# POLITICAL THOUGHT

# (DPS01)

# (M.A. POLITICAL SCIENCE)

## ACHARYA NAGARJUNA UNIVERSITY

### CENTRE FOR DISTANCE EDUCATION

### NAGARJUNA NAGAR,

### GUNTUR

### ANDHRA PRADESH

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | ప్లేటో ధర్మ సిద్ధాంతం, కమ్యూనిజం, ఆదర్శరాజ్యం | 1.1 - 1.17 |
| 2. | అరిస్టాటిల్ - ప్రభుత్వాల వర్గీకరణ, విప్లవాలు | 2.1 - 2.8 |
| 3. | అరిస్టాటిల్ - (384-327 బి.సి.) రాజ్యావరణ సిద్ధాంతం | 3.1 - 3.7 |
| 4. | మధ్యయుగాల రాజనీతి తత్వ విచారం సెయింట్ అగస్టిన్ - | 4.1 - 4.7 |
| 5. | పునరుజ్జీవనోద్యమం - కాలంనాటి రాజనీతి | 5.1 - 5.12 |
| 6. | సామాజిక ఒడంబడిక సిద్ధాంతం : థామస్ హాబ్స్ | 6.1 - 6.10 |
| 7. | సామాజిక ఒడంబడిక సిద్ధాంతం : జాన్‌లాక్ | 7.1 - 7.11 |
| 8. | సామాజిక ఒడంబడిక సిద్ధాంతం : రూసో | 8.1 - 8.10 |
| 9. | భావవాదం - హెగెల్ | 9.1 - 9.12 |
| 10. | సామ్యవాదం - కార్లమార్క్స్ (1818-1883) | 10.1 - 10.12 |
| 11. | స్వేచ్ఛావాదము - జె.ఎస్.మిల్ | 11.1 - 11.10 |
| 12. | జాన్ రాల్స్ - (1921-2003) | 12.1 - 12.7 |
| 13. | సి.బి. మాక్‌ఫర్‌సన్ | 13.1 - 13.7 |
| 14. | ఎఫ్. ఏ. హేయక్ (1899-1992) | 14.1 - 14.5 |
| 15. | మైకేల్ ఫుకో (1926-1984) | 15.1 - 15.4 |
| 16. | మేరి ఊల్‌స్టోన్ (1759-1797) | 16.1 - 16.13 |
| 17. | సిమోన్ ద బూవుఆర్ (1908-1986) | 17.1 - 17.16 |
| 18. | అంటోనియో గ్రాంసీ | 18.1 - 18.8 |
| 19. | హెర్బర్ట్ మార్క్యూజ్ - ఫ్రాంకఫర్డ్ ఆలోచన ధోరణి | 19.1 - 19.6 |

పాఠం - 1

# గ్రీకు రాజనీతి తత్వశాస్త్రం - ప్లేటో

# ధర్మసిద్ధాంతం, కమ్యూనిజం, ఆదర్శరాజ్యం

విషయసూచిక


1.0 పరిచయం
1.1 సంగ్రహ జీవిత విశేషాలు - రచనలు - రచనా పద్ధతి
1.2 ప్లేటోను ప్రభావితం చేసిన అంశాలు
1.3 ధర్మ సిద్ధాంతం
1.3.1 ప్లేటో ధర్మసిద్ధాంతం - ఒక విమర్శ
1.4 ప్లేటో  విద్యావిధానం
1.4.1 విద్యావిధాన ముఖ్యలక్షణాలు
1.5 ప్లేటో కమ్యూనిజం
1.5.1 అర్థ వివరణ
1.5.2 కమ్యూనిజం రూపాలు
1.5.3 విమర్శ
1.5.4. ప్లేటో కమ్యూనిజం - ఆధునిక కమ్యూనిజం
1.6 ఆదర్శ రాజ్యం
1.6.1 ఆదర్శరాజ్య ముఖ్య లక్షణాలు
1.6.2. పని విభజన - ప్రత్యేకీకరణ
1.6.3. తాత్వీక రాజు
1.6.4 తాత్వీక రాజుకు ఎటువంటి లక్షణాలుండాలి ?
1.6.5 తాత్వీక రాజు విధులు
1.7 స్టేట్స్‌మన్
1.8 “ది లాస్”
1.9 ప్లేటో ఫాసిస్టా ?
1. 10 చదువదగిన పుస్తకాలు

## 1.0 పరిచయం :

ఆధునిక పాశ్చాత్య రాజనీతి తత్వవిచారణకి ప్లేటో, అరిస్టాటిల్ మొదలగు ప్రాచీన గ్రీకు తత్వవేత్తలు వారి రచనలో చర్చించిన లౌకిక, హేతుబద్ధమైన భావాలు మూలమని చెప్పవచ్చును. ఇటువంటి భావాలే రాజనీతి తత్వశాస్త్రాన్ని ప్రారంభించాయి. రాజ్య స్వభావం, రాజ్యానికి - వ్యక్తికి ఉన్న సంబంధం మొదలగు ముఖ్యాంశాలు వారి రాజనీతి తత్వవిచారణ అధ్యయనంలో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించాయి.

రాజనీతి తత్వవేత్తల సిద్ధాంతాలను, వారు చెప్పిన భావాలను ఆర్థంచేసుకొనడానికి ప్రయత్నించే ముందు వారి దేశకాల పరిస్థితులను అవగాహన చేసుకొనాలి. ఎందుకంటేవారు విశ్లేషించిన సిద్ధాంతాలు, భావాలను సమకాలీన పరిస్థితులు, సంఘటనలు, వ్యక్తిగత అభిప్రాయాలు ప్రభావితం చేస్తాయి. ఉదాహరణకు ప్లేటో అరిస్టాటిల్ రచించిన రాజనీతి గ్రంథాలలో కొంత సార్వజనీకత ఉన్నప్పటికీ, అవి పరిమిత పౌరసత్వం గల ఆనాటి నగర రాజ్యాలే వారికి ఆధర్శాలు. వీటిలో అధిక జనాభాకు పౌరసత్వం లేదు. బానిసవ్యవస్థ విస్థారంగా ఆచరణలో ఉన్న పరిమిత సమాజ వ్యవస్థను ఉద్దేశించి ప్లేటో, ముఖ్యంగా అరిస్టాటిల్ రచనలు చేశారు. ఇటువంటి వాస్తవిక పరిస్థితుల ప్రభావం వారి రచనలపై కనబడుతుంది.

ప్రాచీన గ్రీకు రాజనీతి తత్వవేత్తలలో ప్లేటో, అరిస్టాటిల్ ప్రముఖులు. ఈ విభాగంలో వారి రాజనీతి సిద్ధాంతాలను, భావాలను సంక్షిప్తంగా తెలుసుకుందాం.

**ప్లేటో** (427 - 347 B.C.)

## 1.1 సంగ్రహ జీవిత విశేషాలు - రచనలు - రచనా పద్ధతి :

సుప్రసిద్ధ ప్రాచీన గ్రీకు రాజనీతి తత్వవేత్తలలో ప్లేటో అగ్రగణ్యుడు. రాజనీతితత్వ విచారమునకు ప్లేటో పితామహుడు. క్రీ.పూ. 427లో ఏథెన్స్ నగరములో ఒక సంపన్నపాలక వంశంలో ప్లేటో జన్మించాడు. క్రీ.పూ. సి.404/3లో అధికారాన్ని చేజిక్కించుకున్న "30 ప్రభువుల" పాలకవర్గంలో ప్లేటో బంధువులున్నారు. కులీన కుటుంబానికి చెందటలవల్ల ప్లేటో రాజకీయవేత్తగా స్థిరపడాలని మొదట అనుకున్నాడు. కాని రెండు ముఖ్య సంఘటనల కారణంగా ప్లేటో తత్వవేత్తగా మారాడు. అవి (1) "30 ప్రభువుల" నియంతృత్వపాలన (2) తన గురువైన సోక్రటీస్‌కు ఏథెన్స్ ప్రజాస్వామ్య పాలకులు అసత్య ఆరోపణలు చేసి మరణశిక్ష విధించటం.

సోక్రటీస్ మరణానంతరం ప్లేటో కొంతమంది స్నేహితులు, శిష్యులతో కలసి సిసిలీ, మెగారా, దక్షిణ ఇటలీ, ఈజిప్టు దేశాలను సందర్శించాడు. ఈ పర్యటన వల్ల వివిధరకాల రాజ్యాంగాలు, ప్రభుత్వాలు పనిచేసే తీరుతెన్నులు సంబంధిత విజ్ఞానాన్ని ప్లేటో సంపాదించుకున్నాడు. ఏథెన్స్‌కు తిరిగివచ్చిన తరువాత ప్లేటో "అకాడమి" అనే విద్యాలయాన్ని స్థాపించాడు. దాన్ని ప్రధాన కేంద్రంగా చేసుకొని విద్యాబోధన, పరిశోధన వ్యాసంగాలను కొనసాగిస్తూ తన శేషజీవితాన్ని ప్లేటో గడిపాడు. ప్లేటో ఆ ధర్మరాజ్య స్థాపనకు సంబంధించిన ప్రణాళికను పరిశీలిస్తే ప్రభుత్వపాలకులకు శాసనసభల సభ్యులకు శిక్షణనిచ్చే ముఖ్యోద్దేశ్యంతో అకాడమి స్థాపించబడినదని చెప్పవచ్చును.

ప్లేటో ఎన్నో గ్రంథాలను రచించాడు. వాటిలో అతని రాజనీతి తత్వశాస్త్రమునకు సంబంధించినవి ముఖ్యంగా మూడు. (1) రిపబ్లిక్, (2) స్టేట్స్‌మాన్, (3) లాస్. ఈ మూడు గ్రంథాలు అతని రాజనీతి తత్వవిచారాన్ని విశదపరుస్తాయి. వీటి రచనలలో సోక్రటీస్ నుంచి గ్రహించిన ప్రశ్నోత్తర పద్ధతిని ప్లేటో అనుసరించాడు. అవి సంభాషణ రూపంలో వుంటాయి. ఈ గ్రంథాలు ప్రాచీన పాశ్చాత్య రాజనీతి తత్వవిచారణ వారసత్వానికి ప్రాతినిధ్యాన్ని వహిస్తున్నాయి.

పైన చెప్పిన మూడు గ్రంథాలలో "రిపబ్లిక్" ముఖ్యమైనది. ఇందులో ఒక ఆదర్శ రాజ్యాంగ వ్యవస్థను ప్లేటో సూచించినాడు. "స్టేట్స్‌మాన్"లో ప్లేటో ఒక మెట్టు కిందకి దిగాడు. ఇందులో చర్చనీయాంశం ఆదర్శరాజ్యాంగం కాని ఆదర్శసంస్థలు కాని కావు. దక్షుడైన రాజనీతిజ్ఞునికి వుండవలసిన నిపుణత, పాలనాచాతుర్యం మొదలగు విషయాలను స్టేట్స్‌మాన్‌లో ప్లేటో చర్చించాడు. "లాస్"లో వాస్తవ రాజ్యనిర్మాణానికి సంబంధించిన వాస్తవాలను వివరించాడు. ఇందులో ద్వితీయ ఉత్తమ రాజ్యాన్ని సూచించాడు.

## 1.2 ప్లేటోను ప్రభావితం చేసిన అంశాలు :

ప్లేటో తాత్విక చింతనను ఈక్రింద వివరించిన మూడు అంశాలు ప్రభావితం చేశాయి. (1) "30 ప్రభువుల" నియంతృత్వ దుష్టపాలన, (2) సోక్రటీస్ బోధనలు, అతని మరణం (3) వివిధ దేశాలలో చేసిన పర్యటన. వీటిలో మొదటి రెండు అంశాలు ప్రభావం వల్ల ప్లేటో ప్రజాస్వామ్య ప్రభుత్వవిధానానికి వ్యతిరేకి అయినాడు.

ప్రజాస్వామ్య విలువలను మంటగలిపి ఏథేన్ యువతను తప్పుత్రోవ పట్టిస్తున్నాడనే అసత్య ఆరోపణలు చేసి సోక్రటీస్‌కు ఏథెన్స్ ప్రజాస్వామ్య పాలకులు మరణశిక్ష విధించారు. ఈ సంఘటన కారణంగా ప్లేటో రాజకీయవేత్తగా స్థిరపడాలన్న నిర్ణయాన్ని మార్చుకొని తత్వవేత్తగా మారాడు. ఆ తరువాత తన జీవితాన్ని తాత్విక చింతనకే అంకితం చేశాడు. వివిధ దేశాలను సందర్శించడం వల్ల అతనికి ఇతర ఆలోచనా ధోరణులతో పరిచయం ఏర్పడింది. ప్లేటో విశదీకరించిన రాజనీతి సిద్ధాంతాలు, భావాలలో పైన వివరించిన మూడు అంశాలు ప్రభావం కనబడుతుంది.

## 1.3 ధర్మ సిద్ధాంతం :

"రిపబ్లిక్"లో ప్లేటో చర్చించిన ప్రధాన అంశం "ధర్మానికి" అర్థవివరణను చెప్పడం. ఇది రాజనీతి సిద్ధాంతంలో ఒక పురాతనమైన అంశం. ప్లేటో నైతిక దృష్టితో ధర్మాన్ని వివరించాడు. ధర్మం యొక్క చట్టబద్ధతను అతను వివరించలేదు. ఈక్రింది సమకాలీన సిద్ధాంతాలను మొదట పరిశీలించిన పిమ్మట ప్లేటో తన ధర్మసిద్ధాంతాన్ని వివరించాడు.

### (1) కెఫాలస్ సాంప్రదాయ సిద్ధాంతం :

కెఫాలస్ ఏథెన్స్‌లో నివసించే ఒకముసలి, ధనిక వర్తకుడు. అతని ప్రకారం ధర్మమంటే "సత్యాన్ని పలకడం అప్పు తీర్చడం". కెఫాలస్ సిద్ధాంతాన్ని ప్లేటో అంగీకరించక పోవడంతో అతని కుమారుడు పొలిమార్కస్ తండ్రి చెప్పిన నిర్వచనాన్ని కొద్దిగా మార్పుచేసి తన నిర్వచనాన్ని ఈవిధంగా చెప్పాడు. "ఎవరకి ఏది ఇవ్వదగినదో దానిని ఇవ్వడమే ధర్మం". అంటే మిత్రుడికి మేలు / మంచి చేయడం, శత్రువుకి కీడుచేయడమే ధర్మం. ఈ సిద్ధాంతాన్ని ఈ క్రింది కారణాల వల్ల ప్లేటో అంగీకరించలేదు.

శత్రువులు, మిత్రులు కాలంతోపాటు మారుతుంటారు. నిన్నటి శత్రువు నేటి మిత్రుడు కావచ్చు. అదేవిధంగా నేటి మిత్రుడు రేపటి శత్రువుకావచ్చు. ప్లేటో వాదననుసరించి ధర్మం అందరికి ఒకేవిధంగా వర్తిస్తుంది. ధర్మం దృష్టిలో శత్రువులు మిత్రులు అందరూ సమానమే. శత్రువులకైనా హానిచేయడం నైతిక సూత్రాలకు విరుద్ధమని ప్లేటో వాదించినాడు.

### (2) త్రాసిమాకస్ తీవ్రవాద సిద్ధాంతం :

"బలవంతుని స్వప్రయోజనమే ధర్మమని" త్రాసిమాకస్ నిర్వచించాడు. ఈ సిద్ధాంతాన్ని వివరంగా పరిశీలిస్తే బలవంతునిదే రాజ్యమని, అతనిమాటే చెల్లుతుందని తెలుస్తుంది. ఇంకో విధంగా చెప్పాలంటే సమాజంలో ప్రభుత్వ

నిర్వాహకులే (పాలకులే) బలమైనవారు కాబట్టివారు చేసిన శాసనాలను బలహీనమైన ప్రజలు తప్పనిసరిగా పాటించవలెను. పాలకుల స్వప్రయోజనాలను కోరుకొనేది "ధర్మమని" త్రాసిమాకస్ నిర్వచనం తెలియజేస్తుంది. పాలకుల స్వార్థప్రయోజనాల కోసమే ప్రభుత్వమేర్పడిందని ఈ సిద్ధాంతం వివరిస్తుంది. త్రాసిమాకస్ సిద్ధాంతం సోఫిష్టుల అభిప్రాయాన్ని ప్రతిబింబిస్తుంది.

ప్లేటో దృష్టిలో ఈ సిద్ధాంతం ఆదర్శమైంది. ప్లేటో అభిప్రాయంలో ప్రభుత్వ నిర్వాహణ ఒక కళ. ప్రతికళ దానియొక్క కళావస్తువు ప్రయోజనాన్ని కోరుతుంది. అదేవిధంగా ప్రభుత్వపాలన కూడా పాలితుల (ప్రజల) ప్రయోజనం కోసంపాటుపడడమే ధర్మమని ప్లేటో వివరించాడు.

## (3) గ్లాకన్ ఆచరణీయ సిద్ధాంతం :

"బలహీనుల శ్రేయస్సు"ను కోరుకొనేదే ధర్మమని గ్లాకన్ వాదించాడు. ఈ సిద్ధాంతాన్ని అనుసరించి ఆదిమ దశలో ప్రభుత్వం, చట్టం లేనందువల్ల బలవంతులు బలహీనులను దోపిడీ చేసేవారు. అటువంటి దోపిడి నుంచి కాపాడుకొనే ఉద్దేశ్యంతో బలహీనులందరు కలసి ఒక ఒడంబడిక ద్వారా ప్రభుత్వాన్ని, చట్టాన్ని ఏర్పరచుకొన్నారు. దీనిద్వారా చట్ట సమ్మతమైన చర్యను ప్రభోదించారు. అటువంటి చర్యలను ప్రజలు ఆచరించేటట్లు చేశారు. ఈవిధంగా భయం, అభద్రతాభావం వల్ల ధర్మం జనించిందని గ్లాకన్ వాదించాడు. గ్లాకన్ సిద్ధాంతంలో చట్టం ధర్మాన్ని నిర్ణయిస్తుంది. త్రాసిమాకస్ సిద్ధాంతంలో ధర్మాన్ని నిర్వచించటంలో చట్టానికి ప్రాముఖ్యత వుంది. గ్లాకన్ సిద్ధాంతాన్ని కూడా ప్లేటో అంగీకరించలేదు.

పై మూడు సిద్ధాంతాల ప్రకారము ధర్మం మానవుని బాహ్యచర్యలకు సంబంధించిందని, సాంప్రదాయ ఫలితంగా అమలులోకి వచ్చిందని తెలుస్తుంది. ఈ సిద్ధాంతలన్నింటిని విమర్శనాత్మకంగా పరిశీలించిన తరువాత ప్లేటో తన ధర్మసిద్ధాంతాన్ని వివరించాడు.

## (4) ప్లేటో ధర్మ సిద్ధాంతం :

ధర్మం వ్యక్తి అంతరంగానికి, సమాజానికి సంబంధించిందని ప్లేటో చెప్పాడు. ప్రతివ్యక్తి ఆత్మలో మూడు గుణాలుంటాయి. హేతువు, ధీరత్వం, ఇచ్ఛ. ఈ మూడింటితోపాటు ధర్మమనే నాలుగో గుణం కూడా వుంటుంది. ధర్మం మిగిలిన మూడు గుణాలను సమతుల్యంగా వుంచుతుంది. బుద్ధిబలం, సుగుణం, హేతువు ఎక్కువగా కలవారు పాలకులుగా, ధీరత్వం అధికంగా ఉన్నవారు కార్మికులు, కర్షకులుగా రాణిస్తారు.

వ్యక్తి సామర్థ్యాన్ని బట్టి, అతనికిచ్చే శిక్షణననుసరించి అతను దేనికి పనికొస్తే ఈ పనిని నీతి నిజాయితీతో నిర్వర్తించడమే ఆవ్యక్తి ధర్మమని ప్లేటో వివరించాడు.

ధర్మానికి సామాజిక రూపం కూడా వుంటుందని ప్లేటో భావించాడు. సంతులిత వ్యక్తి విరాట్ స్వరూపమే రాజ్యమని ప్లేటో చెప్పాడు. కాబట్టి రాజ్యానికి కూడా పైన పేర్కొన్న నాలుగు గుణాలు వుంటాయి. ధర్మం వ్యక్తికి, రాజ్యానికి సమానంగా వర్తిస్తుంది.

వ్యక్తి ఆత్మకున్న మూడు గుణాలను (హేతువు, ధీరత్వం, ఇచ్ఛ) అనుసరించి ప్లేటో సమాజాన్ని మూడు వర్గాలుగా విభజించాడు. (1) పాలకులు. వీరికి బుద్ధిబలం అధికంగా వుంటుంది. వీరు జ్ఞానసంపాదనకే అధిక ప్రాధాన్యతనిస్తారు. (2) సైనికులు. వీరిలో ధైర్యసాహసాలు అధికంగా వుంటాయి. వీరు వీరోచితంగా పోరాడి రాజ్యాన్ని రక్షించగలుగుతారు.

పాలకులు సైనికులు కలసి సంరక్షణ వర్గంగా (Guardian Class) వ్యవహరింపబడతారు. (3) కార్మికులు, కర్షకులు. వీరు భౌతికపరమైన కోర్కెలు ఎక్కువ కలవారు. కాబట్టి వీరు అనేకరకాల ఉత్పత్తి కార్యకలాపాలలో పాల్గొంటారు. వీరుచేసే కార్యకలాపాలు సామాజిక అవసరాలు తీర్చటానికి ఉపయోగపడతాయి. వ్యక్తులకున్న శక్తిసామర్థ్యాలలో తేడాలననుసరించి పైన వివరించిన మూడు వర్గాలను ప్లేటో వర్గీకరించాడు.

సమాజంలో వున్న మూడు వర్గాలలో ప్రతివర్గం ఇతర వర్గాల కార్యకలాపాలలో జోక్యం చేసుకోకుండా ఆ వర్గానికి సంబంధించిన కార్యకలాపాలను నిర్వహించడమే ధర్మం. జోక్యం చేసుకున్నట్లయితే అధర్మం. ఎందుకంటే అధర్మ సమాజంలో అనేక సందర్భాలలో అసమర్థులు కార్యకలాపాలు నిర్వహిస్తారు. దీనిఫలితంగా సామర్థ్యం కుంటుపడి, అవినీతి, అసమర్థత, అజ్ఞానం రాజ్యమేలుతాయి. ధర్మాన్ని పాటించడంవల్ల ఇటువంటి పరిస్థితిని నివారించవచ్చునని ప్లేటో వివరించాడు. బుద్ధిబలంగల పాలకుల ఆదేశాలను సైనికుల, కార్మికులు పాటించవలెను. అటువంటి సమాజంలో సామరస్యంతో కూడిన సంబంధాలుంటాయి.

ప్లేటో ధర్మసిద్ధాంతంలో రెండు విషయాలను చెప్పాడు. అవి (1) వృత్తుల వర్గీకరణ, (2) పరస్పర జోక్యం లేకుండా ఎవరి వృత్తి వారు నిర్వహించడం. ఏ సమాజమైన ముఖ్యంగా మూడు విధులను నిర్వహించాలి. (ఎ) పరిపాలన, (బి) దేశరక్షణ, (సి) వస్తువుల ఉత్పత్తి. ఈ మూడు రకాల విధుల ద్వారా ప్లేటో సమాజాన్ని మూడువర్గాలుగా విభజించాడు. కర్తవ్య నిర్వహణ శ్రమవిభజనకు, శ్రమవిభజన ప్రత్యేకీకరణకు దారితీస్తాయి. శ్రమ విభజన ప్రత్యేకీకరణకు దారితీస్తాయి. శ్రమ విభజన, వృత్తుల వర్గీకరణ ద్వారా సమాజంలో సహకారం సాధ్యపడుతుంది. భిన్నరకాల ప్రజల సమిష్టి శ్రేయస్సు కొరకు ఏకం కావడమే సామాజిక ధర్మమని ప్లేటో చెప్పాడు. ప్లేటో సిద్ధాంతంలో అధికారాల కంటే విధులకే ప్రాముఖ్యతనిచ్చాడు. పాలకులకు అధికారాలుండవు. వారికున్న విజ్ఞత మూలంగా వారు విధి నిర్వహణ చేస్తారు.

### 1.3.1 ప్లేటో ధర్మసిద్ధాంతం - ఒక విమర్శ :

ప్లేటో ధర్మ సిద్ధాంతం కొన్ని విమర్శలకు గురైంది. ప్లేటో చట్టబద్ధమైన ధర్మసిద్ధాంతాన్ని చెప్పలేదు. అతను చెప్పిన ధర్మసిద్ధాంతం నైతికమైంది. మానవులు దేవతలుకారు కాబట్టి వారిమధ్య ఘర్షణలు తలెత్తుతాయి. ఒకవర్గంలో ఉన్న వ్యక్తుల మధ్య, వివిధ వర్గాల మధ్య ఘర్షణలేర్పడినప్పుడు ఏవిధంగా వాటిని పరిష్కరించాలో ప్లేటో వివరించలేదు. నైతిక కర్తవ్యానికి, చట్టపరమైన బాధ్యతను మధ్య వ్యత్యాసాన్ని ప్లేటో విస్మరించాడు.

ప్లేటో ధర్మసిద్ధాంతాన్ననుసరించి వ్యక్తులకు ఆత్మనిగ్రహం లేనిదే వారి వారి విధుల నిర్వాహణ సాధ్యపడదు. అంటే ప్లేటో చెప్పిన ధర్మస్థాపన జరగదు. ఆత్మనిగ్రహాన్ని ఆచరించలేనపుడు, అది సమాజంలో సమస్యలకు దారితీస్తుంది. చట్టబద్ధమైన అధికారం లేకుండా నైతిక విధులను ఆచరించడం అంత సులభంకాదు.

ప్లేటో ధర్మసిద్ధాంతం ఒకవ్యక్తిని ఒకే వృత్తికి పరిమితం చేస్తుంది. ఈ సంకుచిత నియమము వల్ల వ్యక్తి సమగ్ర వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసుకోలేడు. సామాజిక జీవనంలోనూ నిండుతనం చైతన్యం వుండదు. అంతేకాకుండా రాజ్యకలాపాలలో అందరు పాలుపంచుకోవడానికి వీలుండదు. ఈ సిద్ధాంతం మానవజీవితాన్ని యాంత్రికంగా చైతన్యరహితంగా నిస్సారంగా రూపొందిస్తుందని అరిస్టాటిల్ విమర్శించాడు.

ప్లేటో ధర్మసిద్ధాంతం రాజ్యపాలకులైన తాత్విక ప్రభువులకు అధిక ప్రాధాన్యతనిచ్చింది. ఈ కారణంగా వారు సమాజంలో ఇతర వర్గాలపై నిరంకుశంగా పెత్తనం చెలాయించవచ్చు.

ప్లేటో ధర్మసిద్ధాంతంలో వ్యక్తి కంటే రాజ్యానికే అధిక ప్రాధాన్యతనిచ్చాడు. అతని దృష్టిలో రాజ్యమే సర్వం. రాజ్య అంగిక సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. ఈ సిద్ధాంతాన్ని తరువాత కాలంలో హెర్బర్ట్ స్పెన్సర్ మరింత పరిపుష్టం చేశాడు. ప్లేటో సిద్ధాంతం సామాజిక జీవనంలో రాజ్య ఏకత్వానికి ప్రాదాన్యతనిచ్చి సమాజ శ్రేయస్సును సాధించడానికి ఉద్దేశింపబడిందని చెప్పవచ్చును.

## 1.4 ప్లేటో చెప్పిన విద్యావిధానం :

ప్లేటో కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని వివరించే ముందు సంక్షిప్తంగా ప్లేటో రూపొందించిన విద్యావిధానాన్ని తెలుసుకుందాం. ''రిపబ్లిక్''లో ప్లేటో విద్యావిధానానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చాడు. విద్య, కమ్యూనిస్టు సామాజిక వ్యవస్థ ద్వారా సమాజంలో ధర్మాన్ని సాధించవచ్చునని ప్లేటో విశ్వసించాడు. ప్లేటో దృష్టిలో సామాజిక ధర్మాన్ని ఆచరించడానికి, సత్యాన్ని సాధించడానికి విద్య ఒక సాధనం మాత్రమే. సామాజిక విజయాన్ని సాధించడం విద్యలక్షం కాదని ప్లేటో భావించాడు. ఆత్మలో నిగూఢంగా ఉన్న ఉత్తమ లక్షణాల దృష్టిని మంచి విషయాలపై సారింపచేయడం ద్వారా వాటిని వెలికితీయడం విద్య ద్వారా సాధ్యమవుతుందని ప్లేటో చెప్పాడు. ఆదర్శరాజ్యంలో ధర్మసంస్థాపన విద్య ద్వారానే సాధ్యమవుతుందని ప్లేటో భావించాడు. విద్య గడపటానికి తగిన వాతావరణం వుండాలని ప్లేటో భావించాడు.

ప్లేటో వివరించిన విద్యావిధానానికి రెండు ముఖ్య లక్ష్యాలున్నాయి. (1) తత్వవేత్తలైన పాలకులను అభివృద్ధి చేయడం, (2) వ్యక్తుల శక్తిసామర్థ్యాలనుబట్టి వారికి విధులను కేటాయించడం. తత్వవేత్తల ఆధిపత్యాన్ని మన్నించి వ్యవహరించుకొనే తత్వాన్ని మిగిలిన వర్గాలలో అలవరచటం.

### 1.4.1 విద్యావిధాన ముఖ్యలక్షణాలు :

ప్లేటో విద్యావిధాన ముఖ్యలక్షణాలను ఈక్రింది విధంగా సంక్షిప్తంగా చెప్పవచ్చు.

(1) ప్రభుత్వ ఆధీనంలో విద్యావిధానం వుంటుంది. పాఠ్యప్రణాళికాంశాలను ప్రభుత్వ అధికారులే రూపొందిస్తారు.

(2) ఇది నిర్భంధ, విద్యావిధానం. ధనిక, బీద అనే బేధం లేకుండా అందరికి విద్య నిర్భంధముగా నేర్పబడాలి.

(3) స్త్రీలకు పురుషులకు అందరికి ఒకే నిర్భంద విద్యవిధానం. ఈవిధంగా స్త్రీ పురుషుల సమానత్వాన్ని ప్లేటో ప్రోత్సహించాడు.

(4) స్పార్టా విద్యావిధానానికి సంబంధించిన క్రమశిక్షణతో కూడిన వ్యాయామ విద్య, మేథాసంపత్తిని, వ్యక్తి వికాసాన్ని పెంపొందించే ఏథెన్స్ విద్యా విధానానికి సంబంధించిన అంశాల కలయికే ప్లేటో విద్యావిధానం.

(5) ప్లేటో విద్యా విధానంలో రెండు భాగాలున్నాయి. (ఎ) ప్రాథమిక విద్య, (బి) ఉన్నతవిద్య.

## (ఎ) ప్రాథమిక విద్య :

ప్రాథమిక దశలో విద్య శరీర వ్యాయామానికి, మేథాసంపత్తికి సంబంధించి వుండాలని ప్లేటో భావించాడు. ఈ దశలో శారీరక పటుత్వం పెంపుదలకు, మానసిక వికాసానికి అధిక ప్రాముఖ్యత వుండాలి. ప్రతి పాఠశాలలో వ్యాయామశాల, ఆటస్థలం వుండాలి. మొదటి పదిసంవత్సరాల కాలంలో పిల్లలదేహం ధారుడ్యత, ఆరోగ్యం సక్రమంగా కలిగేలా చూడాలి.

ఆటపాటలతోపాటు పిల్లల మానసిక వికాసం కోసం సంగీత సాహిత్యాలను బోధించాలని ప్లేటో సూచించాడు. ప్లేటో వాయిద్య సంగీతానికి అధిక ప్రాధాన్యతనిచ్చాడు. సంగీతం మానసిక ఒత్తిడులను తగ్గించి, మానసికంగా ఆహ్లాదాన్ని కలుగజేస్తుంది. వ్యాయామ విద్య శరీర దారుఢ్యతను పెంపొందిస్తే, సంగీతం మానసిక వికాసానికి తోడ్పడుతుందని ప్లేటో చెప్పాడు. బాల్యదశలోనే శారీరక మానసిక అభివృద్ధి జరగాలని ప్లేటో అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. పద్యాల, పాటల రూపంలో సాహిత్యాన్ని బోధించాలి. ఈ విధంగా 18 సంవత్సరాల లోపు సాధారణమైన స్థాయిలో వ్యాయామం, సంగీతం, సామాన్య శాస్త్రాలను బోధించాలని ప్లేటో భావించాడు. ఈ దశలోనే నీతిపాఠాలను కూడా బోధించాలి. 18 నుండి 20 సంవత్సరాల మధ్య కాలంలో వ్యాయామ విద్యతోపాటు సైనికశిక్షణ ఇవ్వాలి. ధైర్యం, ఆత్మ నిగ్రహం, సత్ప్రవర్తన, క్రమశిక్షణ పెంపొందించే లక్ష్యంతో ఈ శిక్షణ వుండాలి.

### (బి) ఉన్నత విద్య :

ప్రాథమిక విద్యను పూర్తిచేసిన విద్యార్థులకు 20 సంవత్సరాలు వయస్సు రాగానే ఉన్నత విద్య కొరకు ఒక ఎంపిక పరీక్షను నిర్వహిస్తారు. ఈ పరీక్షలో తప్పినవారు కర్షకులు, కార్మికులుగా వ్యవహరిస్తారు. వ్యవసాయం, వస్తువుల ఉత్పత్తి మొదలగు ఆర్థిక విధులను వీరు నిర్వహిస్తారు.

ఈ పరీక్షలో నెగ్గినవారు ఉన్నతవిద్యను అభ్యసించడానికి అర్హతను సంపాదిస్తారు. ఉన్నత విద్యను రెండు దశలలో నిర్వహిస్తారు. 20 నుండి 30 సంవత్సరాల వరకు ఒకదశ, 30 నుండి 35 సంవత్సరాల వరకు రెండోదశ. ఉన్నత విద్య మొదటిదశలో స్త్రీ, పురుషులకు సమానంగా క్రమబద్ధమైన శాస్త్రీయ విద్యను బోధిస్తారు. శిక్షణ మేధాసంపత్తికి, శారీరక వ్యాయామానికి సంబంధించి వుంటుంది. ఈ దశలో గణాంక శాస్త్రం, రేఖాగణితం, ఖగోళశాస్త్రం, తర్కశాస్త్రం మొదలగు వాటిలో భోదన వుంటుంది. ప్రభుత్వ సర్వీసులలో, ముఖ్యంగా సైనిక సర్వీసులలో శిక్షణ నిస్తారు.

ఉన్నత విద్య మొదట దశలను పూర్తిచేసుకొని 30 సంవత్సరాల వయస్సులో ఉన్న వారికి మరో ఎంపిక పరీక్ష నిర్వహింపబడుతుంది. ఈ పరీక్షలో తప్పినవారు ప్రభుత్వాధికారాలుగా, సైనికాధికారులుగా ఉద్యోగాలు నిర్వహిస్తారు. ఈ పరీక్షలో నెగ్గిన వారికి మరో ఐదు సంవత్సరాలుపాటు గతి తర్కం, గణితశాస్త్రం మొదలైన శాస్త్రాలలో అత్యున్నతంగా విద్యాబోధన, శిక్షణ ఇస్తారు. మరో 15 సంవత్సరాలపాటు వారికి వివిధ ప్రభుత్వ శాఖలలో క్రియాత్మక శిక్షణనిస్తారు. దీనివల్ల వారికి ఆచరణాత్మక అనుభం వస్తుంది. 50 సంవత్సరాల వయస్సులో ఉన్నవారిలో శారీరక, మానసిక క్రమశిక్షణలను అలవర్చుకున్నవారికి రాజ్యపాలనాభారాన్ని అప్పగిస్తారు.

దేశపాలన కొరకు విద్యావేత్తలైన నాయకులను రూపొందించటమే ప్లేటో విద్యా విధానం యొక్క లక్ష్యం. నాయకులకు జ్ఞానం, అనుభవం, శీలం, ధైర్యం, ఆత్మనిగ్రహం అవసరం. పరిపూర్ణ వ్యక్తిత్వ సిద్ధికి ప్లేటో విద్యావిధానం దోహదం చేస్తుంది.

ప్లేటో విద్యావిధానంలో వృత్తి, సాంకేతిక విద్యకు స్థానంలేదు. ఉత్పత్తి చేసే వర్గాలపట్ల అన్యాయంగా నిరంకుశంగా ప్లేటో విద్యావిధానం వుందని ఒక విమర్శ వుంది. ఈ విమర్శ ఉన్నప్పటికి ఆనాటి నగర రాజ్యాలలో నెలకొని ఉన్న అవినీతికి, అస్థిరత్వానికి ప్లేటో విద్యాపథకం ఒక చికిత్సవంటిదని చెప్పవచ్చును.

## 1.5 ప్లేటో కమ్యూనిజం :

### 1.5.1 అర్థ వివరణ :

పాలక, సైనిక వర్గాలకు సొంత ఆస్థిని, సొంతకుటుంబాన్ని ప్లేటో నిషేధించాడు. ఈ నిషేధాన్ని ప్లేటో చెప్పిన కమ్యూనిష్టు సిద్ధాంతమని చెప్పవచ్చు. ఇది ఒక కొత్త సామాజిక విధానం. సొంత ఆస్థి, సొంత కుటుంబం ఈరెండు వ్యవస్థలను పాలకవర్గానికి అనుమతిస్తే అవి స్వార్థాన్ని, బంధుప్రీతిని, ఆశ్రిత పక్షపాతాన్ని, వర్గతత్వాన్ని మొదలగు చెడు లక్షణాలను పాలకవర్గంలో కలిగిస్తాయి. ఫలితంగా రాజ్యంలో అవినీతి, అజ్ఞానం, అసమర్థత విలయతాండవం చేస్తాయి. విద్య పాలకులకు వైజ్ఞానిక వాతావరణాన్ని కల్గిస్తే, కమ్యూనిజం మంచి పరిపాలనకున్న అవరోధాలను తొలగిస్తుంది. ప్లేటో కమ్యూనిజంకు కేవలం రాజకీయ ప్రయోజనం మాత్రమే వుంది. రాజ్యంలో ఏకత్వాన్ని పెంపొందించటమే దీని ముఖ్యలక్ష్యం. ప్లేటో కమ్యూనిజం మూడవ వర్గానికి చెందిన ప్రజలకు వర్తించదు. వారికి సొంత ఆస్తిని, సొంత కుటుంబాన్ని సమ్మతించాడు.

### 1.5.2 కమ్యూనిజం రూపాలు :

ప్లేటో కమ్యూనిజం రెండు రూపాలలో వుంటుంది. (1) ఆస్తి కమ్యూనిజం, (2) భార్యల కమ్యూనిజం, ఈ రెండు రకాల కమ్యూనిజాన్ని సంక్షిప్తంగా తెలుసుకుందాం.

### (1) ఆస్తి కమ్యూనిజం :

పాలకులకు, సైనికులకు సొంత ఆస్తిని ప్లేటో నిషేదించాడు. ఈ పాలకవర్గానికి చెందిన వారికి వ్యక్తిగత ఆస్తి గాని, సమిష్టి ఆస్తిగాని ఉండరాదని ప్లేటో భావించాడు. వారికి గృహాలు గాని, వ్యవసాయ భూములు గాని వుండకూడదని ప్లేటో చెప్పాడు. పొలాలు మూడవ వర్గానికి చెందిన రైతులు చేతుల్లో వుంటాయి. పాలకవర్గానికి చెందినవారు అందరు సామాజిక జీవనాన్ని గడుపుతారు. వారు సహపంక్తి భోజనాలు చేస్తూ, ఉమ్మడి గదుల్లో నివసిస్తారు. వారికి బంగారం, వెండి, డబ్బు, ధనం వుండరాదు. వారి జీవనానికి సరిపడే వస్తుసామగ్రిని రైతులు సమకూర్చుతారు. వారు నిరాడంబర జీవితాన్ని గడపాలని ప్లేటో భావించాడు.

ప్లేటో చెప్పిన ఆస్తికమ్యూనిజం రాజకీయపరమైనదే గాని, ఆర్థికపరమైనదికాదు. రాజకీయ అధికారం, ఆర్థికశక్తి ఒకరి చేతిలో ఉన్నట్లయితే, రాజకీయ అధికారాన్ని ఆస్తిపాస్తులను పెంచుకోవడానికి దుర్వినియోగం చేసే అవకాశం ఎక్కువగా వుంటుంది. అంతేకాకుండా పాలకులలో స్వార్థచింతన పెరిగి, నైతికంగా పతనం చెందుతారు. ఫలితంగా అసమర్థపాలన సంభవిస్తుంది. ఈ కారణాల వల్ల ప్లేటో రాజకీయ, ఆర్థిక కార్యకలాపాలను వేరుచేశాడు.

### (2) భార్యల కమ్యూనిజం :

"రిపబ్లిక్"లో ప్లేటో ఆస్థి కమ్యూనిజం కంటే భార్యల కమ్యూనిజంకే అధిక ప్రాధాన్యతనిచ్చాడు. పాలక వర్గాలకి చెందిన వారికి కుటుంబ వ్యవస్థను ప్లేటో రద్దుచేశాడు. వారికి సొంత కుటుంబం వుండకూడదని ప్లేటో చెప్పాడు. కుటుంబం ద్వారా స్వార్థం, ద్వేషం, అసూయ మొదలగు వాటికి కారణం కాబట్టి అది నిస్వార్థసేవకు ఆటంకం అవుతుంది. పాలకవర్గానికి చెందిన ఏ వ్యక్తికి "నా కుటుంబం, నా భార్యా, నా పిల్లలు" అనే భావం వుండకూడదని ప్లేటో భావించాడు. పాలక వర్గానికి చెందిన వారు ఎవరు శాశ్వత వివాహాలు చేసుకోకూడదు.

ప్లేటో ప్రతిపాదించిన భార్యల కమ్యూనిజంలో రెండు ముఖ్య భావాలున్నాయి. సాంప్రదాయక వివాహవ్యవస్థను సంస్కరించడం, స్త్రీ విమోచన. సాంప్రదాయక వివాహం వల్ల స్త్రీలు పురుషులపై ఆధారపడి, వారి ఆధీనంలో ఒంటరి జీవితం గడపవలసివుంటుంది. పిల్లలను కని, పెంచి, భర్త అవసరాలు తీర్చే ఒక యంత్రంగా స్త్రీ పనిచేయవలసి వుంటుంది. ఇటువంటి యాంత్రిక జీవనం వల్ల స్త్రీల ప్రతిభ నిరుపయోగం అవుతుంది. స్త్రీ పురుషులతోపాటు సమానంగా ఆలోచింపగల మేధాశక్తి వుందని ప్లేటో భావించాడు. కాబట్టి, స్త్రీల తెలివితేటలు, మేధాశక్తి, సృజనాత్మకశక్తి సమాజాభివృద్ధికి ఉపయోగపడాలంటే పాలక వర్గాలకు శాశ్వత వివాహాలు రద్దు చేయాలని ప్లేటో చెప్పాడు.

రాజ్యపాలనకు ఉత్తమ శ్రేణికి చెందిన పాలకులు అవసరం. కాబట్టి పాలకవర్గానికి చెందిన ఉత్తమ స్త్రీ పురుషులకు ఒక నిర్ణీత కాలానికి తాత్కాలిక దంపతులుగా వ్యవహరించాలని ప్లేటో భావించాడు. అటువంటి దాంపత్య జీవితం వల్ల ఆరోగ్యవంతమైన సంతతి ఏర్పడుతుంది. ఉత్తమశ్రేణికి చెందిన స్త్రీ పురుషులకు పుట్టిన శిశువులను వెనువెంటనే తల్లిదండ్రుల నుంచి వేరుపరచి ప్రభుత్వ శిశుసంరక్షణ కేంద్రాలలో పెంచాలి. దీనివల్ల తల్లిదండ్రులకు తమ సంతానం ఎవరో తెలియదు. సంతానానికి తమ తల్లిదండ్రులెవరో తెలియదు. ఈ కారణంగా పాలకవర్గంలో అందరు సఖ్యత, సామరస్యం, ఐకమత్యంతో ఒకే కుటుంబంలా వుంటారు. అంతేకాకుండా, రాజ్యంలో రాజకీయఐక్యత, సుస్థిరత ఏర్పడతాయి.

ప్లేటో స్త్రీ పురుషుల వివాహ వయస్సును నిర్ణయించినాడు. పురుషులకు 25 - 55 సంవత్సరాల మధ్య కాలం, స్త్రీలకు 20 - 40 సంవత్సరాల మద్యకాలం తగిన వయసుగా నిర్ణయించాడు. ఈ వయసులో దాంపత్య జీవితంవల్ల జన్మించిన పిల్లలు ప్రతిభావంతులు అవుతారని ప్లేటో భావించాడు. ప్లేటో ఆదర్శ రాజ్యంలో ప్రతిభకే అగ్రస్థానం ఇచ్చాడు. అనారోగ్య శిశువులను, వికృతరూపంగల శిశువులను వెనువెంటనే వధించాలని ప్లేటో చెప్పాడు. ఈ ఆచారం జంతు ప్రపంచానికి వర్తిస్తుంది. కాని మానవ ప్రపంచానికి వర్తించదు.

భార్యల కమ్యూనిజం ద్వారా స్త్రీ పురుషుల సమానత్వాన్ని ప్లేటో అంగీకరించాడు. ప్లేటో కాలం నాటికి ఈ భావన విప్లవాత్మకమైందని చెప్పవచ్చును. వంశాభివృద్ధి శాస్త్రాన్ని అనుసరించి కూడా భార్యల కమ్యూనిజమును ప్లేటో సమర్థించాడు. "ఆరోగ్యవంతమైన శిశువులే ఆరోగ్యవంతమైన భావిపౌరులని" అతడు భావించాడు.

## 1.5.3 విమర్శ :

ప్లేటో చెప్పిన కమ్యూనిష్టు సిద్ధాంతం అనేక విమర్శలకు గురైంది. శతాబ్దాల తరబడివస్తున్న మానవసమాజ ఆచార సాంప్రదాయాలను ప్లేటో కమ్యూనిజం ద్వారా సవాల్ చేశాడు. ప్లేటో శిష్యుడు అరిస్టాటిల్ ప్లేటో సిద్ధాంతాన్ని పూర్తిగా వ్యతిరేకించాడు. ఆస్తి, కుటుంబ వ్యవస్థల వల్ల చెడు ప్రభావం వున్నప్పటికీ, అవి సామాజిక జీవనానికి జీవగుర్ర వంటవి. "సామూహిక ఆస్థి సామూహిక నిర్లక్ష్యానికి గురి అవుతుందని" అరిస్టాటిల్ వాదించాడు. ఆస్థి, కుటుంబ వ్యవస్థల ఆవశ్యకత వ్యక్తి సుఖసంతోషాలకు, రాజ్యశ్రేయస్సుకు ఎంతైనా వుంది.

ప్లేటో చెప్పిన భార్యల కమ్యూనిజం ఏవగింపు కలిగిస్తుందని గ్రూబే, టేలరు చెప్పినారు. ఇది అక్రమ సంబంధాలకు దారితీస్తుంది. తల్లిదండ్రులు, పిల్లలు ఎవరు ఎవరు గురించి తెలుసుకోలేని స్థితిలో వుంటారు. కుటుంబం సహజవ్యవస్థని స్ట్రాస్ చెప్పాడు. అటువంటి వ్యవస్థను రద్దుచేయడంలో ప్లేటో తెలివితేటలను ఆయన ప్రశ్నించాడు. అయినప్పటికీ సెంట్ సైమన్, రాబర్ట్ ఒవెన్, ఫొరియర్ వంటి సామ్యవాదులు కొందరు ఏకవివాహ వ్యవస్థను, కుటుంబ వ్యవస్థను ప్లేటో నిషేధించటం తప్పుకాదని భావించారు.

రాజ్య భద్రత, శ్రేయస్సు దృష్ట్యా ఆస్తి పట్ల మితభావన వుండాలని ప్లేటో చెప్పాడు. ఆస్థి సంపాదన కొరకు ఎక్కువ పాటుపడటం మంచిదికాదని ప్లేటో భావించాడు. అటువంటి దురాశ రాజ్యంలో ఐకమత్యాన్ని, సామరస్యాన్ని నైతిక విలువలను నాశనం చేస్తుంది. ఆర్థిక రాజకీయ శక్తులు ఒకరిచేతిలో వుంటే, అవి అవినీతికి దారితీసి రాజ్యాన్ని రెండు ముక్కలు చేస్తాయి. రాజకీయాలపై ఆర్థికశక్తుల ప్రభావాన్ని గుర్తించిన మొదటివాడు ప్లేటో అని చెప్పవచ్చును. రాజ్యంలో ఆర్థిక అసమానతలు రాజకీయ అస్థిరత్వానికి, సామాజిక విప్లవాలకు దారితీస్తుందని ప్లేటో భావించాడు.

## 1.5.4. ప్లేటో కమ్యూనిజం - ఆధునిక కమ్యూనిజం :

ఆధునిక కమ్యూనిష్టు సిద్ధాంతానికి ప్లేటో పురోగామి అని చెప్పవచ్చు. ప్లేటో కమ్యూనిజానికి ఆధునిక కమ్మూనిజానికి మధ్య కొన్ని పోలికలు, తేడాలు ఉన్నాయి. వాటిని సంక్షిప్తంగా పరిశీలిద్దాం.

### పోలికలు :

(1) ప్లేటో, మార్క్స్ ఇద్దరు మానవ స్వార్థాన్ని పెంపొందించడంలో ప్రైవేటు ఆస్థి యొక్క దుష్టప్రభావాన్ని గుర్తించారు. రాజ్య అస్థిరతకు ఆర్థిక అసమానతలు దారితీస్తాయని ఇద్దరు అంగీకరించారు.

(2) వ్యక్తిగత ప్రయోజనాలు కంటే సమాజ ఉమ్మడి ప్రయోజనాలే ముఖ్యమని చెప్పారు.

(3) ఒక విధంగా ఇద్దరూ కులీనపాలననే సమర్థించారు. ప్లేటో సిద్ధాంతంలో తాత్విక ప్రభువుల చేతిలో అధికారముంటే, మార్క్స్ సిద్ధాంతం ప్రకారం కమ్యూనిస్టు పార్టీ నాయకుల చేతిలో అధికారం వుంటుంది. వారి రెండు సిద్ధాంతాలలో పాలకవర్గాలు కొద్దిమంది మాత్రమే అని కొందరు అభిప్రాయబడ్డారు.

(4) ప్లేటో సిద్ధాంతంలో తాత్విక ప్రభువులు, మార్క్స్ సిద్ధాంతంలో కమ్యూనిష్టు పార్టీ అపరిమిత అధికారాన్ని చెలాయిస్తారు.

### తేడాలు :

పైన వివరించినట్లు ప్లేటో కమ్యూనిస్టు సిద్ధాంతానికి మార్క్స్ సిద్ధాంతానికి కొంతమట్టుకు సారూప్యం ఉన్నప్పటికీ వాటి మధ్య కొన్నితేడాలు కూడా వున్నాయి. ఈ రెండు సిద్ధాంతాలు యొక్క ఆరంభం, లక్ష్యాలు, ఉపయోగించే పద్ధతులలో కొంత బేధం కనిపిస్తుంది. వాటి మధ్య తేడాలను ఈ క్రింది విధంగా చెప్పవచ్చును.

(1) ప్రాచీన ఏథెన్సులో ఉన్న అవినీతి, అసమర్థతలతో కూడిన ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ప్లేటో తన కమ్యూనిష్టు సిద్ధాంతాన్ని చెప్పాడు. 19వ శతాబ్దంలో ప్రబలిన పారిశ్రామికీకరణ వల్ల సంభవించిన పెట్టుబడిదారీ విధానంలో దుష్ఫలితాలను వ్యతిరేకంగా మార్క్స్ సిద్ధాంతం అవతరించింది.

(2) ప్లేటో కమ్యూనిజానికి రాజకీయ లక్ష్యం కలదు. అంటే రాజ్యఏకత్వాన్ని సాధించడమే గాని ప్రధాన ధ్యేయం. మార్క్స్ సిద్ధాంతానికి ఆర్థికపరమైన లక్ష్యం వుంది. దేశసంపదను ప్రజల మధ్య వీలైనంతవరకు సమానంగా పంపిణీ చేసివారి జీవన ప్రమాణాన్ని మెరుగుపరచడం.

(3) పౌరుల ఆధ్యాత్మిక, మానసిక అభివృద్ధిని సాధించటమే ప్లేటో సిద్ధాంతం లక్ష్యాలలో ఒకటని చెప్పవచ్చు. దీనికి విభిన్నంగా మార్క్స్ సిద్ధాంతం భౌతికమైనది.

(4) ప్లేటో కమ్యూనిజం పాలక వర్గానికి మాత్రమే వర్తిస్తుంది. అదికాకుండా వారు నిరాడంబరంగా యోగులవలె

జీవించాలి. మార్క్స్ కమ్యూనిజం రాజ్యంలో ప్రజలందరికి వర్తిస్తుంది. ఆర్థిక సమానత్వంతో ప్రజలందరూ జీవించాలని మార్క్స్ చెప్పాడు.

(5) ప్లేటో సిద్ధాంతంలో సామాజిక వర్గాలుంటాయి. కార్మిక, కర్షక వర్గాలకు ప్రైవేటు ఆస్థిని అనుమతించాడు. దీనికి విభిన్నంగా మార్క్స్ వర్గరహిత సమాజాన్ని చెప్పాడు. ఉత్పత్తి సాధనాలు సమాజీకరణ చేయబడతాయి.

(6) ప్లేటో కమ్యూనిజం శాంతియుత వాతావరణం వున్నసమాజంలో ధర్మస్థాపనకు విద్యా విధానానికి తోడ్పడుతుంది. అందులో సంఘర్షణకు తావులేదు. ధనిక బీద వర్గాలమధ్య సంఘర్షణలుంటాయని మార్క్స్ సిద్ధాంతం భావిస్తుంది. కమ్యూనిస్టు రాజ్యస్థాపన సంఘర్షణతో కూడిన విప్లవం ద్వారా సాధ్యపడుతుందని మార్క్ చెప్పాడు.

(7) ప్లేటో సిద్ధాంతంలో రాజ్యం కొనసాగుతుంది. జ్ఞానం, సుగుణం ద్వారా రాజ్యం సంపూర్ణత్వాన్ని పొందుతుంది. మార్క్స్ సిద్ధాంతాన్ని అనుసరించి వర్గరహిత సమాజం ఏర్పడిన తరువాత రాజ్యం క్రమేణా నిశించిపోతుంది.

పై చర్చిననుసరించి ప్లేటో కమ్యూనిష్ఠు సిద్ధాంతానికి, మార్క్స్ చెప్పిన ఆధునిక కమ్యూనిష్ఠు సిద్ధాంతానికి మధ్య మౌలికమైన, గుణాత్మకమైన భేదాలున్నాయని చెప్పవచ్చును. ఇటువంటి తేడాలు వాటి లక్ష్యాలుతోను, అవి అనుసరించే పద్ధతులలోను చూడవచ్చును. వాటి మధ్య నున్న పోలికలు వాటి సారాంశానికి సంబంధించినవికావు. ఈ కారణంగా ఆధునిక కమ్యూనిజానికి ప్లేటో అగ్రగామి కాడని చెప్పవచ్చును. అలా అనుకుంటే ప్లేటో సిద్ధాంతాన్ని సంపూర్ణంగా అపార్థం చేసుకున్నట్లే. కమ్యూనిజానికిచ్చిన ఆధునిక అర్థంతో ప్లేటోని కమ్యూనిష్ఠు తత్వవేత్తని చెబితే అతనిని అవహేళన చేసినట్టు అవుతుంది.

## 1.6 ఆదర్శ రాజ్యం :

ప్లేటో ఆదర్శరాజ్యం గురించి చెప్పేముందు అతని భావసిద్ధాంతం గురించి సంక్షిప్తంగా తెలుసుకుందాం. వాస్తవ ప్రపంచంలో ఉన్న ప్రతి వస్తువుకి, ఒక ఆకృతి భావం వుంటుందని ప్లేటో వివరించాడు. ఆకృతి భావనే నిజమైనది, సంపూర్ణమైనది, శాశ్వతమైనది. వాస్తవ ప్రపంచంలో ఆకృతులకు ప్రతిరూపాలుగా ఉన్న వాస్తవ వస్తువులు నిజమైనవి కావని ప్లేటో భావించాడు. అవి అశాశ్వతమైనవి, అసంపూర్ణమైనవికూడా. వస్తుపరంగా కంటే, భావపరంగా పొందినవే నిజమైన, స్థిరమైన జ్ఞానమని ప్లేటో భావించాడు. ఈ జ్ఞాన సిద్ధాంతాన్ని అనుసరించే రాజ్యమనే భావన శాశ్వతమైనదని, సంపూర్ణమైనదని ప్లేటో చెప్పాడు. మనము చూస్తున్న వాస్తవ రాజ్యాలు అసంపూర్ణమైనవి, దోషపూరితమైనవని ప్లేటో భావించాడు. భావపరంగా సంపాదించిన జ్ఞానమే నిజమైన విజ్ఞానమని ప్లేటో అభిప్రాయబడ్డాడు. అటువంటి విజ్ఞానమే సుగుణమని సోక్రటీస్ చెప్పాడు.

''రిపబ్లిక్'' గ్రంథంలో ప్రధానాంశం ధర్మసిద్ధాంతం. ప్లేటో ఆదర్శరాజ్యం దర్మభావనలో పరాకాష్ట చెందుతుందని సౌబిన్ చెప్పాడు. ''సుగుణమే విజ్ఞానం'' అని సోక్రటీస్ చెప్పిన సూక్తి ఆధారంగా ప్లేటో ఆదర్శరాజ్యాన్ని వర్ణించాడు. సుగుణం నుండి విజ్ఞానం ఏర్పడినట్లయితే అజ్ఞానం నుండి దుష్టబుద్ధి ఏర్పడుతుంది. విజ్ఞానవంతులు మంచికార్యాలు చేస్తే అజ్ఞానులు దుష్టకార్యాలు చేస్తారు. ఈ భావాన్ని అనుసరించి విజ్ఞానులైన తత్వవేత్తలే ఆదర్శరాజ్యానికి పాలకులు అవాలని ప్లేటో భావించాడు.

''రిపబ్లిక్''లో ప్లేటో వర్ణించిన ఆదర్శరాజ్యం ఒక నమూనా రాజ్యం. ఇది సంపూర్ణమైన అత్యుత్తమ రాజ్యం. ఇటువంటి రాజ్యం స్వర్గంలో తప్ప భూమి మీద కనిపించదు. ఇది వాస్తవ రాజ్యం కాదు. వాస్తవరాజ్యాలకు ఇది ఆదర్శం మాత్రమే. దీనిని ఆదర్శంగా తీసుకొని వాస్తవ రాజ్యాలు వీలైనంతవరకు దోషరహిత రాజ్యాలుగా రూపొందటానికి

ప్రయత్నించాలని ప్లేటో భావించాడు. ఆదర్శరాజ్య లక్ష్యం కూడా పాలకవర్గంలో ఏకత్వాన్ని సాధించడమే. భూమిమీద సామాజిక, రాజకీయ జీవనంలో వీలైనంత నిర్దుష్టంగా సాధించే దివ్యభావాలే (Divine Ideas) ప్లేటో "రిపబ్లిక్"లో చెప్పిన ఆదర్శరాజ్యమని చెప్పవచ్చును.

### 1.6.1 ఆదర్శరాజ్య ముఖ్య లక్షణాలు :

ప్లేటో ఆదర్శ రాజ్యానికి కొన్ని లక్షణాలను చెప్పాడు. ఆదర్శ రాజ్యానికి మూలాధారం ధర్మం. రాజ్యపాలక వర్గంలో ఏకత్వం, ఏకాభిప్రాయం వుండాలి. అన్ని రంగాలలో స్త్రీ పురుషుల సమానత్వం వుండాలి. రాజ్యనియంత్రణ కింద విద్యావిధానం వుండాలి. పాలక వర్గానికి కుటుంబ వ్యవస్థను, సొంత ఆస్థిని రద్దుచేశాడు. ఈ అంశాల గురించి ఇంతకు ముందే వివరంగా తెలుసుకున్నాం. ఇప్పుడు మరికొన్ని ఆదర్శరాజ్య లక్షణాలను వివరంగా చర్చిద్దాం.

### 1.6.2. పని విభజన - ప్రత్యేకీకరణ :

ప్లేటో ఆదర్శరాజ్యం వర్గరాజ్యం. రాజ్యవ్యవస్థ నిర్మాణంలో మూడు వర్గాల ప్రజలుంటారు. పాలకులు, సైనికులు, కర్షకులు. వారికుండే భౌతిక సంపదనుబట్టి ప్లేటో ప్రజలను మూడు వర్గాలుగా వర్గీకరించలేదు. ప్రతి వ్యక్తి ఆత్మలో హేతువు, ధీరత్వం, ఇచ్ఛ అనే మూడు గుణాలననుసరించి పై మూడు వర్గాలను విభజించాడు. హేతువు ప్రధానంగా గలవారు పాలకులుగా, ధీరత్వం అధికంగా గలవారు సైనికులుగా, ఇచ్ఛ (కోర్కెలు) ఎక్కువశాతం ఉన్నవారు కర్షకులుగా వ్యవహరిస్తారు. ఈ మూడు వర్గాల మధ్య వారి వారి గుణాలనుబట్టి ప్లేటో పని విభజన చేశాడు. పాలకులకు రాజ్యపాలన, సైనికులకు రాజ్యరక్షణ, కర్షకులు కార్మికులకు ఆహారధాన్యాలు యితర జీవితావసర వస్తువులను ఉత్పత్తిచేసి సరఫరా చేయడం ప్లేటో కేటాయించాడు. ఈ మూడు వర్గాలవారు చివరికి కేటాయించిన కార్యకలాపాలను వారు సక్రమంగా నిర్వహించాలి. ఏ ఒక్క వర్గం ఇతర వర్గాల కార్యకలాపాలలో జోక్యం చేసుకోకూడదు.

పనివిభజన, ప్రత్యేకీకరణ నాగరికత అభివృద్ధికి, రాజ్యం పెరుగుదలకి అవసరమని ప్లేటో భావించాడు. రాజ్యంలో ఉన్న మూడు వర్గాలను క్రమానుగతి శ్రేణి జరిగింది. అత్యున్నత శ్రేణిలో ఉన్న పాలకుల ఆదేశాలను, సైనికులు, కర్షకులు పాటించాలి. సైనికుల ఆజ్ఞలను కర్షకులు, కార్మికులు పాటించాలి. ఈ విధంగా ఒకవర్గం ఇంకొక వర్గాన్ని నియంత్రణ చేస్తుంది. ఈ మూడువర్గాల వారు ఆదర్శరాజ్యానికి తాత్విక, సైనిక, ఆర్థిక మూలాధారాలని ప్లేటో భావించాడు.

### 1.6.3. తాత్విక రాజు :

ప్లేటో తత్వశాస్త్రంలో తాత్విక రాజుకు ప్రముఖ స్థానాన్ని ఇచ్చాడు. అతని ఆదర్శరాజ్యంలో తాత్విక రాజుకు కీలకమైన స్థానముంది. ఆదర్శరాజ్యాన్ని పాలించడానికి కావలసిన అర్హతలు - బుద్ధి, జ్ఞానం, శిక్షణ మొదలగునవి తాత్విక రాజులకే వుంటాయని ప్లేటో భావించాడు. కొద్దిమంది ఉత్తములైన తత్వవేత్తలు పాలించే ఉత్తమ రాజ్యమే ప్లేటో చెప్పిన ఆదర్శరాజ్యం. ఇతర వృత్తులవలె పాలన కూడా ఒక నిర్దిష్టమైన నిపుణతతో కూడిన ఒక వృత్తి. పాలన ముఖ్యోద్దేశం సమాజ శ్రేయస్సు, ప్రజలను మంచి వ్యక్తులుగా తీర్చిదిద్దటం. ఆ కాలంనాటి గ్రీకు నగరరాజ్యాలలో బుద్ధి, శిక్షణ లేని అజ్ఞానుల పాలనవల్ల వాటిలో అస్తవ్యస్త పరిస్థితులు ఏర్పడ్డాయి. నానాటికి క్షీణిస్తున్న గ్రీకు నగర రాజ్యాల పరిస్థితులను చక్కదిద్ది వాటి కష్టాలను గట్టెక్కించడానికి తాత్విక రాజుల వలెనే ఏకైక మార్గమని ప్లేటో చెప్పాడు. ప్లేటో తాత్విక రాజుల పాలనను ప్రతిపాదించడానికి పైన పేర్కొన్నది ఒక ముఖ్యకారణం.

తత్వవేత్తలకే రాజకీయ అధికారానికి హక్కుందని ప్లేటో ఈక్రింది విధంగా నొక్కిచెప్పాడు. "ఈ ప్రపంచంలో తత్వవేత్తలే పాలకులైనప్పుడు లేదా పాలకులే తత్వవేత్తలు అయినపుడు ప్రస్తుత రాజ్యాలకు వాటి అరిష్ఠాల నుండి విముక్తి లభిస్తుంది" అప్పుడే రాజకీయం అధికారం తత్వజ్ఞానం, ఒకరి చేతిలో వుంటాయి. అంతేకాక ప్లేటో ఊహించిన ఆదర్శరాజ్యం సాధ్యపడుతుంది. అటువంటి రాజ్యంలో వ్యక్తులకు సుఖశాంతులు లభిస్తాయని ప్లేటో భావించాడు.

## 1.6.4 తాత్విక రాజుకు ఎటువంటి లక్షణాలుండాలి ?

ఎల్లప్పుడు జ్ఞాన సముపార్జనకి పాటుపడేవాడే తత్వవేత్త. అన్నిరకాల జ్ఞానసంపాదనకి అతను అభిరుచి చూపిస్తాడు. విజ్ఞానానికి మూలం సత్యం. సత్యంను తెలుసుకొనే వక్తే తత్వవేత్త. అతను జీవితకాలం సత్యాన్వేషణకు ఆరాటపడుతూవుంటాడు. హేతువాదియై వుండాలి. సాధుశీలుడై వుండాలి. అమూర్త భావాలైన సౌందర్యం, ధర్మం మొదలగు భావప్రపంచం పట్ల అభిరుచి కలవాడై వుండాలి. సౌందర్యమనే భావానికి, సౌందర్యమనే వస్తువులకు మధ్య తేడాలను గుర్తించగలవాడై వుండాలి. అసత్యాన్ని పలుకడు. చావంటే భయపడడు. సామాజ సంక్షేమం కొరకు ధర్మపాలన చేయడానికి ఉత్సాహంతో వుంటాడు. ప్లేటో చెప్పి తాత్వికరాజు భారతీయ తత్వశాస్త్రంలోని రాజర్షి లాంటివాడని చెప్పవచ్చును. రాజర్షికి రాజు లక్షణాలు తత్వవేత్త లక్షణాలు రెండూ వుంటాయి.

## 1.6.5 తాత్విక రాజు విధులు :

తాత్విక రాజు ఈక్రింది చెప్పిన విధులను నిర్వహించాలి.

(1) రాజ్యాన్ని ఆదర్శరాజ్య నమూనాకు వీలైనంత వరకు సన్నిహితంగా వుంచడానికి ప్రయత్నించాలి.

(2) రాజ్యంలో ధనిక, బీద వర్గాల మధ్య ఎక్కువ అంతరాయాలు లేకుండా చూడాలి.

(3) రాజ్యంలో ఏకత్వం దెబ్బతినకుండా రాజ్య విస్తీర్ణం పెరుగుదలను అదుపుచేయాలి.

(4) రాజ్యంలో మూడు వర్గాలవారు వారి వారి కర్తవ్యాలను నిర్వర్తించేటట్టు చూడాలి.. రాజ్యంలో ధర్మాన్ని నెలకొల్పటానికి ఈ విధి చాలా ముఖ్యం.

(5) విద్యావిధానంలో కొత్త మార్పులు రాకుండా చూడాలి.

(6) పౌరుల మధ్య మంచి సంబంధాలు వుండేటట్లు చూడాలి. వారిలో చిత్తశుద్ధి వుండేటట్లు చేయాలి.

(7) రాజ్యఏకత్వానికి అధిక ప్రాధాన్యతనివ్వాలి.

ఈ ఏడు విధులు తాత్విక ప్రభువులు విధిగా నిర్వహించవలసిన రాజ్యాంగ సాంప్రదాయాలు వంటివి. వాటిని గౌరవించటం వారివిధి. వాటిని మార్చడం గాని ఉల్లంఘించడం గాని చేయకూడదు. తాత్విక ప్రభువులు వారికున్న సంపూర్ణ రాజకీయాధాకారాన్ని దుర్వినియోగం చేయకుండా వారు నిర్వహించవలసిన విధులు అడ్డుపడతాయి.

అధర్శరాజ్యంలో లిఖిత రాజ్యాంగంగాని, లిఖిత శాసనాలుగాని వుండవు. అయినప్పటికి తాత్విక ప్రభువులు నియంతలుగా మారజాలరు. ఎందుకంటే ఆదర్శరాజ్యంలో అత్యున్నతాధికారి హేతువు. వారు హేతుబుద్ధిననుసరించి సమాజ సంక్షేమం కొరకు పాలన చేస్తారు. వారికి సొంతకుటుంబం, సొంత ఆస్థి వుండవు కాబట్టి వారు స్వార్థబుద్ధితో అధికారాన్ని దుర్వినియోగం చేయజాలరు. అంతేకాకుండ తాత్వికులు విద్య, బుద్ధులు, జ్ఞానంగల సుశిక్షితులు. వారు లిఖిత నియమ నిబంధనలు ననుసరించి రాజ్యపాలన చేసినట్లయితే వారిలో నున్న సృజనాత్మకమైన శక్తినశిస్తుంది. అందువలన వారు నిర్మాణాత్మకమైన మార్పులు తేలేరు అని ప్లేటో భావించాడు.

తాత్విక ప్రభువులు చాలా అరుదైనవారు. వారు అధికారం చేపట్టటానికి అయిష్టతను చూపుతారు. అధికారం పట్ల వారికున్న అయిష్టతవలననే వారు రాజ్యపాలనకు అర్హులని ప్లేటో భావించాడు. అటువంటివారు అధికారాన్ని దుర్వినియోగం చేయజాలరని ప్లేటో నమ్మకం.

ప్లేటో విశ్లేషించిన ఆదర్శరాజ్యంలో రెండు ముఖ్యవిషయాలు తేటతెల్లమౌతున్నాయి. తాత్వికరాజు, ధర్మం. రాజు తాత్వికుడు కానప్పుడు ఆదర్శరాజ్య సూత్రాలు ఆచరణలోకి రావు. అవి ఊహాలోకంలో మాత్రమే మిగిలిపోతాయని ప్లేటో చెప్పాడు. నైతిక, రాజకీయ, నైపుణ్యం, సామర్థ్యం తాత్విక ప్రభువులకు మాత్రమే వుంటాయి. కాబట్టి వారు సమాజాన్ని న్యాయంగా సక్రమంగా పాలించగలరని ప్లేటో భావించాడు. "రిపబ్లిక్" యొక్క రాజకీయ ముగింపు తాత్వికరాజని R.N. Barki భావించాడు.

ప్లేటో చెప్పిన తాత్విక ప్రభువులు వంశపారంపర్యపాలకవర్గం కాదు. కర్షక, కార్మిక వర్గానికి చెందిన జ్ఞానవంతులను సమర్థవంతులను తాత్విక ప్రభువులుగా నియమించవచ్చును. తాత్విక వర్గానికి చెందిన పిల్లలు అసమర్థులైనపుడు వారిని కార్మిక కర్షక వర్గానికి చెందిన హోదాకి తగ్గించవచ్చు అని ప్లేటో చెప్పాడు.

### 1.6.6. విమర్శ :

ప్లేటో వర్ణించిన ఆదర్శరాజ్యం, తాత్విక ప్రభువుల పాలన కొన్ని విమర్శలకు గురైంది. వాటిని సంక్షిప్తంగా పరిశీలిద్దాం.

(1) ఆదర్శరాజ్య ఏకత్వానికి ప్లేటో అధిక ప్రాధాన్యత నిచ్చాడని ఒక విమర్శవుంది. ఈ అభిప్రాయానికి విభిన్నంగా రాజ్యంలో వివిధ వర్గాల మధ్య ఐక్యత వుండే ఏర్పాటుకే అధిక ప్రాధాన్యత నిచ్చాడని ఆచార్య బార్కర్ చెప్పాడు. తాత్విక ప్రభువులను, సైనిక, కార్మిక కర్షక వర్గాల నుండి వేరుచేశాడు. ఫలితంగా ఈ మూడు వర్గాలమధ్య రాజీపడే అవకాశం తక్కువ. అందువల్ల సంపూర్ణ ఏకత్వం ఎప్పుడూరాదు.

(2) స్వేచ్ఛా సమాజానికి ప్లేటో శత్రువని కార్లపాపర్ విమర్శించాడు. వ్యక్తి కంటే సమాజానికి ప్లేటో అధిక ప్రాధాన్యతనిచ్చాడు. వ్యక్తి హక్కుల కంటే విధులకే ప్రాధాన్యతనిచ్చాడు.

(3) ప్లేటో ఆదర్శరాజ్యంలో సామాజిక - రాజకీయ వ్యవస్థ నిర్మాణం ప్రజాస్వామ్యానికి విరుద్ధమైనది. సమాజాన్ని మూడు అసమాన వర్గాలుగా విభజించాడు. ఈ విభజన ప్రజాస్వామిక సమానత్వ విలువుకు విరుద్ధమైనది. రాజ్యకలాపాల నిర్వహణలో కార్మిక కర్షక వర్గానికి ఎటువంటి పాత్రలేదు. మొత్తం రాజ్యాధికారం పాలకవర్గం చేతిలో కేంద్రీకృతం అయింది. ప్లేటో ఆదర్శరాజ్యం పెరిక్లిస్ చెప్పిన ఆదర్శప్రజాస్వామ్యాన్ని నిరాకరించింది.

(4) సామాన్య ప్రజల లోకజ్ఞానం కంటే తాత్విక ప్రభువుల నిపుణత, పరిజ్ఞానం, ప్రభుత్వపాలన, ఉన్నతమైనది కాదని అరిస్టాటిల్ భావించాడు.

(5) ప్లేటో చెప్పిన ఆస్థికమ్యూనిజం, భార్యల కమ్యూనిజం సామాజిక సాంప్రదాయాలకు, సాంఘిక ఆచారాలకు విరుద్ధమైనవి. అంతేకాకుండా ఆచరణకి పనికిరానివి. తాత్విక ప్రభువులుకూడా మానవులే కాబట్టి, వారికున్న నిరపేక్ష అధికారం దుర్వినియోగం చేయరని నమ్మకం లేదని ఒక విమర్శ వుంది.

(6) సంపూర్ణ అధికారవాద రాజ్యాన్ని ప్లేటో సమర్థించాడని కార్ల్‌పాపర్, బెట్రాండ్ రస్సెల్ విమర్శించాడు. లిఖిత రాజ్యాంగం, లిఖిత శాసనాలు అవసరం లేకుండా సామాన్య ప్రజల జీవితాలను తాత్విక ప్రభువులు నియంత్రణ చేయడం సంపూర్ణ అధికారవాదం అవుతుందని విమర్శకుల అభిప్రాయం.

(7) ప్లేటో చెప్పిన ఆదర్శరాజ్యం ఊహాజనిత రాజ్యం. వాస్తవ ప్రపంచంలో ఆచరణకి పనికిరానిది. ఈ విషయమై ప్లేటోకి కూడా కొంత ఆచరణాత్మక విలువ వుందని చెప్పవచ్చు. వాస్తవ అసంపూర్ణ రాజ్యాలు ఆదర్శరాజ్యాన్నిఆదర్శంగా తీసుకొని కొంతవరకు మెరుగుపడవచ్చునని కూడా చెప్పవచ్చును.

పై విమర్శలున్నప్పటికి ప్లేటో చెప్పిన తాత్విక ప్రభువుల పాలనలో నేటికి కూడా వర్తించే అంశాలు కొన్ని ఉన్నాయని చెప్పవచ్చును. అన్ని ఆధునిక ప్రజాస్వామ్య రాజ్యాలలో యోగ్యత ఆధారంగా ప్రభుత్వ ఉద్యోగాలను ఎంపికచేసి నియమిస్తూవున్నారు. పరీక్షల ద్వారా విద్యార్హతలున్న అభ్యర్థుల యొక్క యోగ్యతను నిర్ణయిస్తారు. ఇటువంటి అభ్యర్థులను ప్రభుత్వ ఉద్యోగులుగా నియమించడంవల్ల ప్రజాస్వామ్యాలలో పాలనా సామర్థ్యం పెరుగుతుంది.

## 1.7 స్టేట్స్‌మన్ :

"స్టేట్స్‌మాన్" లేదా "ది పొలిటికస్" అనే గ్రంథాన్ని ప్లేటో వృద్ధాప్యంలో రాశాడని బార్కర్ భావించాడు. "రిపబ్లిక్"లో చెప్పిన ఆదర్శాలను కొంతవరకు విడిచిపెట్టి, వాస్తవ దృక్పథంతో తన ఆదర్శరాజ్య సిద్ధాంతాన్ని "స్టేట్స్‌మాన్"లో చెప్పాడు. ఈ గ్రంథంతో తాత్విక ప్రభువు ఆధిక్యతకు బదులు చట్టం ఆధిక్యతను నెలకొల్పాడు. చట్టాన్ని అనుసరించి పాలన జరుగుతుంది. ఈవిధంగా తాత్విక రాజుల నిరపేక్ష అధికారాన్ని సడలించాడు.

"స్టేట్స్‌మాన్"లో రెండు విధాలుగా ప్రభుత్వాలను ప్లేటో వర్గీకరించాడు. అవి (1) చట్టసమ్మతమైన ప్రభుత్వాలు, (2) చట్టవిరుద్ధమైన ప్రభుత్వాలు.

**చట్టసమ్మతమైన ప్రభుత్వాలు :** (1) రాజరికం - చట్టసమ్మతమైన ఒక వ్యక్తిపాలన. (2) కులీనపాలన - చట్టసమ్మతమైన కొద్దిమంది వ్యక్తులపాలన, (3) రాజ్యాంగ సమ్మతమైన ప్రజాస్వామ్యం - చట్టసమ్మతమైన అనేకమంది మితవాదపాలన.

**చట్టవిరుద్ధమైన ప్రభుత్వాలు :** (1) నిరంకుశపాలన - చట్టవిరుద్ధమైన ఒక వ్యక్తిపాలన. (2) అల్పజనపాలన - చట్టవిరుద్ధమైన కొద్దిమంది వ్యక్తులపాలన. (3) రాజ్యాంగ బద్ధమైన ప్రజాస్వామ్యం - అనేకమంది ఇష్టానుసారమైన పాలన.

చట్టసమ్మతమైన రాజ్యాలలో ఉత్తమమైనది రాజరికం. చట్టవిరుద్ధమైన రాజ్యాలలో మిక్కిలి చెడ్డది నిరంకుశపాలనని ప్లేటో చెప్పాడు. చట్టసమ్మతమైన రాజ్యాలలో రెండవశ్రేణికి చెందినది కులీనపాలన. చట్టవిరుద్ధమైన రాజ్యాలలో రెండవచెడ్డది అల్పజనపాలన. చట్టసమ్మత రాజ్యాలన్నింటిలో మిక్కిలి చెడ్డది ప్రజాస్వామ్యం కాని, అల్పజనపాలన, నిరంకుశపాలనల కంటే చట్టసమ్మతమైన ప్రజాస్వామ్యం మంచిదని ప్లేటో అభిప్రాయబడ్డాడు. ఈ విధంగా "రిపబ్లిక్"లో చెప్పిన ఆదర్శాలు నుండి కొంతమేరకు ప్లేటో స్టేట్స్‌మాన్‌తో వాస్తవాలకు దిగివచ్చాడని చెప్పవచ్చును.

## 1.8 "ది లాస్" :

"ది లాస్" అనేగ్రంథాన్ని ప్లేటో పండుబారిన వృద్ధాప్యంలో రచించాడు. ఈ గ్రంథంలో రెండవ ఉత్తమ రాజ్యాన్ని ప్లేటో వివరించాడు. దీనిని ఆచరణయోగ్యమైన ఆదర్శరాజ్యమని చెప్పవచ్చును. ఈ రాజ్యంలో చట్టసమ్మతమైన ప్రభుత్వమే సర్వాధికారి. పాలకులు, పాలితులు చట్టానికి బద్ధులై వుంటారు. చట్టాలు అందరికి ఒకేవిధంగా వర్తిస్తాయి. చట్టసార్వభౌమత్వాన్ని ప్లేటో అంగీకరించాడు.

"లాస్‌లో" వివరించిన రాజ్యం రాజ్యాంగ బద్ధమైన మిశ్రమ రాజ్యం. ఇందులో రాజరిక లక్షణాలు, ప్రజాస్వామ్య లక్షణాలు రెండూ కలసి వుంటాయి.

రెండవ ఉత్తమ రాజ్యంలో 5040 మంది పౌరులుంటారు. వీరి కుటుంబాలుతోపాటు, బానిసలు, విదేశీయులు రాజ్యంలో వుంటారు. ఇందులో శ్రమ విభజన ప్రకారం వ్యవసాయ సంబంధిత కార్యక్రమాలు బానిసల విధి. పౌరులు కాని స్వేచ్ఛగా జీవించే వ్యక్తులు వర్తక వ్యాపారం, పరిశ్రమలకు సంబంధించిన కార్యకలాపాలు నిర్వహిస్తారు. రాజకీయ కార్యకలాపాలు పౌరులు మాత్రమే నిర్వహిస్తారు.

రాజ్యంలో భూమి 5040 పౌరుల మధ్య సమానంగా విభజింపబడుతుంది. అధిక ఆర్థిక అసమానతలను తగ్గించాడు. రాజ్య ఆర్థిక, రాజకీయ వ్యవస్థలు మిశ్రమ రాజ్యాంగాన్ని వివరిస్తున్నారు.

రెండవ ఉత్తమ రాజ్యవ్యవస్థలో ముఖ్యమైన రాజకీయ, పాలనా వ్యవస్థలు. (1) శాసన సంరక్షకులు. ఇందులో 37 మంది సభ్యులను పౌరులు మూడు అంచెలలో ఎన్నుకొంటారు. ఇదే అత్యున్నత పాలకవ్యవస్థ. (2) పాలకమండలి. ఇది 360 సభ్యులతో కూడిన కార్యనిర్వాహకమండలి. ప్రజాసభ ఇందులో 5040 పౌరులు సభ్యులుగా వుంటారు. 37 మంది శాసన సంరక్షకులను, 360 పాలకమండలి సభ్యులను ప్రజాసభ ఎన్నుకొంటుంది. శాసనాలలో మార్పులను కూడా సూచిస్తుంది. (4) నాక్చ్‌ర్‌న కౌన్సిల్. ఇందులో 37 మంది శాసన సంరక్షకలు. విద్యాశాఖ మంత్రి కొంతమంది నిర్ణీత పురోహితులు సభ్యులుగా వుంటారు. ఈ కౌన్సిల్‌కి రాజ్యవ్యవస్థతో చాలా తక్కువ సంబంధం వుంటుంది. అయినప్పటికీ, చట్టబద్ధమైన రాజ్యవ్యవస్థలను నియంత్రణ చేసే అధికారం దీనికి వుంది.

రెండవ ఉత్తమ రాజ్యంలో కూడా ప్లేటో విద్యకి ప్రముఖ స్థానాన్ని ఇచ్చాడు. పౌరులందరిని సార్వత్రిక నిర్బంధ విద్యావిధానాన్ని సూచించాడు. స్త్రీ పురుషులందరికి ఒకేవిధమైన విద్యావిధానం వుంటుంది. మతం రాజ్య నియంత్రణ కింద వుంటుంది. గుర్తించిన మతాన్ని పౌరులందరు పాటించాలని ప్లేటో చెప్పాడు.

## 1.9 ప్లేటో ఫాసిస్టా ?

కార్లపాపర్, బెట్రాండ్ రస్సెల్ వంటి విమర్శకులు ప్లేటోను ఆధునిక ఫాసిస్టు సిద్ధాంతానికి అగ్రగామిగా విమర్శించారు. రెండు ప్రపంచ యుద్ధాల మధ్యకాలంలో ఇటలీ, జర్మనీ దేశాలలో పుట్టిపెరిగిన ఫాసిస్టు సిద్ధాంతానికి ప్లేటో ఆదర్శరాజ్య సిద్ధాంతానికి కొన్ని ముఖ్యపోలికలున్నాయని భావించారు. ముస్సోలినీ, హిట్లర్ వలె ప్లేటో కూడా స్వేఛ్ఛా సమాజానికి ప్రజాస్వామ్యానికి వ్యతిరేకి. ఈ రెండు సిద్ధాంతాలు వ్యక్తి హక్కుల కంటే విధులకి, వ్యక్తి కంటే రాజ్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చాయి. రెండింటిలోనూ అధికార వాదానికి, రాజ్యాధికారానికి, శిష్టుల నాయకత్వానికి, పాలనకి, సాహిత్యంపై సెన్సార్‌షిప్ మొదలగునవి ఈ రెండు సిద్ధాంతాలలో చోటుచేసుకున్నాయి.

రెండు సిద్ధాంతాలలో పై పేరాలలో వివరించిన పోలికలున్నప్పటికీ, ప్లేటో సిద్ధాంతాన్ని బాగా పరిశీలించినట్లైతే ప్లేటో సిద్ధాంతానికి ఫాసిస్టు సిద్ధాంతానికి మధ్య ముఖ్యమైన తేడాలున్నాయి.

(1) ప్లేటో సిద్ధాంతంలో ప్రభుత్వంపై ఆంక్షలుంటే, ఫాసిస్టు సిద్ధాంతంలో పౌరులపై ఆంక్షలు విధించారు.

(2) ప్లేటో సిద్ధాంతంలో విద్య ద్వారా సుశిక్షితులైన తత్వవేత్తలు శిష్టుల వర్గం. వీరు నేటి ఉన్నతవర్గ ప్రభుత్వఉద్యోగుల వంటివారు. వీరిలో క్రమానుగత శ్రేణిలేదు. పాలకవర్గంలో వారందరు సమానులే. వారి హోదాలలో హెచ్చుతగ్గులు లేవు. దీనికి భిన్నంగా ఫాసిజంలో నాయకులను రహస్యంగా ఎంపిక చేస్తారు. వారిలో క్రమానుగతశ్రేణి ననుసరించి హోదాలో భేదాలుంటాయి.

(3) ప్లేటో ఆదర్శరాజ్యంలో ప్రచారానికి తావులేదు. ఫాసిస్టు రాజ్యంలో సిద్ధాంతాన్ని ప్రచారం చేయడానికి అధిక ప్రాధాన్యత వుంది.

(4) జాతి ఆధిక్యతకు ఫాసిజంలో అధిక ప్రాముఖ్యత వుంది. ప్లేటో సిద్ధాంతంలో జాతి ఆధిక్యతకు స్థానం లేదు.

(5) ప్లేటో నిజం సంపూర్ణ సమిష్టివాదం కాదు. హేతువు, ధర్మమును అనుసరించి వ్యక్తి ఔన్నత్యానికి, ఉత్తమ జీవితానికి ప్లేటో అధిక ప్రాముఖ్యత నిచ్చాడు.

(6) ఫాసిజం యుద్ధానికి, సామ్రాజ్య వాదానికి అధిక ప్రాధాన్యతనిచ్చింది. ప్లేటో ఆదర్శ రాజ్యంలో సైనికులు రాజ్య రక్షణ దళం మాత్రమే. విదేశాలపై దురాక్రమణ జరపడం సైన్యం ముఖ్యోద్దేశం కాదు. దేశ ఆర్థిక వ్యవస్థ శాంతియుత వాతావరణం మీద ఆధారపడి వుంటుంది.

ఈ చర్చ సారాంశాన్నిబట్టి ప్లేటో ఫాసిస్టుకాడు. కాబట్టి అతను ఆధునిక ఫాసిస్టు సిద్ధాంతానికి అగ్రగామి కాడని నిర్ద్వందంగా చెప్పవచ్చును.

## 1. 10 చదువదగిన పుస్తకాలు :


1. Barker, E. "The Political Thought of Plato and Aristotle" (1959)
2. Sabine, G.H. "A History of Political Theory (1973)
3. Mukherjee, S., and Sushila Ramaswamy, "A History of Political Thought - Plato to Marx" (1999)
4. Gellel, R.G., "History of Political Thought"
5. Krishna Rao, V., "పాశ్చాత్య రాజనీతితత్వ విచారము"


## ప్రశ్నలు :

1. రాజనీతి శాస్త్రానికి ప్లేటో చేసిన సేవను వివరింపుము.
2. ప్లేటో ప్రతిపాదించిన ధర్మసిద్ధాంతము ఏమిటి ?
3. ప్లేటో ప్రతిపాదించిన కూమ్యూనిష్టు సమాజ లక్షణాలు ఏమిటి ?
4. ప్లేటో ప్రతిపాదించిన కమ్యూనిష్టు సమాజ లక్షణాలను, మార్క్స్ ప్రతిపాదించిన కమ్యూనిస్టు సమాజలక్షణాలకు తేడా ఏమిటి ?
5. ఆదర్శరాజ్య ప్రధాన లక్షణాలు ఏమిటి ?
6. ఆదర్శరాజ్య లక్షణాల విషయంలో ప్లేటో ఆలోచనలలో వచ్చిన మార్పును వివరించండి ?
7. ప్లేటో విశిష్టతను వివరించి, ప్లేటో సిద్ధాంఛతంపై అరిస్టాటిల్ విమర్శ సహేతుకమా ? కాదా ? చర్చించండి.

**రచయిత : యస్. పోలినాయుడు**

పాఠం - 2

# అరిస్టాటిల్ - ప్రభుత్వాల వర్గీకరణ - విప్లవాలు

## విషయసూచిక


2.0 లక్ష్యం

2.1 రాజ్యం - ప్రభుత్వాల మధ్య వ్యత్యాసం

2.2 రాజ్యాంగబద్ధమైన పరిపాలన - శాసన సార్వభౌమాధికారం

2.3 ప్రభుత్వాల వర్గీకరణ

2.4 అల్పజన పాలన - ప్రజాస్వామ్యం

2.5 అరిస్టాటిల్ - ఉత్తమ రాజ్యం

2.6 అరిస్టాటిల్ - విప్లవాలు

2.6.1 విప్లవాలకు సాధారణ కారణాలు

2.6.2 విప్లవాలకు ప్రత్యేక కారణాలు

2.6.3. విప్లవాలను నివారించటానికి మార్గాలు

2.7 అరిస్టాటిల్ - సిద్ధాంత విమర్శ

2.8 అరిస్టాటిల్ - విశిష్టత


## 2.0 లక్ష్యం :

అరిస్టాటిల్ వాస్తవికవాదానికి, శాస్త్రీయ దృక్పధానికి, మేధాసంపత్తికి ప్రతీకగా ఆయన వివరించిన ప్రభుత్వాల వర్గీకరణ మరియు విప్లవాలపై ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలు నిలుస్తాయి. అరిస్టాటిల్ సహజము, నిశితము అయిన శాస్త్రీయదృక్పధంతో ప్రభుత్వాల వర్గీకరణను చేపట్టాడు. అదే సమయంలో ఆయన రాజ్యానికి, ప్రభుత్వానికి మధ్య గల వ్యత్యాసాన్ని గుర్తించాడు. ఈ విషయములన్నింటిని తెలియజేయటమే, ఈ పాఠం యొక్క లక్ష్యం.

## 2.1 రాజ్యం - ప్రభుత్వాల మధ్య వ్యత్యాసం :

అరిస్టాటిల్ తన రచనలలో రాజ్యానికి, ప్రభుత్వానికి మధ్య తేడా ఉందని స్పష్టీకరించాడు. పౌరులతో కూడుకున్న సమాజమే రాజ్యమని అరిస్టాటిల్ భావించాడు. రాజ్యాన్ని నిర్వహించే పౌరుల సమూహమే ప్రభుత్వం. రాజ్యం యొక్క నైతిక, రాజకీయ విధులను నిర్వహించే ప్రత్యక్ష సాధనమే ప్రభుత్వం. ప్రభుత్వాన్ని నిర్వహించే వ్యక్తులు మారినట్లయితే ప్రభుత్వం మారిపోతుంది. కానీ రాజ్యాంగం మారితే కాని రాజ్యం మారదు.

అరిస్టాటిల్ ప్రభుత్వాల ఏర్పాటుకు ప్రాతిపదికగా మూడు అంశాలను గుర్తించాడు. అవి 1. పుట్టుక (Birth), 2. సంపద (Wealth) , 3. సంఖ్య (Number) . అరిస్టాటిల్ అభిప్రాయంలో సార్వభౌమాధికారం మొత్తం పౌరసమాజానికి చెందిఉన్నప్పటికీ ప్రభుత్వాధికారం మాత్రం సమర్థులైన కొద్దిమంది పౌరులు మాత్రమే నిర్వహిస్తారు. సామాన్య ప్రజానీకం ప్రభుత్వంలోని సాంకేతిక విషయాలను అవగాహన చేసుకోలేకపోవచ్చు. కానీ రాజ్యాధికారం ఎవరికి ఇవ్వవలెననే విషయం నిర్ణయించటానికి వాళ్ళకు సహజ వివేచనం ఉంటుంది. అందువలననే అరిస్టాటిల్ పరిమిత ప్రజాస్వామ్యం వైపు మొగ్గు చూపాడు.

## 2.2 రాజ్యాంగబద్ధమైన పరిపాలన - శాసన సార్వభౌమాధికారం :

ప్రజలు అధికారాన్ని దుర్వినియోగం చేయకుండా శాసనాలకే సార్వభౌమాధికారం ఇచ్చి రాజ్యాంగబద్ధమైన పరిపాలనను నిర్వహించవలెనని అరిస్టాటిల్ భావించాడు. శాసనము మానవుని ఆవేశానికి, ఉద్రేకాలకు అతీతమై మనిషి వివేచనను ప్రోత్సహిస్తుంది. వివేకవంతమైన పరిపాలనను ప్రతిబింబిస్తుంది (Law refelects the rule of reason). అంతేగాక రాజ్యాంగానికి స్థిరత్వాన్ని, పటిష్ఠతను చేకూర్చుతుంది. మానవుని లోకజ్ఞానాన్ని, గత అనుభవాన్ని ప్రతిఫలిస్తుంది. కాబట్టి మానవుని సుఖజీవనానికి, ప్రభుత్వ యంత్రాంగం సక్రమంగా పనిచేయటానికి శాసనాలు అత్యంత ఆవశ్యకాలు.

## 2.3 ప్రభుత్వాల వర్గీకరణ :

అరిస్టాటిల్ సమకాలీన గ్రీకు సమాజంలోని 158 రాజ్యాంగాలను సమగ్రంగా, తులనాత్మకంగా అధ్యయనం చేసి వాటికి సంబంధించిన వాస్తవాలను, సమాచారాన్ని సేకరించి, వాటిని విశ్లేషించి ప్రభుత్వాలను గుణాత్మకంగాను, గణాత్మకంగాను 6 రకాలుగా వర్గీకరించాడు. అవి 1. రాజరికం (monarchy), 2. కులీన పాలన (Aristrocracy) , 3. పాలిటి (Polity), 4. క్రూరపాలన (Tyranny), 5. అల్పజన పాలన (Oligarchy), 6. ప్రజాస్వామ్యం (Democracy).

అరిస్టాటిల్ ప్రభుత్వాలను రెండు ప్రాతిపదికలను ఆధారం చేసికొని వర్గీకరించాడు. అవి 1. అధికారం చెలాయించే వారి సంఖ్యనుబట్టి, 2. ఆయా ప్రభుత్వాలు అనుసరించే లక్ష్యాలను బట్టి. వాటిలో రాజకీయ అధికారం అంతా ఒకవ్యక్తి చేతిలో కేంద్రీకృతమై వుంటే అది ఏకవ్యక్తి పాలన. అధికారాన్ని కొద్దిమంది వ్యక్తులు చెలాయిస్తే అది కులీనపాలన. అధికార నిర్వహణలో అనేకమంది వ్యక్తులు పాలుపంచుకొంటే దానిని పాలిటి అని వర్గీకరించారు. రెండవ ప్రాతిపదికను అనుసరించి అధికారాన్ని ఎవరి ప్రయోజనం కోసం నిర్వహించటం జరుగుతుందో దానినిబట్టి మూడు మంచి ప్రభుత్వాలు, మరి మూడు వాటి వికృత రూపాలుగా పేర్కొన్నాడు. రాజ్యాధికారం ఒక వ్యక్తి చేతిలో వుండి అతడు ప్రజాసంక్షేమం కోసం అధికారాన్ని చెలాయిస్తే ఆ ప్రభుత్వంను రాచరికం అన్నాడు. అదే పాలకుడు అధికారాన్ని తన స్వప్రయోజనాలకు, స్వార్థానికి వినియోగిస్తే అది క్రూరపాలన అవుతుంది. అధికారాన్ని కొద్దిమంది శ్రేష్ఠజనులు - గుణవంతులు, సంపన్నులు, ఉన్నత కుటుంబ నేపథ్యం ఉన్నవారు - ప్రజా ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని వినియోగిస్తే అది కులీన పాలన అవుతుంది. అట్లా కాకుండా ఆ కొద్దిమంది తమ వర్గ ప్రయోజనాల కోసం అధికారం నిర్వహిస్తే అది అల్పజనపాలన అవుతుంది. అధికార నిర్వహణలో అధిక సంఖ్యాక ప్రజలు పాలుపంచుకొని, రాజ్యాంగబద్ధంగా దానిని అందరి ప్రయోజనాల కోసం వినియోగించినపుడు ఏర్పడేదే పాలిటి. కానీ బీదల సంఖ్య అధికం కాబట్టి అధికారం క్రమేణా బీదల చేతికి చిక్కి పాలిటి ప్రజాస్వామ్యంగా వికృత రూపాన్ని పొందుతుంది. దీనిలో బీదల సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన నిర్వహించబడుతుంది. అరిస్టాటిల్ అభిప్రాయములో అన్ని ప్రభుత్వాల కన్నా మధ్య తరగతి ప్రజల నిర్వహణలో ఉన్న శాసనబద్ధమైన ప్రభుత్వమే ఉత్తమమైనది. ఆయన ఉద్దేశించిన పాలిటిలో కులీనుల వివేకం, అధిక సంఖ్యాకుల (మధ్య తరగతి) సమ్మతి రెండూ వున్నాయి.

## 2.4 అల్పజన పాలన - ప్రజాస్వామ్యం :

అరిస్టాటిల్ తన రచనలలో ఆరు రకాల ప్రభుత్వాలను గుర్తించినప్పటికి అల్పజనపాలన మరియు ప్రజాస్వామిక ప్రభుత్వాల పట్ల ఎక్కువ ఆసక్తిని చూపించాడు. ఈ రెండు ఉత్తమ ప్రభుత్వాల వికృత రూపాలైనా, రాజనీతి శాస్త్రవేత్తగా

అనుభవపూర్వక వాదాన్ని ఉపయోగించి వీటిని విశేషంగా పరిశీలించి విశ్లేషించినాడు. ఈ రెండు ప్రభుత్వాల పరిశీలన వలన తేలినది ఏమిటంటే మానవులు తమకు ప్రత్యక్షంగా లాభదాయకమైన ప్రభుత్వాన్ని అంగీకరిస్తారు, శిరసావహిస్తారు. వ్యవస్థలు కూడా వాటిని నిర్వహించే వారి ప్రయోజనాలు, ఉద్దేశాలు వారు అధికారాన్ని ఏ విధంగా చేజిక్కించుకున్నారో తెలుపుతాయి.

అరిస్టాటిల్ ప్రజాస్వామ్యానికి, అల్పజనపాలనకి ఉన్న వ్యత్యాసాన్ని సవివరంగా వివరించాడు. ప్రజాస్వామ్యంలో అధిక సంఖ్యాకుల ప్రయోజనానికి అల్పజనపాలనలో ధనపరంగా, వర్గపరంగా అల్పసంఖ్యాకుల (Oligarchy) ప్రయోజనానికి ఎక్కువ ప్రాధాన్యత వుంటుంది. ప్రజాస్వామ్యం అధిక సంఖ్యాకుల ప్రభుత్వం అయినప్పటికీ, అల్పసంఖ్యాక వర్గానికి తగిన ప్రాతినిధ్యం ఇవ్వదు. వారి అభిప్రాయాలను మన్నించదు. గుణవంతులకు ఈ ప్రభుత్వంలో పాల్గొనటానికి అవకాశం వుండదు. అల్పజనపాలనలో కూడా అనేక నియమ నిబంధనలు ఆధారంగా అశేష ప్రజానీకాన్ని రాజకీయాలకు దూరంగా వుంచటం జరుగుతుంది. ఆస్థి హక్కు పౌరులకే పరిమితం అవుతుంది. ఓటుహక్కు సమాజంలోని కొద్దిమందికే వుంటుంది.

ప్రజాస్వామ్యంలో అందరికి సమానత్వం ఉంటుంది. కాబట్టి తలలను ప్రాతిపదికగా చేసుకొని వ్యవహారాలను నిర్వహించుట జరుగుతుంది. గుణవంతులు, జ్ఞానులు, అజ్ఞానులు అందరూ సమానంగా పరిగణింపబడతారు. దనవంతులు, నిరుపేదలు అన్న తేడా వుండదు. అల్పసంఖ్యాకులు అధిక సంఖ్యాకుల నియంతృత్వం కింద నలిగిపోతారు. అజ్ఞానులు, అసమర్థులు గుణవంతులై స్వారీ చేయటానికి అవకాశం వుంటుంది. అయితే ప్రజాస్వామ్యం, అల్పజనపాలనలు మధ్య తేడా అంత సులభమైనది కాదు. అల్పజనపాలన కూడా వాస్తవంలో అధికసంఖ్యకుల అభిప్రాయాన్ని కాదని ఎక్కువకాలం అధికారంలో మనలేదు. అదేవిధంగా ప్రజాస్వామ్యంలో కొద్దియంది నాయకులు ప్రజాదరణను సంపాదించి, ప్రజాస్వామ్యాన్ని అల్పజన పాలనగా, క్రూరపాలనగా మార్చే ప్రమాదం లేకపోలేదు.

## 2.5 అరిస్టాటిల్ - ఉత్తమ రాజ్యం :

అరిస్టాటిల్ తన "పాలిటిక్స్"లో ఏడు, ఎనిమిది అధ్యాయాలలో ఉత్తమ రాజ్యాన్ని లేదా ఉత్తమ ప్రభుత్వ వ్యవస్థను గురించి చర్చించాడు. అయితే ఈ సందర్భములో ఉత్తమ ప్రభుత్వం వాస్తవంలో ఆచరణ సాధ్యమైనదే కానీ, ప్లేటో వలె ఒక ఆదర్శవంతమైన నమూనాను రూపొందించి, దానికి అనుగుణంగా వాస్తవ ప్రభుత్వాలు రూపొందాలని అరిస్టాటిల్ భావించలేదు. ప్లేటో ఆదర్శరాజ్యాన్ని ప్రతిపాదిస్తే, అరిస్టాటిల్ ఆచరణాత్మకమైన ఉత్తమ రాజ్యాన్ని(The best practicable State) మాత్రమే వర్ణిస్తాడు. అతని అభిప్రాయంలో రాజ్యాంగానికి మితవాదం (Moderation) మరియు స్థిరత్వం (Stability) అనే రెండు ప్రధాన లక్షణాలు ఉండాలి. అరిస్టాటిల్ ఉత్తమ రాజ్యానికి సంబంధించి మధ్యేమార్గాన్ని (Mean) అనుసరించాడు. అల్పజనపాలన, ప్రజాస్వామ్యం అనేవి వాస్తవంలో ఎన్ని లోపాలున్నప్పటికి ఎక్కువ రాజ్యాలలో కొనసాగే ప్రభుత్వాలు. అవి బాగాలేకున్నా వాటిని మనం విస్మరించలేము. అందువలన అరిస్టాటిల్ వాస్తవంలో ఏది శాశ్వత ప్రాతిపదికపై రాజకీయ సుస్థిరతను సాధించగలదో అది ఆచరణాత్మకమైన ఉత్తమ ప్రభుత్వం అని భావించాడు. ఆచరణలో రాజకీయ సుస్థిరతను నెలకొల్పాలంటే అల్పజనపాలన, ప్రజాస్వామ్యాల మధ్య రాజీ పథంగా మధ్యే మార్గాన్ని అనుసరించాలి. ప్రభుత్వంలో ధనం, గుణం, పేదవర్గాల ప్రభావం అన్నీ మిళితమై వుంటాయి. అది రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యంలోనే సాధ్యమవుతుందని అరిస్టాటిల్ భావించాడు. అయితే గ్రీకుల కాలంలో ప్రజాస్వామ్యం

తీవ్రప్రజాస్వామ్యం మరియు మూక ప్రజాస్వామ్యములుగా పరిణామం చెందుట వలన అరిస్టాటిల్ ఉత్తమ రాజ్యాన్ని "ప్రజాస్వామ్యం"గా వర్ణించటంలో కొంత ఇబ్బందిపడినాడు. అందువలననే ప్రజాస్వామ్యానికి పర్యాయ పథంగా "పాలిటి"ని రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యం అని అర్ధం వచ్చే విధంగా రూపొందించాడు.

అరిస్టాటిల్ అభిప్రాయములో మంచి ప్రభుత్వం చట్టానికి అనుగుణంగా వుంటుంది. అందువల్ల మంచి రాజ్యాలలో చట్టానికి ఆధిక్యత ఉండాలని భావించాడు. ప్లేటో తన ఆదర్శరాజ్యంలో తాత్విక ప్రభువులకు ప్రాముఖ్యం ఇస్తే, అరిస్టాటిల్ తన రచనలలో చట్టం యొక్క ఆధిక్యం ఆదర్శప్రాయమైనదని అభిప్రాయబడినాడు. తాత్విక ప్రభువుల పాలన ఎంత ఉత్తమంగా ఉన్నప్పటికి అది చట్టానికి ప్రత్యామ్నాయం కాలేదని అరిస్టాటిల్ వాదిస్తాడు. రాజ్యాంగబద్ధమైన పాలన తాత్కాలిక ప్రయోజనాలకు అతీతంగా వుంటుంది. నిష్పక్షపాతమైన చట్టం అధికారి స్థానాన్ని ఆక్రమించదు. కాని అతని అధికారాన్ని చట్టబద్ధం చేస్తుంది, అతని అధికారానికి నైతిక విలువనిస్తుంది. రాజ్యాంగబద్ధపాలన పాలితుని గౌరవానికి తగినట్లు వుంటుంది. రాజ్యాంగబద్ద పాలకుడు ప్రజలను వారి అనుమతితో పాలిస్తాడు.

అరిస్టాటిల్ అభిప్రాయంలో ప్రతి రాజ్యంలోనూ మూడు వర్గాలుంటాయి. అవి ఒకటి అతి ధనవంతులు, రెండు అతి బీదవారు, మూడు మధ్యతరగతివారు. అతి ధనవంతులలో అహంకారం, ధనమదం ఎక్కువగా ఉండే అవకాశం వుంది. బీదవారిలో హింసాత్మక, విప్లవశక్తులు విజృంభిస్తూ వుంటాయి. రెండు వర్గాలవారు ఒకరినొకరు బద్ధవైరులుగా చూసుకొంటారు. అరిస్టాటిల్ ఉద్దేశ్యంలో సామాన్య ఆదాయం, సుగుణాలు ఉన్న మధ్యతరగతి ప్రజలు కొంత హేతుబద్ధంగా వ్యవహరిస్తారు. వారికి ధనికులకు ఉన్న నిర్లక్ష్యం, సోమరితనం మరియు పేదవారికి ఉన్న నేరప్రవృత్తి, నీచ లక్షణం, హింసాత్మక ప్రవృత్తి వుండవు. నిర్లక్ష్యం, నేరప్రవృత్తికి మధ్యేమార్గంగా మధ్య తరగతి ప్రజలు వ్యవహరిస్తారు. సమాజంలో సమన్వయం సాధించటానికి మధ్యతరగతి యోగ్యత ఉన్నదని అరిస్టాటిల్ అభిప్రాయబడినాడు. అందుచేత మధ్యతరగతి వారి మీద ఆధారపడిన రాజ్యమే ఉత్తమరాజ్యమని అతని భావం. మధ్యతరగతివారు ఇతరులపై ఈర్ష్యకానీ, అహంభావం కానిలేకుండా స్థిరత్వాన్ని, సంయమనాన్ని ప్రదర్శిస్తారు. అందువల్ల మధ్యతరగతి వారి సంఖ్య ఇతరుల కంటే ఎక్కువగా ఉన్న రాజ్యం స్థిరంగాను, పటిష్ఠంగానూ వుంటుంది. పాలిటిలో మధ్య తరగతి అధికం కాబట్టి ఇదే ఉత్తమరాజ్యమని అతని అభిప్రాయం. పాలిటికి మిశ్రమ రాజ్యాంగం (Mixed Constitution) వుంటుంది. అంటే అల్పజనపాలన, ప్రజాస్వామ్యంల సమన్వయంతో గుణవంతులైన, సమర్థవంతులైన వారిని సామాన్యప్రజలు పాలకులుగా ఎంపిక చేసుకొనే రాజ్యాంగ వ్యవస్థ వుంటుంది. ఇది ధనిక, బీద వర్గాలను సమన్వయం చేస్తుంది. అదేవిధంగా ప్రజాస్వామ్యంలోని సంఖ్యాబలానికి కులీన పాలనలోని వివేకంతో సామరస్యం కుదురుతుంది. మధ్యతరగతి వారు విప్లవాలకు అనుకూలంగా ఉండరు. వారు స్థిరత్వానికి, సంయమనానికి అనుకూలంగా వుంటారు.

అరిస్టాటిల్ మితవాది, సంస్కరణవాది. అందువలనే అతడు అచరణసాధ్యమైన భావాలనే రూపొందించినాడు. సమస్యలను పరిష్కరించటంలో అరిస్టాటిల్ మధ్యేమార్గాన్ని అనుసరించాడు. దీనిని అనుసరించి రాజ్యంలో ఏ రెండు ప్రబల వర్గాలకు చెందని మధ్యతరగతి వర్గం తృతీయ శక్తిగా వుంటుంది. ఈ మధ్య తరగతి వర్గం ధనిక, పేద వర్గాల మధ్య సమతౌల్యాన్ని నెలకొల్పడం ద్వారా స్థిరత్వాన్ని కలిగిస్తుంది. అందువలన అరిస్టాటిల్ మధ్యతరగతి ప్రజల సంఖ్య అధికంగా ఉన్న రాజ్యంలో రాజకీయసుస్థిరత ఎక్కువగా వుంటుందని భావించినాడు. అరిస్టాటిల్ అభిప్రాయంలో ధనవంతులు పరిపాలించటానికి అలవాటుపడి వుండరు. వారికి నిరంకుశంగా అధికారాన్ని చెలాయించటం మాత్రమే తెలుసు. నిరుపేదలు అధికారాన్ని నిర్వహించలేరు. వారికి తెలిసింది కేవలం నిరంకుశ అధికారికి లోబడి బానిస

ప్రవృత్తితో వ్యవహరించటమే. అందువలన కేవలం ధనిక - పేద వర్గాలు మాత్రమే వుండే రాజ్యంలో పాలకులు - పాలితుల మధ్య సంబంధాలు యజమాని - బానిస సంబంధాలుగా వుంటాయి. అప్పుడు వారి మధ్య సహకారం, సమానత్వం, స్నేహభావం అనేవి వుండవు. ఈ భావాలు మధ్యతరగతి ప్రజలలో ఎక్కువగా కన్పిస్తాయి. అందువల్ల వారిసంఖ్య మిగతావర్గాల కంటే ఎక్కువగా ఉండాలని అరిస్టాటిల్ భావించినాడు.

అరిస్టాటిల్ చర్చించిన "పాలిటి" రాజకీయ సుస్థిరత పట్ల ఎక్కువ ఆసక్తిని సూచిస్తుంది. రాజకీయ సంక్షోభాలకు ఆర్థిక వ్యత్యాసాలు మూలమన్న విషయాన్ని అరిస్టాటిల్ గుర్తించాడు. అందువల్ల వాటి ప్రాబల్యాన్ని తగ్గించి రాజకీయ సుస్థిరతను చేకూర్చటానికి అరిస్టాటిల్ ప్రయత్నించాడు. తీవ్ర ఆర్థిక వ్యత్యాసాలున్న ధనిక, పేద వర్గ ప్రభుత్వాల కంటే మధ్యతరగతి ప్రాబల్యంలో ఉన్న ప్రభుత్వం సుస్థిరతకు దోహదం చేస్తుందని అరిస్టాటిల్ విశదీకరించాడు. తద్వారా వివిధ వర్గాల మధ్య సంఘర్షణలను తొలగించి అధికారాన్ని తగిన విధంగా పంపిణీ చేయటం ద్వారా సాంఘిక భద్రత, శాంతియుత వాతావరణం ఏర్పడతాయి. ప్రజలలో సంపదపరంగా ఎక్కువ వ్యత్యాసాలు ఉండటం రాజకీయ సుస్థిరతకు ఆరోగ్యకరమైనది కాదంటాడు. రాజకీయ సుస్థిరతకు పరిమిత ఆస్థి, ఆదాయం ఉన్న మధ్యతరగతి ప్రజానీకం ఒక సామాజిక శక్తిగా, వర్గంగా అవసరమని సుమారు రెండు వేల మూడువందల సంవత్సరాల క్రితమే అరిస్టాటిల్ గుర్తించాడంటే ఆయన వాస్తవిక దృక్పదాన్ని, దూరదృష్టిని, మేధాశక్తిని మనం అంచనా వేయవచ్చు.

ఉత్తమ రాజ్యానికి స్థిరత్వం వుండి, పురోగతి సాధించాలంటే కొన్ని భౌతిక పరిస్థితులు కూడా అవసరమని అరిస్టాటిల్ భావించాడు. రాజ్యంలోని జనసంఖ్య మరీ తక్కువ కాకుండా స్వయం పోషకమై ఉండేటట్లు, మరీ ఎక్కువ కాకుండా సక్రమైన పరిపాలనకు అనువుగా వుండవలెనని అరిస్టాటిల్ అభిప్రాయపడినాడు. కానీ అదే సమయంలో ప్రజల సంఖ్య ఇతిమిద్ధంగా ఇంత ఉండాలని ఆయన నిర్ణయించలేదు. జనాభా వలె రాజ్యం యొక్క భూభాగం కూడా మరీ పెద్దది కాకుండా, మరీ చిన్నది కాకుండా ఉండవలెను. అప్పుడే ప్రజలంతా కలసి సభలు, సమావేశాలు ఏర్పాటుచేసుకోవటానికి అనువుగా వుంటుంది. ప్రదేశం అనేది శత్రువులకు అభేద్యమైనదిగా ఉండటం శ్రేయస్కరం. ఉత్తమ రాజ్యంలో అరిస్టాటిల్ విద్యకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాడు. విద్య మానవుని వ్యక్తిత్వాన్ని వైజ్ఞానిక, నైతిక, భౌతిక రంగాలలో అభివృద్ధి చేసి అతనిని సుశిక్షితుడైన పౌరునిగా తీర్చిదిద్దుతుంది. కాబట్టి ప్రభుత్వం నిర్బంధ విద్యావిధానం ప్రవేశపెట్టాలని అరిస్టాటిల్ అభిప్రాయపడినాడు.

## 2.6 అరిస్టాటిల్ - విప్లవాలు :

అరిస్టాటిల్ తన "పాలిటిక్స్" ఐదు, ఆరు అధ్యాయాలలో రాజ్యాలలో చోటుచేసుకొనే విప్లవాలను (Revolutions) గురించి, వాటి ద్వారా రాజ్యాలలో చోటుచేసుకొనే మార్పులను గురించి వివరించాడు. విప్లవాలకు గల కారణాలను, వాటిని నివారించటానికి తగిన మార్గాలను కూడా సూచించాడు. ఆనాటి సమకాలీన గ్రీకు సమాజంలో నెలకొని ఉన్న అరాచకపరిస్థితులు, గ్రీకు నగరరాజ్యాలలో ఏర్పడిన రాజకీయ, రాజ్యాంగపరమైన మార్పులు, రాజకీయ అస్థిరతపై వాటి ప్రభావం అరిస్టాటిల్‌ను ఈ దిశగా ఆలోచింపచేసాయి. తులనాత్మకంగా అధ్యయనం చేసిన గ్రీకు నగర రాజ్యాల చరిత్ర, అనుభవపూర్వకమైన యదార్థసంఘటనలను ప్రాతిపదికగా చేసికొని విప్లవాలకు సంబంధించిన సిద్ధాంతాలను అరిస్టాటిల్ రూపొందించాడు. అదే సమయంలో ఏ ప్రభుత్వవ్యవస్థపై నా ప్రత్యేక అభిమానం చూపకుండా శాస్త్రీయ దృక్పధంతో రాజకీయవేత్తలకు, పరిపాలకులకు ఉపయోగపడేవిధంగా విప్లవాలను నివారించటానికి కొన్ని సూచనలు కూడా ఆయన పొందుపరిచాడు.

విప్లవాలన్నీ ఒకే లక్ష్యంతో రాకపోవచ్చు. ఒక విప్లవం రాజ్యాంగాన్ని మార్చటానికి రావచ్చు. లేదా కొన్ని సమయాలలో విప్లవకారులు రాజ్యాంగాన్ని మార్చకుండానే రాజ్యాధికారాన్ని వశపరచుకోవచ్చు. అదే విధంగా ఒక ప్రభుత్వ విధానాన్ని మార్చి ఇంకొక రకమైన ప్రభుత్వ విధానాన్ని ఏర్పాటు చేసుకోవటానికి కూడా విప్లవాలు రావచ్చు. ఉదాహరణకు అల్పజనపాలిత రాజ్యాన్ని కులీన పాలిత రాజ్యంగా మార్చటానికి కాని, ప్రజాస్వామ్యాన్ని పాలిటిగా మార్చటానికి కాని విప్లవాలు రావచ్చు. ఒక్కొక్కసారి ప్రభుత్వంలోని ఏదో ఒక అంగం (Organ) యొక్క స్వరూప, స్వభావాలను మార్చటానికి కూడా విప్లవం రావచ్చు.

అరిస్టాటిల్ అభిప్రాయంలో విప్లవాలను మూడు రకాలుగా వర్గీకరించవచ్చును. అవి 1. అంతరంగిక లేదా అంత:పుర విప్లవం (Palace Revoluation) 2. రాజకీయ విప్లవం (Political Revoluation) , 3. సామాజిక విప్లవం(Social Revoluation). అంత:పుర లేదా అంతరంగిక విప్లవం అంటే అధికారంలో ఉన్న పాలకవర్గంలో కొందరు పాలకుల పట్ల వ్యక్తిగత, తదితర కారణాల వల్ల అసంతృప్తి చెంది ఆకస్మిక తిరుగుబాటు ద్వారా అధికారాన్ని హస్తగతం చేసుకుంటారు. ఈ తిరుగుబాటు ద్వారా అధికారం పాలకవర్గంలోని గ్రూపులలో ఒక గ్రూపు నుండి మరో గ్రూపు చేతిలోకి మారుతుందే తప్ప మౌలికంగా అధికారం ఆ పాలకవర్గంలోనే వుంటుంది. ఈ విప్లవం ద్వారా రాజ్యాంగంలో కాని, ప్రజాజీవనంలో కాని ఎటువంటి ప్రధాన మార్పులు సంభవించవు. రాజకీయ విప్లవం అంటే అధికారంలో ఉన్న వర్గంలో కొంతమంది వ్యతిరేక వర్గంతో చేతులు కలిపి చేసిన తిరుగుబాటు ద్వారా ఏర్పడ్డ నూతన రాజకీయ వ్యవస్థలో పాలకవర్గం ప్రత్యర్థివర్గంతో అధికారాన్ని పంచుకొంటుంది. ఇటువంటి విప్లవం వలన రాజ్యాంగంలో మార్పులు చోటుచేసుకుంటాయే కాని ఇతర రంగాలపై దాని ప్రభావం విశేషంగా ఉండదు. సామాజిక విప్లవం రాజకీయరంగంలో మార్పులు తేవటమే కాకుండా ప్రజల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాలలో కూడా మౌలికమైన మార్పులు తీసుకువస్తుంది. సామాజిక విప్లవం సమాజంలో ఎవరిని వదిలిపెట్టకుండా అన్ని రంగాలలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొని వస్తుంది.

## 2.6.1. విప్లవాలకు సాధారణ కారణాలు :

అరిస్టాటిల్ అభిప్రాయంలో విప్లవాలు రావటానికి ముఖ్యమైన కారణం ప్రజల సమానత్వ వాంఛ, న్యాయాభిలాష. సమాజంలో నెలకొన్న అసమానతలు అసంతృప్తికి, అసంతృప్తి తిరుగుబాటుకు దోహదం చేస్తుంది. ఆ విధంగా సమానత్వాన్ని సాధించటానికి విప్లవాలు చోటుచేసుకుంటాయి. సమానత్వ భావం అన్ని రాజకీయ వ్యవస్థలలో ఒకే విధంగా ఉండదు. ప్రజాస్వామ్యంలో ప్రజానీకం సంపూర్ణ సమానత్వం ఉండవలెనని ఆకాంక్షిస్తుంది. అల్పజనపాలనలో పాలకులు సంపదను, శక్తిసామర్థ్యాలను అనుసరించి యోగ్యతకు తగిన సమానత్వం ఉండవలెనని భావిస్తారు. ఆర్థిక అసమానతలు, ప్రభుత్వాధికారాన్ని దుర్వినియోగం చేయటం, సమాజంలో సమన్వయాన్ని కుదర్చగలిగే మధ్యతరగతి లేకపోవటం విప్లవాలు రావటానికి దోహదం చేస్తాయి.

## 2.6.2 విప్లవాలకు ప్రత్యేక కారణాలు :

విప్లవాలకు కొన్ని ప్రత్యేక కారణాలు కూడా ఉంటాయని అరిస్టాటిల్ భావించాడు. స్వార్థం, పదవీ వ్యామోహం, దురహంకారం, ప్రజాజీవితంలో కొందరికే అనుచితమైన ప్రాధాన్యం ఇవ్వటం, ఎన్నికల కుతంత్రాలు, విశ్వాస ఘాతకులకు

ఉన్నతమైన పదవులు ఇవ్వటం, రాజ్యంలో వివిధ స్థాయిలలో నెలకొని ఉన్న అసమానతలు మొదలైనవి విప్లవాలకు దారితీస్తాయి.

## 2.6.3 విప్లవాలను నివారించటానికి మార్గాలు :

అరిస్టాటిల్ విప్లవాలు రావటానికి గల కారణాలను విశ్లేషించిన తరువాత వాటిని అరికట్టటానికి, అవి రాకుండా ఉండటానికి కొన్ని మార్గాలను సూచించాడు. విప్లవాలు రాకుండా నిరోధించాలంటే మొట్టమొదట చేయవలసినది ప్రజలలో చట్టం పట్ల విధేయతను పెంపొందించటం. ప్రజలందరూ శాసనబద్ధంగా వ్యవహరిస్తే అందరికి లాభదాయకమని ప్రబోదించాలి. ప్రజలను మోసగించే చర్యలుకాని, కపటోపాయాలు కాని పాలకులు అనుసరించకూడదు. అధికారం ఏ ఒక్క వ్యక్తి చేతిలో కాని లేక ఒక వర్గంలోకాని ఎక్కువగా కేంద్రీకృతం కాకూడదు. అందువలన మిగతావారికి అసూయ, అసంతృప్తి ఏర్పడే ప్రమాదం వుంది. కాబట్టి పాలకుడు సాధ్యమైనంతవరకు రాజకీయ అధికారాన్ని పదవులను అన్ని వర్గాల మధ్య సమదృష్టితో పంపిణీ చేయటానికి ప్రయత్నించాలి. ఏ ఒక్క వ్యక్తికి, సామాజిక వర్గానికి ప్రభుత్వాధికారం లభించలేదనే అసంతృప్తి కలగకుండా జాగ్రత్త వహించాలి. విదేశీయులకు కానీ, అపరిచితులకు కాని ఉన్నత పదవులు ఇవ్వరాదు. ప్రభుత్వాధికారులు పదవిని దుర్వినియోగం చేసి అవినీతి, లంచగొండితనములను అలవరచుకోకుండా గట్టి ఏర్పాట్లు, నిఘా వుంచాలి. ప్రభుత్వం యొక్క అంతర్గత వివరాలు ముఖ్యంగా ఆర్థికపరమైన లావాదేవీలపై ప్రజాపర్యవేక్షణకు అవకాశం కల్పించాలి. అప్పుడే ప్రభుత్వం ఎక్కువ ప్రజాదరణ పొందుతుంది. యోగ్యతననుసరించి పదవులను ఇవ్వాలి. ఏ ఒక్క వర్గానికో అధికారంలో ప్రాధాన్యత ఇవ్వకూడదు. విద్యావిధానం రాజ్య రాజకీయ వ్యవస్థను, రాజ్యాంగాన్ని సమర్థించే విధంగానూ రూపొందించబడాలి. రాజ్యాంగంలో ఉన్నత పదవులన్నీ రాజ్యాంగ విధేయత, పరిపాలనా సామర్థ్యం, నీతి పరత్వం, సత్‌శీలత ఉన్నవారికి మాత్రమే ఇవ్వాలి. ప్రజలకు రక్షణ కల్పించటం, వారి ఆస్థిపాస్థులను పరిరక్షించటమే కాకుండా వారి విలువలను,సాంప్రదాయాలను గౌరవించాలి.

## 2.7 అరిస్టాటిల్ - సిద్ధాంత విమర్శ :

అరిస్టాటిల్ రాజనీతి సిద్ధాంతం, అభిప్రాయాలు ఎంతగా ప్రాచుర్యం చెందినప్పటికి వాటిలో కొన్ని లోపాలు కూడా కన్పిస్తాయి. యదార్థ పరిస్థితులను అతడు శాస్త్రీయంగా పరిశోధించినప్పటికీ ఆనాడు గ్రీకు సమాజంలో చోటుచేసుకుంటున్న కొన్ని వాస్తవాలను అతడు గుర్తించలేకపోయాడు. ఆనాడు అలెగ్జాండర్ జైత్రయాత్రలతో నగర రాజ్యాలు అంతరించి సామ్రాజ్య భావాలు స్పష్టంగా అంకురించిన విషయాన్ని ఆయన గమనించలేదు. అదే విధంగా అరిస్టాటిల్ బానిసత్వ విధానాన్ని సమర్థించటం సముచితంగా లేదు. మానవులందరిని రెండు వర్గాలుగా, అంటే, ఆజ్ఞలిచ్చే పాలకులగానూ, శిరసావహించే బానిసలుగాను విభజించుట సహేతుకంగా లేదు. ఆధునిక యుగంలోని కార్మికులు, కర్షకులు అతని భావనలో బానిసలు క్రిందే లెక్క. కానీ ఈ అభిప్రాయం సమర్థనీయంగా లేదు. బానిస విధానాన్ని చర్చించుటలో అరిస్టాటిల్ జాత్యాహంకారాన్ని ప్రదర్శించాడు. గ్రీకులను బానిసలుగా చేయకూడదని ఆయన అంటాడు. అదేవిధంగా అరిస్టాటిల్ పౌరసత్వానికి ఇచ్చిన వివరణ కూడా చాలా సంకుచితంగా వుంది. అతని అభిప్రాయంలో పౌరసత్వం కొద్దిమంది ఉన్నత వంశీయులకు, ఆస్థిపరులకే పరిమితమైనది. జనసామాన్యానికి, స్త్రీలకు పౌరసత్వం అందుబాటులోవుండదు. వారు రెండవశ్రేణి జనాభాలాగా బ్రతకాలి.

## 2.8 అరిస్టాటిల్ - విశిష్ఠత :

అరిస్టాటిల్ అభిప్రాయాలలో, సిద్ధాంతాలలో కొన్ని లోపాలు ఉన్నప్పటికి ప్రపంచ చరిత్రలో మొట్టమొదటి మేటితత్వవేత్తగా ఆయనను పరిగణించవచ్చు. మానవ విజ్ఞానాన్ని వ్యవస్థీకరించి ఒక శాస్త్రీయరూపం కల్పించటంలో అరిస్టాటిల్ కృషి అద్వితీయమైనది. అరిస్టాటిల్ రాజనీతితత్వ విచారంలోని చాలా అభిప్రాయాలు ఈనాటికి ఉపయుక్తతను (Relevance) కలిగి ఉన్నాయి అంటే ఆయన మేధాసంపత్తి ఎటువంటిదో మనం ఊహించుకోవచ్చు. ఆధునిక కాలంలో బహుళ ప్రాచుర్యాన్ని పొందిన సమన్యాయపాలన (Rule of Law), రాజ్యాంగితావాదం (Constitutionalism), అధికార పృధ:కరణ సిద్ధాంతం (Theory of seperation of Power) వంటి భావనలకు, సిద్ధాంతాలకు పునాదులు అరిస్టాటిల్ రచనలలో మనకు గోచరిస్తాయి. అరిస్టాటిల్ యొక్క "పాలిటిక్స్" మధ్య యుగ రచయితలనే కాక ఆధునిక యుగానికి చెందిన మాఖియవెల్లి, మాంటెస్క్యూ, హెగెల్, కారల్‌మార్క్స్ వంటి రాజనీతి తత్తవేత్తలను కూడా ఎంతగానో ప్రభావితం చేసింది. ప్లేటో ఆదర్శవాదానికి పితామహుడైతే, అరిస్టాటిల్ వాస్తవిక వాదానికి, శాస్త్రీయ దృక్పదానికి మూలపురుషునిగా ప్రఖ్యాతి చెందాడు.

**చదువవలసిన గ్రంధాలు :**

(1) R.P. Sharma : Westren Political Thought

(2) George.H.Sabine : A History of Political Theory

(3) W.A. Dunning : A History of Political Theory

(4) V. Krishna Rao : పాశ్చాత్య రాజనీతి తత్వవిచారం

**ప్రశ్నలు :**

1) అరిస్టాటిల్ యొక్క ప్రభుత్వాల వర్గీకరణపై ఒక వ్యాసాన్ని వ్రాయండి.
2) విప్లవాలపై అరిస్టాటిల్ యొక్క అభిప్రాయాలను వివరించండి.
3) అరిస్టాటిల్ విశిష్టత ఏమిటి ?
4) పాలిటి - ప్రజాస్వామ్యం మధ్య ఉన్న తేడాను వ్రాస్తూ, ప్రజాస్వామ్యంపై అరిస్టాటిల్ భావాలపై విమర్శనాత్మక వ్యాఖ్య వ్రాయండి.
5) అరిస్టాటిల్ ప్రతిపాదించిన "ఉత్తమ రాజ్యం"పై ఒక వ్యాసం వ్రాయండి.
6) సామాజిక వర్గాలపై అరిస్టాటిల్ భావాలు సమర్థనీయమా ?

**రచయిత : ఐ. దోసగిరిరావు**

పాఠం - 3

# అరిస్టాటిల్ - (384 - 327 B.C )

# రాజ్యావతరణ సిద్ధాంతం

**విషయసూచిక**


3.0 పరిచయం

3.1 అరిస్టాటిల్‌పై గ్రీకుల, ప్లేటో యొక్క ప్రభావం

3.2 ప్లేటో - అరిస్టాటిల్ భేదాభిప్రాయాలు

3.3 అరిస్టాటిల్ - రచనలు

3.4 అరిస్టాటిల్ - రాజ్యావతరణ సిద్ధాంతం

3.5 రాజ్యం - సహజమైన సంస్థ

3.6 రాజ్యం - లక్ష్యాలు (Ends of the State)

3.7 పౌరసత్వం

3.8 బానిసత్వ వ్యవస్థ - సమర్థన

3..9 స్త్రీ - హోదా

3.10 సారాంశం


## 3.0 పరిచయం :

ప్రపంచ చరిత్రలో మొట్టమొదటిసారిగా విజ్ఞానాన్ని శాస్త్రీయ దృక్పథంతో వ్యవస్థీకరించిన మహామేధావి అరిస్టాటిల్. ఈయన ప్లేటో శిష్యులలో అగ్రగణ్యుడిగా పరిగణింపబడుతున్నాడు. మానవ చరిత్రలో మేధాసంపత్తికి సంబంధించి ఆయనతో సరితూగగల తత్వవేత్తలెవరూ లేరన్నది అతిశయోక్తికాదు. అతని గురువు అయిన ప్లేటో అంతటి తత్త్వవేత్త, తన శిష్యుడు అరిస్టాటిల్‌ను మేధాసంపత్తికి ప్రతిరూపంగా భావించాడన్న అనిస్టాటిల్ ఎంతటి మేధావో ఊహించుకోవలసిందే. రాజనీతి శాస్త్రంలో ఆదర్శవాదానికి (Idealism) ప్లేటోను మూలపురుషుడుగా పరిగణిస్తే, వాస్తవిక వాదానికి (Realism), శాస్త్రీయ దృక్పధానికి అరిస్టాటిల్‌ను మూలపురుషునిగా పేర్కొనవచ్చును. ప్లేటో వలననే అరిస్టాటిల్ కూడా కాలానికి అతీతమైన తత్వవేత్త. అన్ని యుగాలవారు ఆయన రచనల ద్వారా ప్రభావితులైనారు. ఈనాటికి ఆయన రచనలు, ఆలోచనలు ఉపయుక్తతను (Relevance) కలిగి, నేటి మేధావులకు స్ఫూర్తిని కల్గిస్తున్నాయి.

అరిస్టాటిల్ గ్రీసు దేశంలో స్టాజిరా నగరంలో క్రీ.పూ. 384లో జన్మించాడు. ఇతని తండ్రి నికోమాకస్ మాసిడోనియా రాజ్యంలో ఆస్థాన వైద్యునిగా ఉండేవాడు. అరిస్టాటిల్ బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. ఇతని 18వ యేట ఏథెన్స్ నగరంలో ఉన్న ప్లేటో "అకాడమి"లో ప్రవేశించి, సుమారు 20 సంవత్సరముల పాటు సకల విద్యలు అభ్యసించాడు. ప్లేటో మరణాంతరం మాసిడోనియా వెళ్ళి అక్కడ అలెగ్జాండర్‌కు విద్యాబోధకునిగా పనిచేసాడు. క్రీ.పూ. 335లో ఏథెన్స్

నగరానికి తిరిగివచ్చి లైసియం (Lycium) అనే విశ్వవిద్యాలయాన్ని స్థాపించి జీవితాంతం వివిధ విషయాలలో పరిశోధనలు నిర్వహిస్తూ, రచనలు చేస్తూ, విద్యాబోధన చేస్తూ క్రీ.పూ. 332లో గతించాడు.

## 3.1 అరిస్టాటిల్‌పై గ్రీకుల, ప్లేటో యొక్క ప్రభావం :

అరిస్టాటిల్ భావాలపై సమకాలీన గ్రీకు నగర రాజ్యాల రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితుల ప్రభావం కనబడుతుంది. ప్లేటో కాలంనాటి పరిస్థితులే అరిస్టాటిల్ కాలంలోకూడా కొనసాగినవని చెప్పవచ్చును. అంతర్యుద్ధాలు, ముఠా తగాదాలు, ప్రభుత్వాల అస్థిరత ఇంకొంత తారాస్థాయికి చేరుకొన్నాయి. స్పార్టా పతనం అరిస్టాటిల్ కాలంలోనే జరిగింది. ఏథేన్స్‌లో ప్రజాస్వామ్య ప్రభుత్వాలు స్థిరత్వం లేక ఒకటి తరువాత మరొకటి ఏర్పడుతూ వచ్చాయి. ఆనాడు గ్రీసులో ఉన్న కొన్ని విశ్వాసాలు, సంకుచిత అభిప్రాయాలు కూడా అతని మీద ప్రభావం చూపినాయి. గ్రీకుల ఆధిక్యం, నగర రాజ్యమే సాంఘిక వ్యవస్థలన్నింటిలో మేలైనదటం, బానిసత్వ వ్యవస్థ సహజమైనదనటం, వ్యక్తిమీద రాజ్య ఆధిక్యం, ప్రజా వ్యవహారాలలో పౌరునికి ఉన్న ప్రముఖ పాత్ర మొదలైనవి అతనిపై ప్రభావం చూపినాయి. అదే విధంగా 20 సంవత్సరాలపాటు అతనికి విద్యాబోధన చేసిన ప్లేటో యొక్క ప్రభావం కూడా అతనిపై కన్పిస్తుంది.

## 3.2 ప్లేటో - అరిస్టాటిల్ భేదాభిప్రాయాలు :

అరిస్టాటిల్ భావాలపై ప్లేటో ప్రభావం ఎంత ఉన్నప్పటికీ అరిస్టాటిల్ కొన్ని సందర్భాలలో ప్లేటోతో విభేదించాడు. మౌలిక అంశాలపై వారి ఇరువురికి ఏకాభిప్రాయం ఉన్నప్పటికి పద్ధతులలో, దృక్పథంలో భిన్నత్వం కన్పిస్తుంది. ప్లేటో తన అభిప్రాయాలను వ్యక్తీకరించటానికి నిగమన పద్ధతి (Deductive Method) ని అవలంభించగా, అరిస్టాటిల్ ఆగమన పద్ధతి (Inductive Method) ని అనుసరించాడు. ప్లేటో కొన్ని ప్రధాన సూత్రాలను ఆధారం చేసుకొని తన అభిప్రాయాలను వ్యక్తం చేయగా, అరిస్టాటిల్ వాస్తవిక పరిస్థితులను పరిశీలించి వాటిని ఆధారం చేసుకొని అభిప్రాయాలను వ్యక్తీకరించాడు. అరిస్టాటిల్ సమకాలీన గ్రీకు సమాజంలోని 158 గ్రీకు రాజ్యాంగాలను సమగ్రంగా, విమర్శనాత్మకంగా, తులనాత్మకంగా పరిశీలించి వాటి ఆధారంగా తన సిద్ధాంతాలను రూపొందించాడు. ఆ విధంగా తులనాత్మక రాజకీయ వ్యవస్థల అధ్యయనాన్ని ప్రారంభించిన ఘనత అరిస్టాటిల్‌కే చెందుతుంది.

అరిస్టాటిల్ తన గురువైన ప్లేటో భావాలను ఎంతగా గౌరవించినప్పటికి అతని మేథాసంపత్తి ప్లేటోను విమర్శనారహితంగా అంగీకరించలేదు. వాస్తవానికి అరిస్టాటిల్ ప్లేటో భావాలను, అభిప్రాయాలను తన భావాలకు, సిద్ధాంతాలకు ప్రాతిపదికగా చేసుకొన్నాడు. కానీ అదే సమయంలో అరిస్టాటిల్ ప్లేటో భావాలను గుడ్డిగా అంగీకరించలేదు. ప్లేటో అనుభవాన్ని కాదంటే అరిస్టాటిల్ దానినే ప్రాతిపదికగా భావించాడు. ప్లేటో రాజకీయ ఆదర్శాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాడు. కానీ వాస్తవంలో అవి ఆచరణ సాధ్యమా, కాదా అని ఆలోచన చేయలేదు. కానీ అరిస్టాటిల్ అట్లాకాకుండా రాజకీయ వాస్తవికాలకు, అనుభవపూర్వకమైన విషయాలకు ప్రాముఖ్యం ఇచ్చాడు. ప్లేటో తత్వవేత్త అయితే అరిస్టాటిల్ శాస్త్రవేత్త. ప్లేటో తీవ్రవాది అయితే అరిస్టాటిల్ సంస్కర్త. ప్లేటో ఉన్న వ్యవస్థను పూర్తిగా తొలగించి దానిస్థానంలో నూతన రాజకీయ వ్యవస్థను క్రొత్త పునాదులపై ఏర్పరచాలని భావిస్తే, అరిస్టాటిల్ వాస్తవ రాజకీయ వ్యవస్థలను అనుభవపూర్వకంగా సంస్కరించాలని భావించాడు. అరిస్టాటిల్ తన రచనలలో ఆనాటి ప్రజల అభిప్రాయాలకు, ఆచారాలకు ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చాడు. అందుకే అతనిని వాస్తవిక తత్వవేత్త (Realist Philosophor) గా పరిగణించవచ్చు. అంతేగాక

అరిస్టాటిల్ రాజనీతిని నైతికశాస్త్రం నుంచి వేరుచేసి స్వతంత్ర శాస్త్రంగా రూపొందించినాడు. ఈ విధంగా అతడు రాజనీతి శాస్త్రానికి మూలపురుషునిగా విఖ్యాతి చెందినాడు.

## 3.3. అరిస్టాటిల్ - రచనలు :

అరిస్టాటిల్ సర్వతోముఖ ప్రజ్ఞావంతుడు, మహాపండితుడు. ఒక్క గణితశాస్త్రానికి తప్పించి మిగిలిన అన్ని శాస్త్రాలను ఆయన సృజించాడు. నేటికి అనేక శాస్త్రాలకు ఈయన గ్రంథాలే మార్గదర్శకాలు. అరిస్టాటిల్ తన రచనలలో ఆనాటి ప్రజాభిప్రాయాలకు, వాస్తవికవాదదృక్పదానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినాడు. అందుకే అతడు వాస్తవికవాద తత్త్వవేత్తగా పరిగణింపబడినాడు. అరిస్టాటిల్ రచించిన ప్రధాన గ్రంథం పాలిటిక్స్ (Politics). ఆ తరువాత కాలంలో చాలా ప్రముఖమైన గ్రంథంగా పరిగణింపబడినది. ఎంతోమంది మేధావులను, రచయితలను అది ఎంతగానో ప్రభావితం చేసింది. ఈ గ్రంథం అప్పటి వ్యవస్థలైన నగర రాజ్యాన్ని (City State), బానిసత్వాన్ని, కుటుంబాన్ని సమర్థించి రాజ్యంలోని దోషాలకు నివారణోపాయాలను సూచిస్తుంది.

## 3.4 అరిస్టాటిల్ - రాజ్యావతరణ సిద్ధాంతం :

అరిస్టాటిల్, ప్లేటో వలనే రాజ్యం ఒక సహజమైన సంస్థ అని భావించాడు. దానిని ఏ ప్రజాసముదాయం ప్రత్యేకించి ఒక ప్రయోజన సాధన కోసం, ఒక ప్రత్యేక కాలంలో రూపొందించలేదు. సోఫిస్టుల అభిప్రాయలకు భిన్నంగా అరిస్టాటిల్ రాజ్యం ఒక ఒప్పందం ఫలితంగా ఏర్పడలేదని ఒకానొక ప్రత్యేక కాలంలో ఏర్పాటయిన రాజకీయవ్యవస్థగా రాజ్యాన్ని భావించుట సరికాదని అభిప్రాయబడినాడు. రాజ్యం ఏర్పాటు కావటం ఒక సహజ పరిణామమని, కాని దానికి కొన్ని ఉన్నతమైన నైతికవిలువలు ఉన్నాయని అరిస్టాటిల్ భావించాడు. అరిస్టాటిల్ భావనలో రాజ్యం ఏర్పాటుకు ప్రాతిపదిక కుటుంబ వ్యవస్థ

## 3.5 రాజ్యం - సహజమైన సంస్థ :

స్వాభావికంగా మానవుడు సంఘజీవి (Social Animal) అంటాడు అరిస్టాటిల్. మానవునికి ఉన్న అనేక అవసరాలను తీర్చటానికి రాజ్యం ఏర్పడింది. మానవుని ప్రాథమిక అవసరాలు ముఖ్యంగా మూడు. ఆహారం, వస్త్రం, నివాసం. ఈ రకమైన ఆర్థిక అవసరాలతోపాటు మానవునికి కొన్ని సామాజికపరమైన, మానసికపరమైన అవసరాలు, కోరికలు కూడా వుంటాయి. ఇటువంటి అవసరాలను, కోర్కెలను తీర్చుకోవటానికి పురుషులు, స్త్రీలు కలిసి కుటుంబ వ్యవస్థ ఏర్పడింది. ఇదే రాజ్యానికి ప్రాతిపదిక. అరిస్టాటిల్ అభిప్రాయములో కుటుంబానికి నైతిక, సామాజికమైన ప్రయోజనం వున్నది. కాలక్రమంలో మానవుని కోరికలు, అవసరాలు పెరిగి నాగరికత పురోగమించిన కొలది కుటుంబాలన్నీ కలసి గ్రామం ఏర్పడింది. ఈ గ్రామమే చివరికి స్వయం పోషకమైన నగరరాజ్యంగా ఏర్పడింది. ఇటువంటి స్వయంపోషకమైన నగరరాజ్యాన్ని "పోలిస్" అంటాడు అరిస్టాటిల్. రాజ్యంగా పరిణామం చెందటమే వ్యక్తి యొక్క పరమావధి. రాజ్యానికి అవసరమయ్యే సహజీవనం (Co-Existence), రాజకీయ వ్యవస్థ (Political Organization) , న్యాయం (Law) అనే మూడు అంశాలు ఈ వ్యవస్థలోనే ఉద్భవించినవి. ఆ విధంగా మానవునికి కుటుంబ వ్యవస్థ ఎంత సహజమైనదో రాజ్యం కూడా అంత సహజమైనది. ఈ విధంగా అరిస్టాటిల్ రాజ్యాన్ని ఒక సహజమైన మరియు అవసరమైన వ్యవస్థగా భావించాడు.

మానవుని అవసరాలు, కోర్కెలు తీర్చటానికి వివిధ వ్యవస్థలు ఏర్పడతాయి. కానీ ఈ వ్యవస్థలన్నింటికన్నా రాజ్యం అత్యుత్తమమైనది. ఇతర వ్యవస్థలు మానవుని ప్రత్యేక అవసరాల కోసం, సంకుచితమైన కోర్కెలు తీర్చటం కోసం ఏర్పడి ఉండవచ్చు. కానీ రాజ్యం మానవునికి ఉన్నత ఆశయాల సాధన కోసం మరియు పరిపూర్ణమైన జీవనాన్ని కల్పించటానికి ఏర్పడిన సహజమైన సంస్థ. ఉన్నతమైన ఆశయాలు, భావ వ్యక్తీకరణ సామర్థ్యం మానవుని జంతుజాలానికి భిన్నంగా నిరూపిస్తాయి. ఇవి మానవునికి స్వాభావికమైనవి. కనుక రాజ్యం కూడా మానవునికి స్వాభావికమైనది. రాజ్యం లేకపోతే మానవునికి వాస్తవికంగా నైతిక జీవనం సాధ్యం కాదు. ఆ విధంగా రాజ్యం సహజమైనది, మానవుడు సంఘజీవి అని స్పష్టమైనది.

అరిస్టాటిల్ రాజ్యాన్ని ఒక సహజమైన సముదాయంగా వర్ణించాడు. వివిధ కోరికలను, విభిన్నమైన అవసరాలను తీర్చుకోవటానికి వ్యక్తులు తమ స్వభావాల ద్వారా ప్రేరేపించబడి ఒక సముదాయంగా రూపొందుతారు. రాజ్యం ఒక సముదాయం కావటం వలన - వారి అవసరాల రీత్యా - రాజ్యానికి వ్యక్తికి మధ్య ఎటువంటి వైరుధ్యాలు, ప్రయోజనాల సంఘర్షణ ఉండదు. అది ప్రజలందరికి ఉన్నతమైన జీవనాన్ని కల్పించుటకు ప్రయత్నిస్తుంది. అదే విధంగా చట్టానికి, వ్యక్తుల స్వేచ్ఛకు మద్య ఎటువంటి వైరుధ్యం ఉండటానికి అవకాశం లేదు. ప్లేటో తన ''రిపబ్లిక్''లో ప్రతిపాదించిన రాజ్యావతరణ కూడా ఇంచుమించుగా పై విధంగానే వుంటుంది. వ్యక్తులు తమ అవసరాలను, కోర్కెలను తీర్చుకోవటానికి శ్రమ విభజన సిద్ధాంతాన్ని ఆధారంగా చేసుకొని వివిధ కర్తవ్యాలు నిర్వహిస్తారు. అయితే వివిధ సముదాయాల నుంచి, వ్యవస్థల నుంచి రాజ్యాన్ని వేరుచేసి వివరించటానికి, అది ఏ విధంగా ఇతర వ్యవస్థల కంటే భిన్నంగా, ఉన్నతంగా ఉంటుందో విశ్లేషించటానికి అరిస్టాటిల్ ప్రయత్నించాడు.

అరిస్టాటిల్ అభిప్రాయంలో వ్యక్తి కంటే రాజ్యం ఉన్నతమైనది. రాజ్యం లేకపోతే మానవుడు జీవించలేడు. రాజ్యం మానవుని సహజమైన గమ్యం ఎందుకంటే అతడు రాజకీయజీవి. రాజ్యం నుండి అతనిని విడదీస్తే స్వయం పోషకుడిగా పరిపూర్ణ జీవనాన్ని సాగించలేడు. ఒకవేళ ఎవరైనా రాజ్యంతో నిమిత్తం లేకుండా రాజ్యానికి వెలుపల ఏకాంతంగా జీవించగలిగితే అతడు మానవుడి కంటే అధమ స్థాయిలోనైనా - జంతువైనా వుండాలి. లేదా అత్యుత్తమ స్థాయిలోనైనా - దేవతగానైనా- వుండాలి. ఈ రెండు అతనికి సాధ్యం కాదు కాబట్టి మానవుడు స్వాభావికంగా రాజకీయజీవి అయ్యాడు. అందువల్లనే రాజ్యం అతనికి సహజమైన సంస్థ అయినది. మానవుడు తన శ్రేయస్సు కోసం, పరిపూర్ణత సాధించుట కోసం రాజ్యంలో ఉండి తీరాలి. వ్యక్తిని రాజ్యం నుంచి వేరుచేయటానికి సాధ్యం కాదు. రాజ్యం అనే శరీరానికి వ్యక్తి ఒక అవయవం. రాజ్యానికి, వ్యక్తికి ఇంత సన్నిహిత సంబంధం ఉండుట వల్లనే మానవుడు రాజకీయజీవి (Political Animal) అయినాడు. వ్యక్తిని రాజ్యానికి, న్యాయానికి దూరం చేస్తే అతడు మృగం కన్నా హీనంగా ప్రవర్తిస్తాడు. అందుకే మానవుడు మానవుడుగా జీవనం సాగించుట కోసం రాజ్యం అత్యంత అవసరమైనది.

## 3.6 రాజ్యం - లక్ష్యాలు (Ends of the State) :

మానవుని ప్రాథమిక అవసరాలను తీర్చటానికి ప్రారంభంలో రాజ్యం ఏర్పడిందని అరిస్టాటిల్ కూడా ప్లేటోవలె భావించినాడు. ప్రారంభంలో జీవిత అవసరాలను తీర్చటానికి ఏర్పడినప్పటికీ, ఆ తరువాత కాలంలో రాజ్యలక్ష్యాలు క్రమక్రమంగా పెరగటం ప్రారంభించాయి. వాటి లక్ష్యం ప్రజలకు ఉత్తమ జీవనాన్ని కల్పించటంగా మార్పుచెందాయి. అరిస్టాటిల్ ఉద్దేశ్యంలో రాజ్యం మానవునికి పరిపూర్ణమైన జీవనాన్ని కల్పించటానికి ఏర్పడిన సహజమైన సంస్థ. అందువల్లనే

"రాజ్యం మానవునికి ప్రాథమిక అవసరాలు తీర్చటానికి ఏర్పడింది. కానీ అంతటితో ఆగక అతనికి ఉత్తమ జీవనాన్ని కల్పించటానికి కొనసాగుతుంది" అని అరిస్టాటిల్ పేర్కొన్నాడు. ఆ విధంగా అరిస్టాటిల్ రాజ్యాన్ని మానవుల ప్రాథమిక అవసరాలను తీర్చే వ్యవస్థగానో లేక ఆర్థికపరమైన ప్రయోజనాలను సమకూర్చే వ్యవస్థగానో భావించలేదు. వ్యక్తి నైతికాభివృద్ధికి కావలసిన ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించుట రాజ్యం యొక్క లక్ష్యంగా ఆయన భావించాడు. రాజ్యం కంటే తక్కువ స్థాయిలో ఉండే సముదాయం, కుటుంబం, గ్రామం, వ్యక్తి దైనందిన అవసరాలను తీర్చగలవే కాని అతనికి పరిపూర్ణమైన జీవనాన్ని కలిగించలేవు. అతని హేతుబుద్ధికి అనుగుణమైన వాతావరణాన్ని పెంపొందించలేవు. ఇవన్నీ ఒక్క రాజ్యంలోనే సాధ్యం అవుతాయి.

## 3.7 పౌరసత్వం :

అరిస్టాటిల్ రాజ్యంలో పౌరులే ప్రధాన పాత్ర వహిస్తారు. బానిసలు పౌరులు కారు. ఎందుకంటే వారికి విచక్షణాజ్ఞానం ఉండదు. స్త్రీలు కూడా పౌరులు కాదు. ఎందుకంటే వారికి పౌరులకు కావలసిన సుగుణాలు లేవు. విదేశీయులకు పౌరసత్వం లేదు. ఎందువలనంటే వారు మరో దేశపౌరులు కాబట్టి. అందువలన తీరిక, విజ్ఞత, జీవించటానికి కావలసిన సంపద వుండి రాజ్య కార్యకలాపాలలో ఉత్సాహంగా పాల్గొనేవాడే అరిస్టాటిల్ దృష్టిలో నిజమైన పౌరుడు. పౌరుడు రాజ్య వ్యవహారాలలో శ్రద్ధాసక్తులతో పాల్గొనవలెనంటే అతనికి ఆర్థికపరమైన ఇబ్బందులు ఉండకూడదు. కాబట్టి ఆస్థి పౌరునికి అత్యవసరమని అరిస్టాటిల్ భావించాడు. రాజ్య వ్యవహారాలలో అంటే ప్రభుత్వ నిర్వహణలోను, న్యాయ పరిపాలనలోను, శాసన నిర్మాణంలోను పాల్గొనగలిగే సామర్థ్యం ఉన్నవాడే పౌరుడుఅని అరిస్టాటిల్ అంటాడు. అరిస్టాటిల్ నిర్వచించిన పౌరులు ఏకకాలంలో పాలకులు, పాలితులుగా వుంటారు. ఎందువలనంటే అటువంటి సామర్థ్యం ఉన్నవారి నుంచే పాలకులు ఏర్పడతారు. అందువలన అటువంటి పౌరుల ఉత్తమ జీవనానికి రాజ్యం ఏర్పడిందని చెప్పవచ్చును. ఈ పౌరుల మధ్యనే సామర్థ్యంపరంగా సమానత్వం ఉండుట వలన మళ్ళీ వీళ్ళే ప్రజాస్వామ్యంలో కూడా పాలకులు, పాలితులుగా ఉంటారు. బానిసలు, స్త్రీలు, విదేశీయులను మినహాయిస్తే ఈ పౌరుల సంఖ్య సహజంగానే చాలా తక్కువ సంఖ్యలో ఉంటుంది. అరిస్టాటిల్ శ్రామిక జనానికి కూడా పౌరసత్వం ఇవ్వలేదు. రాజ్యాధికారాన్ని ప్లేటో కొద్దిమందికే పరిమితం చేశాడని అతడు విమర్శించినాడే కాని తాను కూడా సర్వజనులకు పౌరసత్వం ఇవ్వలేదు.

## 3.8 బానిసత్వ వ్యవస్థ - సమర్థన :

అరిస్టాటిల్ సాంప్రదాయవాది. ప్లేటోవలె సమకాలీన గ్రీకు సమాజంలోని అభిప్రాయాలకు భిన్నంగా అతను వ్యవహరించలేదు. వాస్తవిక దృక్పథం పేరుమీద అతడు బానిసత్వ వ్యవస్థను సమర్థించటానికి ప్రయత్నించాడు. కుటుంబ వ్యవస్థ మనుగడకు బానిసత్వం చాలా అవసరమైనదని, అది సహజమైనదని, నైతికమైనదని అతని అభిప్రాయం. పౌరునికి విరామం కల్పించటానికి, అతనిని గృహవ్యవహారాలలో సాధనంగా పనిచేయడానికి అనువుగా అరిస్టాటిల్ బానిస వ్యవస్థను సమర్థించాడు.

మేధాశక్తిలో తారతమ్యాలను ఆధారం చేసుకొని అరిస్టాటిల్ బానిసత్వ వ్యవస్థను బలపరిచాడు. మానవునిలో కొందరు మేధాశక్తి సంపన్నులు, మరికొందరు శారీరక బలసంపన్నులుగా ఉంటారు. శారీరక బలం మీద మేధాశక్తిదే పైచేయి. కనుక స్వాభావికంగా ఎక్కువ తెలివైనవారు ఇతరులకు నాయకత్వం వహించవలసి ఉంటుంది. అంటే వారే

పరిపాలకులు అవుతారు. శారీరక బలం వుండి మేధాసంపత్తి లేనివారు బానిసలుగా వుంటారు. జన్మత: ఇతరుల ఆజ్ఞలను శిరసావహించటానికి కొందరు, ఇతరులను పరిపాలించటానికి కొందరు నిర్ణీతులై ఉంటారని అరిస్టాటిల్ అభిప్రాయపడినాడు. యజమానులు బానిసలను హింసించకపోతే బానిసత్వ వ్యవస్థ ఉభయులకు లాభదాయకమే. యజమానులందరూ బానిసలను దయార్థ్ర దృష్టితో చూడవలెనని అరిస్టాటిల్ హెచ్చరించాడు. ఎవరైనా బానిసల పట్ల అమానుషంగా వ్యవహరిస్తే వారిని శిక్షించవలెనని కూడా అతడు సూచిస్తాడు. యుద్ధంలో పరాజితులైనవారు విజయం సాధించిన వారికన్నా మేధాశక్తిలో తక్కువవారైతేనే బానిసలుగా ఉండటానికి అర్హులు. అరిస్టాటిల్ అభిప్రాయంలో గ్రీకులంతా అధిక మేధాసంపన్నులు. కాబట్టి వారిని బానిసలుగా చేయకూడదు. స్వాభావికంగా బానిస అయినవానికి, శాసన రీత్యా బానిస అయినవారికి తేడా వుంది. శాసనరీత్యా బానిస అయినవాడు యుద్ధంలో ఓడినవాడు. స్వాభావికంగా బానిస అయినవానికి వివేకం ఉండదు. ఇతరులను పరిపాలించే సమర్థత కూడా ఉండదు.

అరిస్టాటిల్ జీవించిన కాలంలో బానిసత్వ వ్యవస్థ విశ్వవ్యాప్తమై సమాజంలో ఒక ప్రధాన అంశంగా వుండేది. అందువలన అరిస్టాటిల్ వాస్తవిక దృష్టితో బానిస విధానాన్ని సమర్థించాడు. బానిస వ్యవస్థ గృహనిర్వహణకు అత్యంత అవసరమైన సాధనంగా పరిగణిస్తాడు. గృహనిర్వహణకు, గృహ అవసరాలు తీర్చుకోవటానికి కొన్ని సాధనాలు అవసరం. ఈ సాధనాలు సజీవమైనవి లేదా నిర్జీవమైనవి కావచ్చు. బానిసలు సజీవమైన సాధనాలు. వారు గృహ అవసరాలు తీర్చటానికి పరికరాలుగా ఉపయోగపడతారు. కుటుంబ నిర్వహణలో అవసరమైన సేవలను వారు అందచేస్తారు. అందువలన ఈ బానిస విధానం స్వేచ్ఛాపరులైన గ్రీకు సంప్రదాయాలను అనుసరించి సమర్థించినప్పటికీ, యజమానులు బానిసలను సానుభూతితో చూడాలని భావిస్తాడు. చివరికి తన బానిసలను తన తదనంతరం అమ్మకుండా, స్వేచ్ఛా జీవులుగా వారిని వదిలివేయాలని తన వీలునామాలో అరిస్టాటిల్ నిర్దేశించాడు.

## 3.9 స్త్రీ - హోదా :

అరిస్టాటిల్ రచనలలో స్త్రీలను గురించి వెలిబుచ్చిన అభిప్రాయాలను ప్లేటో అభిప్రాయాలకు భిన్నంగా వున్నాయి. అరిస్టాటిల్ అభిప్రాయంలో సహజంగానే స్త్రీలు పురుషుల కంటే నిమ్నస్థాయిలో ఉంటారు. పురుషుడు, స్త్రీ కంటే ఔన్నత్యం కలవాడని అరిస్టాటిల్ భావన. సంతానోత్పత్తికి స్త్రీ అవసరమని, అది ఆమె నిర్వహించవలసిన కర్తవ్యం అని అరిస్టాటిల్ భావిస్తాడు. అయితే సంతానోత్పత్తిలో స్త్రీ కంటే పురుషుడే క్రియాత్మక పాత్ర వహిస్తాడు. ఆ విధంగా అరిస్టాటిల్ బావనలో స్త్రీ కేవలం సంతానాన్ని కనటానికి ఉపయోగపడే సాధనం మాత్రమే. వివాహం, మంచి సంతతిని ఉత్పత్తి చేయటానికి ఒక సాధనం.

ఈ సందర్భంలోనే అరిస్టాటిల్ తన గురువైన ప్లేటోతో విభేదిస్తాడు. ప్లేటో తన ''రిపబ్లిక్''లో పాలకులకు వ్యక్తిగతమైన కుటుంబాన్ని, ఆస్థిని నిషేదిస్తాడు. కానీ అరిస్టాటిల్ ఇది సరైనది కాదని విమర్శిస్తాడు. పాలకులకు స్వంత కుటుంబాలు లేకపోవటం కాలక్రమంలో రాజ్య ప్రయోజనాన్ని నిర్లక్ష్యం చేస్తుందని అరిస్టాటిల్ భావించాడు. ప్రతివ్యక్తి ఏది తన స్వంతం అయితే దానిపట్ల ఎక్కువ ఆసక్తి చూపిస్తాడు. సామూహిక సంపద సామూహిక అజాగ్రత్తకు గురిఅవుతుంది. ఎవరి సంతానం ఎవరిదో తెలియనందువలన పాలకవర్గం సంతతి మొత్తం నిరాదరణకు గురిఅవుతుందని అరిస్టాటిల్ ప్లేటో ప్రతిపాదించిన స్వంత కుటుంబం రద్దును విమర్శిస్తాడు. అరిస్టాటిల్ ప్లేటో సిద్ధాంతానికి భిన్నంగా కుటుంబ

వ్యవస్థను, ఆస్థిని సమర్ధించాడు. కుటుంబం, ఆస్థి ఉండటం వలన స్త్రీలు భార్యలుగా గృహ కార్యక్రమాలలో నిమగ్నులై వుంటారు. అదే సమయంలో అరిస్టాటిల్ స్త్రీలను పౌరులుగా పరిగణించలేదు. వారిని సంతానోత్పత్తికి, కుటుంబ నిర్వహణకు పరిమితం చేశాడు.

## 3.10 సారాంశం :

రాజనీతి తత్త్వశాస్త్రంలో అరిస్టాటిల్ స్థానం చాలా విశిష్టమైనది. అతని రచనలు సమకాలీన గ్రీకు సమాజంలోని పరిస్థితుల వలన, భావాల వలన ప్రభావితం అయినప్పటికి ఆ తరువాతి కాలంలో అభిప్రాయాలు ఎందరో తత్వవేత్తలను ప్రభావితం చేశాయి. సెయింట్ థామస్ ఆక్వినాస్, డాంటే, మాకియవెల్లి , మాంటెస్క్యూ, హెగెల్ వంటి రాజనీతి తత్వవేత్తలు అతని సిద్ధాంతాల ద్వారా ఎంతగానో ప్రేరేపితులయ్యారు. పాశ్చాత్యదేశాలలో ఒక రకంగా వాస్తవిక రాజనీతి విచారణ అరిస్టాటిల్ తో ప్రారంభమైందని చెప్పవచ్చు. అతని నిశిత విమర్శల వలన, శాస్త్రీయ దృక్పధం వలన రాజనీతి ఒక స్వతంత్ర్య శాస్త్రంగా అభివృద్ధి చెందినది. అరిస్టాటిల్ వాస్తవికవాద దృక్పధం అతడు చర్చించిన అన్ని అంశాలలో మనకు విస్పష్టంగా కన్పిస్తుంది. మాక్సి అన్నట్లు "ప్లేటో ఆదర్శవాదానికి, విప్లవాలకు మార్గదర్శి అయితే అరిస్టాటిల్ వాస్తవికవాదానికి, శాస్త్రీయ దృక్పదానికి, అనుభవపూర్వక వాదానికి మూలపురుషుడు"గా భావించవచ్చును.

## చదువవలసిన గ్రంధాలు :


| | | |
|---|---|---|
| (1) R.P. Sharma | : | Westren Political Thought |
| (2) George.H.Sabine | : | A History of Political Theory |
| (3) W.A. Danning | : | A History of Political Theory |
| (4) V. Krishna Rao | : | పాశ్చాత్య రాజనీతి తత్వవిచారం |


## ప్రశ్నలు :

1. అరిస్టాటిల్ యొక్క రాజ్యావతరణ సిద్ధాంతాన్ని వివరించండి.
2. అరిస్టాటిల్ పై ప్లేటో మరియు గ్రీకుల ప్రభావాన్ని వివరించండి.
3. రాజ్యం దానిలక్ష్యాలపై అరిస్టాటిల్ భావాలపై విమర్శనాత్మక వ్యాసాన్ని వ్రాయండి.
4. రాజ్యం, పౌరసత్వం, స్త్రీలను అరిస్టాటిల్ భావాలు వివరించండి.
5. బానిసలు, స్త్రీలపై అరిస్టాటిల్ భావాలు సమర్థనీయమా ?

**రచయిత : ఐ. దోసగిరిరావు**

పాఠం - 4

# మధ్యయుగాల రాజనీతి తత్వవిచారం :

# సెయింట్ అగస్టీన్ - చర్చి - రాజ్యం

**విషయసూచిక**


4.0 పరిచయం

4.1 అగస్టీన్ - జీవిత విశేషాలు

4.2 రచనలు

4.3 రెండు నగరాల సిద్ధాంతం

4.4 అగస్టీన్ రాజకీయ భావాలు

4.4.1. రాజ్యం

4.5 రాజ్యానికి - చర్చికి మధ్య సంబంధాలు

4.6 ఆస్థి

4.7 ధర్మసిద్ధాంతం

4.8 బానిస వ్యవస్థ

4.9 **"City of God"** - విమర్శనాత్మక పరిశీలన - సారాంశం

4.10 చదువవదగిన పుస్తకాలు


## 4.0 పరిచయం :

476 A.D. నుండి 1453 A.D. మధ్యకాలాన్ని ఐరోపా చరిత్రలో మధ్యయుగాలని వ్యవహరిస్తారు. మధ్యయుగం రోమన్ సామ్రాజ్య పతనంతో ప్రారంభమై సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమం ప్రారంభంతో ముగిసింది. చర్చి, భూస్వామ్య వ్యవస్థ, సామ్రాజ్యం, ప్రారంభదశలో వున్న జాతీయతా భావం ముఖ్యంగా మధ్యయుగాల రాజనీతి చింతనను ప్రభావితం చేశాయి. వీటి సంఘర్షణ వల్ల మధ్యయుగాలనాటి రాజనీతితత్వ విచారణ ఆవిర్భవించిందని ఆచార్య మాక్సీ అన్నాడు.

మధ్యయుగంలో ప్రజల సాంఘిక జీవన విధానాన్ని నియంత్రణ చేయడంలో రాజ్యం కంటే చర్చికే ఎక్కువ పాత్ర వుండేది. రాజకీయ సమాజ అవతరణ, దాని స్వభావం గురించి విస్తృతంగా చర్చించే రచనలు లేవు. ఈ కాలంలో రాజ్యవిధులయొక్క ఉచితమైన పరిధి, వాటి స్వరూపం మొదలగు విషయాలపై రాజ్యాధిపతులకు, మతాధిపతులకు మధ్యసంఘర్షణలతో కూడిన వాదనలు తలెత్తాయి. ఇరుపక్షాలవారు వారి వారి వాదనలను బలపరచుకోవడానికి బైబిల్‌ని, క్రైస్తవ మతాధిపతులు, పోప్‌లు చేసిన ప్రకటనలను, ఇచ్చిన తీర్పులను ఉదహరించేవారు. అంటే ఒకే రకమైన ఆధారాలను చూపేవారు.

మధ్యయుగంనాటి రాజనీతి తత్వవిచారణ బైబిల్, మతపరమైన చర్చి యొక్క సిద్ధాంతాలకు పూర్తిగా అనుగుణంగా వుందని చెప్పలేము. ఈ సిద్ధాంతాలను చర్చించినపుడు క్రైస్తవేతర ప్రాచీన గ్రీకు, రోమన్ రచయితల భావాలను కూడా ఉపయోగించారు. ఇటువంటి చర్చల ద్వారా కొన్ని ముఖ్యమైన ప్రాచీన రాజనీతి సిద్ధాంత భావాలు కూడా చోటుచేసుకొని ముందు యుగాలకు సాగాయి. అంతేకాకుండా రాజకీయ కార్యకలాపాల విలువలను నిర్ణయించడానికి కొన్ని క్రైస్తవ సిద్ధాంతాలు కూడా అంతస్సూచికలుగా పనిచేశాయి. పై చర్చననుసరించి రాజనీతి సిద్ధాంత పరిణామంలో మధ్యయుగాలు పూర్తిగా ఫలరహితమైనవని చెప్పడం సమంజసంకాదు.

## 4.1 అగస్టీన్ - జీవిత విశేషాలు :

తొలి క్రైస్తవ మతాచార్యులలో సెయింట్ అగస్టీన్ చాలా ప్రముఖుడు. ఇతను ఉత్తర ఆఫ్రికాలో నుడిమియాలో (354 A.D.)లో జన్మించాడు. తల్లి క్రైస్తవ మతస్థురాలు. తండ్రి క్రైస్తవ మతేతరుడు. వయోజనుడు అయిన కొద్ది అగస్టీన్ తాత్విక అభిరుచిని అలవరచుకొన్నాడు. సెయింట్ ఆంబ్రోస్ కు శిష్యుడు. అగస్టీన్ 35వ ఏట క్రైస్తవమతాన్ని స్వీకరించాడు. 42వ ఏట ఆఫ్రికాలో హిప్పోలో బిషప్‌గా నియమితుడై ఈ పదవిలో అగస్టీన్ 430 A.D. లో తను మరణించినంతవరకు కొనసాగాడు.

## 4.2 రచనలు :

అగస్టీన్ ఎన్నో గ్రంథాలను రచించాడు. వాటిలో క్రైస్తవ మతానికి వివరణిచ్చి సమర్థించాడు. అతని గ్రంథాలలో "Confessions", "City of God" అనే గ్రంధాలు ముఖ్యమైనవి. "City of God" గ్రంథాన్ని రచించడానికి అతనికి దాదాపు 12 సంవత్సరాలు పట్టింది. ఇది 22 పుస్తకాల సంకలనం. ఇది ఒక మహాగ్రంథం. ఉత్తర మధ్యయుగకాలంలో దీని ప్రభావం చాలా ఎక్కువగా వుండేది.

"City of God" గ్రంధరచనకు ముఖ్యకారణం 410 A.D.లో రోమ్‌నగరం అలారిక్ నాయకత్వంలో జర్మనీ ఆటవికులైన విసిగోత్సు చేతిలో పతనమైంది. 313 A.D. లో రోమన్ సామ్రాజ్యం అధికారమతంగా గుర్తింపుపొంది వ్యాప్తిచెందిన క్రైస్తవమతమే రోమన్ సామ్రాజ్యపతనానికి కారణమని క్రైస్తవమతేతరులు ప్రచారంచేశారు. ఈ ప్రచారాన్ని తిప్పికొట్టటానికి "City of God" గ్రంధాన్ని అగస్టీన్ రచించాడు. ఈ గ్రంధంలో మొదటి 10 పుస్తకాలలో క్రైస్తవమతం రోమన్ సామ్రాజ్యపతనానికి కారణం కాదని అగస్టీన్ వివరించాడు. ఇందులో క్రైస్తవమతాన్ని సమర్థించాడు. ఈ గ్రంధరచనలో ప్లేటో చెప్పిన ఆదర్శభావాలు (ముఖ్యంగా ధర్మభావన) సిసిరో చెప్పిన భక్తిభావన, జ్యూడో - క్రైస్తవ మతవిశ్వాసాలు అగస్టీన్‌ను ప్రభావితం చేశాయి. అయినప్పటికి ఈ గ్రంధంలో క్రైస్తవమత తాత్విక చింతననుసరించి ముఖ్య విషయాలను చర్చించాడు.

## 4.3 రెండు నగరాల సిద్ధాంతం :

"City of God" గ్రంధంలో అగస్టీన్ రెండు నగరాల (సమాజాల) సిద్ధాంతాన్ని వివరించాడు. నిజానికి ఈ రెండు నగరాలు స్వర్గం, భూప్రపంచాలుకావు. అవి చర్చి, రాజ్యం కూడా కావు. మానవుల ఆత్మలను పొందటానికి అనాది నుంచి పోటీపడే మంచి, చెడు అనే రెండు శక్తులు మాత్రమే. మంచి దైవనగరానికి ప్రతీకైతే, చెడు దానవ లేదా పిశాచి నగరానికి ప్రతీక.

దైవ, పిశాచి నగరాలు రెండురకాల సమాజాలకు ప్రతినిధులు. ఇవి విభిన్న లక్షణాలు కలిగివుంటాయి. దానవ (పిశాచ) నగరం (Earthly city) లో ప్రజలు స్వార్థానికే అధిక ప్రాధాన్యతనిస్తారు. భగవంతుడిని ద్వేషిస్తారు. వారు ఆధ్యాత్మిక విషయాల కంటే భౌతిక ప్రయోజనాలకే ప్రాధాన్యతనిస్తారు. ఈ సమాజంలో నైతిక విలువలకు ప్రాధాన్యత వుండదు. దానవ నగరంలో పాలకులు, ప్రభుత్వ ఉద్యోగులు, సామాన్య ప్రజల మధ్య పగ, ప్రతీకారం, ద్వేషం, అంతః కలహాలు సర్వసాధారణమైన విషయాలు. ప్రజలలో ప్రేమ, ఇతరుల పట్ల గౌరవ భావం వుండవు. అన్నిరకాల వ్యసనాలకు బానిసలై వుంటారు. తెలివితక్కువతో ఈ నగర ప్రజలు శాంతిస్థాపనకు యుద్ధాలు చేస్తారు. కాని ఈ నగరంలో శాంతిస్థాపన ఎప్పుడూ జరగదు. రోమన్ సామ్రాజ్యం పిశాచి నగరాన్ని పోలిందని అగస్టీన్ అభిప్రాయం. భగవంతునిపై విశ్వాసం లేని క్రైస్తవేతరులు రోమన్ సామ్రాజ్యాన్ని పరిపాలించడంవల్ల వారిలో క్రౌర్యం, అహంకారం, దుఃఖజీవనం, వ్యభిచారం వృద్ధిచెంది అవి ఈ సామ్రాజ్యాన్ని పతనం చేశాయని అతను చెప్పాడు. పాపకార్యాలు, దుష్టబుద్ధి దాని పతనానికి మూలకారణమని చెప్పాడు.

దానవ నగరానికి విభిన్నంగా దైవనగరం వుంటుంది. దైవనగరంలో ప్రజలకు భగవంతుని యెడల ఉన్న భక్తిభావంపై ఈ నగరం ఆధారపడివుంటుంది. ఇందులో ప్రజలు పవిత్రులు. వారు ఆధ్యాత్మిక విషయాలకే అధిక ప్రాధాన్యతనిస్తారు. వారు స్వప్రయోజనాలకు ప్రాధాన్యతనివ్వరు. వారు త్యాగబుద్ధి, సత్ప్రవర్తన, సౌజన్యం కలిగివుంటారు. ప్రజలలో అంతఃకలహాలు, పగ, అధికార దాహం వుండవు. ఈ కారణంగా దైవనగరంలో శాంతి,సత్సంబంధాలు, పవిత్రత శాశ్వతంగా వుంటాయి. అగస్టీన్ వివరించిన దైవనగరం కేవలం రాజ్యంకాదు, అలాగని పూర్తిగా చర్చికాదు. అది ఒక రకమైన క్రైస్తవ చర్చిరాజ్యం. ఇటువంటి రాజ్యంలో మాత్రమే సమానత్వం, ధర్మం, స్వేచ్ఛ సాధ్యం.

దైవనగరంలో మోక్షాన్ని, శాశ్వత జీవితాన్ని సాధించడానికి తోడ్పడే రెండు సాధనాలను భగవంతుడు సమకూర్చాడు. అవి చర్చి, రాజ్యం. ఈ రెండింటిలో చర్చి ముఖ్యమైనది. రాజ్యం క్రైస్తవ రాజ్యం కానట్లైతే అది మానవుల మోక్షసాధనకి అడ్డంకిగా వుంటుందని అగస్టీన్ భావించాడు. భూమిపై భగవంతుని ప్రతినిధి చర్చి. పాపాత్ములను కాపాడి వారికి మోక్షాన్ని ప్రసాదించే ఒక మహోన్నత వ్యవస్థే చర్చి, చర్చికున్న ఈ ఆధ్యాత్మిక లక్ష్యమే అది రాజ్యం కంటే గొప్పదని చెప్పడానికి కారణం.

అగస్టీన్ సిద్ధాంతాన్ని అనుసరించి దైవనగర మంచి శక్తులకు, దానవ నగర చెడ్డశక్తులకు మధ్య జరిగిన సంఘర్షణే చరిత్ర అని అగస్టీన్ భావించాడు. ఈ రెండింటి మధ్యజరిగిన సంఘర్షణ ఫలితంగా క్రైస్తవ కామన్‌వెల్తు స్థాపింపబడుతుందని అగస్టీన్ చెప్పాడు. అగస్టీన్ వివరించిన చరిత్ర సిద్ధాంతం మధ్యయుగాల నాటి ఆలోచనలనే గాక ఆ తరువాత కాలంనాటి ఆలోచనలను కూడా ప్రభావితం చేసింది.

## 4.4 అగస్టీన్ రాజకీయ భావాలు :

అగస్టీన్ ప్రదానంగా రాజనీతి తత్వవేత్తకాడు. సహేతుకుమైన రాజనీతి సిద్ధాంతాన్ని అభివృద్ధి చేయాలని అతని ఉద్దేశ్యం కాదు. రోమన్ సామ్రాజ్య పతనానికి దారితీసిన వివిధ కారణాలను వివరించిన సందర్భములో రాజనీతి తత్వశాస్త్రంలో భాగాలైన రాజ్యం, సమాజం, మానవ స్వభావం, ఆస్థి, బానిసవ్యవస్థ మొదలగు విషయాలను అగస్టీన్ చర్చించాడు. వీటిపై అగస్టీన్ భావాలను సంక్షిప్తంగా వివరిద్దాం.

### 4.4.1. రాజ్యం :

రాజ్యాన్ని, సమాజాన్ని భగవంతుడే సృష్టించాడని అగస్టీన్ చెప్పాడు. మానవుడు స్వాభావికంగా తన తోటి మానవుల సహచర్యాన్ని కోరుకుంటాడు. ఈ కోర్కె సమాజం ఏర్పాటుకు దారితీసింది. రాజ్యం, సమాజం ఏర్పడక ముందు అమాయకులైన ఆదిమమానవులు అందరు సమానంగా వుండేవారు. ఒకరిపై ఒకరికి ఆధిపత్యం లేదు. కానీ ఆడమ్ పతనాంతరం పాపం ప్రారంభమైంది. క్రమేణా మానవులు చేసిన పాపకార్యాలవల్ల వారిలో అసమానతలు పెరిగాయి. పాపకార్యాల ఫలితంగా మానవునిలో విలాసజీవితాన్ని గడపాలనే కోరిక పెరిగింది. పాపకార్యాలలో చిక్కుకున్న మనిషి ఆత్మనిగ్రహం ద్వారా భగవంతుని దీవెనలను పొందగలడని అగస్టీన్ చెప్పాడు. రాజ్యానికి పునాది ధర్మం . ఉమ్మడి వస్తువులను సామరస్యంగా అనుభవించడానికి ఏర్పడిన హేతుబద్ధమైన మానవుల సంఘమే రాజ్యమని అగస్టీన్ చెప్పాడు.

అగస్టీన్ దైవదత్తాధికార సిద్ధాంతాన్ని సమర్థించాడు. ఈ సిద్ధాంతాన్ని అనుసరించి రాజుకు అధికారం దైవం నుంచి సంక్రమించింది. రాజరికం దైవదత్తమైనది. రాజు చేసే పనులను విమర్శించడానికి ప్రజలకు హక్కులేదని అగస్టీన్ భావించాడు. ప్రజల యోగ్యతను బట్టి భగవంతుడు రాజును నియమిస్తాడు. ప్రజలు పాపాత్ములైనప్పుడు వారికి ఒక దుర్మార్గుడిని రాజుగా భగవంతుడు నియమిస్తాడు. సన్మార్గుడైన రాజు ఆజ్ఞలను ఏవిధంగా పాటిస్తారో, దుర్మార్గుడైన రాజు ఆజ్ఞలను కూడా ప్రజలు అదేవిధంగా విధేయులై వుండాలని అగస్టీన్ భావించాడు. రాజు ఆజ్ఞలను ధిక్కరించే అధికారం ప్రజలకు లేదని అగస్టీన్ చెప్పాడు. అతని అభిప్రాయంలో ఈ భూప్రపంచంలో వున్న మానవులందరు పాపాత్ములే గనుక సర్వాధికారి అయిన ఒకవ్యక్తి అధికారానికి వారు లోబడివుండటం అవసరమని అగస్టీన్ భావించాడు.

రాజ్యం యొక్క ప్రధానవిధి శాంతిభద్రతలను పరిరక్షించడమని, హక్కులను కాపాడటం కాదని అగస్టీన్ పేర్కొన్నాడు. క్రైస్తవ రాజ్యాలు, క్రైస్తవేతర రాజ్యాలు రెండూ శాంతి భద్రతలను కాపాడతాయి. దానవ రాజ్యంలో శాంతి భద్రతలుండటంవల్ల ప్రజలు వారికి ఇష్టమైన భౌతిక వస్తువులను, విలాసాలను బాగా అనుభవించగలరు. దైవరాజ్యంలో ప్రజలు భగవంతుడిని పూజించి తరించడానికి ప్రజలకు శాంతి భద్రతలు అవసరం. ఈ సందర్భంలో క్రమరహిత ప్రజాస్వామ్యం కంటే సుస్థిరమైన, శాంతి భద్రతలను కాపాడగల నియంతృత్వమే మంచిదని అగస్టీన్ చెప్పాడు.

## 4.5 రాజ్యానికి - చర్చికి మధ్య సంబంధాలు :

రాజ్యాన్ని, చర్చిని భగవంతుడే సృష్టించాడు. అవి కొంతవరకు శిక్షాత్మకమైనవి, కొంతవరకు పరిహారాత్మకమైనవి కాబట్టి రెండూ అవసరమేనని అగస్టీన్ చెప్పాడు. చర్చి - రాజ్య సంబంధాలు విషయమై అగస్టీన్ అతనికంటే ముందున్న క్రైస్తవ మతాధిపతుల అభిప్రాయాలతో ఇంచుమించు ఏకీభవించాడు. సంపూర్ణ ధర్మసాధనకి చర్చికి లౌకిక శాఖగా రాజ్యం పనిచేస్తుందని అగస్టీన్ అభిప్రాయబడ్డాడు.

లౌకిక, ఆధ్యాత్మిక విధుల మధ్య తేడాను చెప్పాడు. ఆధ్యాత్మిక విషయాలలో రాజు జోక్యం చేసుకోరాదని చెప్పాడు. దైవంపట్ల నిర్వహించవలసిన విధులకు రాజ్యశాసనాలు అడ్డురానంతవరకు రాజ్యం పట్ల ప్రజలు విధేయులై వుండటం న్యాయబద్ధమేనని అగస్టీన్ చెప్పాడు. నిజమైన క్రైస్తవులు దైవం అనుమతించిన పౌరశాసనాలకు బద్ధులై వుండాలి. ఆధ్యాత్మిక విషయాలలో రాజు జోక్యం చేసుకున్నట్లయితే అటువంటి రాజు ఆజ్ఞలను ప్రజలు పాటించనక్కరలేదు.

అంతమాత్రాన అగస్టీన్ మతపరమైన రాజ్యాన్ని సమర్థించాడని కాదు. అతని అభిప్రాయములో రాజ్యం చర్చి పరస్పరం సహకారంతో పనిచేయాలి. రాజ్యం అవసరం చర్చికి, చర్చి అవసరం రాజ్యానికి వుంటుందని చెప్పాడు. మతవిషయాలలో క్రైస్తవ రాజ్యపాలకులకు చర్చి యొక్క సూచనలు అవసరం. చర్చికి సంబంధించిన లౌకిక విషయాలలో పాలకుల లౌకిక అధికారం చర్చికి అవసరం. చర్చి, రాజ్యం రెండు సామరస్యంతో పనిచేయాలని అగస్టీన్ భావించాడు.

ఇంతకుముందు చెప్పినట్లు అగస్టీన్ మతపరమైన రాజ్యాన్ని సమర్థించలేదు. చర్చి ఆధిక్యతను గుర్తించినప్పటికి రాజ్యం చర్చికి అనుబంధసంస్థ కాదని అగస్టీన్ చెప్పాడు. చర్చి యొక్కనైతిక, ఆధ్యాత్మిక నియంత్రణ క్రింద రాజ్యాన్ని అతన్ని వుంచలేదు. రెండింటికి వేరువేరుగా సముచితమైన రీతిలో విధులను కేటాయించాడు. దేని పరిధిలో దానికి సార్వభౌమాధికారం వుంటుంది. చర్చితో పాటు రాజ్యం కూడా వుంటుంది. రాజ్యం దానివిధులను అదిసక్రమంగా నిర్వహించాలని అగస్టీన్ భావించాడు.

## 4.6 ఆస్థి :

ఆస్థిపై సెయింట్ ఆంబ్రోస్ భావాలతో అగస్టీన్ ఏకీభవించాడు. భగవంతుడు భూమిని మానవుల యొక్క ఉమ్మడి ఆస్తిగా సృష్టించాడు. కాని మానవుని దురాశ వలన ఉమ్మడి ఆస్థిభావన ఆచరణ సాధ్యంకాలేదు. ఈ కారణంగా సొంతఆస్థి ఏర్పడింది. ప్రైవేటు ఆస్థి అన్యాయమైనది కాదని, అది మానవుని పాపకార్యాలకు కారణం లేదని అగస్టీన్ భావించాడు.

దైవశాసనం, మానవ శాసనాల వల్ల ప్రైవేటు ఆస్థి ఏర్పడింది. దైవశాసనాన్ని అనుసరించి ఆస్థి మొత్తం భగవంతునికే చెందుతుంది. మానవ శాసనాన్ని అనుసరించి ఆస్థి వ్యక్తులకు చెందుతుంది. ప్రైవేటు ఆస్థి వ్యక్తులకు చెందుతుంది. మానవ శాసనాన్ని అనుసరించి ఆస్తి వ్యక్తులకు చెందుతుంది. ప్రైవేటు ఆస్తి పరిమితి దాని ఉపయోగం మీద ఆధారపడి వుంది. ఏ వ్యక్తి అయినా తన ఆస్తిని సక్రమ పద్ధతిలో ఉపయోగించాలి. ఏవ్యక్తి అయినా ఆస్తిని సక్రమ పద్దతిలో ఉపయోగించనట్లయితే, అతనికి ఆస్తి హక్కు వుండదు. ఆస్తిలో కొంత బీద ప్రజలకు దానం చేయలి. ఆస్తి మానవసంస్థ. ఆస్తిహక్కు రాజ్యం ద్వారా వ్యక్తికి సంభవిస్తుంది. అగస్టీన్ ఆస్తిపై వ్యక్తం చేసిన ఈ భాద రోమన్ న్యాయవేత్తల యొక్క భావానికి విరుద్ధమైనవి. ఆస్తి సహజన్యాయంపై ఆధారపడిందని రోమన్ న్యాయవేత్తలు చెప్పారు. వ్యక్తిశ్రమ ఫలితంగా ఆస్తి ఏర్పడిందనే సిద్ధాంతాన్నే అగస్టీన్ తిరస్కరించాడు.

## 4.7 ధర్మసిద్ధాంతం :

క్రైస్తవ మతం ద్వారా మాత్రమే మానవులకు మోక్షం లభిస్తుందని అగస్టీన్ నొక్కివక్కాణించాడు. క్రైస్తవమత రాజ్యాలలో మాత్రమే ధర్మం వుంటుంది. సిసిరో చెప్పినట్లు ఏరాజ్యంలో బడితే ఆ రాజ్యంలో ధర్మం వుండదు. క్రైస్తవ మతేతర రాజ్యంలో ధర్మం వుండదని అతని అర్థం. ధర్మాన్ని పౌరఅధికారి సృష్టించలేడు. చర్చి మాత్రమే ధర్మాన్ని స్థాపించగలదని అతని నమ్మకం. భగవంతునిలో నమ్మకం లేనివారిలో ధర్మం వుండదు. క్రైస్తవ మతరాజ్యంలో మాత్రమే ధర్మపథం ఆచరింపబడుతుంది. క్రైస్తవ మతసిద్ధాంతం, చర్చి లేని రాజ్యం ఒక దొంగల సంఘం వంటిదని అగస్టీన్ చెప్పాడు.

'ధర్మం' భావనపై అగస్టీన్ తొలిచర్చి అధిపతులతో ఏకీభవించలేదు. ధర్మం రాజ్యంలో వుంటుందనివారు భావించారు. "చట్టం" "ధర్మం" రాజ్యానికి మూలాధారాలని రోమన్ రచయితలు చెప్పారు. వీరితోగూడా అగస్టీన్ ఏకీభవించలేదు.

## 4.8 బానిస వ్యవస్థ :

మానవుని పాపం కారణంగా బానిస వ్యవస్థ ఏర్పడిందని అగస్టీన్ వాదించాడు. పాపం కారణంగా ఒక మనిషి ఇంకొక మనిషికి అధీనుడు అవుతాడు. పవిత్ర గ్రంధాలలో బానిస వ్యవస్థ ప్రస్తావనలేదు. ఇది సహజ వ్యవస్థ కూడా కాదు. బానిస వ్యవస్థ కూడా కొంతవరకు శిక్షాత్మకమైనది, కొంతవరకు పరిహారాత్మకమైనది. యుద్ధంలో ఓడిపోయిన వారిలో చావగా మిగిలిన వారిని సేవకులనేవారు. ఈ పరిస్థితులు యుద్ధమనే పాపకార్యంవల్ల ఏర్పడినవి. పాపకార్యములు చేసిన ప్రతివ్యక్తి పాపానికి సేవకుడే. సేవకుడవటమే అతనికిచ్చే శిక్ష. బానిస వ్యవస్థ భగవంతును అజ్ఞవల్ల ఏర్పడినది గనుక బానిస యజమాని ఆజ్ఞలను తప్పనిసరిగా పాటించవలెను. బంధ విముక్తుని చేయమని బానిస యజమానిని అర్థించకూడదు. ఆధ్యాత్మిక విషయాలలో బానిసలను యజమాని తన సొంతబిడ్డలవలే ఆదరించవలెను.

బానిస వ్యవస్థపై అరిస్టాటిల్, అగస్టీన్ భావాలలో కొంత బేధం వుంది. మనుషులలో ఉన్నతేడాలవల్ల బానిసవ్యవస్థ ఏర్పడిందని అరిస్టాటిల్ చెప్పాడు. కొంతమందికి బుద్ధిబలం ఎక్కువ వుంటే, మరి కొంతమందికి శారీరక బలం ఎక్కువ వుంటుంది. బుద్ధిబలం ఎక్కువ ఉన్నవారికి శారీరకబలం ఎక్కువ వుండి బుద్దిబలం తక్కువ ఉన్నవారు బానిసలైతే ఇరువురికి మంచిదేనని అరిస్టాటిల్ భావించాడు. బానిసవ్యవస్థ సహజంగా ఏర్పడిందని అరిస్టాటిల్ చెప్పాడు. దీనికి విభిన్నంగా మానవులు చేసిన పాపకార్యాలకు శిక్షగా బానిసవ్యవస్థను భగవంతుడు విధించాడని అగస్టీన్ చెప్పాడు.

బానిసవ్యవస్థ, ప్రభుత్వం, ప్రైవేటు ఆస్తి ఈ మూడింటిలో మానవులలో వున్న అసమానతలు కనిపిస్తాయని అగస్టీన్ చెప్పాడు. వీటివల్ల అసమానతలు ఉన్నప్పటికి అవి చెడ్డవికావని అగస్టీన్ భావించాడు. సమానత్వం, శాంతి లేని ఈ ప్రపంచంలో మనిషి జీవించడానికి ఈ మూడు సంస్థలు అవసరమని భావించి భగవంతుడే వాటిని సృష్టించాడని అగస్టీన్ చెప్పాడు.

## 4.9 "City of God" - విమర్శనాత్మక పరిశీలన - సారాంశం :

మధ్యయుగానికి చెందిన ప్రఖ్యాత క్రైస్తవ తత్వవేత్తలలో అగస్టీన్ ముఖ్యుడు. ఇతని రచనలలో "City of God" ప్రసిద్ధి చెందింది. ఈ గ్రంథం మధ్యయుగంనాటి క్రైస్తవ తత్వం, భావాల సంకలనం. ఈ గ్రంధాన్ని భావముల గని అని సేబిన్ వ్యాఖ్యానించాడు. ఈ గ్రంథంలో భావనలను కేథిలిక్కులు, ప్రొటిస్టేంటులు ఉపయోగించుకున్నారు. ఇతను చెప్పిన సిద్ధాంతాలు ప్రజాదరణ పొందాయి.

"City of God" కొన్ని విమర్శలకు గురైంది. ఇది పూర్తిగా రాజనీతి తత్వ విచారణకే పరిమితం కాలేదు. ఇందులో అగస్టీన్ ఎన్నో విషయాలను చర్చించాడు. వీటిలో కొంత అస్పష్టత వుంది. చర్చి - రాజ్యం మధ్యనున్న సంబంధాలను స్పష్టంగా వివరించలేదు. చర్చి ఆధిక్యతను సమర్థించడం వల్ల పోపుల యొక్క నియంతృత్వానికి దారితీసింది. క్రైస్తవ రాజ్యాలలో మాత్రమే ధర్మముంటుందని చెప్పడం సత్యదూరం. ఈ భావన వాస్తవాలకు విరుద్ధం. నాగరికతను మతపరంగా

వివరించడానికి ఇతని సిద్ధాంతాలు దారితీసినాయి. ప్రపంచ శాంతికి భంగం కలిగించే ప్రకటనలు కూడా చేశాడు. ఉదాహరణకు క్రైస్తవలు వారి మతాన్ని రక్షించుకొనటానికి నాస్తికులపై యుద్ధాన్ని చేయవచ్చని చెప్పాడు. న్యాయవర్తనుల పాలనవల్ల ప్రజలకు మంచి జరుగుతుందని చెప్పాడు. కాని అటువంటి పాలనకు మార్గదర్శక సూత్రాలను చెప్పలేదు.

అగస్టీన్ సిద్ధాంతం పైవిమర్శలకు గురైనప్పటికి దాని ప్రభావం మధ్యయుగాలపై అమితంగా వుందని చెప్పవచ్చును. క్రైస్తవ చర్చి క్లిష్టపరిస్థితిలో ఉన్న సమయంలో అగస్టీన్ "City of God"లో వివరించిన తాత్విక చింతన దానికి ఒక ప్రత్యేకమైన ఉనికిని, నిర్ధిష్టమైన లక్ష్యాన్ని కల్పించింది. దిక్కుతోచని క్రైస్తవులకు ఈ గ్రంథం దిక్సూచిగా పనిచేసింది.

అగస్టీన్ సిద్ధాంతంలో చర్చికి ఆధిక్యతను వుంచినప్పటికి రాజ్యానికి కూడా ప్రాధాన్యతనిచ్చాడు. రాజ్యం మంచి జీవితాన్ని సాధించటానికి ఉపయోగపడే అవసరమైన సాధనమని అతడు భావించాడు. "City of God"లో ఉన్న సంపూర్ణ రాజనీతి అంశాలు మధ్యయుగంనాటి తత్వవేత్తలైన థామస్ ఆక్వినాస్, గోటియస్‌ను, చార్లిమేన్, ఒట్టో ది గ్రేట్ (Otto the Great) వంటి పాలకులను ప్రభావితం చేశాయి. అగస్టీన్ చెప్పిన "క్రిస్టియన్ కామన్‌వెల్తు భావన" మధ్యయుగంలో స్థాపించబడిన పవిత్రరోమన్ సామ్రాజ్యం స్థాపించడానికి పునాదిగా పనిచేసింది. అగస్టీన్ భావాలను అతని రచనలు మధ్యయుగ క్రైస్తవ ప్రపంచానికి అందించిన ఒక ముఖ్యమైన మాధ్యమంగా పనిచేశాయి.

## 4.10 చదువదగిన పుస్తకాలు :

1. M. Judd Harmon : "Political Thought : From Plato to the Present"
2. V. Venkata Rao : "A History of Political Theories"
3. P.G. Das : "History of Political Thought"

## ప్రశ్నలు :

1. అగస్టీన్ రాజకీయభావాలపై ఒక వ్యాసాన్ని వ్రాయండి.
2. చర్చి - రాజ్యం మధ్య సంబంధాలపై ఆగస్టీన్ అభిప్రాయాలను వివరించండి.
3. అగస్టీన్ రచించిన "City of God" (దేవుని రాజ్యంపై) విమర్శనాతమక వ్యాసాన్ని వ్రాయండి.
4. అగస్టీన్ యొక్క ధర్మసిద్ధాంతంపై ఒక వ్యాసం వ్రాయండి.
5. ఆస్థి, ధర్మం, బానిసలపై అగస్టీన్ అభిప్రాయాలు సమర్ధనీయమా ?
6. చర్చ యొక్క రాజకీయ పాత్రపై అగస్టీన్ అభిప్రాయం ఏమిటి ?

**రచయిత : యస్. పోలినాయుడు**

పాఠం - 5

# పునరుజ్జీవనోద్యమం కాలంనాటి రాజనీతి : నికోలో మాకియవెల్లీ - రాజ్య నిర్వహణ

విషయసూచిక


5.0 పరిచయం

5.1 జీవిత విశేషాలు

5.2 రచనలు - రచనా పద్ధతి

5.2.1. రచనా పద్ధతి

5.3 సమకాలీన పరిస్థితుల ప్రభావం

5.4 మానవ స్వభావం

5.5 మతం - నీతిపై మాకియవెల్లీ భావాలు

5.6 రాజ్యం

5.7 రాజ్య నిర్వహణ

5.8 రాజ్య విస్తరణ

5.9 ప్రభుత్వాల వర్గీకరణ

5.10. శాసనకర్త పాత్ర

5.11 రాజనీతి తత్వశాస్త్ర చరిత్రలో మాకియవెల్లీ స్థానం

5.12 చదవదగిన పుస్తకాలు


## 5.0 పరిచయం :

క్రీ.శ. 14, 16 శతాబ్దాల మధ్యకాలంలో సాంస్కృతిక పునరుజ్జీవనం ఉద్యమం ఇటలీ నగర రాజ్యాలలో ప్రారంభమై క్రమేణా ఐరోపాలోని ఇతర రాజ్యాలకు వ్యాప్తిచెందింది. ఈ కాలంలో సాహిత్యం, కళలు మొదలుకొని ఇతర వైజ్ఞానిక రంగాలలో సంభవించిన మార్పులనే సాంస్కృతిక పునరుజ్జీవనమని అంటారు. ఈ ఉద్యమం వల్ల ప్రాచీన గ్రీకు, రోమన్ సాహిత్యం, కళలు శాస్త్రీయ విజ్ఞానం పట్ల ఐరోపా దేశీయులకు అభిరుచి కలిగింది. వారిలో మతపరమైన ఆలోచనలు తగ్గి, శాస్త్రీయ, లౌకికవివేచన వైఖరి అలవడింది. మానవుని దృష్టిని తన పరిసర, భౌతిక స్థితిగతుల వైపు మరలించేటట్లు చేసింది. లౌకికతత్వంతో పాటు మతప్రమేయంలేని లౌకికజాతి రాజ్యాలు ఐరోపాలో ఏర్పడ్డాయి. వీటిలో మతాధిపతుల ఆధిపత్యం పోయి, రాజ్యాధికారుల ఆధిపత్యం ఏర్పడింది. అంటే మధ్యయుగం నాటి మతపరంగా ప్రభావితమైన రాజకీయ వ్యవస్థకు స్థానం పోయింది. ఇటువంటి లౌకిక రాజ్యవ్యవస్థ భావన మాకియవెల్లి రచనలలో సుస్పష్టంగా కనిపిస్తుంది. ఇతను తన రచనలలో రాజనీతిని, మతం, నైతిక విలువల నుండి పూర్తిగా వేరుచేశాడు. ఈ నేపథ్యంలో మాకియవెల్లి రాజనీతిని చర్చిద్దాం.

## 5.1 జీవిత విశేషాలు :

పాశ్చాత్య దేశాలలో రాజనీతి శాస్త్రమనగానే నికోలీమాకియవెల్లి పేరు జ్ఞాపకం రానివారుండరు. మాకియవెల్లీ ఫ్లోరెన్సు నగరములో క్రీ.శ. 1469 మే నెల 3వ తేదీన ప్రఖ్యాతిగాంచిన వంశంలో జన్మించాడు. ఇతని తండ్రి నాయవాది. మాకియవెల్లి గ్రీకు, లాటిన్, ఇటాలియన్ భాషలలో ప్రసిద్ధి చెందిన గ్రంథాలను అధ్యయనం చేశాడు. 1494లో ఫ్లొరెన్స్ రిపబ్లిక్‌గా అవతరించింది. ఆ సంవత్సరములోనే రెండవ చాన్సరీ శాఖయందు చిన్న గుమస్తాగా రిపబ్లిక్ ప్రభుత్వ ఉద్యోగంలో మాకియవెల్లి చేరాడు. స్వయంశక్తి, తెలివి, చాకచక్యం గల మాకియవెల్లి అచిరకాలంలోనే ఉన్నత పదవులను అలంకరించాడు.

1496లో రెండవ చాన్సరీకి కార్యదర్శి పదవిలో చేరి 1512 వరకు ఆ పదవిలో కొనసాగాడు. ఈ కాలంలో విదేశీ వ్యవహారాలకు సంబంధించిన దౌత్య, ప్రభుత్వపాలన, మిలటరీ కార్యకలాపాల బాధ్యతలను అతను నిర్వహించాడు. ఈ కార్యకలాపాల నిర్వహణలో దౌత్యవేత్తగా రోమ్, ఫ్రాన్స్, బెర్లిన్‌లతో పాటు అనేక దేశాలను సందర్శించాడు. ఆయా దేశాల ప్రభుత్వపాలనా యంత్రాంగం అమలును, రాజకీయాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకొన్నాడు. 1512 ఫ్లొరెన్సులో తిరుగుబాటు వచ్చి మెదిచీ అధికారంలోకి వచ్చాడు. 1513లో మెదిచీ ప్రభుత్వంపై కుట్ర అభియోగం మోపి మాకియవెల్లికి కారాగారశిక్ష విధించారు. కొద్దికాలం తరువాత కారాగార శిక్షనుండి విముక్తిచెంది మాకియవెల్లీ తన శేషజీవితాన్ని గ్రామీణ ప్రాంతంలో గ్రంథరచనకు వినియోగించాడు.

## 5.2 రచనలు - రచనా పద్ధతి :

ఈ దిగువన పేర్కొన్న ముఖ్య గ్రంథాలను మాకియవెల్లీ రచించాడు.

1. The Prince (1513)
2. Discourses on Livy (1520)
3. The Art of War (1919-20)
4. History of Florence (1922)

వీటిలో ముఖ్యమైనవి మొదటి రెండు గ్రంథాలు. ''ది ప్రిన్స్'' రాజ్యపాలకులకు హితబోధిని గ్రంథమని చెప్పవచ్చును. రాజ్యనిర్వహణ కార్యక్రమాలలో పాలకులు అనుసరించే విధానాలు, పాటించవలసిన నియమ నిబంధనలు గురించి ఈ గ్రంథంలో మాకియవెల్లికి చర్చించాడు. రోమన్ ప్రభుత్వం పుట్టుక, ప్రగతి, నిర్వహణకు సంబంధించిన గ్రంథం "డిస్కోర్సెస్''. ఈ రెండు గ్రంథాలలో ప్రభుత్వ కార్యకలాపాలకు నైతిక విలువలతో సంబంధముండదని మాకియవెల్లి వివరించాడు.

### 5.2.1. రచనా పద్ధతి :

ఈ గ్రంథ రచనలలో మాకియవెల్లీ ముఖ్యంగా చారిత్రిక పద్ధతిని అనుసరించాడు. ఈ పద్ధతి ఆగమన పద్ధతి క్రిందకి వస్తుంది. గత చరిత్రను అధ్యయనం చేయటంవల్ల సమకాలీన పరిస్థితులను అవగాహన చేసుకొని భవిష్యత్తును ఊహించగలమని అతని అభిప్రాయం. ఈ విషయాన్ని నొక్కి చెప్పడానికి రోమన్ చరిత్రలోని అనేక దృష్టాంతాలను

ఆయన ఇచ్చాడు. రాజనీతి అధ్యయనంలో ఈ కొత్తపద్ధతిని అనుసరిస్తున్నట్లు మాకియవెల్లి తెలిపాడు. ఇతని పద్ధతిలో గత చారిత్రక అనుభవాలను ప్రస్తుత పరిస్థితులలో సరిపోల్చవలసివుంటుంది. అంటే ఇతని చారిత్రక పద్ధతిలో తులనాత్మక పరిశీలనా పద్ధతి ఇమిడి వుందని చెప్పవచ్చును. మాకియవెల్లీ రాజ్యపాలకులకు ఇచ్చే సలహాలు, సూచనలు చారిత్రక అనుభవాల మీద, చారిత్రక వాస్తవాల విశ్లేషణ మీద ఆధారపడి వున్నాయని చెప్పవచ్చును. అతను ఇచ్చే సలహాలు అమూర్తపరిశీలనపై ఆధారపడిలేవు.

మాకియవెల్లీ అనుసరించిన అధ్యయన పద్ధతి సరియైన చారిత్రక పద్ధతి కాదని డన్నింగ్, సౌబిన్ వ్యాఖ్యానించారు. సమకాలీన రాజకీయ పరిస్థితులను, వ్యక్తుల ప్రవర్తనను పరిశీలన వల్ల ఏర్పడిన అతని అభిప్రాయాలను, వ్యక్తిగత అనుభవాలను నిరూపించడానికి చారిత్రక దృష్టాంతాలను అతను ఉపయోగించాడని విమర్శకులు చెప్పారు. ఒకవిధంగా మాకియవెల్లీ అనుభవ పద్ధతిని ప్రోత్సహించాడని చెప్పవచ్చును.

ఇతని అధ్యయన పద్ధతి నిజమైన చారిత్రక పద్ధతి కాదని చెప్పడానికి ఇంకొక కారణం ఉందని చెప్పవచ్చును. అతను సాధారణీకరించిన భావాలు చరిత్రనంతా అద్యయనం చేసిన తరువాత ఏర్పడినవి కావు. అవి రోమ్ చరిత్ర అధ్యయన మీద మాత్రమే ఆధారపడినవి.

## 5.3 సమకాలీన పరిస్థితుల ప్రభావం :

మాకియవెల్లీ రాజనీతి సిద్ధాంతాన్ని ప్రభావితం చేసిన సమకాలీన ముఖ్యాంశాలను సంక్షిప్తంగా ఈ క్రింది చెప్పవచ్చును.

1. మాకియవెల్లీ కాలంనాటి ఇటలీ నేపుల్సు, రోమ్, మిలాన్, వెన్నీస్, ఫ్లోరెన్సు అనే ఐదు రాజ్యాలుగా విభజింపబడింది. అంతర్గతంగా రాజకీయాధికారం గురించి పెనుగులాట వలన, బాహ్యంగా వాటి మధ్య ఉన్న విపరీతమైన పోటీవలన ఈ ఐదు రాజ్యాలు బలహీనపడ్డాయి. దీనికితోడు ఫ్రాన్సు, జర్మనీ, స్పెయిన్ వంటి ఇరుగుపొరుగు బలమైన రాజ్యాల జోక్యం ఇటలీ రాజ్యాల వ్యవహారాలలో ఎక్కువ అయింది. ఇటలీ ప్రజలలో అవినీతి ప్రబలింది. ఈ పరిస్థితులను చక్కదిద్ది సమైక్య ఇటలీ సాధనకు ఒక బలమైన కేంద్ర ప్రభుత్వం అవసరమని మాకియవెల్లీ తన రచనలలో నిర్ద్వందంగా చెప్పాడు.

2. మాకియవెల్లీ జన్మించిన ఫ్లోరెన్సులో నూతన పునరుజ్జీవన ఉద్యమం ప్రారంభమై ఐరోపా దేశాలకు విస్తరించింది. ఈ ఉద్యమం వల్ల మానవతావాదం, శాస్త్రీయ దృక్పధం ప్రజలలో ఏర్పడ్డాయి.

3. ఈ కాలంలో మధ్యయుగం నాటి ప్రాతినిధ్య సంస్థలు సంపూర్ణంగా అంతరించిపోయాయి. వాటిస్థానంలో బలమైన లౌకిక రాచరిక ప్రభుత్వాలు ఐరోపాలో ఏర్పడ్డాయి.

ఈ కారణాలు వల్ల మధ్యయుగం అంతరించింది. దానిస్థానంలో నూతన ప్రపంచం ఏర్పడింది. పైన పేర్కొన్న రాజకీయ, వైజ్ఞానిక రంగాలలో వచ్చిన సంచలనాత్మకమైన మార్పులు వల్ల రాజనీతి సిద్ధాంతంలో కూడా కొత్త భావాలు చోటుచేసుకున్నాయి. ఈ నూతన రాజనీతి సిద్ధాంతం మాకియవెల్లీ రచనలలో సుస్పష్టంగా కనబడుతుంది. అంతేకాకుండా మాకియవెల్లీ యొక్క వ్యక్తిగత అనుభవాలు, తన కాలం నాటి రాజకీయవేత్తలలో దిగజారిపోతున్న అవినీతిపై తొలగిన భ్రమలు కూడా అతని రాజనీతి సిద్ధాంతాన్ని ప్రభావితం చేశాయి.

## 5.4 మానవ స్వభావం :

మానవ స్వభావం ఆధారంగా రాజ్యం ఏర్పడుతుందని మాకియవెల్లి అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. రాజ్యానికి మానవ స్వభావానికి మధ్యగల పరస్పర సంబంధాన్ని అతను పూర్తిగా గ్రహించాడు. ప్రభుత్వాల వర్గీకరణకు, ప్రభుత్వ సిద్ధాంతానికి మానవ స్వభావం ముఖ్యకారణమని అతనున చెప్పాడు. కాబట్టి "ది ప్రిన్స్" అనే గ్రంథంలో అతను మానవ స్వభావాన్ని విశ్లేషించాడు.

మాకియవెల్లికి మానవ స్వభావంపై సదభిప్రాయం లేదు. మనిషి దుర్మార్గుడు, స్వార్థపరుడు, అహంకారి. మానవుడు పిరికివాడు, కృతఘ్నుడు, అత్యాశాపరుడు, నిరంతరం ఆస్థి కొరకు, స్వేచ్ఛాకొరకు, కుతూహలపడతాడు. అవసరం కొద్ది మాత్రమే మానవుడు మంచితనాన్ని ప్రదర్శిస్తాడు. మానవులకు నీతి, నిజాయితీ ధర్మబుద్ధి వుండవు. కాబట్టి సమాజానికి హాని చేయటానికి కూడా వెనుకాడరు. మానవులు చంచల స్వభావులు, మోసగాళ్ళు.

పైన వివరించిన మానవ స్వభావాన్నిబట్టి రాజ్యాన్ని గురించి, పాలకులు పాటించవలసిన రాజనీతిని గురించి, మాకియవెల్లి వివరించాడు. మానవుడు అమాయకుడు, బయటకు కనిపించే మంచిని చూసి భ్రమతో మోసపోతాడు. మానవులు మందబుద్ధి గలవారు కాబట్టి అటువంటివారు తెలివిగల ఉన్నతాధాకారాలు గల పాలకుని పాలనలో లేనట్లైతే వారు హేతు విరుద్ధంగా ప్రవర్తించి సమాజానికి ప్రమాదాలు తెచ్చిపెడతారని మాకియవెల్లి భావించాడు. రిపబ్లిక్ ప్రభుత్వవిధానంలో యోగ్యులైన, సమర్థులైన వ్యక్తులను ప్రజలు గౌరవించరు. కాబట్టి ప్రజలను చక్కదిద్దే అవకాశం అటువంటి వ్యక్తులకు ఉండదు.

మానవుడు పిరికివాడు, కృతఘ్నుడు కాబట్టి, అటువంటి ప్రజలను పాలకుడు కఠినశిక్షలు విధించి, భయభ్రాంతులను చేసి పరిపాలించడం మంచిది. దుష్టులైన మానవులను వంచనతో రాజు పాలించాలని మాకియవెల్లి చెప్పాడు. కాబట్టి పౌరుల ఆస్తిని పాలకుడు కాజేయకూడదని మాకియవెల్లీ చెప్పాడు. ఆస్తి సంపాదనలో మానవుల మధ్య సంఘర్షణలు తగాదాలు ఏర్పడతాయి.

మానవులు స్వేచ్ఛగా జీవించాలని కోరుకుంటారు. ఇతరులు ఆధీనంలో ఉండడానికి ఇష్టపడరు. ఎవరైనా ఇతరులను తన ఆధీనంలో ఉంచడానికి ప్రయత్నిస్తే ఇది కూడా సంఘర్షణలకు దారితీస్తుంది. ఈ కారణం వల్లనే రాజ్యాల మధ్య సంఘర్షణలు యుద్ధాలు సంభవిస్తాయని మాకియవెల్లి చెప్పాడు.

అత్యాస గల మానవుని కోర్కెలు అనంతమైనవి. అసంతుష్టమైనవి. మనిషి ఆశించినదంతా సంపాదించలేడు గనుక అతనిలో అసంతృప్తి కలుగుతుంది. ఈ కారణంగా గతించిన కాలం మంచిదని, ప్రస్తుతకాలం చెడ్డదని అతను భావిస్తాడు. భవిష్యత్తుపై ఆశలు పెంచుకుంటాడు. ఇటువంటి ఆలోచనలకు ఏ కారణం కనిపించదు.

మానవునిలో స్వాభావికంగా ఉన్న అధికారకాంక్ష, కీర్తి ప్రతిష్టలు సంపాదించాలనే కోరిక, ఇతరుల పై ఆధిక్యాన్ని సంపాదించి, వారిపై ఆధిపత్యాన్ని చెలాయించాలనే ఉత్సుకతా రాజ్యస్థాపనకి దారితీసాయని మాకియవెల్లి చెప్పాడు. కాని ఇటువంటి మానవ స్వభావాన్ని శిష్టులకు మాత్రమే మాకియవెల్లి పరిమితం చేశాడు. సామాన్య ప్రజల శక్తిసామర్థ్యాలకు మాకియవెల్లి తక్కువ చేశాడని పై వాక్యం అర్థంకాదు.

## 5.5 మతం - నీతిపై మాకియవెల్లి భావాలు :

మతం, నీతిపై మాకియవెల్లి వెలుబుచ్చిన భావాలు మధ్యయుగం నాటి రాజనీతి తత్వవేత్తలు వెలుబుచ్చిన భావాల కంటే విభిన్నమైనవి. ఉదాహరణకు థామస్ అక్వినాస్ మతానికి, రాజనీతికి పరస్పర సంబంధముగలదని వాదించాడు. దీనికి విభిన్నంగా రాజనీతిని, మతం, నీతి నుండి మాకియవెల్లీ వేరుచేశాడు. ఈ విధంగా రాజనీతికి స్వతంత్ర ప్రతిపత్తిని అతను సమకూర్చాడు.

మాకియవెల్లి క్రైస్తవ చర్చి వ్యవస్థకి, క్రైస్తవ మతాధికారులకు వ్యతిరేకి. అతను మతానికి వ్యతిరేకికాడు. నైతికంగా ప్రజలను ఉత్తేజపరచడంలోను, ఇటలీని సమైక్య పరచటంలోను చర్చి, మతాధికారులు విఫలమయ్యారని మాకియవెల్లి విమర్శించాడు. క్రైస్తవ మతాచార్యులు ఆధ్యాత్మిక చింతనను విస్మరించి, అధికారదాహం, ధనకాంక్ష మొదలగు వాటికి ప్రాముఖ్యతనిచ్చి ఇటలీ సమైక్యతకు అవరోధాన్ని కల్పించారని చెప్పాడు. క్రైస్తవ మతం బోధించిన అణకువ, విధేయత, ప్రాపంచిక విషయాలపై ఏహ్యాభావం మొదలగు గుణాలు మనుషులను బలహీనపరచి, వారిని దుర్మార్గుల చేతిలో బలపోయేటట్లు చేస్తాయి. కాబట్టి ఇటువంటి గుణాలను మాకియవెల్లి తిరస్కరించాడు. అతను మతవ్యతిరేకికాడు. చర్చి సమైక్య ఇటలీని సాధించి పాలించినట్లైతే మంచిదే అని అతను భావించాడు.

మాకియవెల్లి మతాన్ని ఆచరణాత్మకమైన రాజకీయ దృష్టితో చూశాడు. మతం ఒక సామాజిక శక్తి. కాబట్టి మతాన్ని రాజ్య సమైక్యసాధనకి ఉపయోగపడే ఒక రాజకీయ సాధనంగా పాలకుడు ఉపయోగించాలని మాకియవెల్లి భావించాడు. అధికారాన్ని హస్తగతం చేసుకొని, దాన్ని నిలబెట్టుకొనడానికి పాలకుడు మతాన్ని ఉపయోగించుకోవాలని మాకియవెల్లి భావించాడు. పాలకుడు ప్రజలలో మతవిశ్వాసాలను కలిగించడానికి అన్ని విధాల ప్రయత్నించాలి. రాజుకు మతంపై వ్యక్తిగతంగా నమ్మకం లేకపోయినా, మతంలో విశ్వాసం ఉన్నట్లు అతను నటించాలని చెప్పాడు. పాలకుడు అన్ని మత కార్యకలాపాలలో పాల్గొనాలి. దీనివల్ల అతనిని ప్రజలు పవిత్రుడుగా భావిస్తారు. రాజ్యప్రయోజనాలను సాధించడానికి ప్రజల విధేయతను పొందడానికి మతాన్ని రాజు ఉపయోగించుకోవాలని మాకియవెల్లి సలహాయిచ్చాడు. మతం అధికారానికి లోబడి ఉండాలని, చర్చి రాజ్యానికి ఒక అంగం మాత్రమేని అతను భావించాడు. చర్చిపై రాజ్యానికి ఆధిపత్యం ఉందని చెప్పాడు.

పై చర్చననుసరించి మాకియవెల్లి మతాన్ని ద్వేషించాడని గాని, వ్యతిరేకించాడనిగాని భావించరాదు. నిజజీవితంలో ఈతను ఆస్తికుడేకాని, నాస్తికుడు కాడు. మతం మానవుని సామాజిక జీవితానికి, రాజ్యసుస్థిరతకు, సౌభాగ్యానికి అవసరమని అతను చెప్పాడు. మతం వ్యక్తిలో సత్ప్రవర్తనను కలిగిస్తుంది. అటువంటి ప్రవర్తన సమాజ శ్రేయస్సును మంచిదని అతను ఉద్ఘాటించాడు.

రాజనీతిని, నీతి నుండి వేరుపరచిన తొలి రాజనీతి తత్వవేత్త మాకియవెల్లి. రాజనీతికి, నైతిక విలువలను సంబంధంలేదని చెప్పాడు. నైతిక విలువల పట్ల మాకియవెల్లీ ద్వివిధ ప్రమాణాలను సమర్థించాడు. రాజు పాటించవలసిన నైతిక విలువులు ప్రజలకు వర్తించాలని అతను చెప్పాడు. ఈ రెండు రకాల నైతిక విలవల మధ్య తేడాలను మాకియవెల్లి వివరించాడు.

అధికారాన్ని చేజిక్కించుకొని, సుసంఘటితపరచి, విస్తరింపచేసిన పాలకుడే సమర్థవంతుడనిమాకియవెల్లి భావించాడు. రాజ్యరక్షణకు, సుస్థిరతకు, ప్రజల సంక్షేమాన్ని పెంపొందించటానికి తీసుకొన్న చర్యలు ఎటువంటివి

అయినా సమర్థనీయమే అని అతడు భావించాడు. రాజ్యస్వప్రయోజనాలను కాపాడటానికి పాలకుడు అవినీతి మార్గాలనైనా అనుసరించవచ్చును. విజయాన్ని సాధించటానికి అవినీతిమార్గాలు, దుర్మార్గ పద్ధతులను కూడా రాజు ఉపయోగించటం సమర్థనీయమే. లక్ష్యాలు మంచివి అయినప్పుడు ఎటువంటి సాధనాలనైనా ఉపయోగించవచ్చు. నైతిక విలువల కంటే రాజ్య భద్రత ముఖ్యం. ఈ సందర్భంలో ఆచార్య అలెన్ ఈవిధంగా వ్యాఖ్యానించాడు. "తన అధికారం, రాజ్యభద్రత ప్రమాదస్థితిలో ఉన్నప్పుడు పాలకుడు ఆలోచించవలసింది ఏదినీతి, ఏది అవినీతి అనికాదు, ఏది న్యాయం, ఏది అన్యాయం అని కాదు, ఏది చట్టబద్ధమైనది, ఏది చట్టవిరుద్ధమైనది అనికాదు. ఏ మార్గాన్ని అనుసరించడం ద్వారా తన ఉనికిని, రాజ్యభద్రతను కాపాడుకొనటం సాధ్యమవుతుందో ఆలోచించి, ఆ మార్గాన్ని అనుసరించాలి".

అన్ని సమయాలలో నైతిక విలువలకు, మతపరమైన విలువలకు కట్టుబడి పాలకుడు ఉండనక్కరలేదు. అటువంటి విలువలను పాటించటం వల్ల రాజ్య సుస్థిరతను ప్రజాశ్రేయస్సుకు హాని కలుగుతుందని భావించినట్లైతే వాటిని పాటించనవసరం లేదు. రాజ్యంలో నెలకొనివున్న క్లిష్ట పరిస్థితుల దృష్ట్యా రాజ్యసుస్థిరతను నెలకొల్పడానికి అవసరమగు చర్యలు పాలకుడు తీసుకొనవలెనని మాకియవెల్లి చెప్పాడు. లక్ష్యాలు మంచివి అయినప్పుడు వాటి సాధనకు ఉపయోగించే మార్గాలు ఎటువంటివి అయినా సమర్థనీయమేనని మాకియవెల్లి భావించాడు. కాని బహిరంగంగా రాజు ప్రజల దృష్టిలో విలువైన నైతిక విలువులను పాటస్తున్నట్లు, వాటిని గౌరవిస్తున్నట్లు ప్రవర్తించాలి.

రాజనీతి, పౌరనీతి వేర్వేరని ద్వివిధ నీతిసూత్రాలను మాకియవెల్లి ప్రభోదించాడు. ఉదాహరణకు ఒకవ్యక్తి ఇంకొక వ్యక్తిని హత్యచేస్తే అది నేరమవుతుంది. రాజ్యంలో శాంతిభద్రతల దృష్ట్యా పాలకుడు అటువంటి నేరస్థులకు మరణశిక్ష విధించవచ్చు. ఈ చర్య నైతికమైనదే. వ్యక్తి అసత్యమాడటం అపరాధమవుతుంది. కాని పాలకుడు రాజకీయ ప్రయోజనాల కొరకు కొన్ని సందర్భాలలో అసత్యం పలుకవచ్చు. వ్యక్తి స్వప్రయోజనాల కొరకు పాటుపడితే, రాజ్యం సమాజశ్రేయస్సు కొరకు పాటుపడుతుంది. ఈ విధంగా పౌరనీతికి, రాజ్యనీతికి మద్యభేదాన్ని మాకియవెల్లి వివరించాడు.

మతం, నీతి పట్ల మాకియవెల్లి వెలిబుచ్చిన భావాలు వివాదస్పదంగా మారాయి. ఇతను దుష్కర్మలను ప్రబోధించాడని స్ట్రాస్ (Strauss) చెప్పాడు. మాకియవెల్లి నీతినిగాని, అవినీతిగాని ప్రబోదించలేదని సౌబిన్ చెప్పాడు. రాజనీతి విజయానికి కావలసిన సూత్రాలను మాత్రమే మాకియవెల్లి వల్లించాడని పోకాక్ (Pocock) అభిప్రాయపడ్డాడు. మతం నుండి రాజనీతిని వేరుచేసి లౌకికతత్వాన్ని ప్రబోదించిన మొదటి రాజనీతి తత్వవేత్త మాకియవెల్లి. ఈ భావనే లౌకికరాజ్య స్థాపనకు పునాది. మతపరమైన, నైతిక విలువలపరమైన మధ్యయుగపు రాజనీతిని మాకియవెల్లి తిరస్కరించాడు. రాజనీతికి ఒక స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించడానికి మాకియవెల్లి చేసే ప్రయత్నంలో అతను నైతిక విలువలను తిరస్కరించడం సుస్పష్టంగా విధితమౌతుంది.

## 5.6 రాజ్యం :

"ది ప్రిన్స్" అనే గ్రంధంలో మాకియవెల్లి విశ్లేషించిన ముఖ్యాంశాలలో రాజ్యం, రాజ్య నిర్వాహణ ప్రధానమైనవి. ఈ రెండు అంశాలపై అతను ఎక్కువ దృష్టిని సారించాడు. మానవుని స్వభావరీత్యా రాజ్యం ఏర్పడిందని మాకియవెల్లి చెప్పాడు. దురాశపరులు, దుర్మార్గులు, సంఘ వ్యతిరేకులైన మానవులు అరాచక పరిస్థితులను సృష్టిస్తారు. అటువంటి పరిస్థితులను సృష్టిస్తారు. అటువంటి పరిస్థితులను నివారించి ప్రజల ప్రాణాలను, ఆస్థులను కాపాడటానికి ప్రభుత్వం అవసరమని మాకియవెల్లి భావించాడు. కాబట్టి మానవులు వారి ప్రాణాలను, ఆస్థులను కాపాడుకోవాలనే స్వార్థబుద్ధే రాజ్యం ఏర్పడడానికి కారణమని అతను చెప్పాడు.

ప్రాచీనగ్రీకు తత్వవేత్తలు చెప్పినట్లు, మాకియవెల్లి రాజ్యసిద్ధాంతాన్ని చెప్పలేదు. తనకాలంనాటి వాస్తవ రాజ్యాలను, రాజకీయాలను పరిశీలించిన పిమ్మట మాకియవెల్లి రాజ్యలక్షణాలను విశ్లేషించాడు. వ్యవస్థీకృతమైన శక్తి (Organized Power) రాజ్యమని మాకియవెల్లి నిర్వచించాడు. రాజ్యాన్ని ప్రభుత్వంతోను, రాజ్యాధిపతితోను గుర్తించాడు.

రాజ్యం స్వయం సమృద్ధిగల వ్యవస్థగా వుండాలని భావించాడు. అటువంటి రాజ్యానికి సుసంఘటితమైన కేంద్రప్రభుత్వం, బలమైన పౌరసైన్యం, పౌరులలో ఏకత్వభావన, స్థిరమైన స్వతంత్ర ఆర్థిక వ్యవస్థ వుండాలి. మంచి సాయుధబలం వుంటే, మంచి శాసనాలు ఉంటాయని మాకియవెల్లి చెప్పాడు. పౌరసైన్యం, మంచి శాసనాలు మతం రాజ్యానికి సహాయ వ్యవస్థలుగా ఉపయోగపడతాయి.

ప్రతి రాజ్యానికి ఇరుగుపొరుగు రాజ్యాలతో సంఘర్షణ తప్పదు. కాబట్టి వాటిని శత్రురాజ్యాలుగా పరిగణించాలి. ప్రతి రాజ్యం అధికారాన్ని, దాని భూభాగాన్ని విస్తరింపచేయడానికి ప్రయత్నిస్తుంది. ఈ ప్రయత్నంలో రాజ్యవిస్తరణ జరగొచ్చు. లేదా అంతరించిపోవచ్చని మాకియవెల్లి చెప్పాడు. ఇటువంటి దానికి ప్రాబల్యరాజకీయాలలో రాజ్యం విజయం సాధించాలంటే దానికి బలమైన పౌరసైన్యం అవసరం. రాజు కిరాయి సైన్యం మీద ఆధారపడకూడదు.

మాకియవెల్లి రాజ్యలక్షణాలను ఈక్రింది విధంగా వివరించాడు.

1. ఒకేభాష, ఒకే ఆచార సాంప్రదాయాలు, ఒకే మతం గల రాజ్యం ఎక్కువ సుస్థిరమైన, శక్తివంతమైన రాజ్యము. రాజ్యం యొక్క బలం, శక్తి ఈ అంశాలు మీదే ఆధారపడివుంటాయి.

2. మాకియవెల్లి చెప్పిన రాజ్యం లౌకిక రాజ్యం. దానికి చర్చితోగాని, భగవంతునితోగాని ఎటువంటి సంబంధము లేదు. ఇది మతానికి అతీతమైన రాజ్యం.

3. రాజ్యం ఒక స్వతంత్రవ్యవస్థ. దానికి ఒక ప్రత్యేకత వుంది.

4. ప్రతిరాజ్యం ఎక్కువ అధికార సంపాదనకు, రాజ్యవిస్తరణకు కృషిచేయాలి. ఎందుకంటే రాజ్యభద్రత, విస్తరణ దాని అధికారం మీద ఆధారపడి వుంటాయి. ఎక్కువ భద్రత కల్పించిన ప్రభుత్వం ఎక్కువ ప్రజాదరణ పొందుతుంది.

5. పౌరులు దేశభక్తి కలిగివుండాలి. అటువంటి పౌరులు చూపిన ఉత్సాహం మీద సైనికబలం ఆధారపడి వుంటుంది. సైనికుల బలంపై రాజ్యబలం ఆధారపడి వుంటుంది.

6. రాజ్యపాలనలో పౌరుల భాగస్వాములుగా ఉన్నట్లైతే ఆ రాజ్యాన్ని ఉత్తమ రాజ్యంగా పరిగణించవచ్చు. ఇటువంటి రాజ్యం పౌరులలో ఉత్సాహాన్ని పెంపొందిస్తుంది.

వంశపారంపర్య రాజరికం, భూస్వాములు, సుస్థాపిత చర్చి, మతాధికారులు, కిరాయి సైనికులు మొదలగు సాంప్రదాయ సంస్థలు మంచి సుస్థిర, సామాజిక, రాజకీయ వ్యవస్థకు శత్రువులుగా భావించాడు. ఈ కారణంగా మాకియవెల్లీ వాటిని వ్యతిరేకించాడు. రాజ్యాన్ని బలహీనపరచే శక్తులను పాలకుడు నిర్దాక్షిణ్యంగా అణిచివేయాలని మాకియవెల్లీ చెప్పాడు.

మాకియవెల్లి చెప్పిన రాజ్యభావన అరిస్టాటిల్ చెప్పిన రాజ్యభావన కంటే సంకుచితమైనది. వ్యక్తికి ఉత్తమ జీవితాన్ని కలుగచేయడమే రాజ్యం యొక్క లక్ష్యమని అరిస్టాటిల్ చెప్పాడు. రాజ్యం యొక్క లక్ష్యం ప్రదానంగా భౌతిక పరమైనదని మాకియవెల్లి చెప్పాడు. పౌరులకు ప్రాణరక్షణ, ఆస్థిరక్షణ కల్పించడమే రాజ్యం యొక్క ముఖ్యలక్షమని మాకియవెల్లి చెప్పాడు.

మాకియవెల్లి చెప్పిన రాజ్య విశ్లేషణను పరిశీలిస్తే ఆధునిక లౌకిక జాతి రాజ్యభావన మాకియవెల్లి ఆలోచనాసరళిలో కనిపిస్తుంది. చిన్న చిన్న రాజ్యాలుగా విభజింపబడి, అంతహకలహాలు, అనైక్యతతో బలహీనపడిన సమకాలీన ఇటలీని ఒక శక్తివంతమైన లౌకికరాజ్యంగా అభివృద్ధి చేయాలనే ఆకాంక్ష దేశభక్తుడైన మాకియవెల్లిలో కనిపిస్తుంది.

## 5.7 రాజ్య నిర్వహణ :

ఆధునిక రాజనీతి తంత్రానికి మూలపురుషుడు మాకియవెల్లి అని చెప్పవచ్చు. అతను రచించిన "ది ప్రిన్స్" అనే గ్రంథం వాస్తవిక రాజకీయానికి సంబంధించినది. విజయపథంలో రాజ్యపాలన చేయాలనే కాంక్ష గల రాజు / పాలకుడు పాటించవలసిన సలహాలను మాకియవెల్లి ఈ గ్రంథంలో సూచించాడు. మాకియవెల్లీ నిర్వహించిన దౌత్యకార్యకలాపాలు, ఉత్తర ప్రత్యుత్తరాలు, చారిత్రిక అనుభవాలు నేర్పిన పాఠాలు, ప్రాచీనుల బుద్ధిబలం, గొప్పవారు సాధించిన ఘనకార్యాలు మొదలగు ఆధారంగా మాకియవెల్లి రాజనీతి తంత్రానికి సంబంధించిన నియమావళిని తయారుచేశాడు. రాజ్యకలాపాలను దక్షతతో నిర్వహించాలనుకొన్న రాజు ఈక్రింది సలహాలను తప్పనిసరిగా పాటించాలి. పాటించనివారు నాశనం అవుతారని మాకియవెల్లి చెప్పాడు.

రాజ్యపాలకులు సమాజాభివృద్ధికి, ఆర్థిక శ్రేయస్సుకు కృషి చేయాలి. వీటికి సంబంధించిన కార్యక్రమాలలోను, రాజ్య నిర్వహణలోను రాజు పాటించవలసిన నియమావళిని మాకియవెల్లి ఈక్రింది విధంగా వివరించడు.

1. రాజు ప్రజల పట్ల అధిక దయాదాక్షిణ్యాలతో గాని, అధిక కఠినంగా ఉండరాదు. పాలకుని ప్రవర్తనమితంగా వుండటం మంచిది. పరిస్థితులననుసరించి దయతోగాని, కాఠిన్నంతో గాని పాలకుడు ప్రవర్తించాలి. ప్రవర్తన పరిస్థితులకు అణుగుణ్యంగా వుండాలి.

2. రాజు సైనిక బలం కలిగివుండాలి. అవసరమైనప్పుడు తన బలాన్ని ప్రదర్శించి నిరూపించాలి. అన్ని సమయాలలో తన ఆధిక్యతను నిలుపుకోవాలి.

3. బాధ్యతతో, సమర్థవంతంగా పరిపాలించి రాజ్య ఉనికిని, సుస్థిరతను కాపాడాలి.

4. రాజుపట్ల ప్రజలు భయంతోకాక, భక్తిపూర్వక భయంతో మెలిగేటట్లు చూడాలి.

5. ప్రజలలో సాంప్రదాయక నైతిక ప్రమాణాలు, భావాలను పెంపొందించాలి. ఈ లక్ష్యసాధనకు మతాన్ని పోత్సహించాలి.

6. రాజు ప్రజల ఆస్థులను కాజేయకూడదు. వారి స్త్రీలను చెరచరాదు. ఒక వ్యక్తి తన తండ్రి మరణాన్ని అతి త్వరగా మరచిపోగలడేమోగాని, తన తండ్రి సంపాదించిన ఆస్తిని ఎవరైనా కాజేస్తే మాత్రం సహించలేడు, మర్చిపోలేడు. ఈ రెండు విషయాలలో ప్రజల భావాలు సున్నితంగా వుంటాయి. కాబట్టి రాజు ప్రజల ఆస్థులను, స్త్రీలను తాకరాదు. పౌరుల ఆస్తులను, స్త్రీలను పాలకుడు పవిత్రంగా భావించాలి.

7. రాజు ప్రభుత్వ ఉద్యోగస్తులను, సలహాదారులను జాగ్రత్తగా ఎంపిక చేయాలి. ప్రభు భక్తి లేనివారిని నిర్ధాక్షణ్యంగా అణచివేసి తొలగించాలి. రాజు ప్రతివాని సలహా పాటించకూడదు. కొద్దిమంది మేధావంతులను మాత్రమే సలహాదారులుగా నియమించాలి.

8. నియంతృత్వ ప్రభుత్వాన్ని నెలకొల్పటం ద్వారా ప్రజలలో సమైక్యతను సాధించాలి. రాజ్య నిర్వహణలో స్థిరత్వం, దృఢత్వం, నిరంకుశత్వం ముఖ్యమని రాజు తెలుసుకోవాలి.

9. రాజు నిరంతరం రాజ్యవిస్తరణకు కృషిచేయాలి. ఇరుగుపొరుగు రాజ్యాలను శత్రురాజ్యాలుగా పరిగణించాలి. శత్రురాజులు అప్రమత్తులై ఉన్న సమయాన యుద్ధాన్ని ప్రకటించి దండెత్తి ఓడించాలి. రెండు ఇరుగుపొరుగు రాజ్యాలు యుద్ధం చేసినప్పుడు రాజు తటస్థ విధానాన్ని అనుసరించరాదు. ప్రాబల్య సమతౌల్యం సూత్రాన్ని అనుసరించి బలహీన రాజ్యం పక్క యుద్ధం చేయడం మంచిది. ఇటువంటి యుద్ధంలో గెలిచినట్లైతే పరిమిత లాభాలు చేకూరుతాయి. ఓడినట్లైతే నష్టాలు ఉభయులకు అతి తక్కువగా వుంటాయని మాకియవెల్లి చెప్పాడు.

10. రాజ్య విస్తరణలో బల ప్రయోగంగాని లేదా న్యాయసమ్మతమైన శాసనాలు గాని చాలావరకు ఉపయోగపడతాయి. రాజు సమయానుకూలంగా నక్కవలె జిత్తుల మారిగానూ, సింహంవలె పరాక్రమశాలిగానూ వుండాలి. శత్రురాజులతో పోరాడినపుడు సింహంవలే విజృంభించి రాజు శత్రువులను ఓడించాలి. నక్కవలే చతురుతతో తనపై పన్నిన కుట్రలను గుర్తించి రాజు శత్రువుల వల నుండి రక్షించుకోవాలి.

11. రాజు సుశిక్షితులైన పౌరసైన్యాన్ని అభివృద్ధి చేయాలి. ఇటువంటి సైన్యం దేశభక్తి, ప్రభుభక్తి కలిగిరాజ్యరక్షణకు వీరోచితంగా పోరాడటానికి వెనుకాడదు. పాలకుడు కిరాయి సైన్యం మీద ఆధారపడరాదు. కిరాయి సైనికులు క్లిష్ట సమయంలో మోసం చేయడానికి వెనుకాడరు.

12. అధికార దుర్వినియోగం వల్ల సంభవించిన చట్టవిరుద్ధమైన హింసను నివారించడానికి చట్టబద్ధమైన పరిష్కారాలు ఉండక తప్పదు.

13. రాజు ప్రజలకు చేసిన వాగ్దానాలను వీలైనంతవరకు పాటించాలి. కాని కొన్ని క్లిష్ట సమయాలలో ఆ వాగ్దానాలను పాటించడం వల్ల రాజ్య భద్రతకు హానికరమైతే వాటిని నిటబెట్టుకోవసరం లేదని మాకియవెల్లి భావించాడు.

14. విజయసాధనకు అవసరాన్ని బట్టి, ఊసరవెల్లి రంగులు మార్చినట్లు, రాజు కూడా రంగులు మార్చవచ్చు. అవినీతి యుగంలో గొప్పదనాన్ని సాధించాలంటే రాజు అవినీతికరమైన, మార్గాలను అనుసరించడం తప్పుకాదని మాకియవెల్లి సలహాయిచ్చాడు. మోసాన్ని మోసముతో జయించాలని మాకియవెల్లి సూచించాడు.

15. రాజు న్యాయసమ్మతమైన శాసనాల సహాయంతోగాని లేదా బలప్రయోగం ద్వారాగాని రాజ్యవిస్తరణను చేయవచ్చు. నాగరికత, సభ్యత గల మనుషులతో మొదటి పద్ధతిలో యుద్ధం చేయవచ్చు. అనాగరికులైన, క్రూరులైన మనుషులతో యుద్ధం చేయడం రెండవపద్ధతిగా ఉపయోగపడుతుందని మాకియవెల్లి సలహా యిచ్చాడు. ఈ రెండు, రెండు రకాల యుద్ధవిధానాలను చెపుతున్నాయి. అవసరమైనప్పుడు ఈ రెండింటిని మిళితం చేసినట్లైతే పటిష్టమైన ఫలితాలను సాధించవచ్చునని మాకియవెల్లీ భావించాడు. కాని మనుషులు అవమర్యాదకరమైన తుఛ్ఛులు కాబట్టి, బలప్రయోగమే మంచిది.

16. రాజు రాజ్యపాలనలో తన వాస్తవిక స్వరూపాన్ని బయటపెట్టకూడదు. నిజానికి పాలకునకు సదుణాలుండనవసరం లేదు. అటువంటి గుణాలున్నట్లు తన చతురత, నేర్పరితనం ద్వారా ప్రజలను నమ్మించి మోసంతో రాజకీయ కార్యకలాపాలను నిర్వహించాలి. ఈ విధమైన పరిపాలన చాలా లాభదాయకం.

17. రాజు ఎల్లప్పుడు రాజ్యశ్రేయస్సును కోరాలి. రాజ్యశ్రేయస్సు, ప్రజా సంక్షేమము దృష్ట్యా మంచి, చెడు సాధనాలనేలైనా ఉపయోగించవచ్చు. నీతి, అవినీతి అంశాల మధ్య విచక్షణ చూపరాదు.

## 5.8 రాజ్య విస్తరణ :

రాజుకు రాజ్యవిస్తరణ సహజలక్షణం. అతను నిరంతరం రాజ్యవిస్తరణ కృషిచేయాలి. రాచరిక ప్రభుత్వాలు, రిపబ్లిక్ ప్రభుత్వాలు రెండింటకి ఇది ప్రధాన లక్షణం. రాజ్యవిస్తరణ ప్రయత్నంలో విస్తరణ జరగవచ్చు లేదా రాజ్యం

అంతరించిపోవచ్చునని మాకియవెల్లి చెప్పాడు. యుద్ధంలో గెలిచినరాజు ఓడిపోయిన రాజు కుటుంబాన్ని సంపూర్ణంగా నిర్మూలించాలి. శత్రుశేషాన్ని ఉంచరాదు. రాజును వ్యతిరేకించిన వారిని హత్య చేయించాలి. ఎందుకంటే వారు జీవించినట్లైతే రాజుపై ప్రతీకారం తీర్చుకుంటారు. ఆక్రమించన భూభాగాలలో నివాసమేర్పరచుకొని నియంత్రణ చేయటం మంచిది. ఇది సాధ్యంకాని పక్షంలో రాజు తన అనుయాయులకు లేదా శ్రేయోభిలాషులకు ఆ ప్రాంతంలోని కీలకస్థానాలలో వలసలు ఏర్పాటు చేయాలి. రాజ్యవిస్తరణలో తనకు ఆటంకమైన శక్తులను తొలగించడంలో సూక్ష్మబుద్ధితో వ్యవహరించాలి. జయించిన ప్రాంతాల ప్రజల స్వేచ్ఛను పూర్తిగా అపహరించాలి. అధిక పన్నులు వేసి ప్రజలను పీడించి హింసించరాదు. రాజు తన కోశాగారాన్ని ఎల్లప్పుడు నింపివుంచాలి. శత్రురాజులు నుండి కొల్లగొట్టిన ధనాన్ని ఉదారంగా ఖర్చు పెట్టాలి. ప్రజలకు లాభాలను అప్పుడప్పుడు చేకూర్చాలి. గత చరిత్రలో మోజస్, సైరస్, రోములస్, అలగ్జాండర్, థీసస్ మొదలగువారు వారి సొంత సైన్యాలతో, సమర్థతతో ఘనకీర్తిని సాధించారు. రాజు అటువంటి వారిని రాజు అనుకరించవలెనని మాకియవెల్లి సలహా యిచ్చాడు. మాకియవెల్లి దృష్టిలో ప్రాచీన రోమన్ రిపబ్లిక్ ఆదర్శవంతమైన రాజ్యం.

కొత్తగా ఆక్రమించిన ప్రాంతాల ప్రజలు ఒకేభాష, ఒకే ఆచార సాంప్రదాయాలు కలిగి, ఎక్కువకాలం స్వేచ్ఛకు అలవాటుపడి ఉండనట్లైతే, అటువంటి ప్రాంతాలను పటిష్టవంతంగా నియంత్రణ చేయవచ్చని మాకియవెల్లి అభిప్రాయపడ్డాడు.

## 5.9 ప్రభుత్వాల వర్గీకరణ :

మాకియవెల్లి ప్రధానంగా రాజ్యంపై దృష్టిసారించాడు. అయనప్పటికి దాని ప్రధానాంగమైన ప్రభుత్వం యొక్క వివిధ రకాలను వర్గీకరించాడు. అరిస్టాటిల్ వర్గీకరించినట్లె ప్రభుత్వాలను మాకియవెల్లి ఆరు రకాలుగా వర్గీకరించాడు. వీటిలో రాజరికం, కులీనపాలన, రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యం - మూడు మంచి ప్రభుత్వాలు. నియంతృత్వం, అల్పజనపాలన, ప్రజాస్వామ్యం - ఈ మూడు చెడ్డవి. అతని దృష్టిలో రిపబ్లిక్ ప్రభుత్వం రాచరికం కంటే ఎక్కువ సుస్థిరత కలిగి వుంటుంది. సిసిరో, పాలిబియస్ చెప్పినట్లు మిశ్రమ ప్రభుత్వ విధానం సుస్థిరత కలిగి వుంటుందని చెప్పాడు.

## 5.10. శాసనకర్త పాత్ర :

మాకియవెల్లి రాజ్యంలో శాసనకర్త పాత్రకు అధిక ప్రాధాన్యతనిచ్చాడు. శాసనాలు పౌరులతో కర్తవ్యభావనను కలిగించి రాజ్యసుస్థిరతకు దోహదం చేస్తాయి. అవినీతి సమాజాన్ని సంస్కరించడానికి ఒక శాసనకర్త అవసరము. శాసనకర్త రాజ్యనిర్మాత. అతను సమాజ నిర్మాత కూడా. కొత్త శాసనాలు ద్వారా ప్రజల యొక్క స్వభావాలను, గుణాలను ప్రభుత్వాలను మార్చగలశక్తి అతనికి వుంటుంది. రాజ్యంలో కులీన వర్గాలు, సంపన్న వర్గాలు, బీదవర్గాలు మధ్య సమన్వయాన్ని శాసనకర్త సాధించగలడు.

## 5.11 రాజనీతి తత్వశాస్త్ర చరిత్రలో మాకియవెల్లి స్థానం :

రాజనీతి తత్వశాస్త్ర చరిత్రలో మాకియవెల్లి స్థానం గురించి భిన్నాభిప్రాయాలున్నాయి. క్రైస్తవమతానికి, నైతిక విలువలకు వ్యతిరేకమని, నాస్తికుడని, నియంతృత్వాన్ని బోధించాడని, అన్నిరకాల రాజకీయ నేరాలను సమర్థించాడని మాకియవెల్లిని విమర్శకులు విమర్శించారు.కాని అతని వ్యక్తిగత జీవితంలోమాకియవెల్లి పై విమర్శలు ఏవీ వర్తించవు.

మానవుని దృష్టస్వభావాన్ని మాత్రమే వర్ణించాడు. మానవుని యొక్క మతపరమైన మంచి స్వభావానికి ప్రాముఖ్యతనివ్వలేదు. ఆర్థిక అంశాలు మానవ స్వభావాన్ని ఏవిధంగా ప్రభావితం చేస్తాయో కూడా విశ్లేషించలేదు.

మాకియవెల్లి రాజనీతి సిద్ధాంతం స్థానిక ఇటలీ పరిస్థితులకే పరిమితమైందని, 16వ శతాబ్దం తరువాత రాజనీతితత్వంపై దాని ప్రభావం లేదని ఒక విమర్శవుంది.

పై విమర్శలున్నప్పటికీ, రాజనీతి తత్వ శాస్త్ర చరిత్రలో మాకియవెల్లికి ఒక ప్రత్యేక స్థానం వుంది. ఆధునిక రాజకీయాలపై అతని భావాల, సిద్ధాంతాల ప్రభావం చాలావరకు ఎక్కువని చెప్పవచ్చును. మాకియవెల్లి రాజనీతి తత్వవిచారణకు చేసిన సేవను సంక్షిప్తంగా ఈవిధంగా చెప్పవచ్చును.

1. మాకియవెల్లి ఒక క్రొత్త రాజనీతి శాస్త్రాన్ని అభివృద్ధిచేసి, ఆధునిక రాజనీతి సిద్ధాంతం యొక్క ముఖ్య అంశాలను గుర్తించాడు. ఆధునిక రాజనీతి పదజాలంతో రాజ్యానికి సరైన అర్థం చెప్పాడు. అధికార రాజకీయాలకు నాంది పలికిన ఘనత మాకియవెల్లికి దక్కింది. అధికారం కోసం సంఘర్షించే వ్యవస్థీకృతమైన శక్తే రాజ్యమని నిర్వచించాడు. అధికారం కోసం పెనుగులాటే రాజకీయాలన్నాడు. ప్రాబల్య రాజకీయాలను వివరించిన మొదటివాడు మాకియవెల్లి.

2. ఆధునిక రాజనీతి తత్వానికి మాకియవెల్లి పితామహుడు. అతడు వాస్తవిక రాజనీతి తాత్వికుడు. వాస్తవికవాదులలో ఆయన ప్రముఖుడు, ఉత్తముడు. ఎన్నో రాజకీయ విషయాలను పరిశీలించిన పిమ్మట ఆయన భావాలను రూపొందించి అభివృద్ధిచేశాడు. నైతికవిలువలతోగాని, ధార్మిక నియమాలతో గాని రాజనీతికి సంబంధం లేదని చెప్పాడు. రాజనీతిని మతం నుండి వేరుచేశాడు. మానవ స్వభావాన్ని ఆధారంగా చేసుకొని రాజనీతిని విశ్లేషించాడు.

3. రాజనీతి శాస్త్ర అధ్యయనానికి చారిత్రక పద్ధతిని అన్వయించటానికి ప్రయత్నించిన మొదటి ఆధునిక రాజనీతి శాస్త్రవేత్త మాకియవెల్లి. రాజ్యాన్ని అధ్యయనం చేయడానికి అనుభవాత్మక పద్ధతి ఆవశ్యకతను మాకియవెల్లి తెలియచేశాడు. చారిత్రక పద్ధతిని అనుసరించి వాస్తవిక రాజకీయాలకు గొప్ప సేవ చేశాడు.

4. జాతీయభావం, జాతి రాజ్య భావం మాకియవెల్లి రచనలలో తొలిసారి కనిపించాయి. మానవ చరిత్రలో ముఖ్యమైన అతిశక్తివంతమైన ఈ భావనలకు మాకియవెల్లి ప్రవక్త అయినాడు. ఆధునిక జాతి రాజ్యనిర్మాణంలో, జాతీయవాదం, జాతీయ భద్రత, ప్రాదేశిక సమగ్రత, సైనికవాదం మొదలగు ముఖ్యమైన శక్తులు రాజ్యప్రయోజనాలను కాపాడతాయని చెప్పాడు.

5. మతానికి రాజ్యానికి సంబంధంలేదని చెప్పిన మొదటి ఆధునిక రాజనీతితత్వవేత్త మాకియవెల్లి. లౌకికరాజ్య స్వభావాన్ని, ప్రవర్తనని శాస్త్రీయంగా పరిశీలించాడు. ఈ భావన ఆధునిక లౌకికరాజ్య ఆవిర్భావానికి పునాదులు వేసింది. లౌకికవాదియైన మాకియవెల్లి భావాలలో ఎటువంటి వైరుధ్యాలు కనిపించవు.

6. రాజకీయ జీవితంలో అవినీతి గురించి విస్తారంగా అధ్యయనం చేసిన మొదటివ్యక్తి మాకియవెల్లి. అతని ఉద్దేశ్యంలో రాజకీయ జీవితంలో విజయాన్ని సాధించడమే ముఖ్యమని చెప్పాడు. ఈ లక్ష్యసాధనకు నైతిక సూత్రాలకు స్థానంలేదని చెప్పాడు. ఈ భావన గాంధీగారు చెప్పిన భావనకు విరుద్ధమైనదని చెప్పవచ్చును. లక్ష్యాలు మంచివైనప్పుడు, వాటిని నెరవేర్చుకొనడానికి ఉపయోగించే సాధానాలు కూడా మంచివై వుండాలని చెప్పాడు. నైతిక విరుద్ధమైన అంశాలు రాజకీయంగా సరైనవికావని సి.జె. ఫాక్స్ మాకియవెల్లి ని విమర్శించాడు. అతను ఒక క్రమబద్ధమైన సిద్ధాంతాన్ని చెప్పలేదు అని కూడా విమర్శించిన వారు ఉన్నారు.

7. "జాతి", దేశభక్తి" భావనలకు అర్థవివరణ చెప్పి మాకియవెల్లి ఐరోపాలో ఒక విప్లవశక్తిగా తయారైనాడు.

8. మానవ స్వభావాన్ని చెడ్డగా చిత్రీకరించినప్పటికి, మానవుని అభివృద్ధి చేయడానికి మంచి సమాజం యొక్క ప్రాముఖ్యతనున మాకియవెల్లి తిరస్కరించలేదు.

9. మాకియవెల్లి రాజనీతి సిద్ధాంతాన్ని Narrowlly dated, narrowly local అని విమర్శించారు. కొంతమంది

దృష్టిలో మాకియవెల్లి రాజనీతితత్వం 16వ శతాబ్దం రాజనీతితత్వంపై ఎటువంటి ప్రభావం చూపలేదు. కాని ఇది నిజం కాదు. ఐదవచార్లెస్, ఫ్రాన్స్ రాజైన మూడవ హెన్రీ మొదలగువారిని మాకియవెల్లీ సిద్ధాంతం ప్రభావితం చేసింది. ఇతని రచనలలో చెప్పిన యుద్ధకళ, The art of War, పౌరసైన్యం కిరాయిసైన్యం కంటే మెరుగైనదన్న భావన మొదలగు విషయాలు ఆ కాలంలో చాలా మందికి తెలుసు. ఆ కాలంనాటి ఆధారాలనుబట్టి అతని సిద్ధాంతం 16వ శతాబ్దం నాటి రాజనీతితత్వవేత్తలపై చెప్పుకోదగ్గ ప్రభావాన్ని చూపలేదు. దీనికి రెండు కారణాలను చెప్పవచ్చును. ఆ కాలంనాటి వివాదస్పదమైన రెండు ముఖ్య విషయాలను అతని రచనలు ప్రస్తావించలేదు. అవి (1) రాజ్యానికి - చర్చికి మధ్యనున్న సంబంధాలు, (2) రాజ్యానికి - వ్యక్తికి మధ్యనున్న సంబంధాలు. అయినప్పటికి ఇతను చెప్పిన రాజ్యభావన ఆ కాలంలో చాలామందికి తెలుసు.

మరికొంతమంది దృష్టిలో మాకియవెల్లి సిద్ధాంతం ఆ కాలంనాటి ఇటలీ పరిస్థితులకే పరిమితమైంది. అతను ఏమి చెప్పినా తన కాలంనాటి పరిస్థితుల దృష్ట్యా చెప్పాడు. అతని కాలంనాటి ఇటలీ ఐదు చిన్నరాజ్యాలుగా విభజింపబడి పరస్పరంగా అంత:కలహాలకు నిలయమై అస్థిరత వల్ల బలహీనపడింది. ఈ సమయంలో ఇటలీ, ఒక బలమైన రాజ్యంగా అవతరించడానికి దేశభక్తుడైన మాకియవెల్లీ తన రచనల ద్వారా కృషిచేశాడు.

మాకియవెల్లి రాజనీతి సిద్ధాంతాన్ని Narrowlly dated, narrowly local అని విస్మరించడం సమంజసం కాదు. అతని భావాలు, సిద్ధాంతాలు 16వ శతాబ్దం చివర నుండి ప్రభావం చూపడం ప్రారంభించాయి. 17, 18వ శతాబ్దాల రాజనీతితత్వంపై మాకియవెల్లి సిద్ధాంతం అధిక ప్రభావం చూపిందని నిస్సంకోచంగా చెప్పవచ్చు. అతను చెప్పిన చారిత్రక పద్ధతి 17వ శతాబ్దంలోనే రాజనీతి అధ్యయనంలోనే చోటుచేసుకుంది.

రాజనీతి తత్వశాస్త్ర చరిత్రలో మాకియవెల్లికి ఒక ప్రత్యేక స్థానం వున్నది. అతను ముఖ్యంగా రాజనీతి శాస్త్రజ్ఞుడు, రాజనీతి తత్వవేత్తకాడు. వాస్తవ రాజకీయ వ్యవహారాలలో పాలకుడు ఏవిధంగా ప్రవర్తించాలో అతను బోధించాడు. అతని రాజనీతి భావాలు, సిద్ధాంతాలు సర్వత్రా నివసించబడినప్పటికి, నిత్యజీవితంలో వాటిని అనుసరిస్తున్నామని Dunning చెప్పాడు. మాకియవెల్లి భావాలు రాజనీతిశాస్త్ర అభివృద్ధికి ఎంతగానో తోడ్పడ్డాయి.

## 5.12 చదవదగిన పుస్తకాలు


1. M. Judd Harmon : "Political Thought from Ploto to the Present
2. V. Venkata Rao : "A History of Political Theories"


**ప్రశ్నలు :**

1. రాజనీతి శాస్త్ర చరిత్రలో మాకియావెల్లి స్థానాన్ని చర్చించండి.
2. మాకియావెల్లి రచనాపద్ధతిని వివరిస్తూ, ఆయన రచనలపై సమకాలనీ పరిస్థితుల ప్రభావాన్ని వివరించండి.
3. "మానవ స్వభావం" "నీతి" పై మాకియావెల్లి అభిప్రాయాలు సమర్థనీయమేనా ?
4. రాజ్యపాలన, రాజ్య విస్తరణపై మాకియావెల్లి భావాలను చర్చించండి.
5. మాకియావెల్లి తత్వవిచారము "సంకుచితమైంది" అన్న భావనతో మీరు ఏకీభిస్తున్నారా ?
6. "రాజ్య నిర్వహణ" పై "రాజు" లక్షణాలపై మాకియావెల్లి అభిప్రాయాలు సమర్థనీయమా ?

**రచయిత : ఎస్. పోలినాయుడు**

పాఠం - 6

# సామాజిక ఒడంబడిక సిద్ధాంతం : థామస్ హాబ్స్

విషయసూచిక


6.0 పరిచయం
6.1. హాబ్స్ జీవిత విశేషాలు
6.2 రచనలు - రచనా పద్ధతి
6.2.1 రచనా పద్ధతి
6.3 హాబ్స్ రాజనీతి సిద్ధాంతాన్ని ప్రభావితం చేసిన అంశాలు
6.4 మానవ స్వభావం - ప్రాకృతిక వ్యవస్థ
6.5 సహజ హక్కులు - సహజ న్యాయం
6.6 సామాజిక ఒడంబడిక - రాజ్యావతరణ
6.7 సార్వభౌమత్వం
6.7.1 సార్వభౌముని అధికారాలు, విధులు
6.8 ప్రభుత్వ రూపాలు
6.9 రాజ్యం - చర్చి
6.10 హాబ్స్ సిద్ధాంతంలో విభిన్న ధోరణులు
6.11. విమర్శ
6.12 హాబ్స్ రాజనీతి తత్వవిచారణకు చేసిన సేవ
6.13 చదువవదగిన పుస్తకాలు


## 6.0 పరిచయం :

సామాజిక ఒడంబడిక సిద్ధాంతానికి చాలా చరిత్ర వుంది. ప్రాచీనగ్రీకు రాజనీతితత్వంలో ఒడంబడిక సిద్ధాంత ప్రస్తావన వుంది. క్రీ.పూ. 4వ శతాబ్దంలో ప్లేటో రచనల ద్వారా ఒడంబడిక సిద్ధాంతం రాజనీతి సిద్ధాంతంలోకి ప్రవేశించింది. తరువాత క్రైస్తవ చర్చి ద్వారా ఈ సిద్ధాంతం మధ్యయుగం నాటి రాజనీతి సిద్ధాంతంలో చోటుచేసుకుంది. ఆధునిక యుగంలో 17వ శతాబ్దంలో ఈ సిద్ధాంతం బాగా అభివృద్ధి చెందింది. 17, 18వ శతాబ్దాలలో థామస్ హాబ్స్, జాన్‌లాక్, జె.జె.రూసో ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ఈ ముగ్గురు ఒడంబడిక సిద్ధాంతాన్ని మూడు భిన్నలక్ష్యాలకు ఉపయోగించుకొన్నారు.

మానవులు ఉద్దేశ్యపూర్వకంగా చేసుకొన్న అలిఖిత ఒడంబడిక ఫలితంగా రాజ్యం ఏర్పడిందని ఈ సిద్ధాంతం చెపుతోంది. ఈ సిద్ధాంతం ముఖ్యంగా (1) రాజ్య అవతరణ గురించి, (2) రాజకీయబద్ధత గురించి చర్చించింది. ఈ సిద్ధాంతననుసరించి రాజ్యం దైవనిర్మితం కాదని, ప్రజలు ఏర్పరచుకొన్న సంస్థ అని తెలుస్తుంది.

రాజ్యం మానవులు ఏర్పాటు చేసుకున్న సంస్థఅని హాబ్స్, లాక్, రుసో ఏకీభవించారు. కాని కొన్ని అంశాలపై వారిమధ్య ఏకాభిప్రాయం లేదు. ఉదాహరణకు, (1) ప్రాకృతిక వ్యవస్థదశలో ప్రజలు ఏవిధంగా ఏ పరిస్థితులలో జీవించారు ? (2) ఒడంబడిక ఎందుకు అనివార్యమైంది ? (3) ఒడంబడిక షరతులు ఏమిటి ? (4) ఒడంబడిక ఎవరి మధ్య జరిగింది ? ఈ అంశాలపై వారి మధ్య అంగీకారం లేదు.

నిరుపేక్ష సార్వభౌమాధికారం, పరిమిత సార్వభౌమాధికారం, ప్రజాసార్వభౌమత్వం, రాజ్యాంగవాదం, ప్రజాస్వామ్యం, ప్రజల స్వేచ్ఛ, స్వేచ్ఛ - అధికారం మధ్య సమన్వయం మొదలగు ముఖ్యాంశాలను సామాజిక ఒడంబడిక సిద్ధాంతం సమర్థించింది.

ఈ భాగంలో హాబ్స్ సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని వివరంగా చర్చిద్దాం.

## 6.1. హాబ్స్ జీవిత విశేషాలు :

ఆంగ్ల రాజనీతి తత్వవేత్తలలో ప్రముఖుడైన థామస్ హాబ్స్ 1588లో ఏప్రియల్ 5వ తేదీన వెస్ట్‌పోర్ట్ పట్టణంలో జన్మించాడు. స్పానిష్ నౌకాదళం ఇంగ్లాండు పైకి దండెత్తి వస్తుందన్న వార్త విన్న హాబ్స్ తల్లి ప్రాణభయంతో రెండు నెలలు ముందుగానే హాబ్స్‌ని కన్నది. "నేను భయం కవల పిల్లలుగా జన్మించాం" అని హాబ్స్ హాస్యంగా చెప్పేవాడు. అతని తండ్రి మతగురువు. హాబ్స్ పుట్టిన తరువాత అతను కుటుంబాన్ని విడిచిపెట్టి పారిపోయాడు. హాబ్స్ జీవితకాలంలో సంభవించిన ముఖ్యమైన రాజకీయ సంఘటన ఇంగ్లాండులో సంభవించిన అంతర్యుద్ధం. ఈ సంఘటనల కారణంగా హాబ్స్ రాజనీతి సిద్ధాంతంలో భయం అధిక పాత్ర వహించింది.

హాబ్స్ మొదట మామ్స్‌బరిలోనూ, తర్వాత ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేశాడు. పట్టబద్రుడైన తర్వాత డెవెన్‌షైర్ భూస్వామి విలియమ్ కావండిష్ కుమారునికి ఉపాధ్యాయుడిగా హాబ్స్ నియమింపబడ్డాడు. తరువాత రెండవ ఛార్లెస్ రాజుకు కూడా ఉపాధ్యాయునిగా పనిచేశాడు. రాజవంశీయులతో సత్సంబంధాలు ఉండటంవల్ల ఫ్రాన్సిస్ బేకర్, బెన్‌జాన్‌సన్, క్లేరండన్ వంటి ప్రముఖులతో పరిచయాలు ఏర్పడ్డాయి. హాబ్స్ తన శిష్యులతో 1610, 1628, 1637 సంవత్సరములలో ఫ్రాన్స్, ఇటలీ మొదలగు ఐరోపా దేశాలలో పర్యటించటం వలన గెలీలియో, దెకార్త్ వంటి విజ్ఞానవేత్తలు, తత్వవేత్తలతో పరిచయాలు ఏర్పడ్డాయి. 1637లో ఇంగ్లండులో సంభవించిన అంతర్యుద్ధంతో హాబ్స్ రాచరికాన్ని సమర్థించాడు. అతను భయంతో ఫ్రాన్స్ పారిపోయి కొన్ని సంవత్సరాలు పారిస్‌లో ప్రవాస జీవితం గడిపాడు. 1660లో ఇంగ్లండులో రాచరికం పునరుద్ధరింపబడిన తర్వాత హాబ్స్ తిరిగి ఇంగ్లాండు వచ్చాడు. రెండవ ఛార్లెస్ హాబ్స్‌కు సంవత్సరానికి వంద పౌండ్లు జీవనభృతిని ఏర్పాటుచేశాడు. 1679లో 91 ఏట చార్ట్‌వర్త్‌లో హాబ్స్ మరణించాడు.

## 6.2 రచనలు - రచనా పద్ధతి :

హాబ్స్ గొప్ప పాండిత్యము కలవాడు. బహుభాషా కోవిదుడు. అతనికి గ్రీకు, లాటిన్, ఫ్రెంచి మొదలగు భాషలను అధ్యయనం చేశాడు. అతను అనేక గ్రంథాలను రాజనీతి, న్యాయశాస్త్రంపై రచించాడు. హోమర్ రచించిన Odyssey, Gliad గ్రంథాలను తర్జుమా చేశాడు. హాబ్స్ రచించిన ముఖ్య గ్రంథాలు : (1) De Carpore (1654), (2) De Homine (1658), (3) De Cive (1642), (4) Leviathon (1651). వీటిలో హాబ్స్ రాజనీతి తత్వానికి చెందిన ముఖ్యగ్రంథం

లెవియాథన్ Leviathon, ఈ గ్రంథంలో హాబ్స్ సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని విశదీకరించాడు. ఈ గ్రంథంలో నిరపేక్ష సిద్ధాంతాన్ని విశదీకరించారు. ఈ గ్రంథంలో నిరపేక్ష రాచరికాన్ని హాబ్స్ సమర్ధించాడు. "లెవియాథన్" నిర్వచనాలతోను, తర్కంతోను, ఉదాహరణలతోను నిండివున్నది. ఈ గ్రంథం శాస్త్రీయహేతు వాద పద్ధతిలో క్రమబద్ధంగా వ్రాయబడింది. ప్రథమంగా రాజనీతి తత్వంపై ఒక ఆంగ్లేయుడు వ్రాసిన సమగ్ర గ్రంథం లెవియాథన్ అని ఎబెన్‌స్టీన్ వ్యాఖ్యానించాడు.

## 6.2.1 రచనా పద్ధతి :

పాశ్చాత్య రాజనీతి తత్వవిచారణ చరిత్రలో శాస్త్రీయ అధ్యయన పద్ధతిని ఉపయోగించిన మొదటి ఆధునిక రాజనీతి తత్వవేత్త థామస్ హాబ్స్. రాజనీతి సిద్ధాంతాన్ని వైజ్ఞానిక దృష్టితో చూసిన మొదటి ఆధునిక తత్వవేత్త కూడా హాబ్సే. బేకన్ చెప్పిన భౌతికశాస్త్ర విజ్ఞానమే హాబ్స్ రాజనీతి సిద్ధాంతానికి పునాది అయింది. హాబ్స్ చారిత్రక పద్ధతిని తిరస్కరించాడు.

హాబ్స్ భౌతికవాది. అతని భౌతిక వాదంపై అతని రాజనీతి ఆధారపడివుంది. ప్రపంచంలో వున్న ప్రతి పదార్థం నిరంతరం చలనం కలిగివుంటుంది. మానవుడు కూడా చలిస్తున్న కణాల కలయికేనని హాబ్స్ భావించాడు. ప్రతి మనిషిలో కూడా అతని అనుభూతులకు తగినట్లు ప్రతిస్పందించటం వలనే అతనిలో ప్రవర్తన కలుగుతుంది. ప్రతి మనిషి అతనికి సుఖాన్ని కలిగించిన వస్తువులను భావించి వాటిని వాంఛిస్తాడు. అదే విధంగా తనకు బాధను కలిగించిన వస్తువులను మనిషి చెడ్డవని భావించి వాటిని ద్వేషిస్తాడు. ఇవే మానవునిలోని రాగద్వేషాలకు, భావావేషాలకు కారణమై అతనిని కార్యశీలునిగా చేస్తాయి.

హాబ్స్ సాంప్రదాయక రేఖాగణిత పద్ధతిని, సమకాలీన శాస్త్రీయ విజ్ఞానాన్ని మేళవించి తన రాజనీతి సిద్ధాంతాన్ని విశ్లేషించాడు. రాజ్యం కూడా రేఖాగణిత నమూనా వంటిదని అతను చెప్పాడు. ఈ పద్ధతి ద్వారా రాజ్య అవతరణను, దాని స్వభావాన్ని వివరించవచ్చు అని అతను అభిప్రాయబడ్డాడు. ప్రాకృతిక వ్యవస్థ అనే ఒక ప్రతిపాదనతో తన సిద్ధాంతాన్ని ప్రారంభించాడు. దుర్భరమైన ప్రాకృతిక వ్యవస్థలోని మనవ జీవితమే రాజ్యవతరణకు దారితీసిందని చెప్పాడు. ప్రాకృతిక వ్యవస్థలో ఏర్పడిన ఆరాచక పరిస్థితుల వల్ల ప్రాణభీతితో ఉన్న ప్రజలు, ప్రాణరక్షణకు, ఆస్థి రక్షణకు రాజ్యాన్ని ఏర్పరచుకొన్నారని హాబ్స్ చెప్పారు. ఈ వివరణ రేఖాగణితపద్ధతిననునసరించి ఉంది.

## 6.3 హాబ్స్ రాజనీతి సిద్ధాంతాన్ని ప్రభావితం చేసిన అంశాలు :

హాబ్స్ కాలంనాటి రాజకీయ, వైజ్ఞానిక పరిస్థితుల ప్రబావం అతని రాజనీతి సిద్ధాంతంపై చాలా ఎక్కువగా వుంది. అతనికాలంలో ఇంగ్లాండ్‌లో సంభవించిన అతర్యుద్ధం సృష్టించిన అల్లకల్లోల అరాచక పరిస్థితులు, వివిధ మతవర్గాలు మధ్య జరిగిన సంఘర్షణలు, ప్యూరిటన్ విప్లవం, అప్పుడే అభివృద్ధి చెందుతున్న నూతన విజ్ఞానశాస్త్రం, సమకాలీన దేశవిదేశ ప్రముఖులతో హాబ్స్‌కు ఏర్పడిన పరిచయాలు అతని రాజనీతి సిద్ధాంతాన్ని అమితంగా ప్రభావితం చేసాయి.

## 6.4 మానవ స్వభావం - ప్రాకృతిక వ్యవస్థ :

మానవ స్వభావంపై హాబ్స్ మాకియవెల్లీతో ఏకీభవించాడు. మాకియావెల్లీ చెప్పినట్లే మానవుడు సహజంగా స్వార్థపరుడు, మూర్ఖుడు, అహంభావి, నీచుడు, క్రూరుడు అని హాబ్స్ కూడా భావించాడు. ఎల్లప్పుడు తన సుఖాన్నే

కొరుకొనే సంఘవ్యతిరేక జంతువు మానవుడని హాబ్స్ చెప్పాడు. ఈ భావన మానవుడు సంఘజీవి అని అరిస్టాటిల్ చెప్పిన భావనకు వ్యతిరేకమైనది.

పైన వివరించిన లక్షణాలు కలిగిన మానవులు ప్రాకృతిక వ్యవస్థలో (అంటే సమాజం, రాజ్యం ఏర్పడకముందున్న మానవుని స్థితి) అనాగరిక పరిస్థితిలో మృగప్రాయులుగా నివసించేవారు. ప్రాకృతిక వ్యవస్థలో మానవులకు వ్యవసాయం, పరిశ్రమలు, శాస్త్రాలు, భౌగోళిక పరిస్థితులు, సాహిత్యం, లలితకళలు తెలియవు. వారి ప్రాణానికి భద్రత లేదు. నిరంతరం ప్రాణభీతితో నివసించేవారు. ప్రాకృతిక వ్యవస్థలో మానవుడు ఒంటరితనం, దారిద్ర్యంతో, పశుప్రాయునిగా అల్పాయువుతో జీవితాన్ని గడిపాడు.

మానవులందరూ శారీరకంగాను, బుద్ధిబలంలోను, సమానులు. ప్రాకృతిక వ్యవస్థలో అందరికి పరిపూర్ణ స్వేచ్ఛ వుంటుంది. అరుదైన వస్తువులను పొందటానికి ప్రతివ్యక్తి, ప్రతివ్యక్తితో పోటీపడతాడు. ఇటువంటి ప్రయత్నాలు సంఘర్షణలకు దారితీస్తాయి. ప్రతి ఒక్కరి మధ్యా యుద్ధం జరుగుతుంది. ఈ యుద్ధంలో ప్రాణాపాయం జరగవచ్చు. ఈ దుర్భరస్థితిలో మానవులు దారుణ మరణ భీతితో సర్వదా సతమతమవుతూ వుంటారు. ఎందుకంటే శాంతిని భగ్నపరిచే వాళ్ళను శిక్షించే అధికారం ఎవరికిలేదు. ప్రతి వ్యక్తికి ప్రాణరక్షణ తన స్వీయశక్తిమీదే ఆధారపడి వుంటుంది.

ప్రాకృతిక వ్యవస్థలో శాసనాలు చేసి వాటిని అమలు చేసే సార్వభౌముడు అంటూ లేడు. కాబట్టి ప్రతిమనిషి ప్రతిమనిషితో నిరంతర యుద్ధస్థితిలో వుంటాడు. ఈ స్థితికి మానవునిలో వున్న (1) పోటీతత్వం, (2) ఇతరుల పట్ల అపనమ్మకం, (3) అధికారం కోసం, కీర్తికోసం పాకులాడటం కారణాలని హాబ్స్ భావించాడు. ప్రాకృతిక వ్యవస్థలో న్యాయానికి, అన్యాయానికి మధ్య తేడా లేదు. మంచి, చెడులకు మధ్య తేడా లేదు. సొంత ఆస్తికి స్థానం లేదు. ఎందుకంటే బలం ఉన్నవాడికే హక్కు వుంటుంది.

హాబ్స్ వర్ణించిన మానవ స్వభావం అతనికాలం నాటి బూర్జువా మనిషి మనస్తత్వమని విమర్శకులు భావించారు. అతను వివరించిన ప్రాకృతిక వ్యవస్థ చారిత్రాత్మకమైనదికాదు. దానికి చారిత్రక ఆధారాలు లేవు. అది హాబ్స్ చెప్పిన రేఖాగణిత పద్ధతిలో ఒకముఖ్యమైన ప్రతిపాదనగా మనం భావించాలి. ప్రాకృతిక వ్యవస్థను తార్కిక దృష్టితో మాత్రమే హాబ్స్ పరిశీలించాడు. సార్వభౌముడు లేనట్లైతే మానవుని జీవితం ఏవిధమైన బాధలకు ఇబ్బందులకు గురిఅవుతుందో ప్రాకృతిక వ్యవస్థ వర్ణన ద్వారా హాబ్స్ తెలియజేశాడు. ప్రాకృతిక వ్యవస్థ ఎల్లప్పుడూ మనిషిలో వుంటుంది. వ్యవస్థీకరణ చెందిన పౌర సమాజంలో అణగారి వున్న ప్రాకృతిక వ్యవస్థ అరాజక పరిస్థితులు, అంతర్యుద్ధాలు సంభవించనప్పుడు అది బయటపడి విజృంభిస్తుందని హాబ్స్ వివరించాడు. హాబ్స్ చెప్పిన సంఘ వ్యతిరేక మానవ స్వభావాన్ని మనము అంగీకరించినట్లైతే తార్కికంగా అతను వివరించిన ప్రాకృతిక వ్యవస్థను త్రోసిపుచ్చలేము.

## 6.5 సహజ హక్కులు - సహజ న్యాయం :

హాబ్స్ సహజ హక్కులను సహజ న్యాయానికి భేదం చెప్పాడు. సహజ హక్కులంటే మానవుడు తన రక్షణ కోసం ఏది అవసరమైతే దానిని పొందే స్వేచ్ఛ. సహజహక్కులు ప్రాకృతిక వ్యవస్థలో వ్యక్తుల మధ్య సంఘర్షణకు కారణం అవుతాయి. హేతుబద్ధమైన సాధారణ నియమాన్నే సహజన్యాయమని హాబ్స్ చెప్పాడు. ప్రాకృతిక వ్యవస్థలో ఉన్న దుర్భరస్థితి నుండి మానవులు బయటపడటానికి సహజన్యాయం మార్గాన్ని సూచిస్తుంది. దీనివల్ల పౌరసమాజ స్థాపన

జరుగుతుంది. అటువంటి సమాజంలో అందరికి ప్రాణరక్షణ ఉంటుందని హాబ్స్ భావించాడు. హాబ్స్ 19 సహజన్యాయ సూత్రాలను చెప్పాడు. వీటిలో రెండు సూత్రాలు రాజ్యస్థాపనకు ఉపయోగపడతాయి. అవి : (1) మానవుడు తనను తాను నాశనం చేసుకోకూడదు. (2) యుద్ధం కంటే శాంతి మంచిది. ఇతరులు తమ సమాజస్వేచ్ఛను, హక్కులను వదులుకొన్నట్లైతే శాంతిస్థాపన కోసం ప్రతివ్యక్తి తన సహజస్వేచ్ఛను, హక్కులను వదులుకోవాలి. ఈ రెండు సహజన్యాయ సూత్రాలు రాజ్యస్థాపనకు మార్గాన్ని సూచిస్తున్నాయి.

## 6.6 సామాజిక ఒడంబడిక - రాజ్యావతరణ :

హాబ్స్ ప్రాకృతిక వ్యవస్థను, సహజ హక్కులను, సహజ న్యాయాన్ని వివరించిన తరువాత సామాజిక ఒడంబడిక ద్వారా రాజ్యం ఏవిధంగా ఏర్పడిందీ చెప్పాడు. శాంతిస్థాపన కోసం ప్రాకృతిక వ్యవస్థలోని వ్యక్తులు తమతో తాము ఒప్పందం చేసుకొని రాజ్యాన్ని స్థాపించారు. ఇదే హాబ్స్ చెప్పిన సామాజిక ఒడంబడిక. ఈ ఒడంబడిక ద్వారా మానవులు వారి సహజ హక్కులను సార్వభౌముడనే వానికి అర్పిస్తారు. సార్వభౌముడు ఒకవ్యక్తి గాని, కొందరు వ్యక్తులుగాని కావచ్చు. హాబ్స్ మాటలలో "నన్ను నేను కాపాడుకొనే హక్కును ఒక నిర్దిష్టమైన వ్యక్తికి గాని, లేదా కొందరు వ్యక్తులతో కూడిన సభకు గాని ఇచ్చివేస్తాను. ఇదేవిధంగా మీరందరు మీ హక్కులను ఆ వ్యక్తికి గాని లేదా ఆ వ్యక్తుల సభకుగాని ఇచ్చివేసి ఆ వ్యక్తికి, లేదా ఆ వ్యక్తుల సభకు మన రక్షణ కొరకు అధికారమివ్వాలి". (I authorise and give up my right of governing my self to this man, or to this assembly of men, on this condition that thou give up they right to him and authorize all his actions in like manner). ఈ విధంగా ప్రజలు చేసుకొన్న ఒడంబడిక ద్వారా రాజ్యం, రాజ్యాధినేతైన ఒక సార్వభౌముడు ఏర్పడ్డాడు. ఈ ఒప్పందం ప్రజలు మధ్య జరిగింది. ప్రజలకు సార్వభౌమునికి మధ్య జరగలేదు. సార్వభౌముడు ఒప్పందం ఫలితంగా ఏర్పడ్డాడు. కాబట్టి ఒప్పందం షరతులు సార్వభౌమునికి వర్తించవు. అతను వాటికి కట్టుబడి ఉండనక్కరలేదు. సార్వభౌముడు ప్రజలందరికీ ప్రాతినిధ్యం వహిస్తాడు కాబట్టి ప్రాకృతిక వ్యవస్థలో ఉన్న మానవుల సమూహం ఒక సంఘంగా, ఒక రాజ్యంగా వ్యవస్థీకృతమౌతారు. అటువంటి సంఘంపై సార్వభౌమునికి అధికారం సంక్రమిస్తుంది. సార్వభౌముడు రాజ్యంలో ఏకత్వాన్ని చేకూర్చుతాడు. ఈ ఒప్పందం ద్వారా ఒక్క ప్రాణరక్షణ హక్కు మినహాయించి, మిగిలిన అన్ని హక్కులను ప్రజలు సార్వభౌమునికి ఎటువంటి షరతులు లేకుండా బదిలీ చేస్తారు.

హాబ్స్ చెప్పిన సామాజిక ఒడంబడిక శాశ్వతమైనది. అతని ఒడంబడిక సిద్ధాంతాన్ని అనుసరించి ఒడంబడికను ఉపసంహరించుకునే హక్కు ప్రజలకు లేదని తెలుస్తుంది. ఈ ఒడంబడిక ఫలితంగా సంపూర్ణాధికారం గల రాజ్యం ఏర్పడింది. అటువంటి రాజ్యశాసనాలకు, ఆజ్ఞలకు ప్రజలు అన్నివేళలా బద్ధులై వుండాలి. వాటిని ధిక్కరించే అధికారం వారికి లేదు. ఎప్పుడైనా అటువంటి ధిక్కారం జరిగితే ప్రాణానికి భద్రతతో కూడిన శాంతియుత పౌరసమాజం నుండి, ప్రాణానికి భద్రతలేని ప్రాకృతిక వ్యవస్థలోకి మానవులు వెళతారు కాబట్టి హేతు బుద్ధిగల మానవుడు శాంతియుత పౌరసమాజ జీవితాన్నే కోరుకుంటాడు. రాజ్యరక్షణలోనే మానవుడు అమితంగా కోరుకున్న భద్రతను పొందగలుగుతున్నాడు. ఈ విధంగా రాజకీయబద్ధతను, ప్రయోజనా వాదాన్ని అనుసరించి హాబ్స్ సమర్థించాడు.

రాజ్యాలను రెండు పద్ధతుల ద్వారా ఏర్పరచవచ్చునని హాబ్స్ చెప్పాడు. అవి : (1) స్థాపించటం వల్ల రాజ్యాన్ని ఏర్పరచవచ్చు. (2) ఆర్జన వల్ల రాజ్యాన్ని ఏర్పరచవచ్చు. మొదటి రకంలో ప్రజలు స్వచ్ఛందంగా చేసుకొన్న ఒడంబడిక

ద్వారా ఏర్పడిన సార్వభౌమునికి లోబడి వుంటారు. రెండోరకం రాజ్యంలో ప్రజలు ప్రాణరక్షణ కోసం సార్వభౌమునికి లొంగివుంటారు. ఈ రెండు రకాల రాజ్యాల మధ్య పెద్ద తేడా లేదని హాబ్స్ చెప్పాడు. ఈ రెండింటిని సార్వభౌమత్వం ముఖ్యం అని హాబ్స్ అభిప్రాయం.

## 6.7 సార్వభౌమత్వం :

హాబ్స్ సామాజిక ఒడంబడిక సిద్ధాంతం ద్వారా సార్వభౌమునికి సంక్రమించిన అపరిమిత అధికారాలను చెప్పాడు. రాజ్యానికి సార్వభౌముడు ప్రాణం వంటివాడు. సామాజిక ఒడంబడిక ద్వారా ప్రజలు వారి సహజ హక్కులను సార్వభౌమునికి అర్పిస్తారు. సార్వభౌముని అధికారానికి తిరుగులేదు. సార్వభౌముని అధికారం సంపూర్ణాధికారం, నిరపేక్షమైనది, అవిభాజ్యమైనది, అనన్యసంక్రామకమైనది. అతని అధికారాలకు పరిమితి లేదు. సహజన్యాయం, రాజ్యాంగ శాసనం, నీతిసూత్రాలు, మతం, ప్రజల ఆచార వ్యవహారాలు ఇవేవీ అతని అధికారానికి అడ్డుకావు. ఒప్పందం షరతులు అతనికి అడ్డురావు. దీనికి కారణం అతను ఒప్పందానికి భాగస్వామికాడు.

### 6.7.1 సార్వభౌముని అధికారాలు, విధులు :

1. సర్వాధికారాలు సార్వభౌముని చేతిలో కేంద్రీకృతమై వుంటాయి. ప్రజల సమిష్టి శక్తినంతటిని అతను ఉపయోగించవచ్చు. ఈ శక్తిని ఉపయోగించి రాజ్యంలో శాంతిని నెలకొల్పటం, ప్రజల ప్రాణాలను, ఆస్తులను కాపాడటం, దేశస్వాతంత్ర్యాన్ని కాపాడటం సార్వభౌముని విధి.

2. శాసన నిర్మాణాధికారం, కార్యనిర్వాహణాధికారం, న్యాయ నిర్వాహణాధికారం సార్వభౌమునికే చెందుతాయి. సార్వభౌముని ఆజ్ఞలే శాసనాలని హాబ్స్ చెప్పాడు. శాసనాలను అమలుచేసే అధికారం అతనికే వుంటుంది. ప్రజలు మధ్య ఏర్పడే వివాదాలను విచారణచేసి అతనే పరిష్కరిస్తాడు. సార్వభౌముడు ఏ పరిస్థితులలోను తన కిందివారిచేత శిక్షింపబడరాదు.

3. సార్వభౌముడు ప్రజలకు అన్యాయం చేయలేడు. అన్యాయం అంటే ఒడంబడికను ఉల్లంఘించడం. సార్వభౌముడు ఒడంబడికను ఉల్లంఘించడం అన్న ప్రశ్నేలేదు. అతను చేసే ప్రతీపని న్యాయమే. అతను ప్రజలపట్ల ఆదర్శంగా ప్రవర్తించవచ్చు. అతను శాసనాలకు అతీతుడు. సార్వభౌముడే శాసన వ్యాఖ్యాత.

4. సార్వభౌముడు ప్రభుత్వ కార్యాలయాలను స్థాపిస్తాడు. వాటి నిర్వహణకు అవసరమగు ప్రభుత్వ ఉద్యోగులను నియమిస్తాడు. ఉద్యోగులను తొలగించే అధికారం అతనికి వుంటుంది. మంత్రులను, మాజిస్ట్రేటులను నియమించి, తొలిగించే అధికారం అతనికి వుంది.

5. సార్వభౌమునికి యుద్ధాన్ని ప్రకటించటానికి, యుద్ధాన్ని చేయటానికి, విరమించడానికి శాంతి ఒప్పందాలను చేసుకోవడానికి సర్వాధికారాలున్నాయి. సైన్యాన్ని ఆజ్ఞాపించడానికి అతనికి హక్కు వుంది.

6. పౌర అధికారాలన్ని సార్వభౌమునివే. గౌరవ మర్యాదలు, ఆస్తి వ్యవహారాలకు సంబంధించిన కార్యకలాపాలన్నింటిని చూసుకొనే అధికారం అతనికే వుంది. ప్రజల ఆస్థులపై పన్నులు విధించి వసూలు చేసే అధికారం సార్వభౌమునికే వుంది.

7. లౌకిక, ఆధ్యాత్మిక వ్యవహారాలలో కూడా సార్వభౌముడే సర్వోన్నుతుడు. రాజ్యలౌకిక అధికారానికి లోబడి చర్చి వుండాలని అతడు చెప్పాడు. హాబ్స్ సిద్ధాంతంలో సర్వస్వతంత్రమైన చర్చికి స్థానం లేదు. సార్వభౌమునికి అంగీకారం లేనిదే వ్యక్తులను, దేవునికి మధ్య కూడా ఎటువంటి ఒప్పందం జరగకుండా హాబ్స్ చెప్పాడు. అంటే దేవుని కన్నా సార్వభౌమునిదే పైచేయి.

8. వ్యక్తుల అభిప్రాయాలను, సిద్ధాంతాలను కూడా సార్వభౌముడు అదుపులో వుంచవచ్చు. వాక్ స్వాతంత్ర్యం చెడుకు దారి తీయవచ్చు అని హాబ్స్ భావించాడు. వ్యక్తుల వాక్‌ను అదుపులో పెట్టినట్లైతే వారిని సక్రమపద్ధతిలో నడిపించవచ్చు అని హాబ్స్ చెప్పాడు.

పై చర్చనుబట్టి సార్వభౌముని అధికారం సంపూర్ణమైనదని తెలుస్తుంది. అతని అధికారం అవిభాజ్యమైనది, అనన్య సంక్రామకమైనదని చెప్పవచ్చును. అతని అధికారం ప్రశ్నించే హక్కు ప్రజలకు లేదు. అయినప్పటికి సార్వభౌముడు ప్రజాకంటమైన నియంతగా పాలించరాదు. అతడు తన అధికారాలను మితంగా యుక్తాయుక్త వివేచనతో చెలాయించటం మంచిదని హాబ్స్ చెప్పాడు. రాజ్యానికి, సార్వభౌముడికి ప్రమాదం కలగనంతవరకు ప్రజలకు అన్నిరంగాలలో స్వేచ్ఛను అనుమతించవచ్చు. నియంతృత్వ పాలన ప్రజలలో తిరుగుబాటుకు దారితీయవచ్చు. అటువంటి తిరుగుబాటు రాజ్యానికే ముప్పు కలిగిస్తుంది. ఈ కారణంవల్ల సార్వభౌముడు ప్రజారంజకమైన పనిని చేయడం మంచిదని హాబ్స్ సలహా ఇచ్చాడు.

హాబ్స్ సిద్ధాంతంలో సార్వభౌముని పై తిరుగుబాటు చేసేహక్కు ప్రజలకు లేదు. సార్వభౌముని శాసనాలను ఉల్లంఘన చేసినట్లైతే ఉల్లంఘించిన వారిని శిక్షించవచ్చు. వారికి మరణశిక్ష కూడా విధించవచ్చు. కాని, సార్వభౌముడు ప్రజలకు ప్రాణరక్షణ కల్పించ లేకపోతే అతనిపై తిరుగుబాటు చేసేహక్కు ప్రజలకు వుందని హాబ్స్ చెప్పాడు. మరి ఏ ఇతర కారణాల వల్ల సార్వభౌముని ధిక్కరించినా అటువంటి చర్య అన్యాయం అవుతుంది.

## 6.8 ప్రభుత్వ రూపాలు :

హాబ్స్ ప్రభుత్వాన్ని మూడు రకాలుగా విభజించినాడు. సార్వభౌమాధికారాన్ని ఎంతమంది చెలాయిస్తారన్నదే ఈ వర్గీకరణకి మూలం. సార్వభౌమాధికారం ఒకరి చేతిలో వుంటే అది రాజరికం. అది కొద్దిమంది సమూహం చేతిలో వుంటే అది కులీన పాలన. అది ఒక అసెంబ్లీ చేతిలో వుంటే అది ప్రజాస్వామ్యం. బోడిన్ చెప్పినట్లే హాబ్స్ కూడా మిశ్రమ ప్రభుత్వాలు అర్థరహితమని చెప్పారు. ఆ మూడు రకాలు ప్రభుత్వాలలో సార్వభౌమాధికారం ఒకే రకంగా ఒకే రకమైన లక్షణాలు కలిగివుంటుంది.

ఈ మూడు రకాల ప్రభుత్వాలలో రాచరికం మంచిదని భావించిన హాబ్స్ రాచరికానికే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చాడు. దీనికి ఈ క్రింది కారణాలను చూపించాడు.

1. రాచరికంలో ప్రభుత్వ ప్రయోజనాలు, ప్రజల ప్రయోజనాలు కలసిమెలసి వుంటాయి. రాజ్యంలో ప్రజలకున్న సంపద, కీర్తి రాజుకు సొంతమే. అతని కీర్తిప్రతిష్టలు వాటి మీదే ఆధారపడి వుంటాయి.

2. రాజరికంలో రాజునిర్ణయాలు, విధానాలు త్వరితంగా తీసుకొని వాటిని పటిష్టంగా అమలుచేసి కొనసాగించడానికి వీలుంటుంది.

3. రాజరికంలో రాజు ఒక్కడే కనుక అతనికి ఇష్టులు కొద్దిమంది మాత్రమే వుంటారు. కానీ కులీనపాలన, ప్రజాస్వామ్యాలలో పాలకులు ఎక్కువమంది వుంటారు కాబట్టి వారి ఇష్టుల సంఖ్య కూడా ఎక్కువే.

పై కారణాలను బట్టి రాజరికమే మంచి ప్రభుత్వమని హాబ్స్ చెప్పాడు. కాని అతడు చెప్పిన రాజరిక వ్యవస్థ ఆనాటి రాజరికవాదులకు, సాంప్రదాయ మతవాదులకు నచ్చలేదు. ఎందుకంటే దైవదత్తంగాని, నైతిక సంస్థగాని కాదని హాబ్స్ చెప్పాడు.

## 6.9 రాజ్యం - చర్చి :

హాబ్స్ రాజ్యానికి, చర్చికి మధ్యనున్న సంబంధాలను చర్చించాడు. చర్చి రాజ్యాధికారానికి ఒక ప్రత్యర్థి అని అతను గుర్తించాడు. కాబట్టి చర్చిని సార్వభౌముడు నియంత్రణ చేయడం తప్పుకాదని హాబ్స్ భావించాడు. సార్వభౌముని అధికారం అవిభాజ్యం కాబట్టి దానిని విడదీసి ఇంకొకరికి ఇవ్వడానికి వీలుపడదు. అతని దృష్టిలో చర్చి అంటే సార్వభౌముని ఆధీనంలో వుండే ఏసుక్రీస్తు భక్తుల సంఘం మాత్రమే అని హాబ్స్ చెప్పాడు. అటువంటి భక్తులు సమావేశమై ఏసునామం జపించడానికి సార్వభౌముని అనుమతి అవసరమని చెప్పాడు. చర్చి ఆధ్యాత్మిక ప్రభుత్వమనే భావనలో అతనికి నమ్మకంలేదు. ఈ ప్రపంచంలో లౌకిక ప్రభుత్వం ఒక్కటే నిజమైన ప్రభుత్వమని అతని నమ్మకం. మతం, చర్చి, రాజ్యానికి, రాజ్యఐక్యమత్యానికి విధ్వంసకర శక్తులుగా పనిచేస్తాయి. మతం సార్వభౌముని అధికారానికి అడ్డంపడనంతవరకు హాబ్స్‌కు ఇష్టమే. మతం వ్యక్తులను ఒక క్రమబద్ధమైన మార్గంలో నడిపించడానికి అవసరమని అతను భావించాడు. రాజ్యం అనుమతించే మతాన్ని ప్రజలు అనుసరించడం మంచిదని అతను భావించాడు. చర్చి దైవ సృష్టికాదని అతను చెప్పాడు. సార్వభౌముని సహాయం లేనప్పుడు చర్చి నిలవలేదని హాబ్స్ చెప్పాడు. ప్రభుత్వానికి చర్చికి రెండింటికి సార్వభౌముడే అధిపతి. ఆ రెండింటి ఆజ్ఞల మధ్య సంఘర్షణ వుండదని హాబ్స్ చెప్పాడు.

## 6.10 హాబ్స్ సిద్ధాంతంలో విభిన్న ధోరణులు :

హాబ్స్ సిద్ధాంతంలో పరస్పర విరుద్ధమైన సంపూర్ణాధికారవాదం, వ్యక్తివాదం కనిపిస్తాన్నాయని విమర్శకులు చెప్పారు. ఈ రెండుకాక అతని సిద్ధాంతంలో ఉపయోగితావాద అంశాలు కూడా ఉన్నాయి.

హాబ్స్ సిద్ధాంతం అనుసరించి రాజ్యాధిపతియైన సార్వభౌమునికి నిరపేక్ష అధికారం కలదు. అతని అధికారానికి శాసనాలను తిరుగులేదు. అయితే వీటి ఉద్దేశ్యం మానవుని కార్యక్రమాలన్నింటికి నియంత్రణ చేయడం కాదు. ప్రజల జీవితాలకు సంబంధించిన సామాన్య విషయాలలో (ఉదా : స్వేచ్ఛగా వస్తువులను కొనడం, అమ్మడం వంటి కార్యకలాపాలు, ఇష్టం వచ్చిన వృత్తిని స్వీకరించడం, పిల్లలకు ఇష్టం వచ్చిన రీతిలో విద్యను నేర్పించడం) ప్రజలకు స్వేచ్ఛ వుంటుంది. సార్వభౌమునికిచ్చిన సంపూర్ణాధికారం కూడా వ్యక్తి భద్రతను దృష్టిలో పెట్టికొని సమర్థించాడు. నిరపేక్షసార్వభౌమాధికారం వ్యక్తి భద్రతను, శాంతిని సమకూర్చే సాధనం మాత్రమే అని హాబ్స్ చెప్పాడు. సంపూర్ణాధికారాన్ని వ్యక్తివాదాన్ని హాబ్స్ తన సిద్ధాంతంలో సమన్వయపర్చాడు.

హాబ్స్ ఉపయోగవాదానికి కూడా మార్గదర్శకుడు. హాబ్స్ చెప్పిన ''ఆనందం'' అనే భావం, సహజహక్కుల సిద్ధాంతం, సహజన్యాయం, రాజ్యసిద్ధాంతం, రాజకీయ బద్ధత మొదలగునవి అతని సిద్ధాంతంలోని ఉపయోగితావాద సిద్ధాంతాలని చెప్పవచ్చును.

## 6.11. విమర్శ :

హాబ్స్ సిద్ధాంతం కొన్ని విమర్శలకు గురి అయింది.

(1) హాబ్స్ చెప్పిన ప్రాకృతిక వ్యవస్థకు చారిత్రక ఆధారాలు లేవు. అతి ప్రాచీన నాగరిక ప్రజలు కూడా ఏదో ఒక రకమైన సామాజిక జీవితాన్ని గడిపేవారని మానవశాస్త్రం చెబుతుంది.

(2) హాబ్స్ వర్ణించినట్లు మానవుడు పూర్తిగా చెడ్డవాడుకాదు. అరిస్టాటిల్ చెప్పినట్లు మానవుడు సంఘజీవి. మానవుడు తోటివారితో కలసి జీవిస్తాడు. అతను స్నేహంగాను, ప్రేమగాను, జాలిగాను నడుచుకొంటాడు.

(3) రాజ్యం ఏర్పడక ముందు సహజ హక్కులు వుండేవని హాబ్స్ చెప్పాడు. మానవ హక్కులకు సమాజం, రాజ్యంలో మాత్రమే అర్థముంటుంది.

(4) ఏ ఒడంబడికైనా ఇరుపక్షాలు మధ్య జరుగుతుంది. కాని హాబ్స్ చెప్పిన సామాజిక ఒడంబడిక ఏకపక్షంగా జరిగింది. ఈ ఒడంబడిక ఫలితంగా సర్వాధికారి అయిన సార్వభౌముడు ఏర్పడ్డాడు. ప్రాణరక్షణ హక్కు మినహా ప్రజలు అన్ని హక్కులను పోగొట్టుకొన్నారు. ఈ విధంగా హాబ్స్ చెప్పిన సామాజిక ఒడంబడిక వ్యక్తులను బానిసలుగా మార్చే పత్రమని విమర్శకుల అభిప్రాయం. అతని సిద్ధాంతం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం.

(5) హాబ్స్ సిద్ధాంతంలో రాజ్యానికి, సంఘానికి మధ్య, రాజ్యానికి ప్రభుత్వానికి మధ్య తేడాలు లేవు. నిజానికి ఈ మూడు ఒకటికావు.

(6) హాబ్స్ వర్ణించిన మానవుడు సంఘ వ్యతిరేకి అయిన జంతువులాంటివాడు. ప్రాకృతిక వ్యవస్థలో వున్న అటువంటి మృగప్రాయులైన మానవులకు అకస్మాత్తుగా ఒడంబడిక ద్వారా రాజ్యాన్ని స్థాపించుకోవాలనే జ్ఞానం కలిగిందని చెప్పడం నమ్మశక్యంగా లేదు. రాజ్యమున్న పౌర సమాజంలో మాత్రమే ఒప్పందాలను కుదుర్చుకొని, వాటిని పాటించడానికి వీలుంటుంది.

(7) హాబ్స్ సిద్ధాంతం ఇటు ప్రభుభక్తుల వర్గాన్ని, అటు ప్రభువ్యతిరేకవర్గాన్ని, మతాధికారులను తృప్తిపరచలేకపోయింది. అతను తిరుగుబాటును సమర్థించే విధానం ప్రభు భక్తులకు నచ్చలేదు. అతను నిరంకుశ రాజరికాన్ని సమర్థించటం రాజు వ్యతిరేక వర్గానికి నచ్చలేదు. ఈ విధంగా హాబ్స్ సిద్ధాంతం అన్ని ముఖ్యమైన వర్గాలవారిని అసంతృప్తి పరిచింది. ''లేవియాథన్''లో హాబ్స్ ఫలరహితమైన ఒక గొప్పసంకరజాతి సిద్ధాంతాన్ని చెప్పాడని వాగన్ తీవ్రంగా విమర్శించాడు.

## 6.12 హాబ్స్ రాజనీతి తత్వవిచారణకు చేసిన సేవ :

హాబ్స్ రాజనీతి సిద్ధాంతంపై చాలా విమర్శలున్నప్పటికి, అతను రాజనీతి తత్వవిచారణ, అభివృద్ధికి చేసిన సేవ గణనీయమైనదని చెప్పవచ్చును. అతని సిద్ధాంత ప్రాముఖ్యతని సంక్షిప్తంగా ఈక్రింది విధంగా చెప్పవచ్చును.

(1) హాబ్స్ రచించిన లేవియాథన్ గ్రంథం ఆంగ్ల భాషలో వెలువడ్డ రాజనీతి తత్వగ్రంథాలలో ముఖ్యమైన సవిస్తర గ్రంథం. ఇది శాస్త్రీయ హేతువాద పద్ధతిలో క్రమబద్ధంగా రచింపబడ్డది. అతడు అనుసరించిన శాస్త్రీయ రేఖాగణిత పద్ధతి రాజనీతికి శాస్త్రీయ లక్షణాలను చేకూర్చింది. అతని శాస్త్రీయ భౌతికవాదం శాస్త్రీయ సామ్యవాద పితామహుడైన కార్లమార్క్సను ప్రభావితం చేసింది.

(2) మతాన్ని, నీతిని మాకియవెల్లీ రాజనీతినుండి వేరు చేస్తే, హాబ్స్ ఆ రెండింటిని రాజనీతి ఆధిపత్యం కిందకి తెచ్చాడు. దైవదత్తాధికార రాజ్యావతరణ సిద్ధాంతానికి హాబ్స్ చెప్పిన లౌకిక రాజ్యభావన చావుదెబ్బకొట్టినది. రాజనీతిని లౌకికపునాదులు వేసిన ఘనత హాబ్స్‌కి దక్కింది. రాజ్యం మానవుడు తన భద్రత కోసం ఏర్పరచుకున్న సంస్థని అతను భావించాడు.

(3) రాజనీతి తత్వవిచారణ చరిత్రలో సంపూర్ణ సార్వభౌమత్వ సిద్ధాంతాన్ని చెప్పిన మొదటివాడు హాబ్స్ అనే వేపర్ చెప్పాడు. సంవర్థక శాసన భావాన్ని కూడా అతను చెప్పాడు. ఈ రెండు భావాలను 19వ శతాబ్దానికి చెందిన జాన్ ఆస్టిన్ గ్రహించాడు.

(4) హాబ్స్ సుస్పష్టమైన వ్యక్తివాదాన్ని, ఉపయోగితావాదాన్ని చెప్పాడు. అతను చెప్పిన వ్యక్తివాదం 19వ శతాబ్దంనాటి వ్యక్తి స్వేచ్ఛావాదానికి నాంది పలికింది. హాబ్స్ సిద్ధాంతంలోని వ్యక్తివాదం అత్యంత ఆధునిక అంశమని సెబైన్ అభిప్రాయబడ్డారు. ఈ అంశమే హాబ్స్ రాజనీతితత్వాన్ని విప్లవాత్మక రాజనీతి సిద్ధాంతంగా మారడానికి కారణమని సెబైన్ చెప్పాడు. హాబ్స్ సిద్ధాంతంలోని ఉపయోగితావాద అంశం బెంథామ్‌ని ప్రభావితం చేసింది.

నేటి సమాజ పరిస్థితులకు హాబ్స్ చెప్పిన సిద్ధాంతం ఎంతవరకు ఉపయుక్తము ? అతను తన సిద్ధాంతంలో శాంతి భద్రతలకు అధిక ప్రాముఖ్యతనిచ్చాడు. ఈనాడు కూడా మానవులు ఎదుర్కొంటున్న సమస్య శాంతి భద్రతలనే చెప్పవచ్చు.

## 5. 13 చదువదగిన పుస్తకాలు :


1. George H. Sabine : "A History of Political Theory"
2. M. Judd Harmon : "Political Thought From Plato to the Present"
3. Dr. M.V. Subba Rao : "ఆధునిక పాశ్చాత్య రాజనీతి తత్వవిచారము"


## ప్రశ్నలు :

1. హాబ్స్ రచనా పద్ధతి (Methods) యొక్క విశిష్ఠతను వివరించండి.
2. హాబ్స్ యొక్క సిద్ధాంతాల్ని ప్రభావం చేసిన అంశాలు ఏమిటి ? ఆ ప్రభావ ఫలితమేమిటి ?
3. పాకృతిక వ్యవస్థపై హాబ్స్ అభిప్రాయాలు వ్రాయండి.
4. హాబ్స్ ప్రతిపాదించిన సామాజిక ఒడంబడిక లక్షణాలను తులనాత్మకంగా చర్చించండి.
5. సార్వభౌమత్వంపై హాబ్స్ ప్రతిపాదించిన భావనలను విమర్శనాత్మంగా చర్చించండి.
6. హాబ్స్ సిద్ధాంతములోని బలహీనతలను, విశిష్ఠతను వివరించండి.
7. హాబ్స్ రాజనీతి తత్వవిచారణకి చేసిన సేవ ఏమిటి ?

**రచయిత : ఎస్. పోలినాయుడు**

పాఠం - 7

# సామాజిక ఒడంబడిక సిద్ధాంతం : జాన్‌లాక్

## పరిచయం

7.0 పరిచయం
7.1 జీవిత విశేషాలు - లాక్ రచనపై సమకాలీన పరిస్థితుల ప్రభావం
7.1.1 లాక్ రచనలు - సమకాలీన పరిస్థితుల ప్రభావం
7.2 లాక్ రాజనీతి సిద్ధాంతం
7.3 మానవ స్వభావం - ప్రాకృతిక వ్యవస్థ
7.4 సామాజిక ఒడంబడిక : పౌరసమాజం, ప్రభుత్వం స్థాపన
7.5 ప్రభుత్వం
7.5.1 ప్రభుత్వంపై పరిమితులు
7.6. ప్రతిఘటన (తిరుగుబాటు) హక్కు
7.7 సహజ న్యాయం : సహజ హక్కుల సిద్ధాంతం - ఆస్థిహక్కు
7.8 రాజనీతి తత్వవిచారణ చరిత్రలో లాక్ స్థానం
7.9 చదువదగిన పుస్తకాలు

## 7.0 పరిచయం :

సామాజిక ఒడంబడిక సిద్ధాంత కర్తలలో హాబ్స్ తరువాత ముఖ్యమైనవాడు జాన్‌లాక్. హాబ్స్ చెప్పిన సిద్ధాంతం ప్రాతిపదికగా లాక్ సామాజిక ఒడంబడిక సిద్ధాంతం, రాజ్యావతరణ విషయాలపై తన అభిప్రాయాలను వ్యక్తం చేసినాడు. వీరిద్దరి రాజకీయ సిద్ధాంతాలు చాలవరకు విరుద్ధమైనవి. హాబ్స్ నిరపేక్ష రాజరికాన్ని సమర్థిస్తే, లాక్ రాజ్యాంగబద్ధమైన పరిమిత ప్రభుత్వాన్ని సమర్థించాడు. హాబ్స్ ప్రజలకు రాజుపై తిరుగుబాటుచేసేహక్కు లేదని చెప్పినాడు. దీనకి విరుద్ధంగా లాక్ రాజుపై తిరుగుబాటు చేసేహక్కు ప్రజలకుందని చెప్పాడు. "Two Treatises of Government" అనే గ్రంధాన్ని హాబ్స్ సిద్ధాంతాన్ని ఖండించటానికే లాక్ రాసినట్లు కనబడుతుంది. కాని నిజానికి ఆ గ్రంథంలో ఫిల్మర్ సమర్థించిన రాజుల నిరపేక్ష సహజ అధికారాన్ని లాక్ ఖండించాడు.

లాక్ స్వతస్సిద్ధమైన తాత్వికుడు కాడు. అతని సిద్ధాంతంలో తర్కం కాని, విజ్ఞానంకాని, చెప్పుకోతగినంత లేవు. అయినప్పటికి లౌకిక ప్రపంచజ్ఞానం మాత్రం సంపూర్ణంగా ఇమిడివుంది. రాజుల దైవహక్కుల సిద్ధాంతాన్ని లాక్ తిరస్కరించాడు. రాజ్యాంగవాదం, స్వేచ్ఛ, సమ్మతి, ఆస్థి, సహనబుద్ధి మొదలగు అంశాలను లాక్ తన సిద్ధాంతంలో మేళవించాడు. ఈ భావాలు ప్రజాస్వామ్య సంస్థలు, సిద్ధాంతాలు ఐరోపాలో సక్రమ పద్ధతిలో అభివృద్ధి చెందటానికి దోహదంచేశాయి. రాజనీతి సిద్ధాంతానికి లాక్ చేసిన సేవపై వ్యాఖ్యాతలతో అభిప్రాయభేదాలున్నప్పటికి అతని సేవను అందరు అంగీకరించారు. రాజకీయ, సామాజిక రంగాలలో లాక్ సాధించిన ఘనకార్యం ఉదారవాదమని చెప్పవచ్చును.

## 7.1 జీవిత విశేషాలు - లాక్ రచనపై సమకాలీన పరిస్థితుల ప్రభావం :

జాన్‌లాక్ సోమర్‌సెట్‌షైర్‌లోని రింగ్‌టన్ గ్రామంలో 1632వ సంవత్సరములో ఆగస్టు 29న జన్మించాడు. అతని తండ్రి వకీలు. చిన్నతనంలో లాక్ విద్యాభ్యాసం ఇంటివద్దనే జరిగింది. లాక్ కుటుంబ సభ్యులందరూ ప్యూరిటన్ మతస్తులు. ఇంగ్లాండ్‌లో జరిగిన అంతర్యుద్ధంలో రాజుకు వ్యతిరేకంగా పార్లమెంటరీ వర్గంతో కలసిపోరాడారు. 1647లో వెస్ట్‌మినిస్టర్ స్కూల్‌లో చేరాడు. ఆ తరువాత 1652లో క్రీస్తు చర్చి కళాశాలలో విద్యార్థిగాచేరి 1667 వరకు అందులో విద్యనభ్యసించాడు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో బి.ఏ. పట్టాపుచ్చుకున్న తర్వాత, ఎం.ఏ. పరీక్షలో కూడా ఉత్తీర్ణుడైనాడు. మరుసటి సంవత్సరములో గ్రీకు భాష బోధించే ఉపాధ్యాయుడుగా నియమింపబడ్డాడు. ఆక్స్‌ఫర్డ్‌లో వుండగా వైద్యశాస్త్రం అధ్యయనం చేశాడు. ఈ సమయంలోనే అనుభవవాదంపై లాక్ ఆశక్తి కనబరిచాడు.

1666లో లార్డ్ యాషలీ ఆఫ్ షాఫ్ట్‌బరీని కలిసాడు. ఆ తరువాత వీరిద్దరి మధ్య మంచి స్నేహసంబంధాలు ఏర్పడ్డాయి. లాక్ అతనికి వైద్యునిగా కూడా పనిచేశాడు. యాషలీ మరణం వరకు లాక్ అతనికి రక్షకుడుగా, రాజకీయ సహచరుడుగా, స్నేహితుడుగా ఉన్నాడు. యాషలీ మతసహనాన్ని గురించి చెప్పాడు. అసహనం సమాజంలో విభజనలను దారితీస్తుందని, వర్తక వ్యాపారాలను దెబ్బతీస్తుందని యాషలీ భావించాడు. ఈ భావాలు లాక్ రచనలో కనిపిస్తాయి. యాషలీ చార్లెస్ II ను వ్యతిరేకించాడు. ఈ సంఘటనే లాక్ "Treatises of Government" అనే గ్రంధాన్ని రాయడానికి ప్రోత్సహించిందని భావిస్తున్నారు. 1688లో సంభవించిన రక్తరహిత విప్లవాన్ని సమర్థించడానికే ఈ గ్రంథాన్ని 1689లో రచించాడని కొంతమంది అభిప్రాయం.

### 7.1.1 లాక్ రచనలు - సమకాలీన పరిస్థితుల ప్రభావం :

వివిధ విషయాలపై లాక్ ఎన్నో గ్రంథాలను రచించారు. వాటిలో ముఖ్యమైనవి. 1) "Two Treatises of Government, 2) "Letter on Toleration", 3) The Essay Concerning Helman Understanding" . వీటిలో మొదటి గ్రంథం మన రాజనీతి సిద్ధాంతానికి సంబంధించినది.

ఈ గ్రంథాలలో లాక్‌వెలిబుచ్చిన భావాలను లాక్ జీవితకాలంలో సంభవించిన అనేక సంఘటనలు, అంశాలు ప్రభావితం చేశాయి.

(1) లాక్ కాలంలో రక్తరహిత విప్లవం 1688లో సంభవించింది. దీనిఫలితంగా నిరంకుశంగా పరిపాలించిన 2వ జేమ్స్ రాజ్యభ్రష్టుడైనాడు. ఆ తరువాత విలియమ్, అతని భార్య మేరినీ బ్రిటీష్ సింహాసనానికి వారసురాలుగా 1688లో పార్లమెంటు ప్రకటించింది. ఎక్కువ రక్తపాతం లేకుండా ఈ మార్పు జరిగింది. ఈ మార్పువల్ల రాజ్యాంగబద్ధమైన పరిమిత ప్రభుత్వం ఏర్పడింది. ఈ రాజకీయ విప్లవం తెచ్చిన మార్పులను లాక్ సిద్ధాంతపరంగా సూత్రీకరించాడు. 1688లో జరిగిన తిరుగుబాటుకి లాక్ ఒక ప్రవక్తవంటివాడు.

(2) లార్డ్ యాషలీతో ఏర్పడిన స్నేహ సంబంధాల వలన అతని భావాలు లాక్‌ను అమితంగా ప్రభావితం చేశాయి.

(3) డెస్కార్టెస్, న్యూటన్ వంటి శాస్త్రవేత్తల రచనలవల్ల వైజ్ఞానిక వాతావరణంలో ఏర్పడిన మార్పులు,

(4) ఉదారవాదం వ్యాప్తి.

(5) హేతువాదం అభివృద్ధి, మొదలగు అంశాలు లాక్ రాజనీతి సిద్ధాంతాన్ని, భావాలను ప్రభావితం చేశాయి.

లాక్ తన రాజనీతి సిద్ధాంతాన్ని తన సమకాలంలో జరిగిన సంఘటనలకు, ఏర్పడిన పరిస్థితులకు ప్రతిబింబంగా వివరించాడు.

## 7.2 లాక్ రాజనీతి సిద్ధాంతం :

లాక్ తన రాజనీతి సిద్ధాంతాన్ని "Two Treatises of Government" అనేగ్రంథంలో వివరించాడు. ఇది రెండు సంపుటాల గ్రంథం. మొదటి సంపుటి "పాట్రియార్కా" (Patriarcha) గ్రంథంలో సర్ రాబర్ట్ ఫిల్మర్ చెప్పిన సిద్ధాంతాన్ని లాక్ విమర్శించాడు. ఫిల్మర్ ఈ గ్రంథంలో రాజులు ఆడమ్ వారసులని, వారి అధికారం నిరపేక్షమైనదని చెప్పాడు. ఇవి తప్పుడు సిద్ధాంతాలని లాక్ త్రోసిపుచ్చాడు.

"రెండవ సంపుటి" (Second Treatise on Government) లో లాక్ తన ముఖ్యమైన రాజనీతి సిద్ధాంతాన్ని చెప్పాడు. ఇందులో పౌరప్రభుత్వం యొక్క నిజమైన, అసలైన అధికారం మూలంను, దాని పరిథిని, లక్ష్యాలను వివరించాడు. ఈ అధికారం యొక్క లక్ష్యాలను ప్రజలే నిర్ణయిస్తారని లాక్ చెప్పాడు. పౌరప్రభుత్వానికి ఈ క్రింది లక్ష్యాల ముఖ్యమని లాక్ చెప్పాడు. (1) ఆస్తిని నియతం చేసి పరిరక్షించడం, (2) విదేశీ దాడుల నుండి రాజ్యాన్ని రక్షించడం. ఈ లక్ష్యాలు సాధనకు సమాజ శక్తినంతటిని ఉపయోగించి శాసనాలు చేసి, వాటిని అమలుచేయడం. ఈ శాసనాల ద్వారా మరణశిక్షను, అంతకంటే తక్కువ శిక్షను విధించటానికి ప్రభుత్వానికి హక్కు వుందని లాక్ చెప్పాడు. ప్రభుత్వం పైకార్యకలాపాలన్నింటిని ప్రజాసంక్షేమం దృష్ట్యా నిర్వహించాలి.

## 7.3 మానవ స్వభావం - ప్రాకృతిక వ్యవస్థ :

లాక్ కూడా తన సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని హాబ్స్‌వలే మానవ స్వభావం వర్ణన, ప్రాకృతిక వ్యవస్థ చర్చతోనే ప్రారంభించాడు. లాక్ వర్ణించిన మానవుడు హాబ్స్ వర్ణించినటువంటి మృగప్రాయుడు, కలహప్రియుడు, స్వార్థపరుడు కాడు. లాక్ దృష్టిలో మానవుడు సంఘజీవి, స్నేహశీలి, అతను మంచివాడు, యోగ్యుడు. లాక్ అభిప్రాయంలో మానవుడు ప్రధానంగా హేతుబుద్ధి, వివేచనా శక్తికలవాడు. ఈ స్వభావం కల మానవులు ప్రాకృతిక వ్యవస్థలో శాంతియుత సహజీవనం చేసేవారని లాక్ చెప్పాడు. హాబ్స్ ప్రాకృతిక వ్యవస్థ శాంతిమయం. ఇది హాబ్స్ చెప్పినట్లు నిరాశాపూరితమైనది గాని, విషాదపూరితమైనది గాని కాదు. హాబ్స్ చెప్పిన ప్రాకృతిక వ్యవస్థలో సమాజజీవితం, రాజకీయ జీవితం రెండూలేవు. లాక్ చెప్పిన ప్రాకృతిక వ్యవస్థలో రాజకీయ జీవితం లేదు, కాని సమాజజీవితం వుంది.

వ్యక్తుల మధ్య తీర్పుచెప్పడానికి ఒక సార్వజనిక ఉన్నతాధికారి (Superior) లేకుండా మానవులు కలసి మెలసి జీవించే పరిస్థితినే ప్రాకృతిక వ్యవస్థని లాక్ చెప్పాడు. హాబ్స్ ప్రాకృతిక వ్యవస్థలో సహజన్యాయం వుంది. ఈ దశలో మానవులు సహజ న్యాయసూత్రాలకు లోబడి జీవించేవారు. మానవుని హేతుబుద్ధి, విచక్షణా జ్ఞానమే సహజన్యాయమని లాక్ చెప్పాడు. సహజన్యాయం నిర్ణయించిన విధంగా వారు హక్కులను అనుభవిస్తూ, బాధ్యతలను నిర్వహించేవారు. ప్రతివ్యక్తికి జీవించేహక్కు, స్వేచ్ఛహక్కు, ఆస్థిహక్కు సహజన్యాయం ద్వారా లభించాయి. మానవులకు కొన్ని సహజవిధులు కూడా వుండేవి. ప్రతి వ్యక్తి ఇతరుల ప్రాణానికి, ఆరోగ్యానికి, స్వేచ్ఛకి, ఆస్థికి హాని కలిగించకూడదని సహజన్యాయం తెలియజేస్తుంది. కాబట్టి ప్రతివ్యక్తి సహజన్యాయాన్ని అనుసరించి తన హద్దులలో వ్యవహరించేవాడు. ప్రతివ్యక్తికీ శిక్షించేహక్కు ఉండేది. ఎవరైనా సహజన్యాయాన్ని ఉల్లంఘించి ప్రాకృతిక వ్యవస్థను భంగం కలిగిస్తే, అటువంటివారిని శిక్షించేహక్కు ప్రతి వారికి వుంటుందని లాక్ చెప్పారు. ఈ హక్కువల్ల ప్రాకృతిక వ్యవస్థలో మానవులు తప్పుచేయడానికి వెనుకంజవేస్తారు. కాబట్టి ప్రాకృతిక వ్యవస్థలో శాంతి, మంచితనం, పరస్పర సహాయం, రక్షణ వుండేవి.

లాక్ వర్ణించిన ప్రాకృతిక వ్యవస్థను రెండు ముఖ్యలక్షణాలు వున్నాయని చెప్పవచ్చును. అవి (1) సంపూర్ణ స్వేచ్ఛ, (2) సమానత్వం. ప్రతివ్యక్తి ఇతరులకు లోబడకుండా తాను ఇష్టపడినరీతిలో జీవించవచ్చు. స్వేచ్ఛ అంటే విచ్చలవిడిగా ప్రవర్తించడం కాదు అని లాక్ వివరించాడు. ప్రతివ్యక్తి సహజన్యాయ సూత్రాలకు కట్టుబడి వ్యవహరించాలి. వ్యక్తిగత స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను పాథమిక హక్కులుగా పరిగణించి లాక్ సమర్థించాడు. ప్రాకృతిక వ్యవస్థలో ఏ వ్యక్తికి ఇంకొక వ్యక్తిని బలవంతం చేయడానికిగాను, శాసించడానికి గాని హక్కులేదని లాక్ చెప్పాడు. మానవులందరూ సమానమే. సహజస్వేచ్ఛను పొందటానికి ప్రతివ్యక్తికి సమానహక్కు గలదు. అందరు శక్తిసామర్థ్యాలలో సమానులని అర్థంకాదు. హక్కుల విషయంలో మానవులందరూ సమానులని అర్థం. హాబ్స్ సిద్ధాంతంలో ప్రాకృతిక వ్యవస్థలో మానవులకున్న స్వేచ్ఛ, సమానత్వం యుద్ధపరిస్థితికి దారితీసింది. కాని లాక్ సిద్ధాంతంలో సహజన్యాయం వుండటంవల్ల ప్రాకృతిక వ్యవస్థ శాంతిమయం అయింది. ఆత్మహత్య చేసుకొనే హక్కుగాని, హత్యచేసేహక్కు గాని ఎవరికి లేదని లాక్ నిర్ద్వందంగా చెప్పాడు. లాక్ చెప్పిన ప్రాకృతిక వ్యవస్థ ప్రభుత్వంలేని పౌరసమాజం వంటిది. ప్రాకృతిక వ్యవస్థ సంపూర్ణ వ్యవస్థకాదు. ఎందుకంటే ప్రాకృతిక వ్యవస్థలో కొన్ని దోషాలున్నాయి. ప్రాకృతిక వ్యవస్థలో సహజన్యాయానికి అర్థవివరణ ప్రతివ్యక్తి చేయొచ్చు. ప్రతివ్యక్తి అంతో ఇంతో స్వార్థపరుడు కాబట్టి తీర్పు పక్షపాతంగా వుంటుంది. తీర్పును అమలుచేయడానికి వ్యక్తికి తగినంత చొరవ వుండదు. ఒకేరకం తప్పుకు వివిధరకాలు తీర్పులు, వివిధ రకాల శిక్షలు వుంటాయి. ఎందుకంటే ఒకే రకం తప్పుకు వేరువేరు వ్యక్తులు శిక్షవిధిస్తారు కాబట్టి. ఈ పరిస్థితులవల్ల ప్రాకృతిక వ్యవస్థలో మానవుల శాంతియుత జీవిత పరిస్థితులకు కొన్ని యిబ్బందులు ఎదురైనాయి. ముఖ్యంగా హీనజనుల యొక్క అవినీతి, దుష్టబుద్ధి వల్ల ప్రాథమిక వ్యవస్థలో శాంతికి భంగం కలిగింది. ఈ పరిస్థితి ఏర్పడటానికి ముఖ్యంగా మూడు కారణాలను లాక్ చెప్పాడు. అవి (1) అందరికి సమానంగా వర్తించే శాసనాలు చేసేశాసనసభ, లేకపోవడం (2) అటువంటి శాసనాలకు నిష్పక్షపాతంగా అర్థవివరణిచ్చి తీర్పులుచెప్పే న్యాయమూర్తి లేకపోవటం (3) న్యాయమూర్తులిచ్చిన తీర్పులను అమలుచేసే కార్యనిర్వహకశాఖ లేకపోవటం ప్రాకృతిక వ్యస్థలో మానవులకు కలిగిన ఇబ్బందులను తొలగించడానికి పైనచెప్పిన మూడు వ్యవస్థలతోకూడిన పౌరప్రభుత్వాన్ని స్థాపించడమే మార్గమని లాక్ భావించాడు.

## 7.4 సామాజిక ఒడంబడిక - పౌరసమాజం, ప్రభుత్వం స్థాపన :

ప్రాకృతిక వ్యవస్థలో ఉన్న లోపాల వల్ల ఏర్పడిన ఇబ్బందులను తొలగించుకోవడానికి మానవులు పరస్పర అంగీకారం ద్వారా ఒక ఒడంబడిక చేసుకొని దాని ఫలితంగా రాజకీయ సమాజాన్ని ఏర్పరచుకున్నారని లాక్ చెప్పాడు. ఈ ఒడంబడిక వల్ల ప్రజలందరు ఒక సమిష్టి పౌరవ్యవస్థగా (Body Politic) ఏర్పడ్డారు.

ఈ ఒడంబడిక ఏకగ్రీవంగా ప్రజలందరి సమ్మతితో జరిగింది. ఈ ఒప్పందాన్ని అంగీకరించినవారే. రాజ్యాధికారానికి బద్ధులై వుంటారు. అంగీకరించినవారు ప్రాకృతిక వ్యవస్థలో వుంటారు. బలవంతంచేసి పౌరసమాజంలో సభ్యునిగా చేరమనడం అ ప్రజాస్వామ్యమని లాక్ భావించాడు. ఈ ఒప్పందం ద్వారా సహజన్యాయాన్ని అర్థవివరణ చేసి అమలుచేసే హక్కును పౌరసమాజానికి ప్రజలు అర్పించారు. మిగిలిన హక్కులు ప్రజలకే వున్నాయి. పౌరసమాజం దాని అధికారాన్ని ప్రజల ఆస్తిని, స్వేచ్ఛను కాపాడటానికి, రాజ్యరక్షణకు మాత్రమే ఉపయోగించాలని లాక్ వివరించాడు. రాజ్యాధికారం ఈ విధికి మాత్రమే పరిమితం అయిఉండాలి. ఆస్తి, స్వేచ్ఛ, సమ్మతి చట్టబద్ధమైన రాజకీయాధికారం యొక్క ముఖ్య సూత్రాలని లాక్ చెప్పాడు.

లాక్ ప్రతిపాదించిన సామాజిక ఒడంబడికకు నాలుగు ముఖ్యలక్షణాలున్నాయి. అవి :

1) ప్రజల సహజ స్వేచ్ఛను, ఒడంబడికను ఉపయోగించి వీలైనంతవరకు పరిరక్షించడం. ఈ లక్ష్యసాధనకు ప్రజలు సహజ న్యాయాన్ని అమలుచేసే హక్కును మాత్రమే వదులుకొన్నారు. మిగిలిన హక్కులన్ని ప్రజలకే వున్నాయి. మానవులు స్వాభావికంగా స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమానత్వంలో సమానులు కాబట్టి, ఒడంబడిక ప్రజలందరి సమ్మతితో జరిగింది.

2) ఒడంబడిక స్వేచ్ఛగా ఉన్న వ్యక్తుల మధ్య వారి పరస్పర అంగీకారంతో జరిగింది. ఇది పాలకులకు పాలితులకు మధ్య జరగలేదు.

3) పౌరసమాజ స్థాపనకి జరిగిన ఈ ఒడంబడిక ఒకే ఒకసారి జరుగుతుంది. అయితే భావితరాలవారి అంగీకారాన్ని ఈ ఒడంబడికకు ఏవిధంగా పొందవచ్చు అన్నదే ఒక సమస్య. ఈ సమస్య పరిష్కారానికి లాక్ "మౌన అంగీకారం" (Tacit Concent) పద్ధతిని సూచించాడు. వ్యవస్థీకృత ప్రభుత్వం యొక్క రక్షణ, లాభాలను అనుభవించడానికి రాజ్యంలో వయోజనులు అంగీకరిస్తే, వారు మొట్టమొదటి ఒడంబడికను అంగీకరించినట్లే అని భావించవచ్చు అని లాక్ చెప్పాడు. కాని ఈ వివరణ అంత సమంజసంగా లేదని విమర్శకుల అభిప్రాయం.

4. ఒడంబడికకు బాధ్యులైన వారందరు మెజారిటీ పాలనను అంగీకరించారు. మెజారిటీ పాలన రెండు కారణాలవల్ల అవసరమని లాక్ చెప్పాడు. (1) పౌరసమాజం ఏకమొత్తంగా వ్యవహరించాలంటే మెజారిటీ పాలన ఒక్కటే మార్గం. (2) మెజారిటీ పాలనకు ప్రత్యామ్నాయమైన "ప్రజలందరి ఏకగ్రీవ నిర్ణయాల ప్రకారం పాలించడం" ఆచరణలో సాధ్యపడదు. పౌరసమాజస్థాపనకు ఒడంబడిక చేసుకొన్న సమయంలో మైనారిటీ మెజారిటీ పాలనకు ఒప్పుకున్నారని లాక్ చెప్పాడు. కాని, మెజారిటీ నియంతృత్వం నుండి మైనారిటీకి ఈ విషయంలో లాక్ రక్షణ కల్పించలేకపోయాడు.

మెజారిటీ పాలనను సమర్థించడంలో లాక్ ప్రజాస్వామ్యవాదని, ఆచరణశీలుడని తెలుస్తుంది. లాక్ ఉదారవాదని కూడా స్పష్టమౌతుంది. రాజ్యదైనందిన పాలనా కార్యకలాపాలలో ప్రజలందరి సమ్మతి అవసరం లేదని లాక్ భావించాడు. లాక్ మైనారిటీపాలన శక్తిసామర్థ్యాలను కొంతవరకు తక్కువ అంచనా వేశాడు.

లాక్ సామాజిక ఒడంబడికను ఒక సాధనంగా ఉపయోగించి చట్టబద్ధమైన రాజకీయాధికారం, ప్రజల సమ్మతి నుండి రాజ్యానికి లభించిందని లాక్ చెప్పాడు. అటువంటి అధికార లక్ష్యాలను ప్రజలే నిర్ణయిస్తారని లాక్ చెప్పాడు.

లాక్ ఒడంబడిక భావనను ఉపయోగించి ప్రభుత్వసంస్థలను ఏర్పరచటంలో కొంత అనిశ్చితి ఉత్పన్నమైందని చెప్పవచ్చు. రాజ్యానికి ప్రభుత్వానికి మధ్య బేధాన్ని చెప్పిన తొలి రచయితలలో లాక్ ఒకడు. సామాజిక ఒడంబడిక ద్వారా రాజ్యం ఏర్పడిందని లాక్ చెప్పాడు. కాని ప్రభుత్వాన్ని ఎప్పుడు ఏవిధంగా స్థాపించారు ? ఈ ప్రశ్నకు ప్రత్యక్ష సమాధానం లాక్ సిద్ధాంతంలో లేదు. కొంతమంది అభిప్రాయము ప్రకారం లాక్ సిద్ధాంతంలో రెండు ఒడంబడికలు వున్నాయి. ఒక ఒడంబడిక ద్వారా రాజ్యం ఏర్పడింది. రెండో ఒడంబడిక ద్వారా ప్రభుత్వం ఏర్పడింది. మరికొంతమంది ప్రకారం అభిప్రాయము లాక్ సిద్ధాంతంలో ఈ రెండు ఒడంబడికలు అంతర్నిహితంగా వున్నాయి. ఇంకా కొంతమంది ప్రకారం ఒడంబడిక ద్వారా రాజ్యం ఏర్పడిన తక్షణమే అది చేసిన మొట్టమొదటి పని ప్రభుత్వాన్ని ఏర్పరచటం. ఈ వివరణ బలహీనమైనదని ఒక వాదన వుంది. ఈ వాదననుసరించి రాజకీయ సమాజం యొక్క ముఖ్యమైన గుర్తు ప్రభుత్వం. రాజ్యంయొక్క ముఖ్యభాగం ప్రభుత్వం కాబట్టి రాజ్యం ప్రభుత్వం ఏకకాలంలో ఏర్పడి వుండవచ్చు అని చెప్పవచ్చును. ఈ వివరణ ఆమోదయోగ్యమైనదని చెప్పవచ్చును.

## 7.5 ప్రభుత్వం :

లాక్ రాజ్యానికి ప్రభుత్వానికి మధ్య బేధాన్ని స్పష్టం చేశాడని మనం ఇదివరకే తెలుసుకున్నాం. సామాజిక ఒడంబడిక ద్వారా ఏర్పడిన పౌరసమాజం, దాని తరపున పాలించడానికి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. ప్రజల సమ్మతి నుండి ప్రభుత్వానికి చట్టబద్ధమైన రాజకీయాధికారం యొక్క లక్ష్యాలను ప్రజలే నిర్ణయిస్తారు. ముఖ్యంగా ఆస్తిని, స్వేచ్ఛను, ఇతర సమజహక్కులను కాపాడటమే ప్రభుత్వం బాధ్యత.

పాలకులకు - పాలితులకు మధ్య ఎటువంటి సంబంధాలుండాలి ? ఈ ప్రశ్నకు సమాధానముగా "ఒప్పందం" భావనకంటే "ధర్మసంస్థ" భావన (Concept of a Trust) సరిపోతుందని లాక్ చెప్పాడు. ఎందుకంటే "ఒప్పందం" భావనలో ఇరుపక్షాలు వుంటాయి. ఇరుపక్షాలవారికి హక్కులు, బాధ్యతలు వుంటాయి. దీనికి భిన్నంగా ధర్మకర్తృత భావనలో మూడు పక్షాలుంటాయి. అవి (1) ధర్మకర్త (Trusty) ,(2) Trustor, (3) Beneficiary (లబ్ధిదారు). ప్రభుత్వం - ప్రజలు మధ్య సంబంధాలు సందర్భంలో ధర్మకర్త ప్రభుత్వం అయితే, మిగిలిన రెండు (Trustor, Beneficiary,లబ్ధిదారు) ప్రజలే. ధర్మసంస్థ భావనలో హక్కులని, లబ్ధిదారు (ప్రజలు)కే వుంటాయి. బాధ్యతలన్నీ ధర్మకర్తే (పాలకులు) వహించాలి. ధర్మకర్తలు (ప్రభుత్వం) ప్రజలకు విశ్వాసపాత్రులుగా వున్నంతకాలం వారికి కర్తవ్య నిర్వహణలో స్వేచ్ఛగా వ్యవహరించడానికి సముచితంగా అనుమతించాలని లాక్ భావించాడు.

### 7.5.1 ప్రభుత్వంపై పరిమితులు :

ఐరోపా రాజకీయ సాంప్రదాయంలో ధర్మకర్త భావన చాలా పురాతనమైనది. ఈ భావన ముఖ్యవుద్దేశ్యం ప్రభుత్వ అధికారంపై పరిమితులు విధించడం.

లాక్ "Second Treatise" లో ప్రభుత్వంపై నిర్దిష్టమైన పరిమితులను పేర్కొన్నాడు. ప్రభుత్వ అధికారాలను విధులను మూడు శాఖల మధ్య విభజించాడు. అవి (1) శాసనసభ, శాసనాలు చేయడమే దీని ముఖ్యవిధి. (2) కార్యనిర్వాహకశాఖ, శాసనాలను అమలుపరచడమే దీని పని. (3) ఫెడరేటివ్, (Fedarative) ఇది విదేశ వ్యవహారాలను నిర్వహిస్తుంది. దేశరక్షణ, యుద్ధం ప్రకటించడం, శాంతి ఒడంబడికలను చేయడం దీనిపని.

ప్రభుత్వ అంగాలన్నింటిలో శాసననిర్మాణ శాఖ అత్యున్నతమైనది. ఇది ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. కార్యనిర్వాహకశాఖ శాసనసభకు లోబడిపనిచేస్తుంది. ఇది ఎప్పుడైనా కార్యనిర్వాహక పాలకవర్గాన్ని మార్చవచ్చును. లేదా కొత్తగా ఏర్పాటు చేయవచ్చును. శాసనసభ అధికారం అత్యున్నతమైనది. అయినప్పటికి దాని అధికారానికి అడ్డులేదని భావించరాదని లాక్ చెప్పాడు. శాసనసభ అధికారాలపై ఈక్రింది పరిమితులున్నాయని లాక్ వివరించాడు.

1. సమాజాన్ని కాపాడే పవిత్ర భాద్యత శాసనసభపై వున్నది. అంటే ప్రాణాలను, ఆస్తులను, స్వేచ్ఛను కాపాడాలి.
2. శాసనసభ అత్యున్నత అధికారాన్ని సక్రమపద్ధతిలో శాసనాలను చేయడం ద్వారా ప్రకటించాలి.
3. శాసనాలు అందరికి సమానంగా వర్తించేటట్లు చేయాలి.
4. ప్రజల సమ్మతిగాని, వారి ప్రతినిధుల సమ్మతి గాని లేనిదే పన్నులు విధించి వసూలు చేయరాదు.
5. శాసనాలు చేసే అధికారాన్ని శాసనసభ ఎవరికి దత్తం చేయరాదు.

శాసనసభ అధికారాలు, విధులు నిర్వాహణపై సమీక్షచేసే అధికారం ప్రజలకుంది. శాసనాసభా పనితీరుపై ప్రజలకు అసంతృప్తి కలిగితే శాసనసభను మార్చివేసే హక్కు ప్రజలకు వుందని లాక్ చెప్పాడు. మిగిలిన రెండు

శాఖలపై ఇంత కంటే ఎక్కువ పరిమితులున్నాయని లాక్ చెప్పాడు. కార్యనిర్వాహక శాఖలో న్యాయశాఖ ఒక భాగమే.

ఇంకొక పరిమితి అధికారాల విభజన సిద్ధాంతాన్ని (Theory of Separation of Powers) వర్తింపచేయడం. ప్రభుత్వ అధికారాన్ని సమప్రాబల్యంతో వుంచడానికి ప్రభుత్వ వివిధ భాగాలను (శాసనసభ, కార్యనిర్వహక శాఖ, ఫెడరేటివ్ శాఖ) విభిన్న వ్యక్తుల చేతిలో లాక్ వుంచాడు. ప్రభుత్వ మూడురకాల విధుల మధ్య విభేదాలను వివరించాడు. ఈ విధులను విభజించినప్పటికి ఆచరణలో వాటి సమ్మేళనాన్ని లాక్ అనుమతించాడు. ఉదాహరణకు కార్యనిర్వాహక విధులు విదేశ వ్యవహారాలకు సంబంధిత కార్యకలాపాలు ఒకరిచేతిలో వుండొచ్చని చెప్పాడు. కార్యనిర్వాహకశాఖ శాసననిర్మాణశాఖలో ఒకభాగమని కూడా చెప్పాడు. శాసనసభకు మిగిలిన శాఖలన్నింటిపై అత్యున్నతాధికారం వుందని వివరించాడు.

పై విధంగా లాక్ పరిమిత ప్రభుత్వాన్ని సమర్థించాడు. మానవుని హేతుబుద్ధి, అనుభవం వల్ల నిరపేక్ష రాజకీయ అధికారం అంగీకారంకాదని లాక్ చెప్పాడు. రాజ్యం ప్రజల గురించి వుందిగాని, ప్రజలు రాజ్యం గురించిలేరు. మంచి రాజ్యలక్షణాలలో ఇది ఒకటి.

రాజ్యం, ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా సమన్యాయ పాలనకి కట్టుబడి పనిచేయాలి. రాజ్యానికి అధికారాలు ప్రజలు నుండి సంక్రమించినవి కాబట్టి ప్రభుత్వం అటువంటి అధికారాలకు ఒక ధర్మకర్తగా మాత్రమే వ్యవహరిస్తుంది. ప్రభుత్వం ప్రజల సమ్మతిపై ఆధారపడివుంటుంది.

రాజ్య అధికారాలు, విధులు, ఒక్క రాజకీయ విషయాలకే సంబంధించి వుండాలని లాక్ వివరించాడు. రాజకీయేతర విషయాలలో రాజ్యంకాని, ప్రభుత్వం కాని జోక్యం చేసుకోకూడదు. ప్రజల భద్రత, సంక్షేమం పేరుతో అధిక అధికారాలను కావాలనే హక్కు రాజ్యానికి, ప్రభుత్వానికిలేదని లాక్ చెప్పాడు. ప్రభుత్వాన్ని ఏర్పరచి, రద్దుచేసే అత్యున్నత అధికారం, పూర్తి హక్కు సమిష్టిగా ప్రజలకు వుందని లాక్ ప్రకటించాడు. ఒక ప్రభుత్వాన్ని రద్దుచేసినట్లైతే ప్రజలు ప్రాకృతిక వ్యవస్థకు తిరిగిపోతారని అర్థంకాదు. ఎందుకంటే రద్దైన ప్రభుత్వస్థానంలో ఇంకొక ప్రభుత్వాన్ని ఏర్పరిచేహక్కు ప్రజలకు వుందని లాక్ చెప్పాడు.

ప్రభుత్వం రాజకీయాధికారాన్ని దుర్వినియోగం చేసినా, అన్యాయంగా ఉపయోగించినా అటువంటి అధికారాన్ని ప్రతిఘటించే హక్కు ప్రజలకు వుంది.

ప్రభుత్వంపై పరిమితులు వుండాలని లాక్ చెప్పినప్పటికి, ప్రభుత్వం పటిష్టంగా పనిచేయటానికి ప్రభుత్వానికి కావలసినంత అధికారం వుండాలి. అధికారాన్ని సక్రమంగా నిర్వహించడానికి అవసరమయిన వివేచనాధికారం కూడా ప్రభుత్వానికి ఉండాలని చెప్పాడు. చట్టం ప్రతి చిన్న విషయానికి సంబంధించిన వివరాలను పొందుపరచదు. కొన్ని సందర్భాలలో అక్షరాల చట్టం చెప్పినట్లుచేస్తే ప్రజాశ్రేయస్సుకే నష్టం కలగవచ్చు. అటువంటి పరిస్థితులకు అత్యవసర అధికారాలు మంచివని లాక్ నమ్మాడు. పాలకులు దుర్భలులు అయినప్పుడు ఇటువంటి అధికారాలు తగ్గించటం మంచిదని చెప్పాడు. బలమైన పాలకుల విషయంలో ప్రత్యేక అధికారాలు అవసరముండవని లాక్ అభిప్రాయపడ్డాడు. అటువంటి పాలకుడు ప్రజల సంక్షేమానికి తను ధర్మకర్తనని భావిస్తాడు.

గ్రీకు తత్వవేత్త చెప్పినట్టే లాక్ కూడా ప్రభుత్వాన్ని మూడురకాలుగా విభజించినాడు. (1) ప్రజాస్వామ్యం, (2) స్వల్పజన పాలన, (3) రాజరికం. ఈ మూడింటిలో ప్రజాస్వామ్య పరిపాలన ఒక్కటే మంచిదని లాక్ భావించాడు. విప్లవానంతరం సెటిల్‌మెంట్ తర్వాత ఏర్పడిన ఇంగ్లీష్ ప్రభుత్వ విధానానికే లాక్ ప్రాధాన్యమిచ్చాడు. ఈ ప్రభుత్వ విధానంలో

సాధారణ పరిస్థితులలో ప్రజలపాత్ర వారి ప్రతినిధుల సభను ఎన్నుకోవడానికే పరిమితమవుతుంది. ఎన్నుకొన్న తరువాత ప్రతినిధుల సభ సర్వాధికారి. కార్యనిర్వాహణ అధికారం ప్రత్యేక వ్యక్తుల చేతులలో వుంచాలని చెప్పాడు. కాని శాసన నిర్మాణంలో కొంతపాత్రను ఇవ్వాలని చెప్పాడు.

## 7.6. ప్రతిఘటన (తిరుగుబాటు) హక్కు :

ప్రజల సమ్మతిపై ప్రభుత్వం ఆధారపడివుందని లాక్ చెప్పాడు. అంతేకాకుండా పరిమిత ప్రభుత్వాన్ని సమర్థించాడు. ప్రభుత్వానికి ప్రజల ఆస్థిని, ప్రాణాలను, స్వేచ్ఛనుకాపాడటానికి అవసరమగు పరిమిత అధికారాన్ని మాత్రమే ప్రజలు ఇచ్చారు. ప్రభుత్వానికిచ్చిన ఈ రాజకీయాధికారం "విశ్వాసబద్ధ అధికారం" (Fiduciary Power) మాత్రమే. ఈ అధికారాన్ని ప్రజాప్రయోజనాలు దృష్ట్యా మాత్రమే ప్రభుత్వం ఉపయోగించాలని లాక్ చెప్పాడు. ప్రభుత్వానికున్న "విశ్వాసబద్ధ అధికారం" ఒక బాధ్యతవంటిదని లాక్ భావించాడు.

ఎప్పుడైతే ప్రజల సమ్మతిపై ప్రభుత్వం ఏర్పడిందో అప్పుడు ప్రజలకు ప్రభుత్వాన్ని ప్రతిఘటించే హక్కు వుందని చెప్పవచ్చును. అయితే ఏయే పరిస్థితులలో ప్రజలు ప్రభుత్వంపై తిరుగుబాటు చేయవచ్చును ? అన్న ప్రశ్న వేసుకొని ఈ క్రింది పరిస్థితులలో ప్రజల తిరుగుబాటును లాక్ సమర్థించాడు. (1) రాజు ఒడంబడిక ప్రకారం తనకు సంక్రమించిన అధికారాలను అధిగమించినపుడు (2) ప్రభుత్వం ప్రజల ఆస్థిని కాపాడలేకపోయినా (3) వ్యక్తి స్వేచ్ఛను ఉల్లంఘించినపుడు, తగ్గించినపుడు (4) ప్రజలను బానిసలుగా తయారుచేయడానికి ప్రయత్నించినపుడు (5) రాజు నిరంకుశ న్యాయవ్యతిరేకి అయినపుడు ప్రజలకు ప్రభుత్వంపై తిరుగుబాటుచేసే హక్కు వుందని లాక్ గుర్తించాడు. అన్నింటికంటే ముఖ్యంగా ప్రజల విశ్వాసానికి విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహరించినపుడు అటువంటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటుచేసే హక్కు ప్రజలకు వుందని లాక్ గట్టిగా చెప్పాడు. ఇది పౌరులహక్కే కాకుండా విధికూడా అని లాక్ భావించాడు.

పై పరిస్థితులు ఏర్పడినపుడు ప్రజలు ప్రభుత్వానికి ఇచ్చిన అధికారాన్ని ఉపసంహరించుకోవచ్చును. రద్దైన ప్రభుత్వం స్థానంలో ప్రజలు ఇంకొక ప్రభుత్వాన్ని ఏర్పరచుకోవచ్చును. ప్రభుత్వం మారినంత మాత్రాన పౌరసమాజం మారదు. కాబట్టి ప్రభుత్వానికి ప్రత్యామ్నాయం అరాచకమని ప్రజలు భయపడనక్కరలేదు. ప్రతిఘటన సిద్ధాంతం నిరంతరం సమాజ అస్థిరత్వానికి దారితీస్తుందని భావించనక్కరలేదు. ఎందుకంటే ప్రజలు సాధారణంగా సాంప్రదాయవాదులు. చీటికిమాటికి ప్రతిఘటించడాని కంటే కష్టపడడానికే ఇష్టపడతారు. తిరుగుబాటు చేసేహక్కును సమర్థిస్తూ ప్రభుత్వాన్ని ప్రతిఘటించటం వల్ల సమాజంలో అస్థిరత్వం ఏర్పడదని లాక్ ఎంతో నమ్మకంతో చెప్పగలిగాడు. లాక్ జీవితకాలంలో ఇంగ్లాండులో అనేక ప్రభుత్వాలు మారాయి. కాని సమాజంలో ఎటువంటి మార్పు కలగలేదు. కాబట్టి ప్రజలు నియంతృత్వాన్ని సహించనక్కరలేదని లాక్ చెప్పాడు.

ప్రజలకు ప్రభుత్వంపై తిరుగుబాటు చేసే హక్కువుందని లాక్ గుర్తించాడు. కాని తిరుగుబాటు ఎప్పుడు, ఏవిధంగా ఎవరి వలన జరగాలన్నది లాక్ నిర్దిష్టంగా చెప్పలేదు. అతనికాలంలో 2వ జేమ్స్ రాజును రాజ్యభ్రష్టుడిని చేసిన తిరుగుబాటు సాంప్రదాయక తిరుగుబాటు. దానిని బాగా సమర్థించాడు. కానీ సామాన్య తిరుగుబాటు దారులను ప్రోత్సహించే మనస్తత్వం లాక్‌కి లేదు. ఎందుకంటే అతను సుఖప్రదమైన ఉన్నతవర్గానికి చెందిన చాలా జాగ్రత్తైన వ్యక్తి. అతను శాంతి బధ్రతలకు ప్రాధాన్యతనిచ్చే మనిషి.

## 7.7 సహజ న్యాయం - సహజ హక్కుల సిద్ధాంతం - ఆస్థిహక్కు :

లాక్ రాజనీతి సిద్ధాంతంలో సహజన్యాయ భావన అతి ముఖ్యమైనది. సహజన్యాయం లిఖితపూర్వకమైనది కాదు. ఇది మానవునికి ఉన్న హేతుబుద్ధిపూర్వకమైనది. మానవునికి దైవం ఇచ్చివిచక్షణా జ్ఞానమే సహజన్యాయానికి మూలం. దైవం జారీచేసిన నిష్పక్షపాతమైన శాసనమే సహజన్యాయమని లాక్ భావించాడు. రాజనీతి తత్వవిచార చరిత్రలో సహజన్యాయభావన చాలా పురాతనమైనది. ఈ భావన స్టాయిక్స్‌తో ప్రారంభమైనది. మనుషులు చేసే శాసనాలు కంటే ముఖ్యమైనది. వాటికంటే ముందునుంచి సహజ న్యాయం వుంది.

లాక్ తన "Second Treatise on Civil Government" అనే గ్రంథంలో సహజన్యాయాన్ని గురించి చర్చించాడు. సహజన్యాయం మార్గదర్శకత్వంననుసరించి ప్రాకృతిక వ్యవస్థలో మానవులు జీవించేవారు. వారిహక్కులు బాధ్యతలను సహజన్యాయమే నిర్ణయించేది. మానవులుకున్న నిజాయితీ, నమ్మకం వంటి గుణాలను సహజన్యాయం వృద్ధిచేస్తుంది. ఈ గుణాలు మానవులకు సమాజ సభ్యులుగా కాకుండా, వ్యక్తులుగా సంక్రమించినవి. సహజన్యాయం వృద్ధిచేస్తుంది. ఈగుణాలు మానవులకు సమాజ సభ్యులుగా కాకుండా, వ్యక్తులుగా సంక్రమించినవి. సహజన్యాయం ప్రజల సమ్మతిపై ఏర్పడిన న్యాయబద్ధమైన ప్రభుత్వం పట్ల ప్రజలు విధేయులాగా వుండేటట్లు చేస్తుంది. రాజకీయ సంస్థలను, వాటి ప్రవర్తనను ప్రభావితం చేసి నిర్ణయించటానికి సహజన్యాయం ఒక ప్రమాణంగా వుపయోగపడుతుందని లాక్ చెప్పాడు. మానవులు రాజ్యానికి ఎందుకు బద్ధులై వుండాలి అనే సమస్యకు లాక్ ఇక్కడ పరిష్కార మార్గాన్ని సూచించాడు. సహజన్యాయం ఒకప్రమాణంగా ఉపయోగపడుతుందని లాక్ చెప్పాడు. సహజన్యాయం ప్రకారంగా ప్రజలకు ప్రభుత్వంపై తిరుగుబాటు చేసేహక్కు వుందని లాక్ చెప్పాడు.

సహజహక్కుల సిద్ధాంతాన్ని లాక్ సమర్థించాడు. సహజహక్కులు మూడు రకాలని లాక్ చెప్పాడు. అవి (1) ప్రాణరక్షణహక్కు, (2) స్వేచ్ఛహక్కు, (3) ఆస్థిహక్కు. రాజ్యం ఏర్పడకముందే ప్రజలకు ఈ హక్కులున్నాయి. ఈ మూడు హక్కులు మనిషికి పుట్టుకతోనే సహజంగా వచ్చినవి. వీటికి మూలం సహజన్యాయం. ప్రభుత్వం ఏర్పడకముందే మానవులు స్వేచ్ఛగా, స్వతంత్రంగా, సమానంగా అన్యాక్రాంతంకాని ఈ మూడు సహజహక్కులను అనుభవించేవారు. సహజహక్కులను కాపాడుకోవటానికే ఒడంబడిక ద్వారా రాజ్యాన్ని, ప్రభుత్వాన్ని ప్రజలు ఏర్పరచుకొన్నారు.

పైన వివరించిన మూడు సహజహక్కులులో ఆస్థిహక్కు ముఖ్యమైనదని లాక్ భావించాడు. ఆస్థిహక్కుతో మిగిలిన రెండు హక్కులు - ప్రాణరక్షణ హక్కు, స్వేచ్ఛహక్కు ఇమిడి ఉన్నాయని లాక్ భావించాడు. వ్యక్తి స్వేచ్ఛగా జీవించడానికి, వికాసానికి ఆస్థి అవసరమని లాక్ చెప్పాడు. ఆస్థిని కాపాడటమే ప్రభుత్వం ముఖ్యవిధి అని లాక్ చెప్పారు. ప్రాకృతిక స్థితిలో వస్తువులను, మానవుడు తన శారీరక శ్రమను, నేర్పును జోడించి ఆ వస్తువులను సంపాదించినట్లైతే ఆ వస్తువులు అతని సొంతం అవుతాయి. ఆవిధంగా సంపాదించిన వస్తువు అతని ఆస్థి అవుతుంది. ఎందుకంటే శారీరకశ్రమ శ్రామికునికి మాత్రమే చెందిన ఆస్థి. మానవుడు శారీరక శ్రమ ద్వారా ఏ వస్తువును సృష్టించినా అది అతనికే చెందుతుంది. లాక్ దృష్టిలో ఆస్థికి మూలం "శ్రమ". మానవునికి ఆస్థిపై హక్కు కలుగుతుంది.

లాక్ వ్యక్తి ఆస్థిపై కొంతపరిమితిని విధించాడు. ఒక మనిషి ఎంత భూమినైతే దున్ని, విత్తనాలు నాటి, అభివృద్ధిచేసి వ్యవసాయం చేయగలడో ఆ భూమి నుంచి వచ్చిన పంటను అతను ఉపయోగించవచ్చును అని లాక్ చెప్పాడు. ఈ విధంగా సంపాదించిన ఆస్తిని భంగంచేయటానికిగాని, పరిమితిని చేయటానికిగాని, నష్టపరచటానికిగాని, ఏ వ్యక్తికి, పౌరసమాజానికి, ప్రభుత్వానికి అధికారం లేదని లాక్ వివరించాడు. వ్యక్తిగత ఆస్థిపై పరిమితి విధించేహక్కు అధికారం

ప్రభుత్వానికి ఉండకూడదని లాక్ చేసిన వాదన సమర్ధనీయమే. స్వంత ఆస్థి వల్ల వ్యక్తికి ఆత్మవిశ్వాసం భద్రతలుగా కలుగుతాయి.

ప్రభుత్వం ఆస్థిని రక్షించలేనప్పుడు ప్రజలు అటువంటి ప్రభుత్వాన్ని మార్చివేయవచ్చు. లాక్ విశ్లేషించిన సహజన్యాయం, సహజహక్కుల సిద్ధాంతం వ్యక్తివాద సిద్ధాంతానికి అధిక ప్రాముఖ్యతనిచ్చాయి. లాక్ చెప్పిన ఆస్థిహక్కు సిద్ధాంతం పెట్టుబడిదారి విధానానికి దోహదం చేసిందని మేక్‌ఫెర్సన్ వంటి విమర్శకులు అభిప్రాయపడ్డారు. ఈ విమర్శతో డన్, లాస్‌లెట్ వంటివారు ఏకీభవించలేదు. వ్యక్తి వికాసానికే లాక్ ఆస్తిని సమర్థిస్తున్నాడుగాని, ఇతరులను బానిసలుగా మార్చడానికి మాత్రంకాదని ఎబనిస్టీన్ చెప్పాడు. ఆస్థియొక్క సామాజిక స్వభావాన్నిబట్టి లాక్ పరిమిత ప్రభుత్వాన్ని సమర్థించాడు.

లాక్ సిద్ధాంతాన్ని వివిధ వర్గాలువారు ఉపయోగించారు. వారిలో ముఖ్యంగా భూపంపిణీని సమర్థించినవారు, సామ్యవాదులు ఉపయోగించారు. శ్రమ విలువ సిద్ధాంతం ఆధారంగా పెట్టుబడిదారి సిద్ధాంతాన్ని సామ్యవాదులు విమర్శించారు. లాక్ చెప్పిన ఆస్థి సింధానుబట్టి అతను వ్యక్తివాది అని మనం భావించవచ్చు.

## 7.8 రాజనీతి తత్వవిచారణ చరిత్రలో లాక్ స్థానం :

రాజనీతి తత్వవిచారణ చరిత్రలో లాక్ ప్రాముఖ్యతను నిర్ణయించేముందు అతని సిద్ధాంతంలో ఉన్న లోపాలను తెలుసుకుందాం. సామాజిక ఒడంబడిక సిద్ధాంతం తార్కికంగాగాని, వాస్తవంగాగాని సరిపోదని 18వ శతాబ్దం మొదటిలో హూమ్ చెప్పాడు. ఈ సిద్ధాంతానికి చారిత్రక ఆధారాలు లేవు. ఆదిమమానువునికి ఒడంబడిక అనే ఆధునిక భావన , ఆలోచన రాదు. రాజ్యస్థాపన లాక్ చెప్పినట్లు యాంత్రికంగా జరగలేదు. ఎన్నో శతాబ్దాలు కాలంలో క్రమేణా రాజ్యం అభివృద్ధి చెందింది.

లాక్ వివరించిన ఉదారవాద సిద్ధాంతంలో కొన్ని పరస్పర విరుద్ధాలున్నాయి. ఒకవైపు పరిమిత ప్రభుత్వాన్ని సమర్థిస్తూ, మరోవైపు ఆ ప్రభుత్వాన్ని ప్రభలంగా రూపొందించాడు. మెజారిటీ పాలనను సమర్థించాడు. అంటే శక్తివంతమైన ప్రభుత్వాన్ని సమర్థించడమే. ఒకవైపు మానవులందరూ సమానులని చెప్పాడు. మరోవైపు అతని ఉదారవాదం అసమాన ఆర్థిక పరిస్థితులకు దారితీస్తుంది. ఈవిధమైన లోపాలు లాక్ సిద్ధాంతంలో కనిపిస్తాయి.

పై లోపాలు ఉన్నప్పటికీ రాజనీతి తత్వవిచారణ చరిత్రలో లాక్‌కు ప్రముఖస్థానం వుంది. అతని సమకాలీన తత్వశాస్త్రం లాక్ రచనలలో పూర్తిగా అవతరించింది. అతని కాలంలో వుండే సమస్యలనే లాక్ తన రాజకీయ సిద్ధాంతంలో ఇమడ్చగలిగాడు. లాక్ ఉదారవాద, ప్రజాస్వామ్య తాత్వికుడుగా ఘనతకెక్కాడు.

లాక్ రచించిన "Second Treatise on Civil Government" ఆంగ్లో - అమెరికన్ ఆదర్శాలకు ఒక ఆదర్శంగా నిలిచింది. అతను వివరించిన రాజకీయతత్వం 18వ శతాబ్దం ఐరోపాలో విస్తృతంగా వ్యాపించింది. ఇంగ్లాండ్‌లో 1688లో జరిగిన గ్లోరియస్ రివల్యూషన్‌ను లాక్ సమర్థించాడు. ఆదేశంలో విగ్ పార్టీపాలనను, భూస్వాములను సమర్థించడానికి ఈ సిద్ధాంతాన్ని లాక్ ఉపయోగించాడు. స్పెన్స్, (Spence) ఒజిలిని (Ogilini) వంటి భూసంబంధిత సంస్కర్తలకు, భూస్వామ్యవ్యవస్థ వ్యతిరేకవాదనలకు లాక్ రాజకీయ సిద్ధాంతం ఉపయోగపడింది. ఇంగ్లాండ్‌లో రాజ్యాంగవాదం అభివృద్ధికి కూడా దోహదం చేసింది.

లాక్ రాజకీయ సిద్ధాంతానికి ఇంగ్లాండ్‌లో కంటే, ఫ్రాన్స్, అమెరికా దేశాలలో ఎక్కువఖ్యాతి లభించింది. ఫ్రెంచి విప్లవంపై లాక్ సిద్ధాంతం ప్రభావం ఘనంగావుంది. డిడిరాటో, వోల్తేరు, రూసో లాంటి ప్రసిద్ధి తాత్వికులను లాక్ రచనలు ఉత్తేజపరిచాయి. ఫ్రాన్సులో విమర్శకులు, సంస్కర్తలు ఫ్రాన్స్ నిరపేక్షరాజరికాన్ని ఫ్రెంచి విప్లవానికి ముందున్న సామాజిక అన్యాయాన్ని విమర్శించడానికి లాక్ సిద్ధాంతాన్ని ఉపయోగించారు. మాంటెస్క్యూ చెప్పిన అధికారాల విభజన సిద్ధాంతానికి లాక్ మార్గదర్శకుడు అయినాడు.

లాక్‌ను అమెరికా తాత్వికుడుగా పరిగణిస్తారు. అమెరికాలో లాక్ సిద్ధాంతానికి ఎక్కువ ఆదరణ లభించింది. అమెరికా స్వాతంత్ర్య ప్రకటనలపై లాక్ భావాల ప్రభావం ఘనంగా పడింది. లాక్ భావాలు అమెరికా ప్రజల యొక్క ఆర్థిక, సాంఘిక జీవనవిధానాన్ని ప్రభావితం చేశాయి. అంతేకాకుండా, వారి రాజ్యాంగతత్వాన్ని, రాజనీతితత్వాన్ని కూడా లాక్ ప్రభావితం చేశాడు. సాంప్రదాయ మితవాదం, పరిమిత ప్రభుత్వం, ఆస్థిహక్కు మొదలగు భావాలు లాక్ రచనల ప్రభావాల వల్ల అమెరికా రాజ్యాంగంలో చోటుచేసుకున్నాయి.

ఉదారరాజనీతి సిద్ధాంతానికి లాక్ మార్గదర్శకుడని చెప్పవచ్చును. వ్యక్తివాదం, స్వేచ్ఛ, పరిమిత ప్రభుత్వం, రాజ్యాంగబద్ధ అధికారం, సమన్యాయపాలన, మెజారిటిపాలన సూత్రం, అధికారాల విభజన సిద్ధాంతం, ప్రజల సార్వభౌమత్వం, ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం, ఆస్థిహక్కు, పౌరసమాజం, సమ్మతి సిద్ధాంతం, ప్రభుత్వంపై ప్రజలుతిరుగుబాటు చేసేహక్కు మొదలగునవి లాక్ ఉదారరాజకీయ సిద్ధాంతంలో ముఖ్య అంశాలని చెప్పవచ్చును. అతని తరువాత వచ్చిన ఉదారరాజకీయ తత్వవేత్తలు లాక్ రూపొందించిన మార్గాన్నే అనుసరించారు. 20వ శతాబ్దంలో లాక్ చెప్పిన ఉదారవాదం, దాని ప్రత్యర్థులైన ఫాసిజమ్, కమ్యూనిజమ్ సిద్ధాంతాలపై విజయాన్ని సాధించింది. లాక్ చెప్పిన ఉదారవాద సిద్ధాంతం నేటికీ ఆచరణీయం, ఆమోదయోగ్యం.

## 7.9 చదువదగిన పుస్తకాలు


1. H.J. Laski, "Political Thought in England from Locke to Bentham"
2. S. Mukherjee and Sushila Ramaswamy - "A History of Political Thought From Plato to Marx"
3. Dr. A.V. Subba Rao ఆధునిక పాశ్చాత్య రాజనీతి తత్వవిచారం.


ప్రశ్నలు :

1. లాక్ రచనలపై సమకాలీన పరిస్థితుల ప్రభావం, ఆ ప్రభావం ఫలితం ఏమిటో చర్చించండి.
2. లాక్ రాజనీతి సిద్ధాంతానికి, హాబ్స్ రాజనీతి సిద్ధాంతానికి మధ్యవున్న పోలికలు, వైరుధ్యాలను వివరించండి.
3. ప్రాకృతిక వ్యవస్థపై లాక్ అభిప్రాయాన్ని వ్రాయండి.
4. లాక్ ప్రతిపాదించిన సామాజిక ఒడంబడిక లక్షణాలను వివరించండి.
5. లాక్ రాజనీతి తత్వవిచారానికి చేసిన సేవను వివరించండి, లాక్ స్థానాన్ని గుర్తించండి.
6. పౌర సమాజం, ప్రభుత్వం, ప్రతిఘటన హక్కులపై లాక్ అభిప్రాయాలను వ్రాయండి.

**రచయిత : ఎస్. పోలినాయుడు**

పాఠం - 8

# సామాజిక ఒడంబడిక సిద్ధాంతం : రూసో

విషయసూచిక


8.0 పరిచయం
8.1 జీవిత విశేషాలు - రచనలు
8.2 ప్రాకృతిక వ్యవస్థ
8.3 సామాజిక ఒడంబడిక
8.4 జనేచ్ఛ - సార్వభౌమత్వం
8.4.1 విమర్శ
8.5 రాజ్యం - వ్యక్తి స్వేచ్ఛ
8.6 ప్రభుత్వం - ప్రభుత్వాల వర్గీకరణ
8.7 పౌరమతం (Civil Religion)
8.8 రూసో సంపూర్ణాధికార వాదా ? ఉదారవాదా ? ఫాసిస్టా ? కమ్యూనిష్టా ?
8.9 రాజనీతితత్వ శాస్త్ర చరిత్రలో రూసో స్థానం


## 8.0 పరిచయం :

18వ శతాబ్దపు ఫ్రెంచి అగ్రరాజనీతి తత్వవేత్తలలో జె.జె.రూసో ఒకడు. ఈ శతాబ్దాన్ని పాశ్చాత్యదేశాల నాగరికత చరిత్రలో "జ్ఞాన వికాసయుగం"గా చరిత్రకారులు చిత్రీకరించారు. జ్ఞానవికాస సిద్ధాంతాన్ని అనుసరించి మనిషి వివేకం హేతుబద్ధ పునాదులు ప్రాతిపదికగా సమాజాన్ని ఏర్పరచుకున్నాడు. ఈ సిద్ధాంతం రాజులకు, చర్చికి ఉన్న సాంప్రదాయ అధికారాన్ని త్రోసిపుచ్చింది. ఈ సిద్ధాంతం ఫలితంగా ఏర్పడిన విప్లవాలవల్ల ఆ కాలంలో వున్న సామాజిక వ్యవస్థలు అంతరించుకుపోయాయి. వాటి స్థానంలో కొత్త వ్యవస్థలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో రూసో రచనలు అధిక ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. రూసో చాలా సున్నితమైన, సుఖసంతోషాలు లేనివ్యక్తి. ఇతనికి జ్ఞాన వికాస వైజ్ఞానిక విషయాలలో సంపూర్ణ విశ్వాసం వున్నప్పటికీ, ఆధునిక వైజ్ఞానిక సమాజ జీవిత విధానాన్ని అతను తిరస్కరించారు. నిజానికి, రూసో అతని సిద్ధాంతాలలో ఈరెండు విషయాలను మేళవించారు. ఆధునిక రాజనీతితత్వంలో సామాజికదృష్టికి (Social Vision) సక్రమ పునాదులు రూసో సిద్ధాంతాలలో వున్నాయి. ఆధునిక యుగం రాజకీయ చైతన్యం మొత్తం ప్రధానంగా రూసో తత్వశాస్త్రంలో వుంది అనడం అతిశయోక్తికాదు.

## 8.1 జీవిత విశేషాలు - రచనలు :

రూసో జూన్ 28, 1712లో జనీవా నగరంలో ఒక మధ్యతరగతి కుటుంబంలో జన్మించాడు. జన్మించిన నెలరోజులలో రూసోతల్లి మరణించింది. అతని తండ్రి వృత్తి గడియారాలు తయారుచేయడం. రూసో పెంపకం, విద్యాభ్యాసంపట్ల తండ్రి ఎక్కువ ఆసక్తి చూపలేదు. ఫలితంగా రూసో చదువుకు స్వస్తిచెప్పి కొన్నాళ్ళు దేశదిమ్మరిగా గడిపాడు. రూసో

చిన్నతనం నుండి కాల్వినిజం (Calvinism) యొక్క నిరాడంబర విలువలను గ్రహించాడు. తన 30వ ఏట రూసో పారిస్‌కు వెళ్ళి అక్కడ డైడిరాట్‌తో స్నేహం చేశాడు. 1743 నుండి 1744 వరకు ఫ్రెంచి రాయబారిగా వెనీస్‌లో కార్యదర్శిగా పనిచేశాడు. వివిధ దేశాలు తిరిగిన తరువాత 1744లో తిరిగి పారిస్ చేరుకున్నాడు. 1753లో డిజాక్ అకాడమీ నిర్వహించిన వ్యాసరచన పోటీలో పాల్గొన్నాడు. రూసోకు ప్రథమ బహుమతిని తెచ్చిన "Discourse on the Science and Arts" అనే వ్యాసంతోనే అతనిపేరు నలుదిక్కులా వ్యాపించింది. ఫ్రెంచి మేధావి వర్గాలలో రూసోకు గుర్తింపు, ప్రవేశం లభించాయి. మతకారణంగా రూసో హింసకు గురైనాడు. అతని "సోషల్ కాంట్రాక్టు" "ఎమిలీ" గ్రంథాలను కాల్చివేశారు. జైలుశిక్ష పడుతుందనే భయంతో అతను స్విట్జర్‌లాండ్‌కు పారిపోయాడు. రూసో తన 66వయేట 1778లో పారిస్‌లో చనిపోయాడు.

రూసో ఎంతో ప్రతిభగల తాత్వికుడు, రచయిత. రూసో రచనలలో ముఖ్యమైనవి 1) "A Discourse on the Arts and Sciences" (1750), 2) Discourse on the Origin of Inequality (1755), 3) "Social Contract" (1762), 4) Emile (1762) రూసో గ్రంథాలన్నింటిలో సోషల్ కాంట్రాక్టు సుప్రసిద్ధమైంది. ఇది ఒక గొప్ప రాజకీయ గ్రంథం.

"A Discourse on the Arts and Sciences" గ్రంథంలో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంచడానికి బదులు అతనిలో అవినీతిని, చెడును కలిగించిందని రూసో వాదించాడు. అసహజ నాగరికతవల్ల ఏర్పడిన చెడ్డసంస్థల వల్ల మనిషి చెడిపోయాడని రూసో చెప్పాడు. The Origin of Inequality లో మనిషి అమాయకత్వాన్ని ప్రశంసించాడు. సమాజంలో అసమానతలు ఏర్పడటానికి, సమాజం క్షీణించటానికి ఆస్థి మూలకారణమని రూసో వివరించాడు. ఇది ఒక విప్లవాత్మక భావం. ఈ గ్రంథంలో రూసో సామాజిక సిద్ధాంతంలో తొలి ప్రయత్నం చేశాడని చెప్పవచ్చును. Emile గ్రంథలో చర్చి ఆధిపత్యం కిందవున్న సాంప్రదాయ విద్యావిధానాన్ని తీవ్రంగా విమర్శించాడు. ఈ విధానం స్థానంలో సహజ విద్యావిధానాన్ని రూసో ప్రతిపాదించాడు. రూసో యొక్క వ్యక్తిత్వం, అతని జీవిత అనుభవాలు, అతనుపుట్టి పెరిగిన జెనీవా వాతావరణం, అతను నివసించిన ఫ్రెంచి వాతావరణం మొదలగు వాటిప్రభావం రూసోపై వుంది. ఇతని రచనలు ఫ్రెంచి విప్లవానికి దోహదం చేశాయి. ప్రజాస్వామ్య ఉద్యమానికి స్ఫూర్తినిచ్చాయి.

"Social Contract" రూసో రచించిన ఉత్తమరాజనీతి గ్రంథం. ఈ గ్రంథంలో జనేచ్ఛ సిద్ధాంతం ననుసరించి స్వేచ్ఛ, అధికారాలను రూసో సమన్వయం చేశాడు. జనేచ్ఛ సార్వభౌమత్వాన్ని సమర్థించాడు. ఈ గ్రంథంలో (1) ఒడంబడిక ద్వారా పౌరసమాజం పుట్టుక, (2) సార్వభౌమత్వ సిద్ధాంతం - జనేచ్ఛ, (3) ప్రభుత్వం స్థాపన, (4) పౌరమతం ముఖ్యాంశాలని "Henry J. Tozer" చెప్పాడు. ఈ ముఖ్యాంశాల గురించి ఇప్పుడు మనము విపులంగా చర్చిద్దాం.

## 8.2 ప్రాకృతిక వ్యవస్థ :

17, 18 శతాబ్దాలలో ఆచరణలో వున్న సాంప్రదాయం ప్రకారం రూసో కూడా తన సిద్ధాంతాన్ని ప్రాకృతిక వ్యవస్థ వర్ణనతో ప్రారంభించాడు. సామాజిక నైతిక బంధాలుపై ఏర్పడిన ఒక సహజ సమాజం గురించి తన సిద్ధాంతంలో చెప్పదలచినాడు. ప్రాకృతిక వ్యవస్థలో వున్న మానవులు సామాజిక ఒడంబడిక ద్వారా పైన చెప్పిన సమాజాన్ని ఏర్పరచుకున్నారని రూసో భావించాడు. ఈ భావనే ఊహాజనిత ప్రాకృతిక వ్యవస్థ వర్ణనకు కారణం.

ప్రాకృతిక వ్యవస్థవర్ణనలో రూసో హాబ్స్‌తో ఏకీభవించలేదు. హాబ్స్ ప్రాథమిక వ్యవస్థను చాలా భయంకరంగా వర్ణించాడు. అది నిరంతర యుద్ధపరిస్థితిని హాబ్స్ చెప్పాడు. దీనికి భిన్నంగా లాక్ వర్ణించిన ప్రాకృతిక వ్యవస్థ సద్గుణాలు

కలిగిన అరాచకవాదుల సమూహం. రూసో ప్రాకృతిక వ్యవస్థ వర్ణన విషయంలో కొంతవరకు లాక్‌తో ఏకీభవించాడని చెప్పవచ్చును. లాక్ చెప్పినట్లే ప్రాకృతిక వ్యవస్థలో మానవుడు సంఘజీవి. ప్రారంభంలో ప్రాకృతిక వ్యవస్థ నిర్మలంగా, ప్రశాంతంగా వుండేదని రూసో కూడా భావించాడు.

ప్రాకృతిక వ్యవస్థలో అడ్డులేని స్వేచ్ఛతో మానవుడు జీవించేవాడు. తన పరిమిత సహజ అవసరాలను తీర్చుకుంటూ మనిషి ఇతరులతో కలసిమెలసి జీవించేవాడు. వారికి వ్యవస్థీకృత సామాజిక జీవితం తెలియదు. వారికి మంచి చెడు మధ్య తేడా కూడా తెలియదు. వారికి జాలి, దయ ఉండేవి కాని అతనికి భాషలేదు కాబట్టి ఏవిధమైన అభిప్రాయాలను తెలియజేసే అవకాశం లేదు. ఆధునిక మానవుడు పాటించిన నైతికవిలువలు, సూత్రాలు అతనికి తెలియవు. అతనికి ఆస్థిపాస్తులు లేవు కాబట్టి అసమానతలు తెలియవు. అతనికి సంతోషం, విచారం తెలియవు. ఇటువంటి లక్షణాలు గల మానవులు నివసించిన ప్రాకృతిక వ్యవస్థ హాబ్స్ చెప్పినట్లు భయంకరమైనది కాదు. ఆ స్థితిలో వ్యక్తుల మధ్య వివాదాలకు యుద్ధాలకు తావులేదు. అయితే, ఇంత ప్రశాంతంగా ప్రాకృతిక వ్యవస్థలో జీవించే మానవులు ఒడంబడిక ద్వారా రాజకీయ సమాజాన్ని ఎందుకు ఏర్పరచుకోవలసి వచ్చింది ? ప్రాకృతిక వ్యవస్థలోని శాంతియుత జీవనాన్ని చెడగొట్టే పరిస్థితులు నాగరికత వ్యక్తిగత ఆస్థి ప్రారంభంతో ఏర్పడ్డాయని రూసో చెప్పాడు.

వ్యక్తిగత ఆస్థి ప్రారంభంతో ప్రాకృతిక వ్యవస్థలో స్వర్గతుల్యమైన మానవుని జీవితం అంతరించిపోయింది. మొట్టమొదట ఒక వ్యక్తి కొంతభూమి చుట్టుకంచె వేసి "ఇది నాది" అని చెప్పి మిగిలిన ప్రజలను నమ్మించాడో అప్పుడే సొంత ఆస్తి ప్రారంభమైంది. ఇతడే పౌరసమాజస్థాపకుడు అని రూసో చెప్పాడు. సొంత ఆస్థితోపాటు మానవులలో అసమానతలు ఏర్పడ్డాయి. ఆస్థి మనిషిలో గర్వాన్ని, అహంకారాన్ని, అతిశయాన్ని, ఆవేశాన్ని కలిగించింది. దీనితోపాటు కుటుంబ వ్యవస్థ, నాగరికజీవనం వృద్ధి చెందాయి. ఇవన్నీ వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలిగించాయి. ఈవిధంగా ప్రాకృతిక వ్యవస్థలోని జీవితం దుర్భరమైనది. ఈ పరిస్థితి నుండి బయటపడటానికి ప్రజలు ఒక ఒప్పందం ద్వారా రాజకీయ సమాజాన్ని ఏర్పాటుచేసుకున్నారని రూసో చెప్పాడు.

## 8.3 సామాజిక ఒడంబడిక :

రూసో చెప్పిన సామాజిక ఒడంబడిక ప్రసిద్ధి చెందిన ఈక్రింది వాక్యంతో ప్రారంభమైనది. "స్వేచ్ఛగా జన్మించిన మానవుడు సర్వత్రా సంకెళ్ళలో ఉన్నాడు. (Man is Born free, and everywhere he is in chains) మనిషి స్వేచ్ఛగా, స్వతంత్రంగా, ఏకాంతంగా వుండటం మంచిదని దీని అర్థం. ప్రాకృతిక వ్యవస్థలో అనుభవించగల ఇటువంటి స్వేచ్ఛ పౌరసమాజంలో వీలుపడదు. ఎందుకంటే సమాజసాంప్రదాయాలు, కట్టుబాట్లు, నియమ నిబంధనలు సామాజిక, రాజకీయ వ్యవస్థలు అటువంటి స్వేచ్ఛకు సంకెళ్ళని రూసో భావించాడు. అయితే సంకెళ్ళులేని స్వేచ్ఛను పొందాలంటే తిరిగి ప్రాకృతిక వ్యవస్థకు వెళ్ళాలి. కాని ఇది అసంభవం. కాబట్టి పౌరసమాజంలో వుంటూ పోగొట్టుకున్న స్వేచ్ఛను సామాజిక ఒడంబడిక ప్రాతిపదికపై ఏర్పడిన సమాజం ద్వారా పొందవచ్చునని రూసో చెప్పాడు.

హాబ్స్ సిద్ధాంతంలో భద్రత కొరకు మానవుడు స్వేచ్ఛను వదులుకొన్నాడు. కాని రూసో భద్రత, స్వేచ్ఛ రెండూ వ్యక్తికి అవసరమేనని భావించాడు. భద్రతతో కూడిన స్వేచ్ఛను అనుభవించడమే రూసో ఒడంబడిక సిద్ధాంతం ముఖ్య లక్ష్యం.

ఇప్పుడు రూసో చెప్పిన ఒడంబడిక ఏ విధంగా జరిగిందో తెలుసుకుందాం. ఈ ఒడంబడికను ప్రజలు స్వేచ్ఛగా తమతో తామే చేసుకున్నారు. అంటే ప్రతి ఒక్కరు మొత్తం సమాజంతో ఒప్పందాన్ని చేసుకున్నాడు. ఈ ఒప్పందం ప్రకారం ప్రతిఒక్క సమాజసభ్యుడు తన సర్వహక్కులను సమాజానికి బేషరతుగా సంపూర్ణంగా వదులుకొన్నాడు. ఈ ఒడంబడిక వల్ల ఒక సమిష్టి నైతిక సంస్థ ఏర్పడింది.

రూసో చెప్పిన ఈ ఒడంబడికకు కొన్ని ముఖ్యలక్షణాలున్నాయి. ఈ క్రింది విధంగా వివరించవచ్చును.

1. ఈ ఒడంబడిక వల్ల ప్రజలకు ఏమాత్రం నష్టం కలగదు. పైగా వారికి ఎంతో లాభం కలుగుతుంది. వ్యక్తికి సంఘ వ్యతిరేక కార్యకలాపాలు చేసే స్వేచ్ఛపోయింది. దానిస్థానంలో బాధ్యతాయుతంగా వ్యవహరించే స్వేచ్ఛ ప్రతి పౌరునికి లభిస్తుంది. ప్రతి వ్యక్తికి కావలసినంత నైతికస్వేచ్ఛ లభిస్తుంది.

2. ఈ ఒప్పందం షరతులు ననుసరించి ప్రతివ్యక్తి తన సర్వహక్కులను ప్రతి ఒక్కరికి అర్పించాడు. అదేవిధంగా వారందరూ వారి సర్వహక్కులను అతనికి అర్పిస్తారు. ఇందులో ఏ ఒక్కరికి ఎటువంటి నష్టం వాటిల్లదు. పైగా ప్రతి ఒక్కరికి సమాజపరమైన సమిష్టి అధికారం వల్ల అతని సొంతాస్థికి రక్షణ కలుగుతుంది. అంతేకాకుండా ప్రతి ఒక్కరికి పౌరస్వేచ్ఛ లభిస్తుంది.

3. ఈ ఒడంబడిక ద్వారా ఏర్పడిన రాజ్యం ఒక నైతిక సంస్థగా రూపొందుతుంది. దాని రాజకీయాధికారం చట్టబద్ధము అయినది. అది చేసే శాసనాలు ప్రజల సమ్మతిపై ఆధారపడివుంటాయి. కాబట్టి పౌరులు అటువంటి శాసనాలకు స్వచ్ఛందంగా విధేయత చూపుతారు. అంటే ప్రజలు చేసుకున్న శాసనాలను ప్రజలే పాటించడం అన్నమాట. రాజ్యంలో ప్రతివ్యక్తి పౌరుడేకాక సార్వభౌముడు కూడా.

4. ఒడంబడిక వల్ల ఏర్పడిన సమాజం ఒక సజీవమైన చైతన్యవంతమైన వ్యవస్థ. ఈ వ్యవస్థలోని భాగాలన్నీ అంగాంగిక సంబంధాన్ని కలిగివుంటాయి. అవి ఒక దానిపై ఒకటి పరస్పరంగా ఆధారపడివుంటాయి. ఇందులో ఏ భాగాన్ని విడదీసినా, ఏ షరతుని ఉల్లంఘించినా మొత్తం సమాజవ్యవస్థ నిరుపయోగమౌతుంది. రూసో చేతిలో సామాజిక ఒడంబడిక పవిత్రతను చట్టబద్ధతను పొందింది.

రూసో ఒడంబడిక సిద్ధాంతం ఏఏవిషయాలలో హాబ్స్, లాక్ ఒడంబడిక సిద్ధాంతాలతో విబేదిస్తుందో పరిశీలిద్దాం. ముగ్గురు మూడు రకాల ప్రయోజనాలకు, లక్ష్యాలకు ఒడంబడిక సిద్ధాంతాన్ని ఉపయోగించారు.

హాబ్స్ ఒడంబడిక సిద్ధాంతం ఉపయోగితావాదం సూత్రాలపై ఆధారపడివుంది. ప్రాకృతిక వ్యవస్థలో నిరంతర యుద్ధస్థితిలో వున్న రక్షణలేని దుర్భర జీవనం నుండి బయటపడడానికి ప్రజలు ఒప్పందం చేసుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా ప్రాణరక్షణహక్కు మినహాయించి, మిగిలిన హక్కులు, అధికారాలు అన్నింటిని బేషరుతుగా సార్వభౌమునికి అర్పించుకొన్నారు. సార్వభౌమునిపై తిరుగుబాటు చేసే హక్కు ప్రజలకు లేదు. హాబ్స్ నిరుపేక్ష రాజరికాన్ని సమర్థించడానికి ఒడంబడికని ఒక సాధనంలా ఉపయోగించుకున్నాడు.

లాక్ సిద్ధాంతంలో ప్రాకృతిక వ్యవస్థలో ఏర్పడ్డ కొన్ని ఇబ్బందులను తొలగించుకొని ప్రజలు వారి సహజహక్కులను మరింత మెరుగైన రాజ్యరక్షణ వాతావరణంలో అనుభవించడానికి ఒప్పందాన్ని చేసుకున్నారు. ఇతని సిద్ధాంతంలో

ప్రభుత్వ ఒప్పందం కూడా వుంది. ప్రభుత్వంపై తిరుగుబాటు చేసేహక్కు ప్రజలకు వుందని లాక్ సమర్థించాడు. లక్ పరిమిత ప్రభుత్వాన్ని, రక్తరహిత విప్లవాన్ని (1688) సమర్థించడానికి ఒడంబడికను ఉపయోగించాడు.

హాబ్స్ సిద్ధాంతంలో అతను చేసిన ప్రతిపాదనలను లాక్ సిద్ధాంతంలోని ముగింపు అభిప్రాయాలను మేళవించి రూసో తన సిద్ధాంతాన్ని చెప్పాడు. ఆస్థి, నాగరికత అభివృద్ధి చెందటంతో ప్రాకృతిక వ్యవస్థలో మానవుడు నైతికంగా పతనం చెందాడు. ఈ పరిస్థితి నుండి బయటపడి మెరుగైన నైతికజీవితాన్ని గడపటానికి ప్రజలు తమలో తాము ఒడంబడిక చేసికొని ఒక సమిష్టి నైతిక సంస్థ (రాజ్యం)ను ఏర్పరచుకొన్నారని రూసో చెప్పాడు. ఈ సంస్థకు సహజ ప్రతినిధిగా ఏర్పడిన జనేచ్ఛ సార్వభౌమాధికారమని రూసో చెప్పాడు. రూసో ప్రత్యేక ప్రజాస్వామ్యాన్ని సమర్థించాడు. హాబ్స్‌వలే రూసో కూడా నిరపేక్ష సార్వభౌమాధికారాన్ని సమర్థించాడు. రూసో తన ఒడంబడిక సిద్ధాంతాన్ని చెప్పడంలో ఎక్కువగా లాక్‌ను అనుసరించాడు.

## 8.4 జనేచ్ఛ - సార్వభౌమత్వం :

రూసో రాజనీతి సిద్ధాంతంలో "జనేచ్ఛ" ఒక ముఖ్యమైన రాజకీయ భావన. ఈ భావన రూసో సిద్ధాంతంలో ఒక కీలక భాగమైనప్పటికి, ఇది వివాదగ్రస్తమైనదని కూడా చెప్పవచ్చును. రూసో రాజనీతి భావాల నుండి జనేచ్ఛను తొలగిస్తే అతని రాజనీతి సిద్ధాంతాల సంపుటే విచ్ఛిన్నం అవుతుంది. రూసో జనేచ్ఛ లక్షణాలను, ప్రాముఖ్యతను తన రాజనీతి సిద్ధాంతంలో వివరించాడు.

జనేచ్ఛ అర్థాన్ని ఈక్రింది విధంగా వివరించవచ్చు. ప్రతివ్యక్తిలో రెండురకాలు ఇచ్ఛలు వుంటాయి. (1). మొదటిరకం వ్యక్తిగత ప్రయోజనాలను కోరుతుంది. (2) రెండోరకం సమాజ సమిష్టి ప్రయోజనాలను కోరుతుంది. మొదటిరకాన్ని "వాస్తవ ఇచ్ఛ" అని రెండవ రకాన్ని "నిజమైన ఇచ్ఛ" అని చెప్పవచ్చును. వ్యక్తి 'వాస్తవ ఇచ్ఛ' ఆవేశపూరితమైనది. ఇది వ్యక్తి స్వలాభాన్నే కోరుతుంది. అతని వ్యక్తిగత ఆసక్తులకే కృషి చేయమని ప్రోత్సహిస్తుంది. వాస్తవ ఇచ్ఛకు సమాజశ్రేయస్సుతో సంబంధం వుండదు. అది సంకుచితమైనది, ఘర్షణలతో కూడుకున్నది.

"నిజమైన ఇచ్ఛ" సమాజ సంక్షేమాన్ని కోరుతుంది. వ్యక్తిశ్రేయస్సు సమాజ శ్రేయస్సులోనే ఇమిడి వుంటుందని నిజమైన ఇచ్ఛ వ్యక్తికి చెబుతుంది. వ్యక్తి క్షేమంకంటే సమిష్టి క్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తుంది. ప్రతి వ్యక్తిలోను ఈ రెండురకాల ఇచ్ఛలు వుంటాయి. సమాజంలోని నిజమైన ఇచ్ఛల సమన్వయమే జనేచ్ఛని చెప్పవచ్చును. అంటే సమాజంలోని వ్యక్తుల యొక్క నిజమైన ఇచ్ఛల కలియిక నుండే జనేచ్ఛ ఏర్పడుతుంది.

రూసో "జనేచ్ఛకు", "సర్వజనేచ్ఛకు" మధ్యభేదాన్ని చూపించాడు. జనేచ్ఛ సమాజ సమిష్టిక్షేమానికి సంబంధించినది. సర్వజనేచ్ఛ వ్యక్తులందరి వ్యక్తిగత ఇచ్ఛలకు సమానము. ఇది వ్యక్తిగత క్షేమానికి సంబంధించింది. ఇది వ్యక్తిగత ఇచ్ఛల సమూహము మాత్రమే.

జనేచ్ఛకు రెండు ముఖ్యలక్షణాలున్నాయి. ఇది సర్వజనుల (సంఘ) శ్రేయస్సును సుఖాన్ని ఎల్లప్పుడు కోరుతుంది. ఇది ప్రజలందరి నుండి వస్తుంది. అందరికి వర్తిస్తుంది. జనేచ్ఛను వ్యక్తం చేయటంలో సంఖ్యా బలంతో పనిలేదు. మెజారిటి ప్రజలు వారి వ్యక్తిగత క్షేమాన్నే కోరుకున్నట్లైతే అది జనేచ్ఛ అవదు. ఒక వ్యక్తిగాని లేదా ఒక మైనారిటి వర్గం కాని సమాజ సమిష్టిశ్రేయస్సును కోరినట్లైతే అది జనేచ్ఛ అవుతుంది. ఇది నిజమైన సమాజ ఇచ్ఛకు ప్రాతినిధ్యం వహిస్తుంది.

జనేచ్ఛకు రూసో "Common Me" అని అన్నాడు. ఇది ఎల్లప్పుడూ న్యాయంగా వుంటుందంటాడు రూసో. జనేచ్ఛ వ్యవస్థీకృతమైన నైతిక సమాజశ్రేయస్సును కోరుకున్న నిజమైన ఇచ్ఛకు ప్రతినిధి. ఇది ఎప్పుడు తప్పుచేయదు.

రూసోజనేచ్ఛ సార్వభౌమత్వాన్ని సమర్థించాడు.

జనేచ్ఛకు కొన్ని ముఖ్య లక్షణాలున్నాయని రూసో చెప్పాడు. వాటిని ఈక్రింది విధంగా వివరించవచ్చు.

(1) జనేచ్ఛ శాశ్వతమైనది. శాశ్వత ప్రాతిపదికపై జాతీయసంస్థలకు స్థిరత్వాన్ని కలిగిస్తుంది.

(2) జనేచ్ఛ హేతుబద్ధమైనది. దీని అభీష్టంమేరకే రాజ్యకలాపాలు జరుగుతాయి. ఈ కార్యకలాపాలు నిస్వార్థంగా జరుగుతాయి.

(3) జనేచ్ఛ అధికారం నిరపేక్షమైనది. దీని అధికారానికి తిరుగులేదు.

(4) దీని అధికారం అవిభాజ్యమైనది. అంటే జనేచ్ఛ సమగ్రమైనది.

(5) జనేచ్ఛ అధికారం అన్యాక్రాంతం చేయటానికి వీలులేనిది. ఈ లక్షణాన్ని అనుసరించి రూసో ప్రత్యక్ష ప్రజాస్వామ్యాన్ని సమర్థించాడని చెప్పవచ్చును.

(6) జనేచ్ఛ శాసనాలకు మూలాధారం, కాబట్టి ఇది న్యాయానికి కూడా ఆధారం. రాజ్యంలో సామాజిక న్యాయం జరగాలంటే జనేచ్ఛ తప్పదని రూసో చెప్పాడు.

### 8.4.1 విమర్శ :

రూసో చెప్పిన జనేచ్ఛ సిద్ధాంతం కొన్ని విమర్శలకు గురిఅయింది. రాజకీయపార్టీలు లేనటువంటి పరిస్థితులలో జనేచ్ఛను వ్యక్తం చేసే అవకాశం వుంటుంది. కాని నేటి ప్రపంచంలో ఏ రాజకీయ వ్యవస్థలోనైనా పార్టీలు తప్పనిసరిఅని బార్కర్ అన్నాడు. పార్టీలు ఉన్న ప్రభుత్వాలలో ఏకగ్రీవంగా జనేచ్ఛను వ్యక్తం చేసే అవకాశంలేదని బార్కర్ వివరించాడు.

చిన్నరాజ్యాలలోనే జనేచ్ఛకు అవకాశం వుంటుంది. నేటి పెద్ద పెద్ద రాజ్యాలలో జనేచ్ఛకు అవకాశం వుండదు. ముఖ్యంగా అనేక పార్టీలు, వర్గాలు వున్న ఈ రాజ్యాలలో జనేచ్ఛకు అవకాశం ఉండదు. ఉన్నా అది ఎక్కువకాలం నిలిచే అవకాశం ఉండదు. ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో జనేచ్ఛకు తావులేదు.

జనేచ్ఛ ఎప్పుడు తప్పు చేయదు. అది ఎప్పుడు అన్యాయంగా ప్రవర్తించదని రూసో చెప్పాడు. ఇవి ఊహాగానాలు మాత్రమే. వీటికి ఆచరణ యోగ్యత లేదు.

రూసో చెప్పిన సామాజిక ఒడంబడికలో కొంత అసంబద్ధత వుందని సి.ఎల్.వేపర్ అన్నాడు. జనేచ్ఛ పరమోన్నత మైతే, సామాజిక ఒడంబడిక అనవసరం మరియు అర్థరహితం. ఒకవేళ సామాజిక ఒడంబడిక ఆవశ్యకమైతే, జనేచ్ఛ పరమోన్నతమైనది కాదు.

ఏ వ్యక్తి అయిన తనే జనేచ్ఛకు ప్రాతినిధ్యం వహిస్తున్నానని చెప్పి అధికారాన్ని హస్తగతం చేసుకొని ప్రజలుపై నియంతృత్వ అధికారాన్ని చెలాయించవచ్చును.

పై విమర్శలున్నప్పటికి రూసో సిద్ధాంతంలో జనేచ్ఛ భావనే అసలైనదని W.T. Jones అభిప్రాయబడ్డాడు. చారిత్రాత్మకంగా కూడా ఈ భావనే అతను రాజనీతి సిద్ధాంతానికి చేసినసేవ. ఇది ఒక కాల్పనిక భావనని త్రోసిపుచ్చడానికి

ఏకారణంలేదని జోన్స్ చెప్పాడు. రాజ్యంలో సంక్షోభం పరిస్థితులలో పడినపుడు జనేచ్ఛభావన దేశభక్తిని కలిగిస్తుందని డేవిడ్ థామ్సన్ చెప్పాడు. ఈ భావనవల్లే రూసో ఒక ప్రజాస్వామ్యవాదిగా ఖ్యాతిగడించాడు. ప్రత్యక్ష ప్రజాస్వామ్యానికి ఆరాధకుడు అయినాడు. G.D.H. Cole మాటలలో "జనేచ్ఛభావన నైతికపరమైనది. రాజకీయ ప్రవర్తనకు వర్తింపచేసిన నైతిక ప్రవర్తన సూత్రం, కాంట్ చెప్పిన నైతిక హేతుబద్ధత భావన జనేచ్ఛభావన ఒక్కటే". ప్రజాస్వామ్య సిద్ధాంతాలకు, సామ్యవాద సిద్ధాంతాలకు కూడా రూసో ప్రతిపాదించిన జనేచ్ఛ మూలాధారం.

## 8.5 రాజ్యం - వ్యక్తి స్వేచ్ఛ :

ప్లేటో, అరిస్టాటిల్ సంపూర్ణరాజ్య సిద్ధాంతాన్ని చెప్పారు. రూసో వీరు చెప్పినట్లు సంపూర్ణ రాజ్యసిద్ధాంతాన్ని చెప్పలేదు. రాజ్యాన్ని ఏర్పాటు చేయటంలో రూసో ముఖ్యోద్దేశ్యం ప్రాకృతిక వ్యవస్థలో ప్రజలు అనుభవించిన స్వేచ్ఛను, పౌరసమాజంలో కాపాడటం. రాజ్యస్వభావం, లక్ష్యాలలో రూసో రాజ్యం హాబ్స్ రాజ్యం కంటే విభిన్నమైనది. రూసో రాజ్యానికి కూడా ఉపయోగం ఉన్నమాట వాస్తవమే. కాని దీనికి ఒక ఉత్కృష్టమైన ఆశయం వున్నది. రూసో చెప్పిన రాజ్యం ఒక సమిష్టి నైతిక వ్యక్తిలాంటిది. దీని ఆశయం పౌరులను నైతికంగా అభివృద్ధిచేయడం. రాజ్యంలోనే ప్రజలకు నైతికసూత్రాలనుసరించి జీవనం చేసే అవకాశముంటుంది. రూసో సిద్ధాంతంలో రాజ్యానికి, జనేచ్ఛకు తేడాలేదు.

రూసో సిద్ధాంతంలో ప్రజలు సమ్మతిపై ఆధారపడిరాజ్యం ఏర్పడింది. వ్యక్తి స్వేచ్ఛను కాపాడటంలోనే రాజ్యం ప్రాముఖ్యత వుందని రూసో వివరించాడు. పౌరసమాజం లేదా రాజ్యం వ్యక్తి లాభం కొరకే ఏర్పడిందని రూసో భావించాడు. రాజ్యం యొక్క అధికారాన్ని వ్యక్తి స్వేచ్ఛతో సమన్వయపరిచాడు. రాజ్యసభ్యత్వం ద్వారా ప్రజలు సంపూర్ణ స్వేచ్ఛను వృద్ధిచేసుకోగలరని రూసో చెప్పాడు. స్వచ్ఛందంగా ఏర్పరచుకొన్న రాజ్యం ద్వారా వ్యక్తి నైతిక స్వాతంత్ర్యాన్ని పొందగలడు. వ్యక్తి యొక్క నైతిక స్వయం నిర్ణయాధికారాన్నే స్వేచ్ఛ అనవచ్చు. ఎల్లప్పుడు సమాజశ్రేయస్సును కాంక్షిస్తున్న జనేచ్ఛ ఆజ్ఞలకు విధేయత చూపడం ద్వారా వ్యక్తి సంపూర్ణ స్వేచ్ఛను అనుభవించగలడు.

రూసో స్వేచ్ఛకు స్వాతంత్ర్యానికి మధ్య వ్యత్యాసాన్ని చెప్పాడు. ఈ రెండు ఒకదానితో ఇంకొకటి సంబంధంలేనివి. స్వాతంత్ర్యం ఏవిధమైన చట్టాలకు పరిమితం కాదు. దీనికి భిన్నంగా స్వేచ్ఛ కొన్ని పరిమితులను అంగీకరిస్తుంది. స్వాతంత్ర్యం మానవుని ప్రగతిలో మొదటిదశ. పౌరసమాజం ఏర్పడిన తరువాత స్వాతంత్ర్యానికి బదులు పౌరస్వేచ్ఛను పొందాడు. జనేచ్ఛ ఆజ్ఞలకు వ్యక్తి వ్యతిరేకంగా వ్యవహరిస్తే అతని మంచిని అతను తెలుసుకోలేదన్నమాట. అటువంటి వ్యక్తిని బలవంతగానైనా స్వేచ్ఛాజీవిగా వుండేటట్లు చేయాలి. ఇటువంటి అధికారం జనేచ్ఛకు వుందని రూసో భావించాడు. ఈ విధంగా చట్టానికి స్వేచ్ఛకి మధ్యనున్న సంఘర్షణను రూసో పరిష్కరించాడు.

## 8.6 ప్రభుత్వం - ప్రభుత్వాల వర్గీకరణ :

రాజ్యానికి ప్రభుత్వానికి మధ్య భేదాన్ని రూసో చెప్పినాడు. రాజ్యం పౌరుల సముదాయం. ఇది ప్రజలు చేసుకున్న ఒడంబడిక ద్వారా ఏర్పడింది. ఇది జనేచ్ఛలో వ్యక్తం అవుతుంది. రాజ్యం శాసనం ద్వారా ప్రభుత్వాన్ని ఏర్పరుస్తుంది. జనేచ్ఛకు ప్రభుత్వం ఒక ఏజెంటుగా పనిచేస్తుంది. దీని పని పాలనా కార్యక్రమాలను నిర్వహించటం. రూసో సిద్ధాంతంలో శాసననిర్మాణ విధులు, కార్యనిర్వాహక విధులు వేరుగా వుంటాయి. శాసన నిర్మాణాధికారం జనేచ్ఛకు వుంటుంది. శాసనాలను అమలుచేసే అధికారం ప్రభుత్వానిది. ప్రభుత్వానికి దత్తతాధికారాలు మాత్రమే వుంటాయి. ప్రభుత్వానికి ఒడంబడికకు సంబంధంలేదు. రాజ్యవ్యవస్థలో ప్రభుత్వం ఒకభాగం.

రూసో సిద్ధాంతంలో రాజరిక వ్యతిరేక ధోరణులు కనిపిస్తున్నాయి. రూసో చెప్పిన ప్రభుత్వ విధానంలో రాజుకు శాసనాధికారాలు లేవు. అతను ఇష్టానుసారం శాసనాలు చేయలేడు. జనేచ్ఛకే శాసనాధికారం వుంది. కార్యనిర్వహణాధికారానికి మూలము ప్రజలు, భగవంతుడు కాదని రూసో చెప్పాడు. ప్రభుత్వానికి విధులు తప్పించి, స్వతహాగా హక్కులు లేవని రూసో వెల్లడించాడు. సార్వభౌములు అయిన ప్రజలు ప్రభుత్వాన్ని తొలగించగలరు.

రూసో సాంప్రదాయంగా ప్రభుత్వాలను మూడు రకాలుగా విభజించాడు. అవి 1) రాజరికం (Monarchy), 2) కులీనవర్గం (Aristocracy), 3) ప్రజాస్వామ్యం (Democracy). ఈ ప్రభుత్వాల వర్గీకరణ కార్యనిర్వహణాధికారానికి సంబంధించింది మాత్రమే.

కార్యనిర్వహణాధికారం ఒకరి చేతిలో వుంటే అది రాచరికం. ఈవిధానంలో శాసనాలను పటిష్టంగా అమలుచేయడానికి వీలుంటుంది. ఇది వాంఛనీయమైన ప్రభుత్వమే కాని, వంశపారంపర్యంగా మంచి గుణవంతులు, సమర్థులైన పాలకులు వస్తారని నమ్మకం లేదు. ఎన్నుకోబడ్డ కులీనవర్గం అన్నింటికంటే మంచిదని రూసో చెప్పాడు. ఎందుకంటే ప్రజలుచే ఎన్నుకోబడ్డ కొద్దిమంది తెలివైనవారు కలసి పరిపాలన చేస్తారు. అన్నింటికంటే చెడ్డది వారసత్వ ప్రాతిపదికపై ఏర్పడిన కులీనవర్గం. ప్రజాస్వామ్యంలో కార్యనిర్వహణాధికారం ప్రజలందరి చేతిలో వుంటుంది. ఆచరణదృష్ట్యా ప్రజాస్వామ్య ప్రభుత్వం అసంభవమని చెప్పాడు. పాలనా వ్యవహారాలతో ప్రజలందరు సంబంధాన్ని పెట్టుకోవడం వీలుపడదు. అంతేకాకుండా, శాసననిర్మాణాధికారాన్ని, కార్యనిర్వహణాధికారాన్ని కలిపి రెండింటిని నిర్వర్తించే శక్తిసామర్థ్యాలు ప్రజలకు వుండవు. రాజ్యంలో ప్రజలందరు దేవతలు అయితే తప్ప ప్రజాస్వామ్య ప్రభుత్వం వీలుపడదని రూసో భావించాడు. ప్రజలు, రాజ్యం సైజు, ఇంకా ఎన్నో అంశాలను పరిగణలోనికి తీసుకొని ప్రభుత్వరకాన్ని ఎంచుకోవలసి వుంటుందని రూసో చెప్పాడు. ప్రభుత్వాల వర్గీకరణ విషయంలో రూసోపై మాంటిస్క్యూ ప్రభావం కనిపిస్తుంది.

## 8.7 **పౌరమతం** (Civil Religion) :

రాజ్యంలో "పౌరమతాన్ని" స్థాపించాలని రూసో ప్రతిపాదించాడు. మతవిశ్వాసంతో రాజ్యానికి పనిలేదు. మతం, ముఖ్యంగా క్రైస్తవమతం సమాజాన్ని ఛిన్నాభిన్నం చేస్తుందని రూసో చెప్పాడు. సమాజంలో వర్గాలు ఏర్పడకుండా నివారించడానికి రాజ్యానికి ఒక పౌరమతం అవసరమని రూసో భావించాడు. పౌరమతం నియమాలను సార్వభౌముడు నిర్ణయిస్తాడు. ఇటువంటి మతం రాజ్యంలో ఏకత్వభావనను కలిగిస్తుంది. సమాజంలో సభ్యత్వం ఈ పౌరమత నియమాలలో విశ్వాసం వలన ప్రతిపౌరుడు తన విధులను సక్రమంగా నిర్వహిస్తాడు. ఈ మతాన్ని విశ్వసించనివారిని దేశబహిష్కరణ చేయడానికి రాజ్యానికి అధికారం వుండాలని రూసో చెప్పాడు. ఈ మతంలో విశ్వాసాన్ని ప్రకటించి, దాని నియమాలకు వ్యతిరేకంగా ప్రవర్తించినట్లైతే అటువంటి వ్యక్తికి మరణశిక్ష విధించాలని రూసో చెప్పాడు. ఈ శిక్ష మతపరంగా గాక, పౌర సమాజపరంగా వుండాలని రూసో భావించాడు.

## 8.8 రూసో సంపూర్ణాధికారవాదా ? ఉదారవాదా ? ఫాసిస్టా ? కమ్యూనిస్టా ?

ఆధునిక విమర్శకులు రూసో సిద్ధాంతంలో ఎన్నో వైరుధ్యాలున్నాయని చెపుతున్నారు. రూసోని సంపూర్ణాధికారవాది అని బార్కర్ చెప్పాడు. ఈ వాదాన్ని సమర్థిస్తూ రూసో చెప్పిన భావాలను కొన్నింటిని ఉదాహరణగా అతను చెప్పారు. "మానవుడిని బలవంతంగా స్వేచ్ఛాజీవిగా వుండేటట్లు చేయాలి" ప్రతివ్యక్తి తన సర్వహక్కులను సమాజానికి అర్పించి

సార్వభౌమునికి విధేయుడై వుండాలి. రూసో శాసనాధికారి సర్వశక్తిమంతుడు. రూసో వ్యక్తి స్వేచ్ఛని అమితంగా కాంక్షించినవాడు. కాని సార్వభౌముని సర్వాధికారాలపై ఎటువంటి ఆంక్షలను వుంచలేదు. స్వేచ్ఛకు పరిరక్షణలను రూసో చెప్పలేదు. ఈ కారణాల వల్ల రూసో సంపూర్ణ అధికారవాదాన్ని సమర్థించాడు అని బార్కర్ వంటి విమర్శకులు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ప్లామినాజ్ (Plamenatz) రూసో సిద్ధాంతాన్ని చాలా లోతుగా పరిశీలించి విశ్లేషించిన తరువాత రూసో సంపూర్ణాధికారవాదికాడని చెప్పాడు. రూసో సిద్ధాంతంలో సార్వభౌముడు ఒకవ్యక్తికాని, కొద్దిమంది వ్యక్తులు గాని కాదు. సర్వవేళలా సమాజశ్రేయస్సును కోరుతున్న వ్యవస్థీకృతమైన సమాజం. ఇందులో ప్రతి ఒక్కడు సభ్యుడే. ఈ సభ్యత్వం వల్ల వ్యక్తిగా పోగొట్టుకొన్న హక్కులన్నీ సమాజసభ్యునిగా తిరిగిపొందాడు. సార్వభౌమునికి ఎటువంటి శాసనాలనైనా చేసే హక్కు వుంది. కాని అతనికి ఎటువంటి నియమాలనైనా జారీచేసే అధికారంలేదు. శాసనాలు ప్రజల సమ్మతితో చేయడం జరుగుతుంది. ఈ కారణాలవల్ల రూసో సంపూర్ణ అధికారవాది కాడని చెప్పవచ్చు.

రూసో వ్యక్తి స్వేచ్ఛపై పరస్పర విరుద్ధమైన ప్రకటనలు చేశాడు. అంతమాత్రాన రూసోని సంపూర్ణాధికారవాది అని అనడం సమంజసం కాదు. అసంగతరూసో (Inconsistent Rousseau) అని చెప్పవచ్చు.

రూసో సంపూర్ణాధికార వాది కాడని Plamenatz నిర్ద్వందంగా చెప్పాడు. అంతమాత్రాన రూసోని ఉదారవాది అని చెప్పడానికి వీలులేదు. అతని రచనలలో సంపూర్ణాధికారవాదం భావాలు, ఉదారవాదం భావాలు శాంతియుతంగా సహజీవనం చేస్తున్నాయని చెప్పవచ్చు.

"Social Contract" గ్రంథానికి రాసిన పీఠికలో Maurace Cransion రూసో ఫాసిస్టుకాడు, కమ్యునిస్టుకాడని చెప్పాడు. ఈ రెండు సిద్ధాంతాలతో రూసోకి సంబంధంలేదని అతను చెప్పాడు. రూసో ఏమాత్రమైనా అధికారవాదానికి మొగ్గుచూపినట్లైతే అది అతను చెప్పిన స్వేచ్ఛతో సంఘర్షణ లేనిది. రూసో చెప్పిన రిపబ్లిక్‌కి ఆధునిక సంపూర్ణాధికార రాజ్యాలకు మధ్య ఏమాత్రం పోలికలేదు.

'మానవుడిని బలవంతంగా స్వేచ్ఛాజీవిని చేయాలి అని రూసో చెప్పినది నేరస్తులకు మాత్రమే వర్తిస్తుంది. నేరస్తులను సన్మార్గంలో పెట్టడమే దీని ముఖ్యోద్దేశ్యం.

''జనేచ్ఛ పేరుతో కొంతమంది అవినీతి రాజకీయ నాయకులు అధికారాన్ని హస్తగతం చేసుకొని ప్రజలను హింసకు గురిచేసే అవకాశముందని కొందరు విమర్శకులు అభిప్రాయబడ్డారు. ఇటువంటి అనుమానాలకు ఆధారాలులేవని డబ్ల్యూ.టి.జాన్ చెప్పాడు. ప్రజలు విద్యావంతులై సమాజ సమిష్టి శ్రేయస్సును అర్థం చేసుకున్నట్లయితే రాజకీయ నాయకులు అధికారాన్ని దుర్వినియోగాన్ని చేసే అవకాశముండదు.

## 8.9 రాజనీతితత్వ శాస్త్ర చరిత్రలో రూసో స్థానం :

రూసో సిద్ధాంతానికి అంతర్జాతీయ స్వభావం వుంది. రూసో సిద్ధాంతంలో వ్యక్తి సార్వభౌమత్వానికి, రాజ్యసార్వభౌమత్వానికి స్థానముంది. న్యాయమైన సామాజిక, రాజకీయ వ్యవస్థకి రెండూ అవసరమే. రూసో జనేచ్ఛ

భావన కాంట్ వంటి జర్మనీ భావవాదులను, టి.హెచ్. గ్రీన్ వంటి ఆంగ్లభావవాదులను ప్రభావితం చేసింది. ఫ్రెంచి, అమెరికన్ విప్లవవాదులు పై కూడా రూసో సిద్ధాంతం ప్రభావం కనపడుతుంది.

కొబ్బన్ చెప్పినట్లు, 20వ శతాబ్దం నాటి రాజకీయ అంశాలను రూసో చర్చించాడు. అవి ముఖ్యంగా జాతీయవాదం, రాజ్యసార్వభౌమత్వం, ఆర్థిక సమానత్వం ఆవశ్యకత, దానిని సాధించడంలో రాజ్యం పాత్ర, ప్రజారాజకీయాల మూలాధారాలు, స్వేచ్ఛ సమానత్వాల మధ్య సంబంధాలు,, సమాజంలో ఆస్థి ప్రాముఖ్యత మొదలగునవి. రూసో సిద్ధాంతం ప్రజాస్వామ్య సిద్ధాంతం. రూసోని ప్రజాస్వామ్య సాంప్రదాయానికి మూలపురుషుడని చెప్పవచ్చును.

## 8.10 చదువతగిన పుస్తకాలు :


1. M. Judd Harmon, "Political Thought - from Plato to the Present"
2. P.G.Das, "History of Political Thought"
3. Dr. M.V. Subba Rao "ఆధునిక పాశ్చాత్య రాజనీతితత్వ విచారము"


## ప్రశ్నలు :

1. రూసో రాజనీతి సిద్ధాంతాన్ని వివరించండి.
2. రాజనీతిశాస్త్ర చరిత్రలో రూసో స్థానాన్ని సహేతుకంగా చర్చించండి.
3. సామాజిక ఒడంబడిక సిద్ధాంతం - దాని పర్యావసానంపై రూసో అభిప్రాయాలు ఏమిటి ?
4. జనేచ్ఛ అంటే ఏమిటి ? దానికి రూసో ఇచ్చిన ప్రాధాన్యత ఏమిటి ?
5. ప్రాకృతిక వ్యవస్థపై హాబ్స్, లాక్, రూసోల అభిప్రాయాలు వ్రాయండి.
6. సామాజిక ఒడంబడిక ఏవిధంగా, ఎవరిమధ్య జరిగింది ? దానిపై హాబ్స్, లాక్, రూసోల భావాలు వ్రాయండి.
7. రాజ్యం, ప్రభుత్వం, స్వేచ్ఛ, హక్కులపై హాబ్స్, లాక్, రూసోల అభిప్రాయాలు వ్రాయండి.

**రచయిత : యస్. పోలినాయుడు**

పాఠం - 9

# భావవాదం - హెగెల్

విషయసూచిక

9.0 పరిచయం
9.1 జీవిత విశేషాలు - రచనలు
9.2 గతి తార్కిక పద్ధతి
9.3 రాజ్య సిద్ధాంతం
9.4 కుటుంబం
9.5 పౌరసమాజం
9.6 రాజ్యం - దాని లక్షణాలు
9.7 ప్రభుత్వం
9.8 రాజత్వం (Monarchy)
9.9 పాలకవర్గం
9.10 శాసనసభ
9.11 స్వేచ్ఛ
9.12 యుద్ధం - అంతర్జాతీయ సంబంధాలు
9.13 విమర్శనాత్మక పరిశీలన
9.14 సారాంశం
9.15 చదువదగిన పుస్తకాలు

## 9.0 పరిచయం :

రాజనీతి తత్వవిచారణ చరిత్రలో భావవాదం చాలా పురాతనమైనది. భావవాదం ఉనికి ప్రాచీన గ్రీకు రాజనీతి తత్వవేత్త ప్లేటో రాజనీతి తత్వశాస్త్రంలో కనిపిస్తుంది. రాజ్యం అత్యున్నతమైన నైతికవ్యవస్థ అనీ, రాజ్యంలో సభ్యునిగా మాత్రమే వ్యక్తి నైతిక అభివృద్ధిని సాధించగలడని ప్లేటో చెప్పాడు. రాజ్యం అప్పగించిన విధులను నిర్వహించడమే వ్యక్తి ప్రధమ కర్తవ్యం. శాసనానికి మూలం హేతుబుద్ధి కాబట్టి, శాసనాలను ఉల్లంఘించే ప్రశ్న వుండదు.

18వ శతాబ్దంలో సహజన్యాయం, సహజ హక్కులు, సామాజిక ఒడంబడిక సిద్ధాంతాల నుండి భావవాదం జనించింది. రూసో, బర్క్ రచనలు భావవాదానికి పునాదులు వేశాయి. గ్రీకులు వలే వీరు కూడా వ్యక్తి కంటే సమాజం ముఖ్యమని భావించారు. ఆ కాలంలో ప్రబలంగా ప్రచారంలో వున్న జాన్‌లాక్, హ్యూమ్ మొదలగు తత్వవేత్తల భావాల్లోని భౌతిక హేతువాదానికి వ్యతిరేకంగా జర్మనీలో భావవాదతత్వం జనించింది. ఇమాన్యూల్ కాంట్ (Immanuel Kant 1724 - 1804) చారిత్రక అభివృద్ధి వల్ల రాజ్యం ఏర్పడిందని, రాజ్యంపై తిరుగుబాటు చేసే హక్కు ప్రజలకు లేదని వాదించాడు. ఫిచ్టే (Fichte) జర్మనీ ప్రజలలో దేశభక్తిని ప్రేరేపించి జాతీయ ఐక్యతాభావాన్ని చెప్పాడు. అతను రాజ్య అధికారానికి అధిక ప్రాముఖ్యతనిచ్చి రాజ్య అధికారాన్ని ప్రశంసించాడు. ఆధునికి జర్మన్ భావవాదం ఇమాన్యూల్ కాంట్‌తో ప్రారంభమై

హెగెల్ భావాల్లో పరిపూర్ణత సాధించి తాత్విక నిర్దిష్టతను సంతరించుకుంది.

జర్మన్ భావవాదుల స్ఫూర్తితో ఇంగ్లాండ్‌లో ఆక్స్‌ఫర్డ్ భావవాదుల సాంప్రదాయం అభివృద్ధి చెందింది. టి.హెచ్. గ్రీన్, బ్రాడ్లే, బొసాంకే వీరిలో ప్రముఖులు. ఈ ముగ్గురు ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా పనిచేశారు. రాజనీతి సిద్ధాంతంలో అభివృద్ధి చెందిన భావవాదం ప్లేటోకి రుణపడి వుందిని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ఇప్పుడు హెగెల్ భావవాదం గురించి చర్చిద్దాం.

## 9.1 జీవిత విశేషాలు - రచనలు :

జార్జ్‌విల్‌హెం హెగెల్ సుప్రసిద్ధ జర్మన్ రాజనీతి తత్వవేత్త. హెగెల్ 1770 ఆగస్టు 27న స్టుట్‌గర్ట్‌లో జన్మించాడు. ఇతని తండ్రి వర్ట్‌మ్‌బర్గ్ రాజ్యంలో ఒక చిన్న ప్రభుత్వ ఉద్యోగి. స్టుట్‌గర్డ్ నగరంలో గ్రామర్ స్కూలులో 18 సంవత్సరాల వయస్సు వచ్చిన వరకు ప్రాథమిక విద్యను అభ్యసించాడు. 1793లో తుబిన్‌జెన్ విశ్వవిద్యాలయంలో క్రైస్తవ ధర్మశాస్త్రమును అభ్యసించడానికి చేరాడు. 1805 నుండి జెనా విశ్వవిద్యాలయంలో విద్యార్థిగా చేరి అందులోనే అధ్యాపకుడిగా పనిచేశాడు. 1806లో ఫ్రాన్స్‌కు, జర్మనీకి జరిగిన జెనాయుద్ధంలో ఫ్రాన్స్ గెలిచింది. దాంతో ఫ్రెంచి విప్లవాన్ని గురించి, నెపోలియన్ గురించి హెగెల్ అభిమానం మెండుగా పెంచుకున్నాడు. నెపోలియన్ మనిషి రూపంలో నున్న చరిత్ర చోదకశక్తిగా భావించాడు. 1818లో బెర్లిన్ విశ్వవిద్యాలయంలో తత్వశాస్త్రం ప్రధానాచార్యుడు పదవిని అలంకరించాడు. బెర్లిన్‌లో హెగెల్ అంతర్జాతీయ ఖ్యాతిని గడించాడు. 1831లో కలరా వ్యాధి సోకి తన 55వ ఏట హెగెల్ మరణించాడు.

**హెగెల్ ముఖ్య రచనలు :** (1) Phenomenology of Spirit (1807), 2) Encyclopiedia of Phylosophical Sciences (1717), 3) The Phylosophy of Right (1821), 4) Phylosophy of History (1837 హెగెల్ మరణాంతరం ప్రచురింపబడింది) హెగెల్ మరణాంతరం అతని ప్రభావం జర్మనీలోనే గాక ఇంగ్లాండు అమెరికాలో కూడా ఎక్కువ అయింది.

హెగెల్ రాజనీతి తత్వసిద్ధాంతంలోని ముఖ్య విషయాలను వివరించేముందు అతను తన సిద్ధాంతాన్ని విశ్లేషించడానికి ఉపయోగించిన పద్ధతిని తెలుసుకుందాం. అతను ఉపయోగించే పద్ధతిని గతితార్కిక పద్ధతి అని అంటారు.

## 9.2 గతి తార్కిక పద్ధతి :

గతితార్కికం అంటే వివిధ అభిప్రాయాలలో ఉన్న స్వచ్ఛమైన అంతిమ నిజాయితీని తెలుసుకొనే ఒక కళ. ఈ పద్ధతిని మొదట ప్లేటో ఉపయోగించాడు. ఈ పద్ధతికి హెగెల్ రాజనీతి తత్వశాస్త్రంలో ప్రముఖస్థానం వుంది. గతితార్కిక పద్ధతిని ఉపయోగించి హెగెల్ తన రాజనీతి తత్వవిచారణను విశ్లేషించాడు. ఈ పద్ధతిలో మూడు విషయాలున్నాయి. (1) వాదం, (2) ప్రతివాదం, (3) సమన్వయం. ప్రతీభావం లేదా హేతువు లేదా చిదాత్మ ఈ మూడు దశలలో అభివృద్ధి చెందుతుంది. ఈ క్రమంలో హేతువు (భావం) తనను తాను వాదంగా ప్రతిపాదించుకుంటుంది. వాదం తనలో తానే కేవలం తనతో మాత్రమే వైరుధ్యం గల ప్రతివాదానికి తావిస్తుంది. వాద, ప్రతివాదాలు గతితార్కిక ఏకత, గతితార్కిక భిన్నత్వం గల విరుద్ధాంశాలైనందువల్ల ఘర్షణకు లోనవుతాయి. వాదానికి, ప్రతివాదానికి జరిగే ఘర్షణ వాటిలో అసంగతాల పతనానికి కారణమై, ఆ రెండింటిలోని హేతుశీల గుణాలు ఏకమై సమన్వయంగా వ్యక్తీకరించబడుతుంది. ఈ సమన్వయమే

పరిపూర్ణ హేతువని, సత్యమని భావించేలోగానే అదివాదంగా మారుతుంది. ఈ వాదానికి ప్రతిపాదన వాదనలోనే ఏర్పడి రెండింటికి సంఘర్షణ మొదలవుతుంది. హేతువు లేదా భావం గతితార్కికంగా నిరంతరం తుది పరిపూర్ణత దశను చేరుకున్నంతవరకు తనలోనేగల స్వయం చోదకశక్తి ద్వారా మారుతూనే వుంటుంది. గతి తార్కికంగా మారుతూ పరిపూర్ణతను సాధించిన భావమే హేతు సమన్వితమైన అసలు సత్యం. స్వచ్ఛమైన హేతువు స్వభావసిద్ధంగా తనను తానే బహిర్గతం చేసుకుంటూ అభివృద్ధి చెందుతుంది. తక్కువ పరిపూర్ణత నుంచి నిరపేక్షతకు పయనించి ప్రగతిని సాధించడమే గతితార్కికం. అలా సాధించిన నిరపేక్షతే అంతిమ సత్యం. గతి తార్కిక సిద్ధాంతం ఆధారంగా మార్పు (Change) లోని హేతువాద ప్రక్రియను వివరించాడు. మార్పు, పెరుగుదల, అభివృద్ధి, పరిణామం భ్రమలు కావు.

చరిత్రకి ఒక నిర్దిష్టమైన అర్థం, లక్ష్యం, ప్రాధాన్యత ఉన్నాయని హెగెల్ చెప్పాడు. గతకాలంలో యాదృచ్ఛికంగా, సంబంధరహిత క్రమంలో జరిగిన సంఘటనలను లిఖించడమే చరిత్రకాదని హెగెల్ భావించాడు. చరిత్రకి ఒక వరుస క్రమం వుంది. చరిత్రంటే అభివృద్ధికర పరిణామక్రమం. ప్రపంచంలో నడుస్తున్న హేతువే (Reason of Spirit) మానవచరిత్ర. హేతువునే చిదాత్మ అన్నాడు హెగెల్. చిదాత్మ విరాట్ స్వరూపమే చరిత్ర (History is the human Spirit writ large). గతి తార్కిక పద్ధతి ద్వారా ప్రపంచ చిదాత్మ అభివృద్ధి చెందుతుంది. ప్రపంచ చిదాత్మ భగవంతుని యొక్క హేతువు. దీనికి ఒక స్పష్టమైన ప్రయోజనం వుంది. ప్రపంచానికి భగవంతుడు నిర్ణయించిన ఒక గమ్యం వుంది. ముందుగా నిర్ణయించిన ఈ గమ్యాన్ని చేరడానికి ఆ దిశగా ప్రపంచం పయనిస్తుంది. భగవంతుని నిర్ణయం ప్రకారం గమ్యాన్ని చేరడానికి ప్రపంచం పురోభివృద్ధి చెందుతుంటుందని హెగెల్ భావించాడు. చరిత్ర పూర్తి గమ్యాన్ని చేరినవరకు హేతువు (చిదాత్మ) లక్ష్యం ఎవరికి అర్థంకాదు. ప్రతివానికి గత చరిత్ర మాత్రమే అర్థమౌతుంది. ఇది గతితార్కిక పద్ధతి ద్వారా మాత్రమే వివరింపబడుతుంది. గత చరిత్ర ఆధారంగా ఎంతటి చరిత్రకారుడైన భవిష్యత్తులో జరిగేది చెప్పలేడని హెగెల్ చెప్పాడు.

చరిత్ర చలనం గతితార్కిక పద్ధతి ద్వారా వివరింపబడుతుంది. హేతువు క్రమానుగతంగా వివిధ చారిత్రక దశలలో బహిర్గతమౌతుంది. ప్రతి యుగంలో సంస్థలు, శాస్త్రం, కళలు, మతం, సంస్కృతి అభివృద్ధి చెందుతాయి. వీటి రూపంలో చిదాత్మవ్యక్తమౌతుంది. ఈ అభివృద్ధిని బట్టి ఆ యుగాన్ని అర్థం చేసుకోవచ్చును. జరుగుతున్న చరిత్ర పరిణామంతో మాత్రమే మనిషికి సంబంధం వుంటుంది. చరిత్ర గమనం కఠోరమైనది. ఆ గమనాన్ని మనిషి అటకాయించలేడు, నియంత్రించలేడు.

హెగెల్ గతితార్కిక పద్ధతిననుసరించి చరిత్రని, నాగరికతను, తత్వశాస్త్రాన్ని, ముఖ్యంగా సమాజాన్ని విశ్లేషించాడు. ప్రతిసమాజంలో ఎన్నో సమస్యలుంటాయి. కాని ఆ సమస్యలు సంపూర్ణంగా పరిష్కారం కావు. కాని ప్రతి యుగంలో సాధించిన ప్రగతి దానిముందు యుగంలో సాధించిన ప్రగతి కంటే ఎక్కువని చెప్పవచ్చును. మార్పు, పెరుగుదల, అభివృద్ధి, పరిణామం భ్రమలు కావని హెగెల్ భావించాడు. "మార్పు"లోని హేతువాద ప్రక్రియను గతితార్కిక సిద్ధాంతం ద్వారా హెగెల్ వివరించాడు. హెగెల్ గతితార్కిక వాదం స్వచ్ఛమైన ఆలోచనా ప్రపంచం.

ప్రపంచంలో అనేక మానవ సమాజాలు దశలు దశలుగా అభివృద్ధి చెందే పరిణామక్రమమే చరిత్ర. సమాజ అధ్యయనానికి హెగెల్ గతితార్కిక పద్ధతిని ఉపయోగించాడు. సమాజ నిర్మాణంలో అనేక భాగాలున్నాయి. అవి శాసనాలు, నీతినియమాలు, మతాలు, సంస్థలు. ఇవన్నీ సమాజంలో ముఖ్యాంశాలు. సమాజనిర్మాణంలో రెండవ శ్రేణికి చెందిన

అప్రధాన భాగాలు కూడా వుంటాయి. ఇవన్నీ నిరంతరం చలిస్తుంటాయి. వీటిమధ్య అవి రామంగా ఉద్రిక్తస్థితి కలుగుతుంది. వీటిచలనం ఫలరహితం కాదు. సమాజంలోని వివిధ భాగాలు సర్దుబాటు చేసుకుంటూ వాటిమధ్య సమతౌల్యాన్ని సాధిస్తాయి. కాని ఈ సమతౌల్యాయానికి కొత్త వ్యతిరేక వ్యతిరేక శక్తులు ఏర్పడటంవల్ల భంగం కలుగుతుంది. గతితార్కిక క్రమంలో ఒక దశ వచ్చిన తరువాత దాని తరువాత దశను ఊహించవచ్చును.

సామాజిక మార్పును వివరించడానికి హెగెల్ గతితార్కిక పద్ధతిని ఉపయోగించాడు. సమాజంలో పరివర్తన క్రమేణా గతితార్కికంగా జరుగుతుందని చెప్పారు. ఈ పరిణామంపై ప్రపంచవ్యక్తుల ప్రభావం కూడా ఉంటుందన్నాడు. కాని చరిత్ర ప్రపంచ చారిత్రక వ్యక్తులవల్ల జరగలేదు. చరిత్ర రాజ్యాలవల్ల, రాజ్యాల కొరకు జరగలేదు. చరిత్ర ప్రజలవల్ల, ప్రజలు కొరకు జరిగిందని చెప్పాడు. చరిత్రలో హెగెల్ వంటి విజ్ఞానవంతుల భావం పాత్ర కూడా వుంటుంది. మార్క్స్ తన చరిత్ర విశ్లేషణము హెగెల్ సిద్ధాంతంతో ప్రారంభించాడు. అతను గతితార్కిక భౌతికవాదం ద్వారా సామాజిక మార్పును వివరించి చరిత్ర విషయ స్వభావాన్నే మార్చివేశాడు. హెగెల్ సాంప్రదాయకవాది. మార్క్స్ విప్లవవాది.

## 9.3 రాజ్య సిద్ధాంతం :

"The Phylosophy of Right" హెగెల్ రచించిన అతిముఖ్యమైన రాజకీయ గ్రంథం. ఈ గ్రంధానికి ప్లేటో రచించిన "Republic" హాబ్స్ రచించిన "Leviathan" లతో సమానమైన ప్రాముఖ్యత వుంది. రాజనీతి విషయం మొత్తం ఈ గ్రంథంలో హెగెల్ వివరించాడు. ఈ విషయాల ప్రాముఖ్యత హెగెల్‌కి "ఆధునిక సామాజిక దృష్టి" (Modern Social Vision) ప్రతిపాదకుడుగా పేరుతెచ్చాయి.

హెగెల్ భావవాది. అతని సిద్ధాంతంలో భౌతిక వస్తువుల కంటే, భౌతిక ప్రపంచాన్ని కదిలించే భావాలే ముఖ్యమైనవి. విరుద్ధభావాల సంఘర్షణ వల్ల ప్రగతి ఏర్పడుతుందని, అటువంటి ప్రగతిని సాధించాలంటే భావానికి (Idea) ఒక సాధనం కావాలి. అటువంటి వాస్తవ సాధనమే రాజ్యాలని హెగెల్ భావించాడు. భావం యొక్క ప్రగతిని చరిత్రలో రాజ్యాం ద్వారా సాధించటం జరుగుతుంది. రాజ్యాలు భావాలు యొక్క భౌతిక వ్యక్తీకరణలు, చరిత్రలో ప్రపంచచిదాత్మ (World Idea) ప్రగతికి ప్రాపంచిక సాక్ష్యాలు రాజ్యాలు. ఇప్పుడు హెగెల్ రాజ్యసిద్ధాంతాన్ని గురించి కొంత వివరంగా తెలుసుకుందాం.

హెగెల్ "The Phylosophy of Right" గ్రంధంలో ఆధునిక రాజ్యం సవివరంగా పనిచేయడానికి అవసరమగు మౌలిక వ్యవస్థ రూపకల్పన వివరించాడు. ఆధునిక రాజ్య వివిధభాగాలు కుటుంబం, పౌరసమాజం, న్యాయవ్యవస్థ, ప్రాతినిధ్య శాసనసభలు, ఉద్యోగ స్వామ్యం, రాజరికం, యుద్ధం, అంతర్జాతీయ సంబంధాలు - పాత్ర, విధులను హెగెల్ చర్చించాడు. వీటిలో ముఖ్యమైన కొన్నింటిని ఇక్కడ చర్చిద్దాం.

హెగెల్ తన రాజ్య సిద్ధాంతాన్ని కూడా గతితార్కిక సిద్ధాంతం ఆధారంగానే ప్రతిపాదించాడు. సమాజం, సామాజిక రాజకీయ సంస్థలు వికాస ప్రక్రియను గతితార్కికంగా హెగెల్ వివరించాడు. మానవ సమాజం మొదట కుటుంబవ్యవస్థగా, తర్వాత పౌరసమాజంగా, అటు తర్వాత రాజ్యంగా ఏర్పడి పరిపూర్ణత సాధిస్తుంది.

## 9.4 కుటుంబం :

మానవసమాజం గతితార్కికాభివృద్ధి క్రమంలో కుటుంబ రూపంలో వాదంగా దర్శనమిస్తుంది. కుటుంబం రాజ్యానికి

ప్రథమదశ. కుటుంబంలో వ్యక్తులు ప్రేమానురాగాలతో కలసిమెలసి వుంటారు. కుటుంబంలో వ్యక్తిత్వం స్వతంత్రంగా కాక కుటుంబంలో ఒక భాగంగా మాత్రమే అభివృద్ధి చెందుతుంది. కుటుంబ వ్యవస్థ ఏర్పడటానికి అవసరమగు వివాహం, కుటుంబం, ఆస్థి, పెట్టుబడి, పిల్లల విద్య, కుటుంబ విచ్ఛిన్నం మొదలగు విషయాలను హెగెల్ చర్చించాడు. పిల్లలు పెరిగి వయోజనులను అయిన తర్వాత వివాహ వ్యవస్థ ద్వారా వారు ప్రత్యేక కుటుంబాలుగా ఏర్పడతారు. దీనితోపాటు ఆస్థివిభజన కూడా జరుగుతుంది. ప్రత్యేక కుటుంబాలు ఏర్పాటు, ఆస్థి విభజన సమాంతరంగా జరుగుతాయి. కుటుంబ వ్యవస్థ మానవుని అవసరాలన్నీ తీర్చలేదు. కాబట్టి కుటుంబవాదం తన ప్రతివాదమైన పౌరసమాజాన్ని తనలో నుండే ఏర్పరచుకుంటుంది.

## 9.5 పౌరసమాజం :

ఆడమ్‌స్మిత్, డేవిడ్ రికార్డో వంటి ఆర్థిక శాస్త్రవేత్తలు వర్ణించినటువంటి ఉత్పత్తిదారుల సమాజమే హెగెల్ చెప్పిన పౌరసమాజం. పౌరసమాజంలో పరస్పర సంబంధమున్న వివిధ విషయాలు మూడు వున్నాయి. అవి (1) అవసరాలక్రమం(The System of Needs). ఈ సమాజంలో ప్రతివ్యక్తి అతని ఇష్టానుసారం, శక్తిసామర్థ్యాలననుసరించి అతని ప్రయోజనాల కొరకు పాటుపడతాడు. ఈ సమాజంలో శ్రమవిభజన వుంటుంది. (2) శాంతిభద్రతలు కాపాడటానికి పోలీస్ వ్యవస్థ వుంటుంది. (3) న్యాయనిర్వహణ వుంటుంది. పౌరసమాజంలో విశ్వజనీనమైన నిరంతర పోటీ ఒక ముఖ్యలక్షణం. కాబట్టి పౌరసమాజంతో సహకారం అవసరం. ఈ పౌరసమాజం విస్తృతంగా పెరిగి పెద్దదై రాజ్యంగా అవతరిస్తుంది. ప్రేమ, త్యాగంతో కూడిన కుటుంబమనే వాదానికి, పరస్పర పోటీతో కూడిన పౌరసమాజమనే ప్రతివాదానికి ఏర్పడిన వైరుధ్యాలు ఫలితమే జాతిరాజ్యమని హెగెల్ చెప్పాడు. కుటుంబానికి, పౌరసమాజానికి మధ్య ఏర్పడిన సంఘర్షణ వల్ల ఏర్పడిన సమన్వయమే జాతిరాజ్యం. కుటుంబం, పౌరసమాజాల సంశ్లేషణమే రాజ్యమని హెగెల్ వివరించాడు.

ఆదిమ కాలంలో మానవ సముదాయాలుండేవి. కాని అవిపౌర సమాజాలు కావు. ప్రాచీన కాలంలో తెగలు, వంశాలు మాత్రమే వుండేవి. వీటి విచ్ఛిన్న ఫలితంగా పౌరసమాజం, రాజ్యం ఏర్పడ్డాయి. హెగెల్ బూర్జువా వర్గానికి చెందినవాడు కాబట్టి తన రాజనీతి సిద్ధాంతంలో పౌరసమాజానికి స్థానం కల్పించాడు అని సెబైన్ (Sabine) చెప్పాడు.

వ్యక్తులకు, రాజ్యానికి మధ్య పౌరసమాజం వస్తుంది. రాజ్యం లేకుండా పౌరసమాజం స్వతంత్రంగా మనుగడ చేయలేదు. అది రాజ్య అధీనంలో మాత్రమే పనిచేయగలదు. పౌరసమాజానికి ప్రత్యేక ఇచ్ఛలేదు. కాని అది ప్రముఖపాత్రను పోషిస్తుంది. పౌరసమాజంలోనే వ్యక్తులకు సామాజిక జీవనం లభిస్తుంది. రాజ్యంలో సభ్యులుగా వుండే యోగ్యతన వ్యక్తులకు పౌరసమాజంలో లభిస్తుంది. వ్యక్తులు పౌరసమాజంలో నేర్చుకున్న విలువలు రాజ్యంలో రూపుదిద్దుకుంటాయి. కలసి పనిచేయడం అనే సూత్రాన్ని పౌరసమాజంలోనే వ్యక్తులు నేర్చుకుంటారు. పౌరసమాజంలో వృత్తిసంఘాలు, కార్పోరేషన్లు అభివృద్ధి చెందుతాయి. సమిష్టి ప్రయోజనాలు, సమాజ సంక్షేమం మొదలగు భావాలు బూర్జువా సమాజంలోని వివిధ సంఘాలు పెంపొందిస్తాయి.

## 9.6 రాజ్యం - దాని లక్షణాలు :

గతితార్కిక ప్రక్రియలో అంతిమ, అత్యున్నత దశ జాతి రాజ్యమని హెగెల్ చెప్పాడు. నిజమైన మానవ స్వభావం

రాజ్యాన్ని కావాలని కాంక్షిస్తుంది. హాబ్స్ చెప్పినట్లు మానవభద్రతకు మాత్రమే రాజ్యం అవసరమని హెగెల్ భావించాడు. రాజ్యంలో సభ్యుడుగా వ్యక్తి తన స్వాతంత్ర్యాన్ని పొందగలడు. రాజ్యానికి, వ్యక్తి స్వేచ్ఛకు మధ్య వైరుధ్యం లేదు. రాజ్యంలోనే వ్యక్తికి నిజమైన స్వేచ్ఛ లభిస్తుంది. కాబట్టి మానవుని స్వేచ్ఛను వ్యక్తంచేసే అత్యున్నత సాధనంగా రాజ్యం అవసరమని హెగెల్ భావించాడు. రాజ్యం వెలుపల వ్యక్తికి అస్తిత్వమే లేదు. రాజ్యానికి, వ్యక్తికి వైరుధ్యం లేదు.

బూర్జువా సమాజంలో ప్రత్యేకతకు విశ్వజనీనతకు మధ్య సమన్వయం పాక్షికంగానే సాధ్యమవుతుంది. రాజ్యంలోనే ఆ రెండింటి మధ్య సమన్వయం సంపూర్ణంగా సాధ్యమవుతుంది. రాజ్యంలో ప్రతివ్యక్తి లక్ష్యం, విశ్వజనీన లక్షం మిళితమైపోతాయి. కుటుంబానికి, పౌరసమాజానికి మధ్య ఐకమత్యం, సామరస్యం రాజ్యంలో మాత్రమే సాధ్యపడుతుంది. అందువల్ల కుటుంబం, పౌరసమాజాల సంశ్లేషణమే రాజ్యమని హెగెల్ చెప్పాడు. రాజ్యం వ్యక్తుల సమూహంకాదు. హెగెల్ అభిప్రాయంలో రాజ్యం వివిధ గుంపుల కలయిక.

రాజ్యం దానిలోవున్న హేతుబద్ధ అంశంపై ఆధారపడి ఏర్పడిన ఒక సామాజిక వ్యవస్థ. విశ్వజనీన మానవ చిదాత్మ ద్వారా రాజ్యం రూపొందించబడింది. అందువల్ల వివేచనాత్మకమైనది. విశ్వజనీనత, హేతుబద్ధత వుండటంవల్ల రాజ్యం వాస్తవమైనది. వాస్తవం యొక్క అత్యున్నత స్వరూపమే రాజ్యం.

హెగెల్ సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని అంగీకరించలేదు. భగవంతుని యొక్క అవతారమే రాజ్యమని హెగెల్ భావించాడు. నిజానికి రాజ్యమే దైవం. భూమిపై నడిచే భగవంతుడే రాజ్యం (State is the March of God on Earth). అది ఒక స్వయంపోషక నైతిక సంస్థ. కాబట్టి రాజ్యం పై నైతికపరమైన, శాసనపరమైన ఎటువంటి ఆంక్షలు వుండవు. రాజ్యమే నైతికవిలువలకు, శాసనాలకు మూలము. సంపూర్ణ హేతువుకు రూపమైన రాజ్యం మంచి చెడులను, తప్పు - ఒప్పులను నిర్ణయిస్తుంది. రాజ్యం నైతిక స్వరూపం. అది మానవుని సత్ప్రవర్తన కోసం నైతిక విలువలు రూపొందిస్తుంది.

హెగెల్ చెప్పిన రాజ్యం ఒక జీవివంటిది. ఇది సహజంగా అభివృద్ధి చెందుతుంది. ఇది అంగాంగి పరిపూర్ణ హేతురూపం. వ్యక్తులు, చిన్న చిన్న సంస్థలు, సంఘాలు రాజ్యంలోని భాగాలు. వీటిని రాజ్యం నుండి వేరుచేయడానికి వీలుపడదు. అవి రాజ్యంలో భాగాలుగా ఉన్నప్పుడే వాటికి గుర్తింపు వుంటుంది. రాజ్యం నశిస్తే దాని భాగాలు వాటి ఉనికిని పోగొట్టుకుంటాయి. రాజ్యం రాజ్యం కొరకు వుంది. రాజ్యానికి లక్ష్యం రాజ్యమే. వ్యక్తులు రాజ్యం కొరకు వున్నారుగాని, రాజ్యం వ్యక్తుల కొరకులేదని హెగెల్ భావించాడు. రాజ్యంలో భాగంగా మాత్రమే వ్యక్తి, కుటుంబం, పౌరసమాజం తమ తమ పరిపూర్ణ లక్ష్యాలను, రక్షణను సాధించుకోగలవు. వ్యక్తి నీతిని, రాజనీతి నుండి, వ్యక్తి స్వేచ్ఛను, రాజ్యం స్వేచ్ఛ నుండి విడదీయలేము.

రాజ్యానికి సార్వభౌమత్వం వుంటుంది. జాతీయ (ఆంతరంగిక) అంతర్జాతీయ వ్యవహారాలలో రాజ్యం సర్వస్వతంత్రంగా వ్యవహరిస్తుంది. వ్యక్తి స్వేచ్ఛకు, అతను రాజ్యం పట్ల చూపించే విధేయతకు పరస్పర వ్యతిరేక లేదు. నిరపేక్ష అధికారంతో కూడిన సర్వశక్తిమంతమైన రాజ్యం ఎప్పుడు బాధ్యతా రహితంగా ప్రవర్తించదు. రాజ్యం పౌరుల సామాజిక విలువలకు ప్రాతినిధ్యం వహించుటవల్ల దాని చర్యలను ప్రశ్నించే హక్కు ఎవరికీలేదు. రాజ్యం దైవేచ్ఛ ఫలితం కాబట్టి మానవుడు రాజ్యం పట్ల పూర్తిగా విధేయుడై వుండాలి. వ్యక్తి లక్ష్యంకన్నా రాజ్యలక్ష్యం ఉన్నతమైనది.

అందువలన వ్యక్తి స్వప్రయోజనాలను అవసరమైనప్పుడు రాజ్య లక్ష్యసాధనకు త్యాగం చేయాలి.

ఇతర రాజ్యాలతో వున్న సంబంధాలలో రాజ్యం రాజ్యభద్రతకు ప్రాముఖ్యత ఇవ్వాలి. ఈ విషయంలో రాజ్యం ఏవిధమైన రాజీపడకూడదు. రాజ్యం తన భద్రత గురించి ఎటువంటి నిర్ణయం తీసుకున్నా అదే అత్యున్నత శాసనం. రాజ్య ప్రయోజనాలను, సార్వభౌమత్వాన్ని కాపాడటమే రాజ్యం యొక్క అత్యున్నత నైతికధర్మం. ఈ విధిని నిర్లక్ష్యం చేయడమే పాపమని హెగెల్ చెప్పాడు. రాజ్యానికి యుద్ధాన్ని ప్రకటించే హక్కువుంది.

హెగెల్ వివరించిన రాజ్యలక్షణాల ఆధారంగా కార్లపాపర్ హెగెల్ రాజ్యసిద్ధాంతంలో అధికారవాద లక్షణాలున్నాయని భావించాడు. హెగెల్ అధికారవాద జాతీయవాదాన్ని అభివృద్ధిచేశాడు. జర్మనీ జాతీయవాదం గురించి చెప్పుతూ ఇతర జాతి రాజ్యాలన్నింటికంటే జర్మనీ గొప్పదని వివరించాడు. యుద్ధాన్ని ప్రశంసిస్తూ సమర్థించాడు. పౌరసమాజానికి వర్తించే నీతినియమాలు రాజ్యానికి వర్తించవని చెప్పాడు. హెగెల్ చెప్పిన రాజ్యలక్షణాలు, ముస్సోలినీ, హిట్లర్ ఫాసిస్టు రాజ్యాల లక్షణాలను మధ్య చాలా పోలికలున్నాయి.

## 9.7 ప్రభుత్వం :

రాజ్యం, ప్రభుత్వం రెండూ వాస్తవాలే అని హెగెల్ చెప్పాడు. వాటి ఉనికిని కాదనలేము. కాబట్టి అవి హేతువులు. సంపూర్ణంగా అభివృద్ధిచెందిన రాజ్యంలో ప్రభుత్వం వుంటుంది. హెగెల్ ప్రభుత్వ అధికారాలను మూడురకాలుగా విభజించాడు. అవి : (1) రాజ్యంలో విశ్వజనీనతను నిర్ణయించి ఏర్పరచడం. ఇది శాసనాధికారం. (2) విశ్వజనీనత క్రింద ప్రత్యేక విషయాలను చేర్చటం. ఇది పాలకవర్గ అధికారం. (3) రాజరికం, పై రెండు రకాల విధులను చక్రవర్తి సమన్వయపరుస్తాడు. ఈ విధమైన ప్రభుత్వాధికారాల విభజనలో న్యాయశాఖకు స్వతంత్ర ప్రతిపత్తిని ఇవ్వలేదు. పాలకవర్గమే న్యాయనిర్ణయాలు చేస్తుంది. అంటే పాలకవర్గంలో ఒక భాగమే న్యాయశాఖ. హెగెల్ చెప్పిన అధికారాల విభజన మాంటెస్క్యూ చెప్పిన అధికారాలు విభజనకంటే భిన్నంగా వుంది. మాంటెస్క్యూ ప్రభుత్వ అధికారాలను శాసనసభ, కార్యనిర్వాహక శాఖ, న్యాయశాఖల మధ్య విభజించాడు. హెగెల్ అధికార విభజన సిద్ధాంతంలో న్యాయశాఖ పాలకవర్గంలోని భాగం. శాసనసభ పాలకవర్గం విధులలో పాల్గొంటుంది. ఈ రెండు శాఖల కార్యనిర్వహణలను పర్యవేక్షిస్తూ వాటి కార్యకలాపాలను చక్రవర్తి సమన్వయపరుస్తాడు. శాసనసభకు, కార్యనిర్వహణ శాఖకు స్వయంపాలనాధికారాలంటే రాజ్యవినాశనం జరుగుతుందని హెగెల్ భావించాడు.

## 9.8 రాజత్వం (Monarchy) :

రాజ్యాంగబద్ధమైన రాజరికాన్ని హెగెల్ సమర్థించాడు. ఇటువంటి రాజత్వం సంపూర్ణంగా వివేచనాత్మకమైనదని హెగెల్ భావించాడు. పూర్తిగా అభివృద్ధి చెందిన రాజ్యానికి ప్రభుత్వ కార్యనిర్వహణలన్నింటిని సమన్వయం చేసేందుకు రాజ్యాధినేతగా ఒక వ్యక్తి అవసరం. అతను రాజ్యాధికారానికి ఒక చిహ్నం. అతను సార్వభౌమాధికారానికి, రాజ్య ఐక్యమత్యానికి ప్రతినిధి. ఇతనే చక్రవర్తి. రాజ్య ముఖ్యలక్షణమైన సార్వభౌమాధికారాన్ని నిర్ధిష్టమైన ఒక వ్యక్తి ద్వారా వ్యక్తం చేయాలి. ఆ వ్యక్తి చక్రవర్తి. అతను వంశపారంపర్యంగా వచ్చేవాడై వుండాలని హెగెల్ అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. రాజ్యాంగ బద్ధమైన రాజత్వమే సంపూర్ణమైన వివేచనాత్మకమైన రాజ్యమని హెగెల్ చెప్పాడు. హెగెల్ రాజ్యాంగబద్ధ రాజ్యానికి నమూనా ఇంగ్లాండు రాజ్యాంగబద్ధ రాజరిక వ్యవస్థ.

హెగెల్ చెప్పిన రాజ్యాంగబద్ధ రాజరికంలో చక్రవర్తికి నిరపేక్ష అధికారాలుండవు. అతను అధికారాలను ఇష్టానుసారంగా చెలాయించడానికి వీలుండదు. అతను రాజ్యానికి ఒక లాంఛన ప్రాయమైన అంగం మాత్రమే. చక్రవర్తికి పెద్దతెలివితేటలుగాని, పాలనా సామర్థ్యాలుగాని వుండనక్కరలేదని హెగెల్ చెప్పాడు. ప్రభుత్వ ముఖ్యవిధులు ఇతర ప్రభుత్వ సంస్థలు నిర్వహిస్తాయి. వాస్తవంలో రాజ్యకలాపాలు బాధ్యతగల మంత్రులు నిర్వహిస్తారు. ప్రభుత్వ కార్యకలాపాలకు చక్రవర్తి బాధ్యత వహించడు. రాజ్యాంగబద్ధ రాజ్యంలో శాసనం అత్యున్నతాధికారి. అటువంటి రాజ్యానికి ఆధారం శాసనమే. హెగెల్ నిరపేక్ష రాజరికాన్ని నిరాకరించాడు. మాంటెస్క్యూ చెప్పిన అధికారాల విభజనను కూడా అంగీకరించలేదు.

## 9.9 పాలకవర్గం :

ప్రభుత్వ రెండవఅంగం పాలకవర్గం. ఇందులో పౌర ఉద్యోగులు వుంటారు. వీరినే ఉద్యోగస్వామ్యం అని అనవచ్చు. ఇది పరిపాలన క్రమానుగత శ్రేణిలో వుంటుంది. పౌరవుద్యోగులను విశ్వజనీన వర్గం అని కూడా హెగెల్ అన్నాడు. ఎందుకంటే వీరి దృక్పథం విశ్వజనీనత. వీరు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తారు. ఏ ప్రత్యేక వర్గానికి ప్రాధాన్యతనివ్వరు. సమాజ ప్రయోజనాలకు మాత్రమే ప్రాధాన్యతనిస్తారు. వీరికి ప్రజలందరి కార్యకలాపాలతో సంబంధముంటుంది.

పౌర ఉద్యోగులను కులీనవర్గాల నుండి ఎంపిక చేయకూడదని హెగెల్ చెప్పాడు. ఆధునిక మధ్య తరగతుల నుండి పౌర ఉద్యోగులను ఎంపిక చేయాలి. ఈ వర్గం ప్రజలకు తెలివితేటలుంటాయని హెగెల్ భావించాడు. నిజాయితీ, తెలివితేటలకు సంబంధించినంతవరకు ఈ వర్గంవారు రాజ్యానికి ఒక ఆధారంగా పనిచేస్తారు. వీరు విద్యావంతులు. వీరికి నిపుణత వుంటుంది. సమాజ ప్రయోజనాలను, రాజ్యలక్ష్యాలను పౌర ఉద్యోగలు బాగా నేరవేర్చగలరు. శాసనాలకు సంబంధించిన ప్రతిపాదనలను పౌర ఉద్యోగులే చేస్తారు. సాధారణంగా ఉన్న శాసనాలను, ప్రత్యేక సందర్భాలలో పాలకవర్గం అమలుచేస్తుంది.

పుట్టుకను బట్టి కాకుండా, వ్యక్తుల యొక్క సామర్థ్యాన్నిబట్టి పౌర ఉద్యోగులను ఎంపిక చేయాలి. పౌర ఉద్యోగులుగా చేరడానికి అందరికి అవకాశం వుండాలి. పాలకవర్గంలో సభ్యులుగా చేరడానికి, ధనం, వంశం, పుట్టుక, పరిమితులు కాకూడదని హెగెల్ భావించాడు. స్వశక్తి, శీలం, యోగ్యత ఉన్న ఏ వ్యక్తైనా పాలకవర్గంలో చేరవచ్చు.

## 9.10 శాసనసభ :

శాసనసభలో రెండు సభలుంటాయి. అవి (1) భూస్వాముల ప్రతినిధుల సభ, (2) వృత్తిపనివాళ్ళ సంఘాల ప్రతినిధుల సభ. వయోజన ఓటుహక్కును హెగెల్ తిరస్కరించాడు. హెగెల్ దృష్టిలో అసంఖ్యాకులైన సామాన్యప్రజలు అవివేకులు, అజ్ఞానులు, మూర్ఖులు, స్వార్థపరులు, అనాగరికులు. వారికి ఏది మంచిదో వారు తెలుసుకోలేరు. రాజ్యవ్యవహారాలను కార్యకలాపాలను నిర్ణయించే తెలివితేటలు వారికి వుండవని హెగెల్ భావించాడు.

శాసనసభ ముఖ్యవిధి శాసనాలు చేయడంకాదు. పాలకవర్గానికి సలహాదారుగా శాసనసభ పనిచేస్తుంది.

ఉద్యోగిస్వామ్యాన్ని నియంత్రణ చేయలేదు. ఈ సభ చక్రవర్తి ఆజ్ఞమేరకు సమావేశమౌతుంది. శాసనాలు చేయడం దీని ముఖ్య విధి కాదు. అయినప్పటికి శాసనసభ సభ్యులవల్ల అనేక ముఖ్యమైన ప్రయోజనాలుంటాయి. శాసనసభ సభ్యులకు క్రిందిస్థాయి పరిపాలనా వ్యవహారాలతో సన్నిహిత సంబంధం వుంటుంది. పాలకవర్గం విధులపై పరిశీలకులుగా, విమర్శకులుగా శాసనసభ్యులు పనిచేస్తారు. సామాన్య ప్రజల ప్రయోజనాల దృష్ట్యా వ్యవహరించేలాగ పాలకవర్గాన్ని ప్రోత్సహిస్తారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్యవర్తులుగా పనిచేస్తారు. శాసనసభాసభ్యులు ప్రత్యేక ప్రయోజనాలకు ప్రతినిధులు. అయినప్పటికి రాజ్యం ప్రభుత్వంపై ఆధారపడి వుందన్న విషయాన్ని వారు అర్థం చేసుకుంటారు. సమాజం యొక్క అంగాంగిక ఐక్యతను వృద్ధిచేయడానికి ఉపయోగపడతారు.

## 9.11 స్వేచ్ఛ :

మానవుని అంతిమ లక్ష్యం స్వేచ్ఛను పొందడం. స్వేచ్ఛ మానవుని విశిష్ఠలక్షణం. ప్రాకృతిక వ్యవస్థలో మానవులు స్వేచ్ఛాజీవులన్న సామాజిక ఒడంబడిక సిద్ధాంతకర్తలు వాదనను హాస్యాస్పదమని హెగెల్ హేళన చేశాడు. స్వేచ్ఛ రాజ్యపరంగా మాత్రమే లభిస్తుంది. రాజ్యాన్ని, దాని సంస్థలను గుర్తించి సామాజిక నైతిక జీవనంలో మానవుడు భాగస్వామిగా కృషిచేయడం వల్లనే అతనికి స్వేచ్ఛ లభిస్తుంది. రాజ్యాభీష్టానికి అనుకూలంగాను, దాని అధికారానికి విధేయులుగాను ఉన్నప్పుడే మానవులకు నిజమైన స్వేచ్ఛ వుంటుంది. రాజ్యాధికారానికి వ్యతిరేకంగా నడిచినప్పుడు గాని, వ్యక్తి తన స్వార్థఇచ్ఛ ప్రకారం ప్రవర్తించినప్పుడు కాని వ్యక్తి స్వేచ్ఛను పోగొట్టుకొంటాడు. పౌరునిగా రాజ్యంతో వ్యక్తికి ఉన్న సంబంధాన్ని బట్టే అతని ప్రాధాన్యత, స్వేచ్ఛ వుంటుంది.

వ్యక్తి రాజ్యపరిధిని దాటితే అతనికి స్వేచ్ఛ వుండదు. కాబట్టి వ్యక్తిని బలవంతంగానైనా రాజ్యాధికారానికి విధేయుడైనట్లుగా చూడాలి. హెగెల్ దృక్పథంలో రాజ్యానికి వ్యక్తి స్వేచ్ఛకి మధ్య వైరుధ్యంలేదు. భయంతో రాజ్యానికి విధేయత చూపితే అది నిజమైన స్వేచ్ఛకాదని హెగెల్ భావించాడు. విభిన్న సంస్థల సముదాయాల ద్వారా వ్యక్తి స్వేచ్ఛ బహిర్గతమవుతుంది. రాజ్యం సామాజిక నైతిక విలువలకు స్వరూపము. కాబట్టి రాజ్యంలోనే రాజ్యసభ్యునిగా, రాజ్యాధికారానికి విధేయుడుగా వున్నప్పుడే వ్యక్తికి నిజమైన స్వేచ్ఛ లభిస్తుంది.

## 9.12 యుద్ధం - అంతర్జాతీయ సంబంధాలు :

యుద్ధాన్ని ప్రకటించే సర్వాధికారం రాజ్యానికి వుంది. అంతర్జాతీయ న్యాయం ప్రకారం వివిధ రాజ్యాల మధ్య జరిగే ఒప్పందాలను రాజ్యాలు గౌరవించాలి. ప్రతి రాజ్యానికి తన ప్రత్యేక ఇచ్ఛ వుంటుంది. రాజ్యాల మధ్య విశ్వజనీనత వుండదు. వాటిమధ్య సమన్వయం వుండదు. ఏ విషయానికైనా సంబంధించి రాజ్యాల మధ్య ఒప్పందం కుదరనపుడు యుద్ధం ద్వారా ఆ విషయాన్ని పరిష్కరించుకోవాలి. యుద్ధాన్ని చెడుగా భావించరాదన్నాడు. దానిని ఒక ఆకస్మిక దుర్ఘటనగా భావించాలని చెప్పాడు.

రాజ్యానికి యుద్ధం మంచిదని హెగెల్ సమర్థించాడు. యుద్ధానికి నైతిక విలువ వుంది. ప్రజలలో వున్న అంతరంగిక అసమ్మతులను అవినీతిని ప్రోత్సహించదు. ప్రజలలో దేశభక్తిని పెంపొందిస్తుంది. పౌరులలో దేశసమిష్టి రక్షణ పట్ల ఉత్సాహాన్ని ప్రోత్సహించి, రాజ్యం నిర్వహించే విధులలో పాల్గొనేటట్లు చేస్తుంది. యుద్ధం మానవుని

దినచర్యలలోని అల్పత్వాన్ని విడనాడి, అతనికి విస్తృత సమాజలక్ష్యాలతో ఐకమయ్యేటట్లు చేస్తుంది. రాజ్యం శక్తిసామర్థ్యాలు పౌరుల ప్రోత్సాహంపై ఆధారపడివుంటాయి. క్రమానుగత శ్రేణితో కూడిన బలమైన సైన్యం కూడా రాజ్యానికి అవసరం అని హెగెల్ చెప్పాడు. హెగెల్ కాలంలో అభివృద్ధి చెందుతున్న జాతీయవాదాన్ని హెగెల్ సమర్థించాడు. కాంట్ సుస్థిర ప్రపంచశాంతి వుంటుందని నమ్మాడు. హెగెల్ అటువంటి శాంతి కేవలం ఒక పగటికల మాత్రమే అని చెప్పాడు.

యుద్ధానికి కారణాలు మానవ స్వభావంలో ఉన్నాయని, కాబట్టి యుద్ధాన్ని నివారించటానికి న్యాయసూత్రాల ద్వారా వీలుపడదని హెగెల్ భావించాడు. ప్రతిరాజ్యం సార్వభౌమాధికారం గల స్వతంత్ర రాజ్యం. అది స్వతంత్ర రాజ్యంగా మాత్రమే వ్యవహరిస్తుంది. ఇటువంటి రాజ్యాలపై ఏ ఇతర లేదా మరొక అధికారి వుండరు. అంతర్జాతీయ శాసనాన్ని అమలుజరిపే ఉన్నతాధికారి లేడు కాబట్టి, రాజ్యాల మధ్య సంబంధాలు ప్రాకృతిక వ్యవస్థను పోలివుంటాయని హెగెల్ భావించాడు. రాజ్యాల మధ్య సంబంధాలలో న్యాయం, అన్యాయం అనే ప్రసక్తి వుండదని హెగెల్ చెప్పాడు. ఈ విషయంలో హెగెల్, హాబ్స్ ఒకే అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. యుద్ధాన్ని సమర్థించిన హెగెల్ అంతర్జాతీయ లక్ష్యాలను, సాంప్రదాయాలను, అంతర్జాతీయ చట్టాన్ని, భద్రతను నమ్మలేదు. వాటిలో అతనికి విశ్వాసం లేదు. అంతర్జాతీయ సంబంధాలలో నీతినియమాలకు, విలువలకు స్థానంలేదు అని, వాటిని పాటించవలసిన ప్రశ్నేలేదని అతను చెప్పాడు.

## 9.13 విమర్శనాత్మక పరిశీలన :

రాజనీతి తత్వవిచారణ చరిత్రలో హెగెల్ స్థానంపై భిన్నాభిప్రాయాలు వున్నాయి. అదేవిధంగా అతను రాజనీతి సిద్ధాంతానికి చేసిన సేవపై కూడా ఏకాభిప్రాయం లేదు. ఇతని సిద్ధాంతంలో కొన్ని లోపాలున్నాయి. వాటిని ఈ క్రింది విధంగా చెప్పవచ్చును.

1. రాజ్యం భూమి మీద వెలసిన భగవంతుని స్వరూపమని భావించి రాజ్యం యొక్క దైవత్వాన్ని విశ్వసించాడు. జాతీయ రాజ్యాన్ని దైవసమానంగా స్తుతించాడు. నిరంకుశ రాజ్యాధికారాలను సమర్థించాడు. ఈ విధమైన రాజ్యాధికారాలకు వ్యక్తిని బలిపశువుగా చేశాడు.

2. హెగెల్‌కి విశ్వజనీనత చరిత్రలో నమ్మకం వున్నప్పటికి, అతను తన సమకాలీన దురాభిమానాలకు అతీతంగా వుండలేకపోయాడు.

3. సామాజిక ప్రక్రియలో మార్పులను తేవడంలో శాస్త్రం యొక్క పాత్రను హెగెల్ సక్రమంగా అవగాహన చేసుకోలేదు.

4. హెగెల్ చెప్పిన స్వేచ్ఛాసిద్ధాంతం కూడా అంగీకారం కాదు. రాజ్యాధికారానికి బద్ధుడైనప్పుడే వ్యక్తికి స్వేచ్ఛ వుంటుందన్న హెగెల్ వాదన అంగీకారంకాదు. అంతేకాకుండా హెగెల్ ప్రజాస్వామ్య సిద్ధాంతానికి వ్యతిరేకి. ఇతని సిద్ధాంతంలో ప్రభుత్వాన్ని విమర్శించే అవకాశం, హక్కు, అధికారం వ్యక్తులకు లేదు. శాసన నిర్మాణ ప్రక్రియలో ప్రజలు పాల్గొనే అవకాశం ఇతని సిద్ధాంతంలో లేదు. అంతర్జాతీయ అరాచక వాదాన్ని సమర్థించాడు.

ఇప్పుడు రాజనీతి తత్వవిచారణ చరిత్రలో హెగెల్ స్థానాన్ని పరిశీలిద్దాం. హెగెల్ రాజనీతి సిద్ధాంతాన్ని విశ్లేషించి వర్గీకరించడం చాలా కష్టమైనపని. పరస్పర విరుద్ధం గల ఫాసిస్టు, కమ్యూనిష్టు సిద్ధాంతాలకు హెగెల్ మూలపురుషుడని

కొంతమంది విమర్శకులు అభిప్రాయపడ్డారు. భిన్న స్వభావాలు గల ఈ రెండు సిద్ధాంతాలను సమర్థించడానికి హెగెల్ రాజనీతి సిద్ధాంతాన్ని ఉపయోగించారు.

హెగెల్ ప్రతిపాదించిన రాజ్యసిద్ధాంతం యొక్క ప్రభావం రెండు ప్రపంచయుద్ధాల మధ్యకాలంలో ఆవిర్భవించిన ఫాసిజం, నాజీజం మీద వుంది. ఈ రెండు సిద్ధాంతాలు ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం. అవి తీవ్రజాతీయతాభావాన్ని, యుద్ధాన్ని సమర్థించాయి. వ్యక్తి కంటే రాజ్యం గొప్పదని, హక్కులు కంటే బాధ్యతలు ప్రధానమని చెప్పాయి. హెగెల్ చెప్పిన జాతిరాజ్య భావన, అధికారం, నీతి ఒక్కటే అన్నభావన, అంతర్జాతీయ అరాచకవాదం మొదలైనవి ఫాసిస్టు సిద్ధాంతానికి దారితీసాయి.

హెగెల్ చెప్పిన గతితార్కిక సిద్ధాంతం మార్క్సు చెప్పిన గతితార్కిక భౌతిక సిద్ధాంతానికి ఆధారమైంది. హెగెల్ చెప్పిన జాతుల మధ్య వైరుధ్యం అనే సిద్ధాంతం నుంచి మార్క్స్ వర్గపోరాట సిద్ధాంతాన్ని రూపొందించాడు. హెగెల్ తలక్రిందులు చేసిన గతితార్కిక భావవాదాన్ని సరిదిద్దాలని మార్క్సు చెప్పాడు.

ఇంగ్లీషు ఆక్స్‌ఫర్డ్ భావవాదులు పై కూడా హెగెల్ ప్రభావం పడింది. ఆక్స్‌ఫర్డ్ భావవాదులు ఇంగ్లీషు ఉదారవాదాన్ని పునర్విమర్శించి సవరణ చేయడంలో హెగెల్ సిద్ధాంతాన్ని ఒక ముఖ్యాంశంగా ఉపయోగించారు. హెగెల్ భావవాదంలోని అధిక భాగాన్ని ఇంగ్లీషు ఉదారవాదంతో చేర్చడంతో ఆక్స్‌ఫర్డ్ భావవాదం జనించింది.

హెగెల్ సంపూర్ణాధికారాన్ని సమర్థించాడా ? హెగెల్ అధికారవాదాన్ని సమర్థించాడు. కాని హెగెల్ చెప్పిన సిద్ధాంతం సంపూర్ణాధికారవాదం కాదు. హెగెల్ చెప్పిన రాజ్యం హేతుబద్ధ అంశం ఆధారంగా ఏర్పడిన ఒక స్వయంపోషక సామాజిక నైతికసంస్థ. ఇతని రాజ్యం వ్యక్తికి పూర్తిగా స్వేచ్ఛను లేకుండా చేయలేదు. వ్యక్తి సంపూర్ణంగా ప్రభుత్వ ఆధిపత్యం క్రిందలేడు. హేతుబద్ధంపై రాజ్యాధికారాన్ని హెగెల్ సమర్థించాడు. ఇతను వివరించిన రాజ్యం క్రోడీకరించిన ఫ్రెంచి విప్లవం యొక్క లాభాలకు ప్రతినిధి. వాస్తవ సంస్థల స్థాపనద్వారా వ్యక్తి ఆధునిక ఆకాంక్షలు నెరవేరుతాయని హెగెల్ చెప్పాడు. హెగెల్ ముఖ్యోద్దేశ్యం ఆధునిక రాజ్యం యొక్క ముఖ్య సూత్రాలను వివరించడం.

హెగెల్ ఫాసిస్టుకాడు, కమ్యూనిస్టుకాడు, హెగెల్‌ని ఆధునిక సాంప్రదాయవాదిగా పరిగణించవచ్చు. బర్క్ చెప్పిన సాంప్రదాయవాదం కంటే, కాల్పనిక వాదులు చెప్పిన సాంప్రదాయవాదం కంటే హెగెల్ చెప్పిన సాంప్రదాయవాదం భిన్నమైనది. ప్రస్తుత సంస్థలలో గత కాలంనాటి వివేకం వుంటుందన్న బర్క్ భావాన్ని హెగెల్ అంగీకరించాడు. బర్క్ గతకాలానికే అధిక ప్రాధాన్యత నిచ్చి యధాపూర్వస్థితి (Status Quo) లో మార్పువుండకూడదన్నాడు. మార్పుని రాకుండా ప్రయత్నిస్తే ఆ స్థితి విచ్ఛిన్నమౌతుందని హెగెల్ చెప్పాడు. మార్పు సహజమని చరిత్ర వివరిస్తుందని హెగెల్ భావించాడు. మారిన పరిస్థితులకు అనుగుణ్యంగా సంస్థలను మార్చకపోతే అది పొరపాటు అవుతుందని హెగెల్ భావించాడు. హెగెల్ చెప్పిన రాజ్యం బర్క్ చెప్పిన సాంప్రదాయం కులీనవర్గాలు రాజ్యం కాదు. జాకోబిన్లు చెప్పిన రిపబ్లిక్ కాదు. హెగెల్ వివరించిన రాజ్యం ఐరోపాలో నెపోలియన్ అనంతరం పునరుద్ధరించిన రాజ్యం.

ఇంతకుముందు చెప్పినట్లు హెగెల్‌కు ఫాసిస్టు సిద్ధాంతంతో గాని, కమ్యూనిష్టు సిద్ధాంతంతోగాని సంబంధంలేదని చెప్పవచ్చు. హెగెల్ సిద్ధాంతం జర్మనీలో అతని సమకాలీన పరిస్థితులకు అనుగుణ్యంగా అభివృద్ధిచెందింది. ముఖ్యంగా

జర్మనీ ప్రజలందరు సమైక్యమై ఇంగ్లీషు వారు అభివృద్ధి చేసిన రాజ్యాంగబద్ధ ప్రభుత్వాన్ని నమూనాగా అంగీకరించడం మంచిదని హెగెల్ తన సిద్ధాంతంలో చెప్పాడు.

## 9.14 సారాంశము :

"ఫాసిజం, జాతి ఆధిక్య సిద్ధాంతం, జాతీయవాదం, నాయకత్వ సూత్రం, అధికారవాద ప్రభుత్వం - వీటికి సంబంధించిన అంశాలన్నీ హెగెల్ రాజనీతి సిద్ధాంతంలో వున్నాయి" అని Ebenstein అన్నాడు. హెగెల్ చెప్పిన గతితార్కిక భావం, జాతీయవాదం, అతను చరిత్ర ప్రాముఖ్యతకిచ్చిన సాంప్రదాయాలను అన్నివర్గాలు, ప్రజలు నేటికి పొగుడుతున్నారు. మనం ఏకీభవించినా, ఏకీభవించకపోయినా హెగెల్ భావాలు హేతువు, తర్కం మీద ఆధారపడి వున్నాయని చెప్పవచ్చును.

## 9.15 చదువదగిన పుస్తకాలు :


1. M.Judd Harmon, "Political Thought from Plato to the Present"
2. P.G.Das, "History of Political Thought"
3. Dr. M.V. Subba Rao "ఆధునిక పాశ్చాత్య రాజనీతి తత్వవిచారం"


## ప్రశ్నలు :

1. హెగెల్ ప్రతిపాదించిన గతితార్కిక పద్ధతిని విమర్శనాత్మకంగా చర్చించండి.
2. హెగెల్ భావవాదాన్ని, రాజనీతి శాస్త్రంపై దాని ప్రభావాన్ని క్లుప్తంగా చర్చించండి.
3. రాజ్యంపై హెగెల్ భావాలను వివరించండి.
4. కుటుంబం, సమాజం, ప్రభుత్వం, స్వేచ్ఛలపై హెగెల్ భావాలను విమర్శనాత్మకంగా చర్చించండి.
5. హెగెల్ నాజీజం, ఫాసిజం సిద్ధాంతాలకు ప్రేరణ ఆమోదిస్తారా ? సహేతుకంగా వివరించండి.
6. హెగెల్ రాజనీతి సిద్ధాంతాన్ని విమర్శనాత్మకంగా చర్చించండి.
7. హెగెల్ - మార్క్స మధ్య సారూప్యాన్ని, బేధాన్ని వివరించండి.

**రచయిత : యస్. పోలినాయుడు**

పాఠము - 10

# సామ్యవాదం - కార్ల్‌మార్క్స్
**(1818 - 1883)**

విషయసూచిక-


| | |
|---|---|
| 10.1 | పరిచయం |
| 10.2 | కార్ల్‌మార్క్స్ జీవిత సంగ్రహం |
| 10.3 | రచనలు |
| 10.3.1 | ది కమ్యూనిస్ట్ మానిఫెస్టో |
| 10.4 | మార్క్స్ పై ప్రభావాలు |
| 10.5 | గతితార్కిక భౌతికవాదం |
| 10.6 | చారిత్రక భౌతికవాదం |
| 10.7 | అదనపు విలువ లేక మిగులు విలువ సిద్ధాంతం |
| 10.8 | వర్గపోరాట సిద్ధాంతం |
| 10.9 | శ్రామికవర్గ నియంతృత్వం |
| 10.10 | కమ్యూనిస్ట్ వ్యవస్థ |
| 10.10.1 | మొదటిదశ |
| 10.10.2 | కమ్యూనిస్ట్ ఉన్నతదశ |
| 10.10.3 | రాజ్యరహిత సమాజం |
| 10.11 | రాజ్య సిద్ధాంతం |
| 10.12 | మార్క్సిజం పై విమర్శ |
| 10.13 | మార్క్స్ విశిష్టత |
| 10.14 | చదువదగిన గ్రంథాలు |


## 10.1 పరిచయం :

సామ్యవాదం అనే భావన 1804లో మొదలైంది. 1815 నాటి ఆర్థిక పరిస్థితులు సామ్యవాద భావాలకు ఊపిరిపోశాయి. ఐరోపాలో పారిశ్రామిక విప్లవం జరిగింది. దానితోపాటే అనేక సామాజిక, ఆర్థిక దుస్థితులేర్పడినాయి. ఫాక్టరీ ఉత్పత్తి విధానం సంపన్నులను మరింత సంపన్నులుగాను, పేదవారిని మరింత పేదరికంలోకి మార్చివేసింది. అశేష సంఖ్యలో పల్లెల నుండి పట్టణాలకు వలస ఆరంభమైంది. నిరక్షరాస్యత, పేదరికం, మురికివాడలలో వసతి, దుర్భరజీవన పరిస్థితుల వలన శ్రామికులు నిరాశ నిస్పృహలకు లోనైనారు. కార్మిక సంఘాలు స్థాపించబడినాయి. పెట్టుబడిదారీవర్గానికి, శ్రామిక వర్గానికి మధ్య అంతరం పెరిగింది. హక్కుల పోరాటాలు అణచివేయబడినాయి. ఇట్టి పరిస్థితుల నుండి బయటపడాలన్న శ్రామికుల తపనే సామ్యవాద సిద్ధాంతానికి మూలాధారమైంది. తొలిసామ్యవాద భావాల పుట్టుక జరిగింది.

సెయింట్ సైమన్, రాబర్ట్ ఓవెన్ మొదలగు ఇంగ్లీష్ తాత్వికులు, ఫ్రెంచి సామ్యవాదులు ఉపయోగితావాద సామ్యవాదాన్ని ప్రతిపాదించారు. 1820 నాటి ఇటలీలో సామ్యవాదం ఉధృతంగా ప్రచారమైంది. సంస్కరణల ద్వారా పెట్టుబడిదారీ వ్యవస్థలో మార్పుతెచ్చి సామ్యవాద వ్యవస్థగా రూపొందించవచ్చునని ఊహించారు. వారికి తమగమ్యం తెలుసు. గమ్యం చేరాలనే ఆలోచనావుంది. కాని గమ్యాన్ని చేరే మార్గమే తెలియదు. వారి భావాలు ఊహలకే పరిమితం అయ్యేయి. కాల్పనిక సామ్యవాదులు మానవతావాదులుగానే మిగిలిపోయారు. ఒక పరివర్తనాశీలసిద్ధాంతాన్ని ప్రతిపాదించలేకపోయారు.

మితవాద సామ్యవాద ధోరణిని నిరసిస్తూ అతివాద సామ్యవాదం అవతరించింది. కార్ల్‌మార్క్స్, ఫ్రెడ్రిక్ ఏంగెల్స్ ఈ అతివాదానికి ఆద్యులు. వీరి భావాలే మార్క్సిజంగా ప్రసిద్ధిచెందాయి. కాల్పనిక జగత్తు నుండి సామ్యవాదం వాస్తవంలోకి అడుగుపెట్టింది. శాస్త్రీయతను ఆపాదించుకుంది. శాస్త్రీయ సామ్యవాదంగా ఈ మార్క్సిజం ఖ్యాతిపొందింది. దేశదేశాలలో పీడిత ప్రజానీకం విముక్తి కోసం ఎదురుచూస్తున్న తరుణంలో మార్క్సిజం అవతరించింది. వారికి మార్గదర్శకత్వంగా నిలిచింది. ఆధునిక సామాజిక జీవనాన్ని మార్క్సిజం ప్రభావితం చేసినంతగా రాజనీతితత్వ చరిత్రలో ఏ ఇతర సిద్ధాంతం చేయలేదని నిస్సందేహంగా చెప్పవచ్చును.

## 10.2 కార్ల్‌మార్క్స్ జీవిత సంగ్రహం :

శాస్త్రీయ సామ్యవాద పితామహుడుగా ఖ్యాతినార్జించిన కార్ల్‌మార్క్స్ 1818 మే 5న ప్రష్యా (జర్మనీ)లో రైన్‌లాండ్ రాష్ట్రంలో ట్రెవెస్ నగరంలో జన్మించాడు. తండ్రి పేరు హెర్షల్‌మార్క్స్. ఇతడు యూదు మతస్థుడు. 1824లో మార్క్స్ బాల్యంలో ఈ కుటుంబం క్రైస్తవ మతం స్వీకరించింది. మార్క్స్ తన జీవితపర్యంతం ఏ మతం లేకుండానే గడిపాడు. 1835లో న్యాయశాస్త్ర అధ్యయనానికి బాన్ విశ్వవిద్యాలయంలో చేరాడు. 1836లో బెర్లిన్ విశ్వవిద్యాలయంలో చేరాడు. బ్రూనో, బౌర్ రచనలను అధ్యయనం చేసి నాస్తిక భావాలను అలవర్చుకొన్నాడు. డెమోక్రటిస్ తత్వానికి ఎపిక్యూరియన్ తత్వానికి గల తారతమ్యాలపై పరిశోధన వ్యాసాన్ని సమర్పించి 1841లో జెనా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ డిగ్రీని పొందాడు. 1843లో చిరకాల స్నేహితురాలైన జెన్నీవాన్ వెస్ట్‌ఫాలెన్‌ను వివాహం చేసుకొన్నాడు.

ఎపిక్యూరియన్ సిద్ధాంతములోని భౌతికవాదం మార్క్స్‌ను బాగా ఆకర్షించింది. భావ సిద్ధాంతాలకన్న, భావాలు సాధించటానికి దారితీసిన భౌతిక పరిస్థితులకే ప్రాధాన్యత వుండాలని మార్క్స్ విశ్వసించాడు. బాన్ విశ్వవిద్యాలయంలో ఆచార్య పదవిని ఆశించాడు. అతని విప్లవ భావాల వలన ఆ అవకాశం లభించలేదు. అదే కనుక పొందివుంటే బహుశా "కమ్యూనిస్టు మానిఫెస్టో" వంటి విప్లవాత్మక రచన చేసేవాడు కాదు. శ్రామికుల అర్థశాస్త్రం వైపు మరలేవాడుకాదు. (మాక్సీ వ్యాఖ్యానం).

వార్తాపత్రిక రచయితగా, సంపాదకునిగా విప్లవధోరణితో తిరుగుబాటు భావాలను ప్రచారం చేశాడు. 1843లో ప్రష్యన్ పాలకులు ఇతని ప్రచురణలను నిషేదించారు. కుటుంబ సమేతంగా కార్ల్‌మార్క్స్ ఫ్రాన్స్‌కు చేరుకున్నాడు. తన జీవితాంత సహచరుడైన ఏంగెల్స్‌ను ఇక్కడే కలుసుకున్నాడు. తన సిద్ధాంతాలలో సమాన భాగస్వామిని చేశాడు. వీరిరువురూ ప్రతిపాదించిన ఆర్థిక, సామాజిక సిద్ధాంతాలే మార్క్సిజంగా ప్రసిద్ధిపొందాయి.

ఫ్రాన్స్‌లో విప్లవరాజకీయాలలో పాల్గొన్నాడు. 1895లో ఫ్రాన్స్ నుండి మార్క్స్ బహిష్కరింపబడినాడు. ప్రవాసులందరకూ ఆశ్రయం కలిగివున్న బ్రస్సెల్స్ చేరాడు. తత్వశాస్త్రం, రాజకీయ, ఆర్థిక, సాంఘిక శాస్త్రాలను అధ్యయనం

చేశాడు. విప్లవాలలో చురుకుగా పాల్గొన్నాడు. ఏంగెల్స్ సహకారముతో "కమ్యూనిస్ట్ మేనిఫెస్టో" రచన ఇక్కడే జరిగింది. 1849లో శాశ్వతంగా దేశబహిష్కరణకు గురిఅయ్యాడు.

ఏంగెల్స్ సహాయంతో లండన్ చేరుకున్నాడు. అమూల్యమైన తనకాలాన్నంతా బ్రిటిష్ మ్యూజియమ్ లైబ్రరీలో గడిపాడు. 'దాస్ కాపిటల్' మొదటి భాగాన్ని ప్రచురించాడు. అతని మరణానంతరం మిగిలిన భాగాలను ఏంగెల్స్ పూర్తిచేశాడు. మరణించేవరకు దుర్భరదారిద్ర్యాన్ని అనుభవించాడు.

మార్క్స్ ఒక క్రియాశీలక వ్యక్తి. 1864లో ఏంగెల్స్‌లో కలిసి కమ్యూనిస్ట్ ఇంటర్ నేషనల్ అనే సంస్థను స్థాపించాడు. కమ్యూనిస్ట్ కమిటీ ఆఫ్ కరస్పాండెన్స్‌ను, కమ్యూనిస్ట్ లీగ్‌ను స్థాపించాడు. జీవితకాలమంతా కష్టాలతో, ఉద్యమాలతో గడిచింది. వృద్ధాప్యంలో ఆరోగ్యం క్షీణించి 1883 మార్చి 14న మార్క్స్ మరణించాడు. అతని మార్క్సిజం కోట్లాదిమంది శ్రామికులను, మేధావులను ఉత్తేజపరచింది.

## 10.3 రచనలు :

కార్ల్‌మార్క్స్ విరివిగా రచనలు చేశాడు. ఈ క్రింది వాటిని అత్యంత ప్రధానంగా పేర్కొనవచ్చును.

1. ది పోవర్ట్ ఆఫ్ ఫిలాసఫీ (1847)
2. ది కమ్యూనిస్ట్ మానిఫెస్టో (1848)
3. ది క్రిటాక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ (1859)
4. దాస్ కాపిటల్ (1867)
5. వేల్యూ, ప్రైస్ అండ్ ప్రోఫిట్ (1867)
6. ది సివిల్ వార్ ఇన్ ఫ్రాన్స్ (1870 - 71)

### 10.3.1 ది కమ్యూనిస్ట్ మానిఫెస్టో :

మార్క్స్, ఏంగెల్స్ లిరువురూ కలిసి రచించిన ది కమ్యూనిస్ట్ మానిఫెస్టో 1848లో లండన్‌లో ప్రచురింపబడింది. విప్లవకర ఉత్తేజంతో, సృజనాత్మకతతో రచింపబడింది. నాలుగు భాగాలుగా విభజింపబడింది. మొదటిభాగంలో సామాజిక పరిణామ చరిత్ర, ఆధునిక పెట్టుబడిదారీ, వాణిజ్యవర్గాల (బూర్జువా) వృద్ధి వివరింపబడింది. కమ్యూనిస్ట్ పార్టీ సిద్ధాంతాలు, పరిధి, ప్రణాళిక కార్యక్రమాన్ని అమలుచేయు సాధనాలను రెండవభాగం విశదీకరిస్తుంది. మూడవభాగం సమకాలీన సోషలిస్ట్, కమ్యూనిస్ట్ సాహిత్యాన్ని పరిశీలించింది. కాల్పనిక సామ్యవాదంను తీవ్ర పదజాలంతో గర్హించింది. నాల్గవభాగం విభిన్న ప్రతిపక్షాలతో కమ్యూనిస్ట్‌ల సంబంధాన్ని, స్థితిని, కమ్యూనిస్ట్‌ల మౌలిక, తాత్విక సిద్ధాంతాన్ని అత్యంతశక్తివంతంగా వివరించింది.

కమ్యూనిస్ట్ మానిఫెస్టో సామాజిక విప్లవానికి సాధనం. ఆధునిక ప్రపంచ సామాజిక, ఆర్థిక, రాజకీయ విధానాన్ని ఇంత అమితంగా ప్రభావితం చేసిన రాజకీయ రచన వేరొకటిలేదు. అసంఖ్యానీక వ్యాఖ్యానాలకు, ఉద్యమాలకు దారితీసింది.

## 10.4 మార్క్స్ పై ప్రభావాలు :

బాన్ విశ్వవిద్యాలయంలో మార్క్స్ విద్యార్థిగా ఉన్నకాలములో హెగెల్ తత్వశాస్త్రంలో ఆచార్యునిగా పనిచేశాడు. తన రాజనీతి తత్వం ప్రతిపాదించుటలో "గతితార్కిక" భావాన్ని ప్రవేశపెట్టాడు. పరిణామక్రమంలో 'వాదం'(Thesis)

ప్రతివాదం'(Anti-Thesis) 'సమన్వయం' (Synthesis) లు వుంటాయని, అశాశ్వతత్వం నుంచి శాశ్వతాన్ని, అవాస్తవికత నుండి వాస్తవికతను వేరుచేయవచ్చని వివరించాడు. హెగెలియన్ ఆదర్శవాదాన్ని తిరస్కరిస్తూ అతని గతితార్కిక భావాన్ని మార్క్స్ తన చారిత్రక పరిణామ విశ్లేషణలో సరైన సాధనంగా ఉపయోగించాడు.

ఫ్రెంచి భౌతికవాదుల ప్రభావం కూడా మార్క్స్ పై కనబడుతుంది. రాజకీయ వ్యవస్థతోపాటు, మతం, మతతత్వం, అధి భౌతికవాదం (Meta Physics) లకు వ్యతిరేకంగా వారు పోరాడినతీరు మార్క్సును ఆకర్షించింది. అర్థశాస్త్రాన్ని అధ్యయనం చేసి కొన్ని పరిశోధనలు నిర్వహించాడు. ప్రఖ్యాత ఆర్థికశాస్త్ర వేత్తలైన ఆడమ్‌స్మిత్, డేవిడ్ రికార్డో రచనలను అధ్యయనం చేశాడు. సాంఘిక వ్యవస్థను సమస్త కాలాలలోను ప్రభావితం చేసేవి ఆర్థిక సంబంధాలేననే భావనతో తన సిద్ధాంతాన్ని ఆరంభించాడు. రికార్డో ఆర్థిక వ్యవస్థను సామాజిక దృక్పథంతో పరిశీలించి శ్రమవిలువ సిద్ధాంతాలను ప్రతిపాదించాడు. దాని ఆధారంగా మార్క్స్ తన "మిగులు విలువ" సిద్ధాంతాన్ని వివరించాడు. శ్రమించేవ్యక్తి నిరుపేదగా మారుతున్నాడు. శ్రమ చేయని వ్యక్తి సంపద నానాటికీ వృద్ధి పొందుతుంది. ఈ వైపరీత్యానికి గల కారణాలను మార్క్స్ స్పష్టంగా పేర్కొన్నాడు.

జర్మన్ భావజాలం, ప్రధానంగా హెగెల్ గతితార్కికవాదం, బ్రిటిష్ ఆర్థికశాస్త్రవేత్తల ఆలోచనాసరళి, ఫ్రెంచి మేధావుల భౌతికవాదం, విప్లవవాదం, సామాజిక విధానాలు మొదలైన అనేకం కార్లమార్క్స్ సిద్ధాంతాలలో వ్యక్తీకరించబడినాయి. అతని ఉద్దేశ్యంలో భౌతికవాదమంటే సామాజిక వ్యవస్థను పూర్తిగా మార్చివేయుట, మతాన్ని నిరసించుట, ఆశయ సాధనకై ఉద్యమాలను నిర్వహించుట. గతితార్కిక భౌతికవాదం శ్రామికులకు విప్లవ తత్వశాస్త్రం కాగలదని భావించాడు. మార్క్స్ భావాలకు, సిద్ధాంతాలకు గతితార్కిక భౌతికవాదం పునాదిగా నిలిచింది.

## 10.5 గతితార్కిక భౌతికవాదం (Dialectical Materialism) :

మార్క్సిజం - గతితార్కిక భౌతికవాదంలు రెండు ఒకదానికొకటి పర్యాయపదాలుగా మారాయి. గ్రీకుభాషలో వాద, ప్రతివాద విద్యను "డైలెక్టిక్"గా వ్యవహరిస్తారు. వాద, ప్రతివాదాలు రెంటిలోనూ మంచి, చెడులు, వాస్తవాలు, అవాస్తవాలు కలిసే వుంటాయి. వాటిలో అంతర్గతంగా వున్న మంచిని, వాస్తవాన్ని గ్రహిస్తూ, 'సమన్వయం' ముందుకు వస్తుంది. హెగెల్ తన ఆదర్శవాద ప్రతిపాదనలో గతితార్కిక పద్ధతిని తాత్విక దృష్టితో వివరించాడు. భావజగత్తుకే పరిమితం కాబడింది. అదే గతితార్కిక భౌతికవాదాన్ని మార్క్స్ గ్రహించి భౌతికస్థితి గతులను అధ్యయనం చేయడానికి వినియోగించాడు. దాని సహాయంతో చారిత్రక విశ్లేషణ చేశాడు. మార్క్స్ వివరించిన సామాజిక సిద్ధాంతాలన్నింటికి గతితార్కిన భౌతికవాదమే తాత్వికపునాది అయింది.

హెగెల్ ఆదర్శవాది. గతివార్కికవాదాన్ని చరిత్రతత్వానికి అన్వయించాడు. భౌతిక ప్రపంచానికి అతీతంగా, నిగూఢంగా ఒకశక్తి వుంటుందని దానికి "చిదాత్మ" (Spirit) అని, పేరుపెట్టాడు. ఇది సర్వస్వతంత్రంగా వుంటుంది. తనకు తానుగా పరిపూర్ణత్వాన్ని పొందటానికి నిరంతరం యత్నిస్తూనే వుంటుంది. తనలో తానే వైరుధ్యాలు సృష్టించుకొని అంతః సంఘర్షణలకు లోనౌతుంది. కొంతకాలానికి తన పూర్వపు స్థితి కోల్పోయి వేరొక ఉన్నతస్థితికి చేరుతుంది. వాదం, ప్రతివాదంల మధ్య సంఘర్షణ తీవ్రస్థాయికి చేరిన తరుణంలో ఆ రెంటిలో వుండే చెడు లేక అవాస్తవికత తొలగిపోయి, వాటిలో వుండే మంచి లేక వాస్తవికత బహిర్గతం అవుతుంది. అనగా సమన్వయం ఏర్పడుతుంది. విదుద్ధాంశాల మధ్య ఘర్షణ ఫలితంగా జ్ఞానాభివృద్ధి కలుగుతుంది. ఈ సమన్వయం మళ్ళీ కొంతకాలానికి వాదంగా మారి అంతఃసంఘర్షణకు లోనౌతుంది. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతూనే వుంటుందని హెగెల్ వివరించాడు.

హెగెల్ భావుకతావాదాన్ని నిరశించి మార్క్స్ భౌతిక ప్రపంచ వాస్తవాలనే పరిగణనలోకి తీసుకున్నాడు. హెగెల్ యొక్క గతి తార్కికత తలక్రిందులుగా నిలబడిందని, దానిని తాను సరిచేస్తున్నానని మార్క్స్ ప్రకటించుకొన్నాడు. భౌతిక ప్రపంచపు అభివృద్ధి క్రమాన్ని గతితార్కిక విధానంలోనే అధ్యయనం చేసి తన సామాజిక సిద్ధాంతాలను ప్రతిపాదించాడు.

సామాజికాభివృద్ధి మానవుల ద్వారానే జరుగుతుంది. తమ చరిత్ర తామే లిఖించుకొంటారు. ఇది భౌతికపరిస్థితుల ఆధారంగా వుంటుంది. భౌతిక ప్రగతిని, ఉత్పత్తి శక్తుల - ఉత్పాదక సంబంధాల మధ్య గల ఘర్షణలను, విభిన్న చారిత్రక పరిస్థితులలో సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిణామాలు జరిగిన విధానాన్ని వివరించే సూత్రాలను తెలపటానికి గతితర్కాన్ని మార్క్స్ వినియోగించుకున్నాడు. దీన్నిచరిత్రకు అన్వయిస్తూ ఆర్థికశక్తుల ప్రగతిద్వారానే చరిత్ర ప్రభావితమైందని అంటాడు. ప్రకృతితో మన సంఘర్షణ ఫలితమే మన భావాలు. బాహ్య ప్రపంచంలోను, మానవ చింతనలోనూ జరిగే చలనానికి చెందిన సాధారణ నియమాలను వివరించే సిద్ధాంతమే గతితార్కికవాదం. చరిత్ర అధ్యయనానికి ఇది మూలాధారం. విషయ అవలోకన సాధ్యమవుతుంది.

## 10.6 చారిత్రక భౌతికవాదం (Historical Materialism) :

గతితార్కిక భౌతికవాద సూత్రాలను వివిధ కాలాలలో జరిగిన సమాజపరిణితికి అన్వయింపచేయటమే చారిత్రక భౌతికవాదం. భౌతికదృక్పథంతో లేక ఆర్థిక దృక్పథంతో మానవ చరిత్రను విశ్లేషిస్తుంది. ఆర్థికపర స్థితిగతులే చారిత్రక విషయాలను నిర్ణయిస్తాయని ఈ సిద్ధాంతం చెపుతుంది - "మనుషులు తాము బతకాలనుకుంటే తినాలి" (Simple truth, which is the clue to the meaning of history, that men must eat to live).

భౌతికావసరాలను తీర్చుకొనుటకై వ్యక్తి కృషిచేశాడు. వస్తూత్పత్తి చేయుటలో సాధించిన విజయంపై మానవ మనుగడ ఆధారపడుతుంది. మానవుడు చేసే పనులన్నీ వస్తూత్పత్తికి చెందినవే. భౌతిక జీవనావసరాలన్నీ తీర్చగల ఒకేఒక ప్రక్రియ వస్తూత్పత్తి. మానవుడు తన అవసరాలన్నీ తానే ఒంటరిగా సమకూర్చుకోలేడు. ఇతరుల సహకారం, సహజీవనం తప్పనిసరి. ఈ భౌతికావగాహనే మానవ సమాజనిర్మాణానికి దోహదం చేసింది. అప్పటికీ తన అవసరాలు తీరనప్పుడు ఉత్పత్తి పద్ధతులలోగాని, ఉత్పత్తి సాధనాలలో గాని లోపాలున్నాయని తెలుసుకుంటాడు. అలా గ్రహించలేనివ్యక్తి దేవుణ్ణి మానవాతీతశక్తుల్ని, మతాన్ని ఆశ్రయిస్తాడు. అవసరాలు తీరే అవకాశం లేని భౌతిక సామాజికోత్పత్తిలో మతమే మనుషులకు మత్తుమందులా పనిచేస్తుందని మార్క్స్ అంటాడు.

సామాజిక, రాజకీయ, నైతిక జీవనానికి పునాది వస్తూత్పత్తి. భౌతిక పరిస్థితులే సమాజజీవన పరిస్థితులను నిర్ణయిస్తాయి. ఉత్పత్తి రంగంలో వచ్చే మార్పులే సామాజిక చైతన్యంలో కూడా మార్పులు తెస్తాయి. ఈ భౌతిక పరిస్థితులే సామాజికాభివృద్ధిలో చారిత్రక పరిణామాలకు మూలం. మానవులు తమనుతాము మెరుగుపరచుకొనే వివిధ దశల పరిణామమే మానవచరిత్ర.

మానవచరిత్రను నాలుగు దశలుగా మార్క్స్ వర్గీకరించి వర్ణించాడు

**1. ఆదిమ సమాజం లేక ఏషియాటిక్ దశ :** ఈ దశలో ఉత్పత్తి సాధనాలన్నీ మొత్తం సహజ ఆధీనంలో వుంటాయి. ఇది సమసమాజం. ఉన్నవారు, లేనివారు అనే బేధాలులేవు. కొంతకాలానికి గతితార్కికంగా ఈ దశ అంతరిస్తుంది.

**2. ప్రాచీన సమాజం :** ఈ దశలో ఉత్పత్తి సాధనాలన్నీ యజమానుల ఆధీనంలో వుంటాయి. యజమానులు, బానిసలు అనే వర్గాలేర్పడినాయి. ప్రాచీన గ్రీసు, రోమను సమాజాలు దీనికి ఉదాహరణలు. అనివార్యంగా ఏర్పడిన పరిణామాలవల్ల ఈ సమాజం అంతరించింది.

**3. భూస్వామ్య సమాజం :** ఉత్పత్తికారకమైన భూమిపై యజమాన్యం కొద్దిమందికే లభించింది. భూస్వామ్య వర్గం అవతరించింది. మిగిలినవారు కర్షకులుగా తిర్థబానిసలుగా జీవించేవారు. అంతర్గత వైరుధ్యాలతో ఈదశ క్రమంగా నశించి, అంతరించింది.

**4. పెట్టుబడిదారీ సమాజం :** యంత్రాలు, ఫాక్టరీలు, భూమి, పెట్టుబడి మొదలగు ఉత్పత్తికారకాలు అతికొద్ది మంది చేతిలో కేంద్రీకరింపబడినాయి. మిగిలిన ప్రజానీకం శ్రామికులుగా మిగిలిపోయారు. వర్గ సమాజం అవతరించింది: పెట్టుబడిదారీ వర్గం, శ్రామికవర్గం.

పైన వివరించిన చారిత్రక పరిణామం రెండవ, మూడవ, నాల్గవ దశలలో వరుసగా యజమానులు, భూస్వాములు, పెట్టుబడిదారులు మిగిలిన ప్రజానీకాన్ని పీడనకు, దోపిడీకి గురిచేశాయి. వివిధ రూపాలలో కనిపించిన ఆస్థి సంబంధాలే సామాజికవర్గ సంబంధాలుగా వర్గీకరింపబడి అసమానతలు తెచ్చాయి.

ఉత్పత్తి విధానంలో ఎప్పటికప్పుడు వైరుధ్యాలేర్పడతాయి. అనివార్యంగా నూతన విధానం ఆరంభం అవుతుంది. వ్యవసాయానికి ప్రాథమిక దశలో నాగలి ప్రధానమైన ఉత్పత్తి సాధనం. క్రమంగా ట్రాక్టరు అవసరంచోటు చేసుకుంది. చేనేత పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు స్థానంలో, ఫ్యాక్టరీలు, యంత్రాలు ఉత్పత్తి రంగంలో ప్రవేశించాయి. ఈ పరిణామాలు జీవనరంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చాయి. ఈ మార్పులు జరిగేతరుణం తీవ్రస్థాయికి చేరినపుడు హింసాపూరిత ఘర్షణలు, ఉద్యమాలు జరగవచ్చు. ఫలితంగా నవ్యసమాజ నిర్మాణం జరుగుతుంది. అభివృద్ధి పథంవైపు నడుస్తుంది. వీటన్నింటికి మూలకారణం గతివార్మిక వైరుధ్యాలేనని మార్క్సువాదము. ఉత్పత్తి శక్తుల ఆధారంగా భిన్నసమాజాల పుట్టుక, అభివృద్ధి, పరిణామం, పతనాల గురించి తన చారిత్రక భౌతికవాదంలో వివరించాడు.

## 10.7 అదనపు విలువ లేక మిగులు విలువ సిద్ధాంతం (The Theory of Surplus Value) :

ఆర్థిక అన్వేషణలో మౌలిక భావం అదనపు విలువ సిద్ధాంతం. రికార్డో ప్రతిపాదించిన శ్రమవిలువ సిద్ధాంతాన్ని విస్తృతపరచి మార్క్సు అదనపు విలువ సిద్ధాంతం రూపొందించాడు. వస్తూత్పత్తికి వినియోగించిన శ్రమశక్తే ఆ వస్తువు విలువను నిర్ణయిస్తుందని డేవిడ్ రికార్డో సిద్ధాంతం. వస్తువుకు విలువ లభించేది మానవ శ్రమ ద్వారానే అని మార్క్సు తన సిద్ధాంతాన్ని కొనసాగించాడు. శ్రమశక్తిని, శ్రమించే కాలానికి ధర నిర్ణయించి పెట్టుబడిదారుడుకొంటాడు. యంత్రాలను, ముడి పదార్థాలను సేకరించి వస్తూత్పత్తి చేస్తాడు. మార్కెట్లలో ఆ వస్తువులకు మారకవిలువ వుంటుంది. ఈ మారకపు విలువకు శ్రామికుడు తన శ్రమశక్తికి పొందే వేతనానికి మధ్యగల తేడాయే 'అదనపు విలువ' ఇది 'దాగిన విలువ'. పెట్టుబడిదారుడు దీనిని సొంతం చేసుకుంటాడు. న్యాయంగా శ్రామికునికి చెందవలసిన ఈ అదనపు విలువను పెట్టుబడిదారుడు తన సొంతం చేసుకొనుట ద్వారా దోపిడీవిధానం అవలంభిస్తాడు. ఆధునిక పారిశ్రామిక వ్యవస్థలో దోపిడీ విధానం అత్యంత ప్రధానమైన అన్యాయం.

"ఎవరైతే ఉత్పత్తి సాధనాలను తమ ఆధీనంలో వుంచుకుంటారో వాళ్ళు ఆర్థిక వ్యవస్థనేకాక రాజకీయవ్యవస్థను కూడా నియంత్రిస్తారు (మార్క్సు) సంపద కేంద్రీకరణ తీవ్రరూపం దాలుస్తుంది. శ్రమించని పెట్టుబడిదారుడు సౌఖ్యంగా జీవిస్తాడు. శ్రామికుడు దారిద్ర్యంతో, నిరుద్యోగంతో, బానిసత్వంతో నిరాశ, నిస్పృహలకులోనౌతాడు. కొంతకాలానికి ఈ

శ్రామిక వర్గం చైతన్యం పొంది సంఘటితపడుతుంది. పెట్టుబడిదారీవర్గం - శ్రామిక వర్గాలమధ్య తీవ్రమైన ఘర్షణ జరుగుతుంది. పెట్టుబడిదారీవ్యవస్థ పతనం చెందడం అనివార్యం అని మార్క్స్ ప్రకటించాడు. శ్రామికవర్గాన్ని దారిద్రస్థితికి నెట్టి, దోపిడీకి గురిచేసి వారిలో వర్గచైతన్యాన్ని కలుగచేసి, సంఘటితపరచి తన అంతానికి పెట్టుబడిదారీవర్గముతానే కారణమవుతుంది.

## 10.8 వర్గపోరాట సిద్ధాంతం (Class Struggle) :

The history of all hitherto existing society is the history of class struggles - Karlmarx (communist Manifesto).

మానవజాతి చరిత్ర గమనాన్ని సంఘర్షణగా మార్క్స్ వర్ణించాడు. ఆదిమ వ్యవస్థనుమినహాయించి మిగిలిన అన్ని చారిత్రక దశలలోను మానవసమాజం వర్గాలుగా విడిపోయింది. ఈ వర్గవైరుధ్యాలే వివిధ దశలలో సమాజం అభివృద్ధి చెందటానికి చోదకశక్తిగా పనిచేసింది.

''సర్వ సమాజ చరిత్ర వర్గ సంఘర్షణల చరిత్రే. యజమాని - బానిస, కులీనుడు - సామాన్యుడు, భూస్వామి-కర్షకుడు, చేతిపరిశ్రమల యజమాని - కూలివాడు, ఒక్కమాటలో పీడించేవాడు - పీడితుడు, ఒకరితోనొకరు నిరంతరం వైరుధ్యంతో వుంటారు. ఈ పోరాటం ఒకప్పుడు ప్రచ్ఛన్నంగా, బహిరంగంగా కొనసాగుతుంది. ప్రతీ పర్యాయం సమాజ విప్లవాత్మక పునర్నిర్మాణం జరుగటయో లేక పోరాడే వర్గాల పరస్పర నాశనాత్మక పునర్నిర్మాణం జరుగటయో లేక పోరాడేవర్గాల పరస్పరనాశనమో సంభవిస్తేనే ఈ పోరాటం అంతమవుతుంది''. (కార్ల్‌మార్క్స్)

ఆదిమ సమాజం వర్గసమాజంగా మారింది. యజమానులు - బానిసలు అనే వర్గాలేర్పడినాయి. యజమానులు ఉత్పత్తి సాధనాలను తమ ఆధీనంలో వుంచుకొని తమ అవసరాలకనుకూలంగా సమాజాన్ని నిర్దేశిస్తారు. అస్తిత్వాన్ని నిలుపుకొనుటకై దోపిడీని అరికట్టాలనే భావం పీడితవర్గాలలో కలగటానికి పీడితవర్గమే కారణమౌతుంది. వర్గసంఘర్షణకు దారి తీస్తుంది. నూతన సమాజ వ్యవస్థ జన్మిస్తుంది, మానవచరిత్రలో వివరించిన మూడుదశలూ - బానిస సమాజం, భూస్వామ్యసమాజం, పెట్టుబడిదారీసమాజం ఈ పద్ధతిలోనే జన్మించాయి. పోరాటాల ఫలితంగా నూతన సమాజాలు జన్మించాయి. ప్రతీ సమాజం ఆరంభదశలో అభివృద్ధికరంగా నడిచాయి. కాలం గడిచేకొద్దీ అంతర్గత వైరుధ్యాలు బహిర్గతం అవుతాయి. వర్గపోరాటాలు సంభవిస్తాయి.

పెట్టుబడిదారీ విధానంలో వైరుధ్యాలే స్పష్టంగాను, చాలా తీవ్రంగాను వుంటాయి. ఒకవైపు పెట్టుబడిదారులు ఉత్పత్తి సాధనాలన్నింటినీ తమ ప్రైవేటు ఆస్థిగా మార్చి గుత్తాధిపత్యాన్ని సాధిస్తారు. రెండవ వైపు శ్రామికవర్గం తమ శ్రమను పెట్టుబడిగా తద్వారా అవసరాలకుచాలని వేతనాలతో జీవనసమరం సాగిస్తుంది. శ్రామికుల శ్రమను మిగులు విలువగామార్చి సొంతం చేసికొని (దోపిడీ) అత్యధిక లాభార్జిస్తారు పెట్టుబడిదారులు. ఈ స్థితిలో వర్గపోరాటం అనివార్యం.

వర్గపోరాటాన్ని, దాని పర్యావసానాన్ని తన కమ్యూనిస్ట్ మానిఫెస్టోలో మార్క్స్ విశదపరచాడు. పారిశ్రామికాభివృద్ధి పెరిగినకొద్దీ శ్రామికసంఖ్య పెరుగుతుంది. వారు కార్మిక సంఘాల నేర్పరచుకొని సంఘటితపడతారు. దేశంలో కార్మిక సంఘాలన్నీ ఒక దశలో ఏకమై తమన్యాయ పోరాటాన్ని సాగిస్తాయి. ఇది ఒక జాతీయపోరాటంగా మారుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ బలపడినకొద్దీ ఆర్థిక సంక్షోభాలేర్పడతాయి. నిరుద్యోగం, దారిద్ర్యం ప్రబలుతాయి. తన పతనానికి తానే విప్లవబీజాలు నాటుతుంది. అంతిమంగా పెట్టుబడిదారీవ్యవస్థ పతనమై అంతరిస్తుంది. సామాజికస్థితిలో ప్రగతిశీలక మార్పులేర్పడతాయి. నూతనశకం ఆరంభం అవుతుంది. 'శ్రామికవర్గ నియంతృత్వం' అమలులోకి వస్తుంది.

## 10.9 శ్రామికవర్గ నియంతృత్వం (Dictatorship of the Proletariat) :

శ్రామికవర్గం విప్లవం ద్వారా పెట్టుబడిదారీవ్యవస్థపై విజయాన్ని సాధించి శ్రామికవర్గ నియంతృత్వ విధానాన్ని ప్రవేశపెడుతుంది. కమ్యూనిస్టు సమాజాన్ని స్థాపించేది శ్రామికవర్గ నియంతృత్వమేనని మార్క్స్ విశ్వసించాడు. ఇది సంధి దశలో ఏర్పడే ఒక తాత్కాలిక విప్లవవ్యవస్థ. దీన్ని సోషలిస్ట్ వ్యవస్థగా పేర్కొనవచ్చు. పెట్టుబడిదారీ వ్యవస్థ పతనానంతరం వెంటనే కమ్యూనిస్ట్ సమాజస్థాపన జరగదు. ఇంతవరకు ప్రైవేటు ఆస్తిగా చెలామణి అయిన సంపదను స్వచ్ఛందంగా సమాజపరం చేయటానికి బూర్జువావర్గం ఇష్టపడరు. బలప్రయోగం ద్వారా తప్ప విప్లవవ్యతిరేక శక్తులను అణచివేయటం, అంతరింపచేయటం వీలుకాదు. బూర్జవా సాంస్కృతిని నిర్మూలించటానికి కొంత వ్యవధి అవసరమౌతుంది.

పెట్టుబడిదారీ విధానాలను రద్దుచేయడానికి, దాని ప్రయోజనాలను అంతమొందించటానికి, రాజ్యాధికారాన్ని, ప్రభుత్వ యంత్రాంగాన్ని శ్రామికవర్గం తన ఆధీనంలోకి తెచ్చుకోడాన్ని శ్రామికవర్గ నియంతృత్వమని మార్క్స్ అంటాడు. ప్రైవేటు ఆస్తులను స్వాధీనం చేసికొని, ప్రజలందరకూ సంపదలో భాగస్వామ్యం ఇచ్చి, రాజకీయాధికారాన్ని, ద్రవ్య వ్యవస్థను కేంద్రీకృతం చేస్తుంది. వార్తాపత్రికలు, ప్రచార సాధనాలను, రవాణా సౌకర్యాలను స్వాధీనం చేసుకుంటుంది. ఉత్పత్తికారకాలన్నింటికీ ప్రభుత్వమే యజమాన్యం వహిస్తుంది. వ్యవసాయం, పారిశ్రామిక రంగం వంటి ఉత్పత్తి రంగాలన్నీ సహకారవిధానంలోకి మార్పుచెందుతాయి. ప్రైవేటు వ్యక్తుల గుత్తాధిపత్యం అంతంకాబడుతుంది. ఈ ఏర్పాట్లన్నీ తాత్కాలిక అంతమొందే ప్రాతిపదికపై ప్రవేశపెట్టబడతాయి. పెట్టుబడిదారీ విధానం పూర్తిగా కొనసాగుతాయి. సామ్యవాదసమాజ స్థాపనే శ్రామికవర్గ నియంతృత్వం అంతిమ లక్షయం.

అసమానతలకు, శ్రమదోపిడీకి, పీడితవర్గ అణచివేతకు మూలాధారమైన ప్రైవేటు ఆస్థినిక్రమక్రమంగా అంతమొందించి, వర్గసమాజానికి బాసటగా నిలచిన రాజ్యాధికారాన్ని అంతరింపచేయటానికి శ్రామిక వర్గ నియంతృత్వం నిరంత కృషి చేస్తుంది. తన ఆశయం నెరవేరగానే తాను కూడా అంతరించి చరిత్రలో కలసిపోతుంది. దోపిడీ సాధనమైన రాజ్యం అంతరిస్తుంది. వర్గరహిత, సమాజం స్థాపించబడుతుంది. దీనికి కమ్యూనిస్ట్ వ్యవస్థ అనిపేరు.

## 10.10 కమ్యూనిస్ట్ వ్యవస్థ :

కమ్యూనిస్ట్ సమాజ స్థాపనతో శ్రామికవర్గ నియంతృత్వం అంతరిస్తుందని మార్క్స్ తన ''క్రిటిక్ ఆఫ్ ది గోథాప్రోగ్రాం''లో పేర్కొన్నాడు. ఈ సమాజం రెండుదశలలో పరిణామం చెందుతుందని వివరించాడు. 1. కమ్యూనిస్ట్ మెదటిదశ, 2. కమ్యూనిస్ట్ ఉన్నతదశ.

### 10.10.1 కమ్యూనిస్ట్ మొదటిదశ :

ఇది పరివర్తన దశ. ఇందులో పెట్టుబడిదారీ సమాజలక్షణాలు కొంతవరకూ మిగిలేవుంటాయి. ఉత్పత్తి సాధనాలన్నీ సమాజపరం అవుతాయి. జాతీయం చేయబడతాయి. ప్రతీవ్యక్తి సమాజసభ్యునిగా జాతీయసంపదకూ హక్కుదారుడౌతాడు. భాగస్వామ్యం పొందుతాడు. వస్తూత్పత్తికి ప్రజలందరూ శ్రమిస్తారు. శ్రమించినంత మేరకు ప్రతిఫలం పొందుతారు. ఎంతశ్రమిస్తే అంతే ప్రతిఫలం (వేతనాలు) వుంటుంది. విద్యా, వైద్యము, సాంఘిక సంక్షేమము, వార్తారవాణా సౌకర్యాలు, గృహవసతులు మొదలైన ప్రజోపయోగ కార్యక్రమాలు పబ్లిక్ నిధి నుండి నిర్వహింపబడతాయి. ఈ దశలో సమానత్వం పూర్తిగా స్థాపితంగాదు. హెచ్చుతగ్గులు కొనసాగుతూనే వుంటాయి. అయితే సంపద ప్రభుత్వ యాజమాన్యంలో వుండుటవల్ల

దోపిడీవిధానం వుండదు. "పనిచేయని వారికి తిండితినే హక్కు లేదు" అనే స్థితి కొనసాగుతుంది. వేతనాలలో అసమానతలుంటాయి. సాంకేతిక నిపుణులు, మేనేజర్లు, సివిల్ ఉద్యోగులు మొదలైనవారు సాధారణ శ్రామికులకన్న అధిక వేతనం పొందుతారు. ఉత్పత్తి సాధనాలన్నీ ప్రభుత్వపరం అగుటయే కమ్యూనిస్ట్ సమాజపు తొలిదశగా మార్క్స్ వివరిస్తాడు.

### 10.10.2 కమ్యూనిస్ట్ ఉన్నతదశ :

అంతిమంగా రాజ్యం అంతరించుకుపోవుటయే కమ్యూనిస్ట్ ఉన్నతదశ. "ప్రతి ఒక్కరి సామర్థ్యాన్నిబట్టి శ్రమ, ప్రతి ఒక్కరి అవసరాన్నిబట్టి ప్రతిఫలం" (Each according to his ability and each according to his needs) అనే పద్ధతి ఆచరింపబడినపుడు రాజ్యం అవసరం తీరిపోతుంది. అది అంతరించిపోతుంది (State will wither away). సామాజిక సంబంధాల మౌలిక నియమాలను పాటించడానికి ప్రజలుస్వచ్ఛంధంగా అలవాటుపడతారు. తమ సామర్థ్యానుసారం వస్తూత్పత్తికి శ్రమిస్తారు. తమ అవసరాలకు అనుగుణంగా ప్రతిఫలాన్ని (వేతనాన్ని) స్వేచ్ఛగా పొందుతారు. మనుషులు మనుషులను పాలించరు. ఒకరు ఇంకొకరిని దోపిడీ చేయరు. అభివృద్ధి సాధిస్తూ ప్రతీవ్యక్తి పరిపూర్ణుడుగా రూపొందుతాడు.

### 10.10.3 రాజ్యరహిత సమాజం (Stateless Society) :

కమ్యూనిస్ట్ సమాజంలో చివరిదశలో ప్రజలమధ్య అంతరాలు పూర్తిగా తొలగిపోతాయి. సమానత్వం స్థిరపడుతుంది. ప్రజలందరూ శ్రామికులే. సంపదలో వారందరూ భాగస్వాములే. రాజ్యం తన అస్తిత్వాన్ని కోల్పోతుంది. "రాజ్యం క్రమంగా అంతరిస్తుంది". సామాజిక పరిణామ క్రమంలో ఒక దశలో రాజ్యం అవతరించింది. దోపిడీసాధనంగా నిలచింది. వర్గరహిత సమాజస్థాపనతో రాజ్యం అంతరిస్తుంది. రాజ్యరహిత సమాజం అంటే పాలకవర్గం లేని స్వేచ్ఛాసమానత్వాలు గల సమాజం.

పెట్టుబడిదారీ విధానంలో దోపిడీకి గురిఅయి, నష్టపడి, నిస్సహాయస్థితిలో దుర్భర జీవితాన్ని అనుభవించిన శ్రామికులను సంఘటితపరచి ఒకనిర్దిష్ట కార్యక్రమం ద్వారా కమ్యూనిస్ట్ సమాజస్థాపనకు మార్క్స్ తన సిద్ధాంతాల ద్వారా కృషిచేశాడు. అతడు వాస్తవికవాది. వర్గరహిత, రాజ్యరహిత సమాజస్థాపననే కర్షకుల, కార్మికుల అంతిమలక్ష్యం కావాలని వాదించాడు. నవసమాజనిర్మాణంపై ఇంతకు ముందున్న భావాలను మరింతగా ముందుకు తెచ్చాడు.

## 10.11 రాజ్య సిద్ధాంతం :

ఉత్తమజీవనం అందించుటకే రాజ్యం అవతరించిందని అరిస్టాటిల్ సిద్ధాంతం. దానికి భిన్నంగా వర్గప్రాబల్యాన్ని పెంచి, పోషించే సాధనమని మార్క్స్‌వాదం. ఒకప్పుడు రాజ్యవ్యవస్థలేదు. మానవసమాజం అంతర్గత వైరుధ్యాలలో వర్గాలుగా చీలిపోయిన తరుణంలో రాజ్యావతరణ జరిగిందని మార్క్సిజం చెపుతుంది. స్వాభావికంగా రాజ్యం అవతరించలేదు. వర్గసంఘర్షణ కారణంగా ఏర్పడింది.

రాజ్యమనేది ఒక వర్గముకు చెందిన పాలనాంగం. దోపిడీ వర్గానికి పీడించే ఒక బలమైన ఆయుధంగా రాజ్యం జన్మించింది. పీడనచట్టబద్ధం చేయబడింది. పీడికవర్గం రాజకీయాధికారాన్ని తమ ఆధీనంలో వుంచుకుంటారు. వారి ప్రయోజనాలను, ఆస్తులను కాపాడుటలోనే రాజ్యవ్యవస్థ కొనసాగుతుందని మార్క్స్ వాదించాడు.

సమాజం, రాజ్యం ఈ రెండు వ్యవస్థలు తామంత తాముగా ఏర్పడవని మార్క్సిజం భావిస్తుంది. సమాజం

యొక్క ఉపరితల నిర్మాణమే రాజ్యంగా రూపొందుతుంది. వైరుధ్యాలు పెరిగినకొద్దీ పీడితులను అణచివేసే తత్వాన్ని రాజ్యాధికారం బహిర్గతం చేస్తుంది. శ్రామికవిప్లవం ద్వారా వర్గరహిత సమాజాన్ని సాధించటానికి 'శ్రామిక' రాజ్యం సహాయపడుతుంది. శ్రామికవర్గం ఏదో ఒక దశలో వర్గసమాజాన్ని అంతం చేస్తుంది. దానితో రాజ్యఅవసరం కూడా తీరిపోతుంది. ప్రాబల్యాన్ని కోల్పోయి రాజ్యం క్రమేపీ తానంతతానే అంతరించిపోతుందని మార్క్సిస్టు రాజ్యసిద్ధాంతం వివరిస్తుంది.

## 10.12 మార్క్సిజం పై విమర్శ :

రాజనీతితత్వము, రాజకీయాలు, మానవ మనస్తత్వం, భౌతికజీవన విధానం మొదలగు అనేక రంగాలను గతితార్కిక భౌతికవాద దృష్టితో స్పృశించి మార్క్సిస్టు సిద్ధాంతం ఒక సంచలనం కలిగించింది. అనేక విమర్శలు కూడా చేయబడినాయి.

1. మార్క్స్ ప్రతిపాదించిన చారిత్రక భౌతికవాదానికి సమగ్రత లోపించింది. కేవలం ఆర్థికపరదృష్టిలోనే మానవసంబంధాలను నిర్ధారించుట సమంజసం కాదు. నైతికతా, మానవతా విలువలు విస్మరింపబడినాయి. నైతికపర బోధనలతో మహాప్రవక్తలు మానవాళిని ప్రభావితం చేసారనుట ఒక చారిత్రక సత్యం. నైతికధర్మాలు మానవ సమాజాలను సంస్కరించాయి. ఈ యదార్థాలను మార్క్స్ విస్మరించాడు. ప్రవర్తనా, ఆదర్శాలు, సత్యాన్వేషణలకు కూడా మానవ సమాజంలో ప్రముఖస్థానమే వున్నది.

2. మానవ సమాజం అంటే కేవలం పీడకలు - పీడితులు అనే రెండు పరస్పర వైరుధ్యవర్గాలే కాదు. వీటికతీతంగా వేరే ఇతర వర్గాలు కూడా వుంటాయి. నిర్వాహకులు, నిపుణులు, సలహాదారులు, మధ్యతరగతి వర్గము మొదలైనవారు కూడా సమాజంలో భాగాలే.

3. వర్గసిద్ధాంతం పాలకవర్గాలలో వుండే వైరుధ్యాలను, అంతఃకలహాలను పట్టించుకోలేదు. మధ్యయుగాలలో రాజులకు - మతాధిపతులకు మధ్య కలహాలు ఆనాటి భౌతిక జీవన పరిస్థితులపై (Negative) వ్యతిరేక ప్రభావాన్ని చూపెట్టయి.

4. మార్క్స్ తన దృష్టినంతా పారిశ్రామిక సమాజంపైనే కేంద్రీకరించాడు. వ్యవసాయక సమాజాన్ని నిస్తేజంగా భావించాడు. చైనా, రష్యాలవంటి వ్యవసాయక దేశాలలో విప్లవం జరిగింది. పారిశ్రామికంగా అత్యంత అభివృద్ధిని సాధించిన ఐరోపా దేశాలలో ఇంతవరకు మార్క్స్ ఊహించిన విప్లవం జరగలేదు.

5. మిగులు విలువ సిద్ధాంతం కూడా అసంపూర్ణమే. ఉత్పత్తి సాధనాలలో శ్రమ అనేది ఒక భాగం. వస్తువుల విలువ నిర్ధారించుటలో ఇతర సాధనాలను పరిగణించలేదు.

6. వర్గపోరాటం సత్యదూరం, అవాస్తవికం. ఒక వర్గం నుండి వేరొక వర్గానికి ప్రజలు మారడమనేది సహజంగా, స్వాభావికంగా జరుగుతోంది. సమాజాభివృద్ధికి అందరి సహకారం, సామరస్యం వుండితీరాలి. పెట్టుబడిదారుల ప్రయోజనాలకు - శ్రామికుల ప్రయోజనాలకు మధ్య సమన్వయం చేకూర్చుట అసాధ్యమేమీకాదు. వర్గ సంఘర్షణ ఒక్కటే మార్గం కాదు.

7. సామాజిక విప్లవం అనివార్యమని మార్క్స్ భావించాడు. నేటి ఆధునిక సమాజాలలో విప్లవాలు జరిగితే విపరీత, విపత్కర పరిణామాలేర్పడతాయి. ఫాసిజంవంటి నియంతృత్వ పాలనకు దారితీయవచ్చు.

8. పారిశ్రామిక విప్లవ సందర్భంగా పుట్టిన సిద్ధాంతాలు - ఉదారవాదం, మార్క్సిజం. రాజ్యపరిధిని అత్యల్పస్థాయికి

నియంత్రించాలని ఉదారవాదం భావిస్తుంది. రాజ్యం పూర్తిగా అంతరిస్తుందని మార్క్సిజం ఊహిస్తుంది. వాస్తవ పరిస్థితులు ఈ రెండు సిద్ధాంతాల ధోరణులకు అతీతంగా వున్నాయి. రాజ్యం ఒక బలమైన శక్తిగా మారింది. ప్రజాశ్రేయస్సుకై పాటుపడింది. శ్రేయోరాజ్యాన్ని ప్రజలు ఆదరిస్తున్నారు. అభిమానిస్తున్నారు. మార్క్స్ ఊహకు ఇది అందని పరిణామం.

9. పెట్టుబడిదారీ విధానం పతనం చెందితే శ్రామికవర్గ నియంతృత్వమే ఏర్పడాలనే నిర్బంధమేమీలేదు. అరాచకశక్తులతో నియంతృత్వపాలన ఏర్పడినా ఆశ్చర్యమేమీలేదు.

10. జాతాయతావాదాన్ని మార్క్సిజం గమనించలేదు. ప్రపంచ చరిత్రలో మహావిప్లవాలకు జాతీయవాద భావాలే దోహదం చేశాయి. జర్మనీ, ఇటలీలలో జాతీయవాదమే దీనికి నిదర్శనం.

11. విప్లవం మాత్రమే సమస్యలను పరిష్కరించలేదు. నేటి కార్మికసంఘాలు తమ సంఘటితశక్తితో అనేక సౌకర్యాలు సాధిస్తున్నాయి.

12. కమ్యూనిస్ట్ సిద్ధాంతం ప్రజాస్వామిక విలువలను వ్యతిరేకిస్తుంది. దౌర్జన్యపూరిత, హింసాయుత విప్లవాలను ప్రోత్సహిస్తుంది. మతాన్ని మత్తు మందుగా భావించి ద్వేషిస్తుంది. సమాజ సంస్కరణలలో మత ప్రభావాన్ని మార్క్స్ గుర్తించలేదు. మానసిక ప్రశాంతత, వికాసానికి తోడ్పడే సాధనాలలో మతంకు ప్రముఖస్థానం వుంది.

మార్క్స్ కోరుకున్నట్లు ఆధునిక యుగంలో విప్లవమే సంభవిస్తే సమసమాజనిర్మాణమాటెలా వున్నా దారుణ పరిణామాలేర్పడుట తథ్యం. శ్రామికవర్గ నియంతృత్వం అప్రజాస్వామికం. నియంతృత్వమనేది ఏ రూపంలోనున్నా అది వాంఛనీయంకాదు. వర్గరహిత, రాజ్యరహిత సమాజం కేవలం మార్క్స్ ఊహలకే పరిమితం.

## 10.13 మార్క్స్ విశిష్టత :

మార్క్సిజంపై ఎన్ని విమర్శలున్నా ఆధునిక సమాజాన్ని ఈ సిద్ధాంతము ప్రభావపరచినంతగా వేరొకటిలేదు. మార్క్స్ నవయుగానికి నాంది పలికిన యుగకర్త. సామ్యవాద సిద్ధాంతాన్ని శాస్త్రీయంగా విశ్లేషించి "ప్రపంచ కార్మికులారా ఏకంకండి" అనే విప్లవ సందేశాన్ని అందించాడు. వారికి ఆరాధ్యదైవమయ్యాడు. పెట్టుబడిదారీ విధానంలోని లోపాలను బహిర్గతం చేశాడు.

మార్క్స్ ఒక వాస్తవికవాది. ఆర్థిక వ్యవస్థకు - సమాజ పరిస్థితులకు మధ్యగల సంబంధాన్ని గతితార్కిక పద్ధతులలో విశ్లేషించాడు. ఇతని గతితార్కిక భౌతికవాదం, చారిత్రక భౌతికవాదాలు విశ్వవ్యాప్తంగా గుర్తింపుపొందాయి. మార్క్స్ యొక్క శాస్త్రీయ సామ్యవాదం కొన్ని ప్రాథమిక సత్యాలను వివరించింది. వ్యక్తి కన్నా సమాజం ప్రధానం. మార్గాలకన్నా ధ్యేయాలే ముఖ్యం. ఇది మార్క్స్ క్రియాత్మక ధోరణిని తెలుపుతుంది. సామ్యవాద ఉద్యమాలకు ఊపిరిపోస్తుంది.

"శూన్యం నుండి పదార్థం ఉత్పత్తికాదు" అన్న మార్క్స్‌వాదం శాస్త్రసాంకేతికాభివృద్ధికి దోహదపడింది. ప్రపంచ వ్యాప్తంగా సామాజిక తత్వవేత్తలు, రాజనీతి తాత్వికులు, సంఘ సంస్కర్తలు, విప్లవకారులు, విమర్శకారులు, మార్పుకాంక్షించేవారు - తర్కించుటకో, విమర్శించుటకో మార్క్స్ సిద్ధాంతాలను అధ్యయనం చేశారు. అనుకూలంగానో, ప్రతికూలంగానో ప్రభావితులైనారు.

పీడిత ప్రజానీక ఆశావాది కార్ల్‌మార్క్స్. పరిస్థితులను శాస్త్రీయంగా విశ్లేషించి జీవనసత్యాలనే సిద్ధాంతంగా

ప్రతిపాదించి తన ప్రత్యేకతను నిరూపించుకున్నాడు. ప్రప్రథమంగా లెనిన్ తన నాయకత్వంలో బోల్షివిక్ అనుచరులతో కలిసి రష్యాలో విప్లవం ద్వారా రాచరికపాలన అంతమొందించి శ్రామికవర్గ నియంతృత్వ వ్యవస్థను స్థాపించాడు. అనేక తూర్పు ఐరోపా, ఆసియా రాజ్యాలలో కమ్యూనిస్ట్ ప్రభుత్వాల స్థాపనకు మార్క్స్ సిద్ధాంతమే స్ఫూర్తినిచ్చింది.

"అతని సందేశ శక్తివలన, బోధనలలో ఆవేశం వలన, భావిచరిత్రకాభివృద్ధిపై ప్రభావం వలన, ప్రపంచంలోని గొప్ప రాజనీతి తత్వవేత్తలలో మార్క్స్ ప్రముఖస్థానాన్ని పొందాడనుట నిస్సందేహం" (సి.ఎల్.వేపర్)

"For the power of his message, for the inspiration of his teaching and for his effect upon future development Marx can be sure of his place in any collection of the World's great masters of Political thought"

## 10.14 చదువదగిన గ్రంథాలు :


1. Ebenstein, W, - Great Political Thinkers
2. Wayper, C.L. - Political Thought
3. Sabine, G.H. - Political Theory
4. Andrew Hacker - Political Theory
5. Spargo. J. - Karlmarx, his life and work
6. Allen - The history of Political thought in 16th Century.


**ప్రశ్నలు :**

1. హెగెల్, మార్క్స్‌లు ప్రతిపాదించిన గతితార్కిక వాదాల మధ్య పోలికలను, బేధాలను చర్చించండి.
2. మార్క్స్ ప్రతిపాదించిన గతితార్కిక, చారిత్రక భౌతికవాదాలను వివరించండి.
3. మార్క్స్ ప్రతిపాదించిన రాజనీతి సిద్ధాంతాన్ని విమర్శనాత్మకంగా చర్చించండి.
4. రాజనీతి సిద్ధాంత చరిత్రలో మార్క్స్ స్థానమేమిటి ?
5. అదనపు విలువ, వర్గపోరాటాలను గురించి వివరించండి.
6. మార్క్స్ చారిత్రక భౌతికవాదాన్ని విశ్లేషింపుము.
7. అదనపు విలువ సిద్ధాంతాన్ని విమర్శనాత్మకంగా పరిశీలింపుము.
8. రాజనీతితత్వానికి మార్క్స్ సేవ ఎట్టిది.
9. వర్గపోరాటం వివరింపుము.
10. వర్గరహిత, రాజ్యరహిత సమాజం వివరణ.
11. కమ్యూనిస్ట్ మానిఫెస్టో ప్రాధాన్యత తెలుపుము.

**రచయిత : డా॥ యస్. సుబ్బారావు**

పాఠం - 11

# స్వేచ్ఛావాదము - జె.ఎస్.మిల్

విషయసూచిక


11.1 పరిచయం
11.2 మిల్ జీవిత సంగ్రహం
11.3 మిల్ రచనలు
11.4 ఉపయోగితా వాదముపై మిల్ భావాలు
11.4.1 గుణాత్మక
11.4.2 నైతికత్వము
11.4.3 నైతిక బద్ధత
11.4.4 వ్యక్తిత్వ వికాసం
11.4.5 ప్రజాస్వామిక భావం
11.5 స్వేచ్ఛపై మిల్ భావాలు
11.6 స్వేచ్ఛ - రకాలు
11.6.1 వాక్ స్వాతంత్ర్యం - భావ ప్రకటనా స్వాతంత్ర్యం
11.6.2 ప్రవర్తనా స్వాతంత్ర్యం
11.7 వ్యక్తి స్వేచ్ఛ - అవరోధాలు
11.7.1 ప్రభుత్వ యంత్రాంగం
11.7.2 సాంఘిక నిరంకుశత్వం
11.8 వ్యక్తి స్వేచ్ఛ - అవరోధాలు
11.9 ప్రాతినిధ్య ప్రభుత్వం
11.9.1 నైష్పత్తిక ప్రాతినిధ్యం
11.10 స్త్రీ స్వాతంత్ర్యం
11.11 మిల్ విశిష్ఠత
11.12 చదవదగిన గ్రంథాలు
11.13 నమూనా ప్రశ్నలు


## 11.1 పరిచయం :

జాన్‌స్టూవర్ట్‌మిల్ (1806 - 1873) 19వ శతాబ్దానికి చెందిన ఆంగ్ల రాజనీతి తత్త్వవేత్త. అసాధారణ మేథాసంపన్నుడు. ప్రాధమికంగా ఉదారవాది. బెంథామ్ యొక్క ఉపయోగితావాదానికి, గుణాత్మకమైన మార్పులు చేసి ఆధునికతను కలుగచేసి దాని స్వరూప, స్వభావాలనే మార్చివేశాడు. దానినొక మానవతా సిద్ధాంతంగా మలచిరాజనీతి తత్త్వవిచారంలో ప్రముఖ

స్థానాన్ని సాధించిపెట్టిన ఘనత మిల్‌కు దక్కుతుంది. వ్యక్తి స్వేచ్ఛావాదాన్ని సమర్థించాడు. అది ఒక ప్రధాన చర్చనీయాంశంగా మారింది. సర్వత్రా ఆదరింపబడింది. ఆమోదింపబడింది. ఇతడు ప్రజాస్వామికవాది. ప్రాతినిధ్య ప్రజాస్వామ్యాన్ని ప్రతిపాదించాడు. స్త్రీ జనోద్ధరణ వంటి విషయాలలో పేరెన్నికగన్న సంస్కరణాభిలాషి.

## 11.2 జీవిత సంగ్రహం :

లండన్ నగరంలో 1806 సంవత్సరములో జాన్‌స్టువర్ట్ మిల్ (జె.ఎస్.మిల్) జన్మించాడు. ఇతని తండ్రి జేమ్స్‌మిల్. బెంథామ్‌కు సమకాలికుడు. ఉపయోగితావాది. తన కుమారుడు కూడా తన బాటలోనే ఒక ప్రఖ్యాత ఉపయోగితావాద సిద్ధాంతకర్తగా రూపొందాలని ఆశించాడు. అతనిని తానే స్వయంగా తీర్చిదిద్దాలని తీవ్రమైన కృషిచేశాడు. బాల్యంలో మిల్ తన మూడవ ఏట నుండి గ్రీకు భాషను, ఎనిమిదవఏట నుండి లాటిన్, బీజగణితం, తత్వశాస్త్రం, రసాయనశాస్త్రం, అర్థశాస్త్రం, చరిత్ర, తర్కశాస్త్రం మొదలగువాటిని అభ్యసించి పదహారవ ఏటి నుండి విద్యాభ్యాసం దాదాపు పూర్తిచేసి తన అపార మేధాశక్తిని నిరూపించాడు. అదే సమయంలో "ఉపయోగితావాద సంఘాన్ని" స్థాపించి విభిన్న సాంఘిక, రాజకీయ సమస్యలపై చర్చలను నిర్వహించాడు. తన తీవ్రవాద భావాలకు ప్రచారం కలుగజేశాడు. పత్రికలకు వ్యాసాలు రాయడమేకాక సంపాదకుడుగా కూడా కొంతకాలం పనిచేశాడు.

లండన్‌లో ఈస్టిండియా కంపెనీ కార్యాలయంలో మిల్ తన పదిహేడవ ఏడు చిన్నఉద్యోగంలో చేరాడు. కేవలం అర్హత ఆధారంగా ఉన్నతోద్యోగానికి ఎంపికకాబడి అసిస్టెంట్ ఎగ్జామినర్‌గా పదోన్నతి పొందెను. భారతదేశంపై బ్రిటీష్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిరసనగా 1858లో తన పదవికి రాజీనామా చేశాడు.

జాన్‌స్టువర్ట్‌మిల్‌కు ఇరవైమూడవఏట శ్రీమతి హారియట్ టేలర్ అనే విజ్ఞానవంతురాలైన విద్యావతితో పరిచయమేర్పడింది. ఆమె భర్త మరణానంతరం 1851లో వివాహం చేసుకొన్నాడు. అతని రాజకీయ, సాంఘిక భావాలపై హారియట్ ప్రభావం చాలా వుందని ప్రకటించుకొన్నాడు. ప్రత్యేకంగా స్త్రీజనోద్ధరణ, స్త్రీల ఓటుహక్కు, స్త్రీ స్వాతంత్ర్యం మొదలగు విషయాలలో ఆమె కృషి కూడా తోడయ్యింది. 1866 నుండి 1868 వరకు బ్రిటీష్ పార్లమెంటు సభ్యునిగా కొనసాగాడు. పార్లమెంటులో తీవ్రవాదులతో కలసి పనిచేశాడు. 8 మే 1873లో మిల్ మరణించాడు.

## 11.3 మిల్ రచనలు :

రాజకీయాలు, నీతిశాస్త్రము, ఆర్థికశాస్త్రము మొదలైన అనేక అధ్యయనాలపై మిల్ విస్తృతంగా రచనలు చేసెను. పారిశ్రామికీకరణ, ప్రజాస్వామ్యాల ఫలితంగా 19వ శతాబ్దానికి ఇంగ్లండ్‌లో ఉన్నతమైన విభిన్న రాజకీయ, సాంఘిక సమస్యలనేకం ఇతని రచనలలో నిశితంగా చర్చింపబడినాయి. అతని రచనలలో ఈ క్రింది గ్రంథాలు అత్యంత ప్రచారాన్ని పొందాయి.

1. ప్రిన్సిపల్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ (1848)
2. ఎన్‌ఫ్రాంచైజ్‌మెంట్ ఆఫ్ ఉమెన్ (1858)
3. ఆన్ లిబర్టీ (1859)
4. థాట్స్ ఆన్ పార్లమెంటరీ రిఫార్మ్స్ (1859)
5. కన్సిడరేషన్స్ ఆన్ రిప్రజెంటేటివ్ గవర్నమెంట్ (1860)

6. ఉపయోగితావాదం (1863)
7. ఎడ్మిషన్ ఆఫ్ ఉమెన్ టు ఎలక్టోరల్ ఫ్రాంఛైజ్ (1867)
8. ఉమెన్ సఫ్రెజ్ (1873)
9. సబ్జెక్షన్ ఆఫ్ ఉమెన్ (1869)
10. త్రీ ఎస్సేస్ ఆన్ రిలిజియన్ (1874)
11. ఆత్మకథ (1874)

## 11.4 ఉపయోగితావాదముపై మిల్ భావాలు :

19వ శతాబ్దంలో ఇంగ్లండ్‌లో ఉపయోగితావాదం జన్మించింది. బెంథామ్ ఉపయోగితావాద సిద్ధాంత పితామహుడు. సుఖం, సంతోషం, ఆనందంలు ఉపయోగిత లక్షణాలు. "అత్యధిక సంఖ్యాకులకు అత్యధిక ఆనందాన్ని" కలిగించాలని ఈ సిద్ధాంతం చెబుతుంది. చట్టాలు గాని, ప్రభుత్వకార్యకలాపాలు గాని, సంస్కరణలు గాని అత్యధిక జనులకు అత్యధిక సంతోషాన్ని కలిగించినంతవరకే వాటికి ఉపయోగితవుంటుంది. ఆనాటి సాంఘిక, రాజకీయ వ్యవస్థల విలువ అంచనా వేయడానికి, ప్రజాశ్రేయస్సే ధ్యేయంగా చట్టాలు చేయడానికి ఉపయోగితా వాదం తోడ్పడింది. క్రమేపీ ఈ సిద్ధాంతంలో కొన్ని లోపాలు బహిర్గతమయ్యాయి. తీవ్ర విమర్శలకు లోనైంది. బెంథామ్ శిష్యులలో మిల్ ప్రముఖుడు. ప్రజాదరణ కోల్పోతున్న ఉపయోగితావాద సిద్ధాంతంలో కొన్ని మౌలికమైన మార్పులు చేస్తూ దాన్ని పునరుద్ధరించటానికి పూనుకున్నాడు. అతను ప్రవేశపెట్టిన మార్పులను ఈక్రింది విధంగా వివరించవచ్చు.

### 11.4.1 గుణాత్మకత

బెంథామ్ ప్రతిపాదించిన ఉపయోగితావాదం కేవలం సుఖం, సంతోషం, ఆనందాల పరిమాణాన్ని మాత్రమే పరిగణలోకి తీసుకున్నది. ఈ అభిప్రాయాన్ని మార్పుచేస్తూ ఆనందాలు పరిణాత్మకంగానే కాకుండా గుణాత్మకంగా కూడా ఉంటాయని తెలియచేశాడు. కొన్ని సంతోషాలు అతిసామాన్యంగాను మరికొన్ని అత్యున్నతంగాను వుంటాయి. గుణాన్ననుసరించి ఆనందాలలో వ్యత్యాసాలుంటాయి. పరిమాణాత్మక ఆనందంకన్నా గుణాత్మక ఆనందమే మేలు. "సంతృప్తి చెందిన మృగము కన్న అసంతృప్తుడైన మానవుడు మిన్న. సంతృప్తి చెందిన మూర్ఖునికన్న అసంతృప్తుడైన సోక్రటిస్ మిన్న" (It is better to be a human being dissatisfied than a pig satisfied : Better to be Socrates dissatisfied than a fool satisfied - J.S.Mill) అత్యధిక ఆనందం కన్న అత్యున్నతానందం పొందడమే మానవ లక్ష్యంగా వుండాలని మిల్ భావించాడు.

### 11.4.2 నైతికత్వము :

అత్యధిక సంతోషమే జీవితపరమార్థమని బెంథామ్ సిద్ధాంతము చెపుతుంది. సుఖాన్ని, సంతోషాన్ని కలిగించే ఏ పనినైనా చేయవచ్చని భావిస్తుంది. అనగా భౌతికపర ప్రయోజనాలే ఈ సిద్ధాంతం లక్ష్యం. సొంత ప్రయోజనాల కొరకే యత్నించే మానవ జీవితం పశుప్రాయంగా, యాంత్రికంగా మారుతుంది. ఇట్టి భౌతికానంద భావనను తిరస్కరించి మానవతాపరమైన భావనే ఉత్తమ జీవనానికి ప్రాతిపదికగా మిల్ భావిస్తాడు. సామాజిక ప్రయోజనంలోనే ఉత్తమ జీవనం ఇమిడివుంది. ఉత్తమ లక్ష్యసాధనలోనే నిజమైన ఆనందాన్ని, సంతోషాన్ని పొందవచ్చు. ఇట్టి నైతికపరమైన, మేధోపరమైన ఆశయాలను ప్రవేశపెట్టాడు. నైతిక సుగుణాలను అలవరచుకొనే వ్యక్తి ఉన్నత ఆశయాలను రూపొందించుకొంటాడు.

అదే ఆనందకరమైన ఉత్తమజీవనం. అది పొందటానికి మానవుడు నిరంతర కృషి చేయాలి. రాజ్యం ఒక నైతికసంస్థ. నైతిక లక్ష్యాలను పెంపొందించటమే దాని ప్రధాన ఆశయంగా మిల్ వర్ణిస్తాడు.

### 11.4.3 నైతికబద్ధత :

ఉపయోగితావాదానికి రాజకీయ లక్ష్యాలేగాని నైతిక లక్ష్యాలు లేవనే బెంథామ్ భావాలను మిల్ తీవ్రంగా నిరసించాడు. స్వార్థపరమైన కోర్కెలను నిరసించాడు. తోటివారి ఎడల ప్రేమ, సహనము, సానుభూతి మొదలైనవి నైతికబద్ధతను సూచిస్తాయి. సమాజ సంక్షేమాన్ని కోరుకొంటూ అట్టి సంక్షేమాన్ని పెంపొందించుకోవాలనే నైజం ప్రతీవ్యక్తిలోనూ వుంటుందని భావించాడు. ఆ విధంగా ఉపయోగితావాదానికి నైతికబద్ధత కలిగించాడు.

### 11.4.4. వ్యక్తిత్వ వికాసం :

స్వేచ్ఛ ద్వారా వ్యక్తిత్వ వికాసమనే భావనను బెంథామ్ సిద్ధాంతం విస్మరించింది. వ్యక్తికి, సమాజానికి స్వేచ్ఛయెక్క అవసరం ఎంతైనా వుందని మిల్ భావిస్తాడు. శాశ్వత ప్రయోజనాలకై మానవులు చేసే కృషితో నిరంతర అభివృద్ధి సాధ్యపడుతుంది. అట్టి ప్రయత్నమే నిజమైన ఉపయోగిత. తమకు తాముగా ఎవరికివారు కృషి చేయాలంటే దానికి సరైన స్వేచ్ఛ కావాలి. ప్రతీవ్యక్తి తన వివేకాన్ని, సమర్థతను, నైతికతను పెంపొందించుకొని తద్వారా సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం సాధించటానికి తగినంత స్వేచ్ఛ వుండితీరాలి.

### 11.4.5 ప్రజాస్వామిక భావం :

సాధారణ ప్రజల ప్రయోజనాల పరిరక్షణ ప్రజాస్వామ్యంలోనే చేకూరుతుందని బెంథామ్ భావిస్తాడు. దానితోమిల్ ఏకీభవించినాడు. ప్రజాస్వామ్యం లేనినాడు పాలకవర్గం తన స్వీయ ప్రయోజనాల కొరకే పాటుపడుతుంది. అయితే అన్నిదేశాలలో, అందరి ప్రజలకు ప్రజాస్వామ్యం ఒకేలా వర్తించదు. ఒకేలా విజయవంతం కాదు. భిన్న పరిస్థితులకు, భిన్న రాజకీయ సాంప్రదాయాలకు అనుగుణంగా వివిధ రకాల ప్రభుత్వాలు అమలులోవున్నాయి. ప్రాతినిధ్య ప్రభుత్వమేర్పడినప్పుడు ప్రజాస్వామ్యం విజయవంతంగా పనిచేస్తుందని మిల్ భావించాడు.

## 11.5 స్వేచ్ఛపై మిల్ భావాలు :

"ఆన్ లిబర్టీ" అనే వ్యాసం ద్వారా మిల్ వ్యక్తి స్వేచ్ఛను ప్రతిపాదించాడు. ఈ రచన అతని స్వేచ్ఛాప్రియత్వానికి ఒక నిదర్శనం. స్వేచ్ఛను అతడు సమర్థించినంతగా ఇతర రాజనీతి తత్వవేత్తలెవరూ సమర్థించలేదు. మిల్ యొక్క స్వేచ్ఛావాద సిద్ధాంతం రాజనీతి తత్వచరిత్రలో అతనికి శాశ్వత స్థానాన్ని అందచేసింది.

ఒకవైపు ఉపయోగితావాదం, రెండవవైపు పార్లమెంటు సంస్కరణలు కలిసి చట్టాల స్వభావాన్ని, పరిధిని విస్తృతంగా పెంచసాగేయి. ఓటుహక్కు కూడా విస్తృతం చేయబడింది. వీటి ఫలితంగా వ్యక్తిపర కార్యకలాపాలలో రాజ్యజోక్యం అధికమవుతుందని, ఆ మేరకు వ్యక్తి స్వేచ్ఛ పరిమితం కాబడుతుందని భావించడమైనది. ఇదే సమయంలో విద్యావ్యాప్తి జరిగింది. స్థానికపాలనా సంస్థలు స్థాపించబడినాయి. ప్రజల దృక్పథంలో మార్పులు రాసాగాయి. వ్యక్తికి స్వేచ్ఛ కావాలన్న ఆందోళన ప్రారంభమైంది.

వ్యక్తికి సంపూర్ణ స్వేచ్ఛ యొక్క ఆవశ్యకతను మిల్ గుర్తించాడు. నిరంతర సమాజ పురోభివృద్ధికి వ్యక్తి స్వేచ్ఛ అవసరం అవుతుంది. అది లేనిదే వ్యక్తిపరమైన శక్తి, సామర్థ్యాలు అభివృద్ధి చెందవు. సమాజ పురోగతి ఉండదు.

తనకుండే అవకాశాన్నిబట్టి శక్తిసామర్థ్యాలబట్టి తాననుకొన్న రీతిలో అభివృద్ధి పొందటానికి ప్రతివ్యక్తికీ తగినంత స్వేచ్ఛ వుండితీరాలి. "ప్రతీ వ్యక్తి తనమీద, తన శరీరంమీద, మనస్సు మీద సార్వభౌమాధికారి"(Over himself, Over his own body and mind, the individual is sovereign - J.S.Mill) పార్లమెంటుగాని, ప్రజాభిప్రాయంగాని వ్యక్తి స్వేచ్ఛను భంగపరచరాదు. మానవ సమాజం అభ్యుదయం సాధించడానికి వైవిధ్యం అవసరమవుతుంది. విభిన్న రీతులలో విభిన్న మార్గాలలో మానవసమూహం పురోగమించాలి. అది అభివృద్ధి సూచకం. అయితే ఇతరుల ప్రయోజనాలకు, హక్కులకు భంగం కలుగనంతవరకు వ్యక్తులకు, సంఘాలకు స్వేచ్ఛ అనుమతించవచ్చు.

## 11.6 స్వేచ్ఛ - రకాలు :

స్వేచ్ఛను రెండు రకాలుగా మిల్ వర్గీకరించాడు. అవి 1. అంతరాత్మ స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యం, భావప్రకటనా స్వాతంత్ర్యం, 2. ప్రవర్తనా స్వాతంత్ర్యం. వీటిలో భావప్రకటనా స్వాతంత్ర్యానికి అధిక ప్రాధాన్యతనిచ్చాడు.

### 11.6.1 వాక్ స్వాతంత్ర్యం - భావ ప్రకటనా స్వాతంత్ర్యం :

సమాజంలో ప్రతివ్యక్తికి వాక్ స్వాతంత్ర్యం వుండాలి. అతని భావాలను అణచివేసే అధికారం ఏశక్తికి లేదు. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు మానవ మనుగడకు, సమాజాభివృద్ధికి ఎంతైనా అవసరం. వాక్ స్వాతంత్ర్యాన్ని, భావప్రకటనను నియంత్రించే ఏ విధానమైన మానవాభ్యుదయాన్ని, ఔన్నత్యాన్ని నిరోధిస్తుందని మిల్ భావించాడు. భావప్రకటనా స్వాతంత్ర్యానికి పరిమితులుండరాదు. ఒక అభిప్రాయం గాని, ఆలోచనగాని సమాజంలో ఇతరుల కన్నా భిన్నంగా వుండినప్పటికీ దానిని నిర్భయంగా, స్వేచ్ఛగా ప్రకటించే హక్కు అతనికి వుండితీరాలి. నిరంకుశత్వంలో ఒకవ్యక్తి ఇతరుల భావాలను అణచివేయడం ఎంత తప్పో అదేవిధంగా అందరూకలసి ఒకవ్యక్తి యొక్క భిన్నాభిప్రాయాన్ని అణచివేయడం అంతే తప్పు.

భావప్రకటనా స్వాతంత్ర్యాన్ని సమర్థిస్తూ మిల్ ఈక్రింది అంశాలను ఉదహరించాడు.

1. ఒక వ్యక్తి యొక్క భిన్నాభిప్రాయాన్ని ప్రకటించకుండా అణచివేయుట వలన అందులో వుండే సత్యాన్ని, వాస్తవాన్ని శాశ్వతంగా సమాజం కోల్పోతుంది. వాదోపవాదాలకు తావులేకపోవుట వలన నిజనిర్ధారణ జరిగే అవకాశం వుండదు. ఫలితంగా సమాజానికి తీరని నష్టం కలుగుతుంది.

2. మంచి అనేది కాలానుగుణంగాను, పరిస్థితులననుసరించి మార్పులు చెందుతూ వుంటుంది. అందువలన అది సక్రమంగా కొనసాగాలంటే వాక్ స్వాతంత్ర్యం, భావప్రకటనా స్వాతంత్ర్యంలు నిరంతరం కొనసాగాలి.

3. ఒక విషయంలో భిన్నాభిప్రాయాలేర్పడినప్పుడు వాటిలో ఏ ఒక్క దానిలోను పూర్తి నిజం వుండదు. అన్నింటిలోను ఎంతో కొంత నిజం వుంటుంది. అన్ని అభిప్రాయాలలోను ఇమిడిన నిజాన్ని గ్రహించగలిగినప్పుడే సమాజానికి మేలు కలుగుతుంది.

4. ఎప్పటికప్పుడు వెలువడే నూతన భావాలను సమాజం ఆదరించి ప్రోత్సహించాలి. నిర్మాణాత్మక భావాలే సమాజ ప్రగతికి మార్గాలు. వాటిని ప్రకటించగల సమర్థులు కొద్దిమందే వుంటారు. భావనలలో అంతర్గతంగా వుండే మంచి, చెడులు బయల్పడటానికి సరైన వాదోపవాదాలు జరగాలి. నిశిత పరిశీలనానంతరం స్థిరపడిన భావాలు సమాజపురోభివృద్ధికి తోడ్పడతాయి.

### 11.6.2 ప్రవర్తనా స్వాతంత్ర్యం :

వ్యక్తి తన పరిధిలో తాను స్వేచ్ఛాపరుడని మిల్ అభిప్రాయము. వ్యక్తి చర్యలను రెండు రకాలుగా విభజించాడు. 1. సొంతానికి సంబంధించిన చర్య 2. ఇతరులకు సంబంధించిన చర్య. మొదటి విషయంలో అనగా సొంతానికి, సంబంధించిన విషయాలలో వ్యక్తి సర్వస్వతంత్రుడు. "తనపై, తన శరీరంపై, తన మనస్సుపై వ్యక్తి సార్వభౌముడు" మిల్. ఇతరులకు సంబంధించిన విషయాలలో అతని చర్యల వలన గాని ప్రవర్తన వలన గాని ఇతరుల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలకు ఎట్టి హాని కలుగరాదు. ఈ విషయంలో కొన్ని హద్దులకు, పరిమితులకు లోబడి తన ప్రవర్తనా స్వాతంత్ర్యాన్ని వినియోగించాలి.

## 11.7 వ్యక్తి స్వేచ్ఛ - అవరోధాలు :

ఒకవ్యక్తి స్వేచ్ఛ విషయంలో రాజ్యంగాని, సమాజం గాని జోక్యం చేసుకోరాదని మిల్ భావిస్తాడు. అట్టి జోక్యం వ్యక్తి వికాసానికి అవరోధం కలిగిస్తుంది. సమాజం సంకెళ్ళ నుండి, అధిక సంఖ్యాకుల అభిప్రాయం నుండి వ్యక్తి స్వేచ్ఛను పరిరక్షించుట తన ధ్యేయంగా భావించాడు. గతంలో మత మౌఢ్యవాదం నిరంకుశపాలనగా అవతరించి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలనే భావనలే లేకుండా చేసింది. క్రమంగా మెజారిటీ తీవ్రవాదం, నిరక్షరాస్యుల ఆధిపత్యం, రాజ్య కార్యకలాపాల విస్తరణలు నూతన అవరోధాలుగా అవతరించాయి.

వ్యక్తి స్వేచ్ఛకు అవరోధాలను ఈక్రింది విధంగా మిల్ పేర్కొన్నాడు.

### 11.7.1 ప్రభుత్వ యంత్రాంగం :

వ్యక్తి స్వేచ్ఛను నిరోధించటానికి, పరిమితులు విధించటానికి లేక హరించటానికి తగిన అధికారం ప్రభుత్వ యంత్రాంగానికుంటుంది. అందువలన వ్యక్తి తన అభ్యుదయాన్ని, అభివృద్ధిని తానే సాధించుకునే స్వేచ్ఛ ఎడల రాజ్యజోక్యము ఎంత పరిమితంగా వుంటే అంత మేలు జరుగుతుంది.

### 11.7.2 సాంఘిక నిరంకుశత్వం :

సాంఘికాచారాలు, సాంప్రదాయాలు, భావాలు వ్యక్తిపర ఇష్టాఇష్టాలతో ప్రమేయం లేకుండా అమలు చేయబడతాయి. వ్యక్తిపర స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను గుర్తించవు. దీనినే సాంఘిక నిరంకుశత్వమని మిల్ పేర్కొన్నాడు. దీని నుండి తప్పించుకొనుట అసాధ్యం. అనాదిగా ఆచరింపబడే ఈ సాంఘికాచార, వ్యవహారాలను, భావాలను, అలవాట్లను ఎదుర్కొని, ప్రశ్నించి, విమర్శించి, పరిశీలించవలసిన అవసరం ఎంతైనా వుంది. ఇట్టి అభివృద్ధి నిరోధక శక్తులను నిర్మూలించాలి.

నిజమైన స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు అందరికీ వ్యక్తిగతంగా లభించాలంటే స్వేచ్ఛా ప్రభుత్వంతోపాటు, స్వేచ్ఛా సమాజం నిర్మింపబడాలి.

## 11.8 వ్యక్తి స్వేచ్ఛ - విమర్శలు :

వ్యక్తి స్వేచ్ఛపై మిల్ భావాలు ఈ క్రింది విధంగా విమర్శింపబడినాయి.

1. విద్యావంతులు, జ్ఞానవంతులు, మేధావులకు మాత్రమే ఈ సిద్ధాంతము వలన లాభం కలుగుతుంది. సాధారణ వ్యక్తులకు, పరిపక్వత లేనివారికి దీనివలన ఏ ప్రయోజనమూ లేదు.

2. పరిపూర్ణమైన వ్యక్తి స్వేచ్ఛకు సహనశక్తి గల సమాజ అవసరాన్ని సూచించాడు. భిన్నాభిప్రాయాలను ఆదరించగలగాలి. సాంప్రదాయ వ్యతిరేక భావాలు కూడా అభ్యుదయానికి తోడ్పడతాయని సమాజం భావించాలి. ఇట్టి సమాజం అరుదుగా వుంటుంది.

3. పరిపూర్ణమైన వ్యక్తి స్వేచ్ఛకే మిల్ ప్రాముఖ్యత కల్పించాడు. సృజనాత్మకశక్తికి దోహదపడుతుందని విశ్వసించాడు. తద్వారా సమాజ పురోభివృద్ధి జరుగుతుందని ఆశించాడు. స్వేచ్ఛతోపాటు సంపూర్ణ వ్యక్తిత్వ సాధనకు సమానత్వం కూడా తోడ్పడుతుందనే వాస్తవాన్ని మిల్ విమర్శించాడు. సమానత్వం లేని స్వేచ్ఛ వలన సమాజంలో ప్రమాదకరమైన వర్గవిభేధాలేర్పడతాయి.

4. ప్రభుత్వ జోక్యం ఎంత తక్కువగా వుంటే స్వేచ్ఛ అంత అధికంగా వుంటుందని మిల్ భావించాడు. ఇందులో రాజ్యము ఎడల అతని వ్యతిరేక భావము వ్యక్తమవుతుంది. రాజ్యప్రగతికి వ్యక్తి తోడ్పాటుకావాలి. అదేవిధంగా తన కార్యకలాపాలను విస్తరిస్తూ రాజ్యము వ్యక్తి అభ్యుదయానికి తోడ్పడాలి. నేడు ప్రజలు శ్రేయోరాజ్యస్థాపన కోరుకుంటున్నారు.

5. సొంతానికి సంబంధించిన చర్యల విషయంలో వ్యక్తి సర్వస్వతంత్రుడిగా మిల్ పేర్కొన్నాడు. ఈ భావం కొంత సమంజసంగా లేదు. వ్యక్తి చర్యల ప్రభావం కేవలం అతనికే పరిమితం కాదు. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఇతరుల మీద కూడా పడుతుంది. అందువలన ఇతరులకు హాని కలిగించనంతవరకే వ్యక్తి తన స్వేచ్ఛను అనుభవించవచ్చు.

6. పరిమితులు, షరతులు, నిర్బంధాలు వ్యక్తి స్వేచ్ఛకు ఆటంకాలని మిల్ భావించాడు. అనగా వ్యతిరిక్తమైన స్వేచ్ఛను ప్రాముఖ్యతనిచ్చాడు. సంవర్థక పరిస్థితులను విస్మరించాడు. ఈ సందర్భంగా "మిల్ అమూర్తులైన వ్యక్తుల కొరకు రిక్త స్వేచ్ఛను ప్రకటించిన ప్రవక్త" (Prophet of an empty Liberty and an abstract individual - E.Barker) ఈ వ్యాఖ్యానం సమంజసమేనని చెప్పవచ్చు.

## 11.9 ప్రాతినిధ్య ప్రభుత్వం :

ప్రాతినిధ్య ప్రభుత్వ విధానమే వ్యక్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు అనుకూలమైనదని మిల్ నిర్ధారించాడు. ప్రజలు పాల్గొనే ప్రభుత్వమే వారి అవసరాలను గుర్తించగలదు. సుగుణాన్ని, జ్ఞానాన్ని పెంపొందింపచేయుట ఉత్తమ ప్రభుత్వ లక్ష్యము. అట్టివారే రాజ్యప్రగతిని సాధిస్తారు. ప్రాతినిధ్య ప్రజాస్వామ్య విధానంలోనే ఈ లక్ష్యసాధన జరుగుతుంది. వ్యక్తిపర ప్రయోజనాలు, సమాజపర ప్రయోజనాలు కాపాడబడుతాయి. ప్రజలందరి భాగస్వామ్యాన్ని పొందగల ప్రాతినిధ్య ప్రజాస్వామ్య విధానమే ఉత్తమమైనదనీ, ఆచరణ యోగ్యమైనదని మిల్ విశ్వసించాడు.

ప్రాతినిధ్య ప్రజాస్వామ్య విధానంలో మూడు అంచెలను మిల్ వివరించాడు. మొదటి స్థాయిలో వుండేది ప్రజలు. వీరు ఎన్నికల ద్వారా తమప్రతినిధులను ఎన్నుకొంటారు. రెండవస్థాయిలో ప్రజాప్రతినిధులుంటారు. శాసనాలు నిర్మించుట వీరి కర్తవ్యము. మూడవ స్థాయిలో విధాన నిర్దేయక సంఘం వుంటుంది. ఇందులో సుశిక్షితులైన సభ్యులుంటారు. సమాజావసరాలకు అనుగుణ్యమైన శాసనాల ప్రతిపాదన వీరి కర్తవ్యము. క్లిష్టమైన శాసన ప్రక్రియను ఈ సంఘం చేపడుతుంది. పై మూడు అంచెలతోపాటు శాశ్వత ప్రభుత్వోద్యోగులుంటారు. శాసనాలు అమలు, పాలనా నిర్వహణలు వీరి బాధ్యతలు. ఇది ఆదర్శవంతమైన ప్రాతినిధ్య ప్రభుత్వ నిర్మాణం యొక్క స్వరూపం. ప్రజాకార్యకలాపాలు సక్రమంగా నిర్వహింపబడుతాయి. అల్పసంఖ్యాకవర్గాల శ్రేయస్సుకై ఈ ప్రభుత్వం పాటుపడుతుంది.

ఒకవైపు ప్రాతినిధ్య ప్రభుత్వ సుగుణాలను ఆమోదిస్తూ మిల్ తన కాలంనాటి ఇంగ్లండులో ప్రజాస్వామ్యంలో

బలహీనతలను విస్మరించలేదు. రాజకీయాధికారం ప్రజలందరకూ చెందాలి. దానికనుగుణమైన ఓటు హక్కు గురించి చర్చించాడు. ఓటు హక్కు అందరకూ కలిగించాలి. స్త్రీ, పురుష బేధాలుండరాదు. ఓటు విలువ ఓటు చేసిన వ్యక్తి స్థాయినిబట్టి నిర్ణయించాలి. సాధారణంగా వ్యక్తి ఓటుకి, మేధావి ఓటుకి విలువలలో తారతమ్యం వుండితీరాలి. జ్ఞానవంతులు, విద్యావంతులు, మేధావులు, అనుభవజ్ఞులకు అదనపు ఓట్లు అనుమతించాలి. ఈ విధంగా సార్వజనీక ఓటు హక్కులో వుండే లోపాన్ని గుర్తిస్తూ దాని నివారణోపాయాన్ని సూచించాడు.

రహస్య ఓటింగ్ విధానం అవినీతిని, స్వార్థపరత్వాన్ని ప్రోత్సహిస్తుంది. బహిరంగ ఓటింగ్‌వల్ల మేధావులకు సముచిత స్థానం లభిస్తుంది. వారు సామాన్యులకు మార్గదర్శకులౌతారు. సార్వజనీక ఓటు హక్కు విషయంలో కూడా మిల్‌కు కొన్ని అభ్యంతరాలున్నాయి. అవినీతిపరులకు, అస్థిరులకు, నిరక్షరాస్యులకు అనుమతించే ఓటుహక్కు నిష్ప్రయోజనం అవుతుంది. ఓటుహక్కు పొందటానికి కనీసపు విద్యార్హతలు, ఆస్థిఅర్హతలు వుండాలి.

అన్నిరకాల ప్రజలకు, అన్ని రాజ్యాలకు ప్రజాస్వామ్యం ఒకేలా వర్తించదు. సామాజికంగాను, రాజకీయంగాను, వెనుకబడిన దేశాలకు రాజరికపాలనే మేలు చేస్తుందని మిల్ భావించాడు. అందువల్లనే "మిల్ అయిష్ట ప్రజాస్వామ్యవాది" (సి.ఎల్.పేపర్) అనే విమర్శ వచ్చింది. అయినప్పటికి ప్రజాస్వామ్యానికే అత్యంత ప్రాముఖ్యత కలుగచేసాడనేది నిస్సందేహం. ప్రజాస్వామ్య ప్రభుత్వ విధానాన్ని ఆచరించగల ఆసక్తి, యోగ్యత ఒక దేశానికి ఉన్నప్పుడు, ఆ దేశానికి ప్రజాస్వామ్యం కన్న ఉత్తమమైనది మరేదీ వుండదని మిల్ విశ్వసించాడు.

## 11.9.1 నైష్పత్తిక ప్రాతినిధ్యం :

తన సమకాలీన ఇంగ్లీష్ ప్రజాస్వామ్యంలో రెండు ప్రధాన లోపాలను మిల్ గుర్తించాడు. అల్పసంఖ్యాక వర్గాల ప్రజలకు తగిన ప్రాతినిధ్యం లభించకపోవడం మొదటి లోపం. అధిక సంఖ్యాకవర్గాల నిరంకుశత్వం రెండవలోపము. వీటిని అధికమించటానికి నైష్పత్తిక విధానం ఒక్కటే సరైన మార్గము. దీనివల్ల ప్రజలందరికి సమానత్వ విషయం అన్వయించబడుతుంది. వారివారి సంఖ్యాబలాన్ని బట్టి శాసనసభలో స్థానాలు లభించకపోతే అది పూర్తి ప్రాతినిధ్యప్రజాస్వామ్యం కాబోదు. హేర్ నియమ ఆధారిత నైష్పత్తిక ప్రాతినిధ్య విధానాన్ని ప్రతిపాదించాడు. దీనివలన అన్నివర్గాల నిరంకుశత్వం నుండి అల్పసంఖ్యాక వర్గాలకు తగిన రక్షణ కలుగుతుంది.

ప్రజాస్వామ్యాన్ని రెండు రకాలుగా వర్గీకరించాడు. 1. సరైన ప్రజాస్వామ్యం (True Democracy) , ఇది అన్నివర్గాలకు ప్రాతినిధ్యం కలిగిస్తుంది. 2. నకిలీ ప్రజాస్వామ్యం (False Democracy). అధిక సంఖ్యాకులలకు మాత్రమే ప్రాతినిధ్యం కలిగిస్తుంది. ఒకవైపు నైష్పత్తిక ప్రాతినిధ్య విధానాన్ని సమర్థించాడేగాని సాధారణ ప్రజలశక్తి, సామర్థ్యాలపై అతనికి నమ్మకం లేదు. విలువలతో కూడిన సుగుణాలు వారిలో పెంపొందించాలని అదే ప్రభుత్వ లక్ష్యం కావాలని కోరుకున్నాడు. సమర్థులు, ఉత్తములు ప్రభుత్వాన్ని నడిపించాలి. విజ్ఞత గల ప్రభుత్వ విధానంలో ఆర్థిక న్యాయం, సామాజిక న్యాయం చేకూరుతుంది. అశ్రద్ధ, అవినీతి, మూర్ఖత్వం, హింసావాదాలు నిర్మూలింపబడి సమన్వయం, సహకారం మొదలగు గుణాలు వృద్ధిచెందుతాయి. ప్రజాసమస్యలు, సాంఘిక సమస్యలకు తగిన పరిష్కార మార్గాలు అన్వేషించగల విద్యావంతులు, మేధావులే నిజమైన ప్రజాప్రతినిధులుగా వ్యవహరిస్తారని మిల్ విశ్వాసం. దేశ ప్రధాన సమస్యలను అవగతం చేసుకోగల సమర్థులైన శిష్టజనుల ఓటు విలువ ఇతరుల కన్న అధికంగా వుండాలని కోరుకున్నాడు.

విద్యార్హత, ఆస్తి అర్హత కలవారికే ఓటు హక్కు పరిమితం చేయాలన్నాడు..

మిల్ ఒక "అసంపూర్ణ ప్రజాస్వామికవాది" గాను, అభివృద్ధి నిరోధకునిగాను, బూర్జువా వర్గాలను సమర్ధించేవ్యక్తి గాను విమర్శింపబడినాడు. ఇంగ్లండులో ఉన్నతస్థాయిలోనున్న సంపన్న వర్గాలకు అనుకూలించే ఒక రాజనీతి సిద్ధాంతాన్ని ప్రతిపాదించుటయే అతని ఉద్దేశ్యమని భావించారు. నేటి పరిస్థితులలో మిల్ భావాలు చాలావరకు తమ ప్రాముఖ్యతను కోల్పోయాయి. రాజకీయపార్టీలు, ప్రభావ వర్గాలు, ఉద్యోగిస్వామ్య మొదలైనవి ఈనాటి ప్రజాస్వామ్యంలో ప్రధానచర్చనీయాంశాలుగా మారాయి.

## 11.10 స్త్రీ స్వాతంత్ర్యం :

వ్యక్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాల ప్రాధాన్యతను గుర్తించిన మిల్ అదేస్థాయిలో స్త్రీ స్వాతంత్ర్యం ఎడల ఆసక్తిని ప్రదర్శించాడు. 1. ఎన్‌ఫ్రాంచెజ్‌మెంట్ ఆఫ్ ఉమెన్, (The enfranchisement of Women), 2. ఉమెన్ సఫ్రేజ్ (Women Suffrage), 3. సబ్జెక్షన్ ఆఫ్ ఉమెన్ (Subjection of Women) , వంటి మిల్ రచనలు స్త్రీ స్వాతంత్ర్యంపై అతనికి గల అభిలాషను, భావాలను వ్యక్తపరుస్తాయి. అతని భార్య హారిట్ టేలర్, ఫార్ ఆస్టిన్, జాన్ కార్లైల్‌ల ప్రభావం మిల్‌పై వుంది.

స్త్రీని ఒక సాధారణ సంసార జీవితం గడిపే సాధనంగా పరిగణించడం తీరని అన్యాయంగా వాదించాడు. అది ఒకరకమైన బానిసత్వంగా భావించాడు. స్త్రీ, పురుషుల మధ్య అన్నిరకాల అసమానతలు తొలగించి సమస్త రంగాలలో వారికి సముచిత స్థానాన్ని కలుగచేసి ముందుకు నడిపించాలని ప్రతిపాదించాడు. పురుషులతో సమానంగా స్త్రీలకు శక్తి సామర్థ్యాలున్నాయి. తమ అభిరుచులకు తగిన వృత్తులను, జీవన విధానాన్ని తామే ఎంపిక చేసుకోగలరు. న్యాయపరంగా వారికి చెందవలసిన రాజకీయావకాశాలు, హోదా వారికి కల్పించాలి. రాజకీయ కార్యకలాపాల నిర్వహణకు కూడా వారికి సమర్థత ఉన్నది. అందువల్ల ఓటుహక్కు స్త్రీలకు తప్పనిసరిగా కలుగచేయాలి.

స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కేవలం స్త్రీల వ్యక్తిగత పురోగభివృద్ధికే కాకుండా సామాజిక ప్రయోజనానికి కూడా అవసరమే. విద్యావకాశాలు, ఉద్యోగావకాశాలు కల్పించి స్త్రీలలో ప్రతిభను వెలికితెచ్చి అది సమాజప్రగతికి వినియోగపడేటట్లు చేయాలి. స్త్రీలకు సమానత్వంను ప్రతిపాదించుటలో మిల్ ధర్మబద్ధతను ప్రదర్శించాడు. అసమానతలు తొలగించుట ద్వారా సమాజ ప్రగతిని ఆశించాడు. కుటుంబ వ్యవస్థకు విలువలను ఆపాదించాడు. నైతిక, భౌతిక, మానసిక లక్ష్యాలను కుటుంబం నిర్దేశిస్తుంది. సమానత్వం, సహకారం, సానుభూతి, ప్రేమానురాగాలతో కుటుంబబంధాలు బలపడతాయి. సర్వతోముఖాభివృద్ధి జరుగుతుంది. కుటుంబంలో శ్రమ విభజన సూత్రాన్ని మిల్ ప్రస్తావించాడు. పెంపకం విషయంలో తల్లి ప్రభావమే సంతానంపై అధికంగా వుంటుందని చెప్పాడు.

మిల్ తన సమకాలీన సమాజ సాంప్రదాయాలకు విరుద్ధంగా స్త్రీలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, సమానత్వం వుండాలని వాదించాడు. స్త్రీల విమోచనోద్యమం ఎడల ఆసక్తి చూపిన మొదటి రాజనీతితత్వవేత్తగా ఖ్యాతిపొందాడు. ప్రజాస్వామ్య రాజకీయాలలో స్త్రీలకు ఓటుహక్కు అనుమతించవలసిన అవసరాన్ని తెలియజేశాడు. చట్టాలద్వారా వారికి ప్రత్యేక హక్కులు, సదుపాయాలు కలిగించి దాస్య విమోచన చేయాలని చెప్పాడు. పార్లమెంటు లోపలా, వెలుపలా ఆందోళనలను చేపట్టాడు. అతని కృషి ఫలితంగా నేడు స్త్రీల జీవనవిధానంలో గుణాత్మకమైన మార్పులు వచ్చాయి.

ప్రపంచమంతటా మానవ సమాజంలో స్త్రీలకు సముచితస్థానం లభించింది. ఓటుహక్కు లభించింది. అన్ని రంగాలలో పురుషులతో సమానంగా స్త్రీలకు ప్రవేశం కల్పించబడింది.

## 11.11 మిల్ విశిష్టత :

జె.ఎస్.మిల్ 19వ శతాబ్దానికి చెందిన విశిష్టమైన రాజనీతి తత్వవేత్త. బెంథామ్ ప్రతిపాదించిన ఉపయోగితావాద సిద్ధాంతంలోని లోపాలను గమనించి, వాటిని సవరించి దాని ప్రాధాన్యతను నిలిపిన ఘనత మిల్‌కు దక్కుతుంది.

జె.ఎస్.మిల్ ఉదారవాది, హేతువాది, ఉపయోగితావాది, ప్రజాస్వామ్యవాది. అతడు వ్యక్తీకరించిన ప్రాతినిధ్య ప్రభుత్వం ఉదారవాద పునాదులపై నిర్మింపబడింది. బెంథామ్ ప్రతిపాదించిన వ్యక్తి శ్రేయోవాద సిద్ధాంతానికి మెరుగులుదిద్దాడు. అతని స్వేచ్ఛా భావన రాజనీతి తత్వంలో ఒక నూతన ఒరవడిని సృష్టించింది. వ్యక్తిస్వేచ్ఛ, భావప్రకటనా స్వాతంత్ర్యం, ప్రవర్తనా స్వాతంత్ర్యాలు ఎవరి ఆధీనంలోను ఉండరాదని వాదించాడు. వాటివల్లే అధిక సంఖ్యాకులకు అత్యధిక సంతోషం కలుగుతుందని తెలియజేశాడు. వ్యక్తి స్వేచ్ఛ మానవ సమాజ ప్రగతికి సాధనం మాత్రమే కాదు, అది ఒక లక్ష్యం గూడా. దానికి గౌరవం కలిగించేదే నైతిక సహజం. పరిమాణాత్మక సంతోషం కన్న గుణాత్మక సంతోషమే నైతిక శ్రేష్ఠతను పెంపొందిస్తుందని మిల్ చెప్పినతీరు అతనికి నైతిక విలువలపై గల మక్కువను చాటిచెప్పుతుంది. స్వేచ్ఛకు - సమాజానికి - రాజ్యానికి వుండే సంబంధాల వివరణ, ప్రజాస్వామ్యం, సామ్యవాదం, స్త్రీ జనోద్ధరణలపై అతని భావాలు భావితరాల వారికి మార్గదర్శకంగా నిలచాయి.

## 11.12 చదవదగిన గ్రంథాలు :


1. Mill, J.S. - On Liberty
2. Mill, J.S. - Utilitarianism
3. Wayper, C.L - Political Thought
4. Sabine, G.H. - A History of Political Theory
5. Subba Rao, M.V. - ఆధునిక పాశ్చాత్య రాజనీతి తత్వము.
6. Venkata Rao, V - A History of Political Theories.


## సంక్షిప్త ప్రశ్నలు :

1. జె.యస్. మిల్ రాజనీతి సిద్ధాంతాన్ని వివరించండి.
2. జె.యస్.మిల్ ఉపయోగితావాదాన్ని చర్చించండి.
3. స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలపై మిల్ అభిప్రాయాలను విమర్శనాత్మకంగా చర్చించండి.
4. "వ్యక్తి స్వేచ్ఛావాది మిల్" మీరు అంగీకరిస్తారా ? సహేతుకంగా వివరించండి.
5. ప్రభుత్వం - అధికారం - స్వేచ్ఛ : ఈ మూడింటిని మిల్ ఏవిధంగా సమన్వయపరచాడో వివరించండి.

**రచయిత : డా॥ యస్. సుబ్బారావు**

పాఠం - 12

# జాన్ రాల్స్ [John Rawls 1921 - 2003)

**విషయసూచిక**

12.0. లక్ష్యం
12.1. పరిచయం
12.2. న్యాయసిద్ధాంత ఆవశ్యకత
12.3. రాల్స్ న్యాయ సూత్రాలు
12.4. రాజకీయ వ్యవస్థ - స్వభావం - విధులు
12.5. పౌర విధులు - బాధ్యతలు
12.6. సారాంశము
12.7 మాదిరి ప్రశ్నలు
12.7. చదువదగిన గ్రంథాలు

## 12.0 లక్ష్యం :

ఈ భాగం చదివిన తరువాత ఈ క్రింది విషయాలను తెలుసుకుంటారు.

ఎ) ఉదారవాద ఉపయోగితావాద సిద్ధాంత పరిమితులు

బి) న్యాయసిద్ధాంతం, సామాజిక సహజీవనానికి ఎందుకు అవసరమో

సి) రాల్స్ న్యాయసిద్ధాంతం

డి) రాజ్య వ్యవస్థ యొక్క విధులు, బాధ్యతలపై రాల్స్ అభిప్రాయాలు.

## 12.1 పరిచయం :

గత అర్ధశతాబ్ద కాలంగా ఆంగ్లో - అమెరికన్ రాజనీతి తత్వవిచారంపై అత్యంత ప్రభావాన్ని చూపిన తత్వవేత్త జాన్‌రాల్స్, 1971 వ సంవత్సరంలో ప్రచురించబడిన, "A theory of Justice" అనే గ్రంథ రచయిత అయిన జాన్‌రాల్స్, గత 50 సంవత్సరములుగా తాను ప్రతిపాదించిన న్యాయసిద్ధాంతం ద్వారా, ప్రపంచవ్యాప్తంగా మేధావుల ప్రశంసలను అందుకున్న మహనీయుడు. "A Theory of Justice" అనే గ్రంథం వ్యక్తీకరించిన భావాలపై ఒక సుదీర్ఘమైన చర్చ గత అర్ధశతాబ్ద కాలం నుండి తత్వవేత్తలు మరియు ఇతర సామాజిక శాస్త్ర వేత్తల మధ్య కొనసాగించడం, ఆ గ్రంథ విశిష్టతను తెలియచేస్తుంది. రాజీనీతి తత్వశాస్త్రంలో ప్రాబల్యం వహిస్తున్న ఉపయోగితావాదానికి భిన్నంగా ఒక ప్రత్యామ్నాయ నీతిసిద్ధాంతాన్ని ప్రతిపాదించడమే రాల్స్ చేసిన ప్రధాన కృషి మరియు సేవ (Contribution). రాజనీతిపరంగా చూసినట్లయితే ఆయన ప్రతిపాదించిన న్యాయసిద్ధాంతం ఆధునిక కాలంలో ఉదారవాదానికి, ప్రజాస్వామ్యానికి ఒక సమర్థనీయ భూమికను ఏర్పరిచిందని విశ్లేషకుల అభిప్రాయం.

రాజనీతి తత్వమౌలిక భావనలలో న్యాయం అత్యంత ముఖ్యమైనది. ప్లేటో (Plato) నుండి సిడ్‌విక్ వరకు (Sidgwick, 19th Century Cambridge University కి చెందిన Moral Philosopher) న్యాయంను గూర్చి విభిన్న రకాలుగా వ్యాఖ్యానించడం జరిగింది. ఒక సమాజ నిర్మాణం ఏ న్యాయసూత్రాల ఆధారంగా జరిగిందన్న దాన్నిబట్టి, ఆ సమాజం సమంజసమైనదా, కాదా అనే చర్చకు మూలం న్యాయభావనే. అయితే 20వ శతాబ్దం మొదటి దశాబ్దంలో తత్వశాస్త్రం తన పరిధిని కేవలం భావనలను (Concepts) స్పష్టపరచడమే తన శాస్త్రలక్ష్యంగా ప్రకటించుకొన్న తరువాత, అప్పటివరకు తత్వశాస్త్రం మానవ జీవనానికి సంబంధించి మౌలిక ప్రశ్నలను వేయడం దానికి వివిధ సమాధానాలను ఇచ్చే సాంప్రదాయాన్ని కోల్పోవడం వలన, తత్వశాస్త్రానికి అత్యంత సన్నిహితంగా ఉండే రాజనీతి శాస్త్రం తన గమ్యాన్ని మరియు ఆ క్రమంలో తన అస్థిత్వాన్ని కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో జాన్‌రాల్స్ వ్రాసిన వ్యాసాలు, ఆ తరువాత వాటికి కొనసాగింపుగా 1971లో రచించిన 'A Theory of Justice' అనే గ్రంథం చూపిన ప్రభావ ఫలితంగా, తత్వశాస్త్రం తన అధ్యయన అంశాలను పునర్ నిర్వచించుకోవడానికి తద్వారా, తిరిగి రాజనీతి మౌలిక భావనలపై చర్చ కొనసాగడానికి కారణం అయ్యాయి. పాశ్చాత్య సమాజాల మౌలిక నిర్మాణ సూత్రాల సమంజసత్వాన్ని విశ్లేషించడానికి రాల్స్ న్యాయ సిద్ధాంతం తోడ్పడింది.

## 12.2. న్యాయ సిద్ధాంత ఆవశ్యకత :

మనుషులు నైతికజీవులుగా తమ జీవిత కార్యాచరణను, సామాజిక సంప్రదాయాలను, సంస్థలను గూర్చి తరచుగా న్యాయనిర్ణయాలు చేస్తూ ఉంటారు. రాల్స్ దృష్టిలో మనుషుల ఈ న్యాయనిర్ణయాలే తత్వశాస్త్రజ్ఞునికి అధ్యయన అంశం. మనుషుల ఈ న్యాయనిర్ణయాలను తత్వశాస్త్రజ్ఞుడు విశ్లేషించడం, తద్వారా మానవ సామర్థ్యాన్ని పరిశీలించడం ద్వారా మానవులు ఏ నిర్దేశిక న్యాయప్రమాణాలను పాటిస్తున్నారో అంచనా వేయడానికి వీలవుతుంది. తొందరపాటుతోనో, భయాందోళనలతోనో, ఆత్మవిశ్వాసం లేని సందర్భాలలో మనుషులు చేసే నిర్ణయాలుకాక, సామర్థ్యం, అవకాశం, సరైన నిర్ణయాలు చేయాలనే కోర్కె ఉన్న సందర్భాలలో వివేచనతోచేసే నిర్ణయాలను, ఆ నిర్ణయాలను నిర్దేశించే న్యాయప్రమాణాలను విశ్లేషించి తద్వారా ఒక న్యాయసిద్ధాంతాన్ని ఆవిష్కరించడమే తత్వవేత్త యొక్క కర్తవ్యం. అయితే మనుషులు ఆలోచించి తీసుకునే నిర్ణయాలు అనేక సందర్భాలలో వాళ్ళు చేసే ఇతర నిర్ణయాలకు విరుద్ధంగానో, లేక వాళ్ళు పాటించాలనుకొనే న్యాయ ప్రమాణాలకు భిన్నంగానో ఉండే అవకాశం ఉంది. కావున ఒక స్పష్టమైన న్యాయ సిద్ధాంతాన్ని తత్వవేత్త రూపొందించడం ద్వారా వాళ్ళ నిర్ణయాలకు ప్రాతిపదికగా కొన్ని సార్వజనీన ప్రమాణాలను ఏర్పరచడం ద్వారా వాళ్ళ ఆచరణకు, ఆలోచనకు మధ్య అంతరాన్ని ఈ న్యాయసిద్ధాంతం తగ్గిస్తుందని రాల్స్ ఉద్దేశ్యం. కాబట్టి మనుషులు న్యాయం, అన్యాయాలపై చేసే నిర్ణయాలను (Judgements) తాత్విక స్థాయిలోనే వివరించడం మరియు విశ్లేషించడమే రాల్స్ దృష్టిలో న్యాయసిద్ధాంతం యొక్క కర్తవ్యం.

రాల్స్ న్యాయసిద్ధాంతం వివిధ భావనలను విశ్లేషించడమేకాక మానవ స్వభావాన్ని మరియు సమాజాన్ని గూర్చి అనుభవవాద స్థాయిలో అనేక సూత్రీకరణలను చేస్తుంది. న్యాయబద్ధంగా వ్యవహరించడానికి గల మానవ సామర్థ్యాన్ని పరిశీలించి, అలాగే అతని యొక్క ఇతర సామర్థ్యాలను కూడ దృష్టిలో ఉంచుకొని, మనిషి యొక్క నైతిక స్వభావాన్నే రాల్స్ వివరిస్తాడు. రాల్స్ ఇతర న్యాయసిద్ధాంతాలను వివరించడమేకాక, తన న్యాయసిద్ధాంతం ఏ విధంగా మనుషులు పర్యాలోచన సమతౌల్యస్థితి (Reflective Equilibrium) లో చేసే నిర్ణయాలకు అనుగుణంగా ఉంటుందో వివరిస్తాడు. రాల్స్ రచనా పద్ధతి. సోక్రటీస్ సంవాద పద్ధతిని పోలి ఉంటుంది. అంటే తన అభిప్రాయాలకు, తన పుస్తక పాఠకుల అభిప్రాయాలకు మధ్య సంవాదంగా ఉంటూ, వాళ్ళ న్యాయనిర్ణయాలు తన న్యాయసూత్రాలతో సరితూగుతాయో, లేదో పరీక్షించుకోమని చెప్తూ, చివరగా వాళ్ళ న్యాయనిర్ణయాలు, తన న్యాయసూత్రాల మధ్య అంగీకారం ఎలా సాధ్యమో వివరిస్తాడు.

ఏ సమాజంలోనైనా మనుషుల మధ్య సామరస్యత మరియు సంఘర్షణ రెండూ కలిసి ఉంటాయి. ఒంటరి జీవితం కంటే సామరస్యత, సహకారం ద్వారానే మంచి జీవితాన్ని పొందగలనని ఏ వ్యక్తైనా భావిస్తాడు. అలాగే ఆ సహకార ఫలితాల్లో ప్రతివ్యక్తి ఇతర వ్యక్తుల కంటే ఎక్కువ వాటాను పొందేందుకు ప్రయత్నిస్తాడు కాబట్టి మనుష్యుల మధ్య సంఘర్షణ కూడా ఉంటుంది. కావున ప్రతి సమాజం కొన్ని సార్వత్రిక పంపిణీ నియమాలను ఏర్పరచుకోవడం అవసరం. ఈ పంపిణీ నియమాలు సామాజిక న్యాయనియమాలు. ఆయా సమాజాలలోని పౌరులు ఆయా సమాజాలలో వ్యవస్థీకృతమైన సామాజిక సంస్థల మరియు సాంప్రదాయాల మంచి చెడులను ఈ సామాజిక న్యాయసూత్రాల వెలుగులో చర్చించేందుకు వీలు కలుగుతుంది. సామాజిక సహజీవన ఫలితాలైన చట్టబద్ధహక్కులు, విధులు, సామాజిక, ఆర్థిక అవకాశాలు, ఆస్థి, సామర్థ్యం మొదలగునవన్నీ కాబట్టి సామాజిక న్యాయసూత్రాలకనుగుణంగా పౌరుల మధ్య పంపిణీ చేయవలసి ఉంటుంది. ఏ సమాజంలోనైనా, ఏదైతే ప్రయోజనకరమైనదని ఆ సమాజ సభ్యులు భావిస్తారో దానిని వాళ్ళమధ్య పంపిణీ చేయవలసిరావడం, దానికి అనుగుణ్యమైన న్యాయసూత్రాలను రూపొందించవలసిన అవసరం ఏర్పడుతుంది. కాబట్టి సామాజిక సహజీవనంలో పంపిణీకి సంబంధించిన న్యాయసూత్రాలను ఆ సామాజిక వ్యవస్థ నిర్మాణానికి సంబంధించిన మౌలిక నియమాలుగా భావించవలసి ఉంటుంది. ఒక సమాజం ఏవిధంగా వ్యవస్థీకృతం అయిందో దానినిబట్టి ఆ సమాజంలోని వివిధ వ్యక్తుల సామాజిక స్థానాలు, వాళ్ళజీవన అవకాశాలను నిర్దేశించడం జరుగుతుంది. అంతేకాక వాళ్ళ జీవన ప్రారంభ అవకాశాలు, వాళ్ళ జీవిత లక్ష్యాలు, కోర్కెలు, స్వీయభావనలు అన్నీ కూడ వాళ్ళ సామాజిక స్థానాలపై ఆధారపడి నిర్ణయించబడతాయి. కావున ఏ సమాజంలో అసమానతలు వ్యవస్థీకృతం కాబడతాయో, ఆ అసమానతలు ఏ విధంగా సమర్థనీయమో వివరించేందుకే వివిధ న్యాయసిద్ధాంతాలు రూపొందించబడతాయి. అయితే రాల్స్ దృష్టిలో వ్యక్తులు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఏర్పరచుకొనే ఒప్పందాలనే న్యాయానికి ప్రాతిపదికగా భావిస్తాడు. మార్కెట్‌లో వ్యక్తులు ఏర్పరచుకొన్న ఒప్పందాలు స్వేచ్ఛగా ఏర్పరచుకొన్నవికావని, ఎందువలనంటే మార్కెట్ వ్యవస్థను నిర్దేశించే సామాజిక, ఆర్థిక నేపద్య పరిస్థితులు, ఆ నిర్ణయాలను ప్రభావితం చేస్తూ ఉంటాయి కావున, ఆ నేపద్య పరిస్థితులు (Background Conditions) న్యాయబద్ధమైనవి అని భావించినప్పుడు మాత్రమే, మార్కెట్‌లోని వ్యక్తుల మధ్య జరిగే ఆదాయ, ఆస్థి పంపిణీలు, న్యాయసూత్రాలకు అనుగుణంగా ఉన్నాయని నిర్ధారించబడుతుంది. అయితే ఈ న్యాయసూత్రాలు ఏ ప్రాతిపదికపై రూపొందించబడాలన్నప్పుడు, రాల్స్ మూడు పరిమితులకు లోబడాలని ప్రతిపాదిస్తాడు. మొదటిగా ఈ న్యాయసూత్రాలు అందరికీ వర్తించబడేటట్లు ఉండాలి. అంతేకాక పరస్పర విరుద్ధమైన అభ్యర్థనలను (Claims) పరిష్కరించే లక్షణాలన్నీ ఈ న్యాయసూత్రాలు కలిగి ఉండటమేకాక ఆచరణ సాధ్యమైన అంతిమ సూత్రాలుగా అందరికీ ఆమోదయోగ్యంగా ఉండాలి. రెండవ లక్షణం ఏమంటే, ఈ న్యాయసూత్రాలు నైతిక సూత్రాలుగానేకాక, వాటి ఎంపికను స్వార్థరహితంగా చేయగలగాలి. రాల్స్ దృష్టిలో నైతికంగా ఆలోచించడమంటే, తన వ్యక్తిగత రాగద్వేషాలను అధిగమించి, నిష్పక్షపాతంగా ఆలోచించగలగటం. అంటే ఆ వ్యక్తి తన సామాజిక స్థానాన్నిబట్టి అభిప్రాయాలకు, నిర్ణయాలకు రాకుండా వాటిని అధిగమించి నిష్పక్షపాతంగా నిర్ణయాలకు రాగలగటం.

మూడవ లక్షణమేమంటే, ఈ న్యాయసూత్రాలు మానవ సంబంధాలను నిర్దేశించేవి కనుక, మానవ స్వభావానికి సంబంధించిన కొన్ని ప్రాథమిక వాస్తవాలు అందరికి తెలిసి ఉండాలి. అవి ఏమంటే ప్రతి మనిషి తన ప్రయోజనాలను హేతుబద్దంగా సాధించేందుకు ప్రయత్నిస్తాడని, తను వాంఛించేవి పరిమితంగానే లభ్యమవుతాయని, ఏది మంచి జీవితం అన్న అంశంపై వివిధ దృక్పధాలను కలిగి ఉంటాడని రాల్స్ ప్రతిపాదిస్తాడు. అయితే అందరూ కొన్ని ప్రాథమిక అంశాలైన హక్కులు, స్వేచ్ఛలు, అవకాశాలు, అధికారము, ఆదాయం, ఆస్థి, ఆత్మ గౌరవం మొదలైన వాటిని కావాలని అంగీకరిస్తారని రాల్స్ ప్రకటిస్తాడు.

## 12.3 రాల్స్ న్యాయసూత్రాలు :

పైన పేర్కొన్న మూడు పరిమితులకు లోబడి, రాల్స్ తన న్యాయసూత్రాలను వివరిస్తాడు. సామాజిక ఒడంబడిక సిద్ధాంతాలను ప్రతిపాదించిన హాబ్స్, లాక్, రూసోల మాదిరిగానే, రాల్స్ కూడ ఊహాజనిత ప్రాకృతిక మానవ సముదాయం అనే భావనను ప్రతిపాదిస్తాడు. ఈ ప్రాకృతిక వ్యవస్థ నుండి వ్యక్తులు పరస్పర ఒప్పందం ద్వారా సమాజంగా ఏర్పడతారు. ఇలా సహజంగా ఏర్పడటానికి ముందు ఉండే సర్వసమానదశలో ఒడంబడికకు మౌలిక షరతులుగా ఈ న్యాయసూత్రాలను వ్యక్తులు అంగీకరిస్తారని రాల్స్ చెప్తాడు. ఈ సర్వసమాన తొలిదశను రాల్స్ అసలు స్థితి (Original Condition) అని పేర్కొంటాడు. ఈ అసలు స్థితిలో ఏ వ్యక్తికి సమాజంలో తన స్థానం ఏమిటో తెలియదు. తనశక్తి సామర్థ్యాల గురించిగాని, సహజ సంపదల పంపిణీలో తన అదృష్టం గురించి కాని స్పృహ ఉండదు. ఇలాంటి అజ్ఞాన పూరిత స్థితిలో న్యాయసూత్రాల ఎంపికను తొలిదశలో పరస్పర ఒడంబడిక ద్వారా సమాజంగా ఏర్పడే వ్యక్తులు చేస్తారు. ఈ 'అసలు స్థితి'లో వున్న వ్యక్తులు ఈ క్రింది విధంగా పేర్కొన్న న్యాయసూత్రాన్ని అనుసరిస్తారని రాల్స్ చెప్తాడు. ఆ న్యాయసూత్రం ఏమంటే, "సమాజానికి అవసరమైన ప్రాథమిక వస్తువులైన స్వేచ్ఛ మరియు అవకాశం, ఆదాయం మరియు సంపద, అలాగే ఆత్మాభిమాన మూలాలు అసమానంగా పంపిణీ చేసినట్లయితే తద్వారా ఆ సమాజంలోని అట్టడుగు వర్గాలకు ప్రయోజకంగా ఉండేటట్లయితే అలా చేయడం సమంజసమని, లేనట్లయితే వాటిని సమాజ సభ్యులందరికి సమానంగా పంపిణీ చేయడమే సమంజసమని" ప్రతిపాదిస్తుంది. ఈ న్యాయసూత్రాన్ని రెండు భాగాలుగా విభజించవచ్చు. మొదటిది స్వేచ్ఛకు సంబంధించినది కాగా, రెండవది ప్రాథమిక వస్తువుల పంపిణీకి సంబంధించినది. తన న్యాయ సూత్రాలలో మొదటి దానిని రాల్స్ ఇలా నిర్వచిస్తాడు.

"ప్రతివ్యక్తికి ఎంత విస్తృతమైన స్వేచ్ఛలు సమాన హక్కుగా కలిగి ఉండవచ్చునంటే, అంతే విధమయిన స్వేచ్ఛలు అందరికీ అందుబాటులో ఉండేంతవరకు".

రెండవ సూత్ర నిర్వచనం - సామాజిక, ఆర్థిక అసమానతలు రెండూ ఎలా వ్యవస్థీకృతం కావాలంటే :

ఎ) పొదుపు సూత్రానికి భంగం కలిగించనిమేరకు, ఆ సమాజంలోని అట్టడుగు వర్గాలకు ఎక్కువ ప్రయోజనకరంగా ఉండేరీతిలో చేయవచ్చును.

బి) అందరికి సరైన సమాన అవకాశాలను కల్పించడం ద్వారా ఆయా ఉద్యోగాలలో మరియు పదవులలో అందరికీ ప్రవేశించేందుకు వీలుగా పంపిణీ చేయవచ్చును.

అయితే ఈ రెండు న్యాయసూత్రాలను ప్రమాణంగా తీసుకొన్నప్పుడు కొన్ని సందర్భాలలో ఆచరణలో దేనికి ప్రాధాన్యత ఇవ్వాలనే సమస్య ఎదురైనపుడు, రెండింటిలో మొదటిదానికి, అలాగే రెండవ సూత్రంలో రెండవ దానికి ప్రాధాన్యతనివ్వాలని రాల్స్ ఉద్దేశ్యం. రాల్స్ ప్రతిపాదిస్తున్న మౌలిక స్వేచ్ఛలలో ముఖ్యమైనవి నాలుగు. అవి :

1) రాజకీయ స్వేచ్ఛ అంటే ఓటు హక్కు. ఎన్నికలలో పోటీ చేసే హక్కు, భావప్రకటన మరియు సమావేశ హక్కులు.

2) అంతరాత్మ స్వేచ్ఛ (Liberty of conscience) అనగా స్వేచ్ఛగా ఆలోచించేందుకు మరియు తన కిష్టమయిన విశ్వాసాలను కలిగి ఉండేందుకు స్వేచ్ఛ

3) వ్యక్తిగత ఆస్థి కలిగి ఉండే స్వేచ్ఛ

4) చట్టంతో ప్రమేయం లేకుండా నిర్బంధించబడకుండా ఉండే స్వేచ్ఛ.

పైన పేర్కొనబడిన స్వేచ్ఛలను అందరూ ఆచరణలో పొందేందుకు అనుగుణమైన విధంగా సామాజిక వ్యవస్థ నిర్మాణం జరగాలని, అప్పుడు మాత్రమే ప్రతి వ్యక్తి స్వేచ్ఛగా తాను నిర్దేశించుకున్న విలువలను సాధించగలడని రాల్స్ ఉద్దేశ్యం. అలాగే ఏ సమాజంలోనైనా సామాజిక ఆర్థిక అసమానతలు ఆ సమాజంలోని అట్టడుగు వర్గాలకు ఎక్కువ ప్రయోజనకరంగా ఉన్నప్పుడు మాత్రమే సమర్థనీయం. అనగా ఆ అసమానతల వలన ప్రతివ్యక్తి ఆ సమాజంలోని ఉద్యోగాలలోగాని, పదవులలోగాని సమాన అవకాశాల ద్వారా ప్రవేశించేందుకు వీలుగా ఉన్నప్పుడు మాత్రమే సమర్థనీయం. ఒక్కమాటలో చెప్పాలంటే ఉద్యోగాలు, పదవులలోకి పోటీపడి ప్రవేశించాలంటే లాంఛనప్రాయమైన స్వేచ్ఛ ఉన్నంత మాత్రాన సరిపోదు; సరైన సమాన అవకాశాల ద్వారా ఆ అర్హతలను సాధించడం ద్వారా, వాటిల్లోకి ప్రవేశించడానికి వీలు కల్పించబడాలి.

రాల్స్ తన న్యాయ సూత్రాలను వివరించే క్రమంలో హాబ్స్, లాక్, కాంట్ మొదలగు వారు అనుసరించిన ఊహాత్మక పద్ధతిని ఆధారం చేసుకొని, తాను ప్రతిపాదిస్తున్న న్యాయసూత్రాలు ప్రజల మనోభావాలకు ఏవిధంగా సన్నిహితంగా ఉంటాయో వివరించాడు. తాను ప్రతిపాదించిన న్యాయసూత్రాలను ఆమోదించిన వ్యక్తుల సమూహం, తమ అజ్ఞానతెరను (Veil of ignorance) వివిధ దశలలో తొలగించుకుంటూ, ఆయా దశలలో ఆ న్యాయ సూత్రాలను నిర్దిష్ట పరిస్థితులకు ఎలా అన్వయిస్తారో వివరిస్తాడు. మొదటి దశలో వాళ్ళు రాజ్యాంగ చట్టాన్ని రూపొందించుకొంటారని, ఆ రాజ్యాంగానికి తన మొదటి న్యాయసూత్రం ప్రమాణంగా ఉంటుందని రాల్స్ ఉద్దేశ్యం. రెండవదశలో చట్టాలను రూపొందించుకుంటారని ఈ చట్టాలు తన రెండవ సూత్రంపై ఆధారపడి ఉంటాయని రాల్స్ భావిస్తాడు. తరువాత దశలో ఈ చట్టాలను న్యాయమూర్తులు, పరిపాలనాధికారులు నిర్దిష్ట పరిస్థితులకు వర్తింపజేస్తారు. ఈ దశలో అజ్ఞానదొంతర పూర్తిగా తొలగించబడుతుంది.

## 12.4 రాజకీయ వ్యవస్థ - స్వభావము - విధులు :

న్యాయబద్ధమైన రాజకీయ వ్యవస్థలో సార్వజనీన ఓటుహక్కుద్వారా, నిర్ణీత కాలానికి ఎన్నికైన చట్టసభ మాత్రమే చట్టాలను రూపొందించే అధికారాన్ని కలిగి ఉంటుంది. ఈ చట్టసభ నిర్ణయాలు అధిక సంఖ్యాక ప్రతినిధుల నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది కావున వాళ్ళ నిర్ణయాలు ప్రజల స్వేచ్ఛకు భంగం కలగని విధంగా, రాజ్యాంగంలో స్వేచ్ఛకు సంబంధించిన హక్కులను పొందుపరచడం ద్వారా రక్షణ ఇవ్వబడుతుంది. రాజకీయ వ్యవస్థలో పౌరులందరికి రాజకీయ విషయాలకు సంబంధించిన సమాచారం సమానంగా అందుబాటులో ఉండాలి. పౌరులకు తమంతట తాముగా ప్రత్యామ్నాయ విధానాలను రూపొందించుకోవడానికి అవకాశం ఉండాలి. కొద్దిమంది తమ వ్యక్తిగత అధికార సాధనాల ఆధారంగా రాజకీయ చర్చను మరియు చట్టాలను రూపొందించే క్రమంలో తమ ప్రయోజనాలకనుగుణంగా ఒత్తిడి చేసే అవకాశం ఉన్నందున రాజకీయ స్వేచ్ఛ తన విలువను కోల్పోతుంది. పౌరుల స్వేచ్ఛ పరిరక్షింపబడాలంటే ఆస్థి విస్తృత స్థాయిలో పంపిణీ కాబడినపుడే సాధ్యమవుతుంది.

రాల్స్ రెండవ సూత్రం ప్రకారం ప్రభుత్వం సరైన మరియు సమానమైన అవకాశాలను అందరికి కల్పించాలి. అంటే ప్రభుత్వం విద్య మరియు సాంస్కృతిక అవకాశాలను అందరికి అందుబాటులోనికి తీసికొని రావలెనంటే ప్రభుత్వమే విద్యావ్యవస్థను ఏర్పాటు చేయడంద్వారా కాని లేక ప్రైవేటు విద్యాలయాల్లో ప్రవేశాన్ని అందరికి సమానంగా లభింపచేయాలంటే కొంత ఆర్థిక భారాన్ని ప్రభుత్వమే భరించవలసి ఉంటుంది. విద్యావకాశాలతోపాటు ప్రభుత్వం మరో నాలుగు ముఖ్యమైన విధులను నిర్వర్తించవలసి ఉంటుందని రాల్స్ ప్రతిపాదిస్తాడు. అవి :

1) వస్తువుల ధరలు పూర్తిగా మార్కెట్ చేత నిర్ణయింపబడకుండా, ఒకవైపు ఆర్థికంగా సంపన్న వర్గాల ఆదాయాలపై పన్నులను విధించి, మరోవైపు సామాన్య ప్రజానీకానికి అనేక రాయితీలు కల్పించడం ద్వారా, రాల్స్ ప్రతిపాదించే సామాజిక న్యాయం ఆచరణలోకి వస్తుందంటాడు.

2) సాధ్యమైనంతవరకు సంపూర్ణ ఉద్యోగితను మరియు వ్యక్తులు తమ వృత్తులను ఎంపిక చేసికొనేందుకు అవసరమైన అవకాశాలను విస్తృత స్థాయిలో కల్పించినపుడే, వ్యక్తి స్వేచ్ఛలు ఆచరణ సాధ్యం కాజాలవు.

3) సమాజంలోని అట్టడుగు వర్గాల, దీర్ఘకాల జీవిత ఆకాంక్షలు నెరవేరాలంటే వాళ్ళందరూ కనీస ఆదాయాలు పొందేటట్లు ప్రభుత్వం ప్రయత్నించాలి. ఎందువలనెనంటే పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ మానవ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆదాయాలను పంపిణీ చేయదు కనుక ప్రభుత్వమే కనీస ఆదాయ పంపిణీ జరిగేటట్లు చూడాలి. ప్రభుత్వం కనీస ఆదాయ పంపిణీ అట్టడుగు వర్గాలకు లభించేటట్లు చూడగలిగితే, వారి ప్రాథమిక అవసరాలు, ఆత్మాభిమానం పరిరక్షించబడతాయి కాబట్టి, మిగతా పంపిణీ మార్కెట్ ద్వారా నిర్ణయించబడటం సమర్థనీయమేనని రాల్స్ అభిప్రాయం.

4) ఆర్థిక అసమానతలను ప్రభుత్వం సరిదిద్దకపోయినట్లయితే ఇతర రాజకీయ, విద్యా ఉద్యోగావకాశాలు సమానంగా పంపిణీ కావు కనుక ప్రభుత్వం ఆస్థి పంపిణీని వారసత్వం, వినియోగం మొదలైన వాటిపై పన్నులను విధించటం ద్వారా సమాన అవకాశాలు అందరికీ అందుబాటులో ఉండేటట్లు చూడాలి.

## 12.5 పౌర విధులు - బాధ్యతలు :

పౌరులకు విధులేకాని రాజకీయ బాధ్యతలు ఏమీ ఉండవని రాల్స్ ఉద్దేశ్యం. ప్రభుత్వ పదవులలో ఉన్నవాళ్ళు, ఆయా స్థానముల ఆధారంగా వారు పౌరులపట్ల నిర్వర్తించవలసిన విధులను రాజకీయ బాధ్యతలుగా పేర్కొనవచ్చును. కాని పౌరసత్వం అనేది ఒక సంస్థకి చెందిన పదవికాదు కాబట్టి, పౌరునికి బాధ్యతలు ఉండవు. ఇతరులకు సహాయపడటం, న్యాయబద్ధమైన సంస్థల నిర్ణయాలను అనుసరించడం మొదలైనవి పౌరవిధులుగా పేర్కొనవచ్చు. అలాగే న్యాయబద్ధమైన సామాజిక వ్యవస్థలో ప్రభుత్వ చట్టాలు కాని, విధానాలు గాని కొన్ని సందర్భాలలో న్యాయబద్ధంగా లేనప్పుడు, పౌరులు వాటిని ధిక్కరించరాదు. అయితే న్యాయబద్ధ సమాజంలో శాసనంగాని, విధానం కాని ఘోరమైన స్థాయిలో పౌరస్వేచ్ఛల, ఉల్లంఘనకు దారితీసే అవకాశం ఉందని భావించినపుడు మాత్రమే, రాజ్యధిక్కారానికి పౌరుడు పాల్పడవచ్చు.

## 12.6 సారాంశము :

రాల్స్ న్యాయసూత్రాలు ఉదారవాద సిద్ధాంతానికి ఒక నూతన పునాదిని ఏర్పరచాయి. ఉదారవాదం వ్యక్తిత్వ వికాసం గురించి మాట్లాడినప్పటికీ, అది ఆచరణ సాధ్యంకావడానికి గల అవకాశాలను గురించి వివరించడంలో విఫలమైంది. వ్యక్తినిర్ణయాలపై బాహ్య నియంత్రణ లేకుండా చూడగలగటమే స్వేచ్ఛ అని పరిమిత అర్థంలో ఉదారవాదం నిర్వచించినది కాని, స్వేచ్ఛ వ్యక్తీకరణకు సామాజిక అవకాశాలకు మధ్య ఉన్న సంబంధాన్ని పట్టించుకొనలేదు. అలాగే నైతిక విలువలకు రాజకీయ విలువలకు మధ్య ఉండవలసిన సంబంధంపై, అస్పష్టమైన అభిప్రాయాలను, ఉదారవాదం వెలిబుచ్చింది. ఉదారవాదంలోని ఈ బలహీనతలను గుర్తించి, వాటిని ఉదారవాద భావజాల పరిధిలోనే ఎలా అధికమించవచ్చునో, తన న్యాయ సూత్రాల ద్వారా వివరించాడు. స్వేచ్ఛ మనిషి యొక్క నైతిక స్వభావంపై ఆధారపడి ఉంటుందని, వ్యక్తి యొక్క ఆత్మ గౌరవం, స్వీయవిలువ (Sense of his own worth) లు స్వేచ్ఛ అనే భావనతో సన్నిహిత సంబంధాన్ని కలిగి ఉంటుందని నిరూపించేందుకు ప్రయత్నించాడు. మనుషులు కేవలం భౌతిక అవసరాలు తీర్చుకొనేందుకు మాత్రమే కలసి జీవిస్తారని చెప్పడం సరైనది కాదని,

ఇతర మానసిక అవసరాలైన ఆత్మగౌరవం, తోటివ్యక్తులపట్ల కరుణ మొదలైనవి కూడా సామాజిక సహజీవనానికి ప్రాతిపదిక కాగలవని చెప్పినవ్యక్తి రాల్స్. ప్రతి వ్యక్తి వికాసం, తాను కలసి జీవించే ఇతర వ్యక్తుల వికాసంతో ముడిపడి ఉంటుందన్న విషయాన్ని స్పష్టపరచాడు. ఆ విధంగా సామాజిక సహజీవనంలో స్వేచ్ఛ, సమానత్వం, అనే భావనలను న్యాయం అనే భావన ద్వారా సమన్వయపరచవచ్చునని, తన న్యాయసిద్ధాంతం ద్వారా వివరించాడు.

## 12.7 మాదిరి ప్రశ్నలు :

1. రాల్స్ యొక్క న్యాయసిద్ధాంతాన్ని వివరించండి.
2. పౌరవిధులపై రాల్స్ అభిప్రాయం.
3. రాజకీయ వ్యవస్థ - స్వభావం
4. రాల్స్ న్యాయసూత్రాలు

## 12.8. చదువదగిన గ్రంథాలు :


1. John Rawls, A Theory of Justice, Clarendon Press, Oxford, 1972.
2. Samuel Freeman (ed) : The Cambridge Corporation to Rawls, Cambridge University Press, Cambridge, 2003.
3. Bhikhu Parekh : Contemporary Political Thinkers, Martin Robertson, Oxford, 1982.


రచయిత : **వజ్రాల అంజిరెడ్డి**

పాఠం - 13

# సి.బి. మాక్‌ఫర్‌సన్ (Macpherson)

**విషయసూచిక**


**13.0** లక్ష్యం

**13.1** పరిచయం

**13.2** మానవ స్వభావం

**13.3** మానవ స్వభావం - ప్రజాస్వామ్యం

**13.4** మానవ సామర్థ్యాల పెంపుదలకు అడ్డంకులు

**13.5** వ్యక్తిగత ఆస్థి - పెట్టుబడిదారి వ్యవస్థ

**13.6** ఉదారవాద ప్రజాస్వామ్యంపై మాక్‌ఫర్సన్ భావాలు

**13. 7** సారాంశము

**13.8** మాదిరి ప్రశ్నలు

**13.9** చదువదగిన గ్రంథాలు


## 13.0 లక్ష్యం :

ఈ భాగాన్ని చదివాక మీరు ప్రజాస్వామ్య భావన గురించి, దాని తాత్విక మూలాలను గురించి తెలుసుకుంటారు. ఉదారవాద ప్రజాస్వామ్యం గురించి, ఆ వ్యవస్థ పరిమితులను గురించి విపులంగా మీరు అర్థం చేసుకునేందుకు వీలుపడుతుంది.

## 13.1 పరిచయం :

వర్తమాన రాజనీతి తత్వవిచారంలో ప్రజాస్వామ్య సిద్ధాంతానికి ఒక నూతన అర్థాన్ని, ప్రాతిపాదికను సంతరింపచేయడానికి యత్నించిన ఘనత మాక్‌ఫర్సన్‌కు దక్కుతుంది. ఆధునిక ప్రజాస్వామ్య సిద్ధాంతానికి తాత్విక మూలాలు 17వ, 18 వ శతాబ్దాలలో ఆవిర్భవించిన ఉదారవాద రాజనీతి సిద్ధాంతాలలో ఉన్నాయని గుర్తించిన మాక్‌ఫర్సన్, 19 వ శతాబ్దంలో ప్రతిపాదించబడిన ప్రజాస్వామ్య భావాలతో కలసి, 20వ శతాబ్దంలో ఉదారవాద ప్రజాస్వామ్యంగా ఎలా పరిణామం చెందిందో వివరించడమే ఆయన జీవిత కాలకృషిగా మనం గుర్తించవచ్చును. ఉదారవాద ప్రజాస్వామ్య సిద్ధాంతానికి, పెట్టుబడిదారీ ఆర్థిక సంబంధాలకు మధ్యగల సాన్నిహిత్యాన్ని వివరించటం ద్వారా, ఆ సిద్ధాంతంలోని మౌలిక పరిమితులను బహిర్గత పరచినవ్యక్తి మాక్‌ఫర్సన్. అలాగే మార్క్సిస్ట్ సిద్ధాంతంలో ప్రజాస్వామ్యంపై ఉన్న అస్పష్టతను, తాత్విక బలహీనతలను గుర్తించటం ద్వారా, అటు ఉదారవాదంలోను ఇటు మార్క్సిజంలోను ప్రజాస్వామ్యం పట్ల వ్యక్తీకరించబడిన భావాలకు, మౌలిక ప్రజాస్వామ్య విలువలకు మధ్యగల వ్యత్యాసాలను స్పష్టపరిచిన రాజనీతి తత్వవేత్త మాక్‌ఫర్సన్. అటు ఉదారవాదంలోనూ ఇటు మార్క్సిజంలోనూ ఉన్న సుగుణాలను సంశ్లేషణ చేయడం ద్వారా, ఒక సమగ్రమైన ప్రజాస్వామ్య సిద్ధాంతాన్ని ఆధునిక

కాలానికి అందివ్వాలన్న ప్రగాఢమైన కాంక్ష ఆయనలో కనిపిస్తుంది. ఆయన ప్రతిపాదించిన ప్రజాస్వామ్య సిద్ధాంతంలో, ఈ సంశ్లేషణా ఛాయలు ఉన్నందువల్లనే, ఉదారవాద సిద్ధాంతకర్తలలో చాలామంది ఆయనను మార్క్సిస్టుగా పరిగణిస్తే, మార్క్సిస్టులు ఆయనను ఉదారవాదిగా భావించారు. మానవ స్వభావం, స్వేచ్ఛ, సమానత్వం, అధికారం మొదలగు భావనలపట్ల, ఉదారవాద, మార్క్సిస్ట్ తత్వవిచారంలోని లోపాలను ఎత్తిచూపడంద్వారా, ప్రజాస్వామ్య ఆదర్శాలైన స్వేచ్ఛ, సమానత్వాలను ఎలా ఆచరణ సాధ్యం చేయవచ్చోనని చెప్పిన గొప్ప ప్రజాస్వామ్య సిద్ధాంతవేత్తే మాక్‌ఫర్సన్. ప్రజాస్వామ్య ఆదర్శాలైన స్వేచ్ఛ, సమానత్వాలకు, పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థకు మూలమైన వ్యక్తిగత ఆస్థిహక్కుకు మధ్యగల అంతరాన్ని గుర్తించటం ద్వారా ప్రజాస్వామ్యం, పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థల మధ్య సమన్వయం తాత్కాలికమైనదేకాని, ఈ రెండింటి మధ్య నున్న అంతర్గత వైరుధ్యాలు అంతిమంగా పెట్టుబడిదారీ ఆర్థిక సంబంధాలను అదిగమించవలసి ఉంటుందని తన రచనల ద్వారా మాక్‌ఫర్సన్ వివరించాడు. ప్రజాస్వామ్య ఆదర్శాలు అంతిమంగా సామ్యవాద వ్యవస్థలోనే సాధ్యమని విశ్వసించిన వ్యక్తి మాక్‌ఫర్సన్.

## 13.2 మానవ స్వభావం :

మనిషి స్వభావరీత్యా స్వార్థజీవి అని, అతను నిరంతరం భౌతిక అవసరాల సాధనకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తాడని, మానవ భౌతిక అవసరాలకు పరిమితులు ఉండవని, కావున ప్రతివ్యక్తి తన జీవితకాలం ఈ అవసరాలను తీర్చుకొనేందుకే నిరంతరం శ్రమిస్తాడని, ఆక్రమంలోనే వ్యక్తుల మధ్య సంబంధాలు ఏర్పడతాయని, ఉదారవాదతత్వవేత్తలయిన హాబ్స్, జాన్‌లాక్‌లు మానవ స్వభావంపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అందుకు భిన్నంగా మానవ స్వభావంపై మాక్‌ఫర్సన్ తన అభిప్రాయాలను వ్యక్తం చేశాడు. స్వతః సిద్ధంగా మనిషికి కొన్ని ప్రత్యేక లక్షణాలు ఉన్నాయని మాక్‌ఫర్సన్ భావిస్తాడు. వీటిలో అత్యంత ముఖ్యమైనది "స్వయం దిశానిర్దేశనం" (Self Direction) చేసుకోగల శక్తిని కలిగి ఉండటం. మాక్‌ఫర్సన్ దృష్టిలో స్వయందిశా నిర్దేశనమంటే జీవిత లక్ష్యాలను ఎంచుకోగలిగి వాటిని సాధించేందుకు కార్యాచరణ సామర్థ్యాన్ని కలిగి ఉండటం. మానవ విశిష్ట లక్షణమేమంటే జీవిత లక్ష్యాలకు ఎంపిక చేసుకొనే సామర్థ్యాలతోపాటు, వాటిని సాధించే సంకల్పశక్తిని కూడ కలిగి ఉండటమని, మాక్‌ఫర్సన్ ప్రతిపాదిస్తాడు. అందువల్ల ప్రతివ్యక్తి తనకు తానుగా జీవిత లక్ష్యాలను ఎంచుకొని, వాటిని సాధించేందుకు ప్రయత్నించినపుడే, ఆత్మాభిమానాన్ని పొందగలడని మాక్‌ఫర్సన్ భావిస్తాడు. ఏ వ్యక్తి మరో వ్యక్తి జీవిత లక్ష్యాలకు సాధనంగా మారరాదని చెప్తాడు. ఒక వ్యక్తి ఏ మేరకు ఇతరుల ఆదేశాలకు లొంగి, తన జీవిత లక్ష్యాలను వదులుకొంటున్నాడో, ఆ మేరకు స్వేచ్ఛను, ఆత్మాభిమానాన్ని, ఆ వ్యక్తి కోల్పోతున్నాడని మాక్‌ఫర్సన్ భావిస్తాడు. మాక్‌ఫర్సన్ దృష్టిలో స్వేచ్ఛ అంటే స్వయం నిర్దేశనా లక్షణాన్ని కలిగి ఉండటమే.

దీనితోపాటు మనిషికి ఇతర లక్షణాలు కూడా ఉన్నాయి. హేతుబద్ధ అవగాహనశక్తి, నైతిక అంశాలపై నిర్ణయాలు చేయడం మరియు వాటిని ఆచరించే శక్తిని కలిగి ఉండటం, సౌందర్యదృష్టి, స్నేహం, సహజీవనం, ప్రేమ, భౌతిక వస్తూత్పత్తికై శ్రమించటం మొదలైనవి మానవ స్వభావ లక్షణాలు. అయితే ఇవికాక మనిషికి రెండవ తరహా లక్షణాలు కూడా ఉన్నాయి. సాటి మనుషులను మోసం చేయడం, అబద్దాలు చెప్పడం, దోపిడీ చేయడం మొదలైనవి. అయితే వీటిని సమాజ ప్రతికూల ప్రభావం వలన ఏర్పడిన లక్షణాలుగానే గుర్తించాలితప్ప, మానవ స్వభావ లక్షణాలుగా గుర్తించరాదని మాక్‌ఫర్సన్ వాదన. ఈ రెండో తరగతి లక్షణాలు మానవ స్వభావానికి తప్పనిసరి లక్షణాలు కావు. అందువల్ల అవి మానవనైజంలో భాగం కావు. ఏ లక్షణాలైతే మనిషిని సంపూర్ణ మానవునిగా చేయటంలో ఉపకరిస్తాయో వాటినే "మానవ సారం" (Human Essence) గా చెప్పాలి. ఏశక్తి సామర్థ్యాలయితే మనుషులందరూ సామరస్యంగా పెంపొందించుకోగలరో ఆ శక్తి సామర్థ్యాలే

(Capacities) మానవసారంగా చెప్పవచ్చు. ఏ సామర్థ్యాలు ఇతరులకు హాని కలిగిస్తాయో, ఇతరులు తమ సామర్థ్యాలను పెంపొందించుకోవడానికి అడ్డుపడతాయో, వాటిని నైతికంగా సమర్థించరాదు. అవి మానవ స్వభావంలో భాగమూకావు. ఉదాహరణకు 'అత్యాశ' అనేది పెట్టుబడిదారి సంబంధాల నుండి ఉత్పన్నమైనదేగాని, అది మానవ స్వభావంలో భాగం కాదు. వినాశ పూరిత ఘర్షణలకు దారితీసే సామర్థ్యాలు "మానవ సారం"లో భాగం కాదంటాడు మాక్‌ఫర్సన్. కావున మనిషి, ఇతర మనుషులతో కలసి సామరస్య పూర్వకంగా తన శక్తి, సామర్థ్యాలను పెంపొందించుకొనే అంశాలే, మానవ స్వాభావిక లక్షణాలుగా పరిగణించాలని, మాక్‌ఫర్సన్ వాదిస్తాడు.

## 13.3 మానవ స్వభావం - ప్రజాస్వామ్యం :

మనిషి కేవలం సరుకులను వినిమయం చేసే జీవి మాత్రమే కాదు. తన శక్తిసామర్థ్యాలను వెలికితీసి, పెంపొందింపచేసుకొని, తృప్తినొందటం అతని స్వభావ లక్షణం. ఏ లక్షణాలైతే మానవసారమో వాటిని అభివృద్ధి చేసుకొనే అధికారం మనిషికుంది. ఏ సమాజమైతే ఈ సూత్రాన్ని సంఘజీవనానికి కేంద్రీయ నైతిక సూత్రంగా అంగీకరిస్తుందో దానిని ప్రజాస్వామ్యంగా పిలవగలమంటాడు మాక్‌ఫర్సన్. మాక్‌ఫర్సన్ దృష్టిలో ప్రజాస్వామ్యమంటే కేవలం ప్రభుత్వ వ్యవస్థ మాత్రమే కాదు, అది ఒక సమాజ జీవనవిధానం. ప్రజాస్వామ్యమంటే కేవలం 'ఒక వ్యక్తి, ఒక ఓటు' అన్న సూత్రంపై ఆధారపడి ఏర్పరచుకొనే ప్రభుత్వం మాత్రమే కాదు; ప్రతివ్యక్తి స్వేచ్ఛా సమానతల ఆధారంగా ఇతర వ్యక్తులతో కలసి జీవించగల హక్కును కలిగి ఉండటమన్న సూత్రం మీద ప్రజాస్వామ్యం ఆధారపడి ఉంది. ఆనాటికి లభ్యమయ్యే శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన పరిధిలో ఏ మేరకు ఒక సమాజం తమ సంఘ సభ్యుల అత్యున్నత అభివృద్ధికి (Maximum Development) అనుమతిస్తుందో, ఆ మేరకు ఆ సమాజము యొక్క ప్రజాస్వామ్య స్వభావాన్ని గుర్తించటానికి వీలుపడుతుంది.

మనిషి తన సామర్థ్యాలను (Capacities) పెంపొందించుకోవాలంటే అతనికి అధికారం (Power) అవసరం. "తనకున్న సామర్థ్యాలను ఉపయోగించుకోగలిగిన వాస్తవశక్తే" అధికారం (Power is the "Actual ability to exercise one's capacities) ఒక మనిషి ఒక పని చేయగలిగిఉండీ, ఆ పని చేయడానికి కావలసిన సాధన సంపత్తి లోపించితే అతనికి సామర్థ్యం ఉందికానీ, శక్తిలేదనీ చెప్పవచ్చు. తన సామర్థ్యాలను ఉపయోగించుకోవటంలో ఎటువంటి అడ్డంకులు (Impediments) లేకున్నట్లయితే అతని శక్తి అత్యధికంగా ఉందని చెప్పవచ్చు. ఏ మేరకైతే అడ్డంకులుండవో ఆ మేరకు అతను శక్తివంతుడని చెప్పవచ్చు. (A man's power is to be measured in terms of the absence of impediments to his using his capacities".)

## 13.4 మానవ సామర్థ్యాల పెంపుదలకు అడ్డంకులు :

ప్రతి మనిషి తన సామర్థ్యాన్ని పెంపొందించుకొనే క్రమంలో మూడు రకాల సామాజిక అడ్డంకులను మాక్‌ఫర్సన్ పేర్కొన్నాడు.

మొదటిది : జీవించేందుకు సరిపడా సాధన సంపత్తి లోపించడం (Lack of adequate means of life) అంటే సంఘ జీవితంలో సంపూర్ణంగా పాల్గొనటానికి అవసరమయ్యే భౌతిక వస్తుసముదాయాన్ని కలిగి ఉండకపోవడం.

రెండవది : శ్రమించేందుకు అవసరమైన సాధనాలు లోపించడం (Lack of access to the means of labour). తన శ్రమను వినియోగించేందుకు తగు సాధన సామాగ్రి లేకపోయినట్లయితే తనలో నిక్షిప్తమై ఉన్న సామర్థ్యాన్ని ఉపయోగించేందుకు వీలుపడదు.

మూడవది : ఇతర వ్యక్తుల దాడి నుండి రక్షణ లేకపోవడం (Lack of protection from invasion by others) ఒక మనిషి తన సామర్థ్యాన్ని స్వేచ్ఛగా ఉపయోగించాలంటే ఇతరుల నుండి అవాంతరాలు, దాడి, భయం ఉండకూడదు.

## 13.5 వ్యక్తిగత ఆస్థి - పెట్టుబడిదారీ వ్యవస్థ :

ఈ మూడు అవరోధాలలో మూడవ దానిని నివారించే చట్టాలు మాత్రమే ఉదారవాద పెట్టుబడిదారీ సమాజాలలో కల్పించబడినాయనీ, మొదటి రెండు అవరోధాలను తొలగించే ప్రయత్నం స్వల్పంగా మాత్రమే జరిగిందని మాక్‌ఫర్సన్ అంటాడు. పెట్టుబడిదారీ సమాజాలలో ఉత్పత్తి సాధనాలు ప్రైవేటు యాజమాన్యంలో ఉన్నందున ఎక్కువమంది తమ జీవనం కోసం కొద్దిమంది వ్యక్తులపై ఆధారపడవలసి వస్తుంది. దీనిమూలంగా 1) శ్రామికుడు తన కార్యకలాపాల (Activities) పై నియంత్రణను కోల్పోతాడు. స్వయం నిర్దేశన అనే మానవసారం కుదించబడుతుంది. 2) శ్రామికుడు తన జీవనభృతిని పొందే క్రమంలో తాను సృజించిన విలువను పెట్టుబడిదారునికి బదిలీచేస్తాడు. తాను ఉత్పత్తి చేసిన విలువలో కొంతభాగాన్ని మాత్రమే వేతనంగా తిరిగి పొందుతాడు. తాను చేస్తున్నపని తన కోసంకాక యజమాని లాభాల కోసం శ్రమిస్తున్నానన్న భావం కలుగుతుంది. 3) నిరంతరం అర్థరహితమైన, అవమానకరమైన పరిస్థితుల్లో చేసిన పనినే చేస్తూ ఉండటం వల్ల అతనిలో శ్రమ యెడల నిరాసక్తత, విముఖత, క్రోధం కలుగుతాయి.

మాక్‌ఫర్సన్ ఉద్దేశ్యంలో శక్తి (Power) రెండు రకాలు. ఒకటి, ఒక వ్యక్తి తన నిబిడీకృత సామర్థ్యాలను ఉపయోగించి అభివృద్ధి చెందగలిగినశక్తి. దీనిని అభివృద్దిశీలశక్తి (Developmental Power) అంటాడు. రెండవది ఇతరుల సామర్థ్యాలను ఉపయోగించి తద్వారా లాభం పొందగలిగేశక్తి. ఇది పీడనశక్తి (Extractive Power) పెట్టుబడిదారీ సమాజంలో అత్యధికులకు ఈ రెండవరకం శక్తి ఉండదు. మొదటిరకం శక్తినామమాత్రంగా ఉంటుంది. కాని కొద్దిమందికే ఈ రెండు రకాల శక్తులుంటాయి. ఈ కొద్దిమంది మాత్రం మానవులుగా మనగలిగితే, మిగిలిన వాళ్ళు కేవలం "సరుకు" గా మార్చబడతారు. కాబట్టి పెట్టుబడిదారీ సమాజాలలో మనుషుల శక్తి వ్యక్తీకరణలలో అనూహ్య వ్యత్యాసాలు ఉంటాయి. అందువల్ల ఉత్పత్తి సాధనాలపై వ్యక్తిగత యాజమాన్య హక్కులు ఉన్నట్లయితే, కొద్దిమంది శక్తిమంతులుగానూ, అత్యధికమంది అశక్తులు గానూ మారటం జరుగుతుంది. కొద్దిమంది అనేకమందిపై ఆధిపత్యాన్ని చెలాయించటం, ఇతరుల జీవన విధానాన్ని నిర్దేశించడం, వారి సామర్థ్యాలను స్వలాభం కోసం ఉపయోగించుకోవడం మొదలైన అంశాలకు మూలాధారం ఉత్పత్తి సాధనాలపై వ్యక్తిగత ఆస్థిహక్కును అంగీకరించడమే. కావున వ్యక్తిగత ఆస్థిహక్కు యజమానికి మాత్రమే స్వేచ్ఛను కల్పిస్తూ, శ్రామికునికి అస్వతంత్రకు గురిచేస్తుంది. కాబట్టి వ్యక్తిగత ఆస్థిహక్కు అత్యధికుల స్వీయవ్యక్తీకరణకు, ప్రధాన ప్రతిబంధకమని మాక్‌ఫర్సన్ చెప్పాడు.

వ్యక్తిగత ఆస్థి అనేది శక్తి సంబంధాలు (Power Relations) ను మాత్రమేకాక రాజకీయ సంబంధాన్ని కూడా నియంత్రిస్తుంది. ఉత్పత్తిసాధనాల పై వ్యక్తిగత యాజమాన్య హక్కుని రాజ్యం చట్టబద్దం చేయడం ద్వారా, ఆస్థిహక్కుకు రక్షణ లభిస్తుంది. అసమాన ఆస్థిసంబంధాలను అంటే శక్తి సంబంధాలను పరిరక్షించేందుకు బలమైనశక్తి, అంటే బలప్రయోగం అవసరమవుతుంది. పౌరహక్కులలో భాగంగా ఆస్థిహక్కుకు రాజ్యం రక్షణ కల్పించడం ద్వారా, ఆస్థిని కలిగిన వర్గాల ప్రయోజనాలకు చట్టబద్ధ రక్షణ ఏర్పడుతుంది. ఆ విధంగా పెట్టుబడిదారీ వ్యవస్థలో రాజ్యం సార్వత్రిక హక్కుల రక్షణ పేరుతో, ఆస్థిని కలిగిన వర్గాల ప్రయోజనాలను, ఆధిపత్యాన్ని చట్టబద్ధీకరిస్తుంది. కావున కొద్దిమందికి మాత్రమే ప్రయోజనకరమైన వ్యక్తిగత ఆస్థిహక్కు, ఆ సమాజంలోని అత్యధిక సంఖ్యాకుల శ్రమశక్తిని, స్వీయనిర్దేశకతను, యజమానుల

ప్రయోజనాలకనుగుణంగా నియంత్రిస్తుంది. కాబట్టి, దానిని సార్వత్రిక ప్రయోజనాలకనుగుణంగా నిర్దేశించటం అవసరమని మాక్‌ఫర్సన్ అంటాడు. కావున ప్రజాస్వామ్య చట్టబద్దత ద్వారా రక్షణ కల్పించడంకాదని, దానిని సార్వత్రిక ప్రయోజనాలకనుగుణంగా సరిదిద్దటమని మాక్‌ఫర్సన్ వాదన.

## 13.6 ఉదారవాద ప్రజాస్వామ్యంపై మాక్‌ఫర్సన్ భావాలు :

సామాజిక రాజకీయ జీవితానికి స్వేచ్ఛా భావనను మౌలికమైనదిగా ఉదారవాదం పరిగణిస్తుంది. మాక్‌ఫర్సన్ దృష్టిలో "ఎంపిక స్వేచ్ఛ" (Principle of freedom of choice) అనే సూత్రం ఉదారవాదానికి మౌలిక నైతికసూత్రం (Central ethical principle of liberalism) ఉదారవాదాన్ని మూడు అర్థాలలో తాను ఉపయోగించాడు. మొదటిది : సామాజిక, రాజకీయ జీవన నిర్మాణంలో వ్యక్తిని రాజకీయ, నైతిక ప్రమాణంగా ఉదారవాదం గుర్తిస్తుంది. ప్రతివ్యక్తి, తన జీవిత లక్ష్యాలను, విశ్వాసాలను మతాన్ని, వివాహ భాగస్వామిని, వృత్తిని, ప్రభుత్వాన్ని, జీవన విధానాన్ని మొదలైన అన్ని అంశాలను తనకు తానుగా నిర్ణయించుకోవాలని ప్రతిపాదిస్తుంది. అలాగే ఇతరుల నియంత్రణ లేకుండా స్వతంత్రంగా ఆలోచించగలగటం, మాట్లాడగలగటం, వ్రాయడం ప్రతి వ్యక్తి యొక్క హక్కుగా ఉండాలంటుంది.

రెండవది : స్వాధీన వ్యక్తివాదం (Possessive Individualism) ఉదారవాద రెండవ లక్షణం. స్వాధీన ఉదారవాదాన్ని తిరిగి ఏడు అర్థాలలో మాక్‌ఫర్సన్ వివరించాడు.

1) ఇతరుల ఇచ్ఛకు లోబడకుండా ఉండటం,
2) తన స్వీయప్రయోజనార్ధం, ఏ విధులనంగీకరించాడో ఆ విధుల నిర్వహణకు మాత్రమే కట్టుబడి ఉండటం;
3) తన శరీరం మీద, సామర్థ్యాల మీద అతనే అధిపతి
4) తన సామర్థ్యాలను తన అంగీకారంతో బదిలీ చేయవచ్చు ;
5) మానవ సమాజమంటే విఫణి సంబంధాల పరంపరే ;
6) ఇతరుల స్వేచ్ఛకు భంగకరమయినపుడు మాత్రమే ఒకరి స్వేచ్ఛపై పరిమితులు విధించవచ్చు ;
7) రాజకీయ వ్యవస్థ ఆస్థిని సంరక్షించేందుకు, వ్యక్తుల మధ్య వస్తుమారకాన్ని క్రమబద్దీకరించేందుకు ఏర్పడినది మాత్రమే.

మూడవది : వ్యక్తి ప్రధానంగా అపరిమితమైన కోర్కెలను కలిగి ఉంటాడని, వాటిని తీర్చుకునేందుకు నిరంతరం ప్రయత్నిస్తుంటాడని, మూడవ అర్థం చెబుతుంది. ఉదారవాద భావజాలంలోని పై మూడు అర్థాల మధ్య సమన్వయం ఉండనవసరం లేదని, ఈ అర్థాలను ఉదారవాదం వివిధ చారిత్రిక దశల్లో పొందటం జరిగిందని చెప్తాడు. మాక్‌ఫర్సన్ ఉదారవాదానికి ఇచ్చిన మొదటి అర్థాన్ని అంగీకరించి, రెండు, మూడు అర్థాలను తిరస్కరించాడు. విఫణి సమాజం క్రమేణా ఆధిపత్యాన్ని సాధించే క్రమంలో తత్వవేత్తలైన హాబ్స్, లాక్‌లు రెండవ అర్థాన్ని ప్రతిపాదించారని, పెట్టుబడిదారీ వ్యవస్థ బాగా అభివృద్ధిని చెందిన దశలో బెంథామ్ అను బ్రిటీష్ తత్వవేత్త మూడవ అర్థంలో వాడటం జరిగింది. ఉదారవాదాన్ని పెట్టుబడిదారీ వ్యవస్థను సమర్థించే భావజాలంగానే, మాక్‌ఫర్సన్ భావించాడు.

ఉదారవాదాన్ని భిన్న అర్థాలలో వాడబడినప్పటికీ, మాక్‌ఫర్సన్ దృష్టిలో దాని మౌలిక అర్థం మాత్రం వ్యక్తి ఎంపికా స్వేచ్ఛయే ! ఆర్థిక జీవనంలో పోటీతత్వ విఫణి వ్యవస్థ, రాజకీయ జీవనంలో వ్యక్తులు స్వేచ్ఛయుతంగా నిర్ణీతకాలానికి

ఎన్నికల ద్వారా ప్రభుత్వాన్ని ఎంపిక చేసుకోవడం, తద్వారా స్వేచ్ఛాయుత సమాజాన్ని ఏర్పరచడమే ఉదారవాద భావజాల ప్రధాన లక్ష్యం. చారిత్రకంగా చూసినపుడు ఉదారవాద రాజ్యం, పరిమిత ఓటుహక్కుపై ఏర్పడినదని, దాని ఉదాహవాద స్వభావమే క్రమేణ అది ప్రజాస్వామ్య రాజ్యంగా పరివర్తన చెందటానికి కారణం అయిందని చెప్తాడు. ఎవరికైతే ఓటు హక్కులేదో, రాజకీయ వ్యవస్థలో వారికి తగిన స్థానం, గుర్తింపు లేదని, కావునే సార్వత్రిక ఓటు హక్కు కావాలనే నినాదం ముందుకు వచ్చిందంటాడు. ఉదారవాద రాజ్యం ప్రజాస్వామ్య ఆకాంక్షలను కొంతమేరకు మాత్రమే అంగీకరించిందని, ప్రజాస్వామ్యాన్ని రాజకీయ, ఆర్థిక సమానత్వం అనే పరిపూర్ణ అర్థంలో అంగీకరించనట్లయితే, ఉదారవాద సమాజం మరియు రాజ్య పునాదులు కూలిపోయి ఉండేవని, మాక్‌ఫర్సన్ వాదిస్తాడు. కావునే ఉదారవాద సమాజసంబంధాలు, రాజ్యపాలనా పరిధిలో ప్రజాస్వామ్య సిద్ధాంతాన్ని, ఉదాకీకరించినది మాక్‌ఫర్సన్ వాదిస్తాడు. అందువల్లనే ప్రజాస్వామ్యమంటే సామాన్య ప్రజానీకపాలనే అనే సాంప్రదాయక అర్థాన్ని, వ్యక్తులందరికీ సమాన హక్కులు అనే నూతన అర్థంలో ప్రజాస్వామ్యాన్ని ఉదారవాద పునర్ నిర్వచించినదని మాక్‌ఫర్సన్ చెప్తాడు. మరలా సమాన హక్కులంటే, ప్రతివ్యక్తి ఇతర వ్యక్తులతో సమానంగా తన స్వీయ అభివృద్ధిని సాధించడం కాదని, కేవలం ఉదారవాద విఫణి సమాజంలోనూ, రాజ్యంలోనూ సమానంగా పోటీపడే హక్కును కలిగి ఉండటం మాత్రమేనని, ఉదారవాదం చెబుతుంది. ఉదారవాద సమాజంలో నూతనంగా ఓటు హక్కుని పొందినవాళ్ళు తమ స్థానాలను పొందాలంటే, ఉదారవాద విఫణి సమాజ నియమాలను ఉల్లంఘించరాదని చెబుతుంది. ఆ విధంగా ఉదారవాదం, ప్రజాస్వామ్యంతో కలసి, 19వ శతాబ్దంలో ఉదారవాద ప్రజాస్వామ్యంగా ఏర్పడినదని చెప్పాడు.

ఒక కొత్త ప్రభుత్వ రూపంగా ఉదారవాద ప్రజాస్వామ్యం గత శతాబ్దకాలంలో అనేక నూతన సమస్యలను ఎదుర్కొంది. దీనిని అర్థం చేసుకొని, సమర్థించే క్రమంలో రాజనీతి సిద్ధాంతకర్తలు నాలుగు రకాలైన ప్రజాస్వామ్య నమూనాలను రూపకల్పన చేశారని మాక్‌ఫర్సన్ పేర్కొన్నాడు. అవి

1) రక్షణశీల ప్రజాస్వామ్యం (Protective democracy) విఫణి పోటీలో స్వేచ్ఛను పరిరక్షించి, పరిమిత ప్రభుత్వాన్నే కోరడం. హాబ్స్, లాక్, జేమ్స్ మిల్, బెంథామ్ ఈ కోవకు చెందినవారు.

2) అభివృద్ధిశీల ప్రజాస్వామ్యం (Developmental Democracy) ప్రతి మనిషి తన సామర్థ్యాలను అభివృద్ధి చేసుకునేందుకు ప్రయత్నిస్తాడు కాబట్టి, అందరి సమానాభివృద్ధి కొరకు రాజ్యం ప్రయత్నించాలనేవారు జె.యస్.మిల్ ఈ కోవకు చెందినవారు.

3) సమతౌల్య ప్రజాస్వామ్యం (Equilibrium Model of Democracy) : ప్రజల కోరికలకు, వస్తు సరఫరాకు మధ్య సమతౌల్యాన్ని ఏర్పరిచే ప్రభుత్వాన్ని కలిగి ఉండటమే ప్రజాస్వామ్యమనేవారు. పౌరులకు పోటీపడే శ్రేష్టుల మధ్య ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఉండాలి. అస్తవ్యస్థమైన ప్రజాభిప్రాయాలను ప్రోదిచేసి ఒక అర్థవంతమైన విధానాలను రూపొందించి, అమలు చేయటమే ప్రజాస్వామ్యం. ఈ నమూనాను ప్రతిపాదించినది పీటర్, రాబర్ట్‌డాల్, సిడ్నీ వెర్బాలు.

4) భాగస్వామ్య ప్రజాస్వామ్యం (Participatory Democracy) : క్రింది స్థాయిలో ప్రత్యక్ష స్వయంపాలన కలిగి ఉండి, పై స్థాయిలో పరోక్ష స్వయంపాలన ఉండటం దాని లక్షణం. ప్రతినిధులు ప్రజలచే ఎన్నుకోబడతారు. వారిని తొలగించే అధికారం ప్రజలకు ఉంటుంది. ప్రజలు తమకు తాము తమ సామర్థ్యాలను ఉపయోగించగల పరిస్థితి ఉన్నప్పుడు, సామాజిక ఆర్థిక అసమానతలు బాగా తగ్గినపుడు మాత్రమే భాగస్వామ్య ప్రజాస్వామ్యం సాధ్యంకాగలదంటాడు మాక్‌ఫర్సన్.

ఈ నాలుగు ప్రజాస్వామ్య నమూనాలలో మొదటి మూడు నమూనాలను తిరస్కరించి, భాగస్వామ్య ప్రజాస్వామ్యాన్ని మాక్‌ఫర్సన్ సమర్థించాడు. సమకాలీన పాశ్చాత్యదేశాలలోని ప్రజాస్వామ్యాన్ని, ఉదారవాద ప్రజాస్వామ్యంగా, మాక్‌ఫర్సన్ పేర్కొన్నాడు. ఆ దేశాలలో ఉన్న ప్రజాస్వామ్య వ్యవస్థ, పరిపూర్ణమైన ప్రజాస్వామ్యం కాదని ఎందువలనంటే అక్కడ పెట్టుబడిదారీ విఫణిసంబంధాల పరిధిలోనే ప్రజాస్వామ్య ప్రభుత్వాలు తమ విధులను నిర్వర్తించవలసి ఉంటాయని, అలాగే ప్రజలందరూ తమ శక్తి, సామర్థ్యాలను పరిపూర్ణ స్థాయిలో వ్యక్తం చేయడానికి అవకాశం లేదని మాక్‌ఫర్సన్ చెప్తాడు. అయితే ఆ దేశాలలో ఉదారవాద ప్రజాస్వామ్యం, భాగస్వామ్య ప్రజాస్వామ్యంగా పరివర్తన చెందుతుందన్న క్రమం కొనసాగుతుందని, తన ప్రగాఢ ఆశను వ్యక్తం చేస్తాడు.

## 13.7 సారాంశము :

ఉదారవాదంలోని మేలి లక్షణాలను కొనసాగిస్తూ, దానిలోని లోపాలను తొలగించడానికి ప్రయత్నించిన వ్యక్తి మాక్‌ఫర్సన్. పెట్టుబడిదారీ సమాజాలలో అసమానతలను, మానవ సామర్థ్యాలను వక్రీకరించబడటాన్ని, అన్యాయాలను, ఉదారవాద విలువలను విడనాడకుండా సామ్యవాద విలువల ఆధారంగా విమర్శించాడు. ఉదారవాద రాజ్యాన్ని, సామ్యవాద సమాజాన్ని ఆకాంక్షించాడు. తాను విశ్వసించిన ఉదారవాద విలువలు పెట్టుబడిదారీ సమాజంలో ఎలా సాధ్యంకావో విమర్శనాత్మకంగా విశ్లేషించి, ఒక నూతన ప్రజాస్వామ్య సామ్యవాద నమూనాను రూపొందించాడు మాక్‌ఫర్సన్.

## 13.8 మాదిరి ప్రశ్నలు :

1. మానవ స్వభావంపై మాక్‌ఫర్సన్ అభిప్రాయాలు వ్రాయండి.
2. ప్రజాస్వామ్య సిద్ధాంతంపై మాక్‌ఫర్సన్ అభిప్రాయాలు వ్రాయండి.
3. మానవ స్వభావంపై మాక్‌ఫర్సన్
4. పెట్టుబడిదారీ వ్యవస్థ - ప్రజాస్వామ్యం
5. ఉదారవాద ప్రజాస్వామ్యం

## 13.9 చదువదగిన గ్రంథాలు :

1. Macpherson, C.B. : Democratic Theory : Essays in Retrierval, Clavendon Press, Oxford, 1973.
2. Macpherson, C.B. : Life and Times of Liberal Democracy, Oxford University Press, Oxford, 1980.
3. William Leiss : C.B. Macpherson : Dilemmas of liberalism and socialism, St. Martin's Press, New York, 1988.
4. Macpherson, C.B. : The Political Theory of possessive Individualism : Hobbes to Locke Oxford University Press, Oxford, 1982.

పాఠం - 14

# ఎఫ్. ఏ. హేయక్ (1899 - 1992)

విషయసూచిక

14.0 లక్ష్యం
14.1. పరిచయం
14.2. సామ్యవాదంపై విమర్శ
14.3. స్వేచ్ఛాయుత సమాజంలో స్వేచ్ఛ మరియు చట్టం
14.4. శ్రేయోరాజ్యం సామాజిక న్యాయంపై విమర్శ
14.5. ఉదారవాదం ప్రజాస్వామ్య భావనలపై వివరణ
14.6. సారాంశము
14.7 చదువదగిన గ్రంథాలు

## 14.0. లక్ష్యం :

ఈ భాగం చదివిన తరువాత ఈ క్రింది విషయాలు తెలుసుకుంటారు.

ఎ) ఉదారవాద భావజాల ముఖ్యాంశాలు, వాటి విశిష్టతను గ్రహించగలరు.

బి) సామ్యవాదం, శ్రేయోరాజ్యపాలన ఏ విధంగా ఉదారవాద విలువలకు భంగకరమో వివరించడం జరుగుతుంది.

సి) ఉదారవాదం, ప్రజాస్వామ్యం, స్వేచ్ఛాయుత విఫణి వ్యవస్థలు ఎలా పరస్పర పూరకాలో వివరించడం జరుగుతుంది.

## 14.1. పరిచయం :

ఈ శతాబ్దం తొలి ఐదు లేక ఆరు దశాబ్దాల వరకు సామ్యవాదం, శ్రేయోవాదం, ప్రజాస్వామ్య భావజాలాలు పాశ్చాత్యదేశాల మేధావివర్గాన్ని మరియు ప్రజానీకాన్ని విస్తృతంగా ప్రభావితం చేశాయి. స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం అనే రాజకీయ లక్ష్యాలను సాధించేందుకు ఈ భావజాలాలు ప్రయత్నించాయి. మార్క్సిజం, శ్రామికవర్గ నియంతృత్వాన్ని, శ్రేయోవాదుల మెజారిటీ ప్రతినిధుల పాలనను ఈ లక్ష్యాల సాధనాలుగా ప్రకటించాయి. ప్రణాళికాబద్ధ అభివృద్ధి మరియు పంపిణీల ద్వారా ఈ లక్ష్యాలు సాధించబడతాయని భావించడం జరిగింది. ఈ భావజాలాల ఆధారంగా సోవియట్ యూనియన్, తూర్పు ఐరోపా దేశాలలో ఉత్పత్తి సాధనాలను వ్యక్తిగత యాజమాన్యం నుండి తొలగించి రాజ్యపరిధిలోనికి తీసికొని రావడమేగాక, రాజ్యం ఆర్థిక ప్రణాళికా వ్యూహరచన ఆధారంగా ఆర్థికవ్యవస్థలో విస్తృతంగా జోక్యం చేసుకోవడం జరిగింది. అలాగే ఇతర పశ్చిమ ఐరోపాదేశాలలో రాజ్యం ప్రజాస్వామ్య లక్ష్యాలైన సామాజిక న్యాయం, సమాన అవకాశాలు అందరికీ కల్పించాలన్న ఉద్దేశ్యంతో ఆర్థిక వ్యవస్థలో పంపిణీ రూపంలో జోక్యం చేసుకోవడం జరిగింది. అయితే 1970 దశకానికల్లా అటు సోవియట్ యూనియన్ ఇతర తూర్పు

ఐరోపా దేశాలలోను ఆర్థికాభివృద్ధిలో గణనీయమైన తగ్గుదల స్పష్టంగా కనిపించడమేగాక పైన పేర్కొనబడిన రాజకీయ లక్ష్యాలు రాజ్యం ద్వారా సాధించబడగలవన్న వాదనపై సంశయాలు మొదలైనాయి. ఈ నేపథ్యంలో హేయక్ 1940 నుండే ఈ భావజాలాలపై, 'The Road to Serfdom' అనే గ్రంథం ద్వారా చేసిన విమర్శ, క్రమేణా ఐరోపా దేశాలలో ప్రధాన చర్చనీయాంశంగా మారినది. సాంప్రదాయక ఉదారవాద భావజాల ప్రాతిపదికలైన వ్యక్తి స్వేచ్ఛ మరియు హక్కులు, రాజ్య నియంత్రణలేని స్వేచ్ఛాయుత పెట్టుబడిదారీ పోటీ ప్రపంచములోనే ఆచరణ సాధ్యం అవుతాయని, సామ్యవాద, శ్రేయోరాజ్యాలలో ఈ స్వేచ్ఛలు పరిరక్షించబడవని చెప్పటంలోనే హేయక్ యొక్క భావాల విశిష్టత ఉంది. శ్రేయోరాజ్యం, సామ్యవాదం 1940, 50 దశకాలలో ప్రపంచవ్యాప్తంగా ప్రజానీకాన్ని, మేధావివర్గాన్ని ఆకర్షిస్తున్న కాలంలో కూడ, ఆ వ్యవస్థలపై సునిశితమైన విమర్శ చేసిన వ్యక్తి హేయక్. 1970, 80 దశకాలలో శ్రేయోవాదంపై రాజకీయ విమర్శ విస్తృత స్థాయిలో ప్రజల ఆమోదాన్ని పొందటంతో, హేయక్ ప్రతిపాదించిన భావాలపై ఇటీవల కాలంలో ప్రధాన చర్చకొనసాగుతుంది.

## 14.2 సామ్యవాదంపై విమర్శ :

1944లో వెలువడ్డ The Road to Serfdom, 1988లో ప్రచురించబడ్డ The Fatal Conceit, The Errors of Socialism అనే గ్రంథాలలో హేయక్ సామ్యవాద వ్యవస్థ అంతిమంగా నియంతృత్వం వైపు పయనించడం ఎలా అనివార్యమో వివరించడం జరిగింది. ఆధునిక సమాజాలలో ఉత్పత్తి వ్యయం, వినియోగదారుల కోర్కెలు, వస్తువుల ధరలకు సంబంధించిన సమాచారాన్ని లక్షల లేక కోట్లాది వ్యక్తులు తమంతట తాముగా ఒంటరిగా గ్రహిస్తుంటారు. ఈ కోట్లాది మంది తమ జీవిత లక్ష్యాల కనుగుణంగా సేకరించే సమాచారాన్నంతటిని రాజ్యానికి చెందిన ఒకసంస్థ సేకరించి తదనుగుణంగా మొత్తం వ్యవస్థకు సంబంధించిన స్థూల ఆర్థిక నిర్ణయాలను చేయడం అసాధ్యం. అంటే సామ్యవాద రాజ్యాలలో ప్రభుత్వ ప్రణాళికా సంస్థ మొత్తం వ్యవస్థకు సంబంధించి తీసుకునే నిర్ణయాలు, ప్రజలు ఒంటరిగా తీసుకునే నిర్ణయాలకు మధ్య అంతరం ఉండే అవకాశం ఉంది. అందువలన ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉత్పత్తి పంపిణీలకు సంబంధించిన నిర్ణయాలను ప్రభుత్వం సహేతుకంగా తీసుకోకుండా, తన అధికారం ద్వారా తీసికొనే నిర్ణయాల వలన ఉత్పత్తికారకాలు (Labour, Capital etc.,) వాటి గరిష్టవిలువల కనుగుణంగా వినియోగించకపోవడం వలన ఉత్పాదకత క్రమేణా తగ్గుతూ ఉంటుంది. అందువలన సోషలిస్ట్ వ్యవస్థలలో రాజ్యం చేసే ప్రణాళికాబద్ధ నిర్ణయాల వలన ప్రజల అవసరాలు మరింత ఎక్కువగా తీరుతాయనేది భ్రమ మాత్రమేనని హేయక్ ఉద్దేశ్యం.

## 14.3 స్వేచ్ఛాయుత సమాజంలో న్యాయం మరియు చట్టం :

స్వేచ్ఛాయుత సమాజం(free market economy) లో హేయక్ యొక్క న్యాయసిద్ధాంతం ప్రకారం నిర్దిష్ట మానవ లక్ష్యాలతో ప్రమేయం లేకుండా చట్టాలు రూపొందించబడాలి. సమాజానికి, సంస్థకి మధ్య మౌలిక వ్యత్యాసం ఉందని హేయక్ చెప్తాడు. కొద్దిమంది వ్యక్తులు తమ ఉమ్మడి లక్ష్యాలను సాధించుకునేందుకు సంస్థను ఏర్పరచుకొంటారు కావున ఆ సంస్థ నిర్వహణ సౌలభ్యం కొరకు ఆ సంస్థలో పనిచేసే వ్యక్తులు కొన్ని నియమాలను రూపొందించుకుంటారు. అయితే అభివృద్ధి చెందిన మానవ సమాజాలలో మొత్తం సమాజానికంతటికీ వర్తించే నిర్దిష్ట రాజకీయగమ్యాలు లేక లక్ష్యాలు ఏమీ ఉండవని, అయితే ప్రతివ్యక్తి స్వేచ్ఛగా తన జీవిత లక్ష్యాలను ఆయా సంస్థల ద్వారా సాధించుకొనేందుకు ప్రయత్నిస్తాడంటాడు. దీని పర్యావసానంగా మొత్తం సమాజంలో మానవ సంకల్పంతో ప్రమేయం లేకుండా ఒకక్రమబద్ధమైన వ్యవస్థ (Spontaneous Order) ఏర్పడుతుందంటాడు. ఈ స్వేచ్ఛాయుత సమాజంలో అందరూ అంగీకరించిన "సమిష్టి శ్రేయస్సు" అంటూ నిర్దిష్టంగా

ఏమీ ఉండదని, అయితే సమిష్టిశ్రేయస్సు (Common Good) అంటే ఇక్కడ ప్రతివ్యక్తి తన శ్రేయస్సును పెంపొందించుకొనేందుకు దోహదపడటమే. దానినే హేయక్ చట్టపాలన (Rule of Law) అంటాడు. ఈ నియమాలు అమూర్త స్థాయిలో నిర్వచించబడి ఒక క్రమపద్ధతిని ఏర్పరచడం ద్వారా వ్యక్తులు తమ జీవిత నిర్ణయాలను స్వేచ్ఛగా సాధించుకొనేందుకు అవకాశం ఏర్పడుతుంది. కాబట్టి హేయక్ దృష్టిలో న్యాయం అంటే నిర్దిష్ట సామాజిక శ్రేయస్సును సాధించడమో లేక సమాజంలో విభిన్నవర్గాల మధ్య సమన్వయాన్ని సాధించటమోకాదు. కేవలం న్యాయం అంటే అతని దృష్టిలో సార్వత్రిక నియమాల చట్రాన్ని (A framework of Rules or Rule of Law) రూపొందించటం ద్వారా ప్రతివ్యక్తి తన వ్యక్తిగత శ్రేయస్సును స్వతంత్రంగా పొందేందుకు వీలు కల్పించడమే. కావున స్వేచ్ఛాయుత మార్కెట్ వ్యవస్థలో కొంతమంది వ్యక్తులు పేదరికంలో ఉండటానికి కాని, లేక నిరుద్యోగులుగా ఉండటంకాని, వ్యవస్థీకృత ఫలితాలుగా పరిగణించక ఆయా వ్యక్తుల వ్యక్తిగత లక్షణాల ఫలితంగా పరిగణించబడాలంటాడు. కావున స్వేచ్ఛాయుత మార్కెట్ వ్యవస్థలో ఆస్థి, ఆదాయాలు మరియు వస్తుసేవల సహజపంపిణీ ఆ సమాజంలో అసమానతలకు దారితీసినప్పటికీ ఆ పంపిణీని సమంజసమని భావించాలని, ఎందువలనంటే ఏ వ్యక్తి లేక ప్రభుత్వ ప్రమేయం అందులో ఏ మాత్రం లేదని అది కేవలం అనేక వేల లేక లక్షల మంది వ్యక్తుల నిర్ణయాల ఫలితంగా భావించాలంటాడు.

## 14.4 శ్రేయో రాజ్యంలో సామాజిక న్యాయభావనపై విమర్శ :

స్వేచ్ఛాయుత మార్కెట్ సమాజాలలో సామాజిక న్యాయాన్ని ప్రతిభ మరియు అవసరం అనే అంశాల ఆధారంగా నిర్వచించి, ఆ న్యాయసూత్రాల ఆధారంగా ఆయా సమాజాలలోని ఆస్థి, ఆదాయం మరియు వస్తుసేవలు పంపిణీ చేయడం న్యాయమని, అనేక న్యాయసిద్ధాంతాలు ప్రతిపాదించాయి. అయితే ప్రతిభను, అవసరాన్ని మార్కెట్‌తో ప్రమేయం లేకుండా మదింపు చేయటం కష్టసాధ్యమని మరియు ఆ సమాజాలలో ఈ పంపిణీ సూత్రాలపై ఏకాభిప్రాయం లేదని హేయక్ వాదన. ఒకవేళ ప్రతిభ లేదా అవసరం ఆధారంగా పంపిణీ జరగాలన్నా ఈ ప్రతిభ లేక అవసరాన్ని ఏ ప్రాతిపదికపై అంచనా వేయాలన్న విషయంలో ఏకాభిప్రాయాన్ని సాధించడం కష్టతరమని అతని ఉద్దేశ్యం. అంతేకాక ఈ పంపిణీని చేసే బాధ్యత అంతిమంగా ప్రభుత్వానికి ఇవ్వవలసి ఉంటుందని, ప్రభుత్వం ఈ పంపిణీని తన ఇష్టానుసారంగా చేసినపుడు వ్యక్తి స్వేచ్ఛకు భంగం వాటిల్లుతుందని అతని వాదన. ప్రభుత్వం ఇలా పంపిణీ చేయడం వలన రెండు దుష్ఫలితాలుంటాయని చెప్తాడు. మొదటిది : భిన్న జీవన లక్ష్యాలను స్వేచ్ఛగా సాధించుకోవడం మార్కెట్ వ్యవస్థ ప్రధాన లక్షణంకాగా ప్రతిభ లేక అవసరం ఆధారంగా ఆర్థికవనరులను పంపిణీ చేయడం ఒకానొక న్యాయదృక్పథాన్ని, ఆ సమాజంలోని అందరిపై బలవంతంగారుద్ది ఆమోదింపచేయడం వాళ్ళ స్వేచ్ఛకు విరుద్ధం. రెండవది : ఎవరికైతే ఈ పంపిణీ బాధ్యత ఇవ్వబడుతుందో ముఖ్యంగా ప్రభుత్వాధికారులు తమ విశేష అధికారాన్ని తమ ప్రయోజనాల కనుగుణంగా దుర్వినియోగం చేసే అవకాశం ఉన్నది. ఎప్పుడైతే ప్రభుత్వం ఈ పంపిణీ బాధ్యత స్వీకరిస్తుందో, అప్పుడు ఆయా సమాజాలలోని ప్రభావవర్గాలు (Interest Groups) తమ తమ ప్రయోజనాలకనుగుణంగా సామాజిక న్యాయాన్ని నిర్వచించి ప్రభుత్వంపై ఒత్తిడిని తీసికొని రావడంద్వారా పంపిణీలో ప్రతివర్గం ఎక్కువ వాటాని పొందేందుకు ప్రయత్నిస్తుంది. ఎప్పుడైతే ప్రభుత్వంపై ప్రభావవర్గాల ఒత్తిడి పెరుగుతుందో, అప్పుడు ప్రభుత్వం విచక్షణారహిత నిర్ణయాలను తీసికోవడం తత్ఫలితంగా పాలనా సంక్షోభాన్ని (Governability Crisis) ఎదుర్కొనవలసి వస్తుంది. ఒక ప్రభావ వర్గానికి అనుకూలంగా ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయని భావించినపుడు ఇతరవర్గాలు ఏకంకావడం, చివరకు ప్రభుత్వం అస్థిరతకు దారితీయడం జరుగుతుంది. కాబట్టి హేయక్ దృష్టిలో సామాజిక న్యాయాన్ని ప్రతిభ లేదా అవసరం ఆధారంగా నిర్వచించి అందుకు అనుగుణంగా ప్రభుత్వ ఆదాయం, వస్తుసేవలను పంపిణీ చేసినట్లయితే అది చివరకు ప్రభుత్వ నిరంకుశపాలనకు, అలాగే ప్రభుత్వం అస్థిరత్వానికి దానితీసే అవకాశం ఉంది. కనుక హేయక్ దృష్టిలో ఉదారవాద సమాజాలలోని రాజ్యం,

పోటీపడుతున్న వివిధ న్యాయసూత్రాలకు దూరంగా ఉండాలి. అలాగే స్వేచ్ఛాయుత మార్కెట్ వ్యవస్థలో ప్రతివ్యక్తి స్వతంత్రంగా స్వేచ్ఛతో నిర్ణయాలు చేసేందుకు అనుకూలమైన నియమాల చట్రాన్ని (Framework of Abstract Laws) ప్రభుత్వం రూపొందించి, ఆ వ్యవస్థలో ప్రభుత్వం ఎలాంటి పంపిణీ చేయకుండా ప్రయత్నించినపుడే ఆయా సమాజాలలోని వ్యక్తుల స్వేచ్ఛ విస్తరిస్తుంది. ఈ సామాజిక న్యాయ భావనే మార్క్సియన్ సామ్యవాద భావజాలానికి మరియు శ్రేయోవాదానికి కారణం అని, ఈ భావనను వ్యవస్థీకృతం చేయడంవల్లనే పాశ్చాత్య సమాజాలలో ప్రభుత్వ నిరంకుశత్వం, అస్థిరత్వం, ఆర్థిక వ్యవస్థలో మాంద్యం, ద్రవ్యోల్బణం మొదలైన సమస్యలకు కారణమని హేయక్ వాదన.

## 14.5 ఉదారవాదం, ప్రజాస్వామ్య భావనలపై వివరణ :

ఉదారవాదం అంటే చట్టం ఎలా ఉండాలి అని చెప్పే రాజనీతి సిద్ధాంతం అని, ప్రజాస్వామ్యం అంటే చట్టాన్ని ఏ విధంగా ఏర్పరచుకోవాలని చెప్పే సిద్ధాంతం అని హేయక్ ఈ భావనల అర్థాలను స్పష్టపరిచాడు. చట్టం ముందు అందరూ సమానులే అన్నప్పుడు ఆ చట్టాన్ని రూపొందించటంలో కూడ అందరికీ సమానమైన భాగస్వామ్యం ఉండాలన్న వాదనే ఉదారవాదం మరియు ప్రజాస్వామ్య భావాల కలయికకు మూలం అంటాడు. ఉదారవాదం ప్రధానంగా ప్రభుత్వం యొక్క నియంత్రణాధికారాలను ఎలా అదుపు చేయాలన్న విషయాన్ని గూర్చి ఆలోచిస్తుంది. ఉదారవాదం ప్రభుత్వం యొక్క లక్ష్యాలను మరియు పరిధిని నిర్వచిస్తే, ఆ పరిధిలో ప్రభుత్వాన్ని ఎలా ఏర్పరచాలని చెప్పే పద్ధతే ప్రజాస్వామ్యం అని, ప్రభుత్వ లక్ష్యాలను నిర్దేశించే లక్షణం ప్రజాస్వామ్యానికి లేదని, ఉండరాదని హేయక్ వాదన. ప్రజాస్వామ్యం అంటే అత్యధిక సంఖ్యాకుల పాలన అని, అయితే అత్యధిక సంఖ్యాకుల పాలనకు, ప్రజాసార్వభౌమాధికారం అనే అర్థంలో అపరిమితమైన అధికారాలను ప్రభుత్వానికి ఇవ్వడం సరైనది కాదని హేయక్ వాదన. సమాజంలో పరస్పర భిన్నమైన వాదనలు ప్రభుత్వ నిర్ణయాలుగా ప్రకటించబడాలని పోటీపడుతున్నపుడు, ఏ వాదాన్ని అంతిమ నిర్ణయంగా తీసుకోబడాలన్నప్పుడు, ఎక్కువమంది ప్రజల మద్దత్తువున్న అభిప్రాయాలను ప్రభుత్వ నిర్ణయాలుగా ప్రకటించేందుకు మెజారిటీ పాలన "నిర్ణయ పద్ధతి"గా అంగీకరించబడిందేకాని, ప్రజాస్వామ్యమంటే నియంత్రణలేని అపరిమిత అధికారాలతో కూడిన మెజారిటీ పాలన కాదని హేయక్ వాదన. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు తమ తక్షణ అవసరాలను దృష్టిలో ఉంచుకొని కొన్ని నిర్ణయాలకు వస్తారని, ఆ నిర్ణయాలే ప్రభుత్వ నిర్ణయాలుగా ప్రకటించబడాలని కోరుకుంటారని అయితే ఆ నిర్ణయాల వలన తమ దీర్ఘకాల ప్రయోజనాలు దెబ్బతినే అవకాశం ఉన్నప్పుడు, ప్రజలు తిరిగి తమ అభిప్రాయాలను మార్చుకుంటారని హేయక్ వాదన. కావున ప్రజాస్వామ్య దేశాలలో మేధావివర్గం ప్రజల దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసినపుడు మాత్రమే ప్రజలు తమ తక్షణ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఏర్పరచుకోనే అభిప్రాయాలను అధికమించగలరు. అందుచేతనే ప్రజాస్వామ్యం, భిన్నవాదాల చర్చా వేదికగా భావించబడుతుంది. భావప్రకటనా స్వేచ్ఛ మరియు ఇతర స్వేచ్ఛలకు రాజ్యాంగ చట్టరక్షణ కల్పించటం ద్వారా అధిక సంఖ్యాకులపాలన నియంతృత్వపాలనగా మారకుండా నిరోధించవచ్చు. కనుక మెజారిటీ పాలన నియంతృత్వ పాలనగా మారకుండా వుండాలంటే అధిక సంఖ్యాకుల నిర్ణయాలను నిర్దేశించే సార్వత్రిక చట్టాలు అవసరమని, ఆ చట్టాల పరిధిలోనే మెజారిటి ప్రతినిధుల నిర్ణయాలు తీసుకోబడినపుడు వ్యక్తి స్వేచ్ఛకు రక్షణ ఉంటుందని, అలాకాక మెజారిటీతో ప్రతినిధుల పాలనను నియంత్రించే సార్వత్రిక చట్టాలు లేనపుడు ప్రజాస్వామ్యం వ్యక్తి స్వేచ్ఛతో ఘర్షణపడుతుంది. ప్రజాస్వామ్యాన్ని ఎలాంటి నియంత్రణ లేని అత్యధిక సంఖ్యాక ప్రతినిధుల పాలనగా నిర్వచిస్తే, తాను ప్రజాస్వామ్య వాదిని కాదని నిర్బంధంగా హేయక్ ప్రకటించాడు. కావున పౌరస్వేచ్ఛలు రాజ్యాధికారాలను నియంత్రించే చట్టాలపై ఆధారపడుతుంది. పౌరులు తమ శక్తి సామర్థ్యాలను తమ జీవన

లక్ష్యాలకనుగుణంగా అభివృద్ధిపరచుకోవలెనంటే, ఆ చట్టాలు పౌరహక్కుల రూపంలో నిర్వచించబడినపుడు మాత్రమే సాధ్యమవుతుంది. అందుకనే ఉదారవాద భావజాలం రాజ్యాంగవాద లక్ష్యాలను కలిగివున్నపుడు మాత్రమే ప్రజాస్వామ్యం పౌరస్వేచ్ఛలను విస్తృతపరచే ఆదర్శసాధనంగా మారుతుంది.

## 14.6 సారాంశము :

వ్యక్తి స్వేచ్ఛ, చట్టం, రాజ్యం, ప్రజాస్వామ్యం, స్వేచ్ఛాయుత విఫణి వ్యవస్థ మధ్యనున్న అంతఃసంబంధాన్ని సాంప్రదాయక ఉదారవాద భావజాల వెలుగులో, శ్రేయో, సామ్యవాద్య సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పునఃప్రకటించిన మేధావిగా హేయక్‌ను గుర్తించవచ్చు. శ్రేయోవాదం ఉదారవాద విలువలైన వ్యక్తి స్వేచ్ఛ, ఆస్థిహక్కు, విఫణి వ్యవస్థలకు ఎలా భంగం కలిగిస్తుందో వివరించాడు. అలాగే ప్రజాస్వామ్యాన్ని ఉదారవాదం, రాజ్యాంగవాదం ద్వారా నియంత్రించకపోయినట్లయితే అది శ్రేయోవాదం వైపు వెళ్ళటం ఎలా జరుగుతుందో వివరించాడు. శ్రేయోవాదానికి ప్రాతిపదిక అయిన సామాజిక న్యాయం అనే విలువకు, ఇతర ఉదారవాద విలువలైన వ్యక్తి స్వేచ్ఛ, పరిమిత రాజ్యములకు మధ్యనున్న అంతర్ వైరుధ్యాన్ని స్పష్టపరిచాడు. స్వేచ్ఛాయుత విఫణి వ్యవస్థలోనే ఉదారవాద విలువలైన స్వేచ్ఛ, హక్కులు, అవసరాలు గరిష్టస్థాయిలో ఆచరణ ద్వారా సాధ్యంకాగలవని, మరే ఇతర వ్యవస్థలో సాధ్యంకావంటాడు.

## 14.7 చదువదగిన గ్రంథాలు :


1. F.A. Hayek, The Constitution of Liberty, Routledge and Kegan Paul, London, 1960.
2. F.A. Hayek, Law, Legislation and Liberty Routledge and Kegan Paul, 1976 (Vol. I, II, III)
3. Norman P. Barry, Hayek's Social and Economic Philosophy, Macmillan, London, 1979.
4. John Gray, Hayek of liberty, Basil Blackwell, Oxford, 1984.


రచయిత : **వజ్రాల అంజిరెడ్డి**

పాఠం - 15

# మైకేల్ పుకో (Michel Foucault) (1926 - 1984)

**విషయసూచిక :**


15.0 లక్ష్యం

15.1 పరిచయం

15.2 అధికారం - మూలాలు

15.3 సూక్ష్మ స్థాయిలో అధికారం

15.4 అధికారం - క్రమశిక్షణ

15.5 అధికారంపై సార్వత్రిక సూత్రీకరణలు

15.6 సారాంశము

15.7 మాదిరి ప్రశ్నలు

15.8 చదువదగిన గ్రంథాలు


## 15.0 లక్ష్యం :

ఈ భాగం చదివిన తరువాత ఈ క్రింది విషయాలను తెలుసుకుంటారు.

ఎ) ఆధునికత అంటే ఏమిటి ? ఆధునికత ఏ భావాలను ప్రాచుర్యంలోనికి తీసుకువచ్చింది ?

బి) ఆధునికత, నూతన సామాజిక శాస్త్ర విజ్ఞానికి ఎలా దోహదపడింది ?

సి) ఆధునికత, అధికారాన్ని ఎలా రాజ్యసంస్థలలో కేంద్రీకృతం చేసింది

డి) ఆధునికతపై పుకో చేసిన విమర్శ

## 15.1 పరిచయం :

ఇరవయ్యో శతాబ్దానికి చెందిన ఫ్రెంచిదేశ మేథావి మైకేల్‌పుకో. మనోవిజ్ఞాన శాస్త్రవేత్తగా, తత్వవేత్తగా మరియు భావచారిత్రకుడుగా (Historian of Ideas) అంతర్జాతీయ గుర్తింపుని పొందిన మేథావి మైకేల్‌పుకో. అతని ప్రధాన కృషి రాజనీతి తత్వశాస్త్ర అధ్యయనంలో కానప్పటికీ, ఆధునిక పాశ్చాత్య తత్వశాస్త్రానికి మూలమైన 18వ శతాబ్దపు యూరోపియన్ జ్ఞానోదయం (European Enlightenment Thought) ప్రతిపాదించిన వివేచనా వాదాన్ని తీవ్ర విమర్శకు గురిచేయడం ద్వారా, ఆధునిక రాజనీతితత్వశాస్త్ర మౌలిక భావనలపట్ల సంశయాన్ని ఏర్పరచిన వ్యక్తి మైకేల్‌పుకో.

'ఆధునికత' అనే భావన పద్దెనిమిదో శతాబ్దం నుంచి ఐరోపాదేశాలలో వస్తున్న ప్రధాన సామాజిక మార్పులను తాత్విక స్థాయిలో వివరించేందుకు వాడబడుతూ వస్తుంది. ఈ పదం ఆధునిక యుగం అనే కాలసూచిక అర్థాన్ని కూడ తెలియజేస్తుంది. మధ్యయుగ సమాజ లక్షణాలతో ఆధునికయుగం తనను తాను వేరుచేసుకుంటుంది. పారిశ్రామిక విప్లవానికి ఆధునిక విజ్ఞానశాస్త్రం మూలం. అలాగే ఆధునిక కేంద్రీకృత సార్వభౌమాధికార రాజ్యనిర్మాణానికి మూలం కూడ వివేచనావాద ప్రేరణతో ప్రారంభమైన

ఆధునిక సామాజిక శాస్త్రాల విజ్ఞానమే. పద్దెనిమిదో శతాబ్దం నుండి ప్రారంభమైన ఈ ప్రధానమార్పులకి తాత్విక ప్రాతిపదిక వికాసయుగ తత్వవేత్తలు (Enlightenment Thinkers) ప్రచారం చేసిన జ్ఞాన సిద్ధాంతమే. మనిషి తార్కికంగా, కార్యకారణ సంబంధంతో ఆలోచించడం ద్వారా తననూ, అలాగే తన చుట్టూ ఉండే ప్రపంచాన్ని అర్ధంచేసుకోవడం సాధ్యమవుతుందని ఈ జ్ఞాన సిద్ధాంతం ప్రతిపాదిస్తుంది. మనిషి వివేచనాయుతంగా ఆలోచించడం ద్వారా ఈ విశ్వానికి సంబంధించిన వాస్తవ జ్ఞానాన్ని పొందవచ్చని, తద్వారా మానవ సమాజం మరింత నాగరిక సమాజంగా నిరంతరం పరిణామం చెందవచ్చునన్న నూతన ఆలోచనలకు, ఇదికారణం అయ్యింది. ఈ విశ్వంలో ప్రతి దాన్ని హేతువుతో, తార్కికంగా అర్ధంచేసుకోవడమేకాక, ఆ జ్ఞాన ప్రాతిపదిక ఆధారంగా సామాజిక సమస్యలను పరిష్కరించడంద్వారా, ఆ సమాజంలో క్రమబద్ధతను అలాగే నాగరిక జీవనాన్ని ఏర్పరచవచ్చునన్న ఆలోచనలకు కారణం అయ్యింది. నూతన విజ్ఞాన ఆవిష్కరణలు అవిచ్ఛిన్నంగా కొనసాగించడం ద్వారా, సామాజిక జీవనం నిరంతరం ప్రగతి (Progress) శీల పథంవైపు పయనిస్తుందని, ఈ క్రమం మొత్తం ప్రపంచమానవాళిని సన్నిహితం చేస్తుందని తద్వారా నూతన చరిత్ర ప్రారంభమయిందని భావించడం జరిగింది. ఈ భావాలు మనిషిలో విశ్వాస ప్రాతిపదిక అయిన మతంలో నమ్మకం తగ్గటానికి, వివేచనశక్తిలో, విజ్ఞాన శాస్త్రంలో అపారమైన విశ్వాసం పెరగడానికి కారణం అయ్యాయి.

అయితే ఇరవయ్యో శతాబ్దంలో సంభవించిన రెండు ప్రపంచయుద్ధాలలో జరిగిన మారణకాండ, అలాగే విజ్ఞానశాస్త్ర వికాసం మానవ వినాశనానికి ఎలాకారణం అయ్యిందో గమనించిన తరువాత, మానవ వివేచనాశక్తి మానవవికాసానికి దారితీయగలదన్న వివేచనావాదుల సిద్ధాంతాలపై విశ్వాసం సన్నగిల్లడం ప్రారంభమైనది. అలాగే ఆధునిక రాజ్యవ్యవస్థల నిర్మాణం (ఉదారవాద రాజ్యమైనా, లేదా కమ్యూనిస్టు తరహా రాజ్యమైనా) అధికారాన్ని కేంద్రీకృతం చేయడం ద్వారా మానవ స్వేచ్ఛలు ఎలా నియంత్రించబడుతున్నాయో, వివరించడం ద్వారా మానవ వివేచనాశక్తి పట్ల, విజ్ఞానం శాస్త్రం పట్ల సంశయాలు ప్రారంభమైనాయి. ఈ సంశయాలకు ఒక తాత్విక భూమికను అందించేందుకు ప్రయత్నించిన వ్యక్తే మైకేల్‌ఫూకో.

## 15.2 అధికారం - మూలాలు :

సమకాలీన పాశ్చాత్య సమాజాలలో అధికారం కేంద్రీకృతం కావడానికి, సామాజిక శాస్త్రాల అభివృద్ధి క్రమానికి మధ్య సన్నిహిత సంబంధం ఉందని చెప్తాడు ఫుకో. మనిషి తన వివేచనాశక్తి ద్వారా తన చుట్టూ ఉండే ప్రపంచానికి సంబంధించిన వాస్తవ జ్ఞానాన్ని పొందవచ్చునన్న భావనే, సామాజిక శాస్త్రాల అభివృద్ధికి కారణం అయ్యిందని ఫుకో అభిప్రాయం. ఈ జ్ఞాన ప్రాతిపదికన, సామాజిక జీవనాన్ని క్రమబద్దీకరించవచ్చునన్న అభిప్రాయమే, ఆధునిక రాజ్యం ఒక శక్తివంతమైన సంస్థగా రూపొందడానికి కారణం అయ్యిందని ఫుకో ప్రతిపాదిస్తాడు. ఎందువలనంటే సామాజిక జీవనాన్ని క్రమబద్దీకరించగలశక్తి, రాజ్యానికి మాత్రమే ఉంటుందని, కాబట్టి సామాజిక జీవనంపై రాజ్యాధికార పెత్తనానికి సహేతుకలని తద్వారా కల్పించడం జరిగింది. కాబట్టి రాజ్యాధికారాన్ని ప్రశ్నించడమంటే సామాజిక శాస్త్ర విజ్ఞాన సత్యాలను ప్రశ్నించడం అవుతుంది. ఫుకో సామాజికశాస్త్రాలు ప్రతిపాదించే 'జ్ఞాన సత్యాలను' ప్రశ్నించడం ద్వారా, ఆధునిక రాజ్య అధికారాన్ని, అది నిర్వర్తించే సామాజిక పాత్రను నిశిత విమర్శకు గురిచేశాడు.

## 15.3 సూక్ష్మస్థాయిలో అధికారం :

సామాజిక జీవనాన్ని స్థూలస్థాయిలో క్రమబద్దీకరించేందుకు, రాజ్యస్థాయిలో అధికారం కేంద్రీకృతం అయితే, వ్యక్తి దైనందిక జీవనాన్ని నియంత్రించే క్రమంలో విద్యాలయాలు, వైద్యశాలలు మొదలైన సంస్థలు సూక్ష్మస్థాయిలో అధికారాన్ని కలిగి ఉండటం ద్వారా, ఈ సంస్థల అధికారం అంతమంగా రాజ్యాధికారం మరింత సాధికారితను పొందటానికి ఆధారం అవుతుంది. ఉదాహరణకు ఫ్రాన్స్ దేశంలో 18వ శతాబ్దం మధ్య భాగం నుండి 19వ శతాబ్దం మధ్యవరకు నేరనియంత్రణకు సంబంధించిన

సంస్కరణలను పరిశీలిస్తే పైన పేర్కొన్న విషయం అర్ధమవుతుంది. నేరస్తులను హింసించడం, ఉరితీయడం వంటి పద్దతులకు స్వస్తిచెప్పి జైళ్ళలో నిర్బంధించడం, వాళ్ళపై నిఘాను పెంచడం ద్వారా నేరనియంత్రణను సూక్ష్మస్థాయిలో ఎలా నిర్వహించవచ్చునన్న విషయాలను నేరశాస్త్రం, (Criminology) మనోవిజ్ఞాన శాస్త్రం మొదలైన శాస్త్రాల ద్వారా వివరించడం జరుగుతుంది. కావున నేరశాస్త్రం, న్యాయశాస్త్రం (Jurisprudence), సామాజిక పాలనా శాస్త్రం (Social Administration) మొదలైన శాస్త్రాలు, ఎలా ఆధునిక రాజ్యవ్యవస్థలో అంతర్భాగం అయ్యాయో వివరించడంద్వారా, ఈ శాస్త్రాల విజ్ఞానం, మానవ వికాసానికి లేదా విముక్తికి సాధనాలుగాకాక, వారిని నియంత్రించడానికి ఇవి ఆధారం అవుతున్నాయని ఫూకో వాదిస్తాడు. అందుకే విజ్ఞానం, అధికారం గత రెండు శతాబ్దాలుగా కలసిపోయినంతగా, మానవచరిత్రలో అవి అంతకు ముందెన్నడూ కలవలేదని, కావున ఏ అధికారం ఏ రూపాలలో వ్యవస్థీకృతమైనప్పటికీ, ఆ అధికారాన్ని ఏ శాస్త్రాల ప్రాతిపదికన సమర్ధించబడినప్పటికీ, ఈ రెండింటిని ప్రశ్నించడం ద్వారానే, మనిషి ఈ అధికార బంధనాలనుండి విముక్తికాగలడని ఫూకో భావిస్తాడు.

## 15.4 అధికారం - క్రమశిక్షణ :

ఆధునిక సమాజాలలో విద్యాబోధనా పద్ధతులు, బోధనాంశాలు రెండూ కూడ, అధికారిత సంబంధాలను యధావిధిగా కొనసాగించే లక్ష్యానికనుగుణంగా నిర్వహించబడుతున్నాయేతప్ప, వాటిని ప్రశ్నించే లక్షణం, ఈ బోధనా పద్ధతులకు లేవని ఫూకో వాదిస్తాడు. ఆధునిక విజ్ఞానశాస్త్రాలు ప్రతిపాదించే జ్ఞానం, సార్వత్రికతను కలిగి ఉంటుందని, అది స్థల, కాలాలతో ప్రమేయం లేకుండా అందరికి వర్తించబడుతుందనే వాదనను కూడ ఫుకో ప్రశ్నిస్తాడు. జ్ఞానాన్ని ఆపాదించే ప్రమాణాలు కూడ సాక్షికమైనవేతప్ప, అవి నిరపేక్ష సత్యాలు కావని ఫుకో వాదిస్తాడు. ఈ ఆధునిక శాస్త్రవిజ్ఞానం మనిషిని కార్యశీలనత నుండి ఉదాసీనుడుగా మారుస్తుందని, మనిషిని స్వీయనియంత్రణకు గురిచేస్తుందని, ఫుకో వాదిస్తాడు.

## 15.5. అధికారంపై సార్వత్రిక సూత్రీకరణలు :

రాజరిక రాజ్యవ్యవస్థలలో అధికారం అనేది వ్యక్తి లేదా కొద్దిమంది వ్యక్తులలో కేంద్రీకృతమై ఉండేదని, కాని ఆధునిక రాజ్యాలలో అధికారం ఏ ఒక వ్యక్తి లేదా వ్యక్తుల చేతిలో కేంద్రీకృతం కాక, వివిధ వ్యక్తుల, సంస్థల మధ్య పంపిణీ కాబడి ఉంటుందని ఫుకో చెప్తాడు. ఈ అధికారం అనేది వివిధ సంస్థల నిర్మాణ, నిర్వహణ నియమాల రూపంలో దాగి వుంటుందని, అలాగే చట్టరూపంలోను, సంస్థల విధుల రూపంలోను అది వ్యక్తంకాబడుతుందని ఫుకో భావిస్తాడు. ఈ సంస్థల అధికారానికి, మానవ వివేచన ద్వారా ప్రతిపాదించబడిన శాస్త్రసత్యాల ప్రామాణికత ఆధారంగా, సమర్ధించబడటం జరుగుతుంది.

ప్రజాస్వామ్య రాజ్యాలలో అధికారం అంతిమంగా ప్రజలవద్దనే ఉంటుందనేది కూడ అవాస్తవమైనదని ఫుకో వాదిస్తాడు. రాజకీయ నాయకులు, వ్యాపార, పారిశ్రామిక సంస్థలు, ప్రసారసాధనాలు ప్రజల తరుపున, ప్రజలపేరుతో ప్రజలపైనే తమ అధికారాన్ని చెలాయిస్తున్నారని ఫుకో చెప్తాడు. అయితే మార్క్సిస్ సిద్ధాంత కర్తలు ప్రతిపాదనలకు భిన్నంగా అధికారం ఆయా సమాజాలలో అసమానంగా పంపిణీ కాబడినప్పటికీ, అన్ని సందర్భాలలోను ఆర్ధికంగా సంపన్న వర్గమే, ఇతర బలహీన వర్గాలపై ఆధిపత్యం చేస్తుందనేది కూడ అవాస్తవమని ఫుకో వాదిస్తాడు. కొన్ని సందర్భాలలో బలహీనవర్గాలు కూడ తమ సంఖ్యాధిక్యత మరియు ఇతర కారణాలవలన సంపన్న వర్గాలపై ఆధిపత్యం చేసే అవకాశం లేకపోలేదని వాదిస్తాడు.

అలాగే ఒక సమాజంలో ఆధిపత్య స్థానంలో వున్న అభిప్రాయాలు, సామాజిక రాజకీయ విలువలు, రాజనీతి సిద్ధాంతాలు అన్నీ కూడ, ఆ సమాజంలోని వివిధ వర్గాల, సంస్థల మధ్యనున్న అధికార సంబంధాలను వ్యక్తీకరించే భావాలుగానో, లేదా ఆదర్శీకరించే సిద్ధాంతాలుగానో చెలామణి అవుతుంటాయని ఫుకో వాదిస్తాడు. ఈ క్రమంలో ప్రజలు స్వతంత్ర ఆలోచనా శక్తిని

కోల్పోతారని, ఆధిపత్య భావజాలమే, ప్రజల ప్రాపంచిక దృక్పథంగా చెలామణి అవుతూ ఉంటుందని చెప్తాడు.

ఆధునిక రాజ్యం, ప్రజలను ఒక ఉత్పాదిక వనరుగా (Productive Resource) పరిగణిస్తుందని, కావున ప్రజల లక్షణాలను వర్గీకరించి, దానికి సంబంధించిన జ్ఞానాన్ని సమకూర్చుకునేందుకు నిరంతరం ప్రయత్నిస్తుందని, ఫుకో చెప్తాడు. ఈ జ్ఞాన ప్రాతిపదికనే, ఆధునిక రాజ్యం వివిధ విధానాలను, రూపొందించి అమలుచేస్తుందని, తద్వారా ప్రజాజీవనంపై, రాజ్య నిఘా మరియు నియంత్రణ అనివార్యాలకు విస్తరించడం జరిగిందని, ఈ మార్పులు ప్రజలను అస్వతంత్రులను చేస్తుందని ఫుకో వాదిస్తాడు.

## 15.6 సారాంశము :

18వ శతాబ్దం నుండి ప్రారంభమైన వికాసయుగం ప్రతిపాదించిన నూతన విజ్ఞానం, ఆధునిక పెట్టుబడీదారి సామాజిక సంబంధాలు ఏర్పడటానికి, అలాగే ప్రజాస్వామ్యరాజ్యం ఏర్పడటానికి దోహదం చేసింది. ఈ నూతన విజ్ఞానం మానవజీవనానికి సంబంధించి నూతన ప్రమాణాలను ప్రతిపాదించింది. ఈ ప్రమాణాలకు సార్వత్రికతను ఆపాదించడం ద్వారా, ఈ ప్రమాణాలకు భిన్నమైన సామాజిక జీవనాన్ని, సంబంధాలను అహేతుకమైనవని ప్రకటించి, వాటిని తన ప్రమాణాల వెలుగులో సంస్కరించేందుకు ప్రయత్నించింది. ఆధునికత నుండి ఉద్భవించిన సామాజికశాస్త్రాల సత్యప్రామాణికతను, అది ఆదర్శీకరించిన కేంద్రీకృత రాజ్యనమూనాను, అలాగే చరిత్రక్రమం వివేచన ఆధారంగా పురోగమిస్తుందనే వాదనను ప్రశ్నించిన ఇరవయ్యోవ శతాబ్ది మేథావే మైకేల్‌ఫుకో. ఫుకో, మరికొందరు ఆధునికతపై చేసిన విమర్శను నేడు ఆధునికానంతరవాదంగా పిలవబడుతుంది. వికాసయుగం నుండి సామాజికశాస్త్రాలు నిర్వర్తించిన పాత్ర పట్ల, అనేక సందేహాలను ఫుకో వెలిబుచ్చాడు. ఈ విజ్ఞానం ప్రజల్ని తాను ప్రవచించిన ప్రమాణాల పరిధిలో నియంత్రించడానికి దోహదపడిందని ఫుకో వాదిస్తాడు. ముఖ్యంగా వైద్యశాస్త్రం, నేరపరిశీలనాశాస్త్రం, సామాజికశాస్త్రం అన్నీ కూడా కేంద్రీకృత సార్వభౌమాధికార రాజ్యవ్యవస్థలు మరింత బలోపేతం కావడానికి దోహదపడ్డాయి. అధికారం కేంద్రీకృతం కావడానికి, దానిని ఆదర్శీకరించడానికి, ఈ శాస్త్రాల జ్ఞానం తోడ్పడింది. ఈ శాస్త్రాల విజ్ఞానాన్ని ప్రశ్నించడం ద్వారా, అధికార సంబంధాల మూలాలను మరింత లోతుగా అర్థం చేసుకోవడానికి, ఫుకో రచనలు తోడ్పడతాయని నిస్సందేహంగా చెప్పవచ్చు.

## 15.7 మాదిరి ప్రశ్నలు :

1) ఆధునికతపై ఫుకో చేసిన విమర్శను వివరింపుము.
2) ఆధునిక సమాజాలలో అధికార సంబంధాల మూలాలను ఫుకో ఎలా విశ్లేషించాడు.

## 15.8 చదువదగిన గ్రంథాలు :


1) Michel Foucault : Madness and Civilisation - A History of Insanity in the Age of Reason
2) Michel Foucault : The order of Things : An Archaeology of the Human Sciences
3) Michel Foucault : Power / Knowledge : Selected Interviews and other writings.
4) Geoff Danaher, Tony Schirato, Jen Webb : Understanding Foucault.

పాఠం - 16

# మేరీ ఉల్‌స్టోన్ క్రాఫ్ట్ (1759 - 1797)

**విషయసూచిక :**


16.0. లక్ష్యం

16.1 పరిచయం

16.2. జీవితం, కృషి

16.2.1 ప్రభావం మరియు రచనలు

16.3. తొలి మహిళా స్త్రీవాది

16.4. ప్రాథమిక భావనలు

16.4.1 స్త్రీ స్వభావం - హోదా

16.4.2 సమాజంలో స్త్రీల హోదా తక్కువగా ఉండటానికి గల కారణాలు

16.5. స్త్రీలు - విద్య, ఉపాధి అవకాశాలు

16.6. సమానత్వము - స్త్రీ స్వేచ్ఛ, హక్కులు

16.7. స్త్రీ, పురుష సమానత్వము - సామాజిక ప్రయోజనం

16.8. విమర్శ

16.9. మేరీ ఉల్‌స్టోన్ క్రాఫ్ట్ భావాల ఉపయుక్తత

16.10. సారాంశం

16.11. మాదిరి ప్రశ్నలు

16.12. చదువదగిన గ్రంథాలు


## 16.0. లక్ష్యం :

ప్రపంచంలో వివిధ కాలాలలోని, వివిధ సమాజాలలోని స్త్రీలు తమ సమస్యల గురించి ఎలాంటి ఆలోచనలు చేశారో, పురుషాధిక్య విలువలను ఏవిధంగా ప్రశ్నించారో, వాటిపై ఏవిధంగా పోరాటాలు జరిపారో పరిశీలించినట్లయితే స్త్రీవాద దృక్పథం ఒక బలమైనవాదంగా ఏవిధంగా రూపొందిందో తెలుసుకోవచ్చు. స్త్రీల అణచివేత నుండి స్త్రీవాదం ఆవిర్భవించిందనేది చారిత్రిక సత్యం. ఆధునిక కాలంలో స్త్రీవాద దృక్పధాన్ని వివరించిన మొదటితరం స్త్రీ వాదులలో తొలివ్యక్తి మేరీఉల్‌స్టోన్ క్రాఫ్ట్. రాజనీతి తత్వవిచారంలో స్త్రీవాద దృక్పధంపై మేరిఉల్‌స్టోన్ క్రాఫ్ట్ భావాలు ఎంతో విశిష్టతను సంతరించుకున్నాయి. ఎటువంటి హక్కులూ లేకుండా, స్త్రీలు తక్కువవారిగానే సృష్టించబడ్డారని నమ్మేకాలంలో వారి వెనుకబాటుతనానికి, అణచివేతకు కారణాలను విశ్లేషించి, వారికీ హక్కులున్నాయని తార్కికంగా నిరూపించడంలో ఆమె వెలువరించిన భావాల్ని తెలుసుకోవడానికి ఈ భాగం దోహదం చేస్తుంది.

## 16.1. పరిచయం :

స్త్రీ వాదులలో మేరీఉల్‌స్టోన్ క్రాఫ్ట్‌కు ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. రాజనీతి తత్వవేత్తలలో ప్లేటోని తొలిస్త్రీవాదిగా పరిగణించినప్పటికీ మహిళా తత్వవేత్తలలో తొలిస్త్రీవాది అని స్త్రీవాదులంతా అంగీకరించినది మేరీఉల్‌స్టోన్ క్రాఫ్టనే. రాజనీతి

తత్వవిచారంలో మేరీఊల్‌స్టోన్ క్రాఫ్ట్‌ను ఒక గొప్ప స్త్రీవాదిగా, ఉదారవాదిగా, ప్రజాస్వామికవాదిగా పరిగణించవచ్చు. పురుషాధిక్య, వర్గ సమాజంలోని ఆమె వ్యక్తిగత అనుభవాలే ఆమె ఆలోచనలకు పదును పెట్టాయి. మానవ హక్కుల ఉద్యమాలని సమర్థిస్తూ మానవ హక్కులనేవి పురుషులకే గాదు, స్త్రీలకు కూడా ఉండాలని వాదించింది. ఆధునిక స్త్రీవాదానికి భాష్యం చెప్పిన మేరీఊల్‌స్టోన్ క్రాఫ్ట్ భావాలను స్త్రీవాదులంతా ఉదారవాద స్త్రీవాదంగా ముద్రవేసినప్పటికీ రెండున్నర శతాబ్దాల క్రిందట సమాజంలో ఆమె భావాలు తీవ్రవాద భావాలుగానే పరిగణించబడ్డాయి. మేరీఊల్‌స్టోన్ క్రాఫ్ట్ భావాలకి తాజాదనం ఉండటం వలన సమకాలీన ప్రపంచంలో కూడా ఆమోదయోగ్యం అయినవి. ఆమె ప్రతిపాదనల పట్ల, ఆమె జీవితచరిత్ర పట్ల ఆసక్తి కొనసాగుతూనే వుంది. అందుకనే మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ ఇపుడు మళ్ళీ పఠనీయం అయింది.

ఆయా దేశకాల పరిస్థితులలో అమలులో ఉన్న సామాజిక నియమాలకు, సాంప్రదాయాలకు స్త్రీలు కట్టుబడి ఉండకపోతే ఎలాంటి పరిస్థితులను, విమర్శలను ఎదుర్కోవలసి వస్తుందో, నిర్లక్ష్యానికి గురికావలసి వస్తుందో తెలుసుకోవటానికి మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ జీవితం ఒక గొప్ప ఉదాహరణ. మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ విస్తృతంగా రచనలు చేసినప్పటికి ఇతర తత్వవేత్తలకు వచ్చినంత గుర్తింపు ఆమెకు ఇటీవలి కాలంవరకు లభించలేదు. 1959 వరకు అంటే దాదాపు రెండు శతాబ్దాల వరకూ స్త్రీవాదులు కూడా ఆమె మేధస్సును గుర్తించలేకపోయారు. ఇందుకు ప్రధానంగా రెండు కారణాలున్నట్లు భావించవచ్చు. మొదటిది సాంప్రదాయ విరుద్ధమైన ఆమెవ్యక్తిగత జీవితం సాంప్రదాయ విరుద్ధంగా ఆమె తన జీవితంలో వివాహం కాకుండానే ఇరువురు పురుషులతో సంబంధాన్ని కొనసాగించి వారి ద్వారా సంతానాన్ని కనడం వలన సమకాలీన సమాజం ఆమెను స్వీకరించలేకపోయింది. రెండవది స్త్రీవాద భావాలను విశదీకరించడంలో ఆమె మొదటి మహిళకావడం. అప్పట్లో రచనా వ్యాసంగంలో స్త్రీలకు ప్రవేశంలేదు. మహిళా తత్వవేత్తలకు గుర్తింపు, ఆదరణ లభించేవి కావు. ఈ రెండు కారణాల వల్ల ఆమె ఆలోచనలకు ఇప్పటివరకు సరైన గుర్తింపు, ప్రచారము లభించలేదని భావించవచ్చు.

## 16.2 జీవితం, కృషి :

మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ లండన్‌లోని ఒక చిన్న వ్యవసాయ క్షేత్రంలో పనిచేసే మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ దంపతులకి 1759వ సం॥లో ఏప్రియల్ 27న జన్మించింది. అధిక సంతానం, నిత్యదరిద్రంతో పోరాటం చేసే మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ కుటుంబం ఎక్కడా స్థిరంగా ఉండేది కాదు. ఒక వ్యవసాయ క్షేత్రం నుండి మరొక క్షేత్రానికి మారుతూ ఉండేది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ తండ్రి చూపించే కోపాన్ని, అసహనాన్ని ఆమె తల్లి ఎంతో ఓర్పుతో భరించేది. పురుషాహంకారాన్ని ప్రదర్శించే తండ్రి కారణంగా ఆమె ఏ విధమైన ప్రేమానురాగాలకి నోచుకోలేకపోయింది. నిరుపేద కుటుంబంలో జన్మించిన మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ తనకి ప్రపంచజ్ఞానం కలగడానికి పేదరికం కూడా ఒక విధంగా సహాయపడిందంటుంది. ఆర్థికంగా మెరుగైన కుటుంబాలలో ఆడపిల్లల్ని సోమరులుగా పెంచుతారని, బాహ్యప్రపంచంలో సంబంధం పెట్టుకోనివ్వరని ఆమె అభిప్రాయం.

ఆర్థిక స్వాతంత్ర్యం కోసం 1778లో ఇల్లువదలి, ఉద్యోగాన్వేషణకై బయలుదేరింది. పెద్దగా విద్యార్హతలు లేనికారణంగా మేరికి వచ్చిన ఉద్యోగం ఒక వృద్ధవితంతువుకి తోడుగా ఉండటం. తల్లి జబ్బుపడిన కారణంచేత ఆమెకు సేవచేయడానికై 1781లో తిరిగి ఇల్లు చేరింది. 1782లో తల్లి మరణం తరువాత స్నేహితురాలైన ఫానీబ్లడ్‌తో కలసి జీవించడానికై వెళ్ళింది. 1784లో మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ తన స్నేహితురాలైన ఫానీబ్లడ్‌తోనూ తన చెల్లెళ్ళతోనూ కలసి మొదట ఇలింగ్టన్ వద్ద తరువాత న్యూయింగ్‌టన్ గ్రీన్ అనేచోట ఒకచిన్న పాఠశాల స్థాపించింది. ఆ ప్రదేశంలోనే ఆమెకు అనేకమంది ఉదారవాద మేధావులతోను, అసమ్మతి వాదులతోను పరిచయం ఏర్పడింది. 1785లో ఫానీబ్లడ్ మరణంతో న్యూయింగ్‌టన్ పాఠశాల మూతపడింది. ఆర్థిక బాధలు తట్టుకోవటానికి 1786లో ఐర్ల్యాండ్‌లో కింగ్స్‌బరో పిల్లలకి 'గవర్నెస్'గా చేరింది. ఈ అనుభవం కూడా ఆమె ఆలోచనా పరిధిని విస్తరింపచేసింది. ధనిక స్త్రీల జీవనశైలిని దగ్గరగా గమనించిన ఆమెవారి స్వార్థాన్ని, విలువలు లేనివారి అభిరుచినీ

విమర్శించింది. వారి ద్వారా స్త్రీలు ఎలా ఉండకూడదో అర్థం చేసుకుంది.

1792లో మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ ఫ్రెంచి విప్లవ చరిత్ర రాయాలనే ఉద్దేశ్యంతో, విప్లవాన్ని అతి సమీపం నుండి గమనించడానికై ఫ్రాన్స్ వెళ్లింది. అప్పటికే ఫ్రాన్స్‌లో రాజకీయ సంక్షోభం తీవ్రదశలో ఉంది. ఫ్రెంచి విప్లవాన్ని, ఆనాటి రాజకీయ పరిణామాలను అతిదగ్గర నుండి గమనించిన మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ ఆలోచనా పరిధి మరింత విస్తృతమయింది. ఫ్రాన్స్‌లోనే మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్‌కి 1793లో గిల్బర్ట్‌ఇమ్లే అనే అమెరికన్‌తో పరిచయం ఏర్పడి, ప్రేమగా మారి అతనితో సంబంధం ద్వారా వివాహానికి ముందే ఒక బిడ్డకు తల్లయింది. అతనితో వచ్చిన విభేదాల కారణంగా విడిపోయి, కుమార్తె ఫానీతో కలసి 1795 సం॥లో తిరిగి లండన్ చేరుకుంది. 1797 మార్చి 29వ తేదీన గాడ్విన్ అనే తత్వవేత్తను వివాహమాడి, మేరీ అనే మరో కుమార్తెకు జన్మనిచ్చింది. మేరీకి జన్మనిచ్చిన కొద్దిరోజులకే అంటే 1797 సెప్టెంబర్ 10వ తేదిన మరణించింది. 38 సం॥లు మాత్రమే జీవించిన మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ జీవితం నిరంతరం పోరాటమే అయినప్పటికీ, తన మేధాశక్తిని అభివృద్ధి చేసుకుని తన రచనల ద్వారా స్త్రీవాద సాహిత్యంలో చెరగని ముద్రవేసింది.

## 16.2.1 మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్‌పై ప్రభావం మరియు ఆమె రచనలు :

డాక్టర్ ప్రయిస్, కాథరీన్ మెకాలే, విలియం గాడ్విన్ వంటి తత్వవేత్తల భావాలు, రచనలు మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ పై విశేషమైన ప్రభావాన్ని చూపాయి. ఆనాటి ఉదారవాదులతోను, తీవ్రవాద మేదావులతోను జరిపిన చర్చలు మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ ఆలోచనలకు పదునుపెట్టి సత్తాగల రచయిత్రిగా ఎదగటానికి దోహదం చేశాయి. ఆనాటి ఉదారవాదులు, తీవ్రవాద మేధావులంతా పార్లమెంటరీ సంస్కరణలను, అమెరికన్, ఫ్రెంచి విప్లవాలను సమర్థించేవారు. వీరంతా లాక్ సహజహక్కుల సిద్ధాంతమును ఉపయోగిస్తూ మానవులందరికీ పౌర, రాజకీయ హక్కులు సమానంగా లభించాలని వాదించారు. పూర్తి సమానత్వమును సాధించుటకు ఉన్నత వర్గాల ప్రత్యేక సదుపాయాలను రద్దుచేయాలని భావించారు. వీరి ప్రభావంచేత మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ సమానత్వమనే భావనను స్త్రీలకు కూడా ప్రతిపాదించింది.

ప్రయిస్ ఫ్రెంచి నేషనల్ అసెంబ్లీని అభినందిస్తూ, ఫ్రాన్స్‌లో వచ్చిన పౌర, రాజకీయ, మత, సామాజిక స్వేచ్ఛలపట్ల సంతోషం ప్రకటించాడు. డాక్టర్ ప్రయిస్ సాంప్రదాయవాదులకు నచ్చని ఎన్నో విషయాలను “ఆన్ ది లవ్ ఆఫ్ కంట్రీ” అనే ఉపన్యాసంలో ప్రస్తావించాడు. ఈ ఉపన్యాసాన్ని విని చాలామంది సాంప్రదాయవాదులు తీవ్రంగా స్పందించారు. ఎడ్మండ్ బర్క్ రచించిన “రిఫ్లెక్షన్స్ ఆన్ ది ఫ్రెంచ్ రివెల్యూషన్” (1790) గ్రంథం ఈ కోవలో ముఖ్యమైనది. మానవ హక్కులు నెలకొనడం బర్క్ వంటి సాంప్రదాయవాదులకు నచ్చలేదు. బర్క్ తన గ్రంథంలో ఫ్రాన్స్‌లోని తీవ్రవాదులు కులీన వర్గాలపై చేస్తున్న దాడిని ఖండించాడు. బర్క్ “రిఫ్లెక్షన్స్ ఆన్ ది ఫ్రెంచి రివెల్యూషన్” కి సమాధానంగా ఆమె “విండికేషన్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ మ్యాన్” అనే పుస్తకాన్ని రచించింది.

కాథరిన్ మెకాలే స్త్రీల చదువులపై రాసిన పుస్తకాన్ని సమీక్ష చేసిన మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ ఆ పుస్తకాన్ని ఎంతో మెచ్చుకుంది. మెకాలే రచించిన “లెటర్స్ ఆన్ ఎడ్యుకేషన్” డాక్టర్ ప్రయిస్ “ఆన్ ది లవ్ ఆఫ్ కంట్రీ” అనే ఉపన్యాసం వంటివి. “విండికేషన్ . .” వ్రాయడానికి నేపధ్యాన్ని సమకూర్చాయి. “విండికేషన్ ఆఫ్ ది రైట్స్ ఆప్ మ్యాన్” అనే పుస్తకంలోనే “విండికేషన్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ విమెన్” అనే గొప్ప స్త్రీవాద పుస్తకానికి బీజాలు పడ్డాయి. మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ రచనల ప్రచురణకర్త అయిన జోసఫ్ జాన్సన్ యొక్క పత్రిక ‘ఎనలిటికల్ రివ్యూ’ కోసం అనువాదకురాలిగా పనిచేయడం, పుస్తక సమీక్షలు చేయడం, ఆనాటిరాజకీయ, సామాజిక, సాంస్కృతికాంశాలను నిశితంగా అధ్యయనం చేయడానికి, విమర్శనాత్మక దృష్టిని పెంచుకోవడానికి ఆమెకు దోహదపడ్డాయి. మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ అనేక రచనలు చేసింది. **ఆమె రచనలలో ప్రధానమైనవి.**

1. థాట్స్ ఆన్ ది ఎడ్యుకేషన్ ఆఫ్ డాటర్స్ ( 1787)
   Thoughts on the Education of Daughters
2. మేరి : ఎ ఫిక్షన్ (1788)
   Mary : A Fiction
3. ఎ విండికేషన్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ మెన్ (1790)
   A vindication of the Rights of Men
4. ఎ విండికేషన్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ విమెన్ (1792)
   A vindication of the Rights of Women
5. ఎన్ హిస్టారికల్ అండ్ మోరల్ వ్యూ ఆఫ్ ది ఆరిజన్ అండ్ ప్రోగ్రెస్ ఆఫ్ ది ఫ్రెంచ్ రివల్యూషన్. అండ్ ది ఎఫెక్ట్ ఇట్ హాజ్ ప్రొడ్యూస్డ్ ఇన్ యూరప్ (1794)
   An historical & Moral view of the origin and progress of the French Revolution and the effect it has produced in Europe.
6. లెటర్స్ రిటన్ డ్యూరింగ్ ఎ షార్ట్ రెసిడెన్స్ ఇన్ స్వీడన్, నార్వే అండ్ డెన్మార్క్ (1796)
   Letters return during a short residence in Sweden, Norway and Denmark.
7. ది రాంగ్స్ ఆఫ్ విమెన్ అర్ మారియ (1797)
   The wrongs of women are Maria

## 16.3. తొలిమహిళా స్త్రీవాది :

తల్లిదండ్రుల అదుపు, అధికారాలపై తిరుగుబాటుగా మొదలైన స్వాతంత్ర్యకాంక్ష, సమస్తమైన అధికారాలను నిరసించే స్థాయికి అధిగమించింది. ఆర్థిక స్వాతంత్ర్యం కోసం, అబద్రతా భావం నుంచి విముక్తి కోసం ఆమె పడిన ఆవేదన, చేసిన పోరాటం వ్యక్తిగా తన గురించి మాత్రమేకాక స్త్రీలందరి విముక్తికోసం ఆరాటపడేలా ప్రేరేపించాయి. ఆ ప్రేరణతోనే ఆమె రచించిన "విండికేషన్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ విమెన్" స్త్రీవాద సాహిత్యంపై చెరగని ముద్రవేసింది.

"ఎ విండికేషన్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ విమెన్" సిద్ధాంతపరమైన, స్త్రీ విముక్తి గురించిన మొట్టమొదటి వాదన. ఆనాటి సమాజంలో స్త్రీల స్థానాన్ని, వారి సాంప్రదాయ పాత్రను ప్రశ్నిస్తూ చేసిన వాదనలు, ఖండనలు స్త్రీలకు ఇవ్వవలసిన హక్కులను గురించి చేసిన ప్రతిపాదనలు, సమర్థనలు "విండికేషన్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ విమెన్" నిండా అనేకం ఉన్నాయి. స్త్రీ విముక్తికై, స్త్రీల హక్కులకై చేయబడిన తొలి స్త్రీవాద విజ్ఞప్తిగా మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ "విండికేషన్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ విమెన్"ని పరిగణించవచ్చు. దీనిలో మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ స్త్రీలకు ఎటువంటి జీవన విధానం, విద్యావిధానం అవసరమో, పిల్లల సంరక్షణా బాధ్యతలను వారు ఏ విధంగా నిర్వహించాలో తెలియచెప్తుంది. మానవ హక్కుల ఉద్యమాలు బ్రిటీష్ పార్లమెంటుని వణికిస్తున్న సమయంలో మానవ హక్కులనేది పురుషులకే కాదు స్త్రీలకు కూడా అవసరమే అని వాదిస్తుంది. 'మానవ' అనే పదంలో స్త్రీలు కూడా ఉన్నారని, అందుకనే పురుషులతోపాటు సమానంగా స్త్రీలకు కూడా అన్ని హక్కులూ లభించాలని వాదిస్తుంది. పురుషులతో సమానంగా స్త్రీలకు కూడా పౌర, రాజకీయ హక్కులు ఇవ్వడం వల్ల జరిగే సామాజిక ప్రయోజనం గురించి ఈ పుస్తకంలో వివరిస్తుంది. అందుకనే స్త్రీవాద సాహిత్యంలో మొట్టమొదట చదువవలసిన గ్రంథంగా, 'విండికేషన్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ విమెన్'ను తొలి మహిళా స్త్రీవాదిగా మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్‌ను పరిగణించవచ్చు.

## 16.4. ప్రాథమిక భావనలు :

సాంప్రదాయ వాదియైన బర్క్‌కి సమాధానంగా "ఎ విండికేషన్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ మెన్" పుస్తకం రచించిన ఆమె "ఎ విండికేషన్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ విమెన్" అనే పుస్తకంలో ఫ్రెంచి విప్లవానికి ప్రేరణ ఇచ్చిన రూసో స్త్రీలపై వ్యక్తం చేసిన భావాలను విమర్శించింది. సమకాలీన సమాజంలో ఉన్న సాంఘీక, ఆర్థిక అసమానతలను దోపిడీయుత వ్యవస్థలను, అణచివేతను తీవ్రంగా నిరసించింది. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం అనే ప్రాథమిక భావనలలోనే స్త్రీ విముక్తికై, స్త్రీల హక్కులకై ఆమె చేసిన విజ్ఞప్తులకు పునాదులు వేయబడ్డాయి. లైంగిక సమానత్వం వలన చేకూరే సామాజిక ప్రయోజనం వివరించే సందర్భంలో ఆమె లాక్ సహజహక్కుల సిద్ధాంతాన్ని ఉపయోగితావాద భావనలతో జోడించింది. మానవులంతా స్వేచ్ఛగా జన్మించినపుడు, అందరికీ హక్కులనేవి సహజంగా ఉన్నప్పుడు, లింగ ప్రాతిపదికపై స్త్రీలకు హక్కులను, స్వేచ్ఛను అనుభవించడం నుండి దూరం చేయడం అన్యాయం అంది మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్. మానవజాతిలో సగభాగమైన స్త్రీలకు, సహజంగా లభించే హక్కులలో పురుషులతో సమాన భాగస్వామ్యం కల్పించడమే హేతుబద్ధమైన అంశం అని పేర్కొంది. స్త్రీ హక్కుల సాధనకై ఆమె తన వాదనను నిర్మించడం కోసం మొదట, స్త్రీ స్వభావం పై రూసో వెలిబుచ్చిన అభిప్రాయాలను తీవ్రంగా విమర్శించింది.

### 16.4.1 స్త్రీ స్వభావం - హోదా :

స్త్రీ పురుషులిరువురు ఒకే రకమైన సుగుణాలను కల్గివుండరనే రూసో వాదనను మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ ఖండించింది. పురుషుని సుగుణాలు హేతు స్వభావాన్ని కల్గివుంటే, స్త్రీ సుగుణాలు ప్రధానంగా లైంగిక స్వభావమైన పవిత్రత, విధేయతలతో సంబంధాన్ని కల్గివుంటాయని రూసో అభిప్రాయం. మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ దీనిని ఖండిస్తూ పురుషునివలె స్త్రీలను కూడా మొదట మానవులుగా గుర్తించాలని, లైంగిక జీవులుగా గుర్తించకూడదని వాదించింది. మానవ అనే పదంలో స్త్రీలు కూడా ఉన్నారనే ప్రతిపాదనపైనే ఆమె వాదనలు నిర్మించబడ్డాయి. ఈ సత్యాన్ని అంగీకరించినట్లయితే మానవులుగా ప్రాథమిక లక్ష్యాన్ని సాధించడంలో పురుషులు ఏ విధమైన సుగుణాలు, విధులు, బాధ్యతలు కలిగివుంటారో అవే స్త్రీలకు కూడా సమానంగా వర్తిస్తాయని మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ అభిప్రాయం. స్త్రీల ప్రాథమిక లక్ష్యం మానవులుగా ఉండటంకానీ, స్త్రీత్వం కల్గివుండటం కాదు అని ఆమె పేర్కొంది. స్త్రీ ప్రవర్తనకు సంబంధించి రూసో చేసిన ప్రతిపాదనలు నైతికమైనవి కావని, రూసో వర్ణించిన స్త్రీత్వం కృత్రిమమైనదని ఆమె విమర్శించింది. స్త్రీల మాతృత్వపు బాధ్యతలను రూసో విస్మరించాడని విమర్శించింది. బాల్యం నుండి పురుషులను సంతృప్తిపరచడానికే స్త్రీలు అన్న భావంతో ఉన్న 18వ శతాబ్దపు కొద్దిమంది ఫ్రెంచి స్త్రీలను ఆధారం చేసుకుని స్త్రీత్వంపై రూసో చేసిన ప్రతిపాదనలను మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ తీవ్రంగా ఖండించింది.

స్త్రీలను మొదట మానవులుగా పరిగణించాలనే మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ వాదానికి ప్రాతిపదిక స్త్రీలకి కూడా హేతువాద సామర్థ్యం ఉంటుందనే భావనయే. స్త్రీలు కూడా హేతువుపై ఆధారపడి తమను తాము నియంత్రించుకోగల సామర్థ్యం కల్గివున్నారని, అందుచేత స్త్రీలకు కూడా పురుషులతో పాటు సమానంగా హక్కులు లభించాలని ప్రతిపాదించింది. స్త్రీలకు సహజ హక్కులను నిరాకరించినట్లయితే, మొదట వారికి హేతువాద సామర్థ్యం లేదని నిరూపించవలసి వుంటుందని సవాలు చేసింది మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్.

స్త్రీలు పురుషుల కంటె తక్కువ నైపుణ్యాన్ని, సుగుణాలను కలిగివుంటారనే వాదనను మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ అంగీకరించదు. మానవ సుగుణాలు స్త్రీ పురుషులిరువురికీ సమానమేనంటుంది ఆమె. పవిత్రత, విధేయతలను సామాజిక సుగుణాలుగా పరిగణిస్తుంది మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్. ప్రకృతిసిద్ధంగా సుగుణము, జ్ఞానము స్త్రీ పురుషులిరువురికీ ఉంటాయని వాదించింది. మానవ సుగుణాలను

బోధించేది హేతువు అని, ఎవరిలో అయితే ఈ హేతువు అభివృద్ధి చెందదో ఆ మానవులు సుగుణవంతులు కాజాలరని మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ విశ్వాసం. సంతోషకరమైన మానవ జీవితానికి ఈ హేతువు ప్రధాన నియమం. హేతువునుపయోగించి స్వయంపాలన లేదా స్వయం నియంత్రణ చేయడం స్వతంత్రతను సాధించడం కోసమేనని మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ అభిప్రాయం. హేతువే సుగుణానికి ప్రాతిపదిక ఎందుకనగా దీనిద్వారా మనుషులు తమ మీద తాము ఆధారపడతారు కానీ ఇతరుల నిర్ణయాలు, అభిప్రాయాల మీద కాదు. అయితే సమకాలీన సమాజంలో స్త్రీలు సామర్థ్యం, నైపుణ్యం లేనివారిగా, ఇతరుల మీద ఆధారపడేవారిగా ఉండటానికి కారణం వారు నిర్లక్ష్యం చేయబడి, అణచివేతకు గురికావటమేనని మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ అభిప్రాయం. అంతేకానీ సహజంగా స్త్రీలలో హేతుస్వభావం లేకపోవటం కారణం కాదని ఆమె పేర్కొంది. స్త్రీల జీవితాలలోని అణచివేతను గురించి ధైర్యంగా ప్రశ్నించిన, వివరించిన తొలి తత్వవేత్తగా క్రాఫ్ట్‌ను పరిగణించవచ్చు.

## 16.4.2 సమాజంలో స్త్రీల హోదా తక్కువగా ఉండటానికి గల కారణాలు :

**మానసికమైన కారణం :** స్త్రీ జీవితంలోని అణచివేతకు ప్రధాన కారణం తమపై తమకి నియంత్రణ లేకపోవడం. ఈ కారణంచేత స్త్రీలు ఆధారపడే తత్వాన్ని, బానిసత్వాన్ని అలవర్చుకున్నారంటుంది మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్. బానిసత్వమనే భావన మొదట మనస్సుకు సంబంధించిన ఒక స్థితి అని, ఈ లక్షణమే స్త్రీలను బానిసలుగాను, అదే సమయంలో నియంతలుగాను, క్రూరంగానూ చేస్తుందని క్రాఫ్ట్ అభిప్రాయం.

**సామాజిక కారణం :** పురుషుడిలానే స్త్రీకూడా స్వతంత్రమైన హేతుజీవి అయినప్పటికీ, ప్రస్తుత సమాజంలో స్త్రీలు అలా లేకపోవడానికి కారణం సమాజమే అని మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ అభిప్రాయం. సమాజమే వారినలా తయారుచేస్తుందని ఆమె అభిప్రాయం. సమాజం స్త్రీలను మానవులుగా కాక లైంగిక జీవులుగా పరిగణించడం వలననే ప్రస్తుత సమాజంలో పురుషులకంటే స్త్రీలు తక్కువగా పరిగణింపబడుతున్నారనేది మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ వాదన. ఆత్మకు లింగభేదం లేదని, ప్రతివ్యక్తికీ తన లక్ష్యాన్ని లేదా దిశను నిర్ణయించుకునే సహజహక్కు ఉంటుందని మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ అభిప్రాయం. ప్రతి వ్యక్తికీ ప్రస్తుత జీవితం భవిష్యత్తు జీవితాన్ని నిర్మించుకోవటానికి ఏర్పాటు వంటిదే కాని, కేవలం వివాహం కోసం కాదని ఆమె అభిప్రాయం. అయితే సమాజం స్త్రీలను కేవలం లింగపరమైన దృష్టితో మాత్రమే చూడటం వలననే స్త్రీలు స్వయం నియంత్రణ లేనివారిగాను, సౌందర్యానికి ప్రాధాన్యత ఇచ్చేవారిగాను ఉన్నారని వాదించింది.

స్త్రీల విలువ వారి సౌందర్యంలోనే ఉందనే విషయాన్ని మాత్రమే వారికి బాల్యం నుండి సమాజం బోధిస్తుంది. కాబట్టే స్త్రీలు శరీరానికి ప్రాధాన్యత ఇచ్చేవారిగా తయ్యారయ్యారని మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ అభిప్రాయం. శారీరక సౌందర్యంతో ఏవిధంగా పురుషుడిని ఆకర్షించాలి, ఏ విధంగా అతనిని సంతృప్తిపరచాలి అనే విధంగానే బాలికలు పెంచబడుతున్నారని, ఆమె వాదించింది. అందుచేతనే స్త్రీలు హేతుబద్ధంగానూ, క్రమపద్ధతిలోను ఆలోచించలేకపోతున్నారని క్రాఫ్ట్ అభిప్రాయం.

## హేతుబద్ధమైన విద్య లభించకపోవడం :

ఏ పనినైనా క్రమపద్ధతిలో చేయడం ప్రధానం. అయితే ఒక క్రమపద్ధతిని అనుసరించే స్త్రీలు అరుదుగా ఉంటున్నారు. దీనికి కారణం వారికి హేతుబద్ధమైన విద్య లభించకపోవడమేనని మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ వాదించింది. సరైన విద్య లేకపోవడం వలన వారిలోని జ్ఞానేంద్రియాలు ప్రజ్వలితం కావడంలేదని ఆమె అభిప్రాయం. ఈ కారణంచేతనే స్త్రీలు ఉద్వేగాలకు లోనై అర్థం చేసుకొనేస్థాయిని, ఆలోచనాశక్తిని పెంపొందించుకోలేకపోతున్నారని మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ పేర్కొన్నది. హేతువుతో కూడిన

విద్యలేకపోవడం వలన స్త్రీలు తమ ఆలోచనలను సాధారణీకరించడంలో విఫలమవుతున్నారు. పొగడ్తలకు లొంగిపోయి కపటంతో, క్రూరులుగా వ్యవహరిస్తూ జీవిస్తున్నారు. పిల్లల పెంపకంలోని క్రమబద్ధమైన ప్రణాళికను ఆచరించకుండా, వారిని ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దడమెలాగో తెలియకుండా జీవిస్తున్నారు. సౌందర్యానికి ప్రాధాన్యతనిస్తూ, అబలలుగా, మేధస్సుతో సంబంధం లేనివారిగా జీవించడానికి కారణం వారికి పురుషులతో సమానమైన విద్యావకాశాలు లభించకపోవడమేనని మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ అభిప్రాయం.

## 16.5. స్త్రీలు - విద్య, ఉపాధి అవకాశాలు :

మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ మనిషి స్వభావాన్ని, శీలాన్ని నిర్ణయించటంలో విద్యకు ఉండే శక్తిని, పరిస్థితుల ప్రభావానికుండే ప్రాధాన్యతను ఉదహరిస్తూ, అంతమాత్రం చేత మానవునికి హేతుస్వభావం, ఆలోచనాశక్తి లేవనికాదు అని పేర్కొంది. ఆమె మానవునిలో హేతుస్వభావం సహజంగానే నిబిడీకృతం అయివుంటుందనే వాస్తవాన్ని అంగీకరించింది.

1791లో ఫ్రెంచి జాతీయ అసెంబ్లీ రాజ్యాంగాన్ని ఆమోదించి జాతీయ ఉచిత విద్యావిధానాన్ని డిమాండ్ చేసింది. ఫ్రెంచి జాతీయ విద్యావిధాన రూపకర్త ప్రముఖ విద్యావేత్త టెల్లిరాండ్. టెల్లిరాండ్ రూపొందించిన జాతీయ విద్యావిధానంలో ఫ్రెంచి ఆడపిల్లలు పాఠశాలలో 8 సం॥ల వరకే చదువుకోవాలని, ఆ తరువాత ఇళ్ళలోనే వుండి గృహకార్యకలాపాలు నేర్చుకుని జీవితమంతా గడపాలని రాశాడు. దానికి సమాధానంగా స్త్రీలకు కూడా సమాన విద్యావకాశాలను కల్పించాలని మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ చేసిన విజ్ఞప్తియే “విండికేషన్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ విమెన్”.

ప్రభుత్వ విద్యపై ఆటన్ బిషప్ సూచించిన విధంగా ప్రభుత్వంచే స్థాపించబడిన పాఠశాలలో బాలబాలికలిరువురు కలసి చదువుకోవాలని, 5 సం॥ల నుండి 9 సం॥ల వయస్సు వరకు అన్ని తరగతుల వారికి ఉచిత విద్య ఉండాలని మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ అభిప్రాయపడింది. సెలెక్ట్ కమిటీ చేత ఎంపికకాబడిన ఉపాధ్యాయుల సంఖ్య సరిపోయేంతగా ఉండాలని చెప్పింది. పాఠశాలలో బాలబాలికలకు ధనిక పేద వర్గాలకు మధ్య వ్యత్యాసాలు లేకుండా కలసి ఉండేందుకు ఒకేరకమైన దుస్తులు, ఒకేరకమైన పాఠ్యాంశాలు ఉండాలని ఆమె అభిప్రాయపడింది. పాఠశాల ఆవరణలో పెద్ద ఆటస్థలం ఉండాలని, అది బాలబాలికల శారీరక వ్యాయామానికి అనువుగా ఉండాలని చెప్పింది. మతం, చరిత్ర, రాజకీయాలు, మానవ చరిత్రమొదలైన శాస్త్రాలలోని అంశాలు సోక్రటీస్ పద్ధతిన సంభాషణల రూపంలో బోధించాలని సూచించింది. 9 సం॥ల వయస్సు తరువాత వారిని వేరే పాఠశాలకు మార్చి, అందులో ప్రతి ఒక్కరికీ తన ధ్యేయాన్ని నిర్ణయించుకోనే విధంగా సూచనలు చేయాలని అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ స్థాయిలో కూడా బాలబాలికలిరువురూ కలసి అధ్యయనంచేయాలని ఆమె సూచించింది. స్త్రీలు తమ గృహసంబంధమైన బాధ్యతలను సక్రమంగా నిర్వహించటానికి, స్త్రీలు తమను తాము గౌరవించుకొనే విధంగా వారిని నడిపించటం, నైతిక, రాజనీతి శాస్త్రాల పరిచయం చేయటమొక్కటే మార్గంగా మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ భావించింది.

శారీరక ఆరోగ్యం, వ్యాయామం, ఆటలు మొదలగు అంశాలను క్రాఫ్ట్ కొనసాగిస్తూ అవి స్త్రీలకు కూడా లభించాలంటుంది. అందరూ జీవశాస్త్రాన్ని అధ్యయనం చేయాలని అది వారికి తమ శరీరాలపట్ల అవగాహన కల్పించి ఉత్తమమైన తల్లిదండ్రులు, మంచి భాగస్వాములు అవటానికి దోహదం చేస్తుందని అభిప్రాయపడింది. స్త్రీలు తమ ఆరోగ్యంపట్ల జాగ్రత్తలు తీసుకోవడానికి మాత్రమే కాకుండా తమ పిల్లలు, భర్త, తల్లిదండ్రుల ఆరోగ్యం పట్ల శ్రద్ధవహించేటట్లు చేయడం కోసం వారికి ప్రభుత్వ పాఠశాలలో వైద్యశాస్త్రాన్ని బోధించాలని పేర్కొన్నది.

పురుషుల్ని ఆకర్షించే సౌందర్యం పట్ల ప్రేరేపింపబడకుండా మానసిక, శారీరక బలాన్ని, సామర్ధ్యాన్ని పెంపొందించుకోవడం పట్ల స్త్రీలను ప్రేరేపితుల్ని చేయ్యడం వలన వారిలోని జ్ఞానం సుగుణాలు వికసిస్తాయని మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ అభిప్రాయపడింది.

పౌర, రాజకీయ సమాజ ద్వారాలను మూసివేసి స్త్రీలను గృహాలకు, కుట్లు, అల్లికలు మొదలగువాటికి మాత్రమే పరిమితం చేసినట్లయితే వారు సంకుచిత స్వభావులుగా తయారవుతారని ఆమె భావించింది. స్త్రీలను స్వతంత్రులుగా హేతుబద్ధజీవులుగా చేసినట్లయితే వారు ఉత్తమ తల్లులు, భార్యలుగా తయారవుతారని ఆమె పేర్కొంది.

సరైన విద్య మానవునికి స్వతంత్రతను సాధించేటట్లుగా చేస్తుంది. స్వేచ్ఛ, స్వతంత్రతలతో కూడిన ఏ జీవితం అయితే పురుషులకు కోరదగిన జీవితంగా రూసో భావించాడో, అటువంటి జీవితమే స్త్రీలకు వాంఛనీయమని భావిస్తూ మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ అందుకవసరమైన హేతుబద్ధమైన విద్య స్త్రీలకు కూడా లభించాలని పేర్కొన్నది. సమాచారము, హేతునైపుణ్యాలతో కూడిన విద్యా - విధానము, పురుషులతోపాటు సమానంగా స్త్రీలకు కూడా లభించాలని చెప్పింది. స్త్రీలకు ఎటువంటి విద్య అవసరమో చెప్తూ మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ ఈ క్రింది సూచనలను చేసింది.

1. సమాజంలో స్త్రీల ఉనికికి, హోదాకి సంబంధించిన తప్పుడు భావాలను తొలగించడం

2. ప్రతి మనిషికి స్వయం నిర్ణయం, స్వయం ప్రతిపత్తి, సుగుణం మొదలగునవి సాధించడానికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకునే అవకాశం హేతుజీవిగా ప్రతి మానవునికీ ఉంటుందనే విషయాన్ని తెలియచేయడం.

3. క్రమబద్ధమైన ఆలోచనలు ఉద్భవించేటట్లు ఉండే విద్యావిధానం ప్రవేశపెట్టడం.

స్త్రీల ఆత్మగౌరవం పరిరక్షించబడటానికి, సమాజంలో పౌరులుగా వారి పాత్రను నిర్వహించేందుకు పై అంశాలన్ని తప్పనిసరి. మానవజాతి మరింత సుగుణాలు పొంది, సంతోషంగా ఉండాలంటే స్త్రీ, పురుషులిరువురూ ఒకే సూత్ర ప్రాతిపదికపై వ్యవహరించాలనే సూచన మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ చేసింది. ఈ విధంగా మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ రెండున్నర శతాబ్దా ల క్రిందటే స్త్రీ విద్యకు ప్రాధాన్యతనిస్తూ స్త్రీలకు పురుషులతోపాటు సమానమైన విద్య అవసరమని వాదిస్తుంది. అందుచేతనే మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్‌ను ఉదారవాద స్త్రీవాదిగా అందరూ అంగీకరిస్తారు. స్త్రీ విద్యకు ప్రాధాన్యత ఇచ్చిన కారణంగానే మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ యొక్క రచన "విండికేషన్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ విమెన్" ముద్రించబడిన తొలిరోజులలోనే అధిక ప్రాధాన్యత సంతరించుకున్నది. మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ యొక్క ఈ రచన 18వ శతాబ్దానికి చెందిన ప్రముఖ తత్వవేత్త రూసో యొక్క రచన 'ఎమిలీ'తో పోల్చబడింది. విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన ఆమె స్వయం ఉపాధికై స్వయంగా పాఠశాలను కూడా నడిపింది.

హేతుబద్ధమైన మానవ శీలాన్ని సాధించడం కోసం మనిషి తన నైపుణ్యాలను, సుగుణాలను ఉపయోగపడే ఉపాధి మార్గాలలో వినియోగించడం తప్పనిసరి. అయితే నిర్హేతుకమైన విద్యనభ్యసించిన స్త్రీలు తమ బుద్ధిని వికసింపచేసుకోలేరని, అందువలన వారు జీవనోపాధులలో పురుషులతోపాటు సమాన అవకాశాలను పొందలేకపోతున్నారని మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ అభిప్రాయం. నైపుణ్యాలను పెంపొందించుకోవడం, మేధస్సును వికసింపచేసుకోవడం ధనవంతులలోను, లైంగిక భావాలతో పెంచబడిన స్త్రీలలోను ఉండదని ఆమె వాదిస్తుంది. అది కేవలం మధ్యతరగతికి చెందినవారిలో గుర్తించవచ్చునని తెలియచేస్తుంది. తన తత్వవిచారము లేదా సిద్ధాంతము మధ్యతరగతి వారికే సరిపోతుందని ఎందుకంటే వారు మాత్రమే హేతుబద్దతతో కూడిన స్వాతంత్ర్యాన్ని, సుగుణాన్ని సాధించే స్థితిలో ఉంటారని ఆమె అభిప్రాయం.

పుట్టుకతో ధనవంతులైన వారు సంపదని కల్గివుండటం పట్ల ప్రశంసల్నీ ఆ సంపదను ప్రదర్శించాలని కోరుకున్నట్లే, లైంగిక దృష్టితో పెంచబడిన, చూడబడిన స్త్రీలు కూడా తమ సౌందర్యాన్ని ప్రశంసించాలనీ, గుర్తించాలనీ కోరుకుంటారని, అందుకనే వారిలోని సుగుణాలు వికసింపవనీ పేర్కొన్నది. అవసరానికి మించిన డబ్బుతో, అంతులేని సుఖలాలసలతో బ్రతికే కుటుంబాన్ని అతిసమీపం నుంచి గమనించిన ఆమె, విలువలు లేని వారి స్వార్థాన్ని, అభిరుచిని ఏవగించుకుంది. ఎక్కువ తీరికతో, భోగలాలసలతో

తులతూగుతూ తమ శారీరక సౌందర్యానికి ప్రాధాన్యత ఇస్తూ, వివాహేతర సంబంధాలను పెట్టుకునే ధనిక స్త్రీల జీవనశైలిని ఆమె అసహ్యించుకుంది. ఆర్థికంగా మెరుగైన కుటుంబాలలో ఆడపిల్లల్ని బాహ్య ప్రపంచంతో సంబంధం పెట్టుకోనివ్వరని, అందువలన వారు తమ మేధస్సును వికసింపచేసుకోలేక స్వార్థాన్ని, కపటత్వాన్ని అలవర్చుకుంటారని మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ అభిప్రాయం. ఈ క్రూరమైన పద్దతి అనుసరించడం వలన సమాజానికి ప్రమాదం వాటిల్లుతుందని ఆమె హెచ్చరిస్తుంది. ఈ ప్రమాదం నుండి రక్షించబడాలంటే స్త్రీ పురుషులిరువురికీ సమాన విద్యా, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆమె వాదిస్తుంది.

## 16.6. సమానత్వము - స్త్రీ స్వేచ్ఛ, హక్కులు :

సమాజంలో ప్రత్యేకించి స్త్రీ హోదాలో సంస్కరించవలసిన ప్రాథమిక అంశము సమానత్వము. మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ దృష్టిలో సమానత్వము అంటే ఇతరుల మీద ఆధారపడటమనే అంశానికి తావులేకుండా ఉండటమే. ప్రతి వ్యక్తి తన నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకొని, వాటిని తన కిష్టమైన వృత్తులలో ఉపయోగించుకునే సమాన అవకాశాలను కలిగివుండటమనే సమానత్వమును ఆమె వాంఛిస్తుంది. సమానత్వమును సాధించడానికై పౌర, రాజకీయ హక్కులు స్త్రీలకు కూడా పురుషులతోపాటు సమానంగా లభించాలంటుంది. స్త్రీలకూ రాజకీయ హక్కులు లభించాలని చెప్పింది కానీ వాటి గురించి ఆమె పెద్దగా వివరణ ఇవ్వలేదని చెప్పవచ్చు.

హేతు ప్రాతిపదికన తనని తాను నియంత్రించుకోవడం మరియు సుగుణాలను కలిగిఉండటం ద్వారా మనిషి జీవితంలో అతి ముఖ్యమైన స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను సాధించవచ్చుననే అభిప్రాయం వ్యక్తం చేసింది మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్. ఈ ప్రాథమిక భావనపై ఆధారపడి ఆమె, స్త్రీ జీవితంలో స్వేచ్ఛను, స్వతంత్రతను పొందడానికి, అనుభవించడానికి హేతుబద్ధమైన విద్య, ఉపాధి అవకాశాలు, పౌర, రాజకీయ హక్కులు స్త్రీలకు, పురుషులతోపాటు సమానంగా ఇవ్వాలని వాదించింది. అలా జరగనినాడు జనాభాలో సగభాగమైన స్త్రీల నైపుణ్యాలు, సామర్థ్యాలు నిర్వీర్యమై సమాజ పతనానికి కారణమవుతుందనే హెచ్చరికను చేసిన ధైర్యశాలిగా మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్‌ను పరిగణించవచ్చు.

## వైవాహిక సంబంధాలలో లేదా కుటుంబంలో స్త్రీ స్వేచ్ఛ, స్వాతంత్ర్యం :

స్త్రీ విముక్తికి సంబంధించిన ఏ సిద్ధాంతమైనా సంతానోత్పత్తి, పిల్లల సంరక్షణ, పెంపకం అనే అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా సంపూర్ణం కాదు. మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ కూడా తన "విండికేషన్ . . . " అనే గ్రంథంలో పిల్లల పట్ల తల్లిదండ్రుల బాధ్యతల గురించి, పిల్లల పెంపకం గురించి వివరించింది. అన్ని దేశాలలోను, కుటుంబాలలో మగపిల్లలపై కంటె ఆడపిల్లలపై తల్లిదండ్రుల అదుపు, ఆధిపత్యం ఎక్కువగా ఉంటాయని పేర్కొంది. తల్లిదండ్రులు ఆడపిల్లలపై చలాయించే ఆధిపత్యం, అధికారాల వలన ఆడపిల్లల మనస్సులు గాయపడతాయని, దానివలన వారిలోని సామర్థ్యం బలహీనమవుతుందని పేర్కొంది. పిల్లలను స్వేచ్ఛగా పెంచాలని, తద్వారా వారిలోని సుగుణాలు వికసించి, హేతుబద్ధతను అలవర్చుకుంటారని ఆమె విశ్వాసం. లింగ వివక్షతను తన జీవితంలో స్వయంగా చవిచూసిన మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ తండ్రి ఆధిపత్యాన్ని నిరసించి, స్వేచ్ఛా జీవితాన్ని పొందటానికి నిరంతరం పోరాటం చేసింది.

స్వతంత్రత కలిగిన పౌరులుగాను, హేతుబద్దత కలిగిన జీవులుగాను ఆడపిల్లలను పెంచినట్లయితే, వారు ఉత్తమ భార్యలుగాను, మంచి మాతృమూర్తులుగాను తయారవుతారని అంటుంది మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్. స్త్రీల హక్కులను, స్వేచ్ఛను రక్షించడంలో సమాజం విఫలమైనట్లయితే వారు తమ గృహ సంబంధమైన బాధ్యతలను సక్రమంగా నిర్వహించలేరని, తద్వారా

సమాజ పతనం ప్రారంభమవుతుందని ఆమె వాదించింది. కుటుంబ వ్యవస్థలోని శ్రమ విభజనలో బయటి ప్రపంచం తోటి పురుషులు, గృహసంబంధమైన బాధ్యతలతో స్త్రీలు జోడించబడటాన్ని సమానమైన, భిన్నపాత్రలుగా వ్యవహరిస్తుంది మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్. పౌరహక్కులకు రక్షణ లేనిదే స్త్రీ, పురుషులిరువురూ తమ తమ పౌర బాధ్యతలను సక్రమంగా నిర్వహించలేరని మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ అభిప్రాయం. వివాహంలో పురుషుని భాగస్వామి కావడానికి, పురుషునికి సహకరించడానికి, కుటుంబ బాధ్యతలను సక్రమంగా నిర్వహించడానికి, సంతానాన్ని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటానికి విద్య ద్వారా స్త్రీలను సంసిద్ధం చేయకపోయినట్లయితే వారు తమ జ్ఞానాన్ని, సుగుణాలను అభివృద్ధి చేసుకోలేరని ఆమె వాదించింది.

వైవాహిక సంబంధాలలో స్త్రీ పురుష సమానత్వం, స్త్రీ స్వేచ్ఛ సాధించడానికి, స్త్రీలు తమ భర్తల నుండి స్వాతంత్ర్యం కలిగివుండాలని, లేకపోయినట్లయితే వారు ఉత్తమమైన భార్యలుగాను, మంచి తల్లులుగాను, సుగుణవంతులుగాను కాజాలరని వాదిస్తుంది మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్. వైవాహిక సంబంధాలలో స్త్రీ స్వేచ్ఛను పొందటానికై మొదట స్త్రీ విద్యను సంస్కరించాలని ఆమె అభిప్రాయపడింది. బాలికలకు తమ సోదరులతో సమానంగా ఒకే పాఠశాలలో, ఒకే ఉపాధ్యాయుల ద్వారా విద్యాబోధన జరగాలని సూచన చేసింది. తద్వారా బాలికలు కూడా తమ సోదరులతో సమానంగా తను, తమ సుగుణాలను, సామర్థ్యాన్ని పెంపొందించుకోగలరని ఆమె వాదించింది.

ఎక్కువ మంది స్త్రీలకు భార్యలుగాను, తల్లులుగాను తమ తమ విధులను నిర్వహించడములోనే జీవితం గడచిపోతుందని మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ అభిప్రాయం. అందుచేతనే ఎక్కువమంది స్త్రీలకు స్వేచ్ఛ, సమానత్వమనే విలువలు తమ కుటుంబ బాధ్యతల నిర్వహణలోనే ఏవిధంగా ఉంటాయనే విషయాన్ని మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ ఈ క్రింది విధంగా వివరించింది.

1) వైవాహిక సంబంధంలో, ఆస్థిహక్కు విషయంలో, స్త్రీ కూడా భర్తతో సమానంగాను బాధ్యత కల వ్యక్తిగాను గుర్తించబడుతుంది. కనుక సమానత్వం ఉంటుంది.

2) స్వయం పోషకశక్తి ఉన్నప్పటికీ స్త్రీ కేవలం తనను తాను పోషించుకోవడానికి మాత్రమే వివాహ సంబంధంలోకి ప్రవేశించలేదు కనుక, భర్తపై అతని జీవితకాలంలో కానీ, అతను మరణించిన తరువాత కానీ పూర్తిగా ఆధారపడదు. అందుచేతనే కుటుంబ బాధ్యతల నిర్వహణలో ఆమెకు స్వాతంత్ర్యం ఉంటుంది.

3) స్త్రీ భార్యగా గృహాన్ని నిర్వహించడం, తల్లిగా పిల్లల సంరక్షణ అనే సాంప్రదాయ విధుల్ని హేతుబద్ధత ప్రాతిపదికపై నిర్వహించడం వలన ఆమెకి తన సుగుణాల్ని వికసింపచేసుకోవడానికి, మానవ లక్ష్యాన్ని సాధించడానికి ఎక్కువ అవకాశం ఉంటుంది.

ఈ విధంగా వివాహ బంధంలో స్త్రీ పురుషులిరువురూ సమాన భాగస్వాములే అని, ఇరువురూ స్వతంత్రులే అని మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ అభిప్రాయం. కుటుంబాన్ని పోషించడమనే బాధ్యతను నిర్వహించటంలో పురుషుడు, పిల్లల సంరక్షణ బాధ్యతల్ని నిర్వహించడంలో స్త్రీ సమానమని వారు తమ తమ బాధ్యతల్ని నిర్వహించడానికి ఇరువురికీ హేతుస్వభావం, ఒకేరకమైన సుగుణాలు అవసరమని ఆమె వాదించింది. స్త్రీ పురుషులిరువురు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించడానికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, పౌరహక్కులు, విద్య సమానత్వ ప్రాతిపదికపై ఇరువురికీ లభించాలని ఆమె వాదిస్తుంది. గృహ సంబంధమైన బాధ్యతల నిర్వహణలోని సుగుణాలకు ప్రాధాన్యతనిస్తూ, దాన్నికూడా ఉత్తమ పౌరత్వ అంశంగా పేర్కొంది. పౌరసమాజంలో పురుషుడు నిర్వహించే కర్తవ్యాలకు ఎటువంటి సుగుణాలు అవసరమో, కుటుంబ బాధ్యతల నిర్వహణకు స్త్రీలకు కూడా అటువంటి సుగుణాలు, హేతుబద్ధత అంతే అవసరం అని చెప్పడంలో మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ కుటుంబ బాధ్యతలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తుంది. వ్యక్తిగతంగా కూడా ఆమెకు సంసారజీవితం అంటే ఎంతో ఇష్టం అని, పిల్లల పెంపకం పట్ల ఎంతో ఆసక్తిని కనబరచేదని ఆమెతో

జీవితాన్ని పంచుకున్న విలియం గాడ్విన్ తత్వవేత్త మేరీ గురించి రాసిన స్మృతులలో పేర్కొన్నాడు. ఈ విధంగా మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ సమానత్వ ప్రాతిపదికపైన నిర్మించబడే ఆదర్శవంతమైన కుటుంబాన్ని, వైవాహిక సంబంధాలను కోరుకున్నట్లు తెలుస్తుంది.

## 16.7. స్త్రీ - పురుష సమానత్వము - సామాజిక ప్రయోజనం :

వ్యక్తి యొక్క వ్యక్తిగత కర్తవ్యాన్ని సామాజిక ప్రయోజనంతో అనుసంధానించకపోయినట్లయితే వ్యక్తి తన ధర్మాన్ని సక్రమంగా నిర్వహించలేదనేది వాస్తవం. హేతుబద్ధమైన జీవితం పురుషుడితో సమానంగా స్త్రీలకి కూడా లభించాలని కోరుకోవడంలో మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ ఉద్దేశ్యం వారిని కుటుంబ బాధ్యతల నుండి విముక్తం చేయాలనికాదు. హేతు స్వభావాన్ని పెంపొందించుకోవడం ద్వారా స్త్రీలు తమ కుటుంబ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తారని, తద్వారా సామాజిక ప్రయోజనం చేకూరుతుందని వివరిస్తుంది. జన్మతః స్వభావరీత్యా స్త్రీలు మోసకారులు, సంకుచిత స్వభావులు కారని, కుటుంబ వ్యవస్థ పూర్తిగా వ్యక్తిగతమైనదిగా భావింపబడుట వలననే స్త్రీలు గృహాలలో బంధీలుగా ఉంటూ, సంకుచితత్వాన్ని కపటత్వాన్ని అలవర్చుకుంటున్నారని వాదిస్తుంది సమాజం. పరిస్థితులు వారిని ఆ విధంగా తయారుచేశాయని, అందుచేత స్త్రీలు తమ సంతానాన్ని కూడా సంకుచితమైన వారిగా పెంచుతారని, దీనియొక్క దుష్ఫలితాలు పౌర, రాజకీయ జీవనంలో కూడా ప్రతిబింబిస్తాయనే హెచ్చరిక చేసింది మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్. స్త్రీల - విద్యావకాశాలకు, హక్కులకు రక్షణ కల్పించకుండా వారిని అణిచి వేసినట్లయితే అది కేవలం స్త్రీలకు మాత్రమే కాకుండా మొత్తం సమాజానికే నష్టం వాటిల్లుతుందనే వాదన మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ "విండికేషన్ . . ... లో కన్పిస్తుంది.

"స్త్రీలను విద్యావంతులుగాను, స్వతంత్రమైన పౌరులుగాను తయారుచేయండి. తద్వారా వారు మంచి భార్యలుగాను, తల్లులుగాను తయారవుతారు" అనే మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ అభిప్రాయంలో ఉపయోగితాధోరణి కన్పిస్తుంది. స్త్రీలు తమజీవిత భాగస్వాములతో ఎందుకు సహకరించాలో, ఎందుకు సుగుణవంతులుగా ఉండాలో అనే విషయం విద్య ద్వారా భోదింపబడకపోయినట్లయితే సామాజిక పతనం ప్రారంభమవుతుందనే హెచ్చరిక చేస్తుంది మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్. స్త్రీ మౌలిక స్వభావంపై రూపొందిన దురభిప్రాయాలను, భయాలను పోగొట్టటానికి ఆమె సూచించిన ఏకైక మార్గం స్త్రీలలో ఉండే హేతుస్వభావాన్ని మెరుగుపరచడం. అందుకోసం స్త్రీలకి సరైన విద్యను, సమాన హక్కులను కల్పించాలనీ, తద్వారా స్త్రీలు సామాజిక లక్ష్యంతో జోడింపబడి తమ కర్తవ్యాలను, పౌరబాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తారని ఆమె అభిప్రాయం. స్త్రీ, పురుష సమానత్వం సామాజికాభివృద్ధికి దోహదపడుతుందనే విషయాన్ని ఆనాడే గుర్తించిన సిద్ధాంతకారిణిగా మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్‌ను పరిగణించవచ్చు. దోపిడీయుత, వర్గ సమాజాన్ని నిరసిస్తూ, మానవాభివృద్ధికి స్వేచ్ఛ, హక్కులు సమానత్వ ప్రాతిపదికపై అందరికీ లభించాలని వాదించిన మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ గొప్ప ఉదారవాదిగాను, ప్రజాస్వామిక వాదిగాను పరిగణించవచ్చు. అయితే మానవ అనే పదంలో స్త్రీలు కూడా ఉన్నారని, వారి విముక్తికై పురుషులతో సమానంగా స్త్రీలకు అన్నిహక్కులూ, విద్యావకాశాలు కల్పించాలని వాదించింది కనుకనే ఆమెను స్త్రీవాదిగా పరిగణించవచ్చు. స్త్రీల అణచివేతకు పునాదులైన మానసిక, సాంస్కృతిక, సామాజిక అంశాలను విశ్లేషించి, వాటిని అధిగమించడానికి స్త్రీలకు సమాన విద్యావకాశాలను కల్పించాలని ప్రతిపాదించింది. కుటుంబ బాధ్యతల నుండి విముక్తి చేయడానికైకాక, కుటుంబ బాధ్యతలను సక్రమంగా నిర్వహించడం కోసం మాత్రమే స్త్రీలకు పురుషులతో సమాన హక్కులు లభించాలని ప్రతిపాదన చేసింది. కనుకనే మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్‌ను స్త్రీవాద సిద్ధాంతంలో ఉదారవాద స్త్రీవాదిగానే పరిగణించవచ్చు.

## 16.8. విమర్శ :

ఏ కాలంలో అయినా సాంప్రదాయాలకు విరుద్ధంగా జీవించిన వ్యక్తులు, వారి ఆలోచనలు సమాజం నుండి వ్యక్తిగతంగాను,

సిద్ధాంతపరంగాను విమర్శలు, ప్రతిఘటనలు ఎదుర్కొనక తప్పదు. మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ జీవితం, ఆమె భావాలు అందుకు ఒక ముఖ్యమైన ఉదాహరణ.

సాంప్రదాయ విరుద్ధంగా జీవించిన మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ వ్యక్తిగత జీవితం నిరంతం పోరాటమే అయ్యింది. అనేక తీవ్ర విమర్శలను ఆమె సమకాలీన సమాజం నుండి ఎదుర్కొనక తప్పలేదు. గిల్బర్ట్ ఇమ్లే అనే అమెరికన్‌తోను, ఆ తరువాత విలియం గాడ్విన్ అనే తత్వవేత్తతోనూ ఆమె పరిచయం, పెళ్లి కాకుండానే వారితో జీవితాన్ని పంచుకోవడం అనేక తీవ్ర విమర్శలకు కారణమైంది. ఆనాటి సమాజం వారి సంబంధాన్ని ఏ మాత్రం గౌరవించలేదు. ఒక పత్రికలో మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ పేరును వ్యభిచారం అనే శీర్షిక కింద ప్రచురించారు. వివాహం కాకుండానే పురుషునితో సంబంధం పెట్టుకోవడం, తల్లి కావడం సాంప్రదాయ సమాజంలో స్త్రీ పురుష సంబంధాల పట్ల వున్న ధోరణికి గొడ్డలిపెట్టుగా పరిగణించబడింది.

మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ వ్యక్తిగత జీవితం మాత్రమే కాకుండా, స్త్రీ పురుష సంబంధాల విషయంలోను, స్త్రీ పురుష సమానత్వ విషయంలోను ఆమె వెలిబుచ్చిన భావాలు, సిద్ధాంతాలు అనేక తీవ్ర విమర్శలకు గురిఅయ్యాయి. బాలికలకు, బాలురలో సమానమైన విద్య లభించాలనే ఆమె వాదన ఆనాటి సాంప్రదాయవాదులకు నచ్చలేదు. స్త్రీ పురుష సమానత్వానికై స్త్రీలకూ సమాన విద్యావకాశాలు హక్కులు, రక్షణ కల్పించాలని వాదించిన మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ తద్వారా స్త్రీలు, బాధ్యతల నిర్వహణకే పరిమితం కావాలని కోరుకోవడం సమంజసమైనది కాదు అని ఆమె భావాలపై వచ్చిన ఒక ప్రధానమైన విమర్శ. మంచి తల్లులుగా, భార్యలుగా స్త్రీలు కుటుంబంలో తమ బాధ్యతలను ఎలా నిర్వహించాలి అనే దానికి ప్రాధాన్యత నిచ్చిన ఆమె, పౌర, రాజకీయ సమాజంలో స్త్రీల పాత్ర గురించి అంతగా వివరించలేదనేది మరొక విమర్శ. స్త్రీలను మొదట మానవులుగా పరిగణించాలని, "మానవ" అనే పదంలో స్త్రీలు కూడా ఉన్నారనే భావన ప్రాతిపదికపై తన సిద్ధాంతాన్ని వివరించిన ఆమె స్త్రీలు మానవులుగా తమ లక్ష్యాన్ని సాధించడానికి కాక, వారిని కుటుంబ బాధ్యతల నిర్వహణకే పరిమితం చేసిందనేది ఆమెపై వచ్చిన ప్రధానమైన విమర్శ.

## 16.9. క్రాఫ్ట్ భావాల ఉపయుక్తత :

స్త్రీలు ఇళ్ళకు మాత్రమే పరిమితం కావాలని వారికి పురుషులతో సమానమైన చదువులు అవసరం లేదనే రూసో వాదనను ఖండిస్తూ, స్త్రీ పురుషులిరువురికీ సమానమైన చదువులు లభించాలని "ది విండికేషన్ . . .. .. లో" మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ చేసిన ప్రతిపాదనకు ఇప్పటికీ విశిష్టస్థానమున్నది. ఆధునిక ప్రభుత్వాలన్నీ స్త్రీ పురుష సమానత్వ సాధనకై తమ తమ విధానాలలో విద్యను ప్రాధమికాంశంగా ఇప్పటికీ పరగణించటాన్ని గమనించినట్లయితే స్త్రీ విద్యపై మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ భావాల ఉపయుక్తత మనకు తెలుస్తుంది. స్త్రీ విముక్తికై పురుషులతో సమానంగా స్త్రీలకు అన్ని పౌర రాజకీయ హక్కులు లభించాలనే ఆమె వాదనకి స్త్రీవాద ఉద్యమంలో ప్రముఖ స్థానమున్నది. స్త్రీ పురుషులు నిర్వహించే పాత్రలు భిన్నమైనప్పటికీ సమానమైనవేననీ, రెంటికీ ఒకేరకమైన సుగుణాలు, సమానమైన ప్రాధాన్యత ఉన్నాయని మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ చేసిన వాదనకి స్త్రీవాద సిద్ధాంతములో నేటికీ ప్రాధాన్యత ఉన్నది. స్త్రీ మౌలిక స్వభావానికి సంబంధించి ఆమె భావాలను స్త్రీవాద సిద్ధాంతానికిప్రాతిపదికలుగా పరిగణించవచ్చు. నేటి సమాజంలో స్త్రీ పురుష సంబంధాలలో, స్త్రీ పురుష సమానత్వంలోను వచ్చిన కొద్దిపాటి మార్పుకు మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ లాంటి కొద్దిమంది యొక్క కృషి, రచనలే కారణం అని చెప్పుకోవచ్చును.

## 16.10. సారాంశము :

18వ శతాబ్దంలోనే స్త్రీవాద దృక్పధమనే బీజం మొలకెత్తింది. అందుకనే స్త్రీవాద సిద్ధాంతాన్ని అర్థం చేసుకోవటానికి

మొదటిగా చదువవలసిన పుస్తకంగా మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ యొక్క "ఏ విండికేషన్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ విమెన్" ను పరిగణించవచ్చు. ఈ పుస్తకంలో ఆమె సహజసిద్ధంగా స్త్రీ పురుషులిరువురు ఒకే రకమైన స్వభావాన్ని సుగుణాల్ని కల్గివున్నారని, అయితే కొన్ని పరిస్థితుల ప్రభావంచేత స్త్రీలు వివక్షణకు గురవుతున్నారని పేర్కొన్నది. స్త్రీల పరిస్థితులలో మార్పు తీసుకురావటానికి, స్త్రీలకు సమాన అవకాశాలను, హక్కులను కల్పించాలని, స్త్రీ పురుషులకు ఒకేరకమైన విద్యను ప్రవేశపెట్టాలని, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కల్పించాలని పేర్కొన్నది. మానవ జాతిలో సగభాగమైన స్త్రీలను అజ్ఞానులుగా, అమాయకులుగా చేసినట్లయితే, వారు తమ కుటుంబ బాధ్యతలను సక్రమంగా నిర్వహించలేరని, ఆ కారణం చేత సమాజాభివృద్ధి జరగదని హెచ్చరిక చేసింది. స్త్రీ పురుష సమానత్వం ద్వారా సామాజిక ప్రయోజనం చేకూరుతుందనేది క్రాఫ్ట్ భావాలలోని ప్రధానాంశం. సాంప్రదాయబద్ధమైన సమాజంలో స్త్రీల జీవన విధానంలో, హోదాలో తీసుకురావలసిన మార్పుల గురించి ధైర్యంగా వ్యక్తీకరించిన మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్‌కి స్త్రీవాద సిద్ధాంతంలో విశిష్టస్థానమున్నది. 'వ్యక్తిగతం కూడా రాజకీయమే' (Personal is politics) అని నిర్ధారిస్తూ రాజనీతి తత్వశాస్త్రానికి కొత్త దృష్టికోణాన్ని అన్వేషిస్తున్న స్త్రీవాద దృక్పధాన్ని అవగాహన చేసుకోవాలంటే క్రాఫ్ట్ భావాలపై విస్తృతమైన అధ్యయనం, చర్చ జరగవలసి వుంది.

## 16.11. మాదిరి ప్రశ్నలు :

1. "మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ తొలి మహిళా స్త్రీవాది" చర్చించండి.
2. స్త్రీవాద సిద్ధాంతంలో మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ స్థానాన్ని విమర్శనాత్మకంగా వివరింపుము.
3. స్త్రీ విద్యపై మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ భావాలను వివరించండి.
4. స్త్రీల హక్కులపై మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ అభిప్రాయాలను పరిశీలింపుము.
5. "మేరీ ఊల్‌స్టోన్ క్రాఫ్ట్ ఉదారవాద స్త్రీవాది" చర్చించండి.

## 16.12. చదువదగిన గ్రంథాలు :

1. Mary Wollstonecraft : Political Writings, Oxford World's classics, 1994
2. Diana Coole : Women in Political Theory
3. John Charvet : Modern Ideologies - Feminism
4. Volga - Tholi Velugulu

**రచయిత : శ్రీమతి టి. విజయకృష్ణ**

పాఠం - 17

# సిమోన్ ద బూవుఆర్ (1908 - 1986)

**విషయక్రమం**


**17.0.** లక్ష్యం

**17.1.** పరిచయం

**17.2.** జీవితం, కృషి

**17.3.** అస్తిత్వవాది - స్త్రీవాది

**17.4.** స్త్రీ అంటే ?

**17.4.1** జీవశాస్త్ర, మానసిక విశ్లేషణా దృక్పథం

**17.4.2** చారిత్రక, భౌతికవాద దృక్పథం

**17.5.** ద్వితీయ భావన

**17.6.** పితృస్వామ్యం - అధికారంపై విమర్శ

**17.6.1** పురాతన యుగం

**17.6.2** మధ్య యుగం

**17.6.3** ఆధునిక యుగం

**17.7.** స్త్రీ జీవితపు వివిధ దశలు

**17.8.** స్త్రీ పరిస్థితి గుణగణాలు

**17.9.** స్త్రీ విముక్తి

**17.10.** ముగింపు

**17.11.** మాదిరి ప్రశ్నలు

**17.12.** చదువదగిన పుస్తకాలు


## 17.0. లక్ష్యం :

1) స్త్రీవాదం ఒక బలమైన వాదంగా, విశ్లేషణా పద్ధతిగా ఎలా రూపొందిందీ అన్న విషయం గురించి మీరు ఈ భాగంలో తెలుసుకుంటారు.
2) రెండోతరం స్త్రీవాదులలో ప్రముఖ స్త్రీవాది సిమోన్ ద బూవుఆర్ గురించిన పరిచయం కలుగుతుంది.
3) స్త్రీ అంటే ఏమిటో, చారిత్రకంగా స్త్రీల అణచివేతకు గల కారణాలు ఏమిటో తెలుసుకుంటారు.
4) పితృస్వామ్య వ్యవస్థపై, అధికారంపై సిమోన్ ద బూవుఆర్ చేసిన విశ్లేషణాత్మక విమర్శలను గురించి తెలుసుకుంటారు.

## 17.1. పరిచయం :

సమాజంలో సగంగావున్న స్త్రీల అణచివేత నుండి స్త్రీవాదం జనించిందని చరిత్ర ద్వారా మనకు తెలుస్తుంది. తొలిదశలలో ఈ అణచివేతకు స్త్రీలు ఏదో ఒక రూపంలో ఒంటరిగానే ఎదిరించారు. స్త్రీలు వ్యక్తిగతంగా చేసిన తిరుగుబాట్లు కొన్ని వందల సం॥రాల తరువాత సామూహిక ఉద్యమాల రూపం దాల్చాయి. స్త్రీవాద దృక్పథంలో ఇంతవరకూ స్త్రీలు తాము పురుషులతో సమానులమనీ, సమాన హక్కులు కావాలనీ చేసిన వాదన గురించి ఇంతకుముందు భాగంలో మేరీఊల్‌స్టోన్‌క్రాఫ్ట్ భావాల ద్వారా తెలుసుకున్నాము. అయితే ఆమె భావాలు ఉదారవాద భావాలుగానే పరిగణించబడ్డాయి. క్రమంగా ఉదారవాద భావాలకు ప్రాధాన్యత తగ్గి, స్త్రీవాదం అనేక మార్పులకు గురవుతూ, స్పష్టమైన స్వరూప స్వభావాలు పొందుతూ అభివృద్ధి చెందుతూ ఉంది.

పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందటం, బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికాలలో ప్రజాస్వామ్య భావాలు తలెత్తటమనే ఆర్థిక, రాజకీయ పరిణామాల వలన కుటుంబానికున్న ఆర్థిక, రాజకీయ ప్రాధాన్యత తగ్గటంతోపాటు స్త్రీల ఆర్థిక, రాజకీయ హోదా తగ్గిపోయింది. ఈ పరిణామాలు స్త్రీల పరిస్థితులలోను, హోదాలోను, తమను తాము అర్థం చేసుకొనే పద్ధతిలోను పెను మార్పులు తీసుకువచ్చాయి. ఆధునిక స్త్రీవాదులు స్త్రీల పాత సమస్యలకు కొత్త పరిష్కారాలను, అసలు సమస్యను అర్థం చేసుకోవడంలోనే కొత్త దృష్టికోణాలను అన్వేషించటానికి ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రయత్నంలో సిమోన్ ద బూవుఆర్ గ్రంథం "ది సెకెండ్ సెక్స్" ను స్త్రీవాద సిద్ధాంతంలో ఒక మైలురాయిగా పేర్కొనవచ్చు. ఆమె తన గ్రంథంలో స్త్రీల అణచివేతకు గల కారణాలను విశ్లేషణాత్మకంగా వివరించింది. సిమోన్ ద బూవుఆర్ ఏ విధంగా స్త్రీల అసలు పరిస్థితులను, సమస్యలను అణిచివేతను అర్థం చేసుకోవడంలో నూతన దృష్టికోణాన్ని ఆవిష్కరించిందో ఏ విధంగా పితృస్వామ్య వ్యవస్థను, పురుషాధికారాన్ని విమర్శించిందో ఈ భాగంలో మనం తెలుసుకుందాం.

## 17.2. జీవితం, కృషి :

సిమోన్ ద బూవుఆర్ నవలా, నాటక రచయిత్రి, అధ్యాపకురాలు, అస్తిత్వవాది, స్త్రీవాది, కమ్యూనిజంపై బలమైన విశ్వాసం గల ఉద్యమ నాయకురాలు. రచయిత్రిగా, మేధావిగా ప్రపంచ ప్రసిద్దిపొందిన సిమోన్ ద బూవుఆర్ గ్రంథం "ది సెకండ్ సెక్స్" స్త్రీవాదానికి సంబంధించి ఒక విజ్ఞాన సర్వస్వం స్థాయిలో **1949** సం॥లో వెలువడింది. స్త్రీవాద రచయిత్రిగా ఆమో ఈ గ్రంథంతో ఎంతోమంది స్త్రీలను ప్రభావితం చేసారు. స్త్రీవాదానికి ముఖ్యగ్రంథంగా, అక్షరాయుధంగా వున్న ఈ గ్రంథంపై ప్రపంచవ్యాప్తంగా విస్తృతస్థాయిలో చర్చ జరిగింది.

సిమోన్ ద బూవుఆర్ పారిస్‌లోని ఒక సాంప్రదాయ కుటుంబంలో జనవరి **9, 1908** సం॥లో జన్మించారు. వృత్తిరీత్యా లాయర్ అయిన ఆమె తండ్రి సాంప్రదాయవాది, క్రైస్తవమత ఛాందసుడు. ఆమె **1929** వ సం॥లో సార్బోన్ విశ్వవిద్యాలయంలో తత్వశాస్త్రంలో గ్రాడ్యుయేషన్ పట్టా పొందింది. అదే విశ్వవిద్యాలయంలో మేధావి, తత్వవేత్త అయిన జీన్‌పాల్ సార్త్రతో ఆమెకి పరిచయమైంది. వీరి సహచర్యం జీవితాంతం కొనసాగింది. **1931 - 37** మధ్యకాలంలో ఉత్తరఫ్రాన్స్‌లో రూ లోను, దక్షిణ ఫ్రాన్స్‌లోని మార్సెయిలోను, **1938 - 43** మధ్య పారిస్‌లోను మహిళా కళాశాలల్లో అధ్యాపకురాలిగా పనిచేసారు. సార్త్ర భావాలు, ఫ్రాయిడ్, ఆడ్లర్, యాండ్‌ల మానసిక విశ్లేషణ, రష్యాలో లెనిన్, స్టాలిన్‌ల పాలన ఆమెపై అమితమైన ప్రభావాన్ని చూపాయి. సార్త్రతో కలిసి ప్రపంచంలోని అనేక దేశాలు పర్యటించి, స్త్రీ ప్రగతికి సంబంధించిన ఉద్యమాలకు, ప్రజాపోరాటాలకు మద్దతునిచ్చారు. రెండు ప్రపంచ యుద్ధాల్నీ కళ్ళారా చూసిన ఆమె సామ్రాజ్యవాదాన్నీ, పేదదేశాలపై అగ్రరాజ్యాల ఆధిపత్యాన్ని, స్త్రీలపై పురుషాధిపత్యాన్ని తీవ్రంగా ఖండించింది. అమెరికాలో పర్యటించి, వెర్రితలలు వేస్తున్న అమెరికా నాగరికతనీ, రెండవ ప్రపంచ యుద్ధానంతరం ప్రపంచాధిపత్యం కోసం అమెరికన్లు చేస్తున్న కుట్రల్నీ ధైర్యంగా వెల్లడించారు. ఆ తరువాత **1957**లో

చైనాలో పర్యటించి, "పీపుల్స్ చైనా" మావో నాయకత్వంలో సాధిస్తున్న ఘన విజయాల్ని ప్రపంచానికి చాటి, సామ్రాజ్యవాద దేశాలు చైనాకు వ్యతిరేకంగా చేసే దుష్ప్రచారాన్ని తిప్పికొట్టారు. సాంప్రదాయ కుటుంబంలో జన్మించినప్పటికీ తన బలమైన వ్యక్తిత్వంతో, అఖండ మేధా సంపత్తితో స్త్రీవాద సిద్ధాంత అభివృద్ధికి దోహదంచేసి, 20వ శతాబ్దపు ప్రపంచ ప్రఖ్యాత స్త్రీవాద రచయిత్రిగా పేరుపొందిన ఆమె 1986 సం॥లో ఏప్రియల్ 4వ తేదీన పారిస్‌లో మరణించారు.

**రచనలు :**

సార్త్ర ప్రేరణతో 1943 సం॥లో అస్తిత్వ భావాల్ని వివరించే వ్యాసాలను రచించి అస్తిత్వవాదిగా పేరుపొందారు. పరిశీలనాత్మక దృష్టి, విశ్లేషణాత్మక శక్తి కల్గిన ఆమె విభిన్న అంశాలపై, అంటే యువజంటలు ఎదుర్కొనే సమస్యలపై, వృద్ధాప్యంపై, స్త్రీల సమస్యలపై ప్రపంచ దేశాలలో వస్తున్న రాజకీయ పరిణామాలపై అనేక వ్యాసాలు, నవలలు, నాటకాలు, సైద్ధాంతిక గ్రంథాలు వ్రాసి ప్రపంచ ప్రఖ్యాతి పొందింది. సార్త్రతో కలిసి 1945 సం॥లో 'Letemps Modernes' మాసపత్రికను, తరువాత పారిస్ కార్మికవర్గం కోసం 'In the cause of People' పత్రికను నిర్వహించారు. ఆమె రచనలలో ఈ క్రింద పేర్కొనబడినవి ప్రధానమైనవి.

1. లి డుక్సెమె సెక్సె (Le Deuxieme Sexe) (The Second Sex) 1949
2. ది ఎతిక్స్ ఆఫ్ యాంబిగ్యుటి (The Ethics of Ambiguity)
3. మెమొరీస్ ఆఫ్ ఎ డ్యూటిఫుల్ డాటర్ (Memories of a Dutiful Daughter) 1958
4. ది ప్రైమ్ ఆఫ్ లైఫ్ (The Prime of Life) 1962
5. ఎ వెరీ ఈజీ డెత్ (A very Easy Death) 1964
6. ది ఫోర్స్ ఆఫ్ సర్క్‌మస్టాన్స్ (The force of circumstance) 1965
7. ఆల్ సెడ్ అండ్ డన్ (All said and done) 1974
8. ఆడియుఎక్స్ : ఎ ఫేర్‌వెల్ టు సార్త్ర (Adiuex : A farewell to Sartre) 1980

స్త్రీవాద సిద్ధాంతాల్ని అధ్యయనం చేయాలనుకున్న వారంతా తప్పక చదవవలసిన గ్రంథం సిమోన్ ద బూవుఆర్ గ్రంథం "ది సెకెండ్ సెక్స్' (The second Sex) సిమోన్ ద బూవుఆర్ ఆరెళ్ళపాటు వివిధ పత్రికలలో రాసిన వ్యాసాలు 1949 సం॥లో 'ది దుర్విమ్ సెక్స్' పేర రెండు సంపుటాలుగా ఫ్రెంచి భాషలో వెలువడి సంచలనం సృష్టించాయి. సిమోన్ ద బూవుఆర్‌కి అత్యంత సన్నిహితురాలైన హెచ్.ఎమ్. పార్లే 1953 సం॥లో "లి డుక్సెమె సెక్సె (Le Deuxieme Sexe) ను ఫ్రెంచి భాషనుండి ఆంగ్లభాషలోకి 'ది సెకెండ్ సెక్స్' (The Second Sex) పేరుతో అనువదించింది. ఇంగ్లీషు భాషలోకి అనువదించబడిన తరువాత ఈ పుస్తకం ఎక్కువ మంది పాఠకుల చేతులలోకి వెళ్ళి, చర్చకు గురైంది. ఎంతోమంది సాంప్రదాయవాదుల, మతఛాందసవాదుల విమర్శలకూ గురైంది. ఇందులో ఆమె జీవితపు వివిధ దశలలో స్త్రీలు ఎదుర్కొనే సమస్యలను, ఆ సమస్యలకు గల మూలకారణాలను, వారి సాంఘిక పాత్రను ఆసక్తిని రేకెత్తించే విధంగా విశ్లేషించింది.

## 17.3. అస్తిత్వవాది - స్త్రీవాది :

అస్తిత్వవాదిగా పేరుపొందిన సిమోన్ ద బూవుఆర్ స్త్రీవాదిగా కూడా ప్రపంచ ప్రఖ్యాతిగాంచారు. అస్తిత్వవాద భావాల్ని వివరించే వ్యాసాల రచనలలోనే ఆమె స్త్రీవాద భావాలకు బీజాలు పడ్డాయి. స్త్రీకి ప్రత్యేక అస్తిత్వం లేకుండా పోయిందని, స్త్రీని స్త్రీగా కాక, స్త్రీ పురుషుడితో సాపేక్షంగా చూడబడుతుందని ఆమె అభిప్రాయం. స్త్రీ లేకుండా పరుషుడు సొంతంగా ఆలోచించగలడు,

కాని పురుషుడు లేకుండా స్త్రీ సొంతంగా ఆలోచించలేదనే భావజాలం వలన స్త్రీకి స్వతంత్ర వ్యక్తిత్వం, ఉనికి లేకుండా పోయిందని ఆమె పేర్కొన్నది. మానవజాతి మొత్తం పురుషజాతిగా తయారైందని, ప్రకృతి కూడా పురుషులకే సహకరించి స్త్రీల పట్ల వివక్షత శాశ్వతమైందనీ, ఆమె బలంగా విశ్వసించారు. స్త్రీ పురుషుల మధ్య సంబంధాలు సమాన ప్రాతిపదిక మీద లేవని, స్త్రీ ఎప్పుడూ పురుషునిపై ఆధారపడే వుందని ఆమె పేర్కొన్నది. చట్టపరంగా కూడా స్త్రీకి పురుషునితోపాటు సమాన అవకాశాలు కల్పించబడలేదని, ఒకవేళ కల్పించినా తరతరాల సాంప్రదాయాలు ఆమెకా అవకాశాల్ని దూరం చేస్తున్నాయని ఆమె విమర్శించారు. స్త్రీలకు విద్యావకాశాలు తక్కువని, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలలో పురుషులదే గుత్తాధిపత్యమని, అందుకే స్త్రీలు అన్నింటా వెనుకబడి వున్నారని పేర్కొన్నది. పైగా ఆడవారి తక్కువతనాన్ని నిరూపించటం కోసం మతం, తత్వశాస్త్రం, పురాణ సాహిత్యాలను మాత్రమేగాక విజ్ఞాన శాస్త్రాల్ని, జీవశాస్త్రం, మనస్తత్వ శాస్త్రం మొదలైన ఆధునిక అధ్యయనాల్ని కూడా ఆశ్రయించారని సిమోన్ ద బూవుఆర్ అభిప్రాయం. చరిత్ర మొత్తం పురుష నిర్మితం అని, స్త్రీలకేమీ గతం కాని, చరిత్ర కానీలేదనీ, కనీసం శ్రామిక వర్గానికున్నట్లు సంఘటిత శక్తిగాని, చైతన్యంగాని లేదని స్పష్టం చేసింది. కొంతమంది ప్రజాస్వామ్యవాదుల నిష్పక్షపాత వైఖరి, కృషి ఫలితంగా స్త్రీ పరిస్థితులలో మార్పురానారంభించినప్పటికీ నేటికీ స్త్రీ అంగవైకల్యంతోనే ఉన్నదనే అభిప్రాయం వ్యక్తం చేసింది. సిమోన్ ద బూవుఆర్. అన్ని కాలాలలోను స్త్రీలు పురుషులతో సమాన సంఖ్యలో ఉన్నప్పటికీ, చరిత్ర పొడవునా వారు పురుషులకు అధీనులుగాను, అప్రధానమైనవారుగాను వున్నారని ఆమె పేర్కొన్నది. దానికి కారణం స్త్రీ జన్మించింది మొదలు తమను తాము గుర్తుంచుకోవడంలోగానీ, సమాజం వారిని గుర్తించడంలోగాని వారి స్త్రీత్వానికి ఇచ్చిన ప్రాధాన్యత వారి మానవత్వానికి ఇవ్వబడలేదని ఆమె బలంగా విశ్వసించింది.

స్త్రీ అంటే ఏమిటి ? ఆడ, మగా అనే సెక్స్ ద్వైదీ భావం ఎందుకు సంఘర్షణకు దారితీస్తుంది ? సంఘర్షణలో పురుషుడే ఎందుకు గెలుస్తున్నాడు ? స్త్రీ ద్వితీయురాలు ఎందుచేత ? ఎవరైనా ద్వితీయులుగా ఉండిపోవడానికి ఇష్టపడతారా? స్త్రీ పురుషాధిక్యాన్ని ఎందుకు తిరస్కరించదు ? స్త్రీ విషయంలో లొంగుబాటు ఎక్కడనుండి వస్తుంది ? స్త్రీ స్థానంలో వున్నవారెవరైనా ఎలా సాఫల్యం పొందుతారు ? ఏయే మార్గాలు ఆమెకి తెరచివున్నాయి ? ఏవేవి మూసుకుపోయాయి ? ఇతరులపై ఆధారపడవలసిన వచ్చినపుడు స్వాతంత్ర్యం సాధించడమెలాగ ? స్త్రీ విముక్తికి ఆటంకకరమైన అంశాలేవి ? వాటిని ఎలా అధిగమించడం ? అనేకమైన ఈ ప్రశ్నలకు విశ్లేషణాత్మకంగా సమాధానాలను ఇవ్వడానికి ప్రయత్నించింది. కనుకనే ఆమెను గొప్ప స్త్రీవాదిగా పేర్కొనవచ్చు. ప్రాచీన కాలం నుండి ఆధునికి కాలం వరకు వివిధ తత్వవేత్తలు, రచయితలు, మేధావులు, స్త్రీవాదులు స్త్రీల గురించి వ్యక్తం చేసిన అభిప్రాయాలను ఉదహరించి, విమర్శనాత్మకంగా విశ్లేషించి, తన అభిప్రాయాలను ధైర్యంగా వ్యక్తం చేసిన గొప్ప స్త్రీవాది సిమోన్ ద బూవుఆర్.

## 17.4. స్త్రీ అంటే ?

స్త్రీ యొక్క విలక్షణమైన అస్తిత్వాన్ని ముందుగా గుర్తిస్తే, ఆయా కాలాలలో, ఆయా రంగాలలో స్త్రీ పాత్రను విశ్లేషించటం సులభం అవుతుందని సిమోన్ ద బూవుఆర్ భావించింది. అందుకే ముందుగా స్త్రీ అంటే ఎవరు ? అనే ప్రశ్నకు జీవశాస్త్ర, మానసిక విశ్లేషణాశాస్త్ర మరియు చారిత్రక భౌతికవాద దృక్పథంతో సమాధానం ఇవ్వడానికి ఆమె ప్రయత్నించింది. తరువాత వాస్తవ ప్రపంచంలో స్త్రీ ఎలా రూపొందిందో, ద్వితీయం ఎందుచేతో వివరించింది. ఆ తరువాత మానవ సమాజంలో పూర్తిస్థాయి సభ్యురాలిగా, స్వతంత్ర జీవిగా, ఎలాంటి జీవితం గడపాలో కూడా వివరించింది.

### 17.4.1 జీవశాస్త్ర, మానసిక విశ్లేషణా శాస్త్రదృక్పథం :

స్త్రీ అంటే ఎవరు ? అనే ప్రశ్నకు వివిధ తత్వవేత్తలు ఇచ్చిన నిర్వచనాలను ముందుగా పరిశీలించింది. అరిస్టాటిల్ (క్రీ.పూ. 384 - 322) 'కొన్ని లక్షణాలు లోపించటం వలన ఆడది ఆడదే' అన్నాడు. అసలు ప్రకృతి సిద్ధంగా కూడా స్త్రీ స్వభావంలో కొన్ని లోపాలున్నాయని వారు మందకొడిగా వుంటారనీ, తార్కికశక్తి తక్కువని, నిర్ణయాలు తీసుకునే శక్తి కూడా తక్కువగానే ఉంటుందని పేర్కొన్నాడు.

సెయింట్ థామస్ స్త్రీని 'అసంపూర్ణమైన మనిషి' యాదృచ్ఛికమైన మనిషి అని పేర్కొన్నాడు.

మిఛెట్ 'స్త్రీ సాపేక్ష వ్యక్తి' అని వ్రాశాడు.

స్త్రీని నిర్వచించడానికి గర్భసంచి, అండం అనే పదాలు చాలని భావిస్తుంటారని, అలాగే మగవాని శరీరాన్ని సహజసిద్ధమైనది గాను, స్త్రీ శరీరాన్ని ప్రత్యేకమైనది, అభ్యంతరమైనదిగాను చాలామంది పరిగణిస్తుంటారని, అది సరైన అభిప్రాయం కాదని విమర్శిస్తుంది. సిమోన్ ద బూవుఆర్ స్త్రీ అంటే శరీరం, పొత్తికడుపు అని, ఆమె జీవితమలక్ష్యం అండోత్పత్తి అనే భావన అంతటా, అన్ని కాలలలోనూ పాతుకునిపోయిందని ఆమె అభిప్రాయం. స్త్రీని అనేకమంది పరిమిత పరిధిలోనే నిర్వచించారని, అండం, గర్భాశయం అనే ప్రత్యేకతలు స్త్రీని జీవితాంతం స్త్రీత్వపు బోనులో బంధిస్తాయని ఆమెనొక ప్రత్యేక ప్రకృతికి గురిచేస్తాయని సిమోన్ ద బూవుఆర్ పేర్కొన్నది.

సిమోన్ ద బూవుఆర్ స్త్రీ శరీర నిర్మాణాన్ని గురించి విస్తృతంగా పరిశీలించింది. తొలి యౌవనం నుంచి ఋతుస్రావం ఆగిపోయేవరకు స్త్రీ శరీరం ఒక అద్భుత నాటకానికి రంగస్థలంగా మారుతుందని, దానితో ఆమెకి ఏమీ సంబంధం ఉండదని పేర్కొన్నది. యౌవన గండం, నెలనెలా ఋతుస్రావం, బిడ్డ పుట్టుక, మెనోపాజ్, తరచు జబ్బుపడటం ఇవన్నీ స్త్రీకి ప్రత్యేకం అని స్త్రీ శరీరాన్ని గూర్చిన విశ్లేషణలు చేసింది ఆమె. స్తన్య జాతులన్నిట్లో మానవ స్త్రీ చాలా ప్రత్యేకమైనదని, స్త్రీ సంతానోత్పత్తికి, తల్లితనానికి దగ్గరగా వుంటే, తండ్రికి సెక్స్ కార్యక్రమం, వీర్యఉత్పత్తి ప్రధాన కార్యక్రమవుతుందని, స్తన్యజాతుల్లో మగవానిదే ఎప్పుడూ పెత్తనం అని సిమోన్ ద బూవుఆర్ పేర్నొన్నది. గర్భధారణ అంతా సక్రమంగా జరిగితే చాలా మామూలు ప్రక్రియ అని, కానీ ఒక్కొక్కసారి ఆమె ప్రాణానికి ప్రమాదకరం కావున స్త్రీ శరీరం స్త్రీది కాదని, మగవాని విషయం ఇందుకు భిన్నంగా స్వతంత్ర అస్తిత్వం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం చేసింది.

మగవాడు ఆడదానికంటే పెద్ద శరీరంతో, బలంతో, వేగంతో వుంటాడు. కాని ఆడది మగవాని కంటే బలహీనమైనది, కండరబలం తక్కువ, రక్తంలో ఎర్రరక్తకణాలు తక్కువగా ఉంటాయి, ఊపిరితిత్తుల బలం తక్కువ, మెల్లిగా పరిగెత్తుతుంది, తక్కువ బరువులు మొయ్యగలదు, దేనికయినా తట్టుకునే శక్తి తక్కువ, అందుచేత లోకంపై అవగాహన కూడా తక్కువ అనే వాస్తవాలు వాటంతటవే వాస్తవాలు కావని పేర్కొన్నది. సిమోన్ ద బూవుఆర్ ఇవన్నీ సాపేక్షమైన అంశాలనీ, మగవాడు ఏర్పరచిన ప్రమాణాలనీ, అవి వాస్తవాలని వాదించే ముందు ఆర్థిక, సాంఘిక అవకాశాల్ని కూడా పరిశీలించాలంటుంది ఆమె. పురుషులు వారి శరీరాల కారణంగా స్త్రీలకంటే గొప్పవాళ్ళనీ, వాళ్ళే కుటుంబానికి ప్రధాన పోషకులనే వాదనను తిరస్కరిస్తుంది సిమోన్ ద బూవుఆర్.

సిగ్మండ్ ఫ్రాయిడ్ స్త్రీల గురించి "వారి శరీరనిర్మాణమే వారి గమ్యం" అంటాడు. అతని దృష్టిలో సాధారణ మానవులంటే పురుషులే. అతని నిర్వచనం ప్రకారం స్త్రీలు పురుషాంగం లేని వికృత మానవులు ఆ లోపాన్ని పూరించుకోవడానికి చేసే పోరాటం కేంద్రంగానే స్త్రీల మానసిక నిర్మాణమంతా ఉంటుంది. స్త్రీల శరీరమే వారి మనస్తత్వాన్ని నిర్ణయిస్తుందనే మానసిక విశ్లేషణా దృక్పథాన్ని, ఫ్రాయిడ్ వాదనను తిరస్కరిస్తుంది సిమోన్ ద బూవుఆర్. స్త్రీ అంటే అండాలు ధరించేది మాత్రమేఅని, పురుషుల్లో వీర్యం కలవాడు అని మాత్రమే నిర్వచించడం ఎంతమాత్రం సరైందికాదని, స్త్రీకి ఒక సాధారణ నిర్వచనం ఇవ్వడం చాలా కష్టమనీ అంటుంది ఆమె. 'ఆడది' అనే పదం ఒక అవమానకరమైన తిట్టులాంటిదిగాను, 'మగవాడు' అనే పదం

గర్వంతో కూడిన గౌరవప్రదమైనది గాను సమాజంలో వాడుకలోనున్నదని, ఈ పదం ఆమెను సెక్స్‌కి బంధిస్తుందని, దీనికి కారణం ఆడది మగవాడి దృష్టిలో సెక్స్ తప్ప ఇంకేం కాదని అంటున్నది సిమోన్ ద బూవుఆర్.

### 17.4.2 చారిత్రక భౌతికవాద దృక్పథం :

స్త్రీ అణిచివేతకు గల మూలాలను జీవశాస్త్రరీత్యా, పరిశీలించిన అనంతరం, స్త్రీ వున్న వాస్తవ పరిస్థితులలో పరిశీలించింది సిమోన్ ద బూవుఆర్. మానవ చరిత్ర చూడగా ఆడ, మగా రెండు సెక్స్‌లు ఆది నుంచి వున్నాయని తెలుస్తుంది. అయితే ఈ ప్రపంచాన్ని మానవ చరిత్ర కేవలం శరీరం ద్వారా మాత్రమే నిర్వచించదని, అలాగే స్త్రీని కూడా కేవలం ఒక సెక్స్ ప్రాణిగా మాత్రమే భావించకూడదని పేర్కొన్నది. స్త్రీకి తన గురించిన స్పృహ కేవలం సెక్స్ వల్లనే కలుగదు అని, సాంఘిక, ఆర్థిక వ్యవస్థల వల్ల కూడా కలుగుతుందనే అభిప్రాయం వ్యక్తం చేసింది సిమోన్ ద బూవుఆర్. స్త్రీ అణచివేతకు గల మూలాలను చారిత్రక భౌతికవాద దృక్పథంతో పరిశీలించిన ఏంగిల్స్, బాబెల్ వాదనలను ముందుగా పరిశీలించి తరువాత తన అభిప్రాయాలను వ్యక్తం చేసింది ఆమె.

1884లో ఫ్రెడరిక్ ఏంగిల్స్ "కుటుంబం, వ్యక్తిగత ఆస్తి, రాజ్యాల పుట్టుక" అనే గ్రంథంలో 'స్త్రీల లొంగుబాటు వ్యక్తిగత ఆస్తితో ప్రారంభమైనదని' 'అప్పుడే చారిత్రాత్మకమైన స్త్రీల పరాజయం' జరిగిందని చెప్పాడు. ఆదిమ దశలో వివాహం, వ్యక్తిగత ఆస్తిలేవని, ఆ దశలో స్త్రీ పురుష వివక్షలూ వుండేవికావని పేర్కొన్నాడు. క్రమంగా రాగి, ఇత్తడి, ఇనుము మొదలైన లోహాలు, నాగలి కనిపెట్టాక వ్యవసాయం విస్తరించి మనిషికి ఇతర మనుషుల శ్రమ అవసరమై, బానిసత్వం పెరిగింది. పశువుల రూపంలో, బానిసల రూపంలో సంపదను పోగుచేసుకోవటం మొదలుపెట్టారు. ఇదంతా వ్యక్తిగత ఆస్థి ఏర్పడటానికి దారితీసిందని, పురుషులు అధికారాన్నీ, సంపదనూ తమ స్వాధీనంలో ఉంచుకొని తమ పిల్లలకు సంక్రమింపచేయాలనుకున్నారని, ఈ వారసత్వ నిర్ధారణ కోసం తల్లి హక్కుని తీసేసారని ఏంగిల్స్ పేర్కొన్నాడు. తండ్రి హక్కుని స్థిరపరచటం కోసం స్త్రీలను ఇళ్ళకే పరిమితం చేసే వారి లైంగికత్వాన్ని కంట్రోలు చేసారని ఏంగిల్స్ అభిప్రాయం. భూమిపైనా, బానిసలపైనా ఆధిపత్యం వహించే మగవాడు స్త్రీపై కూడా ఆధిపత్యం వహించాడని పేర్కొన్నాడు. ఈ విధంగా ఏంగిల్స్ గానీ, ఇతర మార్క్సిస్టులు గానీ, స్త్రీల అణిచివేతను, స్త్రీలను తక్కువగా చూడటాన్ని ఆర్థికపరమైన ఆలోచనలతోనే వివరించారు. ఆడవాళ్ళూ, శ్రామికులూ ఇద్దరూ అణగారినవాళ్లేనని, ఇద్దర్నీ ఆర్థికాభివృద్ధి ద్వారా విముక్తి చెయ్యాలని, అందుకు సాంఘిక తిరుగుబాటు అవసరమనీ బాబెల్ పేర్కొన్నాడు.

శ్రమ విభజన వర్గవిభజనను తలపించే మాట నిజమేకాని, అదే పూర్తి నిజం కాదని, వర్గవిభజన వెనుక జీవశాస్త్రపరమైన కారణం ఏదీ లేదంటుంది సిమోన్ ద బూవుఆర్. స్త్రీని శ్రామికురాలిగా మాత్రమే భావించే అవకాశం లేదనీ, ఎందుచేతనంటే ఆమె ఉత్పత్తిశక్తి, సామర్థ్యం ఎంత ముఖ్యమైనదో ఆమె పునరుత్పత్తి శక్తి కూడా అంతే ముఖ్యమైనదని ఆమె అభిప్రాయం. సంతానోత్పత్తి సమస్యను గుర్తించిన ఏంగిల్స్ సోషలిస్ట్ సమాజం వస్తే కుటుంబం రద్దవుతుందని చెప్పాడు. కాని ఇది సంతృప్తికరమైన పరిష్కారం కాదని, గర్భధారణతో ఏ పనినీ సమానంగా చూడలేమని, ఎందుకంటే మాతృత్వంలో ఎంతో సమయం శక్తి వెచ్చించాలి అని సిమోన్ ద బూవు ఆర్ పేర్కొన్నది. మాతృత్వం కారణంచేత స్త్రీ విలువయిన జీవితావకాశాల్నీ, ఆనందాల్నీ కోల్పోతుందనీ, ఆడదాన్ని తరచుగా తల్లిని చేసి, బిడ్డను పెంచడంలో ఆమెకే విధమైన సహాయం లేకపోతే ఈమె అణగారిపోతుందనే అభిప్రాయం వ్యక్తం చేసింది.

స్త్రీకి సంబంధించినవన్నీ పురుషుని కారణంగానే వచ్చినవనే మానసికశాస్త్ర దృక్పథంకానీ, స్త్రీకి గల లైంగికత అంతా

పరోక్షంగా ఆర్థిక కారణాలపై ఆధారపడిందనే మార్క్సిస్టు దృక్పధంగానీ స్త్రీని పూర్తిగా నిర్వచించలేవని పేర్కొంది సిమోన్ ద బూవుఆర్. అందుకే 'యోనికల వ్యక్తి' లేక 'భగము కల వ్యక్తి' అని చెప్పటం ఎంత అర్థంలేదో, 'బూర్జువా' లో 'ప్రోలిటేరియట్' అనీ చెప్పటం కూడా స్త్రీ విషయంలో అర్థం లేనిదని, ఏ పదము స్త్రీని సమగ్రంగా నిర్వచించలేదని పేర్కొన్నది.

## 17.5. ద్వితీయ భావన :

మానవ జీవితం నిరంతరం ఘర్షణలోంచి పరిణామం చెందిందని, సంఘర్షణలేనిదే అస్తిత్వం వుండదని, మానవులలో ఏ ఇద్దరు ఒక దగ్గర చేరినా, ఒకరు మరొకరిపై ఆధిక్యత ప్రకటించుకోవాలని చూస్తారని సిమోన్ ద బూవుఆర్ అభిప్రాయం. స్త్రీని, స్త్రీకి పురుషుడితో గల సంబంధాలను అర్థం చేసుకోవడానికి పై భావనను అన్వయిస్తుంది ఆమె. మగవాళ్ళు మొదటినుంచీ సమస్తాధికారాలూ తమ గుప్పిట్లోనే వుంచుకున్నారన్నది మనకు చరిత్ర చెబుతున్న సత్యం అని అంటుంది ఆమె. పురుషులు న్యాయ సూత్రాలూ, సాంఘిక ధర్మాలూ తమకనుగుణంగా నిర్మించి, స్త్రీనొక వ్యతిరేక వ్యక్తిగా, వేరే వ్యక్తిగా, పరాయిదాన్నిగా చేశారని, అది వారి అస్తిత్వాన్ని నిలబెట్టుకోవడానికి కూడా బాగా పనికొచ్చిందని ఆమె అభిప్రాయం.

ద్వితీయం అనగా రెండవస్థాయి మానవి. స్త్రీలని పురుషులు ద్వితీయులుగానే పరిగణించారని, ఆ ద్వితీయం అతనికొక రకంగా అవసరమే అయ్యిందని పేర్కొన్నది. తనకంటే భిన్నమైన మరొక ద్వితీయ వ్యక్తిని సృష్టిస్తేనే అతని అస్తిత్వం సువ్యవస్థితం అయి, స్థిరీకరణ చెందుతుందని, అందుకే పురుషుడు ద్వితీయం అయిన ఆమె గురించి ఆలోచించకుండా, తన గురించి ఆలోచించలేదని సిమోన్ ద బూవుఆర్ అభిప్రాయపడింది. పురుషుడు ఈ ప్రపంచాన్ని ద్వంద్వ భావంతోనే చూసాడని అయితే ద్వందానికర్థం సెక్స్ ద్వయం అని మాత్రం కాదని అంటుంది. పురుషుడు తానే గనుక, సహజంగానే ఆ రెండవది స్త్రీయే, ద్వితీయం స్త్రీయే అనే భావన అభివృద్ధి చేసారని అంటుంది.

'స్త్రీని సృష్టించినందుకు భగవంతునికి సదా కృతజ్ఞతలు. 'మగవానికి స్త్రీని అందించి ఈ ప్రకృతి చాలా మంచి పని చేస్తుంది'. ఈ వాక్యాలలో మగవాడు తన 'ఆధిక్యతను', స్త్రీ 'ఆధారిత' అనే భావాన్నీ, తన తిరుగులేని ప్రాధాన్యాన్నీ, ఆమె అప్రాధాన్యాన్ని, తను అధికారిననీ, ఆమె కేవలం యాదృచ్ఛికమైనదనే భావాన్ని స్పష్టం చేస్తున్నాడనీ పేర్కొంది. సిమోన్ ద బూవుఆర్ మగవాడు అద్వితీయుడు కనుక, అద్వితీయుడైన మగవాని మందు స్త్రీ ద్వితీయురాలు అనే భావన అభివృద్ధి చెందిందనీ, అయితే ఆమె లేని ఉనికి అతనికీ అసాధ్యమే కనుక స్త్రీ, పురుషునికి అత్యంత అవసరమైన ద్వితీయురాలిగా పరిగణించబడిందని పేర్కొంది సిమోన్ ద బూవుఆర్.

మాతృస్వామ్య వ్యవస్థలో పురుషులు ప్రకృతికి, స్త్రీకి అనుబంధంగా వుండి, తమను తాము శక్తిహీనుల్ని చేసుకొని, స్త్రీకి తమను తాము బానిసలుగా చేసుకుని, తమ స్వాతంత్ర్యం కోల్పోయారని, అయితే ప్రేమతో కాక, భయంతో ఆమెను పూజించారని సిమోన్ ద బూవుఆర్ పేర్కొంది. కానీ త్వరలోనే వారు తిరిగి తమ స్వాతంత్ర్యాన్ని సంపాదించారని, ప్రకృతి నుంచి విముక్తి సాధించినప్పుడే పురుషుడు స్త్రీ నుంచి స్వేచ్ఛను పొందాడని అంటుంది ఆమె. మనిషి స్వతంత్రుడైన తరువాతే 'ద్వితీయ' భావన ఏర్పడిందని, పురుషుడు ప్రథముడై స్త్రీని ద్వితీయం చేసాడని ఆమె పేర్కొన్నది. స్త్రీ తనంతతానుగా ద్వితీయ స్థానాన్ని కోరుకోలేదని, ఆ స్థానానికి పురుషుడే బలప్రయోగంతో నెట్టాడని, ఆమె శ్రమనీ, పాత్రనీ గుర్తించక ఆమెను ద్వితీయం చేసాడని, మగవాడి అధికారవాంఛే ఆడదానికి శాపమైందనే అభిప్రాయం వ్యక్తం చేసింది సిమోన్ ద బూవుఆర్.

ద్వితీయ భావన ఎప్పుడు ప్రారంభమైంది ? ఎలా అభివృద్ధి చెందింది ? అనే ప్రశ్నలకు సిమోన్ ద బూవుఆర్ ఇచ్చిన వివరణ ఈ క్రింది విధంగా ఉంది.

ఆదిమ మానవులు సంచార జీవులుగానున్నపుడు వారికి సంతానోత్పత్తిలో తండ్రి పాత్ర ఎటువంటిదో తెలియదు.

స్త్రీయే తన శరీరంలో జీవిని పెంచి, పోషించి, జన్మనివ్వడం కంటికి కన్పించే సత్యం కనుక, స్త్రీయే బిడ్డ పుట్టుకకి తప్పనిసరి అని తెలుసు ఆదిమ మానవులకి. స్త్రీద్వారానే జాతి ఈ ప్రపంచంలో మనగల్గుతుంది, వృద్ధి చెందగల్గుతుంది. కావుననే స్త్రీ పూజనీయురాలైంది. ఆదిమ మానవులకి దొరికిన సంపదని సేకరించడం మించి ఇంకేమీ తెలియదు. సమస్తమూ ప్రకృతి అధీనమని, తమకేమీ శక్తిలేదని భావించేవారు. స్త్రీ శరీరంలోంచి సంతానం వచ్చినట్లే, భూమిలోంచి పంటలు వస్తాయనీ, భూమి లాగే స్త్రీ శరీరం కూడా సారవంతమైందనీ అనుకున్నారు. మొత్తం ప్రకృతి యావత్తూ స్త్రీలో నిక్షిప్తమై వుందని, సంతానోత్పత్తిపై, భూసంపదపై భక్తి భావం ఉంచారు. అందుచేత జాతి వారసత్వం, పొలాలు. పంట యావత్తూ తల్లి ద్వారానే బిడ్డలకి సంక్రమిస్తుంది. ఈ మాతృస్వామ్య విధానంలో స్త్రీది మహోన్నత స్థానమైనా, ఆమెకి సర్వాధికారాలు ఉన్నట్టుకాదని, నిజానికి స్త్రీకి ఆ సువర్ణయుగం కేవలం ఒక అభూతకల్పన, భ్రమ, ఊహ అనే అభిప్రాయం వ్యక్తం చేసింది సిమోన్ ద బూవుఆర్. స్త్రీని భూమి, మాతృమూర్తి, దేవత అని అంటే ఆమె మగవాడి కళ్ళల్లో సహజీవి, తోటివ్యక్తి కాదని, మానవ ఊహకి అతీతంగా ఆమెకొక ప్రత్యేక స్థానం ఇచ్చి, ద్వితీయురాలు అని చెప్పడమే సిమోన్ ద బూవుఆర్ అభిప్రాయం.

ఏ కాలంలో అయినా సర్వాధికారాలూ పురుషుని ఆధీనంలో వున్నాయని, స్త్రీ ద్వితీయంగానే పరిగణించబడిందనే విషయాన్ని సిమోన్ ద బూవుఆర్ ఈ క్రింది విధంగా వివరించింది.

మానవజాతి ఆవిర్భావం ప్రారంభం నుంచి మగవారికొక సౌకర్యం ఉంది. అది శారీరక సౌకర్యం, శక్తి. ఆశక్తితోనే ఆది మానవుడు ప్రకృతితో నిరంతర యుద్ధంచేసి, ప్రకృతిపై కొంతమేరకు ఆధిపత్యం వహించి, తన అవసరాలకు కోరికలకు, ఇష్టాఇష్టాలకు అనుగుణంగా మలచుకున్నాడు. శ్రమ శక్తితో భూమిని ఫలవంతం చెయ్యవచ్చుననీ, ఫలానా విత్తనం, ఫలానా ఋతువులో ఫలానా విధంగా నాటాలనీ, అలా నాటితే పంట పండుతుందని కనుగొన్నాడు. భూమి, పంటలూ, వ్యవసాయం, ఇవన్నీ మంత్రతంత్రాలూ, మార్మిక శక్తులూ కావని, తన శ్రమ యొక్క సృజనాత్మకతను, తానొక సృష్టికర్తననీ గ్రహించాడు. ప్రకృతితో పోరాటంలో ఎన్నో ప్రమాదాలు ఎదుర్కొన్నాడు, ప్రాణాలు ఇచ్చాడు. కానీ భాధాకరమైన విషయం ఏమిటంటే ఈ యుద్ధాలన్నింటిలో ఆడవార్ని మినహాయించాడు. ప్రకృతిపై జరిగిన పోరాటంలో జీవశక్తి, కాంతి, మేధస్సూ సమస్తమూ పురుషాధీనమైనాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే పురుషుడు ఎప్పుడు భూమికి యజమాని, అధికారి అయ్యాడో, స్త్రీకి కూడా అధికారి, యజమాని, స్వామి అయ్యాడని, ఈ విధంగా ఏర్పడిన పురుషాధిపత్య వ్యవస్థ వలననే ద్వితీయం అనే భావన ఏర్పడిందంటుంది సిమోన్ ద బూవుఆర్.

ఆది నుండి స్త్రీల పరిస్థితి పురుషులకు భిన్నంగా ఉందని, శిశువులకు జన్మనిచ్చే ఆడవాళ్ళకి తాము నూతన సృష్టికి కారకులమనే గర్వం తెలీదని, అది వారిపట్ల ఒక బలహీనంగా పరిణమించిందని పేర్కొంది సిమోన్ ద బూవుఆర్. గర్భధారణ, ప్రసవం, ఋతుస్రావం ఇవన్నీ స్త్రీని బలహీనపరచి, ఆహారం కోసం, రక్షణ కోసం మగవాడి మీద ఆధారపడక తప్పని పరిస్థితి ఏర్పడిందని అంటుంది ఆమె. ఇప్పుడున్నట్లు ఆదిలో గర్భనిరోధక సాధనాలు లేవు కనుక వెంట వెంటనే గర్భధారణ, తల్లితనంతో అవినాభావంగా ఉన్న బిడ్డల పెంపకం, ఇంటి చాకిరీ ఇవన్నీ స్త్రీల శక్తిని హరించివేశాయని పేర్కొంది. స్త్రీ ప్రతినిత్యం ఏ కొత్తదనంలేని అనుత్పాదక శ్రమకి,శాశ్వత బానిసత్వానికీ బందీ అయిపోయిందనీ, శతాబ్దాలుగా ఏ నూతన సృష్టికీ ఆస్కారంలేని నిర్బంధానికి గురయిందని, మగవిలువలకు ఎదురుగా స్త్రీ - స్త్రీ విలువలంటూ ఏమీ ఏర్పరచుకోలేకపోయిందని సిమోన్ ద బూవుఆర్ స్పష్టం చేసింది.

మగవాడు ఆదినుంచీ సృష్టికర్తని, ఆయుధాలు కనిపెట్టటం ద్వారా ఆహార సంపాదన, పోషణ మగవాడి కర్తవ్యం అయితే, స్త్రీ గర్భం ధరించి, బిడ్డని కనవలసి రావడంవల్ల తన శరీరానికే తాను అంటిపెట్టుకొని ఉండిపోవలసి వచ్చిందనీ ఆమె పేర్కొంది. స్త్రీకి సంతానాన్ని పొందే శక్తి వున్నప్పటికీ పురుషుడే ఆమెకి యజమాని అయ్యాడనీ, దీనికి కారణం అతడు

సారవంతమైన భూమికి యజమాని కావడమేనని సిమోన్ ద బూవుఆర్ విశ్లేషించింది. ప్రకృతి శక్తులన్నీ స్త్రీలో నిక్షిప్తమై వున్నాయి, గనుక ప్రకృతి లాగే స్త్రీని కూడా పురుషుడు వశపరచుకున్నాడని, ఆధిపత్యం వహించాడని తెలుపుతూ, ఆ విధంగా ఏర్పడిన పురుషాధిపత్య వ్యవస్థనే పితృస్వామ్య వ్యవస్థగా పేర్కొంటూ, స్త్రీల తక్కువతనానికి, అణిచివేతకు కారణమైన పితృస్వామ్య వ్యవస్థను, అధికారాన్నీ తీవ్రంగా విమర్శించింది సిమోన్ ద బూవుఆర్.

## 17.6. పితృస్వామ్యం - అధికారంపై విమర్శ :

సిమోన్ ద బూవుఆర్ తన గ్రంథం "ది సెకెండ్ సెక్స్" లో స్త్రీలకి లభించవలసిన హక్కులు, అవకాశాల గురించి కాకుండా స్త్రీల తక్కువతనానికీ, అణిచివేతకీ గల కారణాలను గురించి, వారిని ద్వితీయుల్ని చేసిన వాస్తవ పరిస్థితులను గురించి విమర్శనాత్మకంగా విశ్లేషించింది. పురాతన యుగం నుండి నేటి ఆధునిక యుగం వరకు స్త్రీలను ద్వితీయుల్ని చేసిన పితృస్వామ్య వ్యవస్థ ఏ విధంగా వేళ్ళూనుకుపోయిందో వివరిస్తూ, పురుషుల ఆధీనమయిన సమస్త అధికారాలను ఆమె తీవ్రంగా విమర్శించింది.

మానవజాతి వృద్ధిపొంది లిఖిత పురాణాలు దశకు చేరుకునేసరికి పితృస్వామ్య వ్యవస్థ ఏర్పడిందనీ, ఆ వ్యవస్థలో మగవాళ్ళు ఆడవాళ్ళని తక్కువచేసి, ద్వితీయుల్ని చేసిచూసారని, దానితో స్త్రీ మరిన్ని బాధల్ని, బెదిరింపుల్నీ ఎదుర్కొనవలసివచ్చిందనీ సిమోన్ ద బూవుఆర్ పేర్కొన్నది. పితృస్వామ్య వ్యవస్థ ప్రారంభమైనప్పటి నుంచీ జీవితం ఉభయత్వాన్ని పొంది పురుషుడు ప్రథముడై, స్త్రీని ద్వితీయం చేసాడని, స్త్రీకి కొద్దిపాటి శక్తినీ, అధికారాన్నీ ఇచ్చినా స్త్రీ పురుషుని బానిస లేక కీలుబొమ్మలుగానే పరిగణించబడిందని సిమోన్ ద బూవుఆర్ అభిప్రాయం. పితృస్వామ్య సమాజాలలో బానిస కేవలం ఒక మానవరూపంలో వున్న జంతువు మాత్రమే అయినప్పటికీ, స్త్రీకి గల సంతానోత్పత్తి ముందు మగవాడు కాస్త జంకాడని, ఆ మేరకు ఆమెపై ఆధారపడటం వలన ఆమె బానిస కంటే కొంత సుఖపడిందనే అభిప్రాయం వ్యక్తం చేసింది సిమోన్ ద బూవుఆర్.

సమాజం పితృస్వామ్య వ్యవస్థగా మారడానికి కొంత ఘర్షణ జరిగిందని ప్రాచీన సాహిత్యం పేర్కొంటున్నప్పటికీ, అది అమల్లోకి రావటం కేవలం యాదృచ్ఛికం కాదని, అలాగని విప్లవాత్మకం కూడా కాదని, అది ఒక క్రమానుగత పరిణామం అయిఉంటుందని తెలియచేస్తుంది సిమోన్ ద బూవుఆర్. ఇంతవరకూ గల స్త్రీల చరిత్ర యావత్తూ పురుష నిర్మితం అని, ఆమె చరిత్రలో అత్యధిక భాగం పితృస్వామ్యంతోనే ముడిపడిందనీ, ఈ వ్యవస్థ ప్రారంభం నుండే పురుషులు స్త్రీలను తమ మీద ఆధారపడే అస్వతంత్ర జీవులుగా తయారుచేసారని విమర్శించింది సిమోన్ ద బూవుఆర్. పురుషునికి ఆస్థి ముఖ్యమై, అదే ప్రాణాధికమైన తరువాత వ్యక్తిగత ఆస్థి ఏర్పడి, పురుషులు స్త్రీల నుండి అన్ని హక్కుల్నీ ఆస్తుల్నీ బలప్రయోగంతో లాక్కోవడంతో స్త్రీ స్థానం తలకిందులైందని పేర్కొంది. పితృస్వామ్య వ్యవస్థ ఏర్పడిన తరువాత పునరుత్పత్తిలో పురుషుని పాత్ర, ప్రాధాన్యత పెరిగి, స్త్రీ బిడ్డల్ని కనిపెంచేదిగా, బానిసగా మారిపోయిందని, సంతానంతో జాతి విస్తరించినకొద్దీ పురుషుడు స్త్రీపై యాజమాన్యం, పెత్తనం, అధికారం సంపాదించాడని విమర్శించింది.

మానవుల సంచారజీవులుగా నున్నప్పుడు నిజానికి ఏ వ్యవస్థలూ లేవని, స్వంత ఆస్థిగానీ, వారసత్వంగానీ లేదని, మతం, ధర్మం, తటస్థంగా వుండిపోయాయని, మానవులు ఒక దగ్గర స్థిరపడి వ్యవసాయాదారులుగా మారాక వ్యవస్థలూ, న్యాయమూ వచ్చాయని పురుషులే కొన్ని విలువల్ని, నీతి సూత్రాల్ని సృష్టించారని ఏనాడూ స్త్రీలను వాటిలో జోక్యం చేసుకోనివ్వలేదని పేర్కొన్నది. పురుషుడు స్త్రీ కోసం కూడా ఒక ప్రపంచాన్ని సృష్టించాడని, అయితే అందులో ఆమెను బంధించడానికే అయివుంటుందని విమర్శించింది. స్త్రీని అణచివుంచేందుకు ఒక చట్టం రూపొందించవలసి వచ్చేసరికి సూత్రదారులు

న్యాయసూత్రాలన్నీ రెండు నాల్కల ధోరణితో, ద్వైది భావంతో రూపొందించారని సిమోన్ ద బూవుఆర్ తీవ్రంగా విమర్శించింది. జాతికి శాశ్వతంగా కొనసాగించడానికి మనిషి స్త్రీ తప్పనిసరి అవసరం కాబట్టి ఆమెకి సంఘంలో ఒక అవిభాజ్యమైన స్థానం ఇచ్చారని, అయితే ఆమె తన వ్యక్తిగత స్వాతంత్ర్యాన్ని, స్థానాన్ని కోల్పోయి మగవాడి ఆధీనంలోకి రావాలనే భావననే అన్ని మతాలూ, ధర్మశాస్త్రాలూ వక్కాణించాయని సిమోన్ ద బూవుఆర్ తెలిపింది. స్త్రీ మనిషి కాదు వస్తువని, ఆమెని బానిసగా మార్చుకునే ప్రయత్నం పురుషుడు చేసాడని, అయితే ఈ ప్రయత్నం ఒక క్రమం ప్రకారం, బహుశా కొన్ని శతాబ్దాలపాటు సాగిందని, ఇది ఆడవారి జీవిత పరిణామంలో ఒక మజిలీ అనే అభిప్రాయం ఆమె వ్యక్తం చేసింది. సంఘంలో వ్యక్తిగత ఆస్థి, పితృస్వామ్యం బాగా స్థిరపడిపోయాక, ఇక దానినెవరూ ప్రశ్నించే ప్రసక్తి లేనంతగా శాశ్వతం అయిపోయాక స్త్రీ పూర్తిగా పరాధీనమయిపోయిందని అంటుంది సిమోన్ ద బూవుఆర్. పితృస్వామ్యాన్ని ఏ సమాజంలో అయినా, ఏ కాలంలో అయినా ప్రభుత్వం గానీ, మరెవరయినా గానీ ప్రశ్నించలేదని, నియంత్రించలేదని ఆమె పేర్కొన్నది.

పితృస్వామ్య వ్యవస్థలో పురుషుడు స్త్రీని పుట్టినది మొదలు చనిపోయేవరకు తన అధీనంలోనే ఉంచుకుంటాడని, ఆమె నుండి అన్ని హక్కుల్నీ బలప్రయోగంతో లాక్కున్నాడని పేర్కొంది. సిమోన్ ద బూవుఆర్. ఈ పురుషాధిక్యం గ్రీకుల కాలంనాటి ఒక్క స్పార్టా నగరంలో తప్ప అన్ని నగరాల్లోనూ, రోమన్ల కాలంలోను, ఈజిప్షుల కాలంలోను మధ్యయుగంలోని అన్ని సమాజాల్లోను, ఆధునికి కాలంలోని అన్ని రాజ్యాలలోను ఏ విధంగా విస్తరించి, బలంగా పాతుకుపోయిందో వివరించింది సిమోన్ ద బూవుఆర్. వివిధ కాలాలలో, వివిధ సమాజాలలో ఆస్తి, వారసత్వపు హక్కు విషయంలోనూ, వివాహం, విడాకుల విషయాలలోనూ, కుటుంబ వ్యవస్థలలోను విస్తరించి ఉన్న పురుషాధికారాలను, పురుషాధిపత్యాన్ని ఈ క్రింది విధంగా వివరించింది సిమోన్ ద బూవుఆర్.

పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీ ఆస్తిహక్కు కల్గివుండటం క్షమార్హం గానీ నేరం. ఒకవేళ ఆమెకు తండ్రి వారసత్వం ఏమన్నా వుంటే అది మొత్తం భర్త కుటుంబానికే చెందుతుంది. అందుచేత ఆమెను తెలివిగా వారసత్వపు హక్కు నుండి తప్పించివేశారు. ఆమెకంటూ ఏ ఆస్తీ వుండదు కనుక ఆమె స్వతంత్ర వ్యక్తి కాదు. అందుకే ఆడపిల్లలు పుట్టీ పుట్టగానే చంపేస్తారు. ఒకవేళ ఆడపిల్ల బ్రతికినా మగవాడి దయాదాక్షిణ్యం క్రిందనే బ్రతకాలి. పితృస్వామ్య సమాజాలలో ఆడపిల్ల పెరిగి పెద్దదయ్యేంతవరకు తండ్రి సోత్తు, పెళ్ళైన తరువాత భర్త సొత్తు, స్త్రీ పెళ్ళితో ఒక తెగ నుండి మరొక తెగకు వెళ్లిపోతుంది. తను పుట్టి పెరిగిన కుదురు నుంచి పూర్తిగా వేరయిపోయి, వ్రేళ్ళతో పెకలించినట్లు దూరమై ఇంకో కుదురుకు, గుంపుకు వెళ్ళిపోతుంది. మరియు భర్త గుంపుకు చెందిపోతుంది. ఆమె కన్న పిల్లలు కూడా ఆమెకు చెందరు, ఆమె ఏ గుంపు మనిషో ఆ గుంపు లేక తెగకు కూడా చెందరు. ఆమె భర్తకు, అతని కుటుంబానికే చెందుతారు. పురుషుడు స్త్రీని ఒక జంతువునో, బానిసనో కొనుక్కున్నట్లు కొనుక్కుంటాడు. ఆర్థిక స్థోమత ఉంటే ఎంతమంది బానిసల్నయినా పెట్టుకున్నట్లే, ఎంతమంది భార్యల్నయినా ఉంచుకోవచ్చు. దీనిలో బహుభార్యాత్వానికి ఒక హద్దంటూ ఏమీ లేదు. ఉంటే అది ఆర్థిక స్థోమతే అని అంటుంది సిమోన్ ద బూవుఆర్. భర్త ఎప్పుడు వద్దనుకుంటే అప్పుడు భార్యను వదిలించుకోవచ్చు. ఈ విషయంలో కూడా సంఘం ఆమెకి ఏ విధమైన రక్షణ, భద్రత కల్పించదు. పితృస్వామ్య సమాజాలలో స్త్రీల శీలానికి చాలా ఎక్కువ విలువ. దాన్ని వారు చాలా జాగ్రత్తగా కాపాడుకోవాలి. అలాగే వ్యభిచారం విషయంలోను స్త్రీ పురుషులకు సమాన న్యాయం అంటూ ఏమీ లేదు. నేరం మొత్తం స్త్రీదిగానే పరిగణించబడుతుంది. మగవాడు స్త్రీతో వ్యభిచరించినా సరే శిక్ష మాత్రం స్త్రీకే. కొన్ని సమాజాలలో వ్యభిచారం చేసే స్త్రీని రాళ్ళతోకొట్టి చంపుతారు. భర్త మరణించిన భార్యది మరొక సమస్య. కొన్ని సమాజాలలో భర్తతోపాటు భార్యనూ సమాధి చెయ్యడమనే తీవ్రమయిన పరిష్కారం ఉండేది. కొన్ని సమాజాలలో అయితే ఆమెను భర్త కుటుంబానికే అప్పగించేస్తారు. ఈ కుటుంబంలో అన్నదమ్ములందరూ ఉమ్మడిగా అనుభవింపదగినదిగా ఆమెను పరిగణిస్తారు.

ఈ విధంగా అన్ని సమాజాలలోను, అన్ని విషయాలలోను స్త్రీ పురుషుడి అధీనంలోనే ఉంచబడిందని తీవ్రంగా విమర్శించింది సిమోన్ ద బూవుఆర్.

## 17.6.1 పురాతన యుగం :

ప్రాచీన గ్రీక్, రోమ్, ఈజిప్టు రాజ్యాలలో వున్న పితృస్వామ్య వ్యవస్థను ఈ క్రింది విధంగా వివరించింది సిమోన్ ద బూవుఆర్.

స్పార్టా లాంటి కొద్ది మినహాయింపులు తప్పితే, మొత్తం మీద గ్రీసుదేశపు ఆడవాళ్ళు బానిసలలాంటివాళ్ళే ఎందుకంటే వివాహం, విడాకులు, ఆస్థి, వారసత్వం మొదలగు అన్ని విషయాలలో పురుషులకే సమస్త అధికారాలు ఉండేవి. పిత్రార్జితమైన ధనాన్ని ఉంచుకునే హక్కు కుటుంబంలోని పెద్దకొడుక్కి ఉంది. ఏథెన్స్‌లో భార్య నిరంతరం పడకగదికీ లేక అంతఃపురానికి బంధితురాలై ఉండేది. ఆమెపై గట్టి నిఘా ఉండేది. యజమానుల చెప్పుచేతుల్లో ఆమె ఒక వస్తువులాగ, సరుకులాగ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి. వారసత్వపు పద్ధతి వుండే పితృస్వామ్య సమాజాలలో ఆస్తిహక్కు పొందే కొడుకు లేకపోతే సమస్య తలెత్తుతుంది. అలాంటి సమస్య తలెత్తినపుడు ఆడపిల్ల తన తండ్రి బంధువులలో ఒక పెద్దని పెళ్ళి చేసుకోవాలనే సాంప్రదాయం గ్రీకులలో ఉండేది. అయితే ఇక్కడ ఆడపిల్ల వారసురాలు కాదు. వారసుడైన మగపిల్లవాడిని కనడానికి ఉపయోగపడుతుంది. ఈ సాంప్రదాయం ఆడదాన్ని మగవాడి చేతిలో కీలుబొమ్మని చేస్తుందని విమర్శించింది సిమోన్ ద బూవుఆర్. గ్రీకు పౌరుడు వేశ్యావాటికలకి వెళ్ళేవాడు కాబట్టి ఆచరణలో బహుభార్యాత్వాన్ని అనుసరించినట్లేనని, అంతఃపురానికీ, వేశ్యావాటికలకీ పెద్ద తేడా ఏమీ లేదని ఆమె విమర్శించింది. గ్రీకు చట్టం విధించిన కట్నం స్త్రీ పోషణకుపయోగించటం వల్ల, ఒకవేళ విడాకులివ్వవలసి వస్తే కట్నం మొత్తం ఇచ్చేసే పద్ధతి ఉండటంవల్ల, కట్నం వలన ఒక విధంగా మేలే జరిగిందనే అభిప్రాయం వ్యక్తం చేసింది సిమోన్ ద బూవుఆర్.

రోమ్‌లో కుటుంబం, రాజ్యం మధ్య జరిగిన ఘర్షణే ఆడవారి చరిత్రకు మూలం. ప్రాచీన రోమ్ రాజు తార్కిన్ తరువాత పితృస్వామ్య వ్యవస్థ ప్రారంభమైందనేది స్పష్టమైన చారిత్రక సత్యం. వ్యవసాయ సంబంధమైన ఆస్తి, వ్యక్తిగత సంపద, కుటుంబ విధానం సామాజిక పునాదిగా ఏర్పడ్డాక స్త్రీ కుటుంబానికి పరిమితమైపోయింది. గ్రీసు దేశంలో ఆడవారికుండే పాటి చట్టపరమైర రక్షణ కూడా రోమ్‌లోని ఆడవారికి లేదు. అన్ని సామాజిక కార్యక్రమాలకి స్త్రీలను దూరంగా ఉంచి వారిని పూర్తిగా గృహబానిసల్ని చేసారు. స్త్రీకి ఆస్తిహక్కును నేరుగా నిషేధించలేదుకానీ, ఆమెకి ఆస్తిపై అధికారంలేదు. దీనికి కారణం ఆమె ఆస్తిని సంరక్షకుడి ఆధీనంలోనే ఉంచారు. రాజ్యం క్రమంగా స్థిరపడ్డాక, సర్వసత్తాక రాజ్యాంగం ఏర్పడ్డాక పరిస్థితులలో మార్పు వచ్చి కుటుంబ పెద్ద తీర్పు ఇవ్వడంపోయి అధికారాలన్నీ న్యాయస్థానానికే దఖలుపడ్డాయి. రోమన్ న్యాయవ్యవస్థ స్త్రీకి సంరక్షకుల నుంచీ, తండ్రి లేక భర్తనుంచీ ఒక ప్రక్క స్వతంత్ర్యం ఇస్తూనే, మరోప్రక్క ఆమెపై అనేక నిబంధనలు విధించి, తను అధికారాన్ని పొందింది.

అయితే అంతటా ఇలాంటి పితృస్వామ్య విధానమే లేదని, కొన్ని సమాజాలు ఆడవాళ్ళకు కొన్ని హక్కుల్ని అంగీకరించాయని పేర్కొంటూ వాటి గురించి సిమోన్ ద బూవుఆర్ ఈ విధంగా విశ్లేషించింది. కుటుంబ వలయంలోంచి ఏ మేరకు స్త్రీ బయటపడగలిగితే ఆ మేరకు పితృస్వామ్య పద్ధతి నుండి విముక్తి లభించినట్లేనని, అదే విధంగా వ్యక్తిగత ఆస్థి హక్కు లేని సమాజంలో స్త్రీ కూడా ఆ మేరకు బాగుపడినట్లేనని పేర్కొంటూ, గ్రీకు రాజ్యంలో ఈ అవకాశం ఉన్న ఏకైక పట్టణం స్పార్టానే అని సిమోన్ ద బూవుఆర్ అభిప్రాయం. స్పార్టాలో కమ్యూన్ల పాలన అమలులో ఉన్నప్పుడు స్త్రీకి అన్నివిధాలా మగవాడితో సమానస్థాయి ఉంది. ఆడపిల్లల్ని మగపిల్లలతో సమానంగా పెంచేవారు. వ్యక్తిగత ఆస్తిగానీ, వారసత్వ హక్కుగానీ

వుండేది కాదు. ఆడవాళ్ళు ఒక భర్తకి, ఒక యజమానికి లోబడి, కట్టుబడి ఉండవలసిన అగత్యంలేదు. పితృస్వామ్యం లేకపోవటంతో వ్యభిచారానికీ ఆస్కారం లేకుండా పోయింది. పిల్లలందరూ ఉమ్మడిగా నగరానికి చెందుతారు కనుక స్త్రీకి మాతృత్వపు బాధ్యతల నుండి కూడా విముక్తి లభించింది. గ్రీకు నగరరాజ్యాలన్నింటిలో ఒక్క స్పార్టా నగరంలోనే స్త్రీ పరిస్థితి మగవాడితో సమానస్థాయిలో వుండేది. మిగిలిన ప్రాచీన సమాజాలన్నింటిలో సమస్త అధికారాలూ పురుషుని అధీనంలో ఉండటమే స్త్రీల తక్కువతనానికీ కారణమంటుంది సిమోన్ ద బూవుఆర్.

### 17.6.2 మధ్యయుగం :

మధ్యయుగంలో క్రైస్తవ మత ప్రభావంతో రోమ్ చట్టం, న్యాయవ్యవస్థ వెనుకుదువుకు గురై ఆడవారి పరిస్థితి మరింతగా దిగజారిపోయింది. క్రైస్తవ మత సిద్ధాంతం ఆడవారి అణచివేతకు ఎంతగానో దోహదం చేసిందని, అది వారి చట్టాన్ని, క్రైస్తవ సూత్రాల్ని, న్యాయాన్ని నమ్ముకొని ఉండక తప్పని పరిస్థితి తెచ్చిపెట్టింది. క్రైస్తవ మతం స్త్రీ వ్యతిరేక వైఖరి అవలంబించిందని, ఇదంతా సెయింట్ పాల్ ద్వారా అమలు జరిగిందని సిమోన్ ద బూవుఆర్ పేర్కొన్నది. సెయింట్‌పాల్ స్త్రీల పట్ల పక్షపాత వైఖరి అవలంబించి, 'మగవాడు స్త్రీ కోసం కాదని, స్త్రీ మగవాడి కోసమేనని' కొన్ని చోట్ల, 'చర్చి క్రీస్తు చెప్పుచేతలలో వున్నట్లే, స్త్రీ మగవాని చెప్పుచేతులలో వుండవలెనని' కొన్నిచోట్లా వ్యక్తం చేసిన భావాలే స్త్రీ అణచివేతకు కారణమైందని తీవ్రంగా విమర్శించింది సిమోన్ ద బూవుఆర్. 'సమస్త ఆటవిక జంతువులలో స్త్రీ మరింత క్రూరమైనది, ఆటవికమైంది' అనే సెయింట్ ఆంబ్రోస్ భావనను, 'ఒక అసంపూర్ణమైన పురుషుడే స్త్రీ అని, క్రైస్తు మానవుని కంటే ఏ విధంగా ఉన్నతుడో, అదే విధంగా పురుషుడు స్త్రీ కంటే ఉన్నతుడు' అనే సెయింట్ థామస్ భావాల్ని తీవ్రంగా గర్హిస్తుంది సిమోన్ ద బూవుఆర్. మధ్యయుగంలో క్రైస్తవ మతం స్త్రీలకి ఏ విధమైన స్వతంత్ర సాంఘిక జీవితంగానీ, హక్కులు గానీ లేకుండా చేసి, వారిని ద్వితీయుల్ని చేసిందని సిమోన్ ద బూవుఆర్ విమర్శించింది.

మధ్యయుగంలో భూస్వామ్య వ్యవస్థ ఏర్పడిన తరువాత ఆడవారి పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారిందని, వారికి ఏ విధమైన అధికారమూ, ఆస్థి లేకుండా పోయిందని, దాదాపు పదకొండో శతాబ్దంవరకు అదే పరిస్థితి కొనసాగిందని అంటుంది సిమోన్ ద బూవుఆర్. ఆడపిల్లల్ని ముఖ్యంగా భర్త మరణించిన ఆడవాళ్ళని క్రూరంగా చంపిన సంఘటనలు ఆనాటి కావ్యాల్లో అనేకం కన్పిస్తాయి. కొద్దిమంది స్త్రీలు మినహాయిస్తే సాధారణ స్త్రీలు ఇంట్లో ఉంటూ ఏ విధమైన మార్పులేని నిరర్ధకమైన జీవనం గడుపుతూ చనిపోయేవారు. ఇంటిపనులు చేయడానికి, సంతానం కనిపెంచడానికి తప్ప మరే అధికారం, హక్కులు స్త్రీలకు లేవని, ఇదే పరిస్థితి దాదాపు అన్ని దేశాలలో కొనసాగిందని, ఈ దేశాలన్నింటిలో స్త్రీలకు దక్కిన బహుమానం కుటుంబ బానిసత్వం, ఫలితంగా వ్యభిచార జీవితం అనే అభిప్రాయం వ్యక్తం చేసింది సిమోన్ ద బూవుఆర్. చర్చి (మతాధికారులు) గానీ, భూస్వామ్య వ్యవస్థగానీ స్త్రీలను ఏ విధంగానూ ఆదుకోలేదని, స్త్రీలు పురుషునికి బానిసకాకుండా ఏచట్టమూ, న్యాయమూ వారిని కాపాడలేకపోయాయని ఆమె అంటుంది. అన్ని న్యాయసూత్రాలకూ, చట్టాలకూ క్రైస్తవమత నిబంధనలే పుట్టినిల్లని అవి ఆడవారి పట్ల అణచివేత వైఖరిని అవలంబించాయని సిమోన్ ద బూవుఆర్ విమర్శించింది.

### 17.6.3 ఆధునిక యుగం :

పదహేనవ శతాబ్దం ప్రారంభం నుండి పంతొమ్మిదో శతాబ్దం వరకూ స్త్రీల సాంఘిక స్థితిగతులను, వారిపై కొనసాగుతున్న పురుషాధిపత్యమును సిమోన్ ద బూవుఆర్ క్రింది విధముగా విశ్లేషించింది. ఇటలీలో వచ్చిన సాంస్కృతిక పునరుజ్జీవనం

ఫలితంగా ఉన్నత, సంపన్న వర్గాలలో మాత్రం కొద్దిపాటి అభివృద్ధి కన్పిస్తుంది. చదువు, సంస్కారం, ధనం అన్నీ సమకూడివున్న నేపథ్యంలోంచి వచ్చిన కొద్దిమంది ఆడవాళ్ళు కళాకారులూ, రచయిత్రులూ, సంగీతకారిణిలూ, అధికారులూ, యుద్ధవీరులూ అయ్యారు. సామాన్య, మధ్యతరగతి కుటుంబాల నేపథ్యం కలిగిన స్త్రీల విషయంలో నిబంధనలు ఎప్పటిలాగే కఠినంగానే వుండటం వలన, వారి పరిస్థితిలో పెద్ద మార్పేమీ లేదు. ఆనాటి ఆడపిల్లలకు కేవలం తగుమాత్రం చదువు వుంటుంది. కానీ వాళ్ళకున్నట్లు కన్పించే స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు మిధ్య, అవాస్తవం. ఆడపిల్లల ఇష్టా, ఇష్టాల్తో సంబంధంలేకుండా పెళ్ళిళ్లు చేయటంతో గృహబానిసలుగా మారేవారు. సామాన్య ప్రజానీకంలోని మగవాళ్ళు అనేక రంగాలలో ఉన్నత శిఖరాలందుకోగా, స్త్రీలు ఎప్పుడూ ఆ స్థాయికి ఎదగలేకపోయారు. అడుగడుగునా వారికి అడ్డంకులే ఎదురయ్యాయి. తెలివి, పట్టుదల, పెనుగులాడే స్వభావం కల కొద్దిమంది స్త్రీలు సాంఘికంగా ముందంజవేసినప్పటికీ వారి పేర్లు అజ్ఞాతంలోనే ఉన్నాయి. దీనికతంటికీ పురుషాధిక్య భావజాలమే కారణముందని సిమోన్ ద బూవుఆర్.

పదిహేడు, పద్దెనిమిదవ శతాబ్దాలలో కూడా స్త్రీల పరిస్థితి, సాంఘిక హోదాపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. బాల్జాక్, ఆగస్ట్ కామ్టె రూసో వంటి తత్వవేత్తలు కొందరు, స్త్రీ అశాశ్వతమైనదని, స్త్రీ పురుషుడికి లొంగివుండాలని నిరూపించే ప్రయత్నాలు చేసారు. డెనిస్ ది దొరొ, మాంటెస్క్యూ, హెల్విష్యస్, మెర్సియస్ లాంటి కొందరు స్త్రీలను బలపరచి, స్త్రీల పక్షాన వకాల్తా పుచ్చుకుని వారికి అండగా నిలచారు. శాఫో, క్రిస్టనీ, మేరీఊల్‌స్టోన్ క్రాఫ్ట్, బలంపీ ద గూజెస్ లాంటి కొద్దిమంది మహిళలు ఒంటరిగానే పురుషాధిక్య భావజాలాన్ని ధిక్కరించి, మగవారి దుర్మార్గంపై నిరసనను, వ్యతిరేకతను ప్రదర్శించి తమ ప్రతిభాపాటవాలు చాటుకున్నారు.

పంతొమ్మిదవ శతాబ్దంలో వచ్చిన పారిశ్రామిక విప్లవం వల్ల స్త్రీల పరిస్థితులలో గణనీయమైన మార్పు వచ్చింది. అధిక సంఖ్యలో ఏర్పడిన పరిశ్రమలలో పెద్దఎత్తున కార్మికుల అవసరం ఏర్పడి, ఆడవాళ్ళతో కూడా ఫ్యాక్టరీలు నిండిపోయాయి. పారిశ్రామిక విప్లవంతో స్త్రీ వంటింటికి కట్టుబడి ఉండే పరిస్థితి నుండి బయటపడి, కర్మాగారాల్లో, ఉత్పత్తి రంగంలోకి ప్రవేశించింది. యంత్రాలు రంగస్థలం మీదకి వచ్చాక మగవాడి బలం, ఆడదాని బలహీనత అనేవి పాతకాలపు సంగతులైపోయి స్త్రీ విముక్తికి మార్గం సుగమం అయిందని భావించబడింది. కానీ స్త్రీ ప్రత్యుత్పత్తి పాత్ర వల్ల ఉత్పత్తి రంగంలో ఆమె ప్రవేశానికి అంతరాయం కలిగిందని, అంతేకాక కార్మిక రంగానికి వచ్చేసరికి స్త్రీలు, పురుషుల కంటే ఘోరమైన దోపిడీకి గురవుతున్నారని సిమోన్ ద బూవుఆర్ విమర్శించింది.

స్త్రీ పరిస్థితి ఎల్లప్పుడూ రెండు కోణాల్లోంచి విశ్లేషించాలి - ఒకటి సామాజిక ఉత్పత్తి రంగం, రెండోది ప్రత్యుత్పత్తి అంటే సంతానాన్ని కనడం. స్త్రీలు సామాజిక ఉత్పత్తి రంగంలోను, ప్రత్యుత్పత్తి రంగంలోనూ అణిచివేతకు, దోపిడీకి గురవుతున్నారని సిమోన్ ద బూవుఆర్ అభిప్రాయం. దానిని ఆమె ఈ విధంగా విశ్లేషించింది. పెళ్ళి అనే బరువు మగవాడి మీద కంటే స్త్రీ మీదనే చాలా ఎక్కువగా పడుతున్నది. ఆధునిక కాలంలో గర్భనిరోధం, కుటుంబ నియంత్రణ వచ్చినప్పటికీ అవి తగినంతగా వ్యాప్తి చెందలేదు. సరికదా అన్నిచోట్ల సమానంగా కూడా అమలు జరగటం లేదు. పిల్లల పెంపకం భారం మొత్తం ఆడవాళ్ళదే. దాదాపు అన్నిదేశాల్లోనూ స్త్రీలు ఇల్లు విడిచి వీధిలోకొచ్చి, పరిశ్రమలలో పనిచేస్తున్నప్పటికీ, మొత్తం గృహనిర్వహణ, సంసారపు బాధ్యతలు అన్ని ఆడవాళ్లే మోస్తున్నారు. గృహనిర్వహణ, పిల్లల పెంపకం లాంటి బాధ్యతల్ని పురుషులు నిర్వర్తించడాన్ని అటు పురుషులు, ఇటు కొంతమంది స్త్రీలు కూడా అవమానంగానే భావిస్తున్నారు. ఉత్పత్తి రంగంలో ప్రవేశించినప్పటికీ స్త్రీకి పూర్తి ఆర్థిక స్వాతంత్ర్యం లేదు. ఇప్పటికీ సమస్త హక్కులూ, అధికారాలూ పురుషుని చేతుల్లోనే ఉన్నాయి. ఏనాడూ స్త్రీలకి స్వంత

ఇష్టా, ఇష్టాలూ కానీ, తనపై తనకి అధికారంకానీలేవు. సాంఘిక విలువలూ, సాంస్కృతిక సంస్థలూ, న్యాయవ్యవస్థ మొత్తం పురుషుల అధీనంలోనే ఉన్నాయి. స్త్రీలు నివసిస్తున్న సాంఘిక, సాంస్కృతిక స్థితి మరియు సర్వత్రా వున్న పురుషస్వామ్య భావజాలమే స్త్రీల అణచివేతకు, తక్కువతనానికి కారణమంటుంది సిమోన్ ద బూవుఆర్. ఆమె ఈ విధంగా స్త్రీల వాస్తవ పరిస్థితులను చారిత్రక దృష్టికోణంతో పరిశీలించి, వారి తక్కువతనానికి కారణమైన పురుషాధిపత్యమును, పితృస్వామ్య వ్యవస్థనూ తీవ్రంగా విమర్శించింది. అందుకే ఈనాడు అనేకమంది స్త్రీలు తమకి హక్కులు కావలనే డిమాండ్ చేస్తూ, ఉద్యమాలు నిర్వహిస్తున్నారని అంటూ, ఈ స్త్రీవాద ఉద్యమాలపై కూడా పురుషభావజాలపు నీలినీడలు ప్రసరించాయని, అవి కూడా మగవారి స్థాయిని, ఔన్నత్యాన్నీ పెంచడానికే ఉపయోగపడ్డాయని ఈమె తీవ్రంగా విమర్శించింది.

## 17.7. స్త్రీ జీవితపు వివిధ దశలు :

సిమోన్ ద బూవుఆర్ తన "ది సెకెండ్ సెక్స్" రచన రెండో భాగంలో జీవితపు వివిధ దశలలో స్త్రీ ఏవిధంగా తయారుచేయబడుతుందో, పితృస్వామ్యపు భావజాలం ఆమెనే విధంగా రూపుదిద్దిందో వివరించింది. బాల్యంలోను, యౌవనంలోను, వృద్ధాప్యంలోను, పెళ్లయిన తరువాత, తల్లి అయిన తరువాత స్త్రీ జీవితం ఏ విధంగా మలచబడుతుందో వివరించింది. స్త్రీ కుండే సెక్స్ కోరికలు, ఆమె సాంఘిక జీవితం, ఆమె పరిస్థితి, గుణగణాలు మొదలగు వాటిపై ఉండే అపోహలను, అపార్థాలను విశ్లేషించి, చివరగా స్త్రీ విముక్తిని గురించి చర్చిస్తుంది సిమోన్ ద బూవుఆర్.

సిమోన్ ద బూవుఆర్ అభిప్రాయంలో ఎవరూ ఆడవాళ్ళుగా పుట్టరు, తయారవుతారు. ఈ నాగరికతే మొత్తంగా స్త్రీ రూపాన్ని తయారుచేసిందని అంటుంది ఆమె. సమాజం బాల్యంలోను, యౌవనంలోను స్త్రీ మీద రకరకాల ఆంక్షలు విధించినప్పటికీ, ముసలితనం స్త్రీ జీవితంలో విజయవంతమైనదనే అంటుంది సిమోన్ ద బూవుఆర్. సమాజం స్త్రీకి నిర్ణయించిన లక్ష్యం పెళ్ళయితే, పెళ్ళిలో ఆర్థిక పరిణామాలు కలగలిసి, స్త్రీ విషయంలో పెళ్ళి మరింత గందరగోళంగాను, క్లిష్టంగాను మారింది. లైంగికంగా స్త్రీ పురుషులిరువురికీ ఒకరి అవసరం మరొకరికున్నప్పటికీ పెళ్ళిలో ఇద్దరూ ఎన్నడూ సమానం కాలేదని, పెళ్ళిలోని నిరంకుశ లక్షణాలు ఇప్పటికీ పోలేదని, పెళ్ళిలో అబ్బాయికున్న స్వేచ్ఛ అమ్మాయికుండదని అంటుంది సిమోన్ ద బూవుఆర్. పెళ్ళితో స్త్రీ ఇంటికి బంధీ అవుతుందని ఆమె శ్రమ నేరుగా సాంఘిక ఉత్పత్తికి సహకరించదని, శ్రమ ఆమెకు విముక్తిని కలిగించకపోగా ఆమెను బంధీని చేస్తుందని ఆమె పేర్కొన్నది. "పూర్తి గృహిణి పాత్ర" స్త్రీ ఇతరులపై ఆధారపడక తప్పని పరిస్థితి కల్పిస్తున్నదని ఆమె అభిప్రాయం. మాతృత్వంలోని ఆదర్శాన్ని తియ్యదనాన్ని అతిశయోక్తులతో వర్ణించే పురుష ప్రపంచం, వాస్తవంలో గర్భధారణ, గర్భస్రావం, ప్రసవం వంటి అనుభవాలలోని కష్టాలను, ఆరోగ్య పరిణామాలను విస్మరించిందని సిమోన్ ద బూవుఆర్ పేర్కొంది. గర్భస్రావాన్ని స్త్రీ దుర్మార్గంగా చిత్రించే ఈ సమాజం, ఆమెకా గర్భం రావడానికి పురుషుడు కారకుడనే విషయాన్ని విస్మరిస్తుందని అంటుంది. శ్రమ విభజన ద్వారా పురుషుడికి ఉత్పత్తిదారుగా సంఘంలో గౌరవం, హోదా, సమాజంతో పరిచయాలు ఉంటాయి. కానీ స్త్రీకి ప్రత్యేక వృత్తి, ఉద్యోగం ఉండవు కనుక ఆమెకేవిధమైన సాంఘిక జీవితం ఉండదని, తనతో సమానులైన స్త్రీలతో మాత్రమే సాంఘిక పరిచయాలుంటాయని, ఇవేవీ ఆమెకు ఉపయోగపడవని సిమోన్ ద బూవుఆర్ అభిప్రాయం. పిల్లలు, వంటలు, అల్లికలు, అందాలు, అలంకరణలు లాంటి ఇంట్లో జరిగే నిత్యకృత్యాలే స్త్రీ దృష్టిలో మానవజాతి చరిత్రవుందని, దీనికి కారణం ఆమెను సాంఘిక జీవితం నుండి దూరం చేయటమేనని పేర్కొన్నది ఆమె.

## 17.8. స్త్రీ పరిస్థితి గుణగణాలు :

పరస్పర విరుద్ధ స్వభావాలు కలది, తెలివిగలది, అల్పమైనది, వాస్తవ దృక్పథం లేనిది, స్పష్టత లేనిది, నీతిలేనిది, స్వార్థపరురాలు అని స్త్రీపై వచ్చిన నిందలన్నీ స్త్రీ మెదడులోనివి కావని, ఆమె నివసించవలసి వచ్చిన వివిధ పరిస్థితులే ఆమెనలా రూపొందిస్తాయనీ అంటుంది సిమోన్ ద బూవుఆర్. స్త్రీ నివసించవలసివచ్చిన వివిధ పరిస్థితుల్ని విశ్లేషించినప్పుడే ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, చారిత్రక నేపథ్యంలో ఆమె శాశ్వతంగా ఎలా స్త్రీగా ఉండిపోవలసి వచ్చిందో బోధపడ్తుందని ఆమె పేర్కొన్నది. స్త్రీ నివసించవలసివచ్చిన వివిధ పరిస్థితుల వలననే ఆమెకి ఓర్పు, మౌనం, విశ్వాసం, నిస్సత్తువ, మూర్ఖత్వం, అజ్ఞానం, త్యాగం, నిరీక్షణ లాంటి గుణగణాలు అలవడతాయని సిమోన్ ద బూవుఆర్ అభిప్రాయం.

స్త్రీ ప్రతినిత్యం వంటగదిలో నిప్పుతోను, నీరుతోను పనిచేస్తుంది. ఇవన్నీ ఆమెకు ఓర్పు, మౌనం నేర్పుతాయని సిమోన్ ద బూవుఆర్ అభిప్రాయం. నాలుగు గోడల మధ్య స్త్రీని బంధించి ఉండటంవల్లే ఆమెలో నిస్సత్తువ, మూర్ఖత్వం, అజ్ఞానం, ఆతృత అలవాటవుతాయనే ఆమె పేర్కొన్నది. స్త్రీ అంటేనే నిరీక్షణ లేదా వేచివుంటం అని, ఈ నిరీక్షణ ఆమె జీవితాంతం కొనసాగే ప్రక్రియ అని ఆమె అభిప్రాయం. స్త్రీ అబద్ధాలాడుతుందంటారు. కానీ అది కూడా నిజం కాదని, ఆమె చెప్పే అబద్ధాలన్నీ ఉన్న పరిస్థితినిబట్టి చెప్పినవే తప్ప స్వయంగా చెప్పినవికావని, అసలు పురుషులే స్త్రీల చేత అబద్ధాలాడిస్తారు అని ఆమె పేర్కొన్నది. ప్రపంచాన్నంతా ఓ కంట కనిపెట్టడం స్త్రీ బలహీనతని, అందరికోసం త్యాగాలు చేస్తూ, సమయానుకూలంగా తన ప్రవర్తన మార్చుకుంటుందని, అందుకే మగవాడి గురించి మాట్లాడినంత సులభంగా స్త్రీ గురించి సాధారణీకరించి మాట్లాడలేమని సిమోన్ ద బూవుఆర్ పేర్కొన్నది. స్త్రీ పరిస్థితులు మగవారి పరిస్థితుల కంటే పూర్తిగా భిన్నమైనవి, కాబట్టి ఆమె గుణగణాలు, విశ్వాసాలు, విలువలు, తెలివి, నీతి, అభిరుచులు, ప్రవర్తన అన్నీ ఆమె పరిస్థితినిబట్టి నిర్ణయించాలి అని సిమోన్ ద బూవుఆర్ అభిప్రాయం.

## 17.9. స్త్రీ విముక్తి :

స్త్రీలెవ్వరూ 'సాంప్రదాయక స్త్రీ ప్రపంచం' లోంచి తప్పించుకోలేకపోవడానికి కారణం పురుషాధిక్యమేనని, స్త్రీలు మగవాళ్లతో సమానులు కావడానికి సంఘం కానీ, పురుషులు కానీ సహకరించరని అంటుంది సిమోన్ ద బూవుఆర్. తరతరాలుగా స్త్రీలు బానిసలుగా ఉండపోవడానికి కారణం ఆమెని స్వతంత్రంగా ఏ పనీ చెయ్యనివ్వకపోవడం. స్వతంత్రంగా బతికే ఆడవాళ్ళంటే సంఘంలో పెద్ద గౌరవం లేనందువల్ల కూడా స్త్రీలు అలా బతకటానికి సహజంగానే భయపడుతుంటారు. తమ పరిస్థితుల పరిమితులలోంచి బయటికి వచ్చి మగవారితో సమానంగా అన్నీ చెయ్యగలమని నిరూపిస్తూ, తమ విముక్తి కోసం తామే ఉద్యమించటం తప్ప స్త్రీలకి మరో మార్గం లేదంటుంది సిమోన్ ద బూవుఆర్. ఇప్పటికే చాలామంది ఆడవాళ్ళు పట్టుదలగా ఒంటరిపోరాటం చేస్తూ, వ్యక్తిగతంగా విముక్తి సాధించుకుంటున్నారు, కానీ అంతిమంగా ఈ ఒంటరి పోరాటాలు హాస్యాస్పదంగా, బాధాకరంగా తయారవుతున్నాయి. కాబట్టి ఈ విముక్తి పోరాటం సంఘటితంగా జరగాలి.

స్త్రీకి బిడ్డని కనటంలో స్వతంత్రత ఇస్తే, పెంచడంలో కూడా ఆమెకి సహకరిస్తే, పనివిధానంలో ఆమెకి వెసులుబాటు కల్పిస్తే స్త్రీకి మాతృత్వభారం సులభమౌతుందని పేర్కొన్నది సిమోన్ ద బూవుఆర్. అన్ని అవకాశాలు, సాధన సామాగ్రి స్త్రీకి అందుబాటులోకి తెస్తే ఆమె అన్ని విధాలా పురుషుడితో సమానం కాగలదని సిమోన్ ద బూవుఆర్ అభిప్రాయం. బహుశా ఉత్పత్తి కార్యకలాపాలు స్త్రీ చేతిలో వుండివుంటే ఆమె తన ప్రత్యేకతను, స్థాయినీ నిలుపుకొని వుండేదేమో అనే అభిప్రాయం ఆమె వ్యక్తం చేసింది. మగవాళ్ళతో సమానమైన ఉద్యోగాలని ఇచ్చినట్లయితే స్త్రీలు కూడా తమ సమర్థత తప్పక నిరూపించుకోగలరంటుంది సిమోన్ ద బూవుఆర్. చదువూ, అవకాశాలూ గల ఆడవాళ్ళూ చాలామంది ఉద్యోగాలు చేస్తూ

ఆర్థిక, సాంఘిక స్వాతంత్ర్యం పొందగల్గుతున్నారు. కానీ ఓటుహక్కు, ఉద్యోగావకాశం ఉంటే నిజమైన విముక్తి వచ్చేసింది అనుకోకూడదని, పనిచెయ్యడం ఒక్కటే స్వతంత్రం కాదని ఆడవారి శ్రమను మరింత సంక్లిష్టం చేసిన కొన్ని వాస్తవాలను విస్మరించకూడదని సిమోన్ ద బూవుఆర్ పేర్కొన్నది. ఎంతోకొంత సంపాదించటం ఆర్థికంగా బాగుండొచ్చు, కానీ అందువల్ల వారికి ఇంటి చాకిరీ తప్పటం లేదు. ఇంట, బయట రెండుచోట్లా కష్టపడుతున్నారు, కానీ స్త్రీలకి సంపూర్ణ స్వాతంత్ర్యం లేదు. అందువలననే నైతిక, సాంఘిక, సాంస్కృతిక ప్రభావాలన్నీ మారితేగానీ స్త్రీల పరిస్థితిలో మార్పు సాధ్యంకాదనే అభిప్రాయం వ్యక్తం చేసింది సిమోన్ ద బూవుఆర్.

## 17.10. ముగింపు :

మానవజాతి పరిణామం స్త్రీ పురుషుల పరస్పర సాహచర్యంగా జరిగివుండవలసింది. కానీ స్త్రీని తక్కువగా చూడటం జరిగింది. పురుషుడు తన ఘనతను స్త్రీని అణచటంలో చూడాలనుకున్నాడనీ, పురుషుడు స్త్రీ కంటే గొప్పవాడన్న సాంఘిక కుట్రే ఆమె అణిచివేతలకు కారణమని పేర్కొన్నది సిమోన్ ద బూవుఆర్. స్త్రీ శరీర లక్షణాలు గానీ, గర్భధారణ అవసరంగానీ, భార్యగా, తల్లిగా ఆమె బరువు బాధ్యతలు గానీ ఆమెను క్రుంగదీయవు. కానీ ఆమె చుట్టూ ఉండే సామాజిక పరిస్థితులు, పురుషస్వామ్య భావజాలమే ఆమెని క్రుంగదీస్తూ ఆమె అణచివేతకు కారణమవుతున్నాయని సిమోన్ ద బూవుఆర్ అభిప్రాయం. లైంగికత ఒక్కటే మానవ ప్రవర్తనను నిర్ణయించలేదని, మొత్తం పరిస్థితిని అర్థం చేసుకోవడానికి మాత్రమే అది సహకరిస్తుందని ఆమె పేర్కొన్నది. సంఘం మగవారి చేతిలో ఉంటుంది కనుక ఈ ప్రపంచం స్త్రీలపై న్యూనతా భావాన్ని రుద్దింది. స్త్రీ పురుషులిరువురూ కలసి జీవించే కాలం ఇద్దరికీ సమాన ఫలితాల్నివ్వలేదని, మగవారికి లాభించినంతగా ఆడవారికి లాభించలేదని అందేకే స్త్రీ తన సర్వోన్నతికోసం సంఘర్షించక మానదని అంటుంది సిమోన్ ద బూవుఆర్. "శీలం" అనే సూత్రం ఇద్దరికీ సమానంగా వర్తిస్తుందని గుర్తిస్తే ఇద్దరికీ మేలు జరుగుతుందని, పుట్టుకలో, మరణంలో అంతాసమానమైనపుడు. ఈ రెండు దశల మధ్యా ఆడ, మగ తేడాలు మానవజాతి మనుగడకే హానికరం అని ఆమె పేర్కొన్నది. స్త్రీని విముక్తి చెయ్యడం అంటే మగవాడి బంధనాల నుండి విముక్తి చెయ్యడం అని అర్థం గాని, మగవాడితో సంబంధమే లేకుండా చేయడమని అర్థం చేసుకోకూడదని ఆమె తెలిపింది. స్త్రీకి స్వతంత్ర అస్తిత్వం ఇస్తే, ఆమె మగవాడికోసం కూడా అస్తిత్వంలో వుంటుందని, అప్పుడే మానవులు ఇద్దరు కావడంలోని నిజమైన ప్రాముఖ్యం వెల్లడవుతుందని, 'మానవ జంట' వాస్తవమౌతుందని సిమోన్ ద బూవుఆర్ అభిప్రాయం. ఈ ప్రపంచంలో స్వేచ్ఛను సాధించి నిలబెట్టుకోవాలంటే స్త్రీ పురుషులు తమ తేడా ద్వారా, తేడా చేత ఒక అవసరంగా తమ భ్రాతృత్వాన్ని చాటుకోవాలని ఆమె పేర్కొన్నది.

సిమోన్ ద బూవుఆర్ ప్రప్రథమంగా అంత ధైర్యంగా, అంత హేతుబద్ధంగా, అంత విశ్వవ్యాప్తంగా స్త్రీ, పురుష వివక్షతను గూర్చిన అధ్యయనం చేపట్టడం ప్రపంచ మేధావి వర్గంలో ఒక కలకలాన్ని రేకెత్తించింది. ఆమె రచన "ది సెకండ్ సెక్స్" స్త్రీవాద సిద్ధాంతంలో ఒక ప్రామాణిక గ్రంథంగా ప్రపంచ ప్రఖ్యాతి పొంది ఎందరో స్త్రీవాదులకు, స్త్రీ ఉద్యమకారులకీ స్ఫూర్తినిచ్చి, మార్గదర్శకంగా నిలచింది. చాలామంది పురుష మేధావుల ఆగ్రహానికి కూడా కారణమైంది. సిమోన్ ద బూవుఆర్ తన భావజాలంతో అటు అస్తిత్వ భావాల్ని, ఇటు సామ్యవాద భావజాలాన్నీ, మరోప్రక్క చారిత్రక అధ్యయనాన్నీ కలగలిపి, దానితో ఒక స్త్రీగా తన అనుభవాల్నీ జోడిస్తూ వెలువరించిన అద్భుత గ్రంథం "ది సెకండ్ సెక్స్" అని కొందరి అభిప్రాయం. అయితే ఈ మిశ్రమ ఆలోచనా విధానం అందుకోవాలంటే పాఠకులకు ఒక ప్రత్యేక స్త్రీవాద దృక్పథం అవసరం. లేకుంటే ఇది ఒక

ఆవేశపూరితమైన ఆలోచనా ధోరణిగా తిరస్కరించే ప్రమాదం ఎదుర్కోవలసివస్తుంది.

## 17.11. మాదిరి ప్రశ్నలు :

1. సిమోన్ ద బూవుఆర్ రచన " ది సెకెండ్ సెక్స్" స్త్రీవాదానికి సంబంధించి ఒక విజ్ఞాన సర్వస్వం - చర్చించండి.
2. 'స్త్రీ అంటే ?' 'ద్వితీయ భావన' లపై సిమోన్ ద బూవుఆర్ అభిప్రాయాలను విమర్శనాత్మకంగా పరిశీలింపుము.
3. పితృస్వామ్య వ్యవస్థ, పురుషాధికారాలపై సిమోన్ ద బూవుఆర్ భావాలను విమర్శనాత్మంగా వివరించండి
4. స్త్రీ పరిస్థితి, గుణగణాలపై, విముక్తిపై సిమోన్ ద బూవుఆర్ అభిప్రాయాలను వివరించండి.

## 17.12. చదువదగిన గ్రంధాలు :


1. Simone de Beauvoir : The Second Sex Translated and Edited by H.M. Parshley, 1997
2. Diana Coole : Women in Political Theory
3. John Charvet : Modern Ideologies - Feminism
4. రెండో సగం (The Second Sex) సిమోన్ ద బూవుఆర్, తెలుగు సంక్షిప్తీకరణ, అనుసరణ : డా ॥ మానేపల్లి, 2000.
5. ఓల్గా : తొలివెలుగులు : స్త్రీవాద సిద్ధాంత వికాసం


రచయిత : **శ్రీమతి టి. విజయకృష్ణ**

పాఠం - 18

# ఆంటోనియో గ్రాంసీ

**విషయసూచిక**


18.0 లక్ష్యం

18.1 జీవిత సంగ్రహం

18.2 ఫ్యాక్టరీ కౌన్సిళ్ళు

18.3 ఆధిపత్య భావన

18.3.1 బూర్జువా వర్గ ఆధిపత్యం

18.3.2 కార్మిక వర్గ - చారిత్రక శిబిరంలో అలయన్స్‌లు

18.4 పౌర సమాజం

18.5 మేధావులు

18.6 రాజకీయ పార్టీ

18.7 నిష్క్రియా విప్లవం

18.8 సారాంశం

18.9 మాదిరి ప్రశ్నలు

18.10 చదువదగిన గ్రంథాలు


## 18.0 లక్ష్యం :

గ్రాంసీ ప్రతిపాదించిన ప్రధాన భావనలను వివరించటం ఈ పాఠం లక్ష్యం. ఈ పాఠంలో ఫ్యాక్టరీ కౌన్సిళ్ళు, ఆధిపత్య భావన, మేధావులు వంటి అంశాలపై గ్రాంసీ అభిప్రాయాలను తెలుసుకుంటాము.

## 18.1 జీవిత సంగ్రహం :

దక్షిణ ఇటలీలోని సార్డీనియా ద్వీపంలో 1891లో గ్రాంసీ జన్మించాడు. తండ్రి ప్రభుత్వ ఉద్యోగి. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశాడనే నెపంపై తండ్రి జైలుపాలయ్యాక గ్రాంసీ కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది. తల్లి ఒక టైలరు దగ్గర కూలీగా పనిచేస్తూ తెచ్చే డబ్బుతోనే ఏడుగురు పిల్లలు బ్రతకాల్సి వచ్చేది. ఆ కుటుంబం దుర్భరమైన దారిద్ర్యాన్ని అనుభవించేది. పుట్టుకతోనే అర్భకంగా వెన్నెముక వ్యాధితో పుట్టిన గ్రాంసీ, బ్రతుకుదెరువు కోసం ఎనిమిదవ ఏటనే సామాన్లు మోసేవాడు. 1904లో తండ్రి జైలు నుండి తిరిగి వచ్చాక మళ్ళీ బడికి వెళ్ళాడు. 1908లో దిగువ స్కూలు పరీక్ష పాసయి, 1908లో క్యాలరీలో ఉన్న అన్నయ్య వద్దకు వెళ్ళి పాఠశాల విద్య పూర్తి చేశాడు. 1911లో పేద విద్యార్థులకిచ్చే స్కాలర్‌షిప్‌ను సంపాదించి టురిన్ విశ్వవిద్యాలయంలో చేరాడు. కమ్యూనిస్ట్ ఉద్యమంతో పరిచయం, సోషలిస్టు పత్రికలకు

వ్యాసాలు వ్రాయటం మొదలు పెట్టాడు. తీవ్రమైన అనారోగ్యం వలన 1915లో చదువు మానివేశాడు. 1916 - 19ల మధ్య కాలంలో గ్రాంసీ లెక్కకు మించిన వ్యాసాలు వ్రాసి, అందరిచేత "అజేయ రాజకీయ వ్యాఖ్యాత" గా పేరు సంపాదించుకున్నాడు. 1924లో గ్రాంసీ ఇటలీ వెలుపల ఉంటూనే, ఇటలీ పార్లమెంటుకు ఎన్నిక అయారు. కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1926లో అరెస్టయి జైలుకు పంపబడ్డారు. జైలులో విపరీతమయిన అనారోగ్యానికి గురయ్యారు. కదలటానికి కూడా శక్తిలేని పరిస్థితులలో 1937 ఏప్రిల్ 11 న విడుదల అయ్యారు. కాని ఏప్రిల్ 25న మెదడులోని రక్తనాళాలు చిట్లిపోవటం వలన ఏప్రిల్ 27న కన్ను మూసారు. తన సుదీర్ఘమయిన జైలు జీవితంలో 3000 పేజీలకు పైగా వ్యాసాలను వ్రాశారు. అనేక విషయాలకు సంబంధించిన సైద్ధాంతిక చర్యలను ఈ 3000 పేజీలలో పొందుపరిచారు. వీటినే "జైలు నోట్ బుక్స్" అని అంటారు. ఈ 33 జైలు నోట్ బుక్స్‌లోనే గ్రాంసీ రాజకీయ సిద్ధాంతం లభిస్తుంది. గ్రాంసీని ఒక సిద్ధాంతవేత్తగా గుర్తించేవారు ఈ జైలు నోట్ బుక్స్‌కు చాలా ప్రాధాన్యత ఇస్తారు. గ్రాంసీ భావాలను 1) ఫ్యాక్టరీ కౌన్సిళ్ళు 2) ఆధిపత్య భావన 3) పౌర సమాజం 4) మేధావులు 5) రాజకీయ పార్టీ 6) నిష్క్రియా విప్లవం అనే శీర్షికలుగా విభజించి అధ్యయనం చేయవచ్చు.

## 18.2 ఫ్యాక్టరీ కౌన్సిళ్ళు :

గ్రాంసీ భావజాలంలో ప్రధాన అంశం ఫ్యాక్టరీ కౌన్సిళ్ళ నిర్మాణం - నిర్వహణ. బూర్జువాప్రజాస్వామ్యానికి విరుద్ధంగా రాడికల్ కార్మికవర్గ ప్రజాస్వామ్యాన్ని అభివృద్ధి చేయటం ఉద్యమ ధ్యేయం. ప్రతి ఫ్యాక్టరీలోనూ శారీరక శ్రమ, గుమస్తాపనులు, సాంకేతిక నిపుణులు ఇలా శ్రమకు సంబంధించిన ప్రతి విభాగం నుండి, 15 మంది కార్మికులకు ఒకరి చొప్పున ప్రతినిధులను ఎన్నుకొనేవారు. ఆయా వార్డులలో నివసించే ఇతర శ్రామికులను, ఉదా॥ వీధులు ఊడ్చేవారు, టాక్సి డ్రైవర్లు, నెరేటర్లు మొదలయిన వారిని వార్డు కౌన్సిళ్ళలో చేర్చుకొనేవారు. ఈ విధంగా కార్మికులు నివశించే వార్డులోని మొత్తం శ్రామిక వర్గానికి న్యాయబద్ధ, క్రమశిక్షణాయుత వేదికనొకదానిని నిర్మించే ప్రయత్నం జరిగింది. ఈ వార్డు కౌన్సిళ్ళు ఆశయాలు ఈ విధంగా ఉండేవి.

1) ఫ్యాక్టరీ వ్యవస్థలో తీసుకురావల్సిన పరివర్తన గురించి వివరంగా, ఆచరణాత్మకంగా చర్చించటం.
2) నిజమైన ఉత్పతిదారులయిన కార్మికుల వర్గ చైతన్యం పెంపొందించటం.
3) ఉత్పత్తి సాధనాలను తమ చేతుల్లోకి తీసుకోవటానికి, ఉత్పత్తి సంబంధాలను పునర్ వ్యవస్థీకరించటానికి అవసరమయిన సైద్ధాంతిక, ఆచరణాత్మక విధానాలను వివరించడం.
4) సోషలిస్టు సమాజాన్ని సాధించిన తర్వాత అవసరమయే శ్రామికవర్గ సంస్కృతి గురించి వివరించటం.
5) శ్రామికులలో హక్కులకూ, విధులకూ సంబంధించిన చైతన్యాన్ని వ్యాప్తిచేయటం.
6) బూర్జువా సంస్థలతో, బూర్జువా భావాలతో అట్టడుగు స్థాయి నుండి విమర్శనా దృష్టితో వర్గ పోరాటాన్ని నిర్వహించె శక్తిని కల్పించటం.
7) ట్రేడ్ యూనియన్ ఉద్యమంలోని 'ఆర్థిక వాదం' స్థానంలో, రాడికల్ రాజకీయ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి, శ్రామికవర్గ దృక్పథంలో మార్పుతేవటం.

పెట్టుబడి ప్రయోజనాల కోసం పారిశ్రామికులు రూపొందించిన ఉత్పత్తి క్రమాన్ని ఫ్యాక్టరీ కౌన్సిళ్ళు కార్మికుల ప్రయోజనాలకు అనుగుణంగా పునర్ వ్యవస్థీకరించాలి. సామ్యవాదంలో ఫ్యాక్టరీ నిర్వహణ ఏవిధంగా ఉంటుందో, అదే తరహాలలో సూక్ష్మరూపంలో ప్రతి ఫ్యాక్టరీ కార్మికులకు తర్ఫీదు నివ్వాలి. అయితే ఈ ప్రక్రియ కార్మికులపై బయట

నుండి రుద్దబడరాదని, కార్మికులలో నుండే ఈ అవగాహన, చైతన్యం రావాలని గ్రాంసీ భావించాడు. ఫ్యాక్టరీ కౌన్సిళ్ళ సక్రమ నిర్వహణ ద్వారా, ప్రజలకు ఒక శాశ్వత, క్రమశిక్షణాయుత నిర్మాణాన్ని సమకూర్చే ప్రయత్నం జరగాలి. రాజకీయ, పరిపాలనా అనుభవాలకు సంబంధించి ఫ్యాక్టరీ కౌన్సిళ్ళు పాఠశాలలుగా ఉపయోగపడాలి. చిట్టచివరి మనిషి వరకు ప్రజలందరూ ఈ ప్రక్రియలలో భాగస్వాములు కావాలి. ఫలితంగా వారిలో సైద్ధాంతిక పరిజ్ఞానం, గట్టిదనం, పట్టుదల పెరిగి, క్రమశిక్షణ గల్గిన సైనికులలాగా తయారవుతారని గ్రాంసీ భావించాడు.

కౌన్సిళ్ళు పూర్తిగా ప్రజాస్వామ్యయుతంగా ఉండాలి. కౌన్సిల్ స్థాయిలో ప్రజాస్వామ్యాన్ని బలిపెట్టే విధంగా పై స్థాయిలోని నాయకత్వం ప్రయత్నించకూడదు. కౌన్సిళ్ళ స్థాయిలో ప్రజాస్వామ్య పద్ధతిని అమలు చేయటం వలన ప్రతి కార్మికుడు తన సామర్థ్యం, కార్యరంగాల పరిధిలో ఆయా సమస్యలతో మమేకమయి, పరిష్కారం ఆలోచించగలుగుతారు. సమస్యలపై స్పష్టమైన అవగాహన సంపాదించటంలో, పనిచేయటంలో, ఒకనినొకరు చైతన్య పరుచుకోవటంలో ప్రజాస్వామ్య బద్ధంగా పనిచేసే ఫ్యాక్టరీ కౌన్సిళ్ళు గణనీయంగా సహాయపడతాయని గ్రాంసీ భావించాడు.

కౌన్సిళ్ళ నిజమైన ప్రాముఖ్యం కర్మాగారంలో అధికారాన్ని హస్తగతం చేసుకోవడంలోనేకాదు, గుణాత్మకంగా నూతనమైన సంబంధాలను, కొత్త జ్ఞానాన్ని, కొత్త ఉత్పత్తి సంబంధాలను, బూర్జువా వర్గానికి భిన్నమైన కార్మికవర్గ స్వీయాత్మక లక్షణాలను అభివృద్ధి చేసే కేంద్రాలుగా పనిచేయడంలోనే కౌన్సిళ్ళ నిజమైన ప్రాముఖ్యం ఇమిడివుందని పలువురు వ్యాఖ్యాతలు పేర్కొన్నారు. అవి పరివర్తన సాధనాలు. పెట్టుబడిదారీ సంస్థల లోపల విప్లవానికి సన్నాహాలు చేసే సాధనాలు. సిద్ధాంతం - ఆచరణల మధ్య ఐక్యత సాధించి వర్తమానాన్ని భవిష్యత్‌తో అనుసంధించే సాధనాలు. పౌర సమాజంలో జరగాల్సి ఉందని గ్రాంసీ చెప్పిన ముఖాముఖి యుద్ధానికి (War of Position) ఫ్యాక్టరీ కౌన్సిళ్ళు మంచి ఉదాహరణ అవుతాయి.

ఫ్యాక్టరీ కౌన్సిళ్ళ రాజకీయ చొరవను విశ్లేషిస్తూ గ్రాంసీ వాటి "ఓటమి" కి రెండు ముఖ్య కారణాలు చూపించారు. కార్మికవర్గ చొరవను దెబ్బతీసిన సోషలిస్టుపార్టీ, ట్రేడ్ యూనియన్ నాయకత్వ సంస్కరణవాద స్వభావం మొదటి కారణం. రెండవ కారణం -- కార్మికోద్యమం రైతాంగంతో దక్షిణప్రాంత మేధావులతో, ఇతర ప్రజాతంత్ర శక్తులతో ఐక్య సంఘటన నిర్మించుకోలేకపోవడం. అలాంటి మైత్రి రూపొంది ఉంటే, బూర్జువా వర్గం కార్మిక కర్షక వర్గాల పౌరజీవితం, ఆర్థిక రంగం, రాజ్యం -- వీటిలో బూర్జువా అధికారాన్ని సమర్ధంగా సవాలు చేయగల కొత్త చారిత్రక శక్తి ఆవిర్భవించి ఉండేదని గ్రాంసీ భావించాడు.

## 18.3 ఆధిపత్య భావన :

గ్రాంసీ భావజాలంలో ఇది చాలా కీలకమయినదని చాలా మంది విశ్వాసం. గ్రాంసీని చాలా గొప్ప మార్క్సిస్టు మేధావిగా నిరూపించటానికి ప్రయత్నించేవారు, గ్రాంసీ ప్రతిపాదించిన ఈ భావన మార్క్సిజాన్ని మరింత సుసంపన్నం చేసిందని ఆనందిస్తూ ఉంటారు. మార్క్స్, లెనిన్ ఈ భావనకు చాలా ప్రాధాన్యత ఇచ్చారన్న విషయాన్ని గ్రాంసీ అభిమానులు విస్మరిస్తూ ఉంటారు. లెనిన్ **1905 - 1917** ల మధ్య ఈ భావనపై కొన్ని రచనలు చేశారు. అయితే రష్యన్ భాషలో ఆధిపత్యం అనే అర్ధంలో లెనిన్ ఈ పదాన్ని వాడితే, అనువాదకులు దాన్ని "నియంతృత్వం" అని అనువదించారు. మార్క్స్, లెనిన్‌లు ఆధిపత్య భావనను ఏవిధంగా వివరించారు అన్న విషయాన్ని ప్రక్కన పెట్టి, గ్రాంసీ ఏం చెప్పాడో తెలుసుకుందాం. "నిర్బంధం, అణచివేతలు ప్రాతిపదికగా గల అధికారం బదులు, పౌర సమాజంలో సమ్మతి, భావజాల ప్రభావం ప్రాతిపదికన అధికారాన్ని చెలాయించటాన్ని" గ్రాంసీ ఆధిపత్యమని అన్నాడు. మరో మాటలో చెప్పాలంటే సమాజంలో అధికారం

కేవలం బలప్రయోగం ద్వారా మాత్రమే సాగదని, దానికి భావజాలం పునాదిగా ఉన్నప్పుడు మాత్రమే నిరంతరం కొనసాగుతుందని అర్థం. అధికార చెలాయింపులో బలం, దౌర్జన్యం కన్నా, రాజకీయ, న్యాయ, సాంస్కృతిక, మనస్తత్వ, భావజాలం మొదలైన ఉపరితల అంశాలు కీలకపాత్ర పోషిస్తాయని గ్రాంసీ భావించాడు.

### 18.3.1 బూర్జువా వర్గ ఆధిపత్యం :

బూర్జువా వర్గాలు తమ అధికారాన్ని దీర్ఘకాలం ఎలా నిలుపుకుంటున్నాయి ? అన్న ప్రశ్న వేసుకొని, ఫ్రెంచి విప్లవ కాలంలోని జాకోబిన్ల ఉదాహరణను తీసుకొని, గ్రాంసీ ఈ క్రింది విధంగా సమాధానం చెప్పాడు. "జాకోబిన్లు బూర్జువా ప్రభుత్వాన్ని నెలకొల్పడమేకాక - అంటే బూర్జువా వర్గాన్ని పెత్తందారీ వర్గంగా ప్రతిష్ఠించటమేకాక - మరికొన్ని పనులు చేశారు. బూర్జువా రాజ్యాన్ని సృష్టించారు. బూర్జువా వర్గాన్ని జాతి ఆధిపత్య వర్గంగా నిలబెట్టారు. మరో మాటలో చెప్పాలంటే క్రొత్త రాజ్యానికి శాశ్వత పునాది కల్పించి, సువ్యవస్థిత ఆధునిక ఫ్రెంచి జాతిని సృష్టించారు".

రాజకీయ పోరాటమంటే శత్రువర్గాల మధ్య సంఘర్షణ మాత్రమేకాదని , దానిలో సంక్లిష్ట సంబంధాలు ఇమిడి ఉన్నాయని గ్రాంసీ భావన. అధికారంతో పాటు, దానికి జాతీయ ప్రజాసమ్మతి సృష్టించగల సైద్ధాంతిక యంత్రాంగాన్ని తయారు చేయటమే ఆధిపత్య భావనలోని కీలక అంశం. అనేక వర్గాలతో సంఘటన (Allianu) ను ఏర్పరచుకొని, ఆ సంఘటనకు ప్రజామద్దతు కూడ గట్టగలగటం, ఆ మద్దతుకు ఆధారంగా ఒక సైద్ధాంతిక, సామాజిక, పునాదిని సృష్టించగలగటం అవసరం. సంఘటన కేవలం కొన్ని వర్గాల మధ్య మాత్రమే ఏర్పడినా, ఆ సంఘటనను జాతీయ సంఘటనగా చూపి, ప్రజలందరి ఆమోదాన్ని పొందటం ద్వారా మాత్రమే, ఆధిపత్యం సాధ్యపడుతుందని గ్రాంసీ వాదించాడు.

ఇటలీలో 1930లలో పెల్లుబికిన సంక్షోభాన్ని గురించి వివరిస్తూ గ్రాంసీ ఈ విధంగా వ్రాశాడు : "సోషలిస్టులు ప్రజాతంత్ర అలయన్స్‌ను నిర్మించలేకపోవడం వల్లనే, బూర్జువా అధికారాన్ని అన్ని స్థాయిలలో ఎదిరించి జాతీయ ప్రజానాయకత్వాన్ని నిర్మించడం కోసం చొరవతీసుకోవడం వల్లనే ఫాసిజం వేరూనుకోగలిగిందని" గ్రాంసీ వాదించారు. కొత్తగా ముందుకొచ్చిన విప్లవకర బృందం బూర్జువా రాజ్యాధికారాన్ని సవాలు చేయడానికి గాని, భగ్నం చేయడానికిగాని ప్రయత్నించలేదు. సమాజం అంగీకరించదగిన రీతిలో తనవైన నైతిక, రాజకీయ, సాంస్కృతిక విలువలను నెలకొల్పడానికి కూడా ప్రయత్నించలేదు. "ఈ కోణంలోంచి చూస్తే, చివరికి సోషలిస్టులు కూడా బూర్జువా పరిధుల్లోనే పనిచేశారని చెప్పకతప్పదు. సోషలిస్టుల నుంచి ఆధిపత్య చొరవ లేకపోవడం వల్లనే, సంక్షోభాన్ని పెట్టుబడి తనకు అనుకూలంగా పరిష్కరించుకోగలిగింది." అని గ్రాంసీ అభిప్రాయపడ్డాడు.

### 18.3.2 కార్మిక వర్గ - చారిత్రక శిబిరంలో అలయన్స్‌లు :

గ్రాంసీ కాలపు ఇటలీ చాల అసమానంగా అభివృద్ధి చెందిన దేశం. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ఉత్తర ఇటలీకి, వ్యావసాయక దక్షిణభాగానికి మధ్య వ్యత్యాసాలు కొట్టొచ్చినట్లు కనిపించేవి. కార్మికవర్గానికి విస్తృతమైన గ్రామీణ పునాది ఉండేది. రైతాంగం ప్రధానంగా యధాతధవాద (Conservative) స్వభావం కలిగి ఉండేది. మతగురువులు, ఉపాధ్యాయులు తదితరుల విస్తృత 'సైన్యం' మద్దతు కలిగిన రోమన్ క్యాథలిక్ చర్చి కార్మిక, కర్షకులపై గట్టి ప్రభావం కలిగి ఉండేది. దీనికి తోడు కార్మిక వర్గ నాయకత్వంలో అత్యధికంగా మేధావులు ఉండేవారు.

ఈ సమానాభివృద్ధి, భావజాలం నేపథ్యంలో ఇటలీ బూర్జువా వర్గాన్ని సవాలు చేయాలంటే కమ్యూనిస్టులు దక్షిణాది రైతాంగం, ఉత్తరాది పారిశ్రామిక కార్మికుల మధ్య అలయన్స్ సాధించడం అవసరమని గ్రాంసీ వాదించారు :

పెట్టుబడిదారీ విధానానికి, బూర్జువా రాజ్యానికి వ్యతిరేకంగా మెజారిటీ శ్రామిక ప్రజానీకాన్ని సమీకరించడానికి తగిన అలయన్స్ వ్యవస్థను కార్మికవర్గం ఏమేరకు సృష్టించగలదో ఆ మేరకు అది నాయకత్వ, ఆధిక్యవర్గం కాగలుగుతుంది. ఇటలీలో, అక్కడ ఉన్న నిజమైన వర్గ సంబంధాల నేపథ్యంలో చెప్పాలంటే రైతాంగ ప్రజల సమ్మతిని సాధించడం మీద కార్మికవర్గం విజయం ఆధారపడుతుంది.

ఇది జరగాలంటే కార్మికవర్గం తన సొంత ఆర్థిక ప్రయోజనాలను అధిగమించి ఆలోచించాల్సి ఉంటుంది. ఈ ప్రయోజనాలనే గ్రాంసీ 'కార్పొరేటిజం' అన్నారు. రాజకీయాల్లో ట్రేడ్ యూనియన్ మనస్తత్వం విఫలం కావడానికి ఇదే ముఖ్య కారణమని భావించారు. అవసరమైతే రైతాంగంతో, దక్షిణాది మేధావులతో అలయన్స్‌ను సంఘటితం చేసుకోవడం కోసం కార్మికవర్గం తన ప్రయోజనాలు కొన్నింటిన త్యాగం చేయాల్సి ఉంటుందన్నారు.

సంఘటన (Alliance) లోని నాయకత్వ వర్గం, అనేక స్వీయ ఆర్థిక ప్రయోజనాలను అధిగమించి, ఇతర ప్రజల పోరాటాలను పరిగణనలోనికి తీసుకున్నప్పుడే, తన ఆధిపత్య చొరవను నిలబెట్టుకోగలుగుతుందని గ్రాంసీ నొక్కి చెప్పారు. "ఆధిపత్యం సంపాదించదలచుకున్న వర్గం మొత్తం జాతీయ శక్తి సామర్థ్యాల అభివృద్ధికి, సార్వత్రిక విస్తరణకు చలన (Motor) శక్తిగా రూపొందాలి", "కార్మిక వర్గం ఆధిపత్యం సాధించటం కోసం తనను తాను జాతీయం చేసుకోవాలి" అన్న గ్రాంసీ సూత్రీకరణలు చాలా ప్రధానమయినవి.

దోపిడికి గురవుతున్న ప్రజల సముద్ధరణ కోసమే సోషలిజం అన్న భావనను విడవడకుండా, అదే సమయంలో జాతీయ మెజారిటీ దృక్పథ భావనను ప్రధాన నినాదంగా ముందుకు తీసుకురావాలన్నది ఆయన ఉద్దేశ్యం. కార్మికవర్గ నియంతృత్వం అనే భావనలో ఇతర వర్గాలను చెదరగొట్టే అంశం నిబిడీకృతమై ఉందని, దానికి బదులుగా సమాజంలోని ఇతర ప్రధాన వర్గాలను - ఉదా : మధ్యతరగతి - కలుపుకొని ఉద్యమానికి జాతీయ దృక్పధాన్ని కలిగించే ప్రయత్నాన్ని చేయాలని గ్రాంసీ భావించారు. ఈ సామాజిక గమనంలో మూడు దశలుంటాయని గ్రాంసీ భావన. మొదటిది ఆదిమ ఆర్థిక చలనం. ఈ దశలో వివిధ బృందాల వృత్తి సంబంధమయిన ప్రయోజనాలే ప్రాముఖ్యం వహిస్తాయి. రాజకీయ ఆర్థిక చలనం రెండవదశ. ఈ దశలో వర్గ ప్రయోజనాలను గురించిన ఆర్థికపరమైన స్పృహ ఉంటుంది. ఆధిపత్యం దశ మూడవది. ఈ దశలో ఆర్థిక, రాజకీయ, మేధోపర ధ్యేయాల మధ్య ఐక్యత సాధించే సైద్ధాంతిక పోరాటం ప్రాముఖ్యం వహిస్తుంది. ఈ దశలో నాయకవర్గం ఇతర బృందాలతో, వర్గాలతో తన స్వీయ ప్రయోజనాల్ని సమన్వయం చేసుకోవలసి ఉంటుంది అని గ్రాంసీ భావించాడు.

## 16.4 పౌర సమాజం :

రాజ్యం పాలక వర్గం చేతిలో పనిముట్టు. పేద సమాజం చరిత్ర శోదకశక్తి అన్న మార్క్సు అభిప్రాయంతో గ్రాంసీ ఏకీభవించాడు. పౌర సమాజాన్ని అర్థం చేసుకోవాలంటే ఆర్థిక అంశాలను దాటి చూడగలగాలని ప్రతిపాదించారు. గ్రాంసీ అభిప్రాయంలో; ఉపరితలంలో రెండు ప్రధాన స్థాయిలను మనం గుర్తించవచ్చు. ఒకటి పౌర సమాజం. ఇది మామూలుగా మనం 'వ్యక్తిగతం' (ప్రైవేటు) అని వ్యవహరించే సజీవ అంశాల సమాహారం. రెండవది, 'రాజకీయ సమాజం' లేక రాజ్యం.

ఈ రెండు స్థాయిలకు ఒక ప్రక్క మొత్తం సమాజం మీద ఆధిక్య బృందం అమలు జరిపే 'ఆధిపత్యం' విధితోనూ, మరోప్రక్క రాజ్యం ద్వారా 'చట్టబద్ధ' ప్రభుత్వం ద్వారా అమలు జరిగే 'ప్రత్యక్ష పెత్తనం' లేక కమాండ్‌తోనూ సంబంధం ఉంటుంది.

గ్రాంసీ అభిప్రాయంలో బూర్జువా అధికారం కేవలం బూర్జువా రాజ్యంలో కేంద్రీకృతం అయి ఉండదు. వాస్తవానికి, పౌర సమాజమే బూర్జువా అధికారానికి స్థిరమైన మూలాధారం. రాజ్యం రెండు విధాలుగా పనిచేస్తుందని గ్రాంసీ సూచించారు. ఒకటి పెత్తనం. అంటే దమన నీతి, భౌతికంగా బలవంతపెట్టడం. రెండవది సమ్మతి. ఇది వ్యక్తిగత జీవితాన్ని కనుబద్ధీకరించే సంస్థల ద్వారా, భావజాలం ద్వారా పనిచేస్తుంది. విస్తృత వైవిధ్యం కలిగిన సంస్థలు, రాజకీయాలతో సంబంధం లేవని భావించే సంస్థలు కలసి పౌర సమాజం అవుతుంది. పాఠశాల, కుటుంబం, మతం, ట్రేడ్ యూనియన్లు, రాజకీయ పార్టీలు, ప్రసార సాధనాలు - ఈ సంస్థలకు ఉదాహరణలు, లోకోక్తులు, దైనందిన తర్కం (Commonsense Logice) లు కూడా పౌర సమాజంలో భాగమే. దీన్ని గ్రాంసీ "కామన్ సెన్స్" అని అన్నాడు. విజ్ఞానశాస్త్రాలు, కళలు, వృత్తిపర కార్యాచరణ, సౌందర్య (arsthetic) రూపాలు మొదలైనవన్నీ ఇందులో భాగం. అంటే, పరోక్షంగా ఈ రంగాలన్నీ రాజకీయ జోక్యానికి అనువైన రంగాలే అవుతాయి

పైకి చూడటానికి ఈ సంస్థలు రాజ్యం పరిధికి బయట ఉన్నట్లు, స్వయం ప్రతిపత్తితో పనిచేస్తున్నట్లు కన్పించినా, నిజానికి అవన్నీ కలిసి పౌర సమాజం అవుతాయి. ప్రధానంగా ఈ పౌర సమాజ సంస్థలలోనే ఆధిపత్య వర్గం నాయకత్వం నెరపుతుంది. తన అధికారానికి సమ్మతిని సాధిస్తుంది. ఏ ప్రభుత్వమయినా, చివరకు అతి నిరంకుశ ప్రభుత్వాలయినా, ఏదో ఒక మేరకు పౌర సమాజము సమ్మతిని న్యాయబద్ధతను సాధించి, ఆధిపత్యాన్ని పొందగలుగుతాయి. ఇది జరుగనినాడు ప్రభుత్వాల మనుగడ సాధ్యం కాదు.

## 18.5 మేధావులు :

"మేధావులు" అనే మాటకున్న సాధారణ అర్థాన్ని గ్రాంసీ అంగీకరించడు. "సమాజంలోని అన్ని రంగాలలోనూ సమీకర్తల (Orgamisors) పాత్రను నిర్వహించేవారు" మేధావులని గ్రాంసీ అభిప్రాయం. వీరు ఒక సాంఘిక బృందానికి విద్యా చైతన్యాన్ని అందించేవారుగా, పాలనా నిర్వాహకులుగా, నిర్దేశకులుగా, నాయకులుగా వ్యవహరిస్తూ ఉంటారు. ఆధిపత్యాన్ని సాధించటంలో, నిర్వహించటంలో, పునరుత్పత్తి చేయటంలో ఈ మేధావుల పాత్ర ఉంటుందని గ్రాంసీ వాదన.

చరిత్రలో నూతన సాంఘిక వర్గం ఆవిర్భవించిన ప్రతిసారీ క్రొత్త సమీకర్తల/మేధావుల బృందాలు రూపొందుతూ ఉంటాయి. తమ వృత్తినీ, ఉద్యోగాన్ని బట్టి కాకుండా, తాము సజీవ సంబంధం కలిగి ఉన్న వర్గం భావాలకు, ఆశయాలకు వారు నిర్దేశికత్వాన్ని అందిస్తూ, సజీవ మేధావులుగా గుర్తింపు పొందుతారు. ఉదాహరణకు పెట్టుబడిదారులు వారితోపాటు తమ కార్యకలాపాలకు నైతికత్వం, ఆధిక్యతను ఇవ్వగలిగిన మేధావులను కూడా ముందుకు తెస్తారు. ఈ మేధావులలో పారిశ్రామిక, సాంకేతిక నిపుణులు, మేనేజర్లు, రాజకీయ అర్థశాస్త్ర నిపుణులు, నూతన సంస్కృతిని, శాసన వ్యవస్థను, విద్యను, విజ్ఞానాన్ని సమర్థించే "సమీకర్తలను" కూడా ముందుకు తెస్తారు.

మేధావులు, లేదా సమీకర్తలు కేవలం పార్టీలలోనూ, యూనివర్శిటీలలోనో మాత్రమే ఉండరు. మానవునికి సంబంధించిన ప్రతిరంగంలోనూ వారు పనిచేస్తూ ఉంటారు. అయితే, మేధావులను తయారు చేసుకోవాలంటే ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒకమేరకు ఉండే మేధాశక్తిని విమర్శనాత్మకంగా అభివృద్ధి చేయాలి. అయితే ఈ మేధావుల బృందం కాల్పనిక జగత్తులో బ్రతుకుతూ సిద్ధాంతాలను తయారుచేసేవారు మాత్రం కాకూడదు. వారి నిత్య జీవితంలో వారి నిర్దిష్ట

వర్గపు రోజువారి పని, దైనందిక అనుభవాలే వారి మేధస్సుకు ఆలంబనం కావాలి. గ్రాంసీ మాటలలో చెప్పాలంటే, "సాధారణ వాస్తవ కార్యాచరణలో ఒక భాగమయి భౌతిక, సాంఘిక ప్రపంచంలో నిరంతరం నూతన ఆవిష్కరణలకు దారితీసే శారీరక - మేధో (Moscular - nervous) కృషియే నూతన ప్రాపంచిక అవగాహనకు పునాదిగా ఉండేటట్లు జాగ్రత్త పడాలి". గ్రాంసీ మేధావి లక్షణం గురించి వివరిస్తూ ఈ విధంగా చెప్పాడు -

"మేధావి పని అంటే భాషణ చాతుర్యం కాదు. అది కేవలం పై తొడుగు. అప్పటికప్పుడు ఉద్వేగం, ఉద్రేకం కలిగిస్తుంది, అంతే. నూతన మేధావి వాస్తవ జీవితంలో --- నిర్మాతగా, సమీకర్తగా, శాశ్వత ప్రేరకుడిగా -- క్రియాశీలంగా పాల్గొనాలి. ఆవిధంగా టెక్నిక్ ఒకపని అనే స్థాయి నుండి టెక్నిక్ ఒక శాస్త్రం స్థాయికి ఎదుగుతుంది. చరిత్రపట్ల మానవవాద అవగాహన వృద్ధి చెందుతుంది. అలాంటి అవగాహన లేకపోతే ఆ మేధావి 'నిపుణుడి' గా మాత్రమే ఉండిపోతాడు : 'నిర్దేశకుడు' (నిపుణుడు, రాజకీయుడు రెండున్నూ) కాజాలడు". మేధావులను అభివృద్ధి చేసుకోవడం చాల కష్టమైనపని. దానిలో చాల ఇబ్బందులున్నాయి. కాని ఒక ఆధిపత్య విధానం స్థానంలో కొత్తది వచ్చి నిలబడాలంటే ఈ పని తప్పనిసరి. ఉన్న వ్యవస్థను సవాలు చేసి తన ఆధిపత్యం నిలపాలనుకునే వర్గం సాంప్రదాయ మేధావులలో కొన్ని బృందాలను "సైద్ధాంతికంగా గెలుచుకుని, తనలో ఇముడ్చుకోవాలి. ఆ వర్గం తన సొంత సజీవ మేధావులను ఎంత సమర్ధంగా అభివృద్ధి చేసుకోగలిగితే, అంత సమర్ధంగా సాంప్రదాయిక మేధావులను తనలో ఇముడ్చుకోగలుగుతుంది.

## 18.6 రాజకీయ పార్టీ :

రాజకీయ పార్టీపై గ్రాంసీ భావాలు అతని జైలు రచనలలోని "మోడరన్ ప్రిన్స్" అనే అధ్యాయంలో వివరించబడ్డాయి. గ్రాంసీ రచనలలో "రాజకీయపార్టీ" పై వెలిబుచ్చిన అభిప్రాయాలు అనిర్దిష్టంగా ఉంటాయి. కొందరి అభిప్రాయంలో గ్రాంసీ పార్టీ భావన లెనిన్ ప్రతిపాదించిన పార్టీ భావనకన్నా భిన్నంగా ఉన్నదని కొందరి అభిప్రాయం. వీరి ప్రకారం, గ్రాంసీ ప్రతిపాదించిన రాజకీయ పార్టీ నమూనాలో అగ్రగామి పార్టీ యొక్క కేంద్రీకృత ఆదేశాలు కాకుండా, కార్మికుల చైతన్యయుత విమర్శనాత్మక కార్యాచరణే విప్లవానికి చోధకశక్తిగా ఉంటుంది. అయితే, ఇటలీ కమ్యూనిస్టు పార్టీ నాయకుడైన టోగ్లియాటి అభిప్రాయంలో రాజకీయ పార్టీ పట్ల గ్రాంసీ వెలిబుచ్చిన భావన, లెనిన్ ప్రతిపాదించిన భావన ఒకటే.

గ్రాంసీని లోతుగా అధ్యయనం చేసినవారు పై రెండు అభిప్రాయాలు సమంజసమైనవేనని భావించారు. 1919 - 20 ఫ్యాక్టరీ కౌన్సిళ్ళ కాలంలో గ్రాంసీ స్థానిక స్వయంపాలన కోసం, అట్టడుగు నుంచి ప్రజల మధ్య విమర్శనాత్మక చర్చ కోసం సరైన సంస్థా రూపాలు ఉండాలని భావించాడు. 1921 - 24 సంవత్సరాలలో, కౌన్సిళ్ళ ఉద్యమం ఓడిపోయిన తర్వాత, గ్రాంసీ కేంద్రీకృత పార్టీ నిర్మాణం, సైద్ధాంతిక మార్గదర్శకత్వం అనే భావనను సమర్థించారు. ఆ తర్వాత గ్రాంసీ జైలు జీవితం గడుపుతున్నపుడు, ఆయన భావాలలో మరికొన్ని మార్పులు వచ్చినవి. రాజకీయ పార్టీపై స్థూలంగా గ్రాంసీ అభిప్రాయాలు క్రింద వివరించబడ్డాయి.

1) ప్రధాన చారిత్రక ఉద్యమాలలోనూ, దైనందిన పోరాటాలలోనూ నైతిక రాజకీయ విప్లవానికి మార్గాన్ని సుగమనం చేయటమే రాజకీయ పార్టీ కర్తవ్యం.
2) హేతుబద్ధంగా, సృజనాత్మకంగా ప్రజాచైతన్యాన్ని మేల్కొలిపి, జాతిని ఏకం చేయటమే పార్టీ కర్తవ్యం.
3) పార్టీ కార్మిక రాజ్యానికి పునాదులు వేయగలిగిన రాజకీయ హేతుబద్ధతను సమీకరించే శక్తి.

4) పార్టీలో మూడు శ్రేణులుంటాయి. అవి 1) విడివిడిగా ఉన్న సాధారణ సగటు సభ్యులు. 2) సూత్రబద్ధమైన సుసంఘటితమైన శ్రేణి. 3) ఈ రెంటికి మధ్యనుండే శ్రేణి. మిగిలిన రెండు శ్రేణుల మధ్య సంబంధాన్ని ఏర్పాటుచేసి, ఈ శ్రేణి వాటికొక రూప మిస్తుంది.

## 18.7 నిష్క్రియా విప్లవం :

దీనినే విప్లవరహిత విప్లవం అని కూడా అంటారు. ఏదైనా ఒక వర్గం లేదా కొన్ని వర్గాలు సామాజిక మార్పును కోరి ఉద్యమిస్తాయి. వ్యూహాత్మకంగా, ఎత్తుగడల రూపంగా అవి విజయవంతమయి ఆశించిన మార్పును తేగలిగితే అది విప్లవం. వ్యూహాత్మకమైన తప్పిదాల వలన గాని, ఇతర కారణాల వలన గాని సమాజంలో ఆశించిన మార్పు రాకపోగా, ఆ అవకాశాన్ని వర్గశత్రువులు తమకు అనుకూలంగా మార్చుకుంటే అది నిష్క్రియా విప్లవం. మరో మటలో చెప్పాలంటే విప్లవ ఫలితాన్ని వర్గశత్రువు అనుభవించటం, ఉత్పత్తి సంబంధాలను తనకు అనుకూలంగా మార్చుకోవటం - ఈ ప్రక్రియలో విల్లవానికి బోధకశక్తులైన వర్గాలు నష్టపోవటం. సమకాలీన యూరప్ చరిత్ర నుండి అనేక ఉదాహరణలను ఇస్తూ గ్రాంసీ "నిష్క్రియా విప్లవ" భావనను వివరించాడు.

## 18.8 సారాంశం :

కేవలం 46 సం॥లు మాత్రమే జీవించినప్పటికిని మార్క్సిజాన్ని మరింత పరిపుష్టం చేయటానికి శ్రమించిన వ్యక్తి ఆంటోనియో గ్రాంసీ. ఆచరణలోనూ, మేధాసంపత్తిలోనూ వైవిధ్యాన్ని చూపించగలిగాడు. గ్రాంసీ ప్రతిపాదించిన భావనలో అందరి దృష్టిని ఆకర్షించిన భావన ఆధిపత్య భావన. కార్మిక వర్గం అధికారాన్ని తన చేతుల్చోకి తెచ్చుకునే క్రమంలో, సమకాలీన సమాజంలోని అన్ని వర్గాలపై భావజాల ఆధిపత్యాన్ని కూడా సంపాదించి ప్రయత్నం చేయాలన్నది ఆ భావన సారాంశం. అదే విధంగా ఫ్యాక్టరీల మీద కూడా ఆయన లోతైన భావాలను వ్యక్తపరిచారు.

## 18.9 మాదిరి ప్రశ్నలు :

1) మార్క్సిస్టు సిద్ధాంతానికి గ్రాంసీ చేసిన సేవను వివరించండి.
2) ఫ్యాక్టరీ కౌన్సిళ్ళు, ఆధిపత్యం, రాజకీయ పార్టీ భావనలపై గ్రాంసీ అభిప్రాయాలను వ్రాయండి.

## 18.10 చదువదగిన గ్రంథాలు :

1) James Joll, Gramsci.
2) సుశీతారు, ఆంటోనియో గ్రాంసీ, జీవితం, కృషి.

పాఠం - 19

# హెర్బర్ట్ మార్క్యూజ్ (Herbert Marcuse)

# ఫ్రాంక్‌ఫర్ట్ ఆలోచన ధోరణి

(Frankfurt School or Critical Theory)

**విషయసూచిక**


19.0 ఉపోద్ఘాతం

19.1 హెర్బర్ట్ మార్క్యూజ్ (జననం 1898 - మరణం 1979)

19.2 స్వేచ్ఛకు ప్రాధాన్యత


## 19.0 ఉపోద్ఘాతం :

ఫ్రాంక్ ఫర్ట్ ఆలోచన ధోరణి లేక విమర్శనా సిద్ధాంతం (Critical Theory) జర్మనీలో ప్రారంభమైంది. కోలోకోవస్కీ మాటల్లో చెప్పాలంటే, ఇదొక అర్ధ మార్క్సిస్టు ఉద్యమం (Para Marxist Movement). ఫ్రాంక్‌ఫర్టు ఆలోచన ధోరణికి లేక విమర్శనా సిద్ధాంతానికి చెందిన కొంత మంది చింతనాపరులు 1923లో 'ఇనిస్టిట్యూట్ ఫర్ సోషల్ రీసెర్చ్' (Institute for Social Research) పేరుతో ఒక పరిశోధన సంస్థను ప్రారంభించారు. ఈ సంస్థకు అవసరమైన నిధులను సంస్థ ప్రారంభకులలో ఒకరైన ఫెలిక్స్ వీల్ కుటుంబ సభ్యులు అందచేశారు. సంస్థ మాత్రం ఫ్రాంక్ ఫర్ట్ విశ్వవిద్యాలయంలో అధికారికంగా ఒక బాగంగానే ప్రారంభమైంది.

నాజీజం ఉద్ధాన, పతనాలతో సమాతరంగానే ఫ్రాంక్ ఫర్ట్ ఆలోచన ధోరణి అభివృద్ధి చెందింది. అందుకనే నాజీజం ముందుకు తెచ్చిన అనేక సమస్యలు - ఉదాహరణకు జాతివివక్షత, రాజ్యనియంత్రణ విధానాలకు (Totalitarianism) గల ఆర్థిక, సైద్ధాంతిక మూలాలులాంటి అనేక సమస్యలను విమర్శనా సిద్ధాంతకారులు పరిశీలించవలసి వచ్చింది.

తాత్విక రంగంలో ఫ్రాంక్ ఫర్ట్ ఆలోచనా ధోరణి తార్కిక అనుభవైక వాదం (Logical Empiricism), నిశ్చయవాదం (Positivism) లాంటి ధోరణులను తీవ్రంగా విమర్శించింది. అలాగే వ్యావహారిక సత్తావాదం (Pragmatism), ఉపయోగిత వాదాలను, మలికాలానికి చెందిన జర్మన్ అస్తిత్వవాదాన్ని (Existentialism) కూడా ఈ ధోరణి తూర్పార పట్టింది. పెరుగుతున్న ప్రసార మాధ్యమాల వలన సంస్కృతి ఏవిధంగా క్షీణిస్తుందో ఫలితంగా గుంపు సమాజం (Mass Society) ఏవిధంగా ఏర్పడుతుందో కూడా విమర్శనా సిద్ధాంతవేత్తలు పేర్కొన్నారు. ఈ గుంపు సమాజం ఏవిధంగా గుంపు సంస్కృతి (Mass Culture) కి దారితీస్తుందో, దాని ఫలితాలు ఎంత అనర్ధదాయకమై విశ్లేషించి, వివరించడంలో ఈ ధోరణి ఎంతో మౌలికమైన కృషి చేసింది. ఈ విషయంలో - ఫ్రాంక్ ఫర్ట్ ధోరణి జర్మన్ తాత్వికుడు నీషేకి వారసురాలుగా కనిపిస్తుంది. ఆమేరకు 'శిష్ట విలువల'ను సమర్థించిన ధోరణిగా నిలుస్తుంది. ఫాసిజం, రాజ్య నియంత్రవాదం, పాశ్చాత్య ప్రజాస్వామ్య దేశాలలోని అధికారస్వామ్యాన్ని (Bureaucracy) ఉపయోగించి అక్కడ పాలకులు ఏవిధంగా ప్రజలను మభ్యపెడుతూ

వస్తున్నారో కూడా ఈ ధోరణి స్పష్టంగా ఎత్తిచూపింది.

ఫ్రాంక్ ఫర్ట్ ధోరణికి చెందిన ప్రధాన చింతనాపరుల మధ్య అనేక విషయాలలో అభిప్రాయ బేధాలున్నాయి. అదే సందర్భంలో వీరి మధ్య అనేక విషయాలలో అంగీకారం కూడా ఉంది. ఈ ధోరణికి చెందిన చింతనాపరుల మధ్య కనిపించే సారూప్యత మేరకు దానికి చెందిన ఉమ్మడి లక్షణాలను ఈ విధంగా పేర్కొనవచ్చు :

1) మార్క్సిజాన్ని తు.చ. తప్పకుండా పాటించవలసిన విలువగా ఫ్రాంక్ ఫర్ట్ ధోరణి అంగీకరించదు. అయితే వర్తమాన సంస్కృతిని విమర్శించడానికి మార్క్సిజం ఒక ప్రారంభ విశ్లేషణ సాధనమన్న విషయాన్ని అంగీకరిస్తుంది. అయితే వర్తమాన సంస్కృతిని విమర్శించడానికి మార్క్సిజం ఒక ప్రారంభ విశ్లేషణ సాధనమన్న విషయాన్ని అంగీకరిస్తుంది. అందుచేత ఈ ధోరణికి చెందిన చింతనాపరులు హెగెల్, కాంట్, నీషే, ఫ్రాయిడ్ లాంటి మార్క్సిస్టేతర రచయితల నుండి కూడా స్ఫూర్తిపొందారు. ఈ రచయితల నుండి కూడా స్ఫూర్తి పొందడమేకాక వారి నుండి ఎంతో గ్రహించారు కూడ ;

2) ఈ ధోరణి తన పార్టీయేతర దృష్టిని స్పష్టంగా ప్రకటించింది. దీనికి కమ్యూనిస్టు పార్టీతోగాని, సోషల్ డెమొక్రసీ ఉద్యమంతోగాని సంబంధం లేదు. పైగా ఈ రెండింటినీ చాలా సందర్భాలలో విమర్శించింది ;

3) 1920 వ దశకంలో హంగరీ మార్క్సిస్టు తాత్వికుడు జార్జి లూకాస్, జర్మనీ మార్క్సిస్టు తాత్వికుడు కారల్ కార్ష్‌లు అభివృద్ధి చేసిన మార్క్సిజం - ఫ్రాంక్ ఫర్ట్ ధోరణిపై తన ప్రభావాన్ని ఎంతగానో చూపింది. ప్రత్యేకించి వర్తమాన ప్రధాన సమస్యలలో ఒక్కటైన పరాయికరణ (Alienation) భావనకు గల స్థానాన్ని గుర్తించడంలో ఫ్రాంక్ ఫర్ట్ ధోరణిపై లూకాస్ ప్రగాఢమైన ముద్ర వేశాడు. అయితే ఇంత మాత్రం చేత ఫ్రాంక్ ఫర్డ్ ధోరణిని లూకాస్ శిష్యులు అభివృద్ధి చేసిన ధోరణిగా చూడలేం ;

4) సిద్ధాంతానికి గల స్వేచ్ఛ, స్వయం ప్రతిపత్తిని ఈ ధోరణినొక్కి చెప్పింది. అదే సందర్భంలో సర్వ సంపూర్ణమైన ఆచరణ (Praxis) సిద్ధాంతాన్ని పూర్తిగా వంట బట్టించుకోవాలనే వాదనను ఈ ధోరణి వ్యతిరేకించింది. అంత మాత్రం చేత సమాజాన్ని మార్చడానికి ఈ ధోరణి వ్యతిరేకమని అర్థం చేసుకోవడానికి వీలులేదు. సమాజాన్ని మార్చాలన్న లక్ష్యంతో ఈ ధోరణికి చెందిన చింతనాపరులు చేసిన ఎంతో విలువైన విమర్శను ఇక్కడ పరిగణనలోనికి తీసుకోవలసి ఉంటుంది ;

5) ఒక పక్క కార్మిక వర్గం ఏవిధంగా దోపిడీకి గురౌతున్నది, పరాయికరణ చెందుతుందన్న విషయంలో మార్క్స్ విశ్లేషణను అంగీకరిస్తారు. ఆమేరకు మార్క్స్ విశ్లేషణను తరువాత కాలంలో ఇంకాముందుకు కొనిపోయిన లూకాస్‌తో ఫ్రాంక్ ఫర్ట్
ధోరణి తనకిగల ఏకీభావాన్ని అంగీకరిస్తుంది. అదే సందర్భంలో కార్మిక వర్గ చైతన్యమే ముక్తి ప్రధాత అనే విషయాన్ని ఫ్రాంక్ ఫర్ట్ ధోరణి అంగీకరించదు. ఈ విషయంలో ఆ ధోరణి లూకాస్‌తో తనకుగల భేదాభిప్రాయాన్ని నిర్ద్వంద్వంగా ప్రకటించింది. ఫ్రాంక్ ఫర్ట్ ఆలోచన ధోరణి దృష్టిలో - పరాయీకరణ క్రమానికి గురై తన ఉనికినే మరచిపోయేది ఒక కార్మిక వర్గమేకాదు ; పరాయీకరణ క్రమం సార్వత్రికమైనది. దీనివలన సమాజంలోని వివిధ శ్రేణుల శ్రామిక జనావళి ఉనికికి కూడా సమస్య ఏర్పడుతుంది. అసలు కార్మిక వర్గానికి మార్క్స్ భావించినట్టే యావత్ సమాజాన్ని విముక్తి చేసే విప్లవకర స్వభావం ఉందా అనే విషయంలో ఫ్రాంక్ ఫర్ట్ ధోరణి సందేహాన్ని వ్యక్తం చేసింది. అందుకే చివరికి వచ్చేసరికి మార్క్స్ సిద్ధాంతంలో కార్మిక వర్గానికి గల విముక్తి ప్రధానపాత్ర నుండి ఫ్రాంక్ ఫర్ట్ ధోరణి నుండి దానిని తోసిపుచ్చింది;

6) సాంప్రదాయక మార్క్సిజంతో పోల్చి, ఫ్రాంక్ ఫర్ట్ ధోరణిని రివిజనిజంగా పేర్కొనేవారు ఉండవచ్చు. కాని ఫ్రాంక్ ఫర్ట్ ధోరణి తనని తాను విప్లవకర మేధోఉద్యమంగా అభివర్ణించుకొంటుంది. అందుకే సమాజాన్ని యావత్తు మార్చవలసిన అవసరాన్ని గుర్తించింది. అయితే భవిష్యత్ సమాజం ఎలా ఉంటుందో తాను చెప్పలేనని ఈ ధోరణి పేర్కొంది.

## 19.1 హెర్బర్ట్ మార్క్యూజ్ (Herbert Marcuse) (జననం 1898 - మరణం 1979) :

ఫ్రాంక్ ఫర్ట్ ఆలోచనా ధోరణికి చెందిన మొదటి తరానికి చెందిన చింతనాపరుడు మార్క్యూజ్. లాక్షణిక మార్క్సిజానికి (Classical Marxism) కేంద్ర బిందువుగా ఉన్న అనేక అంశాల మీద మార్క్యూజ్ తన దృష్టిని సారించి, కృషి చేశాడు. మానవ విమోచన, స్వేచ్ఛల సాధనే మార్క్సిస్టు సామాజిక సిద్ధాంతానికి కేంద్రంగా భావించి ఆ దిశగా సిద్ధాంతాన్ని అభివృద్ధి చేయడానికి మార్క్యూజ్ తన మేధస్సును ఉపయోగించాడు. సామాజిక విప్లవానికి ఉద్యమించడం ద్వారా తాను ఆశించిన రీతిలో ముందుకు వెళ్ళడానికి సాధ్యమౌతుందని భావించిన మార్క్యూజ్ ఆ దిశగా జీవితాంతం కృషిచేశాడు. ఈ కృషిలో ఒక భాగమే ఆయన రాసిన వ్యాసాలు, గ్రంథాలు.

1) A Contribution to a Phenomenology of Historical Materialism
2) Reason and Revolution (1941)
3) Eros and civilization (1955)
4) Soviet Marxism (1958)
5) One Dimensional Man (1964)
6) The Aesthetic Dimension (1978)

గుత్త పెట్టుబడిదారీ విధానపు భావజాలమే నాజీజమని వివరించిన మార్క్యూజ్ ఉదారవాదాన్ని అంగీకరించలేదు. దానిని పెట్టుబడిదారీ విధానపు తొలిదిశగా అభివర్ణించి, దానికి కాలం చెల్లిందన్నాడు. నాజిజానికి ప్రత్యామ్నాయం సోషలిజమని భావించాడు. అయితే స్టాలిన్ తరహా సోషలిజాన్ని ఆయన అంగీకరించ లేదు. దానిని ముష్కర సోషలిజమన్నాడు. స్టాలిన్ తరహా సోషలిజంలోని వక్రీకరణలను అధిగమించడానికి మార్క్స్ తొలికాలపు రచనలు, ప్రత్యేకించి ఆతని Economic and Philosophical Manuscripts (1844)అనే రచన నేపథ్యంగా మార్క్యూజ్ తన దృష్టిని కొనసాగించాడు. అలానే మార్క్స్ సిద్ధాంత కృషిని ఫ్రాయిడ్ మనోవిశ్లేషణతో జోడించడం మార్క్యూజ్ సిద్ధాంత కృషిలో కనిపించే మరో విశిష్టత.

## 19.2 స్వేచ్ఛకు ప్రాధాన్యత :

స్వేచ్ఛను ప్రధానాంశంగా భావించి, కృషి చేసిన అతి కొద్దిమంది మార్క్సిస్టు మేధావుల్లో మార్క్యూజ్ ఒకడు. స్వేచ్ఛ అన్నది వ్యక్తి పరమైనదనే ఉదారవాద భావనను మార్క్యూజ్ అంగీకరించడు. ఇది సమిష్టి అంశమన్నది ఆయన ప్రగాఢ విశ్వాసం. అరకొర ప్రయత్నాల వలన పెద్దగా జరిగే మార్పు ఉండదని ఆయన అభిప్రాయం. తద్భిన్నంగా విప్లవమే నిజమైన స్వేచ్ఛకు మార్గమని మార్క్యూజ్ భావన. అయితే సమిష్టి పేరుతో మానవ ఇచ్ఛ (Human will), వివేచన (Reason) లాంటి అంశాలకుండవలసిన స్థానాన్ని, వీటికిగల ప్రాధాన్యతను ఏవిధంగాను తగ్గించడానికి వీలులేదని ఆయన వాదిస్తాడు. మానవ సంకల్పం, వివేచనలకు స్థానం ఎంతమేరకు ఉందనే ప్రాతిపదికగానే ఆయా సమాజాలలోని స్వేచ్ఛను కొలవవలసి ఉంటుందని ఆయన అభిప్రాయం. స్వేచ్ఛ అన్నది ఒకే సమయంలో భౌతికమైనదిగాను, ఆత్మికమైనదిగాను

ఉండాలి. అలానే వ్యక్తిగతమైనదిగాను, సమిష్టి అంశంగాను ఉండాలి. సద్యోజనితమైనదిగాను (Spontaneons), వివేచనాత్మకంగాను ఉండాలి. స్వేచ్ఛకు సంబంధించిన ఈ భావన ఆయన రచనా వ్యాసాంగమంతటా కనిపిస్తుంది. ఒక 'ఏకోన్ముఖ మనిషి' (One - Dimensional Man) అన్న మార్క్యూజ్ రచన ఇందుకు భిన్నమైనది.

మార్క్యూజ్ రచనలలోను, ఆలోచనలలోను స్వేచ్ఛకు గల స్థానాన్ని, ప్రాధాన్యతకు గల కారణాలను ఆతని సమకాలీన పరిస్థితుల నుండే గ్రహించవచ్చు. ఒక ప్రక్క గుత్త పెట్టుబడిదారీ విధానపు భావజాలానికి ప్రతీకగా ముందుకొచ్చిన నాజీజంలో వ్యక్తికి స్థానం లేకుండా పోయింది. అలానే దీనికి భిన్నంగా వ్యక్తి స్వేచ్ఛ యావత్ సమాజ స్వేచ్ఛకు గీటురాయని చెప్పిన మార్క్సిజం ఆధారంగా నిర్మితమైన సోవియట్ యూనియన్‌లు సమిష్టి పేరుతో వ్యక్తి స్వేచ్ఛకు స్థానం లేకుండా పోయింది. ఈ స్థితికి ప్రతిస్పందనగా చూసినప్పుడే - ఎందుకు మార్క్యూజ్ స్వేచ్ఛకు అంతటి ప్రాధాన్యత ఇచ్చాడో అర్థంకాగలదు.

స్వేచ్ఛకు ఇంతటి ప్రాధాన్యత ఇచ్చి మార్క్సిజాన్ని అభివృద్ధి చేయడంలో మార్క్యూజ్ అనేక మంది సమకాలీన మార్క్సిస్టేతర చింతనాపరుల నుండి ప్రేరణ పొందాడు. వీరిలో ముఖ్యుడు హెడిగ్గర్. హెడిగ్గర్ అస్తిత్వవాది. అందులోను ఆస్తిక అస్తిత్వవాది. అస్తిత్వం అన్నింటికంటే ముఖ్యం (Existence Preceeds everything). అస్తిత్వవాద బోధన మార్క్యూజ్‌ను ఎంతగానో ప్రభావితం చేసింది. ఉదాహరణకు, ఒంటరి అస్తిత్వం ఆధారంగా ఆత్మాన్వేషణ, ఆత్మ ఆవిష్కరణ సాగాలనే హెడిగ్గర్ భావనను మార్క్స్‌ను జోడించడం ద్వారా మలికాలపు పెట్టుబడి విధానంలో మనిషి అనుభవిస్తున్న స్వేచ్ఛ నిజమైనది కాదనే అభిప్రాయానికి మార్క్యూజ్ వచ్చాడు. "అణచివేత పాలనలో స్వేచ్ఛ అన్నది ఆధిపత్య సాధనంగా మారుతుంది. వ్యక్తికి లభిస్తున్న విస్తృతమైన అవకాశాలు - మానవ స్వేచ్ఛ ఏ మేరకు లభిస్తుందన్న విషయంలో నిర్ణయాత్మక పాత్ర నిర్వహించలేవు.... యజమానులను స్వేచ్ఛగా ఎన్నుకోవడం ద్వారా అటు యాజమాన్యాన్ని కానీ, ఇటు బానిసలను కాని తొలగించలేం. శ్రమ మీద, భయం మీద నియంత్రణ ఉన్నప్పుడు, అంటే పరాయికరణ ఉన్నప్పుడు - అనేక వస్తువులు, సేవల మధ్య ఎంపిక చేసుకొనే అవకాశం ఉండడమన్నది స్వేచ్ఛను చలాయించలేదు.''

అసమాన సంబంధాలు ఉన్నచోట స్వేచ్ఛ ఏ విధంగా ఆధిపత్యంగా మారుతుందో మార్క్యూజ్ ఇలా వివరించాడు : ఎక్కడైతే ఒక వ్యక్తి లక్ష్యాలు, వాటి పరమార్ధం, అలానే వాటిని సాధించటానికి చేసే ప్రయత్నాలు ఇతరులచేత నిర్దేశించబడతాయో అక్కడ స్వేచ్ఛ ఆధిపత్యంగా మారుతుంది. ఆధిపత్యాన్ని మనుషులు నెరసవచ్చు ప్రకృతి నెరసవచ్చు. వస్తువులు నెరసవచ్చు. అంతర్లీనీకరణ (Internalisation) ద్వారా ఎవరైన నెరపవచ్చు. ఇది అణచివేతకు దారి తీస్తుంది. ఆధిపత్యం ద్వారా చోటు చేసుకొనే అణచివేతను, తత్ఫలితంగా ఎదురౌతున్న సమస్యలను ఏవిధంగా పరిష్కరించుకోవాలి ? అణచివేత, తద్వారా ఆధిపత్యంతో సాగుతున్న వీటి నాగరికతలో ఎదురౌతున్న సమస్యలను, వాటి తీవ్రతను తగ్గించడం ద్వారా ముందుకు సాగాలన్నది సమకాలీన రాజకీయ తత్వవిచారణ (Political Philosophical Enquiry) లో ఒక ధోరణి. ఇందు భిన్నంగా అణచివేత, ఆధిపత్యాలకు కారణమైన అసమాన సంబంధతాలను తొలగించి స్వేచ్ఛాయుతమైన సమాజదిశగా సాగాలని మరొక ధోరణి చెబుతుంది. మార్క్యూజ్ రెండవ ధోరణికి చెందినవాడు.

ఇంతకుముందే అనుకున్నట్టు, స్వేచ్ఛ ఆయన ఆలోచనకు కేంద్రబిందువు. మరి స్వేచ్ఛను పొందటానికి అనుసరించవలసిన మార్గమేమిటి ? సమకాలీన నాగరికతను విమర్శించడం ఇందుకొక మార్గం. ఎందుకు సమకాలీన నాగరికతను విమర్శించాలి ? ఇది ఏకోన్ముఖ (One Dimensional) నాగరికత కావడమే ఇందుకు కారణమని మార్క్యూజ్ అభిప్రాయం. సమకాలీన జీవనంలో - అది తత్వశాస్త్రం కావచ్చు, లేక వైజ్ఞానిక రంగం కావచ్చు, లేక కళలు కావచ్చు, లేక ఆర్థిక వ్యవస్థ

కావచ్చు, లేక సాంకేతిక పరిజ్ఞానం కావచ్చు - ప్రతి అంశాన్ని ఒక పార్శ్వం నుండే చూడడం జరుగుతుంది. చూడని మరొక అంశం : నకారాత్మక (Negative) పార్శ్వం. అదే విమర్శనా పార్శ్వం. అంటే కనిపించే ప్రపంచానికి, నైతికంగా భవిష్యత్‌లో నిజంగా ఉండవలసిన ప్రపంచానికి మధ్య తారతమ్య పరిశీలన, తులనాత్మక అధ్యయనం అవసరం. తద్వారా నిజమైన స్వేచ్ఛ అంటే ఏమిటి ? వివేచన అంటే ఏమిటి ? ఆనందమంటే ఏమిటో తెలుసుకోవడం ద్వారా ముందుకు సాగవలసి ఉంటుంది. అందుకే అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలను తన 'ఏకోన్ముఖ మనిషి' (One Dimensional Man) ) అనే గ్రంథంలో నిశితంగా విమర్శించాడు. ఏవిధంగా బాగుచేయడానికి వీలులేని దుష్ట సమాజాలుగా ఈ దేశాలను మార్క్యూజ్ వర్ణించాడు.

ఈ పరిస్థితి నుండి బయటపడడమెలా ? ఇందుకు అనుసరించవలసిన మార్గమేమిటి ? 'ఏకోన్ముఖ' స్థితి నుండి ప్రపంచాన్ని ఎవరు విముక్తిచేయగలరు ? ఇందుకు మార్క్యూజ్ ఆలోచన ఏమిటి ?

మార్క్యూజ్ మార్క్సిజం నుండి బయలుదేరాడనుకొన్నాం. మార్క్యూజ్ కూడా తనను తాను మార్క్సిస్టుగానే పరిగణించుకొన్నాడు. అందుకే పెట్టుబడిదారీ విధానానికి సోషలిజమే ప్రత్యామ్నాయమని భావించాడు. సోషలిజం సాధన ద్వారా సమకాలీన దుష్టస్థితి నుండి బయటపడాలని మార్క్యూజ్ ఆకాంక్ష. సాంప్రదాయ మార్క్సిజం పరిధిలో సోషలిస్టు సమాజస్థాపనలో కార్మిక వర్గం చోదకశక్తి (Driving Force) గా వ్యవహరిస్తుంది. ఈ వర్గాన్ని కమ్యూనిస్టు పార్టీ అగ్రగామి (Vanguard) గా ఉండి నడిపిస్తుంది. సోషలిజాన్ని కాంక్షిస్తున్న మార్క్యూజ్ ఆలోచన చట్రంలో పెట్టుబడిదారీ సమాజాలలోని కార్మిక వర్గం అక్కడ సాంకేతిక పరిజ్ఞానం కలిగిన సమూహాలతో కలిసి పోయింది. అలానే పెరిగిన సాంకేతక పరిజ్ఞానం వలన కార్మిక వర్గ సంఖ్య కూడ తగ్గుతూ వచ్చింది. అలానే ఉత్పత్తి సాధనాలలో వచ్చిన మార్పులు ఫలితంగా కార్మిక వర్గం పెట్టుబడిదారీ వర్గంతో కలిసిపోయిందని మార్క్యూజ్ భావన. ఫలితంగా సాంప్రదాయిక మార్క్సిజం చట్రంలో కార్మికవర్గానికి ఉన్న చోదక పాత్ర మార్క్యూజ్ చట్రంలో లేకుండా పోయింది. కార్మిక వర్గంలోని కొంతమంది పెట్టుబడి పొందుతున్న అదనపు విలువల భాగాన్ని పొంది దానితో కలిసిపోవడాన్ని లెనిన్ శ్రామిక సంపన్న వర్గ (Labour Aristocracy) ఆవిర్భావంగా పేర్కొన్నాడు. కాని మార్క్యూజ్ దృష్టిలో యావత్ కార్మిక వర్గం పెట్టుబడిదారీ వర్గంతో కలిసిపోయినట్టే. అందుకే ఇక ఏమాత్రం కార్మిక వర్గం - గతంలో ఆశించినట్టు - నాయక పాత్రను నిర్వహించలేదు. వర్తమాన పరిస్థితులలో విద్యార్థులు, మేధావులు, అలాగే శ్రామిక జనం, స్త్రీలు, నల్ల జాతి లాంటి ప్రజాసందోహాలు సోషలిస్టు సమాజ సాధనకు పూనుకొంటారని మార్క్యూజ్ భావన. ఈ క్రమంలో వీరు హింసను ఆశ్రయిస్తారు. సోషలిస్టు సమాజ స్థాపన మానవ విముక్తి కోసం ఉద్దేశించినది కనుక హింస సమర్థనీయమని మార్క్యూజ్ అభిప్రాయం. ఇది మార్క్స్ భావన కంటె భిన్నమైనది. వర్గ పోరాటంలో భాగంగా వర్గ శత్రువు హింసను ప్రయోగిస్తే దానిని ఎదుర్కోవడానికి కార్మిక వర్గం బలప్రయోగాన్ని ఆశ్రయిస్తుందని మార్క్స్ భావన.

తాను ఊహించిన స్వేచ్ఛాయుతమైన భవిష్యత్ సమాజంలో ఉండవలసిన సామాజిక, రాజకీయ ఏర్పాటు ఏవిధంగా ఉండాలో మార్క్యూజ్ అంతగా చెప్పలేదు. 'విముక్తి పై వ్యాసం' అన్న రచనలో ఉత్పత్తి సాధనాలపై సమిష్టి యాజమాన్యాన్ని ప్రతిపాదించారు. అలానే రాజకీయపాలనలో ప్రత్యక్ష ప్రజాస్వామ్యం ఉండాలని చెప్పాడు. నిజమైన స్వేచ్ఛ, స్వయం ప్రతిపత్తి కలిగిన మెజారిటీ ప్రజానీకం పాలనలో పాలు పంచుకోవాలని ఆయన ఆశించాడు.

**సారాంశము :**

మార్క్యూజ్ తాను ప్రతిపాదించిన చారిత్రక భౌతికవాదం, "శ్రమ" తత్వం, మార్క్సియన్ గతితర్కాన్ని విశదీకరించిన తీరు, మార్క్స్, ఫ్రాయిడ్ రచనలలోని వివిధ అంశాలను సంశ్లేషించడం ద్వారా సిద్ధాంతం - ఆచరణల సంబంధం గురించి, మానవ శక్తి సామర్థ్యాల (Human Potentiality) గురించి, వర్తమానంలో సాధ్యాసాధ్యాలు, భావి "హేతు సమాజ" (Rational Society) రూపురేఖల గురించి తనదైన దృక్పథాన్ని అభివృద్ధి చేశాడు. స్వేచ్ఛను తన సిద్ధాంతానికి కేంద్రబిందువుగా చేసుకోవటం అతని ప్రత్యేకత. పరాయీకరణ పొందటం కేవలం ఒక వర్గం విషయంలోనే జరుగదని, వాదించటం ద్వారా, మార్క్సిజానికి భిన్నమైన సూత్రీకరణను చేసిన, మార్క్యూజ్ తనకు తాను జీవితాంతం మార్క్సిస్ట్‌గానే భావించుకున్నాడు.

మాదిరి ప్రశ్నలు :

1. మార్క్యూజ్ యొక్క మౌళిక భావనలను వివరించండి ?
2. ఫ్రాంక్‌ఫర్ట్ స్కూల్ ప్రతిపాదించిన భావనలపై ఒక విమర్శనాత్మక వ్యాసాన్ని వ్రాయండి.